# DRAVIDIAN PHIOLOGY & EVOLUTION OF TELUGU LANGUAGE

# (DT22)

# (M.A. TELUGU)

## ACHARYA NAGARJUNA UNIVERSITY

### CENTRE FOR DISTANCE EDUCATION

NAGARJUNA NAGAR,

GUNTUR

ANDHRA PRADESH

పాఠం - 1

# భారతదేశంలోని భాషా కుటుంబాలు

## సినోటిబెటన్, ముండా, ఇండో - యూరోపియన్, ద్రావిడ భాషా కుటుంబాలు - భౌగోళిక వ్యాప్తి

**విషయక్రమం**


**1.0** లక్ష్యం
**1.1** భాష
**1.2** భాషాశాస్త్రం
**1.3** ప్రపంచ భాషలు - వర్గీకరణ
**1.4** భారతదేశంలోని భాషా కుటుంబాలు
**1.4.1** సినో-టిబెటన్ భాషా కుటుంబం - భౌగోళిక వ్యాప్తి
**1.4.2** ఇండో - యూరోపియన్ భాషా కుటుంబం - భౌగోళిక వ్యాప్తి
**1.4.3** ఆస్ట్రో ఏషియాటిక్ భాషా కుటుంబం - భౌగోళిక వ్యాప్తి
**1.4.4** ద్రావిడ భాషా కుటుంబం - భౌగోళిక వ్యాప్తి


### 1.0 లక్ష్యం :

భాషా నిర్వచనం, భాషాశాస్త్రం, భాషల వర్గీకరణ, భారతదేశంలోని భాషా కుటుంబాలు వాటి భౌగోళిక వ్యాప్తి గురించి తెలుసుకుంటారు.

### 1.1. భాష :

మానవుడు తన భావాలను బహిర్గతం చెయ్యడానికి ముఖావయవాల ద్వారా చేసే అర్థవంతమయిన ధ్వని సముదాయం 'భాష'. భాషించేది భాష. సంస్కృత భాషలో 'భాష్' అనే ధాతువుకు మాట్లాడటం (To speak) అని అర్థం. మాట్లాడటం అనే మనోగత భావాలను నోటి ద్వారా అభివ్యక్తం చెయ్యడాన్ని భాష అనవచ్చు. ఆకలి, దాహం, ఉద్రేకం, కోపం, భయం లాంటి చర్యల వల్ల మనిషి మెదడులో పెట్టే ఆలోచనల్ని బహిర్గతం చేసే ప్రక్రియే భాష.

### 1.2 భాషా శాస్త్రం :

భాషను అభివర్ణించే శాస్త్రాన్ని భాషాశాస్త్రమంటారు. భాష సహజమయిన వ్యవస్థ. అంటే కట్టుబాటన్నమాట. ఇది స్థిరమయినది. పరిణామశీలం కలిగినటువంటిది. వ్యవహారంలో సజీవంగా ఉంటుంది. అలాంటి దాని స్వరూప స్వభావాలను ఎలాంటి పూర్వాభిప్రాయాల మీద ఆధారపడకుండా, పరిశీలనే ప్రధానంగా నిర్ణయించే శాస్త్రం భాషాశాస్త్రం.

## 1.3 ప్రపంచ భాషలు - వర్గీకరణ :

ప్రపంచంలో మొత్తం ఎన్ని భాషలున్నాయో కచ్చితంగా చెప్పడం కష్టం. చెప్పగలగడం కూడా అంత తేలికయిన పనికాదు. అయినా కొన్ని శాస్త్రీయ పద్ధతుల నాధారంగా చేసుకొని పరిశీలించినపుడు ప్రపంచంలో స్వతంత్ర భాషలు కాని, మాండలికాలు గాని కలిసి సుమారు 5 నుండి 6 వేల వరకు ఉన్నట్లు ఒక అంచనా.

అయితే ఒక్కో భాషకు లక్షణాలు ఒక్కో విధంగా ఉంటాయి. ఏ రెండు భాషలూ ఒకే విధంగా ఉండవు. ఈ భాషలను వేరువేరుగా అధ్యయనం చేయడం కూడా కష్టమయిన పని. ఇప్పటివరకు జరిగిన శాస్త్రీయ పరిశోధనల వల్ల ప్రపంచంలోని భాషల్ని భాషాశాస్త్రజ్ఞులు మూడు విధాలుగా విభజించారు. అవి :

1) భౌగోళిక వర్గీకరణ (Geographical Classification)
2) పదాంశ / రూపాశ్రిత / నిర్మాణాశ్రిత / లక్షణాత్మక వర్గీకరణ (Morphological or Typoligical Classification)
3) జన్యాత్మక / జన్మాత్మక / జాత్యాశ్రిత / వంశానుగుణ వర్గీకరణ (Genetic or Geneological Classification)

పైన పేర్కొన్న మూడు వర్గీకరణలలో జన్యాత్మక లేదా జన్మాత్మక వర్గీకరణ చాలావరకు శాస్త్రీయమయినది. ఈ విభజనను ఆధారం చేసుకొని ప్రపంచంలోని భాషలను భాషాశాస్త్రవేత్తలు 3 నుండి 40 భాషా కుటుంబాల వరకు విభజించారు. అయితే వీటిలో అధిక సంఖ్యాకులు ఆమోదాన్ని పొందినవి మాత్రం 2 క్రింది 10 భాషాకుటుంబాలు.

1. సినో-టిబెటన్ భాషా కుటుంబం
2. ఇండో - యూరోపియన్ భాషా కుటుంబం
3. ఫిన్నో - ఉగ్రిక్ భాషాకుటుంబం
4. బాస్క్ భాషా కుటుంబం
5. ఆఫ్రో - ఏషియాటిక్ భాషాకుటుంబం
6. జపనీస్ భాషాకుటుంబం
7. యూరల్ - అల్టాయిక్ భాషా కుటుంబం
8. మలయో పాలినీషియన్ భాషాకుటుంబం
9. ఆస్ట్రో - ఏషియాటిక్ భాషా కుటుంబం
10. ద్రావిడ భాషా కుటుంబం

ఈ పది భాషాకుటుంబాలలో వాటి వాటి విశిష్ట లక్షణాలనుబట్టి ఎన్నో ఉపకుటుంబాలుంటాయి. ఉప కుటుంబాలలో శాఖలకు ఉపశాఖలుంటాయి. ఉపశాఖలకు వర్గాలు, ఉపవర్గాలుంటాయి. ఒక్కో వర్గంలో కొన్ని భాషలుంటాయి. మళ్లీ ఒక్క భాషకు కొన్ని మాండలికాలుంటాయి. అవి కింద పేర్కొన్నట్లుగా ఉంటాయి.




## 1.4 భారతదేశంలోని భాషా కుటుంబాలు :

భారతదేశానికి సంబంధించినంతవరకు నాలుగు ప్రధానమయిన భాషాకుటుంబలకు చెందిన భాషలు ఇక్కడ ఉన్నాయి. భారతదేశంలో భాషలుగాని, మాండలికాలు గాని 1652 ఉన్నాయని భాషాశాస్త్రవేత్తల అభిప్రాయం. (వీటి సంఖ్య ఇంకా కాస్త ఎక్కువగా కూడా వుండవచ్చు). అవి

1. సినో - టిబెటన్ భాషాకుటుంబం
2. ఇండో - యూరోపియన్ భాషా కుటుంబం
3. ఆస్ట్రో - ఏషియాటిక్ భాషా కుటుంబం
4. ద్రావిడ భాషాకుటుంబం

పైన పేర్కొన్న నాలుగు భాషా కుటుంబాలలో ద్రావిడభాషా కుటుంబానికి చెందిన భాషలే భారతదేశంలో ప్రాచీన భాషలని ఎక్కువమంది భాషాశాస్త్రవేత్తలు, నృశాస్త్రవేత్తలు (Anthropologists) అభిప్రాయపడుతుండగా మరికొందరు ఆస్ట్రో ఏషియాటిక్ భాషా కుటుంబానికి చెందిన వ్యవహర్తలే పూర్వులని అంటున్నారు. ఆర్యుల రాకతో ఇండో-యూరోపియన్ భాషా కుటుంబానికి చెందిన భాషలు, ఆ తర్వాత సినో - టిబెటన్, భాషా కుటుంబానికి చెందిన వ్యవహర్తలు భారతదేశంలో స్థిరపడిపోయారు. మొత్తం మీద పలు నాలుగుభాషా కుటుంబాలకు చెందిన భాషలు మాట్లాడే ప్రజలు భారతదేశంలో ఉన్నారు.

## 1.4.1 సినో - టిబెటన్ భాషా కుటుంబం :

ఈ భాషా కుటుంబానికి రెండు శాఖలున్నాయి. అవి

1. టిబెటో - బర్మన్
2. చైనీస్

ఇందులో టిబెటో - బర్మన్ శాఖకు చెందిన భాషలు భారతదేశపు ఈశాన్యప్రాంతంలో ఉన్నాయి. మనదేశానికి వచ్చిన 'మంగో లాయిడ్' తెగ హిమాలయ పర్వత ప్రాంతాల్లోనూ, ఈశాన్య ప్రాంతంలోనూ స్థిరపడి టిబెటో - బర్మన్ శాఖకు చెందిన భాషల్ని వాడుకలోకి తెచ్చారు.

### భారతదేశంలోని టిబెటో - బర్మన్ శాఖకు చెందిన భాషలు :

1. బోడో
2. నాగా
3. గారో
4. కుకి - చిన్
5. మణిపురి
6. లుషాయి
7. భూపతి
8. నైవారి
9. లెప్చా
10. అస్మక
11. మికిర్

టిబెటో - బర్మన్ శాఖలు 4 వర్గాలుగా విభజించారు.

1) ఉత్తర అస్సాం వర్గం
2) అస్సాం - బర్మీస్ వర్గం
3) కుకి - చిన్ వర్గం
4) టిబెటన్ వర్గం

## 1) ఉత్తర అస్సాం వర్గం :

అస్సాం ఉత్తర ప్రాంతంలో మాట్లాడతారు. అక, అబోర్, మిరి, మిష్మి భాషలు ఈ వర్గంలో ప్రధానమయిన భాషలు.

**2) అస్సాం - బర్మీస్ వర్గం :**

బోడో, నాగా, కఛారీ, టిప్రాస్ ముఖ్యమయిన భాషలు. బోడో బ్రహ్మపుత్రలోయలో, కఛారీ అస్సాంలోని కఛారీ పర్వత ప్రాంతంలోనూ,నాగాలాండ్ రాష్ట్రంలో నాగాభాష మాట్లాడతారు. నాగాభాషకు అంగామీ, సీమా, రేష్మా, ఆవో మొదలైన మాండలికాలున్నాయి.

**3) కుకి - చిన్ వర్గం :**

మెయ్‌థెయ్ (మణిపురి) ప్రధానమయిన భాషకాగా లుషాయి మికిర్ కూడా వుంది. ఇది మణిపూర్ రాష్ట్రంలో వ్యవహారంలో ఉంది. 15వ శతాబ్దం నుంచి లిపి ఉంది. 18వ శతాబ్దం నుంచి వైష్ణవ సాహిత్యం ఉంది. లుషాయిమికిర్ భాషలో ఎంతో జానపద సాహిత్యం వుంది.

**4) టిబెటన్ వర్గం :**

లడఖీ, డెన్జొంగ్-కె, ల్హో-కె మొదలైనవి ఈ వర్గంలో చేరుతాయి. టిబెట్ సరిహద్దుల్లో లడఖ్‌లో లడఖీ భాష మాట్లాడతారు. సిక్కింలో డెన్జొంక్-కె, భూటాన్‌లో ల్హో-కె భాష మాట్లాడతారు.

**1.4.2 ఇండో - ఆర్యన్ కుటుంబం :**

ఇది ప్రపంచంలోనే అతి పెద్ద భాషా కుటుంబం. ఇందులో పది ఉపకుటుంబాలున్నాయి. అవి :

1) జర్మానిక్
2) కెల్టిక్
3) రొమాన్స్
4) స్లావిక్
5) బాల్టిక్
6) ఆల్బేనియన్
7) ఆర్మేనియన్
8) ఇరేనియన్
9) గ్రీక్
10) ఇండో - ఆర్యన్

పైన పేర్కొన్న పది ఉపకుటుంబాలలో ఇండో - ఆర్యన్ భాషా ఉపకుటుంబానికి చెందిన భాషలు ప్రధానంగా భారతదేశంలో మాట్లాడతారు. సుమారు 70 కోట్ల జనాభా ఈ భాషలను మాట్లాడతారు.

**సంస్కృతం :** హిందార్య (ఇండో - ఆర్యన్) భాషలలో అత్యంత ప్రాచీనమయినది సంస్కృతం. ఈ భాష నుంచి అనేక భాషలు జనించాయి. సంస్కృత భాషలో అత్యంత ప్రాచీనమయినవి వేదాలు. వీటిలో అత్యంత ప్రాచీనమయినది ఋగ్వేదం. ఇది క్రీ.పూ. 1500 నాటిది. దీనిని వైదిక సంస్కృతం అనేవారు. వైదిక సంస్కృతం కొన్ని మార్పులతో లౌకిక సంస్కృతమయింది.

**ప్రాకృతాలు :**

క్రీ.పూ. 6వ శతాబ్ది నుంచి క్రీ.శ. 10వ శతాబ్ది వరకు జైన, బౌద్ధ గ్రంథాలలోనూ, సంస్కృత నాటకాలలోను, శాసనాలలోను ప్రాకృతాలు వ్యవహారంలో ఉన్నాయి. అవి

1. శౌరసేని
2. మాగధి
3. అర్ధమాగధి

4. పైశాచి
5. చూళికాపైశాచి
6. మహారాష్ట్ర ప్రాకృతం అని ఆరు రకాలు. ప్రాకృతాలు లౌకిక సంస్కృతం నుంచి వర్ణలోప, వర్ణవికారాదులతో ఏర్పడ్డాయని భాషావేత్తల అభిప్రాయం.

## పాలీ :

పాకృతీభేదమే 'పాలీ' భాష అని అంటారు. క్రీ.పూ. 307 ప్రాంతంలో సింహళ దేశంలోని మాగధీ ప్రాకృతమే పాలీ అని జాన్‌బామ్స్ అభిప్రాయం. బుద్ధుని బోధలు, త్రిపిటకాలు పాలీలోనే ఉన్నాయి. క్రీ.పూ. 5వ శతాబ్ది నుంచి క్రీ.పూ. 3వ శతాబ్ది వరకు పాలీభాష వ్యాప్తిలో ఉంది.

## అపభ్రంశ భాషలు :

ప్రాకృత భాష నుంచి అపభ్రంశ భాషలు పుట్టాయి. క్రీ.శ. 6వ శతాబ్దిలో అపభ్రంశ శతాబ్ది భామహుడు కావ్యాలకారంలో పేర్కొన్నాడు. మొదటగా అపభ్రంశ శబ్దాన్ని పతంజలి తన మహాభాష్యంలో పేర్కొన్నాడు. అపభ్రంశ భాషల నుంచే తర్వాత నవీన ఔత్తరాహ భాషలు పుట్టాయి.

## నవీన ఔత్తరాహ భాషలు :

హిందీ, ఉర్దూ, బెంగాలీ, పంజాబీ, గుజరాతీ, మరాఠీ, రాజస్థానీ, అస్సామీ, ఒరియా, కాశ్మీరి, కొంకణి, నేపాలీ, సింధి, సింహళీ మొదలైనవి నవీనౌత్తరాహ భాషలు.

## 1) హిందీ :

ఉత్తరప్రదేశ్, హర్యానా, రాజస్థాన్ , మధ్యప్రదేశ్, బీహార్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ భాష వ్యవహారంలో ఉంది. భారతదేశంలో అత్యధికులు మాట్లాడేభాష హిందీ. దీనికి ఎన్నో మాండలికాలున్నాయి. ఇందులో పశ్చిమ మాండలికం, తూర్పు మాండలికం ప్రధానమయినవి.

## పశ్చిమ మాండలికం :

రాజస్థానీ, వ్రజ, బుందేరి, మాలవి, భోజ్‌పురి, మేవారి మొదలయినవి ఈ మాండలికంలో ప్రధానమయినవి. సూరదాస్ కీర్తనలు వ్రజ భాషలో ఉన్నాయి.

## తూర్పు మాండలికం :

అవధి, మైథిలీ ముఖ్యమయినవి. తులసీ దాస్ రాసిన 'రామచరిత్‌మానస్' అవధి భాషలో ఉంది. కబీరు ఖడీబోల్ రాశాడు. హిందీ భాషలో 13వ శతాబ్ది నుంచి సాహిత్యం ఉంది.

## 2) ఉర్దూ :

ఉర్దూ భాష ఉత్తరభారతంలోనేగాక దక్షిణాదిలో హైదరాబాద్, కర్నాటక, మహారాష్ట్రలలో సుమారు 11, 12 కోట్లమంది ఉన్నారు. ఉర్దూ అంటే బస అని అర్థం. ఈ భాష సైనిక శిబిరాల్లోను, దుకాణాల్లోనూ, బజార్లలోనూ పుట్టింది. కొంతమంది దీనిని 'ప్రజాభాష'గా పేర్కొన్నారు. ఇక్బాల్ ఉర్దూభాషలో ప్రముఖకవి.

### 3) బెంగాలీ :

భారతదేశంలో పశ్చిమ బెంగాల్‌లోనూ, బంగ్లాదేశ్‌లోనూ సుమారు 30 కోట్ల మందికి పైగా ఈ భాషను మాట్లాడుతున్నారు. క్రీ.శ. 1000వ సంవత్సరం నాటికి బెంగాలీ ప్రత్యేక భాషగా రూపొందింది. రవీంద్రనాధ్ ఠాగూర్, శరత్ మొదలైన వారు ప్రసిద్ధులు. ఠాగూర్ రాసిన గీతాంజలికి 'నోబుల్' పురస్కారం లభించింది.

### 4) పంజాబీ :

నేటి పంజాబ్ రాష్ట్రంలోనూ, హర్యానాలో కొంతమంది ఈ భాషను మాట్లాడతారు. జనాభా సుమారు 10 కోట్లకు పైనే ఉన్నారు. 11వ శతాబ్ది నుండి సాహిత్యం ఉంది. గురునానక్ పంజాబీలో ఎంతో ప్రసిద్ధుడు. పంజాబీ కవిత్వాన్ని సూఫీ సంప్రదాయం ఎంతో ప్రభావితం చేసింది. సిక్కు గురువులు రూపొందించిన గురుముఖ లిపికి, పంజాబీ భాషకు ఎంతో దగ్గర సంబంధాలున్నాయి.

### 5) గుజరాతీ :

సుమారు 5 కోట్లకు పైగా జనాభా గుజరాత్ రాష్ట్రంలో ఈ భాషను మాట్లాడతారు. ఈ భాష ఘూర్జర అపభ్రంశం నుంచి పుట్టిందంటారు. 12వ శతాబ్ది నుంచి గుజరాతీ భాషలో సాహిత్యం లభ్యమవుతుంది. జైన సాహిత్యం మొదటి గుజరాతీ భాషలో ప్రారంభమయింది. మీరాబాయి మొదలైనవారు ప్రముఖులు.

### 6) మరాఠీ :

మహారాష్ట్రలో సుమారు 7,8 కోట్ల జనాభా మరాఠీని మాట్లాడుతున్నారు. 12వ శతాబ్ది నుంచి సాహిత్యం లభ్యమవుతోంది. జ్ఞానదేవ, నామదేవ, ఏకనాథ, తుకారాం, శ్రీధరుడు మొదలైన ఎంతోమంది ప్రముఖులు ఈ భాషకు చెందినవారే

### 7) రాజస్థానీ :

రాజస్థాన్‌లో ప్రధానంగా ఈ భాషా వ్యవహర్తలున్నారు. సుమారు 5, 6 కోట్ల జనాభా ఈ భాషను మాట్లాడతారు. భారతదేశ చరిత్రలో రాజపూట్‌లకు ఎంతో గొప్ప స్థానముంది. వీరి భాష రాజస్థానీ.

### 8) అస్సామీ :

అస్సాం రాష్ట్రంలో సుమారు 2 1/2 కోట్ల జనాభా ఈ భాషను మాట్లాడుతున్నారు. బెంగాలీ భాషకు దగ్గర సంబంధము ఉంది. ఇందులో 13వ శతాబ్ది నుంచి సాహిత్యం లభ్యమవుతుంది. తేయాకు తోటలకు అస్సాం రాష్ట్రం ప్రసిద్ధి వహించింది.

### 9) ఒరియా :

సుమారు 5, 6 కోట్ల జనాభా ఒరిస్సా రాష్ట్రంలో ప్రధానంగానూ, ఆచుట్టు ప్రక్కల రాష్ట్రాలలోనూ ఒరియా భాషను మాట్లాడుతున్నారు. 13వ శతాబ్ది నుంచి ఈ భాషకు సాహిత్యం లభిస్తోంది. సరలదాస్ ఒరియా భాషలో రామాయణ, భారతాల్ని అనువాదం చేశాడు. 15వ శతాబ్దిలో చైతన్య, 16వ శతాబ్దిలో జయదేవుల ప్రభావం ఒరియా సాహిత్యం మీద ఎంతో వుంది. జైన, బౌద్ధ, శాక్త్యేయ, వైష్ణవ మతాల ప్రభావం కూడా ఈ భాష మీద ఎంతో ఉంది.

### 10) కాశ్మీరీ :

సుమారు 50 లక్షల మంది ప్రజలు జమ్మూ - కాశ్మీర్‌లో ఈ భాషను వ్యవహరిస్తున్నారు. 10వ శతాబ్ది నుండి సాహిత్యం లభ్యమవుతోంది. కాశ్మీరీ భాష మీద పారసీ భాషా ప్రభావం ఎంతో ఉంది. కాశ్మీర్‌లో సుమారు 600 సం॥లు పారసీభాష అధికార భాషగా ఉంది.

### 11) కొంకణి :

ఈ భాషను గోవాలో ప్రధానంగా మాట్లాడతారు. జనాభా సుమారు 40 లక్షలు. మరాఠీ భాషకు సన్నిహితంగా వుంటుంది. దేవనాగరి, రోమన్, కన్నడ, మళయాళ లిపులు ఈ భాషకు వాడుతున్నారు. ముంబాయి, కేరళ, మంగుళూరులలో కూడా ఈ భాషా వ్యవహర్తలున్నారు. ఈ కొంకణి భాషా వ్యవహర్తలు ముఖ్యంగా క్రైస్తవులు.

### 12) నేపాలీ :

భారతదేశంలోనూ, నేపాల్‌లోనూ నేపాలీ భాషా వ్యవహర్తలున్నారు. 1 1/2 కోట్లకు పైగా జనాభా ఈ భాషను మాట్లాడుతున్నారు ఖాస్ ప్రాకృతం దీని మూలం. నేపాలీలు చాలామంది సంస్కృతంలో పండితులు. రామాయణ, భారత, భాగవతాది గ్రంథాలు నేపాలీభాషలో అనువాదం పొందాయి. 18వ శతాబ్ది నుంచి సంప్రదాయక నేపాలీ కవిత్వం కనిపిస్తుంది.

### 13) సింధీ :

గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలలో ప్రధానంగా ఉన్నా, భారతదేశం మొత్తంలో సింధీ భాష మాట్లాడే ప్రజలున్నారు. వీరు సుమారు 2 కోట్లు వరకూ ఉంటారు. ఈ భాషా వ్యవహర్తలు కొంతమంది దేవనాగరి లిపిని, మరొకొంత మంది పెర్సో-అరబిక్ లిపిని వాడుతున్నారు. 13వ శతాబ్ది నుంచి సాహిత్యం లభ్యమవుతోంది.

ఇంకా ఇవిగాక సింహళీ, బీహారీ, మైథిలీ, మాగధీ, భోజపురీ, హల్బీ, ఖడీబోలే, బ్రజ్, డోగ్రీ, పహరీ, గోర్ఖాలీ, గద్వాలీ మొదలయిన అనేక భాషలు ప్రధానంగా ఉత్తర భారతంలో వ్యాప్తిలో ఉన్నాయి.

### 1.4.3 ఆస్ట్రో - ఏషియాటిక్ భాషా కుటుంబం :

ఆస్ట్రేలియా ఖండం మొదలుకొని ఆగ్నేయ ఆసియాలోని భారతదేశం వరకు వ్యాపించి వున్న భాషల్ని ఆస్ట్రో-ఏషియాటిక్ భాషలంటారు. నీగ్రోయిడ్ (నీగ్రోటీ) కొలేరియన్ (ముండారియన్) జాతులు భారత దేశానికి తెచ్చిన భాషలివి. వీరిని సంస్కృత సాహిత్యంలో 'నిషాదులు' అనేవారు. వీరి తరువాత భారతదేశానికి వచ్చిన వారు మంగోలాయిడ్ జాతివాళ్ళు. వీరిని 'కిరాతులు' అని పిలిచేవారు.

ఈ భాషా కుటుంబానికి చెందిన మూడు ఉపకుటుంబాలకు చెందిన భాషలు భారతదేశంలో వాడుకలో ఉన్నాయి. అవి

1. కొలేరియన్ లేదా ముండా భాషా ఉపకుటుంబం
2. నికోబరీస్ భాషా ఉపకుటుంబం
3. మాన్‌ఖ్మేర్ భాషా ఉపకుటుంబం

### 1. కొలేరియన్ లేదా ముండా భాషా ఉపకుటుంబం :

ఈ ఉపకుటుంబానికి చెందినవారు ఆస్ట్రోలాయడ్లు. వీరినే సంస్కృత సాహిత్యంలో 'నిషాదు'లన్నారు. ఇందులో ప్రధానంగా సంతాలీ సవర ముండారీ, ఖడియా, భూమిజ్, కుర్కు, గదబ మొదలయినవి పేర్కొనదగ్గ భాషలు.

### సంతాలీ :

సంతాలీ భాష బీహారు రాష్ట్రంలోని ఛోటా నాగపూర్, సంతాల్ పరిగణాలలోనూ, ఒరిస్సాలోనూ, అస్సాంలో తక్కువగానూ వ్యవహారంలో ఉంది. ముండారీభాష దక్షిణ బీహారులోను, అస్సాంలోని అటవీ ప్రాంతాలలోనూ వ్యవహారంలో ఉంది. కుర్కుభాష మధ్యప్రదేశ్‌లోని బేరార్లో వ్యవహారంలో ఉంది. గదబ భాష ఒరిస్సాలోని గిరిజనులు మాట్లాడుతున్నారు.

### సవర :

సవర / సౌఅర భాష ఆంధ్రప్రదేశ్ ఉత్తర ప్రాంతంలోనూ, ఒరిస్సాలోనూ మాట్లాడతారు. ఈ భాష మీద వ్యవహార భాషోద్యమకారుడు గిడుగు రామమూర్తి పంతులుగారు ఎంతో కృషిచేసి సవర భాషా వ్యాకరణం, సవర భాషా నిఘంటువులను తయారుచేశాడు. ఈ భాషలోని పదాలు కొన్ని ద్రావిడ భాషలో కానవస్తున్నాయి.

### నికోబరీస్ ఉపకుటుంబం :

నికోబార్ దీవుల్లోని గిరిజనులు మాట్లాడే భాష నికోబరీస్. ఇటీవల ఆచార్య బి. రామకృష్ణారెడ్డి మొదలయినవారు దీనిని ప్రత్యేక భాషా కుటుంబాలుగా పేర్కొంటున్నారు.

### మాన్‌ఖ్మేర్ ఉపకుటుంబం :

ఈశాన్య భారతంలోని అస్సాం ఖాసీకొండల్లో, జయంతియా పర్వతశ్రేణుల్లో మాట్లాడే 'ఖాసీ' భాష ఈ ఉపకుటుంబంలో ప్రధానమయినది. దూర ప్రాచ్యదేశాలలో మాన్‌ఖ్మేర్ భాషలు వ్యవహారంలో ఉన్నాయి. వీటికే ఖాసీ, నికోబరీస్ భాషలకు దగ్గర సంబంధం ఉందని ఇటీవల వరకు భావించారు. (ఇటీవల నికోబరీస్‌ను ప్రత్యేక భాషా కుటుంబం అంటున్నారు).

### 1.4.4 ద్రావిడ భాషా కుటుంబం - భౌగోళిక వ్యాప్తి :

ప్రపంచంలోని పెద్ద భాషా కుటుంబాలలో ద్రావిడ భాషా కుటుంబం ప్రధానంగా పేర్కొనదగ్గది. భారతదేశ దక్షిణ ప్రాంతంలో ఆ భాషా కుటుంబానికి చెందిన భాషల్ని ప్రధానంగా మాట్లాడతారు.

భారతదేశానికి సంబంధించినంతవరకు ఇండో - యూరపియన్ భాషా కుటుంబానికి చెందిన హింద్వార్య భాషా ఉపకుటుంబం తర్వాత పేర్కొనదగ్గ రెండోఅతి పెద్ద భాషాకుటుంబమిది. సుమారు 30 కోట్ల మంది జనులు ఈ భాషాకుటుంబానికి చెందిన భాషల్ని మాట్లాడుతున్నారు. ద్రావిడ భాషా కుటుంబానికి చెందిన భాషలకు సుమారు 5 వేల సంవత్సరాల చరిత్ర ఉంది. ప్రొఫెసర్ ఆంద్రినోవా, భద్రిరాజు కృష్ణమూర్తి ద్రావిడభాషా కుటుంబానికి చెందిన బ్రాహూ ఈ భాష క్రీ.పూ. 3,000 సం॥ల నాటికే మూలభాష నుండి విడిపోయి ప్రత్యేక భాషగా ఏర్పడిందని భావించారు. ఇంతటి సుదీర్ఘ చరిత్ర కలిగిన ద్రావిడ భాషా కుటుంబంలో ఇప్పటికి పరిశోధకులు 26 భాషల్ని ప్రత్యేక భాషలుగా పేర్కొంటున్నారు. వాటిని మూడు ఉపకుటుంబాలుగా పేర్కొంటున్నారు. అవి.

**దక్షిణ ద్రావిడభాషా ఉపకుటుంబం :**

1. తమిళం
2. కన్నడం
3. మలయాళం
4. తుళు
5. కొడగు
6. తొద
7. కోత
8. బదగ

**మధ్య ద్రావిడభాషా ఉపకుటుంబం :**

1. తెలుగు
2. గోండి
3. కొండ
4. కుఇ
5. కువి
6. పెంగో
7. మండ
8. అవూత్
9. ఆవె
10. కోలామి
11. నాయకీ
12. పర్జీ
13. గదబ
14. ఒల్లారీ

**ఉత్తర ద్రావిడభాషా ఉపకుటుంబం :**

1. కురుఖ్
2. మాల్తో
3. బ్రాహూఈ
4. థంగర్

ఇటీవల భద్రిరాజు కృష్ణమూర్తి ద్రావిడభాషా కుటుంబంలోని భాషల్ని భాషా లక్షణాల్నిబట్టి నాలుగు ఉపకుటుంబాలుగా విభజించారు. వారి విభజన ప్రకారం అవి :

1. దక్షిణ ద్రావిడ భాషలు - 1
2. దక్షిణ ద్రావిడ భాషలు - 2
3. మధ్య ద్రావిడ భాషలు
4. ఉత్తరం ద్రావిడ భాషలు

వీరి వింగడింపు ప్రకారం మధ్య ద్రావిడ భాషల్నే దక్షిణ ద్రావిడభాషలు - 2, మధ్య ద్రావిడ భాషలుగా విభజించారు. కోలామి, నాయకీ, పర్జీ, గదబ, ఒల్లారీ భాషల్ని మధ్య ద్రావిడ భాషలుగానూ మిగిలిన వాటిని దక్షిణ ద్రావిడ భాషలు - 2 గానూ విభజించారు. పి.ఎస్. సుబ్రహ్మణ్యం గారి లాంటివారు ఈ వింగడింపుకు భాషా శాస్త్రవేత్తల ఆమోదం లభించవలసి ఉందన్నారు.

(ద్రావిడ భాషల వ్యవహర్తలు మాట్లాడే ప్రాంతాల విపులమయిన చర్చ రెండో పాఠంలో చూడండి)

ఇప్పటివరకు పేర్కొన్న భారతదేశంలో ఉన్న నాలుగు భాషా కుటుంబాలలో అతి పెద్ద కుటుంబాలు రెండు. అవి

1. ఇండో - యూరోపియన్‌కు చెందిన హిందార్య భాషా ఉపకుటుంబం
2. ద్రావిడ భాషా కుటుంబం

మొదటిది ఉత్తర భారతీయ భాషల్ని, రెండోది దక్షిణ భారతీయ భాషల్ని ప్రతిబింబిస్తున్నాయి. ప్రధానంగా ద్రావిడ భాషల మీద ఇంకా ఎంతో పరిశోధన జరగవలసి ఉంది.

**భాషా కుటుంబం** (Language Family)



**సమీక్ష :**

భారతదేశంలో ఉన్న భాషాకుటుంబాలు ముఖ్యంగా సినో - టిబెటన్, ఇండో - యూరోపియన్‌కు సంబంధించిన ఇండో-ఆర్యన్, ఆస్ట్రో-ఏషియాటిక్, ద్రావిడ భాషాకుటుంబాల గురించి వివరంగా తెలుసుకున్నారు.

**మాదిరి ప్రశ్నలు :**

1. భారతదేశంలోని భాషా కుటుంబాల గురించి వ్రాయండి.
2. ఇండో - యూరోపియన్ భాషా కుటుంబానికి ఉపకుటుంబమయిన హిందార్య భాషా ఉపకుటుంబం గురించి వివరించండి.
3. ద్రావిడభాషా కుటుంబంలోని భాషలు వాటి వ్యాప్తిని వివరించండి.

**ఆధార గ్రంథ పట్టిక :**

1. పురుషోత్తం, బొడ్డుపల్లి - భాషాశాస్త్ర పరిచయం, నాగలక్ష్మీ గ్రంథమాల, నరసరావుపేట - 522 601, 1982.
2. సుబ్రహ్మణ్యం,పి.ఎస్. - ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, కళాభవన్, సైఫాబాదు, హైదరాబాదు - 4, 1984.
3. Gleason, H.A. 1961, (Indian Edition, 1968) An Introduction to Descriptive Linguistics, New York : Holt
4. Bloom filed, Leonard, 193, Language, New York : Holt.

**- ఆచార్య పి. సుబ్బారావు**



భాషా కుటుంబం (Language Family)
1
ఉపకుటుంబం (Sub - Family)
2
ఉపకుటుంబం
3
ఉపకుటుంబం
1
శాఖ (Branch)
2
శాఖ
3
శాఖ
1
ఉప శాఖ (Sub - Branch)
2
ఉప శాఖ
3
ఉప శాఖ
1
ఉప వర్గం (Sub - Group)
2
ఉప వర్గం
3
ఉప వర్గం
1
భాష (Language)
2
భాష
3
భాష
1
మాండలికం (Dialoct)
2
మాండలికం
3
మాండలికం

పాఠం - 2

# ద్రావిడ భాషలు - వ్యాప్తి - ఉత్తర, మధ్య, దక్షిణ ద్రావిడ భాషలు

# ద్రావిడ భాషలు - లక్షణాలు

**విషయక్రమం**


**2.0** లక్ష్యం

**2.1** ద్రావిడ పదం - ఉత్పత్తి

**2.2** ద్రావిడ భాషలు - పరిశోధన

**2.3** ద్రావిడ భాషలు - వ్యాప్తి

**2.4** ద్రావిడ భాషా కుటుంబం - వర్గీకరణ

**2.4.1** ఉత్తర ద్రావిడ భాషలు

**2.4.2** మధ్య ద్రావిడ భాషలు

**2.4.3** దక్షిణ ద్రావిడ భాషలు

**2.5** ద్రావిడ భాషలు - లక్షణాలు


## 1.0 లక్ష్యం :

ద్రావిడ భాషా పదవ్యుత్పత్తి, ద్రావిడ భాషలలో జరిగిన పరిశోధన, ద్రావిడభాషా వ్యవహర్తలు, ద్రావిడ భాషలవ్యాప్తి, ద్రావిడభాషల ఉపకుటుంబ విభజన, ద్రావిడ భాషల ప్రత్యేక లక్షణాలను గురించి ఈ పాఠంలో తెలుసుకుంటారు.

ప్రపంచంలోనే పెద్దభాషా కుటుంబాలుగా పేర్కొంటున్న వాటిలో ద్రావిడభాషా కుటుంబం ఒకటి. భారతదేశానికి పరిమితం చేసుకున్నప్పుడు రెండవ పెద్ద భాషా కుటుంబమిది. దాదాపు 5 వేల సంవత్సరాలకు పైగా చరిత్ర ఉన్న ద్రావిడ భాషా కుటుంబానికి పరిశోధనలో ఇప్పటివరకు 26 భాషలున్నట్లు తేలింది. ఇవిగాక ఇంకా మరికొన్ని భాషలు, మాండలికాలు లేకపోలేదు. ద్రావిడ భాషల మీద పరిశోధనలు జరిగినా ఇంకా జరగవలసింది ఎంతో ఉంది. సుమారు 30 కోట్ల జనాభా ఈ భాషల్ని మాట్లాడుతున్నారు.

## 2.1. ద్రావిడ పదం - ఉత్పత్తి :

ద్రవిడ, ద్రావిడ, తమిళ్, తమిళ అనే రూపాంతరాలు కన్పిస్తున్నాయి. ద్రవిడ శబ్దం నుంచి ఏర్పడ్డ విశేషణ రూపం ద్రావిడ పదం. ఇవి సంస్కృత శబ్దాలని కాల్డ్వెల్, ఛటర్జీ మొదలైన వారు ఊహించారు.

కొంతమంది ద్రావిడ పదం నుంచి తమిళపదం వచ్చిందన్నార. వారి ఊహప్రకారం ద్రావిడ > దామిడ > దమిడ > దమిళ > తమిళగా మారింది.

మరికొంతమంది తమిళ్ అనే దేశ్యపదమే ద్రావిడపరంగా సంస్కృతీకరించడం జరిగిందంటారు.

పై వ్యుత్పత్తులన్నీ ఊహల మీదే ఆధారపడ్డాయి. అయితే అత్యంత ప్రాచీన సాహిత్యం కలిగిన సంస్కృతం, పాళీ మొదలైన భాషలలో ద్రవిడ, ద్రావిడ పదాలు కనిపిస్తున్నాయి.

**2.2 ద్రావిడ భాషలు - పరిశోధన :**

ద్రావిడ భాషల మీద మొదట పాశ్చాత్యులు, ఆ తర్వాత స్వదేశీయులు ఎంతో పరిశోధన చేశారు.

**పాశ్చాత్యులు :**

1. ఫ్రాన్సిస్ వైట్ ఎలిస్
2. రాస్మస్ క్రిష్టియన్‌రాస్క్
3. రాబర్టు కాల్డ్వెల్
4. సర్ జార్జి గ్రియర్సన్
5. స్టెన్ కొనో
6. థామస్ బరో
7. ఎమ్.బి. ఎమెనో మొదలైనవారు ప్రసిద్ధులు.

ఎ.డి. కాంబెల్ రాసిన "A Grammer of the Teloogoo or Gentoo Language" అనే పుస్తకానికి ముందుమాట రాస్తూ తమిళం, మలయాళం, కన్నడం, తెలుగు,తుళు, కొడగు, మాల్తో భాషలు ఒకే కుటుంబానికి చెందిన భాషలనీ వీటికీ, సంస్కృతానికి జన్మసంబంధం లేదనీ చెప్పాడు. ఎలిస్ ఈ భాషల్ని "Dialects of Southern India" అన్నాడు. రాస్మస్ రాస్క్ (1787 - 1832) కూడా ఈ భాషల మీద పరిశోధన చేసి ఇవి సంస్కృత భాషల కంటే భిన్నవయినవంటూ వీటిని "Malbaric Language" అన్నాడు.

రాబర్టుకాల్డ్వెల్ (1814 - 1891) 1856లో మొట్టమొదటిగా ఈ భాషల్ని ద్రావిడ భాషలన్నారు. తమిళం, మళయాళం, తెలుగు, కన్నడం, తుళు, కొడగు, తొద, కోత, గోండి, కుఇ, కురుఖ్ (ఒరియాన్) రాజమహల్ (మాల్తో) అనే పన్నెండు భాషల్ని గురించి "A Comparitive Grammer of the Dravidian or South Indian faimily of Languages" రాసి 1856లో ప్రచురించాడు.

ఆ తర్వాత సర్ జార్జ్ గ్రియర్సన్‌ను బ్రిటీషు ప్రభుత్వం భారతీయ భాషల మీద సమగ్ర పరిశోధన చేయమని 1896లో నియమించింది. ఆయన కృషి ఫలితంగా 1927లో "Linguistic survey of India" పేరుతో 12 సంపుటాలు వెలువడ్డాయి. వీటిలో నాల్గవ సంపుటం ద్రావిడ భాషలకు సంబంధించినది. దీనిని నార్వే దేశస్థుడయిన స్టెన్‌కొనో రూపొందించాడు. ఇంకా ఎమెనో, బరో, జ్యులిబిల్, కిటెల్, గుండర్ట్, ఎమ్.ఎస్. ఆండ్రోనావ్, గెరాల్డ్ కెల్లీ మొదలయిన ఎందరో ద్రావిడ భాషల మీద పరిశోధన చేశారు.

**భారతీయులు :**

కె.వి. సుబ్బయ్య, ఎల్.వి. రామస్వామి అయ్యర్, కుమారస్వామిరాజా, గంటిజోగి సోమయాజి, భద్రిరాజు కృష్ణమూర్తి, పి.ఎస్. సుబ్రహ్మణ్యం, సుధీభూషణ భట్టాచార్య, శంకర్‌భట్, బి.రామకృష్ణారెడ్డి, పర్వతనేని సుబ్బారావు, బి. రామచంద్రరావు, జి. ఉమామహేశ్వరరావు మొదలైన ఎందరో ద్రావిడ భాషలపై కృషి చేశారు.

## 2.3 ద్రావిడ భాషలు - వ్యాప్తి :

ఇప్పటివరకు జరిగిన పరిశోధనలనుబట్టి 26 ద్రావిడ భాషలు వెలుగులోకి వచ్చాయి. ఆ భాషలను వాటి వ్యాప్తిని గురించి తెలుసుకుందాం.

ద్రావిడ భాషలను వాటి లక్షణాలను ఆధారం చేసుకొని మూడు ఉపకుటుంబాలుగా విభజించారు. అవి ఉత్తర, మధ్య, దక్షిణ ద్రావిడ భాషలు.

కాల్డ్వెల్‌కాలం నాటికి 12 ద్రావిడ భాషలు వెలుగు చూశాయి. ఆయన వాటిని రెండు విధాలుగా వింగడించాడు. అవి

**1. నాగరిక భాషలు** (Literary / Cultivated Languages)

| | |
|---|---|
| తమిళం | కన్నడం |
| మలయాళం | తుళు |
| తెలుగు | కొడగు |

**2. అనాగరిక లేదా గిరిజన భాషలు** (Non - Literary / Uncultivated Languages)

| | |
|---|---|
| తొద | కుఇ |
| కోత | కురుఖ్ / ఒరాయిన్ |
| గోండి | మాల్తో (రాజమహల్) |

**మరికొంతమంది ద్రావిడ భాషల్ని సాహిత్యవంత భాషలు, సాహిత్యరహిత భాషలని కూడా వింగడించారు. సాహిత్యవంత భాషలు :**

కన్నడం, మలయాళం, తెలుగు

**సాహిత్యరహిత భాషలు :**

తుళు, కొడుగు, తొద, కోత, గోండి, కుఇ, కురుఖ్, మాల్తో మొదలయిన భాషలు. వీటిలో ప్రాచీన రచనా సాహిత్యం లేదు. ప్రస్తుతం ద్రావిడ భాషలను వాటి వ్యాప్తిని పరిశీలిద్దాం.

### 1. తమిళం :

ద్రావిడ భాషల్లో అతి ప్రాచీనమయిన సాహిత్యచరిత్ర ఉన్న భాష తమిళం. ఈ భాషకు తమిణి, తిరావిడం, అరవం, తముక, ద్రావిడ అనే పర్యాయపదాలున్నాయి. తమిటి అంటే తియ్యనిది, మధురమయినదని అర్థం. అంటే తమిళం తియ్యనిది మధురంగా ఉండేదని ఉత్పత్తి చెప్పారు. కాని ఎవరి మాతృభాషవారికి మధురంగానే ఉంటుంది కదా. తిరావిజం ద్రావిడపదానికి వికృతి. తమిళుల్ని అరవవాళ్ళనీ, వారి భాషను అరవ భాషనీ అంటారు. అయితే తమిళులు ఎప్పుడూ అలా అనుకోలేదు. ఎక్కడా రాయలేదు. కన్నిడిగులు, తెలుగువాళ్ళు తమిళుల్ని అరవవాళ్ళనీ, వారి భాషను అరవభాషనీ అంటారు. అంటే రవం లేని భాష అని అర్థం. అనగా మహాప్రాణాలు లేని భాష అని అర్థం చెప్పుకుంటే సరిపోతుంది.

**వ్యవహార ప్రాంతం :**

మన దేశంలో తమిళనాడు, పుదుచ్చేరి, ఇంకా ఇతర రాష్ట్రాలలోనూ, శ్రీలంక, బర్మా, మలేషియా, ఇండోనేషియా, దక్షిణాఫ్రికా, బ్రిటీషు గుయానా, ఫిజి, మారిషస్, మడ్గాస్కర్, ట్రినిడాడ్ మొదలయిన చోట్ల ఈ భాష వ్యవహారంలో ఉంది.

**జనసంఖ్య :** సుమారు 6, 7 కోట్ల మంది.

**సాహిత్యం :**

తొల్కాప్పియమ్ మొదటి వ్యాకరణం గ్రంథం. దీనిని రాసింది తొల్కాప్పియనార్ అని అంటారు. ఇది క్రీ.పూ. 1వ శతాబ్దానిదని అంటారు. మరికొంతమంది క్రీస్తు శకారంభంలోనిదంటారు.

తమిళ సాహిత్యంలో అతి ప్రాచీనమయినది సంఘవాఙ్మయం. ఇది క్రీ.పూ. 1వ శతాబ్ది నుంచి ప్రారంభమయి క్రీ.శ. 3వ శతాబ్ది వరకు ఉన్నకాలం. వందలాది ప్రాచీన కవులు రాసిన పద్యాలు, కవితలు సంపుటాలుగా కూర్చారు. వీటిలో ఎట్టుత్తొగై, పత్తుప్పాట్టు ముఖ్యమయినవి. తిరువళ్ళువార్ రాసిన తిరుక్కురళ్, ఇళంకో అటగల్ రాసిన చిలప్పదిగారం, చీత్తలైచాత్తనార్ రాసిన మణిమేకలై గ్రంథాలు ప్రముఖమయినవి. ఆధునికుల్లో సుబ్రహ్మణ్యభారతి చాలా గొప్పకవి.

తమిళభాషకు 5 మాండలికాలున్నాయని ఆంద్రోనావ్ చెప్పాడు. అవి.

1. తూర్పు వ్యవహారంలో ఉన్న మాండలికం
2. ఉత్తర వ్యవహారలో ఉన్న మాండలికం
3. దక్షిణ వ్యవహారంలో ఉన్న మాండలికం
4. పశ్చిమ వ్యవహారంలో ఉన్న మాండలికం
5. శ్రీలంక వ్యవహారలో ఉన్న మాండలికం

**2. మలయాళం :**

పూర్వం చేరనాడుగా వ్యవహారంలో ఉండి, ప్రస్తుతం కేరళ రాష్ట్రంగా ఉన్న ప్రాంతంలో మలయాళ భాష వ్యవహారంలో ఉంది. ఈ భాషను మలబరీ, మలబారీ అని కూడా అంటారు. మలబారీ అంటే కొండల వరుస అని అర్థం. మలయాళం అంటే కొండల ప్రాంతంలో వ్యవహరించబడే భాష అని అర్థం.

**వ్యవహార ప్రాంతం :**

ప్రధానంగా కేరళ రాష్ట్రంలోనూ, భారతదేశంలోని అనేక ఇతర ప్రాంతాలలోనూ ఈ భాష వ్యవహారంలో ఉంది.
జనసంఖ్య : సుమారు 3 1/2 కోట్లు.

**సాహిత్యం :**

మలయాళంలో ప్రత్యేక లక్షణాలు క్రీ.శ. 5 - 10 శతాబ్దాల మధ్యకాలంలో ఏర్పడి అది ప్రత్యేక భాష అయిందని ఎల్.వి.రామస్వామి అయ్యర్ నిరూపించారు. తొమ్మిదో శతాబ్దానికి చెందిన భాస్కర రవివర్మ కొచ్చిన్ తామ్రశాసనాలు మొదటి శాసనాలుగా భావిస్తున్నారు. 13వ శతాబ్దానికి చెందిన 'రామచరితం' మొదటి మహాకావ్యం. 14వ శతాబ్దానికి చెందిన 'లీలా తిలకం' మొదటి ప్రామాణిక వ్యాకరణం. మలయాళ భాషలో 'మణిప్రవాళ' మనే ప్రత్యేక శైలి ఉంది.

**మాండలికాలు :**

జ్వలబిల్ మలయాళ భాషలు 5 మాండలికాలున్నట్లు గుర్తించాడు. అవి 1. నంబూద్రి, 2) నాయర్, 3. మోప్ల 4. పులయ 5. నస్రాణి. ఫెడరిక్ నాలుగు మాండలికాలున్నాయంటాడు. అవి 1. బ్రాహ్మణ మాండలికం 2. నాయర్ మాండలికం 3. శూద్రమాండలికం 4. అస్పృశ్యుల మాండలికం.

**3. కన్నడం :**

కర్ణాటం, కర్ణాటకం, కన్నడి, కానడి, కానరి, కేనరీస్ అనేవి కన్నడ భాషకు పర్యాయ పదాలుగా కనిపిస్తున్నాయి. కర్ణాట అంటే చెవులకు ఇంపయిన భాష అని కొందరు వ్యుత్పత్తి చెప్పారు.

**వ్యవహార ప్రాంతం :**

ప్రస్తుత కర్ణాటక రాష్ట్రంలోనూ, మహారాష్ట్రలో కొంతభాగం, భారతదేశం మిగిలిన అనేక ప్రాంతాలలో కన్నడభాష మాట్లాడే ప్రజలున్నారు.

**జనసంఖ్య :** దాదాపు నాలుగు కోట్లకు పయిగానే.

**సాహిత్యం :**

కన్నడ భాషలో క్రీ.శ. 5వ శతాబ్ది నుంచి శాసనాలు లభ్యమవుతున్నాయి. 9వ శతాబ్దానికే 150కి పైగా శాసనాలు లభ్యమయ్యాయి. కన్నడ భాషలో అతి ప్రాచీన గ్రంథం క్రీ.శ. 9వ శతాబ్దిలో శ్రీ విజయుడు రాసిన 'కవిరాజమార్గ' అనే లక్షణ గ్రంథం. కన్నడ భాషలో 9వ శతాబ్దిలో భారత రచన జరిగింది. భారతం రాసిన పంప, రన్న, పొన్న కవులను రత్నత్రయంగా పిలుస్తారు. పంపడు క్రీ.శ. 941లో 'ఆదిపురాణం' విక్రమార్జున విజయం, పొన్నకవి 'శాంతిపురాణం' రన్నకవి 'అజితపురాణం' 'గదాయుద్ధ' అనే గ్రంథాలు రాశారు. కన్నడ భాషలో సర్వజ్ఞుడు తెలుగులో వేమన లాంటికవి.

**మాండలికాలు :**

కన్నడ భాషలో రెండుకాల మాండలికాలున్నాయి. అవి :

1. కుల మాండలికాలు 2. స్థల మాండలికాలు

కుల మాండలికాలలో ముఖ్యమయినవి : 1. గౌడకన్నడం 2. హవ్య కన్నడం 3. హాలక్కి కన్నడం
స్థల మాండలికాలలో ముఖ్యమయినవి : 1. ధార్వార్ కన్నడం 2. మైసూరు కన్నడం 3. మంగుళూరు కన్నడం 4. గుల్బర్గ కన్నడం 5. కోతకన్నడం.

**4. తెలుగు :**

ఆంధ్రప్రదేశ్‌లోనే గాక ఇరుగుపొరుగు రాష్ట్రాలయిన తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, ఒరిస్సా, బెంగాలల్లో కూడా అధిక సంఖ్యలో తెలుగు మాట్లాడే ప్రజలున్నారు. మారిషస్, మలేషియా, శ్రీలంక, బర్మా, దక్షిణాఫ్రికా, బ్రిటన్, కెనడా, అమెరికా మొదలయిన ఇతర దేశాల్లో కూడా తెలుగువారు ఉన్నారు. ఈ భాషకు పర్యాయపదాలుగా ఆంధ్రం, తెనుఁగు, తెలుఁగు అనేవి

కూడా వ్యవహారంలో ఉన్నాయి. భారతదేశంలో తెలుగు మాట్లాడేవారు హిందీ తర్వాత రెండో స్థానంలో ఉన్నారు. ద్రావిడ భాషలలో ప్రథమ స్థానంలో ఉంది.

జనసంఖ్య : సుమారు 8 నుంచి 9 కోట్లు

### సాహిత్యం :

తెలుగు ప్రత్యయం క్రీ.శ. 2వ శతాబ్దం శాసనంలో ఉంది. కాగా క్రీ.శ. 575 లో కడపజిల్లా, కమలాపురం తాలూకా, ఎర్రగుడిపాడులో లభ్యమయిన శాసనం పూర్తి తెలుగులో ఉన్న మొదటి శాసనం. ఆరో శతాబ్దికి ముందు ఆంధ్ర ప్రాంతంలో శాసనాలు సంస్కృత, ప్రాకృత భాషలలో ఉండేవి. అయితే వాటిలో ఉన్న ఊళ్లపేర్లూ, వ్యక్తుల పేర్లూ పూర్తి తెలుగువే. లభ్యమయినంతలో క్రీ.శ. 11వ శతాబ్దంలో నన్నయ రాసిన ఆంధ్రమహాభారతమే మొదటి రచన. తిక్కన, ఎర్రన, శ్రీనాథుడు, పోతన, కృష్ణదేవరాయలు, పెద్దన, రామరాజ భూషణుడు, చేమకూర, అన్నమయ్య, వేమన, కందుకూరి, గురజాడ, గిడుగు మొదలయిన ఎందరో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. విశ్వనాథ సత్యన్నారాయణ, సి.నారాయణరెడ్డి లు జ్ఞానపీఠ్ పురస్కారాన్ని పొందినవారు.

'ఆంధ్రశబ్ద చింతామణి' ని నన్నయే రాశాడనుకుంటే క్రీ.శ. 11వ శతాబ్దం నాటికే తెలుగులో వ్యాకరణం ఉందని చెప్పవచ్చు. (అయితే దీని కర్త నన్నయకాదనీ 16వ శతాబ్దంలో ఒక పెద్దాయన రాసి నన్నయ పేరుతో ప్రచారం చేశారని అందులోని సూత్రాలు, భాషను బట్టి చెబుతున్నారు) అలాకాకపోయినా 12వ శతాబ్దంలో మూలఘటిక కేతన రాసిన 'ఆంధ్ర భాషా భూషణం' మొదటి వ్యాకరణం అవుతుంది. తెలుగుకు ఇదే మొదటి వ్యాకరణమని కూడా కేతన అందులో పేర్కొన్నాడు.

### 5. తుళు :

తమిళ సంఘ వాఙ్మయానికి చెందిన 'అకనానూఱు' లో తుళునాడు అందులో ఉండే మూదూర్ అనే పట్టణాన్ని వర్ణించారు. కాబట్టి తుళు భాష సంఘ వాఙ్మయ కాలం నాటికే ఉంది. 'దేశభాషలందు తెలుగు లెస్స' అని చెప్పిన శ్రీకృష్ణదేవరాయలు తుళువ వంశంవాడే. ఆయన మాతృభాష తుళు భాషే. ఈ భాషను 'తుళువ' అని కూడా అంటారు. 'తుళు' అంటే మృదువని అర్థం. అంటే మృదువయిన భాష అని అర్థం. తుళు పదజాలం వల్ల కూడా ఆ భాష బాగా అభివృద్ధి చెందిన భాష అనవచ్చు. అందుకే కాల్డ్వెల్ దీనిని నాగరిక భాషలలో చేర్చాడు. వీరు కన్నడ, మలయాళ లిపులు వాడతారు.

### వ్యవహార ప్రాంతం :

తుళుభాష కర్ణాటక రాష్ట్రంలో దక్షిణ కన్నడ జిల్లాలో ఉడుపి, బంటువాళ, కార్కళ, మంగుళూరు, పుత్తూరు తాలూకాలలోనూ, కేరళ రాష్ట్రంలోని కాసరగోడు తాలూకాలోనూ ఉంది.
జనసంఖ్య : సుమారు 25 లక్షలు

### మాండలికాలు :

కులమాండలికాలు, స్థలమాండలికాలు ఉన్నాయి. బ్రాహ్మణుల మాండలికానికి, బ్రాహ్మణేతరుల మాండలికానికి ప్రస్ఫుటమయిన భేదం ఈ భాషలో ఉంది.

### 6. కొడగు :

ఈ భాషను కూర్గు, కూర్గి, కొడగి, కొడవ అని కూడా అంటారు. కొడగు భాష కన్నడ భాషకు దగ్గరగా ఉంటుందని మొదట భావించారు. కాని ఇటీవలి పరిశోధన వల్ల ఇది తమిళ, మలయాళ భాషలకు దగ్గరగా ఉందని తేలింది. కొడగు అనేపదం తమళ కుట(క్కు) 'పశ్చిమం' అనే పదానికి సంబంధించింది అని కాల్డ్వెల్ అన్నాడు. ఈ భాషకు కూడా లిపి, సాహిత్యం లేకపోయినా కాల్డ్వెల్ దీనిని నాగరిక భాషల జాబితాలో చేర్చాడు.

వ్యవహారప్రాంతం : కర్ణాటక రాష్ట్రంలో కూర్గు జిల్లాలో ఈ భాషా వ్యవహర్తలున్నారు.

జనసంఖ్య : సుమారు 2 లక్షలమంది

### 7. తొద :

తొదజాతివారి ఆచారాలూ, భాషా విలక్షణంగా ఉంటాయి. వీరి ముఖ్యవృత్తి గేదెలను పెంచడం. గేదెల పెంపకం వీరిమతంలో ముఖ్యాంశం. ఆహారంలో పాల ఉత్పత్తులయిన మజ్జిగ, పెరుగు, నెయ్యి ఎక్కువగా వాడతారు. అందరూ శాకాహారులే. మాంసాన్ని ముట్టరు. వీరికిపోగా మిగిలిన పాలు, నెయ్యి అమ్మి వాటికి బదులుగా వాళ్ళకు కావలసిన బట్టలు, బియ్యం, జొన్నలు మొదలయినవి తెచ్చుకుంటారు. తొద స్త్రీలకు బహు భర్తృత్వం ఉంది. తొద జాతిలో ఎవరయినా మరణిస్తే వారి శక్తిని బట్టి కొన్ని గేదెల్ని కూడా చంపి వారితో కలిపి పూడుస్తారు. వీళ్ళు ముదురు గోధుమ రంగు వర్ణంలో ఉండి నీలగిరి జాతుల వారందరికంటే బలిష్టంగానూ, పొడవుగానూ ఉంటారు. తొదభాష తమిళ, మలయాళాలకు దగ్గరగా ఉంటుంది.

### వ్యవహార ప్రాంతం :

తొదజాతివారు నీలగిరి కొండల్లో ఉన్నారు. వీరితోపాటు కోత తెగవారు, ఇరుళ మొదలయిన తెగలవాళ్ళు కూడా ఉన్నారు.

జనసంఖ్య : సుమారు 2 వేలకు పైగా ఉన్నారు.

### 8. కోత :

అనాది కాలం నుంచీ నీలగిరి కొండలలో ఉంటున్నారు. వీరితో పాటు తొద, బదగ, ఇరుళ, కురుంబ జాతుల వాళ్ళు కలసి మెలసి జీవనం సాగిస్తున్నారు. కోత తెగవారు మిగిలిన వారికి ఇనుపవస్తువులూ, కుండలూ తయారుచేసి ఇస్తారు. అంతేగాక వీరు భజంత్రీలుగా కూడా పనిచేస్తారు. వ్యవసాయపు పనులు చేస్తారు. కోత జాతి నీలగిరి జాతులన్నింటిలోకి తక్కువ జాతిగా పరిగణిస్తారు. దీనికి కారణం ఎద్దు, గేదె మాంసాన్ని తినడమే గాక చనిపోయిన జంతువుల మాంసాన్ని తినడమే.

వ్యవహార ప్రాంతం : నీలగిరి కొండలు

జనసంఖ్య : సుమారు 3 వేల మంది

### 9. బదగ :

మొదట్లో ఈ భాషను కన్నడ భాష మాండలికంగా పేర్కోవడం జరిగింది. బదగ క్రీ.శ. 10వ శతాబ్దం కే కన్నడ భాష నుంచి విడిపోయి ప్రత్యేక భాషగా రూపుదిద్దుకున్నట్లుగా భాషా శాస్త్రవేత్తలు నిరూపించారు.

వ్యవహారప్రాంతం : నీలగిరి కొండలు మిగిలిన తొద, కోత, ఇరుళ జాతులతో కలసి జీవిస్తున్నారు.

జన సంఖ్య : సుమారు లక్ష మంది

## 10. గోండి :

సాహిత్యరహిత భాషలలో గోండీకి ప్రత్యేక స్థానముంది. గోండులు, గోండీ అనే మాటలు ఇతర భాషలవారు వాడేవి. గోండులు మాత్రం తమ జాతివారిని కోయతూర్ అనీ తమ భాషని 'కోయాజ్' అనీ వ్యవహరిస్తారు. గోండుల ముఖ్య దైవం భీమాల్ (భీముడు). గోండులకు పరంపరగా వచ్చిన కథలూ, పెళ్ళిపాటలూ, పొడుపు కథలూ చాలా ఉన్నాయి. లిపి లేకపోయినా గోండీ భాష చాలా పరిపుష్టమయిన, సుందరమయిన భాష.

### వ్యవహారప్రాంతం :

గోండులు మహారాష్ట్ర తూర్పు, ఉత్తర ప్రాంతాల్లోనూ, మధ్యప్రదేశ్‌లోని బింద్వారా, బెతుక్, మస్తర్, చాందా, బాలాఘాట్, నాగపూర్, వార్ధా, యెట్మల్, ఒరిస్సాలోని కొన్ని ప్రాంతాల్లోనూ, ఆంధ్రప్రదేశ్ ఆదిలాబాద్ జిల్లాలో రాజ్‌గోండులూ, ఖమ్మంలో కోయలూ ఉన్నారు. వీరిలో రాజ్‌గోండులూ, మడియా గోండులూ, మురియా గోండులూ, బస్తర్, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్‌లలో ఉండే కోయలూ ముఖ్యులు.

జనసంఖ్య : రమారమి 40 లక్షల మంది

### మాండలికాలు :

గోండీ భాషలో చాలా మాండలికాలున్నాయి. కోయ మాండలికం ప్రధానమయినది. ఉత్తర, దక్షిణ, తూర్పు, పశ్చిమ మాండలికాలున్నాయి. మడియా మాండలికం, బెతూల్ మాండలికం అని మాండలికాలు ఎక్కువగా ఉన్న భాష. ఈ భాషలో పదాది చకారం కొన్ని మాండలికాల్లో సకారంగానూ, మరికొన్నింటిలో హకారంగానూ, ఇంకొన్నింటిలో $\emptyset$ గానూ మారింది. దీనినే చ > స > హ > $\emptyset$ అని సూత్రరూపంలో రాస్తారు.

## 11. కొండ / కూబి :

ఈ భాషవారు తమ జాతివారిని కూబిజ్ అని అంటారు. భాషను కూబి అని పిలుస్తారు. చుట్టుప్రక్కల వాళ్ళు వీరిని కొండ దొరలు, కొండకాపులు, ఓజలు, పాండవ రైతులు అని పిలుస్తారు.

### వ్యవహార ప్రాంతం :

కొండదొరలు అనే ఈ భాషావ్యవహర్తలు తెలుగుదేశంలో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లోనూ, ఒరిస్సాలోని కోరాపుట్ జిల్లా ఆగ్నేయ ప్రాంతంలోని పర్వత ప్రదేశాల్లోనూ ఉన్నారు. కూబిజ్ జాతివారు విశాఖపట్నం జిల్లాలోని అరకులోయకు ఈశాన్యదిశగా 15 మైళ్ళ దూరంలో ఉన్న సురకం దెల్, మెట్‌కందెల్ ప్రాంతాల్లో నివసించేవారు.
జనసంఖ్య : సుమారు 25 వేల మంది

### మాండలికాలు :

ఆంధ్రప్రదేశ్‌లోని కాశీపట్నానికి తూర్పు ప్రాంతంలోని భాషను అరకు మాండలికంగానూ, అనంతగిరి నుంచి కోరాపుట్ జిల్లాలోని భాషను మరొక మాండలికంగానూ పరిగణించడం జరిగింది.

**12. పెంగొ :**

పెంగొ జాతి వారిని 'జానీ' అని కూడా అంటారు. 1957, 1964-65 లలో బరో, సుధీ భూషణ భట్టాచార్యులు ఈ భాష మీద పరిశోధన చేశారు. ఈ జాతివారిని గురించిన నివేదిక 1891 సెన్సస్‌లోనే ఉంది.

**వ్యవహార ప్రాంతం :**

ఒరిస్సా రాష్ట్రంలోని కోరాపుట్ జిల్లాలో నవరంగపూర్, దసమంతపూర్ తాలూకాలలోనూ, కళహంది జిల్లాలో ధువముల్ రాంపూర్, కాశీపూర్ తాలూకాలలోనూ ఉన్నారు. వీళ్ళలో చాలామంది వారి భాషను మానివేసి ఒరియా భాష మాట్లాడుతున్నారు.

జనసంఖ్య : సుమారు 3 వేలు.

**మాండలికాలు :**

1) పశ్చిమ మాండలికం 2) తూర్పు మాండలికం 3) ధువముల్ రాంపూర్ మాండలికం అని మూడు మాండలికాలున్నాయి.

**13. మండ :**

పెంగో, మండ భాషలు పక్క పక్కనే ఉంటాయి. వీరి జీవన విధానం కూడా ఒకేవిధంగా ఉంటుంది.

**వ్యవహార ప్రాంతం :**

ఒరిస్సాలో కళహంది జిల్లా ధువముల్ రాంపూర్ తాలూకాలో ఉన్నారు. మరి కొంతమంది నవరంగపూర్ తాలూకా సరిహద్దులో కూడా ఉన్నారు. దీనిని మొదట కనుగొన్నవారు బరో, సుధీ భూషణ భట్టాచార్యులు, మండా భాష మాటలు కొన్నింటిని 'A Dravidian Etymological Dictionary, Supplement (1968) లో ఇచ్చారు. పెంగో భాషకు మండ భాషకు చాలా సన్నిహిత సంబంధం ఉంది.

**14. అవూత్ :**

ఒరిస్సాలోని కళహంది, ఫుల్బానీ జిల్లాల్లో వీరు నివసిస్తున్నారు. సుమారు 74 కుగ్రామాల్లో వీరున్నారు. పెంగో భాషకు బరో, భట్టాచార్యులు రాసిన 'The Pengo Language (Oxford, 1970) అనే పుస్తకంలో ముందు మాటలో ఇంకా అక్కడ కొన్ని భాషలున్నాయని వాటి మీద పరిశోధన జరగవలసిన అవసరం ఉందనీ చెప్పారు. దానిని ఆధారంగా చేసుకొని 1979-82లలో పర్వతనేని సుబ్బారావు ఈ ప్రాంతంలో పరిశోధన చేసి ఈ భాషను వెలుగులోకి తెచ్చారు. పెంగొ, మండ, ఆవె / ఇంది, అ?వి అనే భాషలు మాట్లాడేవారు అక్కడున్నారు. వీరంతా చుట్టుప్రక్కల కుగ్రామాలలో జీవిస్తూ కలసిమెలసి ఉంటారు.

**వ్యవహార ప్రాంతం :**

ఒరిస్సాలోని కళహంది జిల్లాలో ధువముల్ రాంపూర్, గుణుపూర్, కాశీపూర్ ప్రాంతాల్లోనూ, నవరంగపూర్ జిల్లాలో కొన్ని కుగ్రామాలు మొత్తం 74 కుగ్రామాలలో ఈ భాషను మాట్లాడే ప్రజలున్నారు.

జనసంఖ్య : సుమారు 15 వేలు.

**15. ఆవె / ఇంది :**

పెంగొ, మండ, అవుత్ భాషలకు చాలా సన్నిహితమయిన భాష. దీనిమీద 1979-83 మధ్య ఆచార్య బి. రామకృష్ణారెడ్డి ఎమ్.వి.రమణయ్యలు పరిశోధన చేసి ఈ భాషను వెలుగులోకి తెచ్చారు.

**వ్యవహార ప్రాంతం :**

ఒరిస్సా ఏజన్సీలో కళహంది జిల్లా ముఖ్య పట్టణమయిన భవానిపట్నంకు 75 కిలోమీటర్ల దూరంలోని థువముల్ రాంపూర్, కాశీపూర్, నవరంగపూర్, గోపాలపట్న ప్రాంతాల్లో గిరిజనులు ఈ భాషను మాట్లాడుతున్నారు.
జనసంఖ్య : సుమారు 5 వేల మంది.

**16. కుఇ :**

ఈ భాష మాట్లాడే వారిని కోండులు, ఖోండులు, కంధులు అంటారు. అయితే వారు మాత్రం తను జాతివారిని 'కూఇంగ' ('ంగ' బహువచన ప్రత్యయం) అంటారు.

**వ్యవహారప్రాంతం :**

ఒరిస్సాలో మహానదికీ, విశాఖపట్నం జిల్లాకీ మధ్య ఉన్న పర్వత ప్రాంతాల్లో ఉన్నారు. ఒరిస్సాలో దసపల్ల, బౌద్, ఖోండ్‌మల్స్, ఫుల్బాని, కళహంది జిల్లాలోనూ, గంజాంలో గుంసూర్, ఉదయగిరి, చిన్న కిమెడి తాలూకాలోనూ, విశాఖపట్నం జిల్లా బిసంకటక్, గుణుపూర్ తాలూకాలలోనూ ఈ భాష వ్యవహారంలో ఉంది.

జనసంఖ్య : సుమారు 10, 12 లక్షలమంది.

**మాండలికాలు :**

1) పశ్చిమ మాండలికం, 2) ఈశాన్య మాండలికం ప్రధానంగా ఉన్నా మరికొన్ని మాండలికాలు ఈ భాషలో ఉన్నాయి.

**17. కువి :**

కువి భాష కుఇ భాషకు ఎంతో సన్నిహితంగా ఉంటుంది. కువి అంటే కొండ అని అర్థం. కోండు / ఖోండు, పూజు, జాతాపు, సామంతు, పోండు అనేవి ఈ భాషకు ప్రాంతీయ నామాలు. వీరిని కూడా కంధులంటారు. ఈ భాషలో కంఠమూలస్పర్శం (Glottal stop) ప్రచురంగా ఉంది.

**వ్యవహార ప్రాంతం :**

ఈ భాష మాట్లాడే కంధ్ జాతివారు విశాఖపట్నం ఏజన్సీ ప్రాంతాలలో అనగా అరకు, సాలూరు ప్రాంతాలలోనూ, జయపూర్, పాలకొండ ప్రాంతాలలోనూ ఉన్నారు.
జనసంఖ్య : సుమారు 4 లక్షలు.

**18. కోలామీ :**

వీరు తమ భాషను కొలవగొట్టి అనీ, తమ జాతివారిని కోలవార్ అనీ పిలుస్తారు. కోలాములు గోండులతో కలసి నివసించడం వల్లా, గోండులు సంఖ్యా బలం వల్లా, సాంఘిక స్థాయి వల్లా కోలామీల కంటే ఎక్కువ వారు కావడంచేత కోలాములందరికీ గోండీ భాష వస్తుంది. ఆదిలాబాద్‌లోని కోలాములు, గోండులు మరాఠీ, ఉర్దూ భాషల్ని కూడా మాట్లాడతారు. ఆదిలాబాద్‌లో తెలుగు వచ్చిన కోలాములు అతి కొద్దిమంది మాత్రమే. కోలాములందరూ బహుభాషావేత్తలని చెప్పవచ్చు.

**వ్యవహార ప్రాంతం :**

మహారాష్ట్రలోని వార్ధా, యోట్మల్ జిల్లాల్లోనూ, ఆంధ్రప్రదేశ్‌లోని ఆదిలాబాద్ జిల్లాలోనూ ఈ భాషా వ్యవహర్తలున్నారు.

జనసంఖ్య : సుమారు ఒక లక్ష మంది

**మాండలికాలు :**

ఇందులో ప్రధానంగా మూడు మాండలికాలున్నాయి.

1) వార్ధా మాండలికం
2) ఆదిలాబాద్ మాండలికం
3) యోట్మల్ మాండలికం

**19. నాయకీ :**

మహారాష్ట్రలోని ఛాందా జిల్లాలో 'ముల్' పట్టణ ప్రాంతంలో 'దద్వే గోండులు' అనే ఒక జాతివారున్నారు. వీరిని నాయక్‌లు అని కూడా అంటారు. ఈ జాతివారు తమని 'ఏర్కు' అని వ్యవహరిస్తారు. వీరిలో ఇప్పుడు అధిక సంఖ్యాకులు మరాఠీనే మాట్లాడుతున్నారు. అయినా కొంత మంది ప్రాచీనభాషను మాట్లాడుతున్నారు. దీని మీద బరో, భట్టాచార్యలు పరిశోధన చేసి వ్యాసం రాశారు. నాయకీ కోలామీ భాషకు చాలా సన్నిహితంగా ఉంటుంది.

**వ్యవహార ప్రాంతం :**

మహారాష్ట్రలోని ఛాందా జిల్లాలోని 'ముల్' పట్టణ ప్రాంతం.

జనసంఖ్య : సుమారు 2 వేల మంది

**20. పర్జీ :**

పర్జీ సంస్కృత 'ప్రజ' నుంచి వచ్చింది. (ప్రజా>పొరొజ) ఈ మాటను పెంగ్ పొరజ, బొంద పొరజ మొదలయిన అనేక భిన్నజాతులకు ఉపయోగిస్తారు. పర్జలు తమని 'దుర్వ' అని అంటారు. గోండులు వీరిని కాపులంటారు. వీరి ముఖ్యవృత్తి వ్యవసాయం. బరో, భట్టాచార్యలు ఈ భాష మీద పరిశోధన చేశారు.

**వ్యవహార ప్రాంతం :**

మధ్యప్రదేశ్ రాష్ట్రం బస్తర్ జిల్లాలోని జగదల్‌పూర్ దక్షిణ ప్రాంతం నుంచి సుక్మ జమీందారీ వరకు, కంగేరీ అడవితో సహా ఉన్న ప్రాంతంలో పర్జీ వ్యవహర్తలున్నారు.

జనసంఖ్య : సుమారు ఒక లక్ష

**మాండలికాలు :**

ముఖ్యంగా మూడు మాండలికాలున్నాయి.

1) వాయువ్య మాండలికం
2) ఈశాన్య మాండలికం
3) దక్షిణ మాండలికం

**21. గదబ :**

వీరిలో గుతోబ్ (మొడ్ / బొడో) గదబలు, ఒల్లార్ గదబలు, కొండే కోర్ గదబలు అని మూడు శాఖల వారున్నారు. (గుతోబ్ గదబల భాష కొలారియన్ భాష) ఒల్లార్, కొండే కోర్ గదబలు మాట్లాడే భాష ద్రావిడ భాష. భట్టాచార్య దీని మీద పరిశోధన చేశాడు. గదబ పర్జీకి చాలా సన్నిహితమయిన భాష.

**వ్యవహార ప్రాంతం :**

ఒరిస్సాలోని కోరాపుట్ జిల్లాలో జయపూర్, విజయనగరం జిల్లా సాలూరు ప్రాంతంలోనూ ఈ భాషను మాట్లాడతారు. జనసంఖ్య : సుమారు 50 వేలమంది.

**22. ఒల్లారి :**

**వ్యవహార ప్రాంతం :**

ఒరిస్సా రాష్ట్రంలోని కోరాపుట్ జిల్లా దక్షిణ భాగంలోని ఏజన్సీ ప్రాంతంలో ఒల్లారీ భాషా వ్యవహర్తలు ఉన్నారు. ఒల్లారీ భాషను గదబకు మాండలికమని బరో, భట్టాచార్యలు పేర్కొన్నారు. కాని దీనిని ప్రత్యేక భాషగానే ఆధునికులు గుర్తిస్తున్నారు. జనసంఖ్య : సుమారు 2 వేలమంది

**23. కురుఖ్ :**

కురుఖ్ జాతి వారిని 'ఒరాయన్' లు అని కూడా అంటారు. కాల్డ్వెల్ వీరిని ఒరాయన్లనే పేర్కొన్నాడు. ఒరయాను, ఒరాయను, కురుంహ్ అనేవి ఈ భాషకు పర్యాయపదాలు.

కురుఖ్‌లు మొదట ముండా (కొలేరియన్) జాతివారితో కలసి ఉంటారు. వీరి ప్రాచీన గాథలు వీరు మొదట కర్నాటక ప్రాంతంలో ఉండేవారనీ అక్కడ నుంచి నర్మదా తీరానికి వెళ్ళి బీహర్‌లో సోనేనది ప్రాంతంలో స్థిరపడ్డారనీ చెప్తాయి. వీరిలో కొందరు గంగానదిని అనుసరించి వెళ్ళి రాజమహల్ కొండల్లో స్థిరపడ్డారు. సాహిత్య రహత భాషలలో సంఖ్యా బలాన్ని బట్టి చూస్తే గోండీ తర్వాత పేర్కోదగ్గ అతి ముఖ్యమయిన భాష కురుఖ్. ఉత్తర ద్రావిడ భాషలలో ప్రధానమయిన భాష.

**వ్యవహారప్రాంతం :**

బీహారు రాష్ట్రంలో భాగల్పూరు, ఛోటా నాగపూర్‌లో ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది రాంచీ జిల్లాలో ఉన్నారు. పలమవ్, గంగాపూర్, జష్పూర్ జిల్లాలలో కూడా వీరు అధిక సంఖ్యలో ఉన్నారు. అస్సాం తేయాకు తోటలలో ఎంతో మంది కూలీలుగా

పనిచేస్తున్నారు. ఒరిస్సా రాష్ట్రంలో సుందరగడ్, సంబల్పూరు జిల్లాల్లోనూ, మధ్యప్రదేశ్‌లో రాయగడ్, సర్గూజా జిల్లాల్లోనూ ఈ భాషా వ్యవహర్తలున్నారు.

జనసంఖ్య : సుమారు 25 లక్షలు.

## 24. మాల్తో :

మాలెర్ మల (త. మలై'కొండ') అనే పదానికి సంబంధించినది. మాలెర్ లంటే కొండలలో నివసించేవారని అర్థం. మాలెర్ లు మాట్లాడే భాష మాల్తో.

కురుఖ్ ల పరంపరా కథనం ప్రకారం కురుఖ్‌లూ, మాల్తోలూ ఒకేజాతి వారనీ, వారు మొదట్లో సోనేనది ఒడ్డున ఉండేవారనీ, వారిలో కొందరు గంగానదిని అనుసరించి వచ్చి రాజమహల్ కొండలలో స్థిరపడ్డారనీ వీరినే మాలెర్ లంటారనీ చెప్తారు. కురుఖ్, మాల్తో భాషలురెంటికీ అతి సన్నిహిత సంబంధం ఉంది. మాలెర్లు పూర్వకాలంలో సమప్రదేశాలకు వచ్చి కొల్లగొట్టుకు పోతుండేవారు. 18వ శతాబ్ది చివరి భాగంలో అగస్టస్ క్లీవ్ లాండ్, భాగల్పూరు కలక్టరు రాజమహల్ కొండల ప్రాంతం భూములు వారికి వ్యవసాయం చేసుకోమని చెప్పి కొల్లగొట్టడం మానండని చెప్పాడు. అయినా వారా భూముల్ని సాగుచేయకుండా సంతాలులకిచ్చివేశారు.

## వ్యవహార ప్రాంతం :

బీహారులో సంతాల్ పరిగణాలలో రాజమహల్ కొండలు.

జనసంఖ్య : సుమారు 2 లక్షలు.

## 25. బ్రాహుఈ :

బ్రాహుఈ లది ఒకే జాతి కాదు. వీరిలో 23 శాఖలున్నాయి. వీరిలో నిజమయిన బ్రాహుఈలు అహమద్ జై (కాలత్ ఖాన్ శాఖ), ఇల్తజై, మిర్వారీ, గుర్‌గ్నారీ, సుమలారీ, కలంద్రరీ అనే ఆరు శాఖలకు చెందినవారేనని వారి నమ్మకం. వీరు (అలెప్పో' నుంచి వచ్చారని వారు నమ్ముతారు. కాలత్ ఖాన్ బ్రాహుఈ లందరికీ నాయకుడు. ఇప్పుడు వారంతా ముస్లిం మతస్థులు, సున్నీశాఖకు చెందినవారు. అయినా ఇస్లాంలో లేని ఆచారాలు అనాదికాలం నుంచీ రావటం చేత దెయ్యాల మీద నమ్మకం, రక్త బలి మొదలయినవి ఇప్పటికీ వారిలో ఉన్నాయి. కాబట్టి ఈ మధ్యకాలంలోనే వారు ఇస్లాం మతం స్వీకరించి ఉంటారని భావించవచ్చు.

వీరి ముఖ్యవృత్తి గొర్రెలు, మేకల్ని మేపటం. కొన్నిచోట్ల గుర్రాల్ని, ఆవుల్ని కూడా పెంచుతారు. వీరిలో సరవాన్, ఝలవాన్ అనే రెండు ముఖ్య భాగాలు ఉన్నాయి. సరవాన్‌లు పర్వత ప్రదేశాలలో ఉంటారు. ఝలవాన్‌లు సమప్రదేశంలో ఉంటారు.

బ్రాహుఈ ల గురించి 15వ శతాబ్దం నుంచే చారిత్రకాధారాలున్నాయి. ఆ కాలంలో బ్రాహుఈ ల ముఖ్య పట్టణమయిన కాలత్‌ని మొగలులు జయించారు. కాని అనతి కాలంలోనే బ్రాహుఈ లు మళ్ళీ కాలత్‌ని గెలుచుకున్నారు. మన పురాణాలలో 'బాహ్లక' జాతి ప్రస్తావన ఉంది. బ్రాహుఈ లే బాహ్లికులనీ, కురుఖ్‌లే కరూశ, కరూఖ జాతులనీ, మాల్తోలే మలదులనీ బరో అభిప్రాయం.

**వ్యవహార ప్రాంతం :**

పాకిస్తాన్‌లోని బలూచీస్తాన్ రాష్ట్రంలో ఉన్నారు. బలూచీస్తాన్ ఖనతే ముఖ్య పట్టణమయిన కాలత్ ప్రాంతంలో వీరు అధికసంఖ్యలో ఉన్నారు. అఫ్ఘనిస్తాన్ లో 'షొరావక్' దగ్గర కూడా వీరున్నారు.

జనసంఖ్య : సుమారు 6 లక్షల మంది

## 26. థంగర్ :

1976 లో ఈ భాష వెలుగులోకి వచ్చింది.

**వ్యవహార ప్రాంతం :** నేపాల్‌లో పశులకాపర్లు ఈ భాషను మాట్లాడతారు.

జనసంఖ్య : సుమారు 2 వేల మంది

## 2. 40. ద్రావిడ భాషాకుటుంబం - వర్గీకరణ :

ద్రావిడ భాషాకుటుంబం ప్రపంచంలోని పెద్ద భాషా కుటుంబాలలో ఒకటి. భాషా లక్షణాలను బట్టి ద్రావిడ భాషా కుటుంబాన్ని మూడు ఉపకుటుంబాలుగా వర్గీకరించడం జరిగింది. అవి.

**ద్రావిడ భాషాకుటుంబం**

| 1 | 2 | 3 |
|---|---|---|
| ఉత్తర ద్రావిడ భాషలు | మధ్య ద్రావిడ భాషలు | దక్షిణ ద్రావిడ భాషలు |
| 1. కురుఖ్ | 1. తెలుగు | 1. తమిళం |
| 2. మాల్తో | 2. గోండి | 2. మలయాళం |
| 3. బ్రాహూఈ | 3. కొండ | 3. కన్నడం |
| 4. థంగర్ | 4. కుఇ | 4. తుళు |
| | 5. కువి | 5. కొడగు |
| | 6. పెంగొ | 6. తొద |
| | 7. మండ | 7. కోత |
| | 8. అవుత్ | 8. బదగ |
| | 9. ఆవె/ఇందీ | |
| | 10. కోలామీ | |
| | 11. నాయకీ | |
| | 12. పర్జీ | |
| | 13. గదబ | |
| | 14. ఒల్లారీ | |

ఇటీవల భద్రిరాజు కృష్ణమూర్తి గారు ప్రతిపాదించిన ఉపకుటుంబ విభజన.

**ద్రావిడ భాషాకుటుంబం**

| 1 | 2 | 3 | 4 |
|---|---|---|---|
| ఉత్తర ద్రావిడ భాషలు | మధ్య ద్రావిడ భాషలు | దక్షిణ ద్రావిడ భాషలు - I | దక్షిణ ద్రావిడ భాషలు - II |
| 1. కురుఖ్ | 1. కోలామీ | 1. తమిళం | 1. తెలుగు |
| 2. మాల్తో | 2. నాయకీ | 2. మలయాళం | 2. గోండి |
| 3. బ్రాహూఈ | 3. పర్జీ | 3. కన్నడం | 3. కొండ |
| 4. థంగర్ | 4. గదబ | 4. తుళు | 4. కుఇ |
| | 5. ఒల్లారీ | 5. కొడగు | 5. కువి |
| | | 6. తొద | 6. పెంగో |
| | | 7. కోత | 7. మండ |
| | | 8. బదగ | 8. అవూత్ |
| | | | 9. ఆవె / ఇందీ |

## 2.5 ద్రావిడ భాషలు - లక్షణాలు :

ద్రావిడ భాషలు ప్రత్యేక భాషలనీ, అవి ఒకేమూల భాష నుంచి పుట్టాయనీ, వాటికీ సంస్కృతానికి జన్మసంబంధం లేదనీ కాల్డెల్ 1856 లో నిరూపించాడు. ఆయనే ద్రావిడ భాషలలో ఉన్న ప్రత్యేక లక్షణాలు ఆ భాషల్ని ఇతర భాషల నుంచి వేరుచేస్తున్నాయనీ ఆ లక్షణాలు కొన్నింటిని పేర్కొన్నాడు. ఈ లక్షణాలు ద్రావిడ భాషలన్నింటినీ ఒకే సముదాయంగా (unit) ఉండేటట్లు చేస్తున్నాయి. అవి :

1. ద్రావిడ భాషల స్వభావం
2. వర్ణ నిర్మాణం
3. సంధి నిర్మాణం
4. సమాస నిర్మాణం
5. ధాతువులు
6. లింగం
7. వచనం
8. విభక్తి
9. ఔపవిభక్తికాలు
10. క్రియలు
11. విశేషణాలు
12. సర్వనామాలు
13. సంఖ్యావాచకాలు
14. వాక్య నిర్మాణం
15. పదజాలం

## 1. ద్రావిడ భాషల స్వభావం :

ఇవి సంయోజనాత్మక భాషల (agglutinative languages) కోవకు చెందినవి. ద్రావిడ భాషల్లో అర్థభేదం సూచించడానికి ఒక పదంపై మరో పదం, ఒక ధాతువుపై మరొక ధాతువు చేరడం కనిపిస్తుంది. ఇది ద్రావిడ భాషలకు సహజమయినది.

ధాతువుపై ధాతువు చేరడం
కొను + తెచ్చు = కొనితెచ్చు
పరుగు + ఎత్తు = పరుగెత్తు
అందు + ఇచ్చు = అందిచ్చు
పదంపై పదం చేరడం
సీత + అక్క = సీతక్క
సోమ + అయ్య = సోమయ్య
రామ + అమ్మ = రామమ్మ

సంస్కృత భాషలోలాగా ద్రావిడ భాషల్లో ఉపసర్గలు ఉండవు.

## 2. వర్ణ నిర్మాణం :

హ్రస్వ ఎ,ఒ లు ద్రావిడ భాషలన్నింటిలో ఉన్నాయి. చ , జ లు ఉండగా ( ), ఱ లు ద్రావిడ భాషలు చాలా వాటిలో ప్రత్యేక వర్ణాలు.

మూర్ధన్య వర్ణాలు టడణళలు ద్రావిడ భాషలకు మాత్రమే సొత్తు. సంస్కృతాది భాషల్లోకి ద్రావిడ భాషా ప్రభావం వల్ల వెళ్ళి చేరాయి.

## 3. సంధి నిర్మాణం :

ద్రావిడ భాషల్లో పరరూప సంధి ఉంది. సంస్కృతాది భాషలలో ఉన్న సవర్ణ, గుణ, వృద్ధి, యణాదేశాది సంధులు ద్రావిడ భాషల్లో లేవు. ద్రావిడ భాషల్లో యడాగమ, వడాగమ సంధులున్నాయి.
సంధి రూపాలు :

ఉదా : రాముడు + అతడు = రాముడతడు
సోముడు + ఇతడు = సోముడితడు

## సంధి జరగనప్పటి రూపాలు :

మా + అమ్మ = మాయమ్మ
మీ + ఊరు = మీ ఊరు

## 4. సమాస నిర్మాణం :

ద్రావిడ భాషల్లో సంస్కృత భాషలో లాగా సుదీర్ఘ సమాసాలు లేవు. సాధారణంగా ఈ భాషల్లో రెండు లేదా మూడు పదాలతోనే సమాసాలుంటాయి. ఈ విధానం కూడా ద్రావిడ భాషల ప్రత్యేకతే.

తెలుగు : తల్లిదండ్రులు
అన్నదమ్ములు
తమిళం : వెళ్ళాడై (తెల్లని బట్ట కలది)
ఇరాప్పగల్ (రాత్రి పగలు)
కన్నడం : కెంగణ్ణం (ఎర్రని కన్నులు కలవాడు)
మొగనోడిదం (మొగం చూడటం)

## 5. ధాతునిర్మాణం :

ద్రావిడ భాషల్లో ధాతువులు నామవాచకాలుగానూ, క్రియావాచకాలుగానూ వాడవచ్చు. ఇది సంస్కృతాది భాషల్లో లేదు.

పండు పండింది (పండు నామవాచకంగానూ, క్రియగానూ వాడటం జరిగింది)

వెలుగు వెలిగాడు (నామవాచకం + క్రియ)

బొంకు బొంకింది (నామవాచకం + క్రియ)

ద్రావిడ భాషలలో ధాతువులు ఒకటి లేదా రెండు లేదా మూడు అచ్చులకు మించి ఉండవు.

### ఒకే అచ్చు :

తెలుగు : పో (ప్ + ఓ) వెళ్ళు
తమిళం : విల్ (వ్ + ఇ + ల్) విల్లు
మలయాళం : చెల్ (చ్ + ఎ + ల్) పోవు

### రెండు అచ్చులు :

తెలుగు : పాడు (ప్ + ఆ + డ్ + ఉ) పాడడం
తమిళం : కుఋ (క్ + ఉ + ఋ + ఉ) పొట్టి

### మూడు అచ్చులు :

తెలుగు : పలుకు (ప్ + అ + ల్ + ఉ + క్ + ఉ) పలకడం
తమిళం : పొళుతు (ప్ + ఒ + ళ్ + ఉ + త్ + ఉ) పొద్దు

## 6. లింగం :

ద్రావిడ భాషలలో లింగ భేదం సహజ లింగ భేదానికి దగ్గరగా ఉంటుంది అంటే సంస్కృతంలో 'కళత్రం' (స్త్రీని సూచించినా నపుంసక లింగం) లతా (జడపదార్థాన్ని సూచించినా స్త్రీ లింగం) వృక్షః (జడపదార్థాన్ని సూచించినా పుంలింగం).

ద్రావిడ భాషలలో ఇలా ఉండదు. సహజలింగానికి దగ్గరగా ఉంటుంది. మహత్తులు, అమహత్తులు అని రెండు విధాల విభజన ద్రావిడ భాషలలో ఉంది.

| | | | | |
|---|---|---|---|---|
| అల్లుడు | - | పుంలింగం | - | మహద్వాచకం |
| కోడలు | - | స్త్రీలింగం | - | మహతీవాచకం |
| కుర్చీ | - | నపుంసకలింగం | - | అమహద్వాచకం |

## 7. వచనం :

సంస్కృతాది భాషల్లో వచనం ఏక, ద్వి, బహు అని మూడు విధాలుగా ఉంటుంది. ద్రావిడ భాషల్లో ఏక, బహువచనాలు మాత్రమే ఉన్నాయి.

| | | | |
|---|---|---|---|
| సంస్కృతం | : | రామః (రాముడు) ఏకవచనం | |
| | | రామౌ (ఇద్దరు రాముళ్ళు) | ద్వివచనం |
| | | రామాః (రాముళ్ళు) | బహువచనం |
| | | ఏ.వ | బ.వ |
| తెలుగు | : | బల్ల | బల్లలు |
| తమిళం | : | పాణ్ (పాటగాడు) | పాణర్ (పాటగాళ్ళు) |
| మలయాళం | : | అరసన్ (రాజు) | అరసన్మార్ (రాజులు) |
| కన్నడం | : | తాయ్ (తల్లి) | తాయ్‌నిర్ (తల్లులు) |

## 8. విభక్తి :

ద్రావిడ భాషల్లో సంస్కృతాది భాషలలాగా సప్తవిధ విభక్తి ప్రణాళిక లేదు. ద్రావిడ భాషల్లో ఏకవచనంలో ఏకవచన రూపం మీద (చెట్టు + ను), బహువచనంలో బహువచన ప్రత్యయం చేరిన నామంపైన (చెట్ల+ను) విభక్తులు చేరతాయి. ద్రావిడ భాషల్లో విభక్త్యర్థాన్ని సూచించడానికి ప్రత్యేకమయిన ప్రత్యయాలంటూ లేవు. విభక్త్యర్థాన్ని సూచించడానికి ప్రత్యేక పదాలు వాడతారు.

ఉదా : బల్ల పక్క, తలుపు కింద, అద్దం ముందు, మేడ మీద మొ॥నవి.

## 9. ఔపవిభక్తికాలు :

ద్వితియా విభక్తులకు సమాసంలో చేరే ప్రత్యయాలే ద్రావిడ భాషల్లో ఔపవిభక్తికాలవుతాయి. వీటికి ప్రత్యేకమయిన అర్థమంటూ ఏమీలేదు. అయితే వీఇ ఉపయోగం వీటి తర్వాత ద్వితీయాది విభక్తులు వస్తాయని సూచించడం. ఔపవిభక్తికాలు నామవాచకాలకు చేరే విభక్తుల ముందు చేరతాయి.

తెలుగు : -ఇ, -టి, -తి, -అ

ఉదా : కాలికి (ఇ), తాటిని (టి), నూతిలో (తి), చేత (అ)

తమిళం : -అన్, -ఇన్, -అఱ్ఱ్, -త్తు

ఐంతాన్ (ఐదుతో), కణ్ణినాల్ (కంటితో), పలవణ్ణిల్ (చాలావాటిలో), ఉలకత్తుళ్ (లోకంలో)

## 10. క్రియలు :

ద్రావిడ భాషల్లో క్రియాపదమే నామపదంగా వాడటం ఉంది. సంస్కృతాది భాషలలో అలా ఉండదు. అంతేగాక ద్రావిడ భాషల్లో ధాతువుకు వ్యతిరేకార్థక ప్రత్యయాన్ని చేర్చడం వల్ల, మరికొన్ని చోట్ల ప్రత్యయం చేరకుండాను వ్యతిరేకార్థం వస్తుంది. వ్యతిరేకక్రియలు ద్రావిడ భాషల ప్రత్యేకత, విశిష్టత కూడా.

చెయ్య్ + అ + ను = చెయ్యను

వెళ్ళ్ + అ + ను = వెళ్ళను

తెలుగు, తమిళాది భాషల్లో కాదు / లేదు, ఇల్లై లాంటి వ్యతిరేకార్థక సమాపక క్రియారూపాల్ని చేర్చడం వల్ల కూడా వ్యతిరేకార్థం వస్తుంది.

| | | | |
|---|---|---|---|
| తెలుగు : | అది పుస్తకం కాదు | తమిళం : | సాపాటు ఇల్లై (భోజనం లేదు) |
| | రాముడు వెళ్ళలేదు | | వరవిల్లై (రాలేదు) |

ద్రావిడ భాషలలో క్రియాజన్య విశేషణాలు ప్రముఖ పాత్ర వహిస్తాయి. వీటి నిర్మాణం ఇలా ఉంటుంది. ఈ నిర్మాణం సంస్కృతాది భాషల్లో లేదు.

ధాతువు + కాలప్రత్యయం / వ్యతిరేక ప్రత్యయం + విశేషణ ప్రత్యయం (అ/ఇ)

భూతకాలికం - చేసిన

అభూతకాలికం - చేసెడి, చేసే

వ్యతిరేకం - చేయని

ద్రావిడ భాషలలో అసమాపకక్రియల ప్రయోగం సర్వసాధారణం. అసమాపక క్రియలలో ధాతువు తరువాత కాల ప్రత్యయం (భూతం, అభూతం) గాని, వ్యతిరేక ప్రత్యయం గాని ఉంటుంది.

చేసి, చేయుచున్ / చేస్తూ, చేయక

ఒక వాక్యంలో ఎన్ని అసమాపకక్రియలయినా ఉండవచ్చు. ఆర్యభాషలయిన సంస్కృతాది భాషల్లో అసమాపకక్రియల ప్రాచుర్యం ద్రావిడ భాషా సాహచర్య ఫలితమని భాషావేత్తల అభిప్రాయం.

## 11. విశేషణాలు :

ద్రావిడ భాషల్లోని విశేషణాలకు లింగవచన భేదం లేదు.

కొత్త కుర్చీ / కొత్త కుర్చీలు

పాత బల్ల / పాత బల్లలు

వీటికి స్వతంత్ర ప్రతిపత్తి లేక వీటి తర్వాత నామపదాన్ని ఆపేక్షిస్తూ ఉంటాయి.

తమిళం : ఉదా : నల్ల పైయన్ / పెణ్ / మరం

తెలుగు : మంచి అబ్బాయి / పిల్ల / చెట్టు

సంస్కృతాది భాషలలో విశేషణాలు వాటికి సంబంధించిన నామపదాల లింగవచనాలలో ఉండి వాక్యంలో స్వతంత్రంగా ఉంటాయి.

ఉదా : సుందరః పురుషః (సుందర పురుషుడు)
సుందర నారీ (సుందర స్త్రీ)
సుందరం వనం (సుందర వనం)

## 12. సర్వనామాలు :

ద్రావిడ భాషల్లోని ఉత్తమ, మధ్యమ, పురుష సర్వనామాల్లో ఏకవచనం, బహువచనం అనే భేదం లేదు. రెండు రూపాలు కన్పిస్తాయి కాని లింగభేదం కన్పించదు. ప్రథమ పురుష సర్వనామాల్లో లింగభేదం కూడా కనిపిస్తుంది.

| తెలుగు | | తమిళం | |
|---|---|---|---|
| ఏ.వ. | బ.వ. | ఏ.వ. | బ.వ. |
| ఏను, నేను | ఏము, మేము | యాన్, నాన్ | యామ్, యాంకళ్, నాంకళ్ |
| నీవు | మీరు | నీ | |
| వాడు | వారఉ | అవన్ | అవర్ |
| ఆమె | | అవళ్ | |
| అది | అవి | అదు | అవై |

## 13. సంఖ్యా వాచకాలు :

ఒకటి నుంచి పదివరకు, నూరు, వెయ్యి వరకు సంఖ్యావాచకాలు ద్రావిడ భాషల్లో ఉన్నాయి. మిగిలినవి సంస్కృతం నుంచి ఎరవు తెచ్చుకోవడం జరిగింది.

## 14. వాక్యనిర్మాణం :

సంస్కృతాది యూరోపియన్ భాషలలో ప్రచురంగా ఉన్న కర్మణి ప్రయోగం సంబంధ సర్వనామాలు ద్రావిడ భాషలలో లేవు. సాహిత్యం ఉన్న నాలుగు ద్రావిడ భాషలలోనూ 'పడు' (మల. పెడు) ధాతువు కర్మణి ప్రయోగానుబంధంగా వాడుతున్నారు.

ఉదా : తమిళం : చొల్లప్పటు కిఱతు
మలయాళం : పరయప్పెటున్ను
ప్రాచీన కన్నడ : పేళల్ పడువుదు (ఆధునిక కన్నడంలో ఈ ప్రయోగం లేదు)
తెలుగు : చెప్పబడుతోంది

కర్మణి వాక్యాలు మిగిలిన ద్రావిడ భాషలలో లేకపోవడంచేత ఇది సంస్కృత భాషా ప్రభావం వల్ల తెలుగులోకి వచ్చిచేరిందని భావించవచ్చు.

## 15. పదజాలం :

ప్రతి భాషలోనూ శరీరావయవ వాచకాలు, బంధుత్వ బోధకాలు మొ॥నవి ఉండటం సర్వసాధారణం. ద్రావిడ భాషల్లో కుటుంబ వ్యవస్థ పటిష్ఠంగా ఉండటం వల్ల బంధుత్వ బోధక పదజాలం మిగిలిన భాషల కంటే ఎక్కువగా ఉండటాన్ని గమనించవచ్చు.

అన్న, తమ్ముడు, అక్క, చెల్లెలు అనే విభాగం ద్రావిడ భాషలలోనే కనిపిస్తుంది.

**సమీక్ష :**

ద్రావిడ పదవ్యుత్పత్తి, ద్రావిడ భాషలలో జరిగిన పరిశోధన, ద్రావిడ భాషల పరిగణన, జనసంఖ్య, వాటి వ్యాప్తి, ద్రావిడ భాషల ఉపకుటుంబ విభజన, ద్రావిడ భాషల లక్షణాలు మొదలయిన విషయాలను ఈ పాఠంలో తెలుసుకున్నారు.

**ప్రశ్నలు :**

1. ద్రావిడ భాషలు, వాటి వ్యాప్తిని వివరించండి.
2. ద్రావిడ భాషా ఉపకుటుంబ విభజనను విపులంగా రాయండి.
3. ద్రావిడ భాషల ప్రత్యేక లక్షణాలను వివరించండి.

**ఆధార గ్రంథాలు :**


1. సుబ్రహ్మణ్యం, పి.ఎస్., - ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు
   ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, కళాభవన్, సైఫాబాదు, హైదరాబాదు - 4, 1984.
2. ............................................................ ద్రావిడ భాషలు. సత్యవతీ పబ్లికేషన్సు, నెం. 4, చంద్రారెడ్డి రోడ్, అన్నామలైనగర్ - 608101, 1977.


**- ఆచార్య పి. సుబ్బారావు**

**పాఠం - 3**

# ద్రావిడ భాషా శాస్త్రం

వర్ణ నిర్మాణం - మూల ద్రావిడ వర్ణాల పునర్నిర్మాణం -పద్ధతులు - పరిమితులు - మూల ద్రావిడ అచ్చులు, హల్లులు - ద్రావిడ భాషలలో పొందిన మార్పులు - ప్రత్యేకించి క,చ,వ,తి - దక్షిణ ద్రావిడ భాషలలో ఇ/ఎ, ఉ/ఒ ల మార్పు

## పాఠ్యాంశ నిర్మాణ క్రమం :

**3.1.0** వర్ణ నిర్మాణం

**3.2.0** మూలభాషా పునర్నిర్మాణ పద్ధతులు

**3.3.0** మూలభాషా పునర్నిర్మాణం - పరిమితులు

**3.4.0** మూల ద్రావిడ అచ్చులు - ఇతర భాషలలో పొందిన మార్పులు

**3.5.0** మూల ద్రావిడ హల్లులు - ఇతర భాషలలో పొందిన మార్పులు

**3.6.0** మూలద్రావిడ క,చ,వ,తి

**3.7.0** దక్షిణ ద్రావిడ భాషలలో ఇ/ఎ, ఉ/ఒ ల మార్పు

## లక్ష్యం :

మూల భాషా పునర్నిర్మాణ పద్ధతులు, పరిమితులను తెలిపి పునర్నిర్మాణం ద్వారా మూలభాషలోని వర్ణాలను పునర్నిర్మించి అవి ఇతర ద్రావిడ భాషలలో ఎలా మార్పు చెందాయో తెలుపుతూ, దక్షిణ ద్రావిడ భాషలలో వచ్చిన ఇ/ఎ, ఉ/ఒ ల ధ్వని మార్పును గురించి తెలుసుకోవడం.

## 3.1.0 వర్ణ నిర్మాణం :

మానవులు మాట్లాడే భాష ధ్వనులమయం. అయితే ఈ ధ్వనులలో కూడా కొన్ని ముఖ్యమయినవి, మరి కొన్ని అముఖ్యమయినవి ఉంటాయి. ముఖ్యమయిన వాటినే వర్ణాలంటారు. మిగిలిన వాటిని ధ్వనులంటారు. దీనిని బట్టి వర్ణాలన్నీ ధ్వనులేకాని ధ్వనులన్నీ వర్ణాలు కావలసిన పని లేదు. వర్ణాలు వాటి నిర్మాణం గురించి వివరించి విపులంగా చెప్పే శాస్త్రాన్ని వర్ణవిజ్ఞాన శాస్త్రం (Phonology) అంటారు.

## 3.2.0 మూలభాషా పునర్నిర్మాణ పద్ధతులు :

రెండు లేదా అంతకంటె ఎక్కువ భాషలలో పదాలు, ప్రత్యయాలు నిర్మాణంలో సాదృశ్యముంటే ఆ భాషలకు జన్మసంబంధం ఉందని అంటే ఆ భాషలు ఇప్పటికి ఆధారాలు మిగిలిన ఒక మూలభాష నుంచి పుట్టాయని నిర్ణయిస్తారు.

## 3.2.1 తులన పద్ధతి :

కొన్ని భాషలు ఒక కుటుంబానికి చెందినవని నిర్ణయించాక, ఆ భాషల పరస్పర సంబంధం, ఒక్కో భాషలో వర్ణాలు, ప్రత్యయాలు మొదలయిన వాటిలో ఏర్పడ్డ మార్పులు తెలుసుకోవలసిన అవసరం ఉంది. ఇలా తెలుసుకోవడాన్ని తులనాత్మక పద్ధతి అంటారు.

సజాతి శబ్దాలను ఏరికూర్చడం తులనాత్మక పద్ధతిలో మొదటి మెట్టు.

ఉదా :

| | | | |
|---|---|---|---|
| తమిళం | మలయాళం | కన్నడం | తెలుగు |
| కణ్ | కణ్ | కణ్, కణ్ణు | కన్ను |
| మరం | మరం | మర | మ్రాను |

పయిన పేర్కొన్నట్లు కొన్ని సజాతి శబ్దాలు సేకరించి వాటి ఆధారంతో ధ్వని సూత్రాలను ఏర్పరుస్తారు. ధ్వని సూత్రాల ఆధారంగా ణ > న ఏవిధంగా మారిందీ, మర > మ్రా గా ఎలా మారింది చెప్పవచ్చు. అంతేగాక ఈ పద్ధతి ద్వారా ఏది మూలరూపమో ఏది మార్పుకు లోనయిందీ - అనే విషయాన్ని కూడా చెప్పవచ్చు.

పయి ఉదాహరణలలో తమిళ, మలయాళ, కన్నడాలలో 'ణ్', తెలుగులో 'న్' గా మారింది. దీనినే మూలద్రావిడంలోని *ణ్ తెలుగులో 'న్' గా మారుతుంది అని సూత్రీకరించవచ్చు. అలాగే రెండో ఉదాహరణలో తమిళ, మలయాళ, కన్నడాలలోని మర 'మ్రా' గా మారిందని చెప్పవచ్చు. ధ్వని సూత్రాల ద్వారా మూల భాషను పునర్నిర్మించవచ్చు.

## 3.3.0 మూల భాషా పునర్నిర్మాణం - పరిమితులు :

పునర్నిర్మాణ పద్ధతి భాషా చరిత్ర అవగాహనకు ముఖ్యపద్ధతే అయినా దీనికి కూడా కొంత పరిధి ఉంది.

1. మూల భాషా వర్ణాలు కొంతవరకు పునర్నిర్మించవచ్చు గాని వాటికి గల సవర్ణ భేదాలు లేక వాటి అసలు ఉచ్చారణ స్వరూపం మొదలయిన విషయాలు మనకు తెలియవు. పూర్తి పదం పునర్నిర్మించడం కూడా అన్ని చోట్లా సాధ్యం కాదు.
2. వాక్యనిర్మాణం సులభంగా పరభాషా ప్రభావానికి లోనవుతుంది కాబట్టి దీన్ని మూలభాషలో సమగ్రంగా పునర్నిర్మించడం సాధ్యం కాదు.
3. ఒక పదానికి గాని, ప్రత్యయానికి గాని రూపభేదాలు ఉన్నప్పుడే దాని పూర్వ రూపం నిర్ణయించడానికి ఉపకరిస్తుంది తప్ప సంధి పరివర్తన లేనిచోట్ల ఈ పద్ధతి ఉపయోగపడదు.

అయినా భాష ప్రాచీన స్వరూపాన్ని ఊహించడానికి, తిరిగి నిర్మించడానికి ఇంతకంటే ముఖ్యమయిన పద్ధతి ప్రస్తుతానికి మరొకటి లేదని చెప్పవచ్చు.

## ద్రావిడ భాషలు :

ఇప్పటివరకు పరిశోధనలో 1. తమిళం, 2. కన్నడం, 3. మలయాళం, 4. తుళు, 5. కొడగు, 6. తొద, 7. కోత, 8. బదగ (దక్షిణ ద్రావిడ భాషలు), 9. తెలుగు, 10. గోండి, 11. కొండ, 12. కుఇ, 13. కువి, 14. పెంగొ, 15. మండ, 16. అవుత్, 17. ఆవె, 18. కోలామీ, 19. నాయకీ, 20. పర్జీ, 21. గదబ, 22. బల్లారీ (మధ్య ద్రావిడ భాషలు), 23. కురుఖ్, 24. మాల్తో, 25. బ్రాహూఈ, 26. థంగర్ (ఉత్తర ద్రావిడ భాషలు), మొత్తం 26 భాషలున్నట్లు తేలింది.

భాషా పరిశోధకులు తులనాత్మక పద్ధతి ద్వారా మూలద్రావిడ భాషను పునర్నిర్మించారు. వారి పరిశోధన ప్రకారం మూల ద్రావిడ భాషలో 10 అచ్చులు, 16 హల్లులు కలిపి మొత్తం 26 వర్ణాలున్నట్లు తేల్చి చెప్పారు. అవి :

**అచ్చులు :**

| | అగ్రం | కేంద్రం | పశ్చిమం |
|---|---|---|---|
| ఉన్నతం | ఇ ఈ | | ఉ ఊ |
| మధ్యమం | ఎ ఏ | | ఒ ఓ |
| నిమ్నం | | అ ఆ | |

**హల్లులు :**

| | కంఠ్యం | తాలవ్యం | మూర్ధన్యం | దంతమూలీయం | దంత్యం | ఓష్ఠ్యం |
|---|---|---|---|---|---|---|
| స్పర్శం | క | చ | ట | త̱ | త | ప |
| అనునాసికం | | ఞ | ణ | (న̱) | న | మ |
| అంతస్థం | | య | | | | వ |
| కంపితం | | | | ర | | |
| పార్శ్వికం | | | ళ | ల | | |
| ఈషత్స్పృష్ట పార్శ్వికం | | | ഴ | | | |

మూల ద్రావిడ భాషలో మూర్ధన్య వర్ణాలయిన ట, ణ, ళ, ഴ లూ దంతమూలీయ వర్ణాలయిన త̱ ర ల (దంతమూలీయ నకారం కూడా ప్రత్యేక వర్ణమని పి.ఎస్. సుబ్రహ్మణ్యం గారు చెప్పారు. ఇది ఇంకా అందరి ఆమోదం పొందవలసి ఉంది) లూ, పదాదిన ఉండవు. తెలుగు - కువి ఉపకుటుంబంలో మాత్రం ఇవి వర్ణవ్యత్యయం వల్ల కొన్ని పదాలలో పదాదికి వచ్చాయి. పయిన ఇచ్చిన హల్లులలో ర,ഴ లు తప్ప మిగిలినవన్నీ ద్విరుక్తంగా కూడా ఉంటాయి. మూల భాషలో కంఠ్యానునాసికం కకారం ముందే ఉంటుంది కాబట్టి దానిని ప్రత్యేక వర్ణంగా పరిగణించరు.

మూలద్రావిడంలో నాద స్పర్శాలు 'గజడదబ' లు ప్రత్యేక వర్ణాలు కావు. తమిళ, మలయాళాలు తప్ప మిగిలిన భాషలలో ప్రాచీనమయిన శ్వాస స్పర్శాలు 'కచటతప' లు కొన్ని పదాలలో నాదస్పర్శాలుగా తర్వాత కాలంలో మారాయి. మూలద్రావిడ భాషలో ద్విరుక్త స్పర్శాలూ, అనునాసిక సహిత స్పర్శాలూ కొన్ని భాషలలో ప్రత్యేకమయిన మార్పులు పొందాయి.

## 3.4.0 మూలద్రావిడ అచ్చులు - ఇతర ద్రావిడ భాషలలో పొందిన మార్పులు :

### 1. *అ :

మూలద్రావిడ అకారం తొద, పర్జీలలో తప్ప మిగలిన అన్ని భాషలలోనూ అకారంగానే ఉంటుంది.

త. అరై, మ. అర, తొ. కోత. అర్, క.తు. అరె, తె. అర (సగం)

తొదలో *అకారానికి అ,ఒ అనే రెండు ప్రతిరూపాలు (reflexes) ఉన్నాయి. అకారం *ర, *ల, *ഴ, -అయ్, అకారానికి ముందుండే మూర్ధన్యాక్షరం ముందూ అకారంగానే ఉంటుంది.

తొ. నర్య్ (నక్క), త.మ. నరి

తొ పల్ (వల), త.వలై, మ. వల

తొ. అత్య్ (ఎరుగు), త.మ.క. అఱి
తొ. అళ్ (కొలుచు) త.మ. అళ

మొదటి అక్షరంలో మిగిలిన పరిసరాలలోనూ, రెండో అక్షరంలో అన్ని చోట్లా జ అకారం 'ఒ' గా మారుతుంది.
తొ. ఒజ్ (భయపడు), త.మ. అంచు
తొ. కొఙ్ (గేదె దూడ) త. కన్రు

పర్జీలో *అ ప్రాచీన దంతమూలీయ వర్ణాలు *ఱ, *న, *ర, *ల ముందు ఎకారంగా మారుతుంది. మిగిలిన వర్ణాల ముందు అకారంగానే ఉంటుంది.

ప. వెద్ప్ (వేయించు), త.మ. వఱు
ప.మెన్ (ఉండు), తె.మను, గోం. గ. మన్
ప.కెల్ (రాయి), త.మ.క. కల్
ప.వెర్ (వచ్చు), త.మ.వరు, క.బరు

* అకారం ముందు, *య, *చ లు ఉంటే దంతమూలీయ వర్ణం పరంగా ఉన్నా అది 'ఎ' గా మారదు.
ప.చర్ (మెడ), త.అఱు, అఱ్ఱు
ప. చర్ప్ (తోలు క్రియ), గ. సర్ప్ -

**2. *ఆ : మూలద్రావిడ ఆ తొద, పర్జీలలో తప్ప మిగిలిన అన్ని భాషలలోనూ ఆ గానే ఉంటుంది.**

త, మ, కాల్ తొ, కో ల్, కోత, క, కాల్ కొడ, కాలు, తు, కారు, తె. కాలు, కో.కాల్, ప.కేల్, గ. కాల్, గోం పెం. మం అవూత్ ఆమె కాల్, కు ఇ కాడు కులి, కాలు

తొదలో ఆ, ఓ అనే రెండు ప్రతిరూపాలున్నాయి. ప్రాచీనమయిన *'అయ్ ముందు *ఆ ఆగానే ఉండిపోతుంది. మిగిలినచోట్ల ఓగా మారుతుంది.

తొ. కాక్ (కాకి) క.కాక్కె, మ.కాక, క.కాకె కాగె, తె.కాకి, తొ.ఓళ్ (మనిషి) తమక. ఆళ్
పర్జీలో *ఆ ప్రాచీనదంత మూలీయ వర్ణాల ముందు ఏగా మారుతుంది.
ప.ఏద్ - ఏడ్ (చల్లారు), త.మ.క.తె.ఆఱు
ప.వేల్ (ఎగురు, దూకు) గ.వాల్

**3. *ఇ :**

అన్ని భాషలలోనూ 'ఇ'గానే ఉంటుంది. తొదలో మాత్రం ఇ, ఈ అని రెండు ప్రతిరూపాలు ఉన్నాయి.

త.మ.ఇల్, ఇల్లం, తె.తు, ఇల్లు, కో.నా. ఎల్ల, ప.ఇలక్ష, కొం.ఇలు, కుఇ.ఇడు, పెం.మం.ఇల్, త.మ.విల్, తొ పిస్, కోత, విళ్య్, క, బిల్, కొడ, బిల్లు, తు.బిల్లు, బిరు, తె.విలు, విల్లు, కో.ప.వవిల్, గ.విండు, గోం.కొం.పెం.మం.అవూత్, ఆవ్.విల్, కుఇ.విడు, కువి.వెల్లు, బ్రా.బిల్.

**4. *ఈ :**

అన్ని భాషలలోనూ 'ఈ' గానే ఉంది.

త.ఈ, మ.ఈచ్చ, తొ.ఈవ్య్, కోత. ఈవ్. తె.ఈఁగ, కో.నా నీంగ, కు.మా. ఈ. బ్రా.ఈల్.

త.మ.నీర్ , ఈర్ / ఈరం(తడి) తొ.కోత.క.నీర్, కొడ.తు.నీరు, తె. నీరు, నీళ్ళు, కో.నా. ఈర్, ప.గ.నీర్, కొం. నీర్, కుఇ. నీరు, బ్రా. దీర్.

**5. * ఉ :**

అన్ని భాషలలోనూ 'ఉ' గానే ఉంది. తొదలో మాత్రం డ, ఉ, ఇ, వు, వ అనే అయిదు ప్రతిరూపాలు ఉన్నాయి.

తమ ఉళ్, తొ. విళ్డ్-, కోత. బళ్-, క. ఉళ్, బళ్, కొడ. తు. ఉళ్ళ్-, తె. ఉండు, బ్రా. ఉట్.

త.నుంకు, తొ.నుగ్, కోత. నుంగ్-, క.నుంగు, తు.నింగు, కుఇ. నునుఖ్-, మా.నుంగ్-, బ్రా. నుఘుష్-

త.మ. పులి, కో.పుజ్, తొ. పుస్య్, క.పులి, తు.పిలి, తె.పులి, కో.నా.పుల్, గ. బెర్పుల్, గోం. పుల్లీ.

**6. * ఊ :**

అన్ని భాషలలోనూ 'ఊ' గానే ఉంది.

త.మ.నూల్, తొ. నూస్, కోత.క.నూల్, కొడ.తు.నూలు, తె.నూలు, కో.ప.గ. గోం. నూల్, కొం. నూలు, పెం.మం. అవూత్, ఆవె. నూల్, కుఇ. నూడు, కువి. లూలు.

త.పూ, మ.పూ, పూవు, కోత.పూ, తొ.పూఫ్, క.కొడ. తు.పూ, తె.పూ, పూవు, పువ్వు, కో.పుల్, నా.పూత, ప.గ.పూ, గోం. పుంగార్, కొం.పూజ్, పెం.మం.ఆవె.పుయ్, కుఇ, పూజు, కువి. పూయు, కురు. పూప్, మా. పూపు.

**7. * ఎ :**

అన్ని భాషలలోను 'ఎ' గానే ఉంది. తొదలో దీనికి ఎ, ఓ అనే రెండు ప్రతిరూపాలు ఉన్నాయి. గోండీ బెతూల్ మాండలికంలో 'అ' గానూ, పర్జీలో కొన్ని పదాలలో 'అ' గానూ, బ్రాహూఈ కొన్ని పదాలలో 'ఇ', మరికొన్నిటిలో 'అ' గానూ మారింది.

త.మ.చెవి, తొ. కిఫ్య్, కోత. కెయ్వ్, క.కివి, కొం.కెవిఁ, తు.కెబి, తె.చెవి, కో.నా. కెవ్, ప.గ. కెకొల్, గోం.కవీ, కెవ్, కొం.గిబి, పెం.కితుల్, మం.గియ్, కురు. ఖెబ్దా, మా.ఖెత్వు, బ్రా.ఖఫ్.

త.మ.ఎలి, తొ.ఇస్య్, కోత.ఎయ్జ్, క.ఎలి, ఇలి, కొడ.ఎలి, తు.ఎలి, ఇలి, తె. ఎలుక, కో.నా. ఎల్క, ప.ఎల్, గోం. అల్లీ, ఎల్లీ, కొం.ఎల్క, బ్రా. అల్.

**8. * ఏ :**

అన్ని భాషలలోనూ 'ఏ' గానే ఉంది. తొదలో ఏ, ఓ అనే రెండు ప్రతిరూపాలు ఉన్నాయి. పర్జీలో 'ఆ' గా కూడా కనిపిస్తోంది.

త.మ. వేర్, తొ. పోర్, కోత.వేర్, క.బేర్, కొడ. బేరు, తు.బేరు, తె.వేరు, కో.నా.వేర్, ప.వార్, గ.వేర్, కొం వేల, కువి. వే?ల.

త.మ.కోత. మేయ్-, తొ. మీయ్-, క.మేయు, కొడ. మేయ్-, తు.తె.మేయు, కోనా. మీయ్-, ప.గోం. కుఇ. మేయ్, కురు.మెన్, మా.మిన్, బ్రా. బెఇ.

**9. * ఒ :**

తొద, రబాహూఈ లలో తప్ప మిగిలిన భాషలలో 'ఒ' గానే ఉంది. తొదలో వు, వ, ఉ, ఉ అనే నాలుగు ప్రతిరూపాలున్నాయి. బ్రాహూఈ లో ఒ,ఓ,ఉ,అ లలో ఒకటిగా మారుతుంది. బ్రాహూఈలో మూలద్రావిడ జఎ, ఒ లు పోవడానికి కారణం దాని చుట్టూ ఉన్న ఇండో-ఆర్యన్, ఇరానియన్ భాషల ప్రభావమని చెప్పవచ్చు.

తె.బొగ్గు, కో.బొగ్, ప. బొగ్, బొగుం, గ.బొగ్గి, కువి. బొగు, బ్రా. పోఘ్
త.మ.కోత. పొన్, తొ. పిన్, క.పొన్, కొడ. తు. తె. పొన్ను (బంగారం)
త. చొట్టు (చుక్క), బ్రా. చుట్ (చుక్క) చుట్ట్ (కారు)
త. చొర్, చొరి (ప్రవహించు), బ్రా. చుర్ర్ - (ప్రవహించు)
త. ఒన్ఱు, తె. ఒండు, బ్రా. అసిట్ (ఒకటి)
త. కొల్ (చంపు), బ్రా. ఖల్ల్ - (కొట్టు, చంపు)

**10. * ఓ**

తొద తప్ప అన్ని భాషలలోనూ 'ఓ' గానే ఉంది. తొదలో వా, వీ, ఈ అనే ప్రతిరూపాలున్నాయి. -అయ్ ముందు 'వా' గానూ, ప తర్వాత 'ఈ' గానూ, మిగిలినచోట్ల 'వీ' గానూ మారుతుంది.

త. తోంటాన్, క. తోళ, తు. తోళు, తె. తోఁడేలు, బ్రా. తోల (నక్క)
త. చోలై ((పూల) తోట), మ. చోల, తొ. త్వాస్, కోత. తేల్
త.మ.కోత.పోర్, తొ. పీర్, క.పోర్, తె.కుఇ. పోరు

త.మ.కోత.తోల్, తొ. త్వీస్, క.తోలు, తొగల్, తొవల్, కొడ. తోలు, తు. తుగలు, తొలికె, తె. తొక్క, తోట, కో.నా.ప.గ.గోం.కొం.పెం. తోల్, కువి. తోలు.

**3.5.0 హల్లులు :**

మూల ద్రావిడ భాషలో హల్లులు మొత్తం 16. అవి : క చ ఞ లు ణ త త న ప మ య ర ల వ ళ తి

**11. *క :**

ఎ) తమిళ, మలయాళ, తెలుగు, తురుఖ్, మాల్తో, బ్రాహూఈ, థంగర్ భాషలలో తప్ప మిగిలిన భాషలలో 'క' గానే ఉంది. కొన్ని భాషలలో 'గ' గా మారింది.

తమిళ, మలయాళాలలో అగ్రాచ్చులయిన ఇ, ఈ, ఎ, ఏ ల ముందు, వీటి తర్వాత మూర్ధన్య వర్ణం లేకుండా ఉంటే 'క' చకారంగా మారుతుంది. మూర్ధన్యం ఉంటే ఈ మార్పు రాదు. 'క' క గానే ఉంటుంది.

తెలుగులో ఇ, ఈ, ఎ, ఏ ల ముందు 'చ' గా మారుతుంది. వీటి తర్వాత మూర్ధన్యం ఉన్నా కూడా 'చ' గా మారిపోతుంది.
తమ. చిఱు, చిఱ్ఱు, కోత. కిర్, క.కిఱు, తు. కిరి, కిరు, తె.చిఱు, చిఱుత
తమ. కిళి, క.తు.గిళి, గిణి, తె. చిలుక, ప.కిల్

బి) కురుఖ్, మాల్తో, బ్రాహూఈ లలో మూలద్రావిడ * కకారం *ఇ *ఈ *ఉ *ఊ ల ముందు కకారంగానే ఉంటుందిగాని మిగిలిన అచ్చుల ముందు ఈషత్‌స్పృష్టం జ గా మారుతుంది.

తె. గిచ్చు, గోం. కిస్క్-, కుఇ. కిస్-, కురు. కిచ్చ్- (విరుచు), కిస్స్ (గిచ్చు), బ్రా. కిష్క్

త.మ. చేంపు, క.కేసవె, కేసు, కెసవు, తె. చేమ (దుంప), ప. కీబి, గ.హియుబ్, కురు. కిస్‌గొ

క.తె. కుట్టు, కో.నా.ప.కుట్-, కురు. కుడ్-, కుడ్-

త. కాక్కై, మ.కాక్క, క.కాకె, కాగె, తె. కాకి, కురు. ఖాఖా, మా.ఖాగె, బ్రా. ఖాఖో

సి) పదమధ్యంలో చాలా భాషలలో 'గ' కారంగా మారింది. తొదలోనూ, తమిళంలోనూ కంఠ్య శ్వాస ఈషత్ స్పృష్టం (velar voiceless fricative) గా మారుతుంది. పర్జీ మాండలికాల్లో గకి బదులుగా య, వ లు కూడా ఉన్నాయి. గోండి, కువిలలో యగా మారుతుంది. కురుఖ్, మాల్తోలలో దీర్ఘాచ్చు తర్వాత క కారంగానే ఉంటుందిగాని హ్రస్వాచ్చు తర్వాత ఈషత్ స్పృష్టంగా మారుతుంది. బ్రాహూఈ లో ఖ-గా మారుతుంది.

త.పుకై, మ.పుక, కోత. పెగ్, తొ. పఖ్, క.కొడ.పొగె, తు.పుగే, పొగే

తె. పొగ, కో.నా.గ. పొగ్, గోం.పోయా, కొం.పొగొ, కువి. బొఃయి

ప.తోయ్ (తొగరు), గ.తోయ్, గోం. తోయా, కొం.పెం.తోగ, మం.తోగె, కుఇ. తోగ, కువి. తోఃయ

త. ఉకిర్, తె. గోరు, కురు. ఒరొఖ్, మా. ఒర్గు

డి) * -క్క- తమిళ, మలయాళాలలో అలాగే ఉంటుంది. కన్నడం, కొడగు, తుళు, తెలుగు, గోండీలలో ఇది హ్రస్వాచ్చు తర్వాత అలాగే ఉంటుంది గాని దీర్ఘాచ్చు తర్వాత అద్విరుక్తంగా మారుతుంది. బ్రాహూఈలో ఖ గా మారుతుంది. కురుఖ్‌లో దీర్ఘాచ్చు తర్వాత ఖ గానూ హ్రస్వాచ్చు తర్వాత ఖ/క్క లు గానూ మారుతుంది. మాల్తోలో గ గా మారుతుంది. మిగిలిన భాషలలో అద్విరుక్త కకారంగా మారుతుంది.

త.మ.నక్కు, కోత. నక్, తొ.నొక్ -, క.కొడ.తు.నక్కు, తె. నాకు, కో.నా.గ. గోం. కొం. పెం. నాక్-, ప.మం. నేక్-, కుఇ. కువి. నాక్-

త. అక్కా, మ.క.తు. అక్క, గోం. తక్కా

ఇ) * -ంక- (-జ్క-) మలయాళంలో జ్ఞ గా మారుతుంది. కన్నడంలో ప్రథమ హ్రస్వాచ్చుకి తర్వాత వేరే హల్లు ఏమీ లేకుండా అనునాసిక సహిత స్పర్శం ఉంటే అందులో అనునాసికం ఉంటుంది. మిగిలినచోట్ల అది లోపిస్తుంది. గోండీ, కొండ, పెంగోలలో ఇది ఞ గా మారుతుంది. తొదలో ఇందులోని అనునాసికం లోపిస్తుంది. మిగిలిన భాషలలో ంగ అవుతుంది.

త.పొంకు, మ.పొజ్ఞు, కోత.పొగ్-, తొ.పిగ్-, క.పొంగు, కొడ. పొజ్ఞు-, తు.బొగు, తె.పొగు, కో.నా.పొంగ్-, గోం.పొజ్-, కొం. పొజి-, పెం. బొజ్-, కుఇ. కువి. పొంగ్-, మా.పొంగ్-.

## 12. *చ :

1. మూలద్రావిడ పదాది *చకారం దక్షిణ ద్రావిడ భాషలలోనూ, కొన్ని పదాలలోనూ లోపించింది.

త. చిప్పి, ఇప్పి (నత్త గుల్ల)

తె. అందము, చందము; ఇగురు, చిగురు

తెలుగు తప్ప మిగిలిన మధ్య ద్రావిడ భాషలలోనూ, ఉత్తర ద్రావిడ భాషలలోనూ పదాది చకారం లోపించదు కాబట్టి ఈ భాషలు మూలభాషలో పదాది చకారం ఉండేదని నిర్ణయించడానికి ఉపయోగిస్తాయి.

ఇది తొదలో తగానూ, మలయాళం, కోత, కొడగు, తెలుగు, పర్జీ, కురుఖ్, మాల్తో, బ్రాహూఈ లలో స్పృష్టోష్మం (Affricate) గా ఉంటుంది. తెలుగులో తాలవ్యాచ్చుల ముందు తాలవ్యం, మిగిలిన చోట్ల దంతమూలీయం. పెంగో, మండ, కువి లలో 'హ' గా మారుతుంది. కోయలో పూర్తిగా లోపిస్తుంది. మిగిలిన భాషలలో 'స' గా మారుతుంది. తమిళ లిపిలో చకారంగా రాసినా 'స' గా ఉచ్చరిస్తారు.

త.మ. చెల్, కోత. చల్, తొ. సల్-, క.తు.సల్, తె. చెల్లు, చను, సలుపు, కో.సెర్-, నా, చ-, సెర్-, ప.చెన్-, గోం. సోన్, హోన్-, అన్, కొం. సొల్, పెం. మం. హల్-, కుఇ. సల్-, కువి. హల్-, కురు. చల్ర్.

## ఎ) దక్షిణ ద్రావిడ భాషలలోనూ, తెలుగులోనూ పదాది *చ కారం లోపిస్తుంది.

క. తు. అళియ, తె. అల్లుడు, ప.చల్‌ఫేద్, గ.సల్‌ఫేడ్, కో.నా. సాంజిన్, గోం.సడే, కొం.సణిన్, కువి. హౌనె, బ్రా. సాలుం.

కొడ. త.మ.తు.తె.ఉప్పు, తొద. ఉప్, కో.నా.సుప్, ప. చుప్, గ.సుప్, గోం. సావోర్, హోవోర్, ఒవోర్, కొం.సోరు, పెం. హోర్, మం.జార్, కుఇ. సారు, కువి. హారు.

ఉత్తర ద్రావిడ భాషలలో *ఉ, *ఊ, *ఎ, *ఏ ల ముందు ()చ- 'క' గా మారుతుంది.
త.మ. చుటు (కాలు) కురు.మా.కుడ్-
త. చెరకు (దోపు) కురు. ఖెర్ర్-, మా. ఖెర్-
తమ. చేర్, తె. చేరు, కురు. కెర్- (పోవు), బ్రా. కేబ్ (దగ్గర)

## బి) *-చ- :

కోత, తమిళ, మలయాళాలలో -చ-, తొద, కన్నడలలో -స-, తుళు, కొడగులలో -జ-, తెలుగులో -చ-/-స-, కోలామీ, నాయకీలలో -స-, పర్జీ, గదబ లలో -య-, గోండి, కొండలలో -స-, పెంగో, మండ, అవుత్‌లలో -హ-, కుఇలో -స-, -హ-, కువిలో -హ-, కురుఖ్, మాల్తో, బ్రాహూఈ లలో -స- గా మారుతుంది.

త.మ. మాచు (మట్టి), (మచ్చ), కోత. మాచ్, క.మాసు, కొడ. మాజ్- (మాయు), తె. మాయు, మాసి, కుఇ. మాసి, కువి. మాహ్- (మాయు).

## సి) *-చ్చ- :

తమిళ, మలయాళ, కన్నడ, తుళు, తెలుగు, కోలామీ, నాయకీ, పర్జీ, గదబ, గోండీ, కడువి, కురుఖ్, మాల్తోలలో -చ్చ- గానూ, కోత, పెంగో, మాండలిలో -చ-గానూ, కొండ, కుఇలలో -స- గానూ, బ్రాహూఈలో -స-, -ష- గానూ మారుతుంది.

త. ముచ్చు (కప్పు), కోత. ముచ్-, తొ. ముచ్-, క.కొడ. తు. తె. ముచ్చు, నా. ముచ్-, గోం. ముచ్చ్-, ముస్-, కొం.ముస్-, పెం.మం.ముచ్-, కుఇ. ముస్, కువి. ముచ్చ్-, కురు. ముచ్చ్-, మా.ముచ్-, బ్రా. ముస్త్ (మూసిన(ది)).

## డి) *-ంచ- :

త. -ంచ-, మ. -ఞ్ఞ-, -ంచ-, కోత. -ంజ-, తొ. -జ-, క. -జ-. -స-, -ంజ-, కొడ. -ంజ-, -ఞ్ఞ-, తు. -ంజ-, తె.కో.నా. -ంజ-, తొ. -జ-, గోం.కొం.పెం.మం. కుఇ. కువి. కురు. మాల్తోలలో -ంజ- గానూ మారుతుంది.

త.మ. తుంచు (నిద్రపోవు), ప.తుఞ్-, -చుఞ్-, గ.తుఞ్-, గోం. సుంజ్-, హుంజ్-, ఊజ్-, కొం.సుంజ్-, పెం.మం.హుంజ్-, కుఇ. సుంజ్-, కువి. హుంజ్-.

**13. *ట :**

ఎ) మూలద్రావిడ *ట పదాదిన రాదు. దుహితృ భాషలలో కూడా తెలుగు -కువి ఉపకుటుంబంలోనే పద మధ్య *టకారం వర్ణ వ్యత్యయం వల్ల పదాదికి వచ్చి 'డ' గా మారుతుంది.

**బి) *-ట- :**

తమిళ, మలయాళాలలో -ట-, కోతలో -ఢ-, -డ, తొదలో -డ-, -డ-, కన్నడం, కొడగు, తుళు, తెలుగు, కోలామీలలో -డ-, నాయకిలో -డ-, పర్జీలో -డ-, గదబలో -ర-, -ఱ-, గోండీలో -ర-, -ఱ-, కొండ, పెంగొ, మండలలో -డ-, కుఇలో -డ-, కువిలో -ఢ-, కురుఖ్, మాల్తోలలో -ఢ-, బ్రాహూఈ లో -ఢ-, -ర-, -ఱ-గా మారుతుంది.

త.మ.ఉటుంపు, క.ఉడ, ఉడు, కొడ. ఉడుంబు, తు. ఉడు, ఒడు, తె.ఉడుము, కో.ఉడుగ్, నా.హుడుగ్, ప. ఉడు, గోం. ఉరూం., ఉఱూం.

**సి) *-ట్ట- :**

తమిళ, మలయాళాలలో -ట్ట-, కోత, తొదలలో -ట-, కన్నడం, కొడగు, తుళు, తెలుగు, కోలామీ, నాయకీ, పర్జీ, గదబ, గోండీలలో -ట్ట-, కొండ, పెంగొ, మండ, కుఇ, కువి లలో -ట-, కురుఖ్, మాల్తోలలో -ట్ట-, -ట-, బ్రాహూఈ లో -ట-గా మారుతుంది.

త. ఇరట్టై, మ. ఇరట్ట, తొ. ఈట్య్, తె. రెట్టి, రెట్టింపు, ప. ఇరొట్, బ్రా. ఇరట్

త. కట్టు, మ. కెట్టు, కోత. కట్-, తొ. కొట్-, క. కట్టు, కొడ. కెట్ట్-, తు.తె. కట్టు, కో. నా.ప.గ. గోం. కట్ట్-.

**డి) *-ంట- :**

తమిళ, మలయాళాలలో -ంట-, కోత, కన్నడలలో -డ-, -ండ-, తొదలో -డ-, మిగిలిన అన్ని భాషలలో -ండ-గా మారుతుంది.

త. ఇరంటు, మ. రంటు, కోత. ఎయ్డ్, తొ. ఏడ్, క. ఎరడు, కొడ. దండు, తు. రడ్డు, తె. రెండు, నా. ఎర్ండి, ప. ఇర్డు, గోం. రండ్, కొం. రుండి, పెం. రిండజ్, కురు. రీండె, బ్రా. ఇరట్, ఇరా.

**14. *త :**

ఎ) మూల ద్రావిడ పదాది *త కారం అన్ని భాషలలోనూ అలాగే వుంది.

త. తలై, మ. తల, కోత. తల్, క.కొ. తలె, తు. తలె, తె. తల, కో.నా. తల్, ప. తెల్, గ. తల్, గోం. తల్లా, కొం. తల, కుఇ. త్లడ, కువి. త్రాయు, మా. తలి.

**బి) *-త- :**

తమిళ, మలయాళాలలో -త్త-, కోత, తొదలలో -త-, కొడగు, తుళు, తెలుగులలో -త-, మిగిలిన భాషలలో -ద-గా మారుతుంది.

త. ఉతవు (సహాయంచేయు), మ. ఉతకు, కోత. ఒద్గ్-, తొ. వితఖ్-, క. ఒదగు, ఒదవు, తు. ఒదగు, తె. ఒదవు.

**సి) *-త్త- :**

తమిళ, మలయాళాలలో -త్త-, కోత, తొదలలో -త-, కొడగు, తుళు, తెలుగులలో -త్త-, -త-, కోలామీలో -త-, నాయకీ, పర్జీ, గోండీలలో -త్త-, -త-, గదబ, కొండ, పెంగో, మండలలో -త-, కుఇ, కువి, కురుఖ్‌లలో -త్త-, -త-, మాల్తో, బ్రాహూఈ లలో -త- గానూ మారుతుంది.

త. అత్తై, క. అత్తె, అత్తి, తు. అత్తె, తె. అత్త, గ. ఆత, గోం. ఆతీ, కుఇ. అత, కువి. అత్త.

త. తాత్తా, మ. తాతన్, క. తాత, కొడ. తాతె, తు. తాతె, తె. తాత, ప. తాత.

**డి) *-ంత- :**

తమిళంలో -ంత-గానూ, మలయాళంలో -న్న- (దంత్యం), తొదలో -ద-, -త-, మిగిలిన భాషలలో -ంద-, తొదలో *-ఇంత్- గానూ మారుతుంది.

త.మరుంతు, మ. మరున్ను, కోత. తొ. మద్, క. మర్దు, మద్దు, కొడ. మద్దు, తు. మర్దు, తె. మందు, కో.నా. మద్, ప. మెరుద్, గ. మర్దిల్, మరిద్, గోం. మత్, కురు. మందర్, మా. మంద్రు.

## 15. *ప :

ఎ) మూలద్రావిడ పదాది *పకారం నవీన కన్నడం తప్ప మిగిలిన అన్ని భాషలలోనూ పకారంగానే ఉంది. కన్నడంలో 9వ శతాబ్దం చివరివరకూ 'ప' గానే ఉండి ఆ తరువాత 'హ' కారంగా మారింది.

తమ. పెయర్, పేర్, కోత. పేర్, తొ. పోర్, క.పెసర్, హెసరు, కొడ. పెద, తు. పుదరు, తె. పేరు, కో.నా. పేర్, ప.గ. పిదర్, గోం. పారోల్, కొం. దోర్, పెం. తోర్, మం. దర్, కుఇ. పడ, పారు, కువి. దోరు, దారు, కురు. మా. పింజ్-, బ్రా. పిన్.

**బి) *-ప- :**

పద మధ్య -ప- చాలా అరుదు. అది సాధారణంగా -వ- గా మారుతుంది.

**సి) *-ప్ప- :**

తమిళ, మలయాళాలలో -ప్ప- గానూ, కోత, తొదలలో -ప- గానూ, మిగిలిన భాషలలో -ప్ప-, -వ-గానూ మారుతుంది. త.మ.క.తె. తప్పు

త. తిరుప్పు, మ. తిరిప్పు, తొ. తిర్ప్-, క. తిరుపు, తు. తిర్పు, తె. త్రిప్పు, కో.నా. తిప్-.

**డి) -ంప- :**

తమిళ, మలయాళాలలో -ంప- గాన, కోతలో -బ-, -ంబ- గాన, తొదలో -బ- గానూ, కన్నడంలో -వ-, -ంబ-గానూ, తుళులలో -ంబ- గానూ, తెలుగులో -మ-, -మ్మ- గానూ, కోలామీ, నాయకీలలో -మ-, పర్జీ, గదబలలో -ంబ-, -బ- గానూ, గోండి, కొండ, పెంగో, మండలలో -మ- గానూ, కుఇలో -ంబ- గానూ, కువిలో -మ-, -ంబ- గానూ, కురుఖ్, మాల్తో, బ్రాహూఈ లలో -ంబ- గానూ మారుతుంది.

త.మ. కొంపు (కొమ్మ, కొమ్ము), కోత. కొబ్, తొ. కుబ్ (కొమ్ము), క. కొంబు, కొంబె, కొడ. తు. కొంబు, తె. కొమ్ము, కొమ్మ, కో.నా. కొమ్, కొండ. కువి. కొమ, కొము.

త.మ. పాంపు, కోత. పాబ్, క. పావు, కొడ. పాంబు, తె. పాము, కో.నా. పాం, ప.గ.బాం.

## 16. *త (*ఱ) :

ఎ) దంతమూలీయ సర్మం మూలద్రావిడ *త (*ఱ) పదాదిన ఉండదు. ఇది మూలభాషలో స్పర్శం అవడానికి ఈ కింది విషయాలు తోడ్పడతాయి.

1. ప్రాచీన తమిళ, మలయాళ, కన్నడాలలో స్పర్శంతో అంతమయ్యే పదాల చివర ఉచ్చారణార్థకమయిన ఉకారం ఉంటుంది. స్పర్శేతరహల్లు చివర ఈ ఉకారం ఉండదు. ఈ భాషలలో పదాంతంలో ఱ తరువాత ఉచ్చారణార్థకమయిన ఉకారం ఉండడం వల్ల ఇది స్పర్శమని చెప్పవచ్చు.
2. అనునాసికం తర్వాత స్పర్శాలేగాని స్పర్శేతర హల్లులు రావు. ద్రావిడ భాషలలో *న్ఱ ప్రచురం కాబట్టి ఇది కూడా *ఱ మొదట్లో స్పర్శమవడానికి ఒక కారణం.
3. మలయాళంలో ద్విరుక్తమయిన ఱ్ఱని దంతమూలీయ స్పర్శం గానే ఉచ్చరిస్తారు. కోత. తొదలలో కూడా ఇది అద్విరుక్తమూలీయ స్పర్శంగా ఉంది.
4. తొల్కాప్పియంలో 'క చ ట త ప ఱ వల్లినం' అని, ఱ మిగిలిన స్పర్శాలతో తుల్యంగా 'వల్లినం' (స్పర్శం) అని చెప్పడం జరిగింది.

## బి) *-ఱ- :

తమిళ, మలయాళ, తొద, కన్నడ, తెలుగు లలో -ఱ- గానూ, కోత, కొడగులలో -ర-, తుళులో -ద- గానూ, కోలామీ, నాయకీలలో -ద-, -ర- గానూ, పర్జీలో -ద-, -డ- గానూ, గదబలో -య-, గోండీలో -ర-, -ఱ్ర-, -డ- గానూ, కొండలో -ఱ- గానూ పెంగోలో -జ- గానూ, కుఇలో -జ-, -ర-, -హ- గానూ, కువిలో -ర-, -య- గానూ కురుఖ్, మాల్తోలలో -స-, -ర- గానూ, బ్రాహూఈలో -ర-, -ఱ్ర- గానూ మారుతుంది.

త.మ. అఱి, కోత. అయ్ర్-, తొ. అఱ్య్-, క. అఱి, తె. ఎఱుఁగు

త.మ. క.తె. నూఱు, కోత. నూర్, తొ. నూఱ్, కొడ. నూరు, తు. నూదు, గోం. నూర్.

## సి) *-ఱ్ఱ- :

తమిళంలో -ఱ్ఱ-, కోత, తొదలలో -త్-, కన్నడ, కొడగులలో -త్త-, -త-, తుళులో -ట-, తెలుగులో -ట్ట-, -ట-, తెలుగులో -ట్ట-, కోలామీ, నాయకిలలో -త్త-, -త-, కుఇలో -స-, కువిలో -చ్చ-, కురుఖి, మాల్తోలలో -త్త-, -త-, బ్రాహూఈలో -త- గానూ మారుతుంది.

త. పుఱ్ఱు, పుఱ్ఱం, మ. పుఱ్ఱు, క. పుత్తు, పుత్త, కొడ. పుత్తు, తు. పుంచ, తె. పుట్ట, ప. పుత్త/పుట్ట, గోం. పుత్తీ, కొండ. పుఱ్ఱి, పెం. పుచి, కుఇ. పుచ్చి, కురు. పుత్తా, మా. పుతె.

**డి) *-న్ట- :**

తమిళంలో -న్ట-, మాలయాళంలో -న్న-, కోతలో -ద-, -ంద-, తొదలో -ద-, కన్నడంలో -ఱ-, -ంద-, కొడగులో -ంద-, తుళులో -ంజ-, తెలుగులో -ండ-, -ంద-, కోలామీ, నాయకీలలో -ంద-, -ండ-, కుఇ, కువిలో -ంజ-, కురుఖ్, మాల్తోలలో -ంద-, బ్రాహూఈలో -స- గానూ మారుతుంది.

త. మూన్టు, మ. మూన్ను, కోత. మూంద్, తొ. మూద్, క. మూఱు, కొడ. మూందు, తె. మూడు, కో.నా. మూందిజ్, నా. మూంది, ప. మూఁదు(క్), గ. మూండ్, గోం. మూంద్, కొం. ముఁన్టి, కుఇ. మూంజి, కురు. మూంద్, బ్రా. ముసిట్.

తెలుగులో ప్రాఙ్నన్నయ శాసనాలలో న్ట ఉంది. వాన్టు (వాడు).

**17. *ఞ :**

మూలద్రావిడ పదాది ఞకారం ప్రాచీన తమిళం, మలయాళాలలో చాలా పదాలలోనూ, కొడగు, తుళులలో కొన్ని పదాలలో మాత్రమే నిలిచి ఉంది. ఇతర భాషలలోనూ, ఆర్వాచీన తమిళంలోనూ నకారంతో కలసిపోయింది. పదాదిలో చాలా విరళంగానే ఉంది. పద మధ్యంలో ఇది *చ ముందే ఉంటుంది. పదాంతంలో ఉండదు. పదాదిలో అ, ఆ ల ముందే ఉంటుంది. దీని తర్వాత అ, ఆ లు కొన్ని భాషలలో ఎ ఏ లుగా మారతాయి.

త. ఞాన్టు (రోజు), మ. ఞాన్ను, తె. నేఁడు, గోం. నేండ్, కొం. నేన్టు, పెం. నేంజెజ్, మం. నేంజె, కుఇ. కువి. నేంజు.

తమ. ఞాలం, తె.నేల, కో.నా. ఏల్, గోం. నేలీ, కుఇ. కువి. నేల.

**18. *ణ :**

ఇది దక్షిణ ద్రావిడ భాషలలో 'ణ' గానే ఉంటుంది. మధ్యోత్తర భాషలలో న గా మారుతుంది. కాని గదబ, కొండ, పెంగో, కుఇ లలో కొన్నింటిలో 'ణ' గానే ఉంటుంది. తెలుగులో ప్రాఙ్నన్నయ యుగశాసనాలలో 'ఆణతి', 'పణి', 'కొణి' లాంటి పదాలలో ణ కారమే ఉంది. ణ నగా మారడం 7-9 శతాబ్దాల మధ్యకాలంలో జరిగింది. ఇది పదాదిన ఉండదు.

త. అణ్ణవ్, అణ్ణా, మ. అణ్ణన్, కోత. అణ్, తొ. ఒణ్, క. అణ్ణ, కొ. అణ్ణె, తు. అణ్ణె, తె. అన్న.

త.మ. పిణం, కోత. పెణ్మ్, క.పెణ, హెణ, తు. పుణ, తె. పీనుగు.

**19. *న :**

ఎ) మూల ద్రావిడ దంత్య *నకారం కొన్ని భాషలలో కొన్ని పదాలలో కావచిత్కంగా లోపిస్తుంది.

తమ. నీంతు, క. ఈసు, ఈజు, తు. ఈచు, ఈజు, తె. ఈఁదు
తమ. నీర్, తె. ఈరు (మీరు)
త. నట, క. నడ, నడె, తె. నడచు, కో.నా. అడ్గ్-

బి) బ్రాహూఈలో మూలద్రావిడ పదాది నకారం తాలవ్యాచ్చుల ముందు 'ద' గానూ, మిగిలిన అచ్చుల ముందు న గానూ ఉంటుంది.

* న > బ్రా.ద
త. నెయ్త్తోర్, క. నెత్తురు, తె. నెత్తురు, బ్రా. దితర్
త.మ. నేర్ (కోయు), బ్రా. దన్న్ -

త. మ. క. తు. తె. నీర్, బ్రా. దీర్

*న > బ్రా.న

త. నాం (మనం), బ్రా. నన్ (మనం, మేం)

త.మ. నుంకు (మింగు), బ్రా. ను ఘుష్-

తమ. క.తె. నూఱు (క్రియ), బ్రా.నుస్-

## 20. *మ :

అన్ని భాషలలోనూ మకారంగానే ఉంది.

త.మ.కోత. మేయ్-, తొ. మీయ్-, క. మేయు, కొడ. మేయ్-, తు. తె. మేయు, కో.నా. మీయ్-, తు.తె. మేయు కో.నా. మీయ్-, ప.గోం. కుఇ. మేయ్, కురు. మెన్-, మా.మిన్-, బ్రా.బెఇ.

త.మ. మరం, తె. మ్రాను, మ్రాకు, గోం. మరా/మర, పెం.మం. మర్, కుఇ. మ్రు. హ్ను, కువి. మ్రాను.

## 21. *య :

ఎ) మూలద్రావిడ పదాది *యకారం చాలా కొద్దిమాటలలోనే ఉంది. ఇలలాంటివి చాలావరకు ప్రాచీన తమిళంలో మిగిలి ఉన్నాయి. తొల్కాప్పియంలో పదాది యకారం తరువాత 'ఆ' మాత్రమే ఉంటుంది. కాని మూలద్రావిడంలో పదాది యకారం తర్వాత 'అ' కారం కూడా ఉండేదని తెలుస్తోంది. మధ్యకాల తమిళంలోనూ, మిగిలిన దక్షిణ భాషలలోనూ *యా లో యకారం లోపించి ఆ గా మారుతుంది.

త. యాటు, ఆటు (మేక), మ. ఆటు, కోత. ఆఢ్, తొ. ఓడ్, క. ఆటు, కొడ. ఆడు, తు. ఏడు, తె. ఏడిక, గోం. ఏటీ, కురు. ఏఢా, మా. ఏడె, బ్రా. ఏట్.

త. యానై, ఆనై, మ. ఆన, కోత. ఆన్, తొ. ఆన్, క.తు.కొడ. ఆనె, తె. ఏనుఁగు, ఏనిక, కో. ఏనాగీ, ప. ఏను.గ. ఏనిగ్, గోం. ఏనీ, ఏనాల్, కొం. ఏని, ఏన్గు.

బి) పదమధ్య, పదాంత *యకారం కుఇలో జగా మారుతుంది. మిగిలిన అన్ని ద్రావిడ భాషలలోనూ యగానే ఉంటుంది. కొన్ని భాషలలో 'య' హల్లు ముందు లోపిస్తుంది.

తె. కోయు, త.మ. కోత, క.కొ.తు. ప.గోం. కొయ్

తె. నేయి, తమ. క.కొ.తు.కో.ప.నెయ్

త.మ.కోత.నాయ్ (కుక్క), తొ.నోయ్, క.నాయ్, నాయి,కొడ. నాయ్, తు.నాయి, కో.నా. ఆతె, ప.నెత్త, గ.నేతె, నెత్తె, గోం.నయ్.

## 22. *ర :

మూలద్రావిడ *ర పదాదిన ఉండదు. పదమధ్యంలోనూ, పదాంతంలోనూ ఇది 'ర' గానే ఉంటుంది. బ్రాహూఈలో దీనికి ర, ర్ర రెండు రూపాలున్నాయి. తొదలో ర,ష,శ అనే మూడు ప్రతిరూపాలున్నాయి. తొదలో కొన్ని పదాలలో 'ర' లోపించి దీని ముందు ఉన్న అచ్చు, తరువాత అచ్చు కలసి దీర్ఘాచ్చుగా మారతాయి. తెలుగు, కన్నడంలలో హల్లు ముందు ఇది లోపిస్తుంది. తెలుగులో పదాది సంయుక్తాక్షరాలలో కూడా అర్వాచీన భాషలో ఇది లోపిస్తుంది. (క్రొవ్వు > కొవ్వు > త్రాగు > తాగు మొ॥వి).

త.మ. పెరు, పెరియ (పెద్ద), పెరుకు (పెరుగు), కోత. పె - (పెద్ద), తొ. పె-, పెర్-, క.పెర్, కొడ. పెరు(ం)-(పెద్ద), పెరు-(పెరుగు), తు.పెరి, పెరియ (పెద్ద), పెర్చు (పెరుగు), తె.పెద్ద, పెరుగు, కో.నా. పెర్గ్-, ప. బెర్తొ (పెద్ద), గోం. పెర్స (పెద్ద), కొం.పెర్, పెరి, కుఇ. బెరిబెరిఇస్- (వాచు), కురు. పర్ద్ (పెరుగు), బ్రా.పిర్ (వాచు).

## 23. *ల :

మూలద్రావిడ *ల పదాదిన ఉండదు. పదమధ్యంలోనూ, పదాంతంలోనూ తొద, కుఇలలో తప్ప మిగిలిన అన్ని భాషలలోను 'ల' గానే ఉంటుంది. ద్విరుక్త లకారంలో కూడా ఏ భాషలలోనూ మార్పు లేదు. కాని కోత, కొండ, పెంగొ, మండ, మాల్తోలలో ఇది అద్విరుక్తంగా మారుతుంది.

తొదలో *ల లేక *ల్ల సాధారణంగా స (దంతమూలీయం) గా మారుతుంది. కాని భూతప్రాతిపదికలో *ట్ఙ ఉండే లకారాంత క్రియలలో ల(శ్వాసం) గా మారుతుంది. తొదలో లకారం ఉన్న మాటలు ఎరవు మాటలు. కుఇలో 'డ' గా మారుతుంది. కాని ఈ మార్పు వర్ణవ్యత్యయం జరిగినప్పుడు ఉండదు. బ్రాహూఈలో ల, ల (శ్వాసం) అనే రెండు రూపాలున్నాయి.

త.పల్, మ. పల్, పల్లు, తొ. పస్, కోత. పల్, క.పల్, కొ. పల్లు, తు. పరు, తె. పలు, పల్లు, పన్ను, కో.నా. పల్, ప. పెల్, గ.గోం.కొం.పల్, కుఇ. పడు, పలు, కువి. పల్లు, కురు. పల్, మా.పలు.

త.ను. క. కొడ. తు. పల్లి, తె. బల్లి, తొ. పస్య్, కో. ఏపజ్

త.మ. కల్ (కట్ట్-) కోత. కల్- (కత్-) తొ. కల్- (కత్-), క. కల్ (-త్-), తు. కల్పు, తె.కఱచు (నేర్చుకొను)

## 24. *వ :

మూలద్రావిడ పదాది *వకారం తొదలో 'ఫ' గా మారుతుంది. కన్నడ, కొడగు, తుళు, కురుఖ్, మాల్తో, బ్రాహూఈ భాషలలో 'బ' గా మారుతుంది. ఈ మార్పు తెలుగులో కూడా కొన్ని పదాలలో ఉంది. బయలు (త. వయల్) మిగలిన భాషలలో మార్పు లేదు.

త.మ. విల్, తొ. పిస్, కోత. విశ్య్, క.బిల్, బిల్లు, కొడ. బిల్లు, తు. బిల్లు, బిరు, తె. విలు, విల్లు, కో.ప. విల్, గ. విండు, గోం.కొం.పెం.మం. విల్, కుఇ. విడు, విలు, కువి. వెల్లు, బ్రా. బిల్.

త.మ. వేర్, తొ. పోర్, కోత. వేర్, క.బేర్, కొడ. బేరు, తు. బేరు, తె.వేరు, కో.నా. వేర్, ప. వార్, గ. వార్, కొం. వేల, కువి. వే?ల.

త.మ. విరల్, క. బెరల్, తె. వ్రేలు, గోం. వఢంజ్, కొం. ఢస్క, పెం. వచ్క, మం. వెహ్పె, కుఇ. కువి. వంజు, కో.నా. వెందె.

త. వరై, క.బరె, బరి, తె. వ్రాయు, కుఇ. వ్రీస్-.

బి) పదమధ్యంలో దీని ప్రతిరూపాలు తొదలో -ఫ-(f), తుళు, కురుఖ్ లలో -బ-, -వ-, బ్రాహూఈలో -ఫ-(f), -వ-, మిగిలిన భాషలలో -వ-గా మారుతుంది.

త.మ. చెవి, తొ. కిఫయ్, కోత. కెయ్వ్, క. కివి, కొడ. కెవిః, తు. కెబి, తె. చెవి, కో.నా.కెవ్, ప.గ. కెకొల్, గోం. కవీ, కెవ్, కొం.గిబి, పెం. కితుల్, మం. గియ్, కురు. ఖెబ్దా, మా. ఖెత్వు, బ్రా. ఖఫ్.

## 25. *ళ :

ఎ) మూలద్రావిడ *ళ పదాదిన రాదు. పదమధ్యంలోనూ, పదాంతంలోనూ వస్తుంది. ఇది దక్షిణ ద్రావిడ భాషలలో ళ గానే ఉంటుంది. తొదలో ళ (శ్వాసం) గా ఉంటుంది. తొదలో ళ ఉన్న రూపాలు ఎరవు పదాలు. తుళు కొన్ని మాండలికాల్లో 'ల' గా

మారుతుంది. గోండి, కొండ, పెంగొ, మండ, కువిలలో ఇది ఢ గా మారుతుంది. కుఇలో -ల-, -ఉ-, బ్రాహూఈలో -ల-, -ల-, మిగిలిన భాషలలో -ల- గానూ మారుతుంది.

త.మ. ఉళ్, తొ. విళ్ద్-, కోత. ఒళ్-, క. ఉళ్, ఒళ్, కొడ. తు. ఉళ్ళ్-, తె. ఉండు, బ్రా. ఉట్.

త.మ. తేళ్, క. తేట్, తేళు, కొడ. తేళు, తు. తేళు, తే. తేలు, మా. తేలె, బ్రా. తేల్.

తెలుగులో ప్రాఙ్నన్నయ శాసనాలలో ళ కారం ఉంది. (సంవత్సరంబుళ్, ళోన).

## బి) *-ళ్ళ- :

దక్షిణ ద్రావిడ భాషలలో -ళ-, తొదలో -ళ- (శ్వాసం), కొండ, పెంగొ, మండ, మాల్తోలలో -ల-, మిగిలిన భాషలలో -ల్ల- గా మారింది.

త. పిళ్ళై, మ. పిళ్ళ, కోత. పయ్ళ్, క.పిళ్ళె, పిళ్ళ, కొడ. పళ్ళె, తు. పిళ్ళై, తె.కో.నా. పిల్ల, కురు. పెల్లో, మా. పెలి, బ్రా.పిల్లో త.

త.మ. ఉళ్ళి, కో. ఉళ్య్, తొ. ఊళ్య్, క. ఉళ్ళి, తు. ఉళ్ళి, ఉల్లి, తె. కో.ప. ఉల్లి, గోం. ఉల్లీ.

## 26. *ఴ :

మూలద్రావిడ *ఴ (మూర్ధన్య ఈషత్ స్పృష్ట పార్శ్వికం) పదాదిన ఉండదు. అద్విరుక్తంగా ఉంటుంది. ప్రాచీన తమిళం, ప్రాచీన మలయాళం, ప్రాచీన కన్నడం, తెలుగులలో ప్రత్యేక వర్ణంగా ఉంది. (ప్రాఙ్నన్నయ శాసనాలలో ప్రచురమయిన వర్ణం) ఇప్పటి తమిళంలో తంజావూరు, ఆర్కాటు మాండలికాల్లో తప్ప మిగిలిన చోట్ల 'ళ' గా మారింది.

తమిళ, మలయాళాలలో ఴ, కోతలో ళ, ఢ, గ, య, తొదలో డ, ఢ, శ, ష, వ, ప్రాచీన కన్నడంలో ఴ, మధ్యకాలంలో -ళ-, హల్లు ముందు -ర, కొడగులో -ళ-, తుళులో -ర-, -ళ-, తెలుగులో -డ- (అచ్చుల మధ్య), వర్ణ వ్యత్యయం వల్ల పదాదికి వచ్చినప్పుడు దీని ముందు హల్లు ఉంటే -ర-, హల్లు లేకపోతే డ-, తరువాత కాలంలో -ద- గానూ మారింది. కోలామీ, నాయకిలలో -ర-, పర్జీలో -ఢ-, గదబలో -ఢ-, డ, గోండీ, కొండ, పెంగో, మండ, కుఇ, కువి లలో -ఢ-, కురుఖ్, మాల్తోలలో -ఢ-, బ్రాహూఈలో -ర-, -ఱ-, -ఢ-, లోపంగానూ మారుతుంది.

త.మ. పొఴుతు, పోత్తు, క. పొత్తు, తె. ప్రొద్దు, గోం. పోఢ్ద్

త.మ. కొఴుంతు (చిగురు), కుఇ. కోడు, కురు. ఖోర్- (చిగుర్చు), ఖోర్ (చిగురు), మా.

ఖొరొచ్ (చిగుర్చు), ఖొరొ (చిగురు), బ్రా. ఖఱ్- (చిగుర్చు), ఖఱున (పచ్చ).

త. ఉళై, మ. ఉఴి -మాన్, క. దుప్పి (<తె), తు. ఉరె, తె. దుప్పి, కో. డుప్పి, ప. ఉఢువ్, గ. ఢుప్పి, గోం. డుప్పల్, కొం. ఢుపి.

త.మ. ఏఴు, తొ. ఒవ్, కోత. ఏయ్ / ఏగ్, క. ఏఴు, ఏళు, కొడ. తు. ఏళు, తె. ఏడు, గోం. ఏఢూంగ్, కుఇ. ఒడ్గి.

త.మ. పుఴు, కోత. పూ, తొ. పుఫ్, క. పుఴు, పుఴి, కొ. పుళు, తు. పురి.పుర, తె. పురుగు, ప్రుచ్చు, కో.నా. పుర్రె, ప. పుడుత్, గ. పుడుత్, గోం. పుడీ, కొం. పిఢ్వు, పిఢి, పెం. ప్డీ, కుఇ. ప్డీఉ, ప్డివు, పిడు కువి. ప్డియులి, కురు. పొచ్గో, మా. పొఱు, బ్రా.పూ.

ప్రాఙ్నన్నయ యుగ శాసనాలలో పుఴొలూర్ (ఊరిపేరు), పుఴోల (పట్టణంలో), ప్ఴొలనాండు (ఒక ప్రాంతం పేరు), ఴిచ్చు (ధ్వంసం చేయు), ఴుల్ల (లొల్ల అనే ఊరు), ఴెన్దుఴూర (దెందులూరు అనే గ్రామం) మొదలయిన ఎన్నో పదాలలో ఴ ఴ కారం కనిపిస్తుంది.

## 3.6.0 మూలద్రావిడ *క, *చ, *వ, *అలు :

*క (3.5.0 లో 11 ను చూడండి)

*చ (3.5.0 లో 12 ను చూడండి)

*వ (3.5.0 లో 24 ను చూడండి)

*అ (3.5.0 లో 26 ను చూడండి)

## 3.7.0 దక్షిణ ద్రావిడ భాషలలో ఇ/ఎ, ఉ/ఒ ల మార్పు :

అకారంతో మొదలయ్యే నిష్పాదక ప్రత్యయం ముందు, దక్షిణ ద్రావిడ భాషలలోనూ, మధ్య ద్రావిడ భాష అయిన తెలుగులోనూ ఒక ప్రధానమయిన మార్పు చోటుచేసుకుంది.

ప్రాచీన తమిళ, మలయాళాలలో రెండో అక్షరంలో అకారం ఉన్నప్పుడు ధాతువులో అ,ఇ,ఉ లలో ఏదో ఒకటి ఉంటుంది. సాధారణంగా ఎ,ఒలు ఉండవు. కాని కన్నడం, తెలుగులలో రెండో అక్షరంలో అకారం ఉన్నపుడు ధాతువులో అ,ఎ,ఒ లలో ఏదో కొటే ఉంటుంది. ఇ,ఉ లు ఉండవు. ఈ నియతి మొదటి అచ్చుకీ, రెండో అచ్చుకీ మధ్య ఒక హల్లు మాత్రం ఉంటేనే కనబడుతుంది. ఇటువంటి నియతి వల్ల కొన్ని పదాలలో తమిళ, మలయాళాలలో మూలద్రావిడ *ఎ, *ఒ లు అకారం ముందు ఇ,ఉ లతో కలసిపోయాయనీ, కన్నడం, తెలుగులలో మూలద్రావిడ *ఇ, ()ఉ లు అకారం ముందు *ఎ, *ఒ లతో కలసిపోయాయనీ ఊహించవచ్చు.

కోత, తొద, కొడగులలో కన్నడంలో లాగే అకారం ముందు ఎ, ఒలే ఉంటాయి కాని ఇ,ఉ లు ఉండవు. తుళు కొన్ని మాండలికాల్లో ఇలాంటి మార్పు లేదు. వ్యవహారిక తమిళ, మలయాళాలలో కూడా అకారం ముందు ఎ,ఒ లే ఉండడం, ఇ,ఉ లు లేకపోవడం గమనించవలసిన విషయం.

త. చితర్, చిత్తై, చింతు, మ. చితఱు, క. కెదరు, తె. చెదరు, చిందు (త. చింతు, తె. చిందు వల్ల ఇందులో *ఇ ప్రాచీనమయినది).

త. ఇరంటు, మ. రండు, క. ఎరడు, తె. రెండు (ఇరు -వది. ఇక్కడ దీని విశేషణ రూపంలో నిష్పాదక ప్రత్యయం ఉకారం ఉంది) ఇందులో ధాతువులో *ఇ ఉంది. కాబట్టి ఈ పద సముదాయంలో *ఇ ప్రాచీనమయినది.

త. చెఱి (జనం ఎక్కువగా ఉండు, చేర్చు), చిఱై (చెఱ), మ. చెఱి, చిఱ, క. కెఱె (చెరువు), తె. చెఱ, చెఱువు, ప. కెద్- (మూయు), గోం. కెహ్- (త. చెఱి, తె.చెఱువు), పర్జీ, గోండీల వల్ల ఇందులో *ఎ కారం ప్రాచీనమయినది).

త. పిణై, పిణవల్, పిణవు (ఆడ జంతువు), పెణ్ (స్త్రీ), మ. పెణ్, పెంటి (పిల్లి), క.పెణ్ (స్త్రీ), తె. పెంటి (త.మ. క.తె.పెణ్, పెంటి వల్ల ఇందులో *ఎ ప్రాచీనమయినది).

త. కుఱు (పొట్టి), కుఱై (తగ్గు, తక్కువ), మ. కుఱు, కుఱయ్-, క. కుఱు, కొఱె, తె. కుఱుచ, కొఱ, కొఱత (త. కుఱు, తె. కుఱుచ వల్ల ఇందులో *ఉ ప్రాచీనం).

త. మున్నై, మ. మున, క. మొనె, తె. మొన (ఇవి మున్, ముందు లకు సంబంధించినవి కాబట్టి వీటిలో *ఉ ప్రాచీనం).

త.మ. ఉటై, ఒటి (విరుగు), క. ఒడె, ఒడి (ఒటి, ఒడి వల్ల ఇందులో *ఒ ప్రాచీనం).

త.మ. పుతర్, పొతుంపు, క. పొదఱు, తె. పొద, పొదరు (త. పొతుంపు వల్ల ఇందులో *ఒ ప్రాచీనం).

భద్రిరాజు కృష్ణమూర్తి గారి ఉద్దేశంలో అకారం ముందు మూలద్రావిడ *ఇ, *ఎ లు *ఎ గానూ, *ఉ, *ఒ లు *ఒ గానూ మూలద్రావిడ భాషా కాలంలో మారాయి. ఆ *ఎ, *ఒ లు ప్రాచీన తమిళ, మలయాళాలలో అకారం ముందు వర్ణభేదనం వల్ల ఇ, ఉ లుగా మారాయని వారి అభిప్రాయం.

ఈ సందర్భంగా కన్నడ భాషలో జరిగిన మార్పును చూడాలి. కన్నడంలో ధాతువులో *ఎ, *ఒలు తరువాత అక్షరంలో ఇ గాని, ఉ గాని ఉంటే అవి క్రమంగా ఇ, ఉ లుగా మారతాయి. అంటే ఉన్నతాచ్చుల ముందు మధ్యాచ్చులు ఉన్నతాచు&ఉచలుగా మారతాయి. కొన్ని చోట్ల ఈ మార్పు ఉన్న రూపం లేని రూపం కూడా ఉంటాయి.

క. ఇదిర్, త.మ. ఎతిర్, తె. ఎదురు

కు. ఇలి, త.మ. ఎలి, తు. ఎలి, తె. ఎలుక

క. కివి, త.మ. చెవి, తె. చెవి, గోం. కెవ్

క. కుడు (ఇచ్చు), త.మ. కొటు

క. పుడి, త.మ. పొటి, తె. పొడి

(ఇలాంటి కన్నడ రూపాల ఆధారంగా మూలభాషలో ధాత్వచ్చు *ఇ, *ఉ అని అపోహపడరాదు).

మొత్తం మీద మూల ద్రావిడ భాషలో ఉన్న *ఇ, *ఉ లు దక్షిణ ద్రావిడ భాషలు, తెలుగులలో *ఎ, *ఒ లుగా మారాయని నిర్ధారించవచ్చు.

**సమీక్ష :**

ఇప్పటి వరకు మూలద్రావిడ వర్ణాల పునర్నిర్మాణం, పద్ధతులు, పరిమితులు, మూలద్రావిడంలోని వర్ణాలు ద్రావిడ భాషలలో ఎలాంటి మార్పులకు లోనయ్యాయి, ప్రత్యేకించి మూలద్రావిడంలోని ఇ, ఉ లు దక్షిణ ద్రావిడ భాషలు, తెలుగులలో ఎ, ఒ లుగా ఎలా మార్పు చెందిందీ - మొదలయిన విషయాలను చర్చించటం జరిగింది.

**ప్రశ్నలు :**

1. వర్ణ పునర్నిర్మాణ పద్ధతులు, పరిమితులను వివరించండి.
2. మూలద్రావిడంలోని వర్ణాలు ద్రావిడ భాషలలో పొందిన మార్పుల్ని సోదాహరణంగా వివరించండి.
3. మూలద్రావిడంలోని *ఇ, *ఉ లు దక్షిణ ద్రావిడ భాషలలోనూ, తెలుగులోనూ ఎలాంటి మార్పుకు గురయ్యాయో సోదాహరణంగా తెలపండి.
4. మూలద్రావిడంలోని *క, *అ వర్ణాలు ద్రావిడ భాషలలో ఎలాంటి మార్పులు చెందాయో రాయండి.

**సంప్రదించవలసిన గ్రంథాలు :**


1. కృష్ణమూర్తి, భద్రిరాజు - తెలుగు వెర్బల్ బేసెస్, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాప్రెస్, బరి&కలి, లాస్ ఏంజిల్స్, యు.ఎస్.ఏ, 1961.
2. సుబ్రహ్మణ్యం, పి.ఎస్, ద్రావిడ భాషలు, సత్యవతీ పబ్లికేషన్సు, నెం. 4, చంద్రారెడ్డి రోడ్, అన్నామలైనగర్, 608101, 1977.


**- ఆచార్య పి. సుబ్బారావు**

పాఠం - 4

# ద్రావిడ భాషా శాస్త్రం

# ధాతువులు - నిష్పాదక ప్రత్యయాలు - ప్రాముఖ్యం - వ్యాప్తి - తులనాత్మకాధ్యయనం

**విషయక్రమం**


**4.1** ధాతువు - నిష్పాదక ప్రత్యయం

**4.2** ధాతు విభజన

**4.3** ధాతువులో దీర్ఘాచ్చులు హ్రస్వాచ్చులుగా, ద్విరుక్త హల్లులు అద్విరుక్తహల్లులుగా మారడం.

**4.4** తెలుగులో య ముందు దీర్ఘాచ్చు

**4.5** దక్షిణ ద్రావిడ భాషలు, తెలుగులలో ఇ>ఎ, ఉ>ఒ ల మార్పు

**4.6** నామవాచకాలు

**4.6.1** కృదంత ప్రాతిపదికలు

**4.6.2** లింగ ప్రత్యయ సహిత ప్రాతిపదికలు

**4.7.0** తద్ధిత ప్రాతిపదికలు


## 4.0 లక్ష్యం :

ధాతువుకీ, నిష్పాదక ప్రత్యయానికీ మధ్య ఉన్న భేదాన్ని తెలుసుకోవడం, ధాతువులను ఆరు రకాలుగా విభజించడం, ధాతువులలోని మార్పుల్ని తెలుసుకొని, నామవాచకాలలోని కృదంత ప్రత్యయాలు, తద్ధిత ప్రత్యయాలను గురించి తెలుసుకోవడం ఈ పాఠ ప్రధాన లక్ష్యం.

## 4.1. ధాతువు - నిష్పాదక ప్రత్యయం :

తులనాత్మక పరిశోధనలో ధాతువు (Root), నిష్పాదక ప్రత్యయం (Derivative suffix) - ఈ రెండింటికీ ఉన్న భేదాన్ని తెలుసుకోవడం అవసరం. సోదర భాషలలో ఉన్న సమాన పదాల (Cognates) లో మొదట కొన్ని వర్ణాలే తుల్యంగా ఉంటాయి. ఇలా అన్ని భాషలలోనూ తుల్యంగా ఉన్న వర్ణ సముదాయాన్ని ధాతువు అంటారు.

ధాతువులో వర్ణాలు తుల్యంగా లేకపోయినా కొన్ని భాషలలో నియతమయిన ధ్వనిపరిణామాలు పొంది ఉండవచ్చు. ధాతువు తరువాత ఉన్న వర్ణ సముదాయాన్ని నిష్పాదక ప్రత్యయం అంటారు.

కొన్ని కొన్ని సందర్భాలలో నిష్పాదక ప్రత్యయం లేకుండా కేవలం ధాతువు మాత్రమే ఉండవచ్చు.

| | |
|---|---|
| త.మ. | ఎలి |
| కోత. | ఎయ్జ్ |
| క. | ఎలి, ఇలి |
| తె. | ఎలుక |
| ప. | ఎల్ |
| బ్రా. | అల్ |

పై వ్యుత్పత్తి సముదాయం (Etymological Group) లో *ఎల్ - అనేది అన్ని భాషలలోనూ ఉంది. కాబట్టి ఇందులో అదే ధాతువు.

ఇందులో లకారం కోతలో జ కారంగా మారింది. ఎ కారం కన్నడ 'ఇలి' లో ఇ కారంగానూ, బ్రాహూ-ఈలో అకారంగానూ మారింది. ఈ మార్పులు ఈ భాషలలో నియతమయినవే కాబట్టి *ఎల్- ని ధాతువుగా పరిగణించడానికేమీ ప్రతిబంధకాలు లేవు.

*ఎల్- తరువాత ఉన్న త.మ.క.-ఇ, కోత -య్ (కోత లో యకార, జకారాలు వర్ణ వ్యత్యయం పొందాయి), తె. -ఉక నిష్పాదక ప్రత్యయాలు. పర్జీ, బ్రాహూ-ఈలలో ధాతువు మాత్రమే ఉంది. నిష్పాదక ప్రత్యయం లేదు. దీనిని బట్టి అన్ని భాషలలోనూ తుల్యంగా ఉండే ధాతువే మూలద్రావిడ భాషలో ఉండేదని నిస్సంశయంగా చెప్పవచ్చు.

ఇంతకూ, మూలద్రావిడ భాషలో నిష్పాదక ప్రత్యయం ఉండేదా? ఉంటే ఇప్పటి భాషలలో కనబడే వాటిలో ఏది మూలద్రావిడ భాషకి చెందినది? అనే ప్రశ్నలకు సమాధానాలు చాలా సందర్భాలలో ఇదమిత్థంగా చెప్పడానికి వీలుపడదు. కొన్ని పదాలలో భిన్నోపకుటుంబాలకి చెందిన భాషలలో ధాతువుతో పాటు నిష్పాదక ప్రత్యయాలు కూడా తుల్యంగా ఉండవచ్చు. అటువంటిచోట్ల ఆ నిష్పాదక ప్రత్యయం కూడా మూలద్రావిడ భాషలో ఉండేదని చెప్పవచ్చు. సర్వ సాధారణంగా నిష్పాదక ప్రత్యయాలు తరువాత కాలంలో ప్రత్యేక భాషలలోగాని, ప్రత్యేక ఉప కుటుంబాలలో గాని చేరినవి అయి ఉంటాయి.

## 4.2.0 ధాతు విభజన :

ద్రావిడ భాషా కుటుంబంలో ధాతువులను వాటి స్వరూప స్వభావాలను బట్టి ఆరు రకాలుగా విభజించారు.

అ = అచ్చు
ఆ = దీర్ఘాచ్చు
హ = హల్లు
(హ) = హల్లు ఉండవచ్చు, లేకపోవచ్చు.

## 4.2.1 (హ) అ- :

మొదటి రకం ధాతువుల్లో హల్లు, అచ్చు గాని లేదా కేవలం హ్రస్వాచ్చు గాని ఉంటుంది.

ఉదా : అ-, ఇ- (అక్కడ, ఇక్కడ, అంత, ఇంత మొదలయిన వాటిలో నిర్దేశవాచక ధాతురూపాలు).

i) త. వ - ంతు
మ. వ - న్ను
క. బ - ందు (వచ్చి)

వీటిలో వరు -'వచ్చు' రూపాంతమయిన వ - ధాతువు.

ii) త. త - ంతు

మ. త - న్ను

క. త - ందు (ఇచ్చు)

వీటిలో తరు - 'ఇచ్చు' రూపాంతరమయి త త -ధాతువు.

ఇలాంటి మొదటిరకం ధాతువులు చాలా స్వల్పం. ఉన్నవి కూడా మిగిలిన రకాలకి చెందిన ధాతువుల రూపాంతరాలుగానే ఉంటాయి.

**4.2.2 (హ) ఆ- :**

రెండో రకం ధాతువుల్లో హల్లు, దీర్ఘాచ్చుగానీ లేదా కేవలం దీర్ఘాచ్చు గాని ఉంటుంది.

i) త.మ.కొడ. క.తు. కా -

తె. కా -చు

ప.గ.కుఇ. కా (రక్షించు)

ii) త.మ ఆ, ఆ -న్

కో ఆ - న్

క. ఆ, ఆ -వు

తె. ఆ - వు

iii) త. ఈ

మ. ఈ - చ్చ

కోత. ఈ - వ్

తొ. ఈ - వ్య్

తె. ఈ - (౦గ

కో.నా. నీ - ంగ

**4.2.3 (హ) అహ- :**

మూడో రకం ధాతువుల్లో హల్లు, హ్రస్వాచ్చు హల్లు గానీ, కేవలం అచ్చు, హల్లు గాని ఉంటుంది.

i) త.మ. ఇటు

కో. ఇడ్ -

క.తె. ఇడు

ప. ఇడ్ -

గోం. ఇర్ -

ii) త.మ. నిల్

కో. నిల్

| | | |
|---|---|---|
| | క.తు. | నిల్ |
| | తె. | నిల్ - ఉచు |
| | ప. | నిల్ - |
| iii) | త. | ముట్ - అంకు |
| | మ. | ముట్ - అఞ్ఞు |
| | క. | మొళ్ - అగు |
| | తె. | మ్రో -ఁగు, మ్రో -యు |

**4.2.4 (హ) ఆహ - :**

నాలుగోరకం ధాతువుల్లో హల్లు, దీర్ఘాచ్చు హల్లు గాని, లేదా కేవలం దీర్ఘాచ్చు, హల్లు గాని ఉంటుంది.

| | | |
|---|---|---|
| i) | త.మ | ఆటు |
| | కో. | ఆడ్ - |
| | తొ. | ఒడ్ - |
| | క.తు.తె | ఆడు |
| | కో.నా | ఆడ్ - |
| ii) | త.మ.క. | ఆర్ - |
| | తె. | ఆర్ -చు |
| | ప. | ఆర్ - |
| iii) | త.మ | తేళ్ |
| | క. | తేట్, తుళు |
| | తు. | చేళు, తేలు |
| | తె. | తేలు |
| | మా. | తేల్ - ఎ |
| | బ్రా. | తేల్ |

**4.2.5 (హ) అహహ :**

అయిదో రకం ధాతువుల్లో హల్లు, హ్రస్వాచ్చు, హల్లు, హల్లుగాని లేదా కేవలం హ్రస్వాచ్చు, హల్లు, హల్లుగాని ఉంటుంది.

| | | |
|---|---|---|
| i) | త. | కట్టు |
| | మ. | కట్టు, కెట్టు |
| | కోత. | కట్ - |
| | తొ. | కొట్ - |
| | తు.క.తె. | కట్టు |
| | ప. | కట్ట్ - |
| | గోం. | కట్ట్ - |

| | | |
|---|---|---|
| ii) | త. | కుప్ప్ - అం, కుప్ప్ - అల్, కుప్ప్ - ఐ |
| | మ. | కుప్ప్ - అ |
| | కో. | కిప్ |
| | క. | కుప్ప్ - ఎ |
| | తె. | కుప్ప్ - అ |
| | ప. | కుప్ప్ - అ |
| | కురు. | కుప్ - అ |
| iii) | త.మ. | నంపు |
| | కోత. | నంబ్ - |
| | తొ. | నొబ్ - |
| | క.తు | నంబు |
| | తె. | నమ్ము |
| iv) | త. | కన్టు |
| | మ. | కన్ను |
| | తొ. | కొట్ |
| | క. | కఱు (వు), కందు |
| | తు. | కంజి |
| | తె. | కందు (పసి కందు) |

పైన పేర్కొన్న ఈ అయిదో రకం ధాతువులని ఇంతవరకూ పరిశోధకులు మూడోరకంలో అంతర్భాగంగానే పరిగణించారు. వారి మతంలో వీటిలో ద్విత్వ, సంయుక్తాక్షరాలలో మొదటి హల్లు ధాతువుకి చెందినది, రెండోది నిష్పాదక ప్రత్యయ భాగం. కాని చాలా భాషలలో ఈ ద్విత్వ సంయుక్తాక్షరాలు ఉండడం వల్ల వీటిలో రెండో హల్లుని కూడా ధాతు భాగంగానే పరిగణించడం సమంజసం.

**4.2.6 (హ) ఆహహ :**

ఆరోరకం ధాతువుల్లో హల్లు, దీర్ఘాచ్చు, హల్లు, హల్లు గాని లేదా దీర్ఘాచ్చు, హల్లు, హల్లు గాని ఉంటుంది.

| | | |
|---|---|---|
| i) | త. మ. | పాంపు |
| | కోత. | పోబ్ |
| | క. | పావు |
| | కొడ. | పాంబు |
| | తు. | హావు |
| | తె. | పాము |
| | కో.నా | పాం |
| | ప.గ. | బాం |

| | | |
|---|---|---|
| ii) | త.మ. | తాంటు |
| | కోత. | దాట్ - |
| | తో. | తోట్ - |
| | క. | తాంటు, దాంటు |
| | తు. | దాంటు |
| | తె. | దాఁటు |
| iii) | త. | తాన్ట్ - ఇ |
| | మ. | తాన్న్ - ఇ |
| | క. | తాట్ - ఇ, తాట్ - ఎ |
| | తు. | దాండ్ - ఇ |
| | తె. | తాఁడ్ - ఇ |
| | ప. | దేండ్ - ఇ, దేన్ - ఇ |
| | గోం. | తాహ్ - కా |

ఈ ఆరో రకం ధాతువుల్ని కూడా ఇంతవరకు పరిశోధకులు ప్రత్యేకంగా పరిగణించలేదు. ఇవి నాలుగో రకానికి చెందినవని భావించేవారు. కాని అది సరయినది కాదని తరువాతి పరిశోధకులు నిరూపించారు. పై ఉదాహరణలలో స్పష్టత కోసం ధాతువూ, నిష్పాదక ప్రత్యయమూ విడివిడిగా ఇవ్వడం జరిగింది. ఒకవేళ ధాతువు తర్వాత ఉకారం మాత్రం ఉంటే దానిని విడిగా ఇవ్వలేదు. కారణం అలాంటివి అజంతత కోసం తరువాత వచ్చి చేరినవి కావడమే.

నిష్పాదక ప్రత్యయంలో మొదటి అచ్చు సాహిత్య రహిత భాషలలో సాధారణంగా లోపిస్తూ ఉంటుంది. అటువంటి అచ్చు తర్వాత హల్లు ఉంటే కన్నడంలో కూడా ఆ అచ్చు లోపిస్తుంది.

ఉదా : కొర్పు, కొబ్బు < *కొట్ - ఉవు (కొవ్వు)

నిష్పాదక ప్రత్యయంలో మొదట అచ్చు ఉంటే అది అ,ఇ,ఉ లలో ఒకటి అయి ఉంటుంది. ధాతువు అజంతమయితే నిష్పాదక ప్రత్యయం మొదట హల్లు ఉంటుంది. హలంత ధాతువు తరువాత వచ్చే నిష్పాదక ప్రత్యయం మొదట సాధారణంగా అచ్చు ఉంటుంది. కాని అరుదుగా హలంత ధాతువు తరవాత హల్లుతో మొదలయ్యే నిష్పాదక ప్రత్యయం కూడా ఉంటుంది. ఇక భాషలోనే ఒక ధాతువు తరువాత భిన్న నిష్పాదక ప్రత్యయాలు ఉండి కొంత అర్థభేదాన్ని కలిగించవచ్చు.

ఉదా : త. కుట్ - అల్ (పిల్లనగ్రోవి), కుట్ - ఐ, కుట్ - ఆయ్ (గొట్టం) కుట్ - ఇ (గొయ్యి), కుట్ - ఉంపు (గొయ్యి).

తె. చెట్ - అ, చెట్ - ఉవు, వెల్ - ఉఁగు, వెల్ - ఉతురు, కొమ్మ్ - ఉ, కొమ్మ్ - అ.

## 4.3.0 ధాతువులో దీర్ఘాచ్చులు హ్రస్వాచ్చులుగా, ద్విరుక్త హల్లులు అద్విరుక్త హల్లులుగా మారడం :

ద్రావిడ భాషా ధాతువులలో దీర్ఘాచ్చు ధాతువు తరువాత, నిష్పాదక ప్రత్యయం లేనప్పుడూ, హల్లుతో మొదలయ్యే నిష్పాదక ప్రత్యయం ఉన్నప్పుడూ దీర్ఘాచ్చుగానే ఉంటుంది. కాని ధాతువు తరువాత అచ్చుతో మొదలయ్యే నిష్పాదక ప్రత్యయం వచ్చినపుడు మాత్రం ధాతువులో దీర్ఘాచ్చు హ్రస్వంగా మారుతుంది. ఈ మార్పు క్రియలలో అపవాదరహితంగా కనబడుతుంది. కాని నామవాచకాలలో త్ర్యచ్కాల (Trisyllabics) లోనే సాధారణంగా ఇది వస్తుంది. ద్వ్యచ్కాల (Disyllabics) లో ఇటువంటి మార్పు సాధారణంగా రాదు. కొన్ని ద్వ్యచ్కాలలో మాత్రం మార్పు వచ్చిన రూపం, రాని రూపం కూడా ఉన్నాయి.

ఇటువంటి మార్పు చాలా ద్రావిడ భాషలలో కనపడటం వల్ల ఇది మూలభాషలోనే మొదలయి ఉంటుందని ఊహించవచ్చు. అందువల్ల కొన్ని పదసముదాయాలలో ఒకే భాషలో దీర్ఘాచ్చు గల ధాతు రూపమూ (నిష్పాదక ప్రత్యయం లేకుండా, హ్రస్వాచ్చు గల ధాతురూపమూ (అచ్చుతో మొదలయ్యే నిష్పాదక ప్రత్యయంతో) మనకు కనిపిస్తూ ఉంటాయి. కొన్ని భాషలలో ధాతువులో హ్రస్వాచ్చుకి కారణమయిన నిష్పాదక ప్రత్యయం మొదటి అచ్చు లోపించడం కూడా ఉంది.

i) ఉదా : త. ఆర్, అరఋ్టు, కోత. ఆర్, క.ఆర్, అర్బిసు, కొడ. అర, తు. ఆర్కు, అరటు, తె. ఆర్చు, గ. అర్గ్ -, ప. కురు. ఆర్ - (క. అర్బిసు, గ. అర్గ్‌లలో ప్రాచీన కాలంలో రేప తరువాత అచ్చు ఉండేది. అది ధాతువులో అచ్చుని హ్రస్వంగా మార్చిన తరువాత లోపించింది).

ii) త. కిఱావు (నెమలి) అరుచు, కోత. కిర్‌య్-, తొ. కిఝ్‌చ్-, క.కిఱుచు, కిఱుచు, కిర్చు, తె. చీఱు (పిలుచు), కుఇ. కిహ్- (అరుచు),

సి) త. పొరు, పొరుతు (యుద్ధం చేయు), పోర్ (యుద్ధం), క. పోర్, తె. పోరు, గ. పోరు- (కోప్పడు).

ఇలాంటి మార్పు యుష్మదస్మదర్థక సర్వనామాలలోనూ, ఆత్మార్థక సర్వనామాలలోనూ, సంఖ్యా వాచకాలలోనూ, కొన్ని విశేషణాలలోనూ కూడా చాలా భాషలలో కనబడుతోంది.

ద్వ్యచ్క నామవాచకాలలో అచ్చుతో మొదలయ్యే నిష్పాదక ప్రత్యయం ఉన్నా ధాతువులో దీర్ఘాచ్చు సాధారణంగా మారదు.

ఉదా : త. కా క్కై, మ. కాక్క, క. కాకె / కాగె, తె. కాకి

త. పానై, మ. పాన, తె. బాన

అచ్చుతో మొదలయ్యే నిష్పాదక ప్రత్యయం ముందు ధాతువులో దీర్ఘాచ్చు హ్రస్వమయినట్లుగా ద్విరుక్త హల్లు కూడా అద్విరుక్తంగా మారుతుంది. పదంలో అక్షరాల సంఖ్య ఎక్కువ అవడమే ఈ మార్పులకి అసలు కారణం. హల్లులలో మార్పు కూడా క్రియలలోనూ త్ర్యచ్క నామవాచకాలలోనూ అపవాదరహితంగా ఉంటుంది. ద్వ్యచ్క నామవాచకాలలో మాత్రం ఇది క్వాచిత్కంగానే కనబడుతుంది.

i) త. కొట్టు ((తేలు) కుట్టు), కొటుక్కు (తేలు కుట్టడం), క. కుటుకు (కుట్టు)
ప. కొడ్క్-, కొట్ట్ -

ii) త.మ. వెళ్ళై (వెల్ల), వెళుప్పు (తెలుపు), వెళిచ్చం (వెలుగు)
క. బెళ్ళి (వెండి), బెళుపు, బెళ్పు, తె. వెల్ల, వెండి, వెలుఁగు.

## 4.4.0 తెలుగులో య ముందు దీర్ఘాచ్చు :

తెలుగులో య కారాంతాలయిన క్రియలలోనూ, నామవాచకాలలోనూ, దీర్ఘాచ్చే ఉంటుంది. దీని స్థానంలో మిగిలిన భాషలలో కొన్ని పద సముదాయాలలో హ్రస్వాచ్చూ, మరికొన్నింటిలో దీర్ఘాచ్చూ ఉంటాయి.

తె. ఏయు, త.మ. తు.ప. ఎయ్-, క. ఎసు, ఎయ్

తె. కోయు, త.మ. కోత.క. కొడ.తు.ప.గోం. కొయ్

### 4.5.0 దక్షిణ ద్రావిడ భాషలు, తెలుగులలో ఇ > ఎ, ఉ > ఒ ల మార్పు :

అకారంతో మొదలయ్యే నిష్పాదక ప్రత్యయం ముందు దక్షిణ ద్రావిడ భాషలు, తెలుగులలో చెప్పుకోదగ్గ ఒక మార్పు వచ్చింది. ప్రాచీన తమిళ, మలయాళాలలో రెండో అక్షరంలో అకారం ఉన్నప్పుడు ధాతువులో అ ఇ ఉ లలో ఏదో ఒకటే ఉంటుంది. (చూడు. 3 వ పాఠంలో ఇ/ఎ, ఉ/ఒ ల మార్పు)

### 4.6.0 నామవాచకాలు :

ఒక వాక్యంలో కర్తగా గాని, కర్మగా గాని ప్రయోగించదగిన శబ్దాలు నామవాచకాలని స్థూలంగా చెప్పవచ్చు. సంఖ్యావాచకాలూ, సర్వనామాలూ కూడా నామవాచకాలనే పెద్ద సముదాయంలో అంతర్విభాగాలే. ఇవిగాక క్రియల మీద కృత్ప్రత్యయాలు చేర్చడం వల్ల ఏర్పడిన కృదంతాలు కూడా నామవాచకాలలో ఒక విభాగం అవుతాయి. ద్రావిడ భాషలలో నామవాచక పదనిర్మాణం (Morphological Structure) ఈ క్రింది విధంగా ఉంటుంది.

ప్రాతిపదిక + (బహువచన ప్రత్యయం) + (ఔప విభక్తికం) + (విభక్తి ప్రత్యయం / విభక్త్యర్థక శబ్దం).

ప్రాతిపదిక ప్రత్యయరహితమయిన ఏకపదం (Monomorphemic) గా గాని, కృత్ప్రత్యయ, లింగ ప్రత్యయాలు కలదిగా గాని ఉండవచ్చు. పైన కుండలీకరణాలలో ఇచ్చిన ప్రత్యయాలు వైభాషికంగా అంటే వ్యవహర్త ఇచ్ఛానుసారంగా ప్రాతిపదికకు చేరతాయి.

### ప్రాతిపదికలు :

ఇవి రెండు విధాలు 1. కృదంత ప్రాతిపదికలు 2. తద్ధిత ప్రాతిపదికలు.

### 4.6.1 కృదంత ప్రాతిపదికలు :

నామ ప్రాతిపదికలలో చాలా 'నీరు', 'కాలు', 'ఎద్దు', 'అన్న' మొదలయిన శబ్దాలులా ఏకపదాలుగానే ఉంటాయి. కాని క్రియకి ఒక ప్రత్యయం చేర్చడం ద్వారా ఏర్పడిన నామవాచకాలు కూడా అన్ని ద్రావిడ భాషలలోనూ ఉంటాయి. వీటినే కృదంతాలు అంటారు.

ద్రావిడ భాషలలో 'తమ్ముడు, మనుమడు, మనుమరాలు వియ్యంకుడు, వియ్యపురాలు' మొదలగు శబ్దాల వంటి లింగ ప్రత్యయాలు ఉన్న నామ ప్రాతిపదికలు కూడా అరుదుగా ఉన్నాయి. సాధారణంగా ద్రావిడ భాషలలో ఒక నామవాచకం లింగం దాని అర్థాన్ని బట్టే తెలుస్తుంది కాని అన్ని నామవాచకాలలోనూ, లింగ సూచకమయిన ప్రత్యయాలు ఉండవు.

### i) తమిళం :

భావార్థక ప్రత్యయం : - అల్, - తల్

కెటుతల్, కెటల్ (చెడడం), పిరితల్ (విడిపోవడం), పిఱత్తల్ (పుట్టడం)

**కృత్ప్రత్యయాలు** : -ఇ, - వల్, - పు, - ఇల్, - ఉళ్, - కాటు, - ఐ, - వు, - అవు, - తి, - కై, - వి, - అం, వెకుళి (కోపం), పార్వల్ (చూడడం), మాణ్బు (గొప్పతనం), మిచ్చిల్ (మిగులు), విక్కుళ్ (ఎక్కిళ్ళు), సాక్కాటు (చావు), విలై (వెల), అఱివు (జ్ఞానం), చెలవు (పోవడం), మికుతి (ఎక్కువ), వరుకై (రాక), కల్వి (చదువు), చినం (కోపం).

ii) **మలయాళం :**

భావార్థక ప్రత్యయం : - అల్
చెయ్యల్ (చెయ్యడం), నటక్కల్ (నడవడం)

కృత్ప్రత్యయాలు : -తల్, -పు, -వు, -తి, -త్తు, -అ, -ఇ, -అం, -మ, -వి, -తల.

కెటుతల్ (చెడడం), కిటప్పు (పడుకోవడం), పార్పు (బ్రతకడం), వీఙ్చ్చ (పడడం), అఱుతి (అంతం), నెయ్‌త్తు (నేత), పిటిత్తం (పెట్టడం), నిల (స్థానం), కేళి (వినడం), నీళం (పొడుగు), ఓర్మ (జ్ఞాపకం), మఱవి (మరుపు), మఱుతల (మరొకవైపు).

iii) **కొడగు :**

భావార్థక ప్రత్యయం : -పె, -వె (-ఒ)
ఒప్పె (రావడం), పెరువె (కనడం), బాళొ (బతకడం)

కృత్ప్రత్యయాలు : - పు, - (ఇ) కె, - (అ) వు, - పె, - ఇ, - $\phi$, -ఆట, -ఆమె, -కు

ఒప్పు (ఒప్పందం), బాకె (జీవితం, నంబికె (నమ్మకం), చావు (చావు), కుడిపె (తాగడం), తీని (తిండి), మొరడు (ఏడ్పు), తున్మూట (తుమ్మడం), ఉక్కామె (వ్యవసాయం), పోకు (నడవడి).

iv) **తొద :**

కృత్ప్రత్యయాలు : - క్య్, - ఫ్, - య్, - మ్, - ప్, - ఇల్, - ఫయ్, - త్, - ఖూ, నొబ్క్‌య్ (నమ్మకం), కేళ్ఫ్ (వార్త, మాట), పోత్‌య్ (పక్క), ఒణమ్ (లెక్కపెట్టడం), నడ్‌ప్ (నడవడి), కోఫిల్ (కాపలా), కల్ఫ్‌య్ (చదువు), పేస్త్ (ఇల్లు నేయడం), ముచ్ ఖూ (మూత).

v) **కన్నడం :**

కృత్ప్రత్యయాలు : - అల్, - ఇ, - అర్, - కె/- క్కె, - గె, - ఇగె, - ఇల్, - కుళి /- గుళి, - అం, - అవు, - వు, - పు, - తె, - పె, - మె, - పి, - వి, - పం, - తం.

ఏఱల్ (సింహాసనం), ఆడి (ఆడేవాడు), బెళర్ (తెలుగు), అగర్కె (విడదీయడం), అడుగె (వంట), తొడిగె (భూషణం), మిగిల్ (గొప్పతనం), పోర్కుళి (పోట్లాడేవాడు), అగలం (వెడల్పు), తొడవు (భూషణం), అఱివు (జ్ఞానం), పొళెపు (తెలుపు), పొగఱితె (పొగడ్త), కూర్మె (ప్రేమ), నోంపి (నోము), నెరవి (పోగు), ఉణిసు (భోజనం), తొనెపం (ఊగడం), గెయ్‌తం (పని).

vi) **తుళు :**

కృత్ప్రత్యయాలు : - ఇ, - అణె, - ఎలు, - కె / - ఇకె, - గె / - ఇగె, - అంద, - డి, - ఎల్ / - ఎ, - వు, - అయ.

మెంచి (మెరుపు), తిర్గణె (స్క్రూ), ముచ్చెలు (మూత), బెదరికె (భయం), బిరికె (బీట), మెత్తిగె (అరుగు), ఒప్పిగె (ఒప్పందం), ఒప్పంద (ఒప్పందం), తిండి (తిండి, కావలు (కావలి), కండెలె (దొంగ), మేవు (మేత), ఒత్తయ (చాలాసార్లు అడగడం).

vii) **తెలుగు :**

భావార్థప్రత్యయం : - ట (- అటం / - అడం, వ్యవహార భాషలో)

చేయుట (చెయ్యటం, చెయ్యడం) అడుగుట (అడగటం / అడగడం).

కృత్ప్రత్యయాలు : - క, - ఇమి, - ఁత, - కువ, - ట, - టు, - పము, - త, - పు, - ఇక, - బడి, - గడ, - ఇకి, - వు, - అ, - అకము, - డు, - వడి, - వి, - అవు, - ఇ, - కలి, $\phi$.

అలుక, నడక, మొలక, కలిమి, ఓరిమి, చేఁత, కూఁత, అడఁకువ, లోఁకువ, ఆట, ఊట, పాటు, చేటు, కలపము, మురిపము, ఆవులింత, గిలిగింత, మాపు, మేపు, కోరిక, కూడిక, ఏలుబడి, పెట్టుబడి, మనుగడ, చేరుగడ, పోలికి, కోరికి, మనువు, కొలువు, ఎండ, కాయ, అమ్మకము, నమ్మకము, అల్లుడు, దంపుడు, కొలువడి, నడవడి, తనివి, తెలివి, నగవు, చేయి, వినుకలి, కనుకలి, నవ్వు, తప్పు, ఒప్పు మొ॥నవి.

viii) **కొండ :**

కృత్ప్రత్యయాలు : ఉణ్, - కు

నేంజుణ్ (ఊపిరి) < నేంజ్ (ఊపిరిపీల్చు), మూల్కు (మూత్రం) < మూల్ (మూత్రం పోయు).

ix) **కుఇ :**

కృత్ప్రత్యయాలు : - ఎడి, - ఎరి, - ఒడి, - ఒరి, - ఒలి

పంగెడి (కర్రపలక), కిసెడి (చెవిపోగు), కోపరి (కోతలు), సీ పాడి (గరిటె), దేస్పారి (ఎత్తడం), ద్రుంగొలి (ఉయ్యాల).

x) **పెంగో :**

కృత్ప్రత్యయాలు : - కొండ్, - పొండ్, - అ, - ఇ

కేర్కొండ్ (పాట), క్డేచ్కొండ్ (కల), కుత అస్పొండు (దగ్గు), పక (చీలిక), క్డేంజి (కల), పకి (వెదురుబద్ద), ముచి (మూత).

xi) **కోలామీ :**

కృత్ప్రత్యయాలు : - ఊడ్

సీవూడ్ (ఇవ్వడం), పండూడ్ (పండు), ఓలూడ్ (చూపినవాడు), ఉంబులూడ్ (మూత్రం).

xii) **పర్జీ :**

కృత్ప్రత్యయాలు : - కుడ్, - అల్, - ఉబ్

ఉర్జుకుడ్ (చెమట), తుమ్కుడ్ (తుమ్ము), నేఇల్ (ఊపిరి), ఊబర్ (చెప్పడం), ఉయ్కుబ్ (పాముకూసం).

xiii) **బ్రాహూఈ :**

కృత్ప్రత్యయాలు : - అ, - స్, - ఆర, $\phi$

చండ (కదలిక), జక్క (దగ్గు), తిస్స్ (దానం), ఖులీస్ (భయం), గా్రార (గొర్రె / మేక అరుపు), వక్కార (కుక్క అరుపు), ద్రిక్ (గంతు), అక్కల్ (అరుపు), పుల్ (దొంగతనం), తక్ (కోరిక).

మధ్య ద్రావిడ భాషలు, ఉత్తర ద్రావిడ భాషలలో తెలుగు తప్ప మిగిలిన సాహిత్యరహిత భాషలలో ప్రాచీన కృత్ప్రత్యయాలు చాలావరకు నశించాయి. కొన్ని భాషలలో పూర్తి సమాచారం లేదు. సాహిత్యం ఉన్న భాషలలో కూడా కృదంతాలని సమగ్రంగా సేకరించి పరిశీలన చెయ్యవలసిన అవసరం ఉంది. ఒక భాషలో ఒకే ధాతువుకి భిన్నార్థాలలో గాని, ఏకార్థంలో గాని భిన్న ప్రత్యయాలు చేరడం కూడా ఉంది.

ఉదా : నడక, నడత; చూపు, చూడ్కి; చేఁత, చేయు, చేయి; వ్రాఁత, వ్రాయి.

## 4.6.2 లింగ ప్రత్యయ సహిత ప్రాతిపదికలు :

నామ ప్రాతిపదికలలో లింగ ప్రత్యయాలు అరుదుగానే ఉంటాయి. నామవాచకం లింగం అర్థం వల్లనే తెలుస్తుంది.

i) తమిళం :

పురుష వాచక ప్రత్యయాలు : - అన్, - ఆన్, - వన్, - నన్, - ఓన్.

మకన్ కొడుకు), పారప్పాన్ (బ్రాహ్మణుడు), చిఱువన్ (పిల్లవాడు), పొరువన్ (యోధుడు), ఇళైయోన్ (యువకుడు).

స్త్రీ వాచక ప్రత్యయాలు : - అళ్, - ఆళ్, - ఓళ్, - ఇ, - వి, - మి, - ఐ, - త్తి.

మకళ్ (కూతరు), మాతరాళ్ (స్త్రీ), ఇళైయోళ్ (అమ్మాయి), కాతలి (నాయిక), మనైవి (భార్య), చిఱుమి (చిన్న పిల్ల), పరత్తై (వెలయాలు)

ii) మలయాళం :

పురుషవాచక ప్రత్యయాలు : -అన్, -ఆన్

మకన్ (కొడుకు), వణ్ణాన్ (చాకలివాఁడు)

స్త్రీవాచక ప్రత్యయాలు : - అళ్, - ఇ, -త్తి

మకళ్ (కూతురు), పొట్టి (మూగది), ఒరుత్తి (ఒకతె)

iii) కోత :

పురుష వాచక ప్రత్యయం : - న్

పర్న్ (మాలవాడు)

స్త్రీ వాచక ప్రత్యయాలు : - ఇ, - తి, - చ్

కళి (దొంగది), దేర్తి (దేవత), పర్చ్ (మాలది)

iv) తొద :

పురుష వాచక ప్రత్యయాలు : - న్, - ఒళ్

కొనాడ్‌య్‌న్ (కన్నడంవాడు) కొళ్‌ణ్ (దొంగ); కెలోళ్ (ముసలివాడు)

స్త్రీ వాచక ప్రత్యయాలు : - ఇ, - త్‌య్, - చ్

మామి (అత్త), పుర్‌కిత్‌య్ (తోడకోడలు), కురుబ్‌చ్ (కురుంబ జాతిస్త్రీ)

v) కొడగు :

పురుష వాచక ప్రత్యయం : - ఎ

కళ్ళె (దొంగ), ఎరపె (ముష్టివాడు)

స్త్రీవాచక ప్రత్యయం : - అతి, - చి, - ఇ, - అ(ళ్), - కర్తి

కొడవతి (కొడగు స్త్రీ), తోటచి (పాకీది), కళ్ళి (అడవిదొంగ), మోవ(ళ్) (కూతురు), అటకర్తి (ఆటది).

vi) కన్నడం :

పురుష వాచక ప్రత్యయం : - అం.

అణ్ణం (అన్న), తమ్మం (తమ్ముడు), అళియం (అల్లుడు)

స్త్రీవాచక ప్రత్యయాలు : - అళ్, - ఇ, - తి

ఒర్వళ్ (ఒక స్త్రీ), అరసి (రాణి), పార్వంతి (బ్రాహ్మణ స్త్రీ), పొలతి / హొలతి (తక్కువ జాతి స్త్రీ).

vii) తుళు :

పురుషవాచక ప్రత్యయం : - ఎ

కురుడె (గుడ్డివాడు), కుంటె (కుంటివాడు).

స్త్రీ వాచక ప్రత్యయాలు : -ఇ, -తి /-త్తి

కురుడి (గుడ్డిది), మరితి (పిచ్చిది), సాల్యెత్తి (సాలెది).

viii) తెలుగు :

పురుష వాచక ప్రత్యయాలు : ఁడు, - న్టు

తమ్ముఁడు, మనుమఁడు, ప్రాఙ్నన్నయ శాసనాలలో తబున్టు (తమ్ముడు)

స్త్రీ వాచక ప్రత్యయాలు : - ఆలు, - అలు, - ఇ, - త్తియ (త్తై), - త

మనుమరాలు, కోడలు, ఒయారి, ఆటకత్తియ / ఆటకత్తె, బోయత, చెంచెత.

ix) గోండి :

పురుష వాచక ప్రత్యయాలు : - ఆల్, - ఓర్

ఆందాల్ (గుడ్డివాడు), కూటాల్ (కుంటివాడు); తొత్తోర్ (పూర్వుడు), డియ్యోర్ (పడుచువాడు)

స్త్రీ వాచక ప్రత్యయాలు : - ఆడ్, - ఈ, - ఏ

మియ్యాఢ్ (కూతురు), సేలాడ్ (చెల్లెలు); నొప్రీ (పెళ్ళికూతురు), మూకీ (మూగది); కుమ్మే (కుమ్మరిది).

x) కొండ :

పురుష వాచక ప్రత్యయాలు : - అ, - ఎన్

కణ (గుడ్డివాడు), డొక్ర (ముసలివాడు); గురుయెన్ (గురువు), కట్కుయెన్ (పిసినిగొట్టువాడు)

స్త్రీ వాచక ప్రత్యయాలు : - ఇ, - ని

కణి (గుడ్డిది), డొక్రి (ముసిలిది), గాన్సిని (తక్కువజాతి స్త్రీ), గురుణి (ఆడ గురువు).

xi) పెంగొ :

పురుష వాచక ప్రత్యయాలు : - ఎన్, - అన్

పొత్లెన్ (మామగారు), దూతెన్ (ముసలివాడు); కెయ్నుకన్ (నౌకరు), ఇంజకన్ (ఇంటివాడు)

స్త్రీ వాచక ప్రత్యయం : - ఎల్

తొడెందెల్ (చెల్లెలు), హరుకదెల్ (చిన్నది).

xii) మండ :

పురుష వాచక ప్రత్యయం : - అన్

దలికతన్ (పెద్దవాడు), కడినన్ (నల్లటివాడు)

స్త్రీ వాచక ప్రత్యయం : - ఎల్

హూల్ పందెల్ (అందమయినది), కడిందెల్ (నల్లటిది)

xiii) కుఇ :

పురుష వాచక ప్రత్యయాలు : - ఎంజు, - ఎర, - ఒక

మ్రీగెంజు (బావమరిది), తోడెంజు (స్నేహితుడు); బ్రూకెర (గుడ్డివాడు), ప్రేకొర (దొంగ).

స్త్రీ వాచక ప్రత్యయాలు : - అలి, - ఎడి, - ఇ

మ్రీగలి (మరదలు), పాటరెడి (మహమ్మదీయ స్త్రీ), బ్రూకెరి (గుడ్డిది).

xiv) కోలామీ :

పురుష వాచక ప్రత్యయాలు : - న్, - క్

మరాన్ (మరిది), మలాన్ (మంగలి); బాసాక్ (మేనల్లుడు), మామాక్ (మామ)

స్త్రీ వాచక ప్రత్యయాలు : - ఆల్, - ఇ, - తాద్

మాసాల్ (భార్య), బాసి (మేనమామ), దీవర్తాద్ (జాలరి స్త్రీ)

xv) నాయకీ :

పురుష వాచక ప్రత్యయాలు : - న్, - అక్

తోలెన్ (తమ్ముడు), కీకెన్ (కొడుకు); ఢివ్రక్ (చేపలవాడు), ముక్కక్ (మూగవాడు).

స్త్రీ వాచక ప్రత్యయాలు : - ఆ (ల్), - ఇ, - ఎ

తెలిగ్రా(ల్) (తెలుకుల స్త్రీ), ముక్కి (మూగది), దివ్రె (జాలరి స్త్రీ).

xvi) పర్జీ :

పురుష వాచక ప్రత్యయం : - ద్

తొలెద్ (సోదరుడు), మయిద్ (భర్త)

స్త్రీ వాచక ప్రత్యయం : - (అ) ల్

పొదల్ (అత్తగారు) చాలల్ (చెల్లెలు)

xvii) గదబ :

పురుష వాచక ప్రత్యయాలు : - ండ్, - ఒన్, - అక్

మగ్గండ్ (మనుష్యుడు), తొడొన్ (సోదరుడు), ముత్తక్ (ముసలివాడు)

స్త్రీ వాచక ప్రత్యయం : - అల్

కొడల్ (కోడలు), ముర్తల్ (ముసలిది).

xviii) కురుఖ్ :

పురుష వాచక ప్రత్యయం : - అస్

ఆలస్ (మనుష్యుడు), బేలస్ (రాజు)

స్త్రీ వాచక ప్రత్యయం : - ఈ

ఆలీ (స్త్రీ) ఉర్బ్నీ (యజమానురాలు), పెల్లో (పని మనిషి)

xix) మాల్తో :

పురుష వాచక ప్రత్యయం : - ఎ

ఖల్వె (దొంగ), మఖె / ఖదె (కొడుకు)

స్త్రీ వాచక ప్రత్యయాలు : - ఇ, - తి

మఖి (పిల్ల), ఖలి (పిన్ని); ఒర్తి (ఒకతె)

xx) బ్రాహూఈ : ఈ భాషలో లింగ భేదం నశించడంవల్ల ఇలాంటి ప్రత్యయాలు లేవు.

పురుష వాచక ప్రత్యయం దక్షిణ భాషలలో *న్ గానూ, మధ్యభాషలలో *న్ట్ గానూ పునర్నిర్మించవచ్చు. వీటిలో *న్ట్ ప్రాచీనతరమని చెప్పవచ్చు.

స్త్రీ వాచక ప్రత్యయాలు *- ఆళ్ (*- అళ్), *- త్తి, *- ఇ - లు ద్రావిడ భాషలలో ప్రచురంగా ఉన్నాయి. వీటిలో *(ఆళ్) (స్త్రీ) అనే పదంతో తుల్యం. *త్తి దక్షిణ ద్రావిడ భాషలలోనే ఉంది. *- ఇ ప్రత్యయం మూడు ఉప కుటుంబాలలోనూ ఉంది. ఇది మూలభాషకు చెందినదే కావచ్చు.

## 4.7.0 తద్ధిత ప్రాతిపదికలు :

మూలద్రావిడ భాషలో కృత్తద్ధిత ప్రత్యయాలలో కలిగే మార్పు చాలా తక్కువ. ఒకే ప్రత్యయం కృత్తుగానూ, తద్ధితంగానూ రావడం జరుగుతుంది. కాలక్రమంలో భాషలో వచ్చిన మార్పులవల్ల తెలుగు భాషలో కొన్ని తద్ధితాలున్నాయి. అవి కూడా చాలా స్వల్పమే.

- తనం, - ఇమి, - పు మొదలగునవి మిగిలిన ద్రావిడ భాషలలో ఉన్నాయి. కాగా - ఱకము, కాఁడు, ఈఁడు, -అరి, - బంటి, - కొలఁది, - మారి, - పోతు, - ఆడి మొదలయిన తద్ధిత ప్రత్యయాలు కేవలం తెలుగులో కన్పిస్తున్నాయి.

i) - తనమ్ :

తె. - తనమ్, తమిళం, - తనమ్, కన్నడం - తనం

గొప్పతనం, మంచితనం, చెడ్డతనం మొ॥వి.

తమిళంలో తన్మై (తనం) స్వభావం అనే అర్థంలో ఉంది.

ii) - ఇమి :

తె. - ఇమి, త.మై, క.మె

తె. పేరిమి, త. పెరుమై, క. పెర్మె

తె. మేలిమి, త. మేన్మై, క. మేల్మె

తె. పసిమి, త. పసుమై, క. పసుమె

-ఇమి ప్రత్యయం కృదంత రూపాలలో కూడా ఉంది. కలుగు ధాతువు మీద చేరిన -ఇమి కృత్తు (కలిమి). పేరు అనే విశేషణ రూపం మీద వచ్చి చేరిన -ఇమి తద్ధిత ప్రత్యయం. ఇలాంటి భేదం అర్వాచీనంలో వచ్చిందని చెప్పవచ్చు.

iii) - పు

తెలుగు వైయాకరణులు దీనిని కృత్ప్రత్యయంగా చూపించారు.

ఉ : ఇంచు - ఇంపు, చూచి - చూపు, మోయు - మోపు మొదలయినవి.

కాని,

తె. కెంపు, త. శివప్పు, క. కెంపు

తె. తెలుపు, త. వెళుప్పు, క. బెళ్పు

పయి ఉదాహరణలలో మూడు భాషలలోనూ '- పు' ప్రత్యయం ఉంది. అది విశేషణాల మీదే వచ్చింది. ఆలాగే తెలుగులో మునుపు, పెనుపు, నునుపు, బలుపు మొదలయిన పదాలలోని పూర్వావయవాలయిన మును, పెను, నును, బలు అనేవి విశేషణాలే. దీనిని బట్టి తెలుగు భాషలో కృత్తుల్ని, తద్ధితుల్ని వేరుచేసి చెప్పడం సులభమే.

పయిన పేర్కొన్నవి కాక కేవలం తెలుగు భాషలోనే ఉన్న తద్ధిత ధాతువులున్నాయి.

| | | |
|---|---|---|
| - ఱికం | : | కన్నెఱికం, చిన్నఱికం, పేదరికం |
| - కాఁడు | : | అందగాఁడు, మోసగాఁడు |
| - కత్తె | : | అందగత్తె, మోసగత్తె |
| - ఈఁడు | : | ఆటమటీఁడు, మన్నీఁడు |
| - అరి | : | జాలరి, పూజారి మొ॥నవి. |

- బంటి, - కొలఁది, - మారి, - పోతు మొదలయినవి తెలుగులోనే ఉన్నాయి. ముక్కిడి, వాలిఁడి మొదలయిన శబ్దాల మీద ఉన్న - ఇడి తో సమానమయిన - ఇలి అనేది అంతమందున్న వాలిలి (వాలం లేనివాడు), పల్లిలి మొదలయినవి కన్నడంలో

కూడా ఉన్నాయి. అలాగే వగలాడి, కులుకులాడి మొదలయిన పదాలలో చివరున్న '- ఆడి' కి సమానమయిన '- ఆళి' కన్నడంలో కూడా ఉంది. అయితే ఇది ఏకవచనంలో మాత్రమే వస్తుంది. (సిగ్గాళి, జూదాళి మొ॥వి).

**సమీక్ష :**

ధాతువులు, నిష్పాదక ప్రత్యయాలు, వాటి వ్యాప్తి ప్రత్యేకించి కృత్తద్ధత ప్రాతిపదికల గురించి ఈ పాఠంలో తెలుసుకోవడం జరిగింది.

**మాదిరి ప్రశ్నలు :**

1. ధాతువులు - నిష్పాదక ప్రత్యయాలకు మధ్య ఉన్న భేద సాదృశ్యాలను వివరించండి.
2. కృదంత ప్రాతిపదికలను, తద్ధిత ప్రాతిపదికలను ద్రావిడ భాషలను ఆధారం చేసికొని సోదాహరణంగా వివరించండి.
3. ధాతువులలో దీర్ఘాచ్చులు హ్రస్వాచ్చులుగానూ ద్విరుక్త హల్లులు అద్విరుక్త హల్లులుగా మారడాన్ని ద్రావిడ భాషల ఆధారంగా చెప్పండి.

**ఉపయుక్త గ్రంథ సూచిక :**


1. కృష్ణమూర్తి - భద్రిరాజు, 'తెలుగు వెర్బల్ బేసిస్', యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా ప్రెస్, బర్కిలి, లాస్‌ఏంజిల్, యు.ఎస్.ఏ, 1961.
2. సుబ్రహ్మణ్యం, పి.ఎస్. ద్రావిడ భాషలు, శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, పబ్లిక్ గార్డెన్స్, నాంపల్లి, హైదరాబాద్ - 4, 1997.
3. జోగి సోమయాజి, గంటి, ఆంధ్రభాషా వికాసము, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళా పరిషత్, విశాఖపట్నం-3, 1947.


-

పాఠం - 5

# నామవాచకం - నిర్మాణం - నామధాతువు - లింగం - వచనం - విభక్తి - పరప్రత్యయాల నిర్మాణం - చరిత్ర - ఔపవిభక్తులు

**విషయసూచిక :**

5.1. నామవాచకం
5.2. లింగం
5.3. వచనం
5.4. విభక్తులు
5.5. జీవ విభక్తులు
అభ్యాసం - 1
5.6. మాదిరి ప్రశ్నలు
5.7. ఆధార గ్రంథాలు

## 1. నామవాచకం :

వాక్యంలో కర్తగా కానీ, కర్మగా కానీ ప్రయోగించ దగిన శబ్దాలు నామవాచాకాలని స్థూలంగా చెప్పవచ్చు. సంఖ్యా వాచకాలు, సర్వనామాలు కూడా నామవాచకాలు అనే పెద్ద సముదాయంలో అంతర్విభాగాలే. ఇవి కాక క్రియల మీద కృత్ప్రత్యయాలు కార్చాటం వల్ల ఏర్పడిన కృదంతాలు కూడా నామవాచాకాల్లో ఒక విభాగం అవుతాయి. ద్రావిడ భాషల్లో నామవాచకం పద నిర్మాణం ఈ క్రింది విధంగా వుంటుంది.

ప్రాతి పదిక +
(బహువచనప్రత్యయం) +
(ఔపవిభక్తికం) +
(విభక్తి ప్రత్యయం / విభక్త్యర్థకశబ్దం)

నామప్రాతి పదికల్లో 'నీరు, కాలు, ఎద్దు, అన్న' మెదులైన శబ్దాలలా ఏక పదాలు గానే వుంటాయి. క్రియకి ఒక ప్రత్యయం చేర్చటం ద్వారా ఏర్పడిన నామ వాచకాలు కూడా అన్ని ద్రావిడ భాషల్లోనూ వుంటాయి. మనుమరాలు, వియ్యంకుడు, వియ్యంపురాలు మొదలైన శబ్దాల లాంటి లింగ ప్రత్యయాలు వున్న నామ ప్రాతిపదికలు కూడా అరుదుగా వున్నాయి. సాధారణంగా ద్రావిడ భాషల్లో ఒక నామవాచకం లింగం దాని అర్థాన్ని బట్టి తెలుస్తుంది. కాని అన్ని నామవాచకాలలోను లింగ సూచకమైన ప్రత్యయాలు వుండవు.

**1. మధ్య ద్రావిడ భాగలు:**

**1. తెలుగు:**

భావార్థక ప్రత్యయం: "ట"

చేయుట(చెయ్యడం)

చెప్పుట (చెప్పడం)

క: అలు, ఎఱుక, నడక, మూఁక, మొలక, రాక

ఇమి: కలిమి, ఓరిమి, కూరిమి, వ్రేలిమి,

**2. కొండ:**

ఉణ్: నేంజుణ్ "ఊపిరి" (నేంజ్ "ఊపిరిపీల్చు")

కు: మూల్కు 'మాత్రము' (మూల్ 'మాత్రమువిడుచు)

**3. కూయి:**

ఈభాషలో తుమున్నర్థకాలు నామవాచకాలుగా చాలా విరివిగా వాడబడతాయి

తిన్ బ 'తనడానికి ,తిండి

డూవ 'దున్నడానిక, దున్నడు

**4. పెంగో:**

కొండ్ -క్టేచ్కొండ్ 'కల'

కేర్కొండ్ -పాట,

**2. దక్షిణద్రావిడ భాగాలు :**

**1. తమిళం :**

భావార్థక ప్రత్యయంః ఆల్ తల్

కెటుతల్, కెటల్ 'చెడడం'

పిరితల్ 'విడినపోవడం'

పిఱత్తల్ 'పుట్టిడం'

కాత్తక 'రక్షించడం'

**కృత్ప్రత్యయాలు: ఇ:**

వెకుళి 'కోసం'

పు: చొప్పు 'పోలిక'

మాణ్డు: 'గొప్పతకు

ధాత్వచ్చుదీర్ఘమవడం: కేఱు 'చేఱు' (కెటు 'చెడు')
అంత్యస్పర్శం ద్విరుక్తమవడం ఎళుత్తు 'అక్షరం'

**2. మలయాళం:**

భావార్థక ప్రత్యయం : అల్ , చెయ్యల్ 'చెయ్యడం, కటకక్కల్ 'నడవడం'

**కృత్ప్రత్యయాలు :**

తల్ పాచ్చుక్ 'పరిగెత్తడం'
కెఱుతక 'చెడడం'
ధాత్వచ్చుదీర్ఘమవడం:
ఊణు 'భోఝనం' (ఉణ్ 'తిను')
అంత్యస్పర్శం ద్విరుక్తమవడం:
పొట్టు 'పాట' (పాటు 'పాడు')

**3. బ్రాహుయి :**

అ:చండ 'కదలిక' (చండ్-'కదులు')
స్: తిస్స్ 'దానం' (తిన్-ఇచ్చు)
ఖులీస్ 'భయం' (ఖుల్ -'భయపడు')

**2. లింగం :**

'లింగం' అనే సంస్కృత పదానికి సంకేతం, గుర్తు, చిహ్నంఅని అర్థం. ఆంగ్లంలో లింగం అనే పదాన్ని (GEnder) అని వ్యవహరిస్తారు. సంస్కృతంలో వున్న లింగ విధానానికి తెలుగు భాషలో వున్న లింగ విధానానికి చాలా తేడా వుండుటుంది. దానికి అర్థంతో సంబంధంలేదు. కాబట్టే ఒకే శబ్దం తటః తటేః తటం అని మూడు లింగాల్లో కనిపిస్తుంది. అంతేకాదు ఒకే అర్థంతో ఉండే వివిధ పదాలు వేర్వేరు లింగాలకు చెందినవిగా కూడా ఉండవచ్చు. ఉదాః దారా/పుంలింగం/భార్యా/స్త్రీలింగం/కళత్రమే/నపుంసక లింగం/.

**<u>ద్రావిడభాషలు :లింగభేదం :</u>**

ద్రావిడ భాషల్లోని లింగభేదం సహజమైన లింగ భేదానికి చాలా వరకు సన్నిహితంగా వుంటుంది. ఇండోయూరోపియన్ భాషలతో పోల్చి చూస్తే ఈ విషయం సుస్పష్టమవుతుంది. ఇండోయూరోపియన్ భాషల్లో వ్యాకరణ లింగానికీ సహజ లింగానికి అంతగా సంబంధం వుండదు. ద్రావిడ భాషల్లో జంతువుల్లో వున్న లింగభేదం వ్యాకరణంలో సూచితంకాదు.

ఉదా॥ ఆది ఎద్దు, ఆది ఆవు
ఎద్దు వచ్చింది, ఆవు వచ్చింది.

పై ఉదాహరణల వల్ల ద్రావిడభాషల్లో లింగభేదం సహజ లింగభేదానికి పూర్తిగా సమానంగా వుంటుందని మనం చెప్పలేం.

ద్రావిడ భాషల్లో నామవాచకం లింగాన్ని అనుసరించి దానితో సంబంధించిన సర్వనామంకానీ, సమాపక క్రియకానీ, అఖ్యాత సర్వనామంకానీ మారుతూ వుంటుండుది. నామవాచకం, లింగం దాని అర్థం వల్లే తెలుస్తుంది. సాధారణంగా నామవాచకంలో లింగ ప్రత్యయాలు వుండువు.

ఉదా॥ తెలుగులో తమ్ముడు, అల్లుడు, మనుమడు లాంటి కొన్ని పదాల్లో 'డు' ప్రత్యయం వుంది కానీ అన్న, తండ్రి, కొడుకు మొదలైన అనేక పదాల్లో లింగ ప్రత్యయంలేదు.

ఈ ఉదాహరణలో ఇచ్చిన పదాలన్నీ అర్థం ఆధారంగా మహత్తులుగానే పరిగణించ బడతాయి. అన్ని ద్రావిడ భాషల్లోనూ లింగ ప్రత్యయాలు వున్న నామవాచకాలు అల్ప సంఖ్యాకంగానే వున్నాయి.

దక్షిణ ద్రావిడ భాషలోని తోదలోనూ, ఉత్తర ద్రావిడ భాషలోని బ్రాహూయిలోనూ లింగం బేధంలేదు. మొత్తం ద్రావిడ భాషల్లో లింగభేదం కాని భాషలు ఈ రెండు భాషలే. మిగిలిన ద్రావిడ భాషల్లోని లింగభేదాల్ని ఆచార్య పి.యస్. సుబ్రహ్మణ్యంగారు నాలుగు రకాలుగా వర్గీకరించారు.

## 1. మొదటి రకం :

మహాత్ ఏ.ప /తమిళ -అపన్/ మనుష్య బహు.ప. /తమిళ -అవర్/
మహత్ ఏ.ప. /తమిళ -అవళ్/
అమహత్ ఏ.ప. /తమిళ -అతు/ అమహత్ బహు.ప./తమిళ.అవ్.అవై/

తమిళం, మలయాళం, కన్నడం, తుళు భాషల్లో ఈ రకమైన లింగభేదం వుంది. కోత, కొడగు భాషల్లో కూడా ఇలాంటి లింగభేదం వుంది కానీ ఈ భాషల్లో అమహత్తులో ఏక వచన బహువచన భేదం లేదు. అంటే కోత అద్, కొడుగు అదు, వీటికి అది, అవి అనే రెండు అర్థాలూ వస్తాయి.

తోదలో లింగభేదం పూర్తిగా నశించి 'అత్' అనే మాటకి వాడు, అమె, అది అనే మూడు అర్థాలూ, దాని బహువచనమైన 'అతామ్' అనే మాటకి వాళ్ళు, అవి అనే రెండు అర్థాలూ వస్తాయి. తోద సర్వనామ, నామవాచకాల్లో వచన భేదం వున్నా, క్రియల్లో మాత్రం ప్రథమ పురుషలో లింగవచన భేదంలేదని మనం తెలుసుకోవాలి.

## 2. రెండో రకం:

మహత్ ఏ.వ./తెలుగు-వాడు/ మనుష్య బ.వ. /తెలుగు -వారు/
అమహత్ ఏ.వ. /తెలుగు - అది /అమహత్ బ.వ. /తెలుగు -అవి/

తెలుగులో ఈ రకమైన లింగభేదం వుంది. ఉత్తర భాషలైన మాల్తో కరుఖ్ భాషల్లో ఇదే రకమైన లింగభేదం వుంది. అయితే వాటిలో అమహత్తులో ఏకవచన బహువచన భేదం లేదు. ఈ భేదం తప్ప తెలుగులో వున్న లింగభేదానికి వీటిలోగల లింగభేదానికి తేడా ఏమీ లేదు.

## 3. మూడో రకం:

మహత్ ఏ.వ. /గోండి - వోర్ / మహత్ బ.ప. /గోండి - వూర్/
అమహత్ ఏ.వ. /గోండి - అద్ / అమహత్ బ.ప / గోండి -అన్ /
ఈ రకమైన లింగభేదం తెలుగు, పెంగో, మండ, తప్ప మిగిలిన అన్ని ద్రావిడ భాషల్లోనూ వుంది.

**4. నాలుగో రకం:**

మహత్ ఏ.వ. /పెంగో -అవన్/ మహత్ బ.వ. /పెంగో -అవర్ /

మహతీ ఏ.వ. /పెంగో -అదెల్/ మహతీ బ.వ. /పెంగో - అవెక్/

అమహత్ ఏ.వ. /పెంగో -అది / అదజ్/ అమహత్ బ.వ. /పెంగో -అవజ్ /

పెంగో భాషలో ఈరకమైన లింగ భేదం వుంది.

పైన చెప్పిన నాలుగు రకాల లింగభేదాల్లో ఏది మూల ద్రావిడ భాషకి చెందినది అనే విషయంలో భాషా పండితుల్లో భిన్నాభిప్రాయాలు చోటుచేసుకున్నాయి. ఆచార్య పియస్. సుబ్రహ్మణ్యం నాలుగు రకాలైన లింగభేదాల్లో తెలుగు, మాల్తో, కరుఖ్, భాషల్లో వున్న లింగ భేదమే మూలద్రావిడ భాషలో వుండేదని అభిప్రాయపడ్డారు.

## 1. మధ్య ద్రావిడ భాషలు

**1. తెలుగు:**

లింగం
- i. మహత్ /పురుష వాచకం /
- ii అమహత్
  - 1. స్త్రీలు
  - 2. తిర్యక్కులు
  - 3. జడ వాచకాలు

తెలుగులో లింగం రెండు రకాలు. ఒకటి మహద్వాచకం రెండు అమహద్వాచకం ఈ విభాగం అర్థాన్ని అనుసరించి చేసింది. 'స్త్రీ తిర్యగడభిన్నంబులును వాని విశేషణంబులును మహత్తులనంబడు' /బాల. త. సూ. 17/ ఉదా॥ సోముడు, భీముడు, రాముడు, మహత్తుల విశేషణాలు కూడా మహత్తులు అవుతాయి. మనోహరుడు సోముడు అనేటప్పుడు సోముడు మహద్వాచకం. ఎందుకంటే స్త్రీ తిర్యగ్జడములు బోధించు పదం కాదు కాబట్టి దీని విశేషణం మనోహరుడు. అంటే మనోహరుడు అనేది మహద్వాచకం అన్న మాట. మొత్తం మీద పురుషుల్ని తెలిపే పదాలు మహద్వాచకాలు. స్త్రీలను తిర్యక్కుల్ని /పశు పక్ష్యాదులు/ జడవాచకాల్ని / అచేతనాలు/ బోధించే పదాలు వాని విశేషణాలు అమహద్వాచకాలు ఉదా॥ జానకి అందమైంది. రాధ చదువుకుంది. స్త్రీలను తెలిపే పదాల్ని తెలుగులో మహతీ వాచకాలని ప్రత్యేకంగా పిలుస్తారు. స్త్రీలను గూర్చి తెలిపేది అమహద్వాచకంలో వున్నాయి. కాబట్టి మహతీ వాచకం, అమహద్వాచకంలో అంతర్భాగం అన్న విషయం మనం మరచిపోకూడదు. కుక్క వస్తున్నది / అమహత్/ సీత వస్తున్నది / మహతీ / ఏక వచనంలో అమహత్తులకు, మహతీ వాచకాలకు తేడాలేదు.

ఉదా॥ అన్న - మహద్వాచకం
ఆవు - అమహద్వాచకం
అమ్మ - మహతీవాచకం

తెలుగులో ఏకవచనంలో తమిళంలో లాగ ఆణ్‌పాల్, పెణ్‌పాల్ అనే వర్గీకరణలేదు. అంటే స్త్రీ, పశు, పక్షి జడ వాచకాల్లో పరస్పర భేదక సంజ్ఞ లేదన్న మాట. అందువల్ల తెలుగు భాషల్లో ఈ కింది వాడుక రూపాలు చోటుచేసుకున్నాయి.

ఉదా॥ గీతి మంచిది /అమహత్తు - స్త్రీవాచి/

గుఱ్ఱం మంచిది /అమహత్తు - పశువాచి/
చెట్టు మంచిది /అమహత్తు - జడవాచి/

**తెలుగులో లింగ నిర్ణయం - పద్ధతులు :**

నామ పదాలు స్వరూపాన్నిబట్టి కానీ, వాక్యంలో వాటికి ఇతర పదాలతో గల అన్వయాన్ని బట్టి కానీ ఒక భాషలో వున్న లింగ భేదాన్ని నిర్ణయించవచ్చు. తెలుగుభాషలో లింగాల్ని అర్థాన్నిబట్టికానీ, వాక్యాన్ని బట్టిగానీ నిర్ధారించవచ్చు. వాక్యగతంగా నిర్దేశాత్మక సర్వనామాల్లో కనిపించే భేదాన్ని బట్టి, సమాపక క్రియలు, సంఖ్యావాచక విశేషణాలు, క్రియాజన్య విశేషణాలు ఇతర విధేయ విశేషణాల్లో కనిపించే సర్వనామ నిర్దేశాన్ని బట్టి లింగ భేదాన్ని తెలుసుకోవచ్చు. బాగా పరిశీలిస్తే తెలుగులో లింగ నిర్ణయం చేయడానికి కొన్ని నియమనిబంధనాలు వున్నాయి.

ఎ. పదాలు - స్త్రీ పురుష లింగ భేదం
బి. ప్రత్యయాలు - లింగ బోధకత్వం
సి. లింగబోధక ప్రత్యయంలేనివి.

**ఎ. పదాలు - స్త్రీ పురుష లింగ భేదం :**

**1. పుంలింగాల్ని తెలిపేవి :**

1. ఆడమగ మొదలైన పదాలు చేర్చి స్త్రీ పురుష భేదాల్ని తెల్పడం.
ఉదా॥ ఆడమనిషి, ఆడ ఏనుగు, మగ మనిషి, మగ ఏనుగు

11. పురుష వాచకాలైన అన్న , అయ్య, పుంజు మొదలైన పదాలు చేర్చి లింగభేదాన్ని తెలియజేయడం.
ఉదా॥ సింగన్న, దేవయ్య కోడి పుంజు.

**2. స్త్రీ లింగాల్ని తెలిపేవి :**

స్త్రీ వాచకాలైన అక్క అమ్మ, పెట్ట మొదలైన పదాలు చేర్చి లింగ భేదాన్ని చెప్పడం.
ఉదా॥ స్వర్ణక్క, రాములమ్మ, కోడిపెట్ట.

**3. ఉభయ లింగాల్ని తెలిపేవి :**

1. అమ్మ, అప్ప, అయ్య మొదలైన పదాలు ఉభయ లింగాల్ని తెలియజేస్తాయి.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | పురుషులు | - | స్త్రీలు |
| | నాయడమ్మ | - | సరసమ్మ |
| | దోణప్ప | - | సీతప్ప |
| | మావయ్య | - | అత్తయ్య |

**బి. ప్రత్యయాలు - లింగ భోధకత్వం :**

తెలుగులో పదాలకు కొన్ని ప్రత్యయాలు చేరడంవల్ల లింగబోధకత్వం జరుగుతుంది.

## 1. పుంలింగాల్ని తెలిపేవి:

1. కాఁడు , గాఁడు, ఈఁడు, వాఁడు, మొదలైనవి తద్ధిత ప్రత్యయాలు.

ఈ ప్రత్యయాలు కొన్ని పదాలకు చేరి పుంలింగాల్ని తెలియజేస్తాయి.

ఉదా॥ ఆటకాడు, అందగాడు, కొండీడు, మాయలవాడు

అ. 1. డుజ్వర్ణకం /డు,ండు/ప్రత్యయం పుంస్త్వబోధకం

ఉదా॥రాముండు, రాముడు

11. ఈప్రత్యయం అప్పుడప్పుడు తిర్యగ్జడాల్ని కూడా తెలుపుతుంది.

ఉదా॥పులియుడ /కుక్క/

గిజిగాడు /పక్షి/

పొర్లుగాడు /చెట్టు/

## 2. స్త్రీలింగాల్ని తెలిపేవి :

1.కత్తె /కత్తెయ, త, ఆడి, అది / ది, అలు / ఆలు మొదలైనవి స్త్రీవాచక తద్ధిత ప్రత్యయాలు.

ఉదా॥ పనికత్తె, బోయత, కొఱవత, కులుకులాడి, ఆడది, మఱదలు, పేదరాలు.

11. 'ఇ' ప్రత్యయం స్త్రీ వాచక తద్ధిత ప్రత్యయం. 'ఇ' ప్రత్యయం ఆదిలో కూడా వుంటుంది.

ఉదా॥ ఓయారి, మిటారి, గడలాడి, వగలమారి.

## 3. ఉభయలింగాల్ని తెలిపేవి :

1. అరి, పోతు మొదలైన తద్ధిత ప్రత్యయాలు ఉభయలింగ బోధకాలు.

ఉదా॥ జాలరి, కంచరి, ఒఱపరి, తిండిపోతు, తాగుబోతు, పొగరబోతు.

## సి. లింగబోధక ప్రత్యయంలేనివి :

1. పురుషుల్ని తెలపేవి /మహత్తులు/ :

ఉదా॥ నాన్న, అన్న, అయ్య, తాతయ్య, పెనిమిటి, కొడుకు, మనుమడు మొ॥

2. స్త్రీలను తెలిపేవి /మహతీ వాచకాలు/ :

ఉదా॥ అక్క, అమ్మ, అప్ప, తల్లి, చెల్లి, కోడలు, పెళ్లాం, మరదలు మొ॥

3. అమహత్తు జడ తిర్యక్కుల్ని తెలిపేవి :

ఉదా॥ మొక్క, మాను.

మూల ద్రావిడ భాషల్లో లింగబోధక ప్రణాళిక లేనప్పటికీ భాషా క్రమంలో స్త్రీ పురుష సామాన్య వాచకాలైన పదాలు నామవాచకాలకు ముందు వెనుకల చేరి లింగబోధకాలయ్యాయి. ఆ పదాలే కాలక్రమంలో ప్రత్యయాలయ్యాయి. ఈ రీతీగా ద్రావిడ భాషల్లో లింగబోధక ప్రణాళిక ఏర్పడింది.

## II. మధ్య ద్రావిడ భాషలు:

### 1. తమిళం :

ద్రావిడ భాషల్లో లింగ భేదం నిర్దేశాత్మక సర్వనామాల్లో సమాపక క్రియల్లో, క్రియాజన్య విశేషణాల్లో కన్పిస్తుంది. ద్రావిడ భాషల్లో లింగ వివక్ష అర్థాన్ని ఆశ్రయించి వుంటుంది. ఇందులో శబ్దానికి ఎటువంటి ప్రాధాన్యముండదు. మొత్తం ద్రావిడ భాషలన్నింటిలోనూ ప్రధానంగా రెండు రకాలైన లింగభేదం కనిపిస్తుంది.

లింగం
- 1. ఉయర్‌తిణై
  - 1. ఏకవచనం
    - 1. అణ్‌పాల్ /పురుష వాచకాలు/
    - 2. పెణ్‌పాల్ /స్త్రీ వాచకాలు /
  - 2. బహువచనం
    - పలర్‌పాల్
- 2. అఫ్టిణై

తమిళంలో లింగం రెండు రకాలు. 1. ఉయర్‌తిణై , 2. అఫ్టిణై ఉయర్‌తిణై అంటే ఉన్నతి జాతి. మనుష్యుల్ని , దేవతల్ని, నరలోక వాసుల్ని తెలిపేది. అఫ్టిణై / ఆర్ + తిణై/ అంటే అది కాని జాతి అని అర్థం. జీవం వున్నా లేకపోయినా తక్కినవన్నీ ఇందులోకి వస్తాయి. ఇందులో లింగభేదం వుండదు.

ఉయర్‌తిణై మరల ఏకవచనం, బహువచనం అని రెండు విధాలు. ఏకవచనంలో అణ్‌పాల్, పెణ్‌పాల్ అనే భేదం వుంది. బహువచనంలో పలర్‌పాల్ అనే ఒకే ఒక భేదం. మాత్రమే వుంది. పలర్ పాల్ పదాల చివరలో 'ర్' వర్ణం /అవర్/ వుంటుంది. అణ్‌పాల్ పదాల చివరిలో 'స' వర్ణం /అవన్- అతడు/ పెణ్‌పాల్ పదాల చివరిలో 'ళ్' వర్ణం /ఆళ్ - ఆమ్/ చేరుతాయి.
వర్ణం /ఆళ్ - ఆమ్/ చేరుతాయి.

తోడ, బ్రాహుయి భాషల్లో నేటికీ లింగబోధక ప్రత్యయాలు లేవు.

### 3. వచనం: ఏకవచనం - బహువచనం :

వచనం (Number) చెప్పటం, ఒక వ్యక్తినిగానీ, ఒక వస్తువుగానీ బోధించేది ఏకవచనం. ఉదా॥ రాముడు , బాలుడు, పుస్తకం, పర్వతం, నది. ఒకటి కంటె ఎక్కువ మంది వ్యక్తుల్నిగానీ, వస్తువుల్నిగానీ బోధించేది బహువచనం.
ఉదా॥ రాములు, బాలురు, పుస్తకాలు, పర్వతాలు, నదులు.

సంస్కృతంలో వున్న వచన ప్రణాళికా విధానికి తెలుగోలో వున్న వచన ప్రణాళికా విధానానికి చాలా తేడా వుంది. అయితే ద్రావిడ భాషల్లో వున్న వచన విధానానికి తెలుగులో వున్న వచన విధానానికి దగ్గర సంబంధం వుంది. దీనిని ప్రతీ నామవాచకం ఏదో ఒక లింగాన్ని కానీ, వచనాన్ని విభక్తినికానీ తప్పనిసరిగా కలిగి వుండి వాక్యం ప్రయోగించబడుతుంది.

## 1. మధ్య ద్రావిడ భాషలు :

### 1. తెలుగు :

తెలుగులో వచనం రెండు రకాలు. ఒకటి ఏకవచనం రెండు బహువచనం. తెలుగులో వచనం మహత్, అమహత్ భేదాల్ని ఆశ్రయించి వుంటుంది. పురుష బోధకాలు మహత్తులు. మిగిలిన స్త్రీ తిర్యగ్జడ వాచకాలన్నీ అమహత్తులు. అమహత్తుల్లో స్త్రీ వాచకాన్ని తెలియజేయునది మహతీవాచకం. ఈ మహతీ వాచకం ఏకవచనంలో అమహత్తులతోనూ బహువచనంలో మహత్తులతోనూ వుంటుంది.

ప్రాచీనకాలంలో మహద్బహు వచనానికి ఒక ప్రత్యయం, అమహద్బహు వచనానికి మరో ప్రత్యయం వుండేది. మహద్బహు వచనానికి 'అర్' , అమహద్బహువచనానికి 'కళ్' అనే ప్రత్యయాలు చేరేవి. క్రమక్రమంగా అమహద్బహు వచన ప్రత్యయమైన 'కళ్' లు ప్రత్యయంగా మారింది.

జడవాచకాలైన నామ పదాలకు బహువచన ప్రత్యయం అవసరకంలేదని 'తోల్ కాప్పియం' లో చెప్పబడింది.

ఉదా॥ మూడు వందన /పశువులు వచ్చినవి/

మూల ద్రావిడ భాషాలక్షణ అవశేషాలు ఇప్పటికీ తెలుగులో అక్కడక్కడ కన్పిస్తున్నాయి.

ఉదా॥ వంద ఎకరం, నూరు గడప, లక్ష జనం

పై ఉదాహరణాల్లో బహువచన ప్రత్యయం లేకుండగానే ఉపయోగిస్తారు.

తెలుగు వచనంలో మరో విలక్షణ విశిష్ట విశేష లక్షణంచోటుచేసుకుంది. అమహద్బహు వచన కర్తకు ఏకవచన క్రియ ఉపయోగిస్తారు.

| | | |
|---|---|---|
| ఉదా॥ | వంద విస్తరి వేశారు | చిలుకలు పలికింది |
| | నూరు ఆకు తెచ్చారు | చెట్లు పడింది |
| | ఏభై మేక కొన్నాడు | వేయి విస్తరిలేచింది |
| | వందకాయ ఊరగాయ | వేయి గడప వుంది. |

## 1. డు- ము - వు - ఏకవచనం :

తెలుగు భాషలో డు, ము, వు ఈ మూడూ ఏకవచన ప్రత్యయాలు. 'లు'
బహువచన ప్రత్యయం. ఏక వచనానికి చివర సాధారణంగా డు, ము, వు అనే ప్రత్యయాల్లో ఒకటి చేరుతుంది.

ఉదా॥ రాముడు, వృక్షము, ధేనువు.

### 1. 'డు' :

మూల ద్రావిడ భాషలోని 'అన్' అనే దాని మీద క్రమంగా 'రు' అనే బహు వచన ప్రత్యయం చేరింది. ఆ రేఫంకాల గమనంలో /మూర్ధన్యాక్షరం, ఊష్మత నుండి స్పర్శతను పొంది / 'డ' వర్ణంగా మార్పు చెంది పిదప 'డు' వర్ణంగా మారింది ఈ 'డు' వర్ణం బిందుపూర్వకం కావడం వల్ల దీని పూర్వ రూపం 'అన్' తఅని తెలుస్తుంది.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | రామన్ + రు రామన్టు | రామణ్ణు | |
| | రామండు | రాముడు | కృష్ణుడు |

**11. ము - వు :**

ము, వల రెండింటికీ మూలరూపం 'పు' కాల గమనంలో 'పు' మార్పు చెంది నాదత పొంది 'బు' వర్ణంగా మారింది. పిదప పిదప ఇందులో ఇందులో అనునాసిక్యం చోటు చేసుకుంది. ప్రాచీన శాసనాల్లో ఈ మార్పు మనకు స్పష్టంగా కనబడుతుంది. ఇందులో అనునాసిక్యం చోటు చేసుకుంది. ప్రాచీన శాసనాల్లో ఈ మార్పు మనకు స్పష్టంగా కనబడుతుంది. ఇందలి 'బు' వర్ణమే 'ఉ' కారాంత పదాల్లో 'వు' వర్ణంగా మార్పు చెందింది.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | శాసనపు | శాసనబు | శాసనంబ్బు |
| | శాసనము | వృక్షము | ధనము |

తెలుగు భాషలో మాత్రం పు వు గా మారండం తత్సమ పదాల మీద మాత్రమే కనబడుతుంది. కన్నడంలో అకారాంతాల మీద 'వు' వర్ణకం కనబడుతుంది.

## నిత్య ఏకవచనాలు :

సస్య, లోహ సంభార వాచకాలూ, ద్రవ్య, సదృశ వాచకాలు, అక్కడాదులు కొన్ని సర్వనామాలు నిత్యైక వచనాంతాలు.

**1. కొన్ని పదాలు:**

కొన్ని పదాలకు డు, ము, వు ప్రత్యయాలు చేరవు. అయినప్పటికీ ఆ పదాలు ఏకత్వ బోధకాలు కావడం చేత వాటిని ఏకవచన పదాలుగానే వ్యవహరిస్తారు.

ఉదా॥ హరి, గిరి, సీత, అన్న, అక్క, గోడ, మేడ, చరిత్ర మొ॥

**2. సస్య వాచకాలు :**

పంటల్ని తెలియజేసేవి సస్యవాచకాలు.

ఉదా॥ వరి, చోడి, జొన్న, రాగి, కంది, పెసర, మినుము మొ॥

**3. లోహ వాచకాలు :**

ఉదా॥ బంగారం, వెండి, కంచు, ఇత్తడి, రాగి, సీసం, ఇనుం మొ॥

**4. సంభార వాచకాలు :**

పాక సామగ్రిని తెల్పే పదాలు సంభార వాచకాలు.

ఉదా॥ చింతపండు, నూనె, నేయి.

**5. ద్రవ్య వాచకాలు :**

ద్రవ్యం అంటే పదార్థం. బియ్యం అనేది ద్రవ్యవాచకం. దీనికి బహువచనం కాదు.

**6. సదృశ వాచకాలు :**

సదృశం అంటే సమానం. సదృశం అనే అర్థాన్ని తెలియజేసే పదాలు సదృశ వాచకాలు

ఉదా॥ ఈడు, ఎన, సరి, సాటి మొ॥

**7. అక్కడాదులు :**

అక్కడ, ఇక్కడ, ఎక్కడ, అచ్చట, ఇచ్చట, ఎచ్చట, అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడు మొ॥

**8. కొన్ని సర్వనామాలు :**

రెండు, మూడు, పెక్కు, అన్ని, ఇన్ని, మున్నగు సర్వనామాలు బహుత్వబోధకాలు అయినప్పటికీ ఏక వచనంగానే పరిగణించబడతాయి.

**9. విశేష్యం, విశేషణం ఒకే వచనంలో వుండడం సర్వసాధారణం :**

ఉదా॥ వాడు బాలుడు, వారు బాలురు.

**10. స్త్రీ సమములైన విశేషణాల మగంత విశేషణాల బహువచనానికి ఏకవచనం వస్తుంది.**

ఉదా॥ మాటలు పెక్కులేల - మాటలు పెక్కేల
కులిశధారలు కుంలితములయ్యె -
కులిశధారలు కుంలితమయ్యె
ఇష్టములగు పదార్థములు -
ఇష్టమగు పదార్థములు
సరసములగు మాటలు -
సరసమగు మాటలు

**2. లు, బహువచనం :**

'లు' వర్ణం బహువచనం . ఇది ప్రాచీన శాసనాల్లో ల్, ళ్, ళు అనే రూపాలతో కన్పిస్తుంది. మరికొన్ని చోట్ల కళ్, కళు కళ్, గళ్, గళు, కొళ్, కొళు అనే రూపాంతరాలు కన్పిస్తున్నాయి.

చాలా ప్రాచీన కాలం నుంచి అమహద్బహువచనంగా వున్న 'కళ్' క్రమంగా మహత్తుల మీదకి వ్యాపించి అనుచిత విభాగం కొన్నిచోట్ల పొందింది.

ఉదా॥ ఈఁం + గళ్ ఈఁంగళ్ ఈఁగ + లు
మరికొన్ని చోట్ల 'క' కార లోపం వల్ల కూడా ఏర్పడింది.

ఉదా॥ పండితర్ + కళ్ + పండితాళ్
పండితు +లు - పండితులు

కాలగమనంలో ఈ 'ళ' కారం 'ల' కారంగా మార్పు చెందింది. అయినప్పటికీ కొన్నిచోట్ల తెలుగలో 'ళ, వర్ణం కనిపిస్తుంది.
ఉదా॥ ఊళ్లు, గోళ్లు, వేళ్లు,

**నిత్యబహువచనాలు :**

**1. ధాన్య వాచకాలు :**

ఆళ్లు, చోళ్లు, వడ్లు, కందులు, పెసలు, జొన్నలు, గోధుమలు మొదలైనవి ధాన్య వాచకాలు నిత్యబహువచనాలు.

**2. క్రీడా విశేషాలు:**

గొబ్బిళ్లు, గుజ్జనగూళ్లు, అచ్చన గాయలు , ఓమనగుంటలు, దాగిలిమూతలు, వన్నెల కుప్ప మొదలైన క్రీడా విశేషాలు నిత్య బహువచనాలు.

**3. గౌరవవాచకాలు :**

'పూజ్యత' అనే అర్థంలో ఏకవచనానికి బదులుగా బహువచనాన్ని వాడుతారు.

ఉదా॥ ఈయన మా ఉపాధ్యాయుడు
వీరు మా ఉపాధ్యాయులు
స్వామి । దయచేయండి

'పూజ్యత' అనే అర్థంలో ఆత్మార్థక బహువచనం యుష్మదర్థానికి బదులుగా వాడుతారు.
తమరెప్పుడు దయచేశారు
తమ రాకతో మా గృహం పావనమైంది.

**4. సంబంధ బాంధవ్యాలు :**

సంబంధ బాందావ్యాల్ని తెలయచేసినప్పుడు బహువచనాన్ని ఉపయోగిస్తారు.

ఉదా॥ ఇది మా ఇల్లు
వీరు మా నాన్నగారు
మీ యూరేది

**5. ప్రశ్నార్థకాలు / అజ్ఞాత ప్రశ్నలు/ :**

అజ్ఞాత ప్రశ్న చేసినప్పుడు ఏక వచనానికి బదులుగా బహువచనం వాడడం జరుగుతుంది.
వచ్చినవారెవరు ?
వచ్చినవారు పురుషులా ? స్త్రీలా ?

**6. సర్వనామాలు :**

కొన్ని సర్వనామాలు నిత్యబహువచనాంతాలై వుంటాయి. ఇద్దరు, ముగ్గురు, పలువురు, పెక్కురు, అందరు, కొందరు మొదలైనవి.

**7. ఇతర పదాలు :**

కురులు, మిణుగురులు మొదలైనవి బహువచనాలుగానే ఉపయోగించబడతాయి. అంటే దీనికి ఏకవచనంలో ప్రయోగం లేదని అర్థం. మిణుగురు బుర్వు అని సమాజంలో ఏకత్వ బోధకమై వుంటుంది. ఇచ్చట ఆక్షేపంలేదు.

2. గోండి :

పురుష వాచకాల్లో బహువచన ప్రత్యయ రూపాలు ర్, ఉుర్, ఈుర్, ఈుర్, 'ర్' ఈకారాంతాల్లోనూ 'ఉుర్' ఏ లేక ఆల్ తో అంతమయ్యే వాటిలోనూ వస్తుంది.

| | | |
|---|---|---|
| కాండీర్ | - | అబ్బాయిలు |
| కల్లీ | - | దొంగలు |
| అక్కూర్ | - | తల్లియొక్క తండ్రులు |
| మామాలీర్ | - | మామయ్యలు |

పురుషేతర నామవాచకాల్లో బహువచనానికి క్, జ్ /ంగ్/ అనే రెండు రూపాలు వున్నాయి.

'క్' కొన్ని అజంత నామ వాచకాల్లో వస్తుంది. ఇది హలంత నామాల్లో నియతంగా వస్తుంది.

| | | |
|---|---|---|
| మరాక్ | - | చెట్లు |
| అజీక్ | - | తండ్రి తల్లులు |
| అతీక్ | - | అత్తలు |
| కాయాజ్ | - | కాయలు |
| కోందాజ్ | - | ఎడ్లు |
| పిట్టేజో | - | పిట్టలు |

**3. కువి:**

పురుష వాచక బహువచన ప్రత్యయం 'రి'.

| | | |
|---|---|---|
| కొకరి | - | అబ్బాయి |

స్త్రీ వాచకాల్లో బహువచన ప్రత్యయం 'స్క'.

| | | |
|---|---|---|
| అయస్క/బయనిక | - | ఆడవాళ్లు |

అమనుష్య వాచకాల్లో బహువచన ప్రత్యయ రూపాలు 'క', 'జ' /ంగ/.
సాధారణంగా 'క' హలంతాలు తర్వాత వస్తుంది.

| | | |
|---|---|---|
| పల్క | - | పళ్లు |
| కణ్క | - | కళ్లు |

'జు' /ంగ/ అజంతాల తర్వాత వస్తుంది.

| | | |
|---|---|---|
| బుగ్గజు | - | బుగ్గలు |
| సెప్పుజు | - | చెప్పులు |
| కడ్వెజు | - | కడియాలు |
| మొకొజు | - | మొక్కలు |

## 2. దక్షిణ ద్రావిడ భాషలు

### 1. తమిళం :

లింగ భేదాన్ని అనుసరించి ద్రావిడ భాషల్లో వచన ప్రత్యయాలు వుంటాయి. తమిళంలో రెండు వచనాలు వున్నాయి. ఒకటి ఏకవచనం రెండు బహువచనం. తమిళంలో రెండు వచనాలు వున్నప్పటికీ వచన రూపాలు ఐదు భాగాలున్నాయి.

**1. తమిళంలో ఏక వచనం - రకాలు**

తమిళంలో ఏకవచనం మూడు రకాలు. అవి ఇవి -

1. పురుషవాచకాలు
2. స్త్రీ వాచకాలు
3. జడవాడచాలు

**2. తమిళంలో బహువచనం - రకాలు**

తమిళంలో బహువచనం రెండు రకాలు. అవి ఇవి -

I. మహన్నహతీ బహువచనం /పలర్‌పాల్ /

II. అమహత్ బహువచనం /పలపిన్‌పాల్/

తమిళభాషలో లింగానిక వచనానికి తేడా లేదు. ఒకే ప్రత్యయం అటు లింగాన్ని ఇటు వచనాన్ని తెలయజేస్తుంది. మనుష్య వాచకాల /ఉయర్‌తిణై/ లో బహువచన ప్రత్యయాలు అర్ / ఆర్, ఓర్, ఇర్, మార్.

| | | |
|---|---|---|
| పాణర్ | - | పాటలు పాడేవారు |
| తాయర్ | - | తల్లులు |
| పార్‌ప్పార్ | - | బ్రాహ్మణులు |
| అటియోర్ | - | సేవకులు |
| ఇళైయోర్ | - | పడుచువాళ్లు |
| కేళిర్ | - | చుట్టాలు |
| పెంటర్ | - | స్త్రీలు |
| ఐయన్‌మార్ | - | అన్నలు |
| తోళియార్ | - | చెలికత్తెలు |

**2. మలయాళం :**

ఈ భాషలో మనుష్య వాచక బహువచన ప్రత్యయాలు 'ఆర్' , 'మార్'

| | | |
|---|---|---|
| మాతర్ | - | స్త్రీలు |
| తచ్చకమార్ | - | వడ్రంగులు |

అమనుష్య వాచకాలలోనూ, కొన్ని మనుష్య వాచకాల్లోనూ 'కళ్' ప్రత్యయం వుంది.

| | | |
|---|---|---|
| మరజ్ఞళ్ | - | చెట్లు |
| స్త్రీకళ్ | - | స్త్రీలు |

అచేతన నామవాచకాల్లో 'కళ్' వైకల్పికం. బహుత్వాన్ని సూచించే సంఖ్య వున్నప్పుడు అచేతన నామవాచకానికి ఈ ప్రత్యయాన్ని చేర్చనక్కరలేదు.

| | | |
|---|---|---|
| నాలుకల్లు/కళ | - | నాలుగు రాళ్లు |

**3. తొద :**

తొదలో అన్ని నామవాచకాల్లోనూ ప్రథమ పురుష సర్వనామాల్లోనూ బహువచన ప్రత్యయం 'ఆమ్'

| | | |
|---|---|---|
| ఆతామ్ | - | వారు, అవి |
| ఇరామ్ | - | గేదెలు |
| మొఖామ్ | - | అబ్బాయిలు |
| కూఖామ్ | - | అమ్మాయిలు |
| కొయామ్ | - | చేతులు |

**III. ఉత్తర ద్రావిడ భాషలు :**

**1. బ్రాహూయి :**

బ్రాహూయి భాషలో బహువచన ప్రత్యయం క్, ఆక్.

'క్' దీర్ఘాచ్చుకానీ, ఎయ్ కానీ చివరలోవున్న నామాల్లోనూ ట్, డ్, డ్, న్, మ్, ల్, ల్, ర్, స్; ష్, జ్, ఝు - ఈ హల్లుల్లో ఒక దానితో అంతమయ్యే నామాల్లోనూ వస్తుంది.

| | | |
|---|---|---|
| చాక్ | - | నోళ్ళు |
| దేక్ | - | రోజులు |
| ఉరాక్ | - | ఇళ్ళు |
| పూక్ | - | పురుగులు |

'ఆక్' మిగిలిన హల్లులతో  నామాల తర్వాత అకారాంతమైన నామాల తర్వాత వస్తుంది.

| | | |
|---|---|---|
| పుటాక్ | - | జుట్టు |
| పిడ్డాక్ | - | కడుపులు |
| తషూక్ | - | నిద్రలు |
| ఇరషూక్ | - | రొట్టెలు |

'ఆస్' అనే బహువచన ప్రత్యయం పేర్లకీ, సంబంధించిన వాచక పదాలకీ, చేర్చబడుతుంది. ఇది ఆ వ్యక్తినీ, ఆ వ్యక్తికి సంబంధించిన కుటుంబాన్నీ లేక సముదాయాన్నీ సూచిస్తుంది.

| | | |
|---|---|---|
| బాజ్‌ఖానాస్క్ | - | బాజ్ ఖానా ఆయన కుటుంబమూ |
| ఎమ్మషూస్క్ | - | తల్లి ఆమెకి సంబంధించిన వాళ్లూ |

**2. మాల్తో :**

మనుష్య వాచక బహువచన ప్రత్యయం 'ర్'

| | | |
|---|---|---|
| మలెర్ | - | మనుష్యులు |
| మస్సీర్ | - | స్త్రీలు |
| మగెర్ | - | అమ్మాయిలు |

ఈ భాషలో అమనుష్య వాచకాలకి బహువచన ప్రత్యయలేదు. అయితే బహుత్వాన్ని సూచించవలసి వచ్చేటప్పుడు 'గహ్ండి' అనే పదాన్ని నామవాచకానికి చేరుస్తారు.

బేడి గహ్ండిత్ - గొర్రెలు

'గొట్' అనే పదం చేర్చడం కూడా వుంది.

గొట్‌సియడెద్ - నక్కలన్నీ

**3. కురుఖ్ :**

మనుష్య వాచక బహువచన ప్రత్యయం 'అర్', 'ర్'

అలర్ - పురుషులు
ముక్కర్ - స్త్రీలు
పెల్లర్ - అమ్మాయిలు

మనుష్య సముదాయాన్ని సూచించడానికి 'గురియార్' అనే పదం వాడుతారు.

ఆలీ గురియార్ - భార్యలు
ఆలర్ గురియార్ - పురుషుల సముదాయం

బంధు వాచక పదాలకి 'బగ్గర్' చేరుస్తారు.

దాదాబగ్గర్ - అన్నలు

అమనుష్య వాచకాలకి బహువచన ప్రత్యయంలేదు. అయితే బహుత్వాన్ని సూచించ వలసివచ్చేటప్పుడు 'గుట్టీ' అనే పదాల్ని నామవాచకానికి చేరుస్తారు.

యన్‌గుట్టీ - చెట్లు
నెర్‌గుట్టీ - పాములు
అడ్డోగుట్టీ - ఎడ్లు

విషయాల్ని బాగా పరిశీలిస్తే ద్రావిడ భాషల్లో మనుష్య వాచకాలకీ ఒక బహువచన ప్రత్యయం, అమనుష్య వాచకాలకి ఒక బహువచన ప్రత్యయం వున్నాయిన తెలుస్తుంది.

**4. విభక్తులు :**

ఒక వాక్యంలో వేర్వేరు పదాలకు అన్వయాన్ని సాధించి పెట్టే ప్రత్యయాలు విభక్తులు సాధారణంగా విభక్తులు రెండు రకాలు. ఒకటి నామ విభక్తులు రెండు క్రియా విభక్తులు. ప్రాతి పదికలపై చేరేవి నామవిభక్తులు. ధాతువలపై చేరేవి క్రియా విభక్తులు.

నామవిభక్తుల్ని సంస్కృతంలో 'సుప్పులు' అంటారు. అవి చేరిన ప్రతిపదికల్ని 'సుబంతాలు' అంటారు. ఏదో ఒక విభక్తి చేరనిదే, లేదా చేరి లోపించనిదే సుబంతాలకు వాక్యంలో ప్రయోగంలేదు.

సంస్కృత విభక్తి ప్రత్యయాలకు తెలుగు విభక్తి ప్రత్యయాలకు ఎలాంటి పోలికలేదు. 'ప్రత్యయం ఇహ వర్ణకః' అని ప్రాచీనులు వ్యవహరించురని సూరిగారి వివరణ.

**ద్రావిడ భాషలు - విభక్తులు - విశిష్టత :**

**1. ప్రథమా విభక్తి :**

ద్రావిడ భాషలో ప్రాతిపదికమే ప్రథమా విభక్తిలో వుపయోగించబడుతుంది. తెలుగు వ్యాకర్తలు డు, ము, వు, లు, అనే నాలుగు ప్రత్యయాలు ప్రథమా విభక్తి ప్రత్యయాలు అని పేర్కొన్నారు. ఇందులో డు, ము, వు, ఈ మూడు ఏక వచనంలో వస్తాయి 'లు' బహువచనంలో వస్తుంది. ఉదా॥ రాముడు, వృక్షము, ధేనువు, నదులు. అయితే పైన చెప్పిన డు, ము, వు, లు అనేవి లింగవచన బోధకాలేకాని ప్రథమా విభక్తి ప్రత్యయాలు కావు.

**2: ద్వితీయా విభక్తి**

**1. మధ్య ద్రావిడ భాషలు :**

**1. తెలుగు :**

ని, ను, ల, కూర్చి, గురించి మొదలైనవి ద్వితీయా విభక్తి ప్రత్యయాలు. ద్వితీయా విభక్తి కర్మకు వస్తుంది. ధాతువు యొక్క అర్థమైన ఫలాన్ని ఆశ్రయించి కర్మ వుంటుంది. 'కర్మ' కు వస్తుంది. ధాతువు యొక్క అర్థమైన ఫలాన్ని ఆశ్రయించి కర్మ వుంటుంది.

**1. ను :**

ఇది ద్వితీయా విభక్తి ఏక వచన ప్రత్యయం. ఇది ద్రుతం కూడా ఇది కొన్ని ఎడల 'ని' వర్ణంగానూ కొన్ని ఎడల 'న' కారం 'న్' గానూ మారుతుంది. అందుచేతనే సూరి 'ను' వర్ణం, ద్వితీయ అని మాత్రమే చెప్పారు. ఇది సర్వనామరూపమైన నన్ - నన్ను అనే వాని సామ్యం వల్ల ఏర్పడింది. ఈ 'ను' అనేది ఇకారాంత పదాల తర్వాత చేరేటప్పుడు స్వర సామ్యాన్ని బట్టి 'ని' అయింది.

హరి + ను -హరిని.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | దండధరుడు | - | దండమును ధరించువాడు |
| | నెలతాల్పు | - | నెలను ధరించినవాడు |
| | నరపాలుడు | - | నరులను పాలించువాడు |

**II. కూర్చి :**

'కూడు' అనే ధాతువు యొక్క ప్రేరణ రూపం 'కూర్చు', 'కూర్చు' క్త్వార్థక రూపమే కూర్చి, 'కూర్చి' స్వతంత్ర్య పదం

ఉదా॥ పార్వతి శివుని గూర్చి తపస్సు చేసెను
రాముని గూర్చి వచ్చెను
ఇంటిని గూర్చి వెళ్ళెను

**III. గుఱించి:**

ద్వితీయా విభక్తిలో 'కూర్చి' అనే దానికి బదులుగా 'గుఱించి' అనేది కూడా ప్రయోగించబడుతుంది. 'కూర్చి' లోని 'క' కారం 'గ' కారంగా మారడంతో పాటు అనునాసికం కూడా చేరి 'గుఱించి' అనే రూపం ఏర్పడినట్లు భావించవచ్చు.

ఉదా॥ నిన్ను గుఱించి ఎదురు చూసితిని

2. గోండి : ఊన్

ఇది జౌప విభక నకారం తర్వాత లోపిస్తుంది

| | | |
|---|---|---|
| బయ్యేన్ | - | అమ్మని |
| కోందాతూన్ | - | ఎద్దుని |

**3. కొండ : జ్, జి**

ఈ భాషలో ద్వితీయ చతుర్థి, చతుర్థి ద్వితీయావిభక్తి అవుతుంది.

యుష్మదస్మదర్థకాలాల్లో 'జి' వస్తుంది.

| | | |
|---|---|---|
| సుక్డిదిజ్ | - | కుక్కని, కుక్కకి |
| నజి | - | నాకు |
| మిజి | - | మీకు |

**II. దక్షిణ ద్రావిడ భాషలు :**

**1. తమిళం :**

తమిళంలో 'ఐ' ప్రత్యయం

| | | |
|---|---|---|
| వేంతన్నై | - | రాజుని |
| ఎన్నై | - | నన్ను |

**2. మళయాలం :**

మలయాళంలో 'ఎ' ప్రత్యయం

| | | |
|---|---|---|
| అవనె | - | వాణ్ణి |

మళయాలంలో ప్రాచీన కాలంలో శాసనాల్లో 'ఐ' వుంది.

| | | | | |
|---|---|---|---|---|
| మగన్ | - | మగనె | - | కుమారుని |
| అవన్ | - | అవనె | - | వానిని |

**III. ఉత్తరం ద్రావిడ భాషలు :**

**1. బ్రాహుయీ : ఎ**

| | | | | |
|---|---|---|---|---|
| దుజ్జె | - | దొంగని | - | దొంగకి |
| మారె | - | కొడుకుని | - | కొడుకుకి |

ఇక్కడ ద్వితీయా విభక్తిచతుర్థీ విభక్తి కూడా అవుతుంది.

**2. మాల్తో : ఎన్ / ఇన్ / న్ / అ / న్/**

| | | |
|---|---|---|
| ఎంగన్ | - | నన్ను |
| మలెరిన్ | - | మనుష్యుల్ని |

| | | |
|---|---|---|
| కుబొాన్ | - | 'కుక్కని' |
| టూడ/న్/ | - | పులిని / టూడ్ / |

**3. కూడఖ్ / కురుఖ్ : అన్ / ఆన్ / ఇన్**

| | | |
|---|---|---|
| ఖెస్సన్ | - | వడ్లు |
| ఎంగన్ | - | 'నన్ను' |
| అడ్డాన్ | - | ఎద్దుని |
| ముక్కరిన్ | - | ముక్కరిన్ |

ఈ భాషలో ద్వితీయకు చతుర్థీ, చతుర్థీకి ద్వితీయా విభక్తి అవుతుంది.

**3 : తృతీయా విభక్తి :**

**I. మధ్య ద్రావిడ భాషలు :**

1. తెలుగు : చేతన్, చే, తోడన్, తో, అనే ఈ నాలుగు తృతీయా విభక్తి ప్రత్యయాలు.

**1. చేతన్ - చే :**

'చేత' అనేది 'చేయి' అనే పదం యొక్క తృతీయసప్తమ్యంతరూపం. 'చెయి' శబ్దానికి 'ఆన్' అనే స్థల వాచకమైన పదం చేర్చగా ఏర్పడిన రూపం కాబట్టి ఇది ద్రుతాంతమైంది. కాబట్టి చేతన్, చేన్ అనే రూపాలు వుంటాయి. చేత వర్ణకం కర్మార్థక వాక్యంలో కర్తకు అగుతుంది.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | విషయ సంపన్నుడు | - | విషయముల చేత సంపన్నుడు |
| | వాత్సల్య సంపూర్ణుడు | - | వాత్సల్యం చేత సంపూర్ణుడు |
| | కుసుమ శృంగారం | - | కుసుముల చేత శృంగారం |
| | రూపం మహనీయులు | - | రూపం చే మహనీయులు |
| | మంత్ర పూతం | - | మంత్రం చే పూతం |

**2. తోడ - తో :**

'తోడు' అనే పదం యొక్క విభక్త్యంత రూపం 'తోడ' . ఇది తోడు ధాతురూపం. 'తోడు' అంటే సంధించు, కలుపు అనే అర్థాలు వున్నాయి. తోడు అనే దానికి 'అన్' చేర్చగా వచ్చిన రూపం ఇది కాబట్టి ఇది ద్రుతాంతం. అంచేత తోడన్, తోన్ అనే రూపాలు వుంటాయి. సహార్థంలోనూ, తుల్యార్థంలోనూ 'తోడ' వర్ణకం వస్తుంది.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | నా సమానుడు | - | నా తోడి సమానుడు |
| | రవి సమానుడు | - | రవితోడి సమానుడు |
| | క్రోధ వచనములు | - | క్రోధము తోడి వచనములు |
| | దీపార్పితము | - | దీపములతో అర్పితము |
| | శక్తియుతము | - | శక్తితోయుతం |

మందారదామం - మందారములతో దామం

వెండినాణెములు - వెండితో నాణెములు

**2. గోండి :**

తృతీయకు సప్తమీ విభక్తి వస్తుంది.

కుయ్‌దే - చేతితో / లో

నాటే - ఊళ్లో

రూసీనే - కత్తులతో /తో

రోన్ - ఇంట్లో / ఇందులో 'ఏ' లోపిస్తుంది/

సహార్థకవిభక్త్యర్థం :

థోడో - వోని థోడో - వాడితో

**3. కొండ : అండ్**

తృతీయాకు పంచమీ విభక్తి వస్తుంది.

డుడుదండ్ - దుడ్డుతో

పనెదండ్ - దువ్వెనతో

దూరంతండ్ - దూరాన్నించి

నేఱండ్ - నేటి నుంచి

'ణి' అనే షష్ఠీ ప్రత్యయం చేరే స్థల కాలవాచి పదాల్లో పంచమీ విభక్తి ప్రత్యయం 'జ్' వస్తుంది.

అబెణిజ్ - అప్పటి నించి

ఇన్‌తోణిజ్ - ఇంట్లోనించి

సహార్థక ప్రత్యయం : వలె

మావలె - మాతో

## 2. దక్షిణ ద్రావిడ భాషలు :

### 1. తమిళం :

కరణార్థక ప్రత్యయాలు : ఆన్, ఆల్

మరుప్పినాన్ - తొండంతో

కైయాల్ - చేత్తో

సహార్థక ప్రత్యయాలు : ఒటు, ఓటు

పలియొటు / పులిమోటు - పులితో

**2. మలయాళం :**

కరణార్థకం - ఆల్

కైయల్ - చేత్తో

సహార్థకం - ఒటు / ఓటు

అవనోటు / అపవోటు - వాడితో

**3. కన్నడం :**

ఈ భాషల్లో తృతీయా, పంచమీ విభక్తులకు ఒకే ప్రత్యయం వుంటుంది.

కరణార్థకం - అపాదానార్థకం :

ప్రాచీనకాలంలో - ఇం - ఇందం - ఇందె

ఆధునిక కాలంలో - ఇంద

పూగళింహూవు గళంద - పువ్వులతో, పువ్వుల నించి

ఇదఱిందం / ఇదరింద - దీనితో, దీనినించి

సహార్థకం : ఒడనె

రామనొడనె - రాముడితో

నన్నొడనె - నాతో

యారొడనె - ఎవరితో

**III. ఉత్తర ద్రావిడ భాషలు :**

1. బ్రాహుయీ : కరణార్థకం - అటో

ఖరాసట్ - ఎద్దుతో

ఎట్టటో - కఱ్రతో

సహార్థకం - తా

మారతా - కుడుకుతో

2. మాల్తో : కరణార్థకం - ఎత్ / ఇత్ / త్

కీడెత్ - ఆకలివల్ల

టెటుత్ - చేత్తో

ఆమెత్ - నీళ్ళతో

మలెరిత్ - మనుషులతో

సహార్థకం : గుసన్ / గనే

నమ్‌గుసన్ - మనతో

**4. : చతుర్థీ విభక్తి :**

I. మధ్య ద్రావిడ భాషలు :

**1.** తెలుగు : **1.** కొఱకు :

కొఱకు, కయి రెండూ చతుర్థీ విభక్తి ప్రత్యయాలు. ఇందులో 'కొఱకు' ద్రుతాంతం. సంప్రదానానికి చతుర్థీ విభక్తి అవుతుంది. త్యాగోద్దేశ్యం సంప్రదానం. ఎవరిని ఉద్దేశించి త్యాగం చేయుటం జరుగుతుందో ఆ వ్యక్తి సంప్రదానం.

ఉదా॥ భోగమందిరం - భోగం కొరకు మందిరం
గురుదక్షిణ - గురువు కొరకు దక్షిణ
పెండ్లి కొడుకు - పెండ్లి కొరకు కొడుకు
కళ్యాణ వేదిక - కళ్యాణం కొరకు వేదిక

**2.** కై :

కు + అయి కయి కై. ఇది 'కయి' యొక్క రూపాంతరం. ఈ పదం కు +అయి - కయి అనే వాని కూడిక వల్ల కలిగింది. ఇది 'అగు' ధాతువు యొక్క క్త్వార్థకరూపం.

తపమునకై అడవికి వెళ్లెను
జ్ఞానమునకై అభ్యాసము చేయుచుండెను.

**2.** గోండి : క్ / కూన్

నాక్ / నాకూన్ - నాకు
మూరాత్క్ / మూరాత్కూన్ - ఆవుకి

**3.** కువి : కి

మ్డెహకి - పురుషుడికి

**II. దక్షిణ ద్రావిడ భాషలు :**

**1.** తమిళం : క్కు

ఎనక్కు - నాకు
వీట్టిఋక్కు / వీట్టుక్కు - ఇంటికి
అవఋక్కు / అవనుక్కు - వాడికి

**2.** మలయాళం : క్కు

కొటిక్కు - జండాకి
ఎనిక్కు - నాకు

తనిక్కు - తనకి
నముక్కు - మనకి

**3. కన్నడం : అ ఆకరం తార్వత ర్, తర్వాత క్కె, మిగిలిన చోట్ల గె.**

మరక్కె - చెట్టుకి
ఓలగక్కె - సభకి
అదర్కె/అదక్కె - దానికి
కవిగె - కవికి

**III. ఉత్తర ద్రావిడ భాషలు :**

**1. మాల్తో : క్, ఇక్**

ఇంగె - నాకు
మలెక్ - మనిషికి
ఖపిక్ - ఊరికి
డడెక్ - అడవికి
పొక్రిక్ - చెరువుకి

**2. కురుఖ్ : గే**

అస్గే - వాడికి
ఎంగాగే - నాకు

## 5. పంచమీ విభక్తి :

**I. తెలుగు :**

వలన, కంటె, పట్టి ఈ మూడు పంచమీ విభక్తి ప్రత్యయాలు. వలన కంటె రెండూ ద్రుతాంతాలు. పట్టి ద్వితీయాంత రూపానికి చేరుతుంది.

**1. వలన :**

'వలన' అంటే ప్రక్క దిక్కు అని అర్థం. 'వలను' కి బదులు 'వల్ల' అని కూడా ప్రయోగిస్తారు.

ఉదా॥ వలన వల్న వల్ల

భయాదులు దేనివల్ల కలుగుతాయో దానికి 'వలన' అనే ప్రత్యయం వస్తుంది. భయం, జుగుప్స, అలుపు, పరాకు, ఎరుగుట, తీసికొనుట, పుట్టుట, కాచుట, విరమించుట దాగుట, అడ్డుకొనుట, ఎడబాటు నొందుట మొదలైనవి భయాదులు.

ఉదా॥ భయం - చోరుని వలన భయం
జుగుప్స - పాపం వలన ఏవగించు

| | | |
|---|---|---|
| అలపు | - | అధ్యయనం వలన అలుపు |
| పరాకు | - | పాడివలన పరాకు పడెను |
| ఎరుగుట | - | ఈ అర్థం అతనివల్ల తెలిసింది |
| తీసుకొనుట | - | రాజు ప్రజల వలన కప్పం కొనును |
| పుట్టు | - | బ్రహ్మవలన మానవులు పుట్టిరి |
| కాచుట | - | శత్రువుల వలన ప్రజల కాచుట రాజధర్మం |
| విరమించుట | - | భోగాల వలన విరమించుట శ్రేయం |
| దాగుట | - | కృష్ణుడు తల్లివలన దాగెను |
| అడ్డుకొనుట | - | శోకం వలన అడ్డుకొనెను |
| ఎడబాటునొందుట | - | రాజ్యం వలన భ్రష్టుడయ్యెను. |

'వలన' కు బదులు 'ఉండి' కూడా వాడబడుతుంది.

ఉదా॥ భోగాల నుండి విరమించుట శ్రేయం.

ఒక్కోసారి 'వలన' అనే ప్రత్యయానికి ఉండి అనే పదం అను ప్రయక్తమగుతుంది.

ఉదా॥ బ్రహ్మమున నుండి మానవులు పుట్టిరి.

## II. కంటె :

కు + అంటెను - కంటెను అనే రూపం ఏర్పడుతుంది. నిర్ధారణంలోనూ, అన్యం మొదలైన పాదాలతోడి సంబంధంలోనూ 'కంటె' వర్ణకం వస్తుంది. అన్యం, ఇతరం, పూర్వం, పరం, ఉత్తరం మొదలైనవి అన్యాదులు.

ఉదా॥ మానహాని కంటె మరణం మేలు / నిర్ధారణం /
చైత్రుని కంటె మైత్రుడు గుణవంతుడు / నిర్ధారణం /
నీవు వచ్చు కంటె పూర్వమే యీతడు వచ్చెను / నిర్ధారణం /
రాముని కంటె నన్యుడు ధానష్కుడు లేడు / అన్యార్థం /

## III. పట్టి :

'పట్టి' అంటే గ్రహించు అని అర్థం. ఇది పట్టు ధాతువు యొక్క క్త్వార్థక రూపం. 'పట్టి' అనే ప్రత్యయం హేతువులైన గుణ క్రియలకు చేరుతుంది.

ఉదా॥ జ్ఞానమును పట్టి ముక్తడగును
నీవు చేయుటను 'పట్టి' వర్ణకం వస్తుంది.

హేత్వర్థంలో పట్టికి బదులు 'వలన' వర్ణకం వస్తుంది.

ఉదా॥ జ్ఞానం వలన ముక్తుడగును
నీవు చేయుట వలన ఇది పూర్తి అయినది.

**2. గోండి : ఆల్**

| | | |
|---|---|---|
| కుహీతాల్ | - | నూతి నుంచి |
| నాట్నాల్ | - | ఊరి నుంచి |

**3. కువి :**

| | |
|---|---|
| ఏకవచనంలో | - టి |
| బహువచనంలో | - కి |
| కడ్డటి | - నదినించి |
| కతడ్డజుకి | - నదుల నుంచి |

**II. దక్షిణ ద్రావిడ భాషలు :**

**1. తమిళం :**

| | | |
|---|---|---|
| ప్రాచీన భాషలో | - | ఇన్ |
| మలైయిన్ | - | కొండమీద నించి |
| వీట్టిన్ | - | ఇంటినించి |

ఆధునిక భాషలో సప్తమీ విభక్తి ప్రత్యయమైన 'ఇల్' కి ఇరుంతు 'ఉండి' అనే పదం చేరడం వల్ల అపాదానార్థం సూచించబడుతుంది.

ములైయి లిరుంతు, వీట్టిలిరుంతు.

**2. <u>మలయాళం</u> :**

| | | |
|---|---|---|
| ఇల్ + నిన్ను | - | నిలిచి |
| దిక్కిత్ నిన్ను | - | దిక్కునించి |
| అవిటెనిన్ను | - | అక్కడనించి |

**3. <u>తొద</u> : స్న్ / నిద్**

| | | |
|---|---|---|
| ఆస్నిద్ | - | ఇంటినించి |
| అత్స్న్ | - | అక్కడ నించి |

**III. ఉత్తర ద్రావి భాషలు:**

**1. <u>బ్రాహూయీ</u> : అన్**

| | | |
|---|---|---|
| ఉరమాన్ | - | ఇంటిలోనించి |
| తమాన్ | - | నిద్రలోనించి |

**2. మాల్తో :**

ఇంతె, ంతె

| | | |
|---|---|---|
| మలెంతె | - | మనిషినించి |
| మలెరింతె | - | మనుష్యులనించి |
| ఖపింతె | - | ఊరినించి |
| పల్లి -ంతె | - | కుండలోనించి |

**3. కురుఖ్ :**

| | | |
|---|---|---|
| పర్తతి | - | కొండమీద నించి |
| ఖాజ్‌తి | - | మట్టితో |

**6. షష్ఠి విభక్తి :**

**I. మధ్య ద్రావిడ భాషలు :**

**1. తెలుగు :**

కు, యొక్క లోప /కి, కు, యొక్క, లో, లోపల / అనే ఈ మూడు షష్ఠీ విభక్తి ప్రత్యయాలు. కు, లోపల అనే ఈ రెండూ ద్రుతాంతాలు. ఇకారం మీద, ఐకారం మీద వచ్చేటప్పుడు 'కు' వర్ణకం 'కి' అనే రూపాంతరం పొందుతుంది. లోపల అనేది వైకల్పికంగా ప్రథమా కారం శేషించటంచేత 'లో' అని అవుతుంది. లోన్, లోపలన్ అనేవి బహువచనంలో మారుతుంది. ఉపయుక్తమవుతాయి.

**1. కు- యొక్క**

సంబంధాన్ని తెలయచేసినప్పుడు కు, యొక్క అనే ప్రత్యయాలు వస్తాయి.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | ధరణినాధుడు | - | ధరణికి నాథుడు |
| | శ్రీవల్లభుడు | - | శ్రీ కి వల్లభుడు |
| | భూపతులు | - | భూమికి పతులు |
| | గుణనిధి | - | గుణములకు నిధి |
| | కంసవిరోధి | - | కంసునకు విరోధి |
| | దేశాధిపతులు | - | దేశమునకు అధిపతులు |
| | కోడికూత | - | కోడియొక్క కూత |
| | రాజకుమారులు | - | రాజుయొక్క కుమారులు |
| | ధర్మ సంస్థాపన | - | ధర్మంయొక్క సంస్థాపన |

**II. లో - లోపల :**

ఈ రెండూ స్వతంత్ర్య పదాలు. నిర్ధారణ షష్ఠికి 'లోపల' వర్ణం అవుతుంది. ఒక సముదాయం నుంచి ఏక దేశాన్ని వేరు పరచడం నిర్ధారణం. ఇటివంటి చోట్ల సముదాయ వాచకానికి 'లోపల' అనే ప్రత్యయం చేరుతుంది.

ఉదా॥ వధూమణి - వధువలలో మణి

భూసురోత్తములు - భూసురులలో ఉత్తములు

మానవుల లోపల శీలవంతుడు పూజ్యుడు గోవుల లోపల కపిల బహుక్షీర.

**2. గోండి : 'ఆ'**

యుష్మదస్మదార్థకాలంలో 'వా'

| | | |
|---|---|---|
| కుహీతాఏర్ | - | నూతినీళ్లు |
| కల్లేనామాల్ | - | దొంగడబ్బు |
| నావారోస్ | - | నా ఇల్లు |
| దూవానాన్ | - | మా ఊరు |

**3. కువి : 'ఇ'**

| | | |
|---|---|---|
| మ్డెహతి | - | పురుషుడి |
| కడ్డజుతి | - | నదుల యొక్క |

**II. దక్షిణ ద్రావిడ భాషలు :**

**1. తమిళం :**

ప్రాచీన తమిళంలో అతు, ఆతు, ఆ, ఉటై, ఉటైయ అనే ప్రత్యయాలు వున్నాయి. ఆధునిక తమిళంలో 'ఉటైయ' మాత్రమే వుంది.

| | | |
|---|---|---|
| ఇన్మైయతు | - | లేమియొక్క |
| తనాతు | - | తనయొక్క |
| వెరినతోల్ | - | వీపు చర్మం |

**2. మలయాళం :**

పదో శతాబ్ది శాసనాల్లో 'ఉటై' వుంది. తర్వాత కాలంలో 'ఉటైయ' వుంది. సాహిత్యంలోనూ ఆధునిక భాషల్లోనూ 'టె' న కారాంతాల తర్వాత మిలిగిన చోట్ల 'ఉటై' వస్తుంది. సాహిత్యంలో నకారాంతాల తర్వాత టె, ఉటెలు రెండూ వున్నాయి.

| | | |
|---|---|---|
| అవరుటె | - | వాళ్ళ |
| ఎన్టె /ఎన్నుటె | - | నా |
| నిన్టె /నిన్నుటె | - | నీ |

**3. కోత : ద్**

| | | |
|---|---|---|
| ఎంద్ | - | నా |
| నింద్ | - | నీ |
| మర్త్ద్ | - | చెట్టుయొక్క |

**III. ఉత్తర ద్రావిడ భాషలు :**

**1.** బ్రాహూయీ : నా, ఆ

| | | |
|---|---|---|
| ఖారాస్నా | - | ఎద్దుయొక్క |
| ఖారాస్తా | - | ఎద్లయొక్క |
| కనాఉల్లీ | - | నా గుర్రం |

**2.** మాల్తో : కి

| | | |
|---|---|---|
| టూడ్కి | - | పులియొక్క |
| తమ్‌కి | - | తమవాళ్ళు |

**3.** కురుఖ్ : గహి / హి

ఆల్‌గహి / ఆలస్‌హి - మనిషి యొక్క

అమనుష్య వాచకాలకి 'త' వస్తుంది.

పూప్‌తరజ్ - పువ్వురంగు

<u>7. సప్తమీ విభక్తి</u>

I. <u>మధ్య ద్రావిడ భాషలు</u> :

1. <u>**తెలుగు**</u> :

అందు, న అనే రెండూ సప్తమీ విభక్తి ప్రత్యయాలు. అందు ద్రుతాంతం కాగా 'ను' వర్ణం ద్రుతం. స్వతంత్ర పదాలు కూడా. అధికరణంలో సప్తమీవిభక్తి వస్తుంది. అధికరణమంటే ఆధారమని అర్థం.

**1.** <u>అందు</u> **:**

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | విద్యాప్రవీణత | - | విద్యయందలి ప్రవీణత |
| | రచనా చాతుర్యం | - | రచన యందలి చాతుర్యం |
| | మాట నేర్పరి | - | మాటల యందు నేర్పరి |

II. న :

'న' వర్ణం ఔపశ్లేషికంలోనూ వైషయికంలోనూ వస్తుంది.

ఉదా॥ 'ఘటమున జలమున్నది'

మోక్షమున నిచ్చ కలదు'

పై విషయాల్ని పరిశీలిస్తే విభక్తి ప్రత్యయాల్లో కొన్ని స్వతంత్ర్య ప్రయోగానికి అర్హమైనవి కొన్ని స్వతంత్ర్య ప్రయోగంలేనివి.

డు, ము, వు, లు, ని, ను, న, ల, కి, కు అనే పదింటినే ప్రత్యయాలుగా పేర్కొనవచ్చు. వీనికి స్వతంత్ర్య ప్రత్యేక ప్రయోగ ప్రయోగ యోగ్యతలేదు.

2. పెంగో : ఒ

| | | |
|---|---|---|
| గుడితో | - | పాకలో |
| టాండితో | - | కుండలో |
| నిపితో | - | బుజంమీద |

3. కువి : అ, బ

| | | |
|---|---|---|
| కడ్డత | - | నదిలో |
| ఇజా | - | ఇంట్లో |
| నాటా | - | ఊళ్ళో |

**II. దక్షిణ ద్రావిడ భాషలు :**

1. **తమిళం** : ఇన్, ఇల్

| | | |
|---|---|---|
| వీట్టిల్ | - | ఇంట్లో |
| ఊరిల్ | - | ఊళ్లో |
| ఇరనిన్ | - | రాత్రి |
| కననిన్ | - | కలెలో |

2. **మలయాళం** : ఇల్

| | | |
|---|---|---|
| నీరిల్ | - | నీళ్ళలో |
| పోరిల్ | - | యుద్ధంలో |

3. కోత :

| | | |
|---|---|---|
| కాట్లో | - | అడవిలో |
| మర్‌త్‌ల్ | - | చెట్టులో |

**III. ఉత్తర ద్రావిడ భాషలు :**

1. బ్రాహూయీ : అటీ

| | | |
|---|---|---|
| షహ్రటీ | - | ఊళ్ళో |
| ఉరాటీ | - | ఇంట్లో |

2. మాల్తో : నొ, ఇనొ

| | | |
|---|---|---|
| మన్నొ | - | చెట్టు మీద / లో |
| టెటునొ | - | చేతిలో |
| మలెలరినొ | - | మనుషులలో |
| మఖెరినొ | - | పిల్లలో |

3. **కురుఖ్ : నూ**

| | | |
|---|---|---|
| ఎడ్పానూ | - | ఇంట్లో |
| టోడంగ్‌నూ | - | అడవిలో |

**8 : ఒక విభక్తికి బదులుగా మరో విభక్తి రావడం :**

కొన్నిసార్లు ఒక విభక్తికి బదులుగా మరో విభక్తిని వాడడం తెలుగు భాషలో వుంది.

**1. ద్వితీయా విభక్తికి బదులుగా ప్రథమ విభక్తి రావడం :**

ఉదా॥ వాడుపువ్వులను తెచ్చెను - వాడు పువ్వులు తెచ్చెను
గ్రామమును వీడెను - గ్రామము వీడెను

**2. తృతీయా విభక్తికి బదులుగా ప్రథమా విభక్తి రావడం :**

ఉదా॥ సుఖంతో వున్నారు
సుఖమున్నారు

**3. తృతీయా విభక్తికి బదులు పంచమీ విభక్తి రావడం :**

ఉదా॥ ఖడ్గంతోడ ఖండించెను - ఖడ్గం వలన ఖండించెను
నీచేతవింటిని - నీ వలన వింటిని

4. <u>తృతీయా విభక్తికి బదులు షష్ఠీ రావడం</u> :

ఉదా॥ చైత్రునితోడ మైత్రుడు తుల్యుడు - చైత్రునకు మైత్రుడు తుల్యుడు
మైత్రుడు చైత్రునితోనిట్లనియె - మైత్రుడు చైత్రనికిట్లనియె

5. <u>చతుర్థికి బదులుగా షష్ఠీ రావడం</u>

ఉదా॥ రామునికొరకు కన్యనిచ్చెను - రామునికి కన్యనిచ్చెను

6. <u>పంచమీకి బదులుగా ద్వితీయా రావడం</u> :

ఉదా॥ ఇంటి నుండి వెడలెను - ఇంటిని వెడలెను
వాహనం నుండి దిగెను - వాహనమును దిగెను

7. <u>పంచమీకి బదులుగా షష్ఠీరావడం</u> :

ఉదా॥ చోరుని వలన వెరచె - చోరునకు వెరచె
పాపంవలన ఏవగించు - పాపంనకు ఏవగించు

8. <u>షష్ఠీకి బదులుగా సప్తమీ రావడం</u> :

ఉదా॥ ఛాత్రుల లోపల మైత్రుడు సమర్థుడు -
ఛాత్రుల యందు మైత్రుడు సమర్థుడు
మనుష్యులు లోపల క్షత్రియుడుశూరుడు -
మనుష్యుల యందు క్షత్రియుడుశూరుడు

పై విధంగా ద్రావిడ భాషల్లో విభక్తి విధానం చోటుచేసుకుంది.

**5. ఔపవిభక్తికాలు:**

ద్రావిడ భాషల్లో కొన్ని నామవాచకాలకి ద్వితీయాది విభక్తులు చేరేముందు కొన్ని ప్రత్యయాలు చేరుతాయి. వీటినే "ఔపవిభక్తికాలు" అని అంటారు. ఆంగ్లంలో ఔపవిభక్తికాల్ని "Inflectional Increments '' అని అంటారు. వీటినే " Augments" అని అంటారు. తమిళ వైయాకరణులు వీటి "చారియై" అంటారు.

**I. మధ్య ద్రావిడ భాషలు :**

**1. తెలుగు :**

చిన్నయసూరి "బాలవ్యాకరణం" లో ఇ,టి,తి అనే మూడు వర్ణాలు "ఔపవిభక్తికాలు " అని అన్నాడు. విభక్తిని ఆధారంగా చేసుకొని ఆదేశాత్మకాలు, ఆగమాత్మకాలు అయిన ఇ,టి,తి వర్ణాలు ఔపవిభక్తికాలు అవుతాయి. విభక్తికి సమీపంలో వచ్చేది ఉపవిభక్తి. (ఉపసామీప్యే) ఉపవిభక్తికి సంబంధించింది ఔపవిభక్తికం. "ఉప" అంటే సమీపం. విభక్తికి సమీపంలో అయ్యేది ఉపవిభక్తి. అంటే విభక్తులు పరమైనపుడు అయ్యేది ఉపవిభక్తి అన్నమాట.

1. తెలుగు నామాలకు కొన్నింటికి ఏకవచనంలో ద్వితీయాది విభక్తులు పరమైనపుడు, కొన్నింటికి తుది అక్షరానికి ఆదేశంగానూ, కొన్నింటికి ఆగమంగానూ, కొన్నింటికి రెండు విధాలుగానూ ఇ-టి-తి అనే వర్ణాలు వస్తాయి.

   ఉదా॥ కాలు-కాలిని-కాలిచే

   కాలు+ను -కాల్ + ఇ + ను - కాలి + ను - కాలిని

   (కాలు + చేత - కాలు + చే - కాల్ + ఇ + చే - కాలిచే )

   ఇలాగే నాగలి - నాగటిని - నాగటిచే, నేయి - నేతిని - నేతిచే.

2. ద్వితీయాద్యే కవచనాలు పరమైనపుడు ఊరు మొదలైన శబ్దాలు తుది అచ్చునకు ఇత్వమవుతుంది.

   ఉదా॥ ఊరు - ఊరిని

   ఊరు + ను - ఊర్ + ఇ + ను - ఊరి + ను - ఊరిని

   ఇలాగే

   కాలు - కాలిని

   మ్రాను - మ్రానిని

   నోరు - నోరిని

   చోటు - చోటిని మొదలైనవి.

3. "టి" వర్ణం కొన్నింటి తుది అక్షరానికి తరుచుగా ఆదేశంగానూ, కొన్నింటికి చివర తరుచుగా ఆగమంగానూ అవుతుంది కొన్నింటికి తరుచుగా ఆదేశం, ఆగమం పర్యాయంగా అవుతుంది.

   **1. ఆదేశం :**

   ఉదా॥ త్రాడు - త్రాటిని

   త్రాడు + ను - త్రాటి + ను - త్రా టి + ని - త్రాటిని

   ఇలాగే

కాడు - కాటిని
నోరు - నోటిని
ఏఱు - ఏటిని, మొదలైనవి.

**2. ఆగమం :**

ఉదా॥ అన్ని - అన్నిటిని
అన్ని+ను-అన్ని+టి+ను-అన్నిటి+ను-అన్నిటి+ని = అన్నిటిని
ఇలాగే ఎనిమిది - ఎనిమిదిటిని
వేయి - వేయిటిని, మొదలైనవి.

**3. ఉభయం :**

ఉదా॥ ఏమి - ఏటిని - ఏమిటిని
ఏమి + ను - ఏటి + ను - ఏటిని
ఏమి + ను - ఏమిటి + ను - ఏమిటిని

మరికొన్ని ఉదా॥
పగలు - పగటిని - పగలిటిని
మొదులు - మొదటిని - మొదలిటిని
రెండు - రెంటిని - రెండింటిని
నూఱు -నూటిని - నూఱిటిని మొదలైనవి.

**4. హ్రస్వం మీది “టి” వర్ణానికి ముందు పూర్ణబిందువు బహుళంగా అవుతుంది.**

ఉదా॥ అన్నింటిని - అన్నిటిని
అన్ని+ను - అన్నిటి +ను - అన్నిటి+ని - అన్నింటిని
పూర్ణబిందువు రాకపోతే అన్నిటిని. ఇలాగే
ఎనిమిదిదింటిని - ఎనిమిదిటిని
పగలింటిని - పగలిటిని
రెండింటిని - మూడిటిని

**5. పదానికి మొట్టమొదటి హ్రస్వం మీది “టి” వర్ణానికి ముందు పూర్ణబిందువు నిత్యంగా వస్తుంది.**

ఉదా॥ కన్ను -కంటిని
కన్ను+ను - క+టి+ను - కంటి +ను -కంటిని
ఇట్టే మిన్ను - మింటిని
ఇల్లు - ఇంటిని
పల్లు - పంటిని

**6. “అఱ్ఱు” మొదలైన పదాలకు చివర “తి” వర్ణం ఆగమంగా అవుతుంది. ఇలాంటి సమయంలో రేఫానికి లోపం కలుగుతుంది. (బా.వ్యా. ఆచ్చిక -34)**

ఉదా॥ అట్టు - అటితిని

అట్టు+ను అటితిని

ఇట్లే కట్టు, గొట్టు, మిట్టు, ఉట్టు, మొదలైనవి.

**7. విభక్తి పరమైనప్పుడు "గోయి" మొదలైనవాని తుది అక్షరానికి "తి" వర్ణం ఆదేశంగా వస్తుంది. (బా.వ్యా. ఆచ్ఛిక. సూ. 35)**

ఉదా॥ గోయి-గోతులు - గోతని - గోతులను

గోయి, చేయి, రాయి, నూయి, నేయి

వాయి, రోయి మొదలైనవి.

గోయి+లు - గోతి +లు - గోతులు -గోతిని

8. ఔపవిభక్తికాలు ద్వితీయాది ఏకవచనం పరమైనప్పుడే అవుతాయి. (బా.వ్యా.ఆచ్ఛిక.సూ.29). కాని ఇక్కడ బహువచనం పరమైనప్పుడు అంటే ఇతర విభక్తులు పరమైనప్పుడు కూడా అవుతాయని గ్రహించాలి.

ఉదా॥ గోయి+లు - గోతి -లు-గోతులు

గోయి+లను - గోతి+లను + గోతులను.

**9. "టి,తి" వర్ణాలు పరమైనప్పుడు ఉత్వానికి ఇత్వం అవుతుంది. (బా.వ్యా.ఆ.సూ. 36).**

ఉదా॥ రెండు+కు - రెండు+టి+కు - రెండిటికు - రెండిటికి

ఇలాగే నాలుగిటికి, పగలిటికి

మొదలిటికి, పెక్కిటికి మొదలైనవి.

కొన్నిచోట్ల ఉత్వానికి ఇత్వం కన్పించదు. అంటే ఇక్కడ ఇత్వం నిషేధించబడమైంది.

ఉదా॥ నెత్తుటికి

**10. "టి" వర్ణంబు పరంబగునపుడు క్రిందు, మీదు, ముందు ఉపవర్ణాలకు అత్వం అగుతుంది. (బా-సూ.ఆచ్ఛిక-37)**

ఉదా॥ క్రిందు - క్రిందటిని

క్రిందు+ను - క్రిందు+టి+ను - క్రింద+టి+ను - క్రిందటిని ఇలాగే

మీదు - మీదటిని

ముందు - ముందటిని

మాపు - మాపటిని

అప్పుడు -అప్పటిని

**11. ఔపవిభక్తిక శబ్దాల యొక్క తృతీయా సప్తమీ విభక్తులకు బహుళంగా అత్వం ఆదేశమవుతుంది (బా.సూ.ఆచ్ఛిక - 38)**

ఉదా॥ గోరను

గోరు+చేత - గోరి +చేత - గోరి+అ+ను -గోరను.

**12. కొన్ని సమాసాల్లో కూడా ఔపవిభక్తిక రూపాలు కన్పిస్తాయి.**

ఉదా॥ నూతిగట్టు, నేతిపాత్ర, చేతిఎముక, కంటినలుసు, ఇంటిపోరు, కాలిముల్లు, ఊరిదారి.

విభక్తి సమీపంలో చేరే ఈ ఔపవిభక్తికాలు వర్ణములేకాని, వర్ణకములుకావు. ఇవి ఏయే శబ్దాలకు చేరతాయో, వేటికి చేరవో గుర్తుంచుకోవలసిందేకాని గుర్తుపట్టే మార్గాలు చాలా తక్కువ.

**2. <u>గోండీ</u> :** **ద్, త్, న్, ట్,**

ద్: ఇది హ్రస్వాచ్చు వుండి డ, య, ర, వలతో అంతమయ్యే ఏకాచ్క నామాలు తర్వాత, వలలతో అంతమయ్యే ఏకాచ్కాల తర్వాత ర, లలో అంతమయ్యే అమనుష్య వాచక ద్వ్యచ్కాల తర్వాతవస్తుంది.

కయ్‌దే 'చేతిలో' , చేతితో

త్: ఇది అజంతాలైన అమనుష్య వాచకాల తర్వాత వ,ర,ల,ల తో అంతమయ్యే మూడు నామాల తర్వాత వస్తుంది.

తడాయితే - 'చెరువులో'

న్: ఇది అజంతమనుష్య వాచకాల తర్వాత, ప్రత్యయంతో అంతమయ్యే పురుష వాచకాల తర్వాత, క్, బహువచన ప్రత్యయం తర్వాత, ద్, త్, లు వచ్చేది కాక మిగిలిన అమనుష్యవాచకాల తర్వాత, నిర్దేశకైక వచన సర్వనామాల తర్వాత వస్తుంది.

మరీన్ 'కొడుకును'',
కాకాన్ 'బాబయ్యని'',

ట్: ఇదిరతో అంతమయ్యే కొన్ని నామాల తర్వాత, ఆగ్గా 'అక్కడ' మొదలైన కొన్ని పదాలు తర్వాత వస్తుంది.
నాడే 'ఊళ్లో',
కోడే 'కొమ్ముతో'

**3. <u>కొండ</u> : ది, తి, టి, ఇ, ఒ,**

ది: ఇది పరుషేతరవాచకైకవచన రూపాల్లో చాలా వాటి తర్వాత వస్తుంది.
అయ్ విది 'అమ్మాయి'
టెకది 'రెక్క'
బోదెల్ ది 'పెళ్ళికూతురి'

ఇ: ఇది పురుషబహువచన ప్రత్యయమైన ద్ తర్వాత, పురుషవాచక సర్వనామాలూ అది, ఇది అనే శబ్దాల తర్వాత వస్తుంది.

బుబరి 'తల్లిదండ్రులు''
వని 'వాణీ'
వారి 'వారి'
వాళ్ల 'వారు'

**4. <u>పెంగొ</u> :** **త్, ద్, ఎర్, అల్, క్**

త్ : శ్వాసహల్లు చివరగల ఏకాచ్కనామాలలో, అనే కాచ్కనామాలకీ ఇది చేరుతుంది.
రాచ్‌తిజ్ -పాముని, పాముకి,
నెకుడ్‌తిజ్ - కుక్కని, క్కుహి

ద్ : **శ్వాసహల్లు కానీ, అనునాసిక సహిత స్పర్శం కానీ చివర కాని ఏకాచ్కనామాలుగా ఇది చేరుతుంది.**

కాల్దిజ్ - కాలికి, కాలిని
వెయ్దా - నోట్లో
హోకదా - పోయ్యిలో

ర్ : ఇది అనేవాచ్కనామాలకి తర్వాత షష్ఠీ ప్రత్యయం ముందు చేరుతుంది.

ఓడని - 'కుకయొుక్క',
వచ్కని - 'వేలియొుక్క'
కెయ్కుని - 'చేతుల యొుక్క'

అల్ : ఇది మనుష్యేతర నిర్దేశక సర్వనామాలకి ద్వితీయా చతుర్థీ ప్రత్యయం ముందు చేరుతుంది.

ఎదలిజ్ దాన్ని, దానికి (ఎది)

క్ : ఇది బహువచన ప్రత్యయావైడ్ కు, జ్/ఇజ్ ల తర్వాత ఇది వచ్చినపుడు కు వైకల్పికంగా లోపిస్తుంది. దీని తర్వాత అజ్/ఉజ్/ఇజ్ అనే ఒక ప్రత్యయం మాత్రమే ద్వితీయా, చతుర్థీ సప్తమ్యర్థాల్లో వస్తుంది.

ఇలుక్కజ్/ఇల్కజ్/ఇలుక్కజ్ -'ఇంటిని',
ఇంటికి, ఇంట్లో
కెల్కుకజ్/కెల్కజ్/కెల్కుజ్ - ~~ఈ~~ కల్ని , ~~ఈ~~కులకి, ~~ఈ~~కలలో.

II. **<u>దక్షిణ ద్రావిడ భాషలు</u> :**

1. **<u>తమిళం</u>** : తమిళ భాషలో ఓపవిభక్తికాలు

అన్, ఇర్, అట్ట్, త్తు.

అన్ : ఇది ఏళ్ (7) ఉకారాంతాలైన ఇతర సంఖ్యా వాచకాలా, ఆతు "ఆది" ఇతు "ఇది", యాతు "ఏది" -ఈ సర్వనామాలు వీటి తర్వాత వస్తుంది. ఏళనై - "ఏడుని", ఇరంటనిన్ "రెండుకంటె", ఆఱుక్కు (అఱన్క్కు) "ఆరుకి",

ఇన్ : ఇది ఏకాచ్కనామాల మీదా, ద్వ్యచ్క నామాల మీద ఉకార, ఐకారాంతనామాల మీదా వైభాషికంగా వస్తుంది. సాహిత్యంలో ఇది వున్న రూపాల లేని రూపాలు వున్నాయి.

ఇర్మైయినా 'దారిద్ర్యం వల్ల'

ఆఱ్ : పలవట్టిల్ 'చాలావాటిలో', అవట్టోఱు 'వాటితో, చిలవఱ్ఱుళ్ 'కొన్నింటిలో,

త్తు : ఇదిమాకారాంత నామాలతో సహార్థకమైన బఱు, చతుర్థీవిభక్తి ప్రత్యయం క్కులు తప్ప మిగిలిన ద్వితీయాదివిభక్తుల్లో నిత్యంగా వస్తుంది. ఉలకత్తుళ్ 'లోకంలో' (ఉలకం).

2. **<u>కన్నడం</u> :**

కన్నడంలో ఔపావిభక్తులు ఇవి
ఇన్, ద్, అణ్, అట్

ఇన్ : ఇది ఉకారాంతాల తర్వాత, ఏకాచ్కాల తర్వాత కొన్ని హలంతాల తర్వాత వస్తుంది.

కూచిన 'పిల్లమొక్క' (కూడు)
పూవిక 'పువ్వు యొక్క' (పూ)

ద్ : ఇది మకారాంతాల తర్వాత వస్తుంది. ఇది ద్వితీయా చతుర్థీ విభక్తుల ముందు కూడదు. వీటి ముందు మకారం లేని రూపం వుంటుంది. ఆధునికి కన్నడంలో పదాంతమకారం లోపిస్తుంది.

ఆణ్ : ఇది ఉకారాంతాలైన దిగ్వాచిశ 'దాలకీ', వ్యవస్థాదాబిశదాలకీ వస్తుంది.
ముందణ/ముంతణ 'ముందటి'' (ముందు)

అట్ : ఇది సంఖ్యా వాచకాలతోనూ అమనుష్య సర్వనామాలతోనూ వస్తుంది.
ఎరడటోళ్/ఎరడరల్లి "రెండింటిలో'' (ఎరడు

3. <u>మలయాళం</u> : త్త్ :

ఇది మాకారాంత నామాలతోనూ, టు, ఱులతో అంతమయ్యేనామాలతోనూ వస్తుంది. ఱు/ఱు+త్త్ ట్ట్/ఱ్ట్ ఱు తో అంతమయ్యే నామాలతో ఇది వైభాషికం.

**III. <u>ఉత్తర ద్రావిడ భాషలు</u> :**

**<u>1. బ్రాహుయీ</u> :**

ఏకాచ్కనామాలకీ సహార్థక షష్ఠీ విభక్తుల ముందు అకారం చేరుతుంది.
మారనా 'కొడుకు యొక్క',
మారతో 'కొడుకుతో',
బా అనా 'నోటి',
బాఅతో 'నోటితో,

## 5.6. మాదిరి పరీక్షా ప్రశ్నలు :

1. నామవాచక నిర్మాణాన్ని గుర్చి తెలయ జేయండి.
2. లింగ ప్రణాళిక గూర్చి వ్రాయిండి.
3. వచనవిధానాన్ని గూర్చి విపులీకరించండి.
4. విభక్తి ప్రణాళిక గూర్చి వివరించండి.
5. ఔపవిభక్తులు గూర్చి విశదీకరించండి.

## 5.7. ఆధార గ్రంథాలు :


1. ఆంధ్రభాషావికాసం - ఆచార్య గంటిజోగి సోమయాజి
2. తెలుగు భాషా చరిత్ర - డా॥ వెలమల సిమ్మన్న
3. దక్షిణ దేశభాషాసారస్వతము - ఆచార్య కోరాడ రామకృష్ణయ్య
4. ద్రావిడ భాషలు - ఆచార్య గంటిజోగి సోమయాజి
5. ద్రావిడ భాషలు - ఆచార్య పి.యస్. సుబ్రహ్మణ్యం
6. ద్రావిడ భాషా పరిశీలనము 1,2, భాగాలు - శ్రీవజ్ఝలబిక సీతారామయ్య
7. ద్రావిడ భాషావిజ్ఞానం - ఆచార్య జి.ఎన్.


**- డా॥ వి. సిమ్మన్న**

పాఠం - 6

# సంఖ్యా వాచకాలు - ద్రావిడ భాషలు - తులనాత్మక పరిశీలన

**విషయసూచిక**


6.1. సంఖ్యా వాచకాలు

6.2. సర్వనామాలు

6.3. పురుష బోధక ప్రత్యయాలు

6.4. కృదంత రూపాలు

6.5. తద్ధిత రూపాలు

6.6. విశేషణాలు

6.7. మాదిరి పరీక్షా ప్రశ్నలు

6.8. ఆధార గ్రంథాలు


## 1. సంఖ్యా వాచకాలు - నిర్వచనం :

ఒక భాష యొక్క జన్యజనక సంబంధాన్ని గూర్చి కానీ, సోదర భాషల యొక్క పరస్పర సంబంధాన్ని గూర్చి కానీ, ఆయా భాషల పరిణామ వికాసాన్ని కానీ తెలుసుకోవాలంటే సంఖ్యా వాచకాల చరిత్రను గూర్చి తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా వుంది. తెలుగు, ద్రావిడ భాషా జన్యమని నిరూపించిన సాధనాల్లో సంఖ్యావాచకాలు ముఖ్యమైనవి. కారణం భాషకివి ముడిపదార్థంలాంటివి. భాషలో ఇతర అంశాలు మార్పుచెందినా ఇవి మారవు. సంఖ్యను గూర్చి తెలియజేసేవి సంఖ్యా వాచకాలు.

## 2. ద్రావిడ భాషలు - సంఖ్యా వాచకాలు :

ద్రావిడ భాషల్లో సంఖ్యా వాచకాలు రెండు రకాలు. 1. విశేష్యాలు వీటినే 'ప్రాథమిక సంఖ్యా వాచకాలు' అని అంటారు. 2. విశేషణాలు వీటిని 'సార్వనామిక విశేషణాలు' అని అంటారు.

ప్రాథమిక సంఖ్య వాచకాలకు 'అగు' ధాతురూపాల్ని చేర్చినపుడు ఏర్పడే సార్వనామిక విశేషణాలు ఒకే రకం. అస్వతంత్రమైన సంఖ్యావాచక విశేషణానికి లింగ, వచన, బోధక ప్రత్యయాల్ని చేర్చగా ఏర్పడేవి మరో రకం.

**సంఖ్యా వాచకాలు**

ప్రాథమిక సంఖ్యావాచకం                సార్వనామిక విశేషణం

ప్రాథమిక సంఖ్యా వాచకం                అస్వతంత్ర సంఖ్యా వాచకం

+ 'అగు' ధాతురూపాలు                + లింగ, వచన, బోధక ప్రత్యయం

ఉదా॥ రెండగు, రెండవ, రెండో                ఉదా॥ ఇద్దరు

ద్రావిడ భాషలన్నింటిలోను విశేషణ రూపాలు ఒకే రకంగా ఉంటాయి. విశేష్యంలో వున్న రూపభేదం, విశేషణాల్లో కనబడుతుంది. కాబట్టి సంఖ్యా వాచకాల్లో విశేషణ రూపం ప్రాచీనమైందిగానూ, విశేష్య రూపం అర్వాచీనమైందిగానూ భావించవచ్చు. విశేషణ రూపాల చివర ప్రత్యయాలు చేరి, సంధిలో మార్పులు కలిగి విశేష్య రూపాలు ఏర్పడతాయని అందువల్లే వివిధ ద్రావిడ భాషల్లోని సంఖ్యావాచక విశేషణాల్లో సారూప్యం ఎక్కువగా కన్పిస్తుందని ఆచార్య గంటిజోగి సోమయాజిగారు అభిప్రాయపడ్డారు.

తెలుగులోని సంఖ్యా వాచకాలకు మిగిలిన ద్రావిడ భాషలకు సారూప్యం వుంది. అయితే తెలుగులో మాత్రం సంఖ్యావాచకాలు మహత్ అమహత్ విశేషణ రూపం భిన్నంగా వుంటుంది. తెలుగులో వున్న ఈ బేధం ద్రావిడ భాషలైన తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో లేదు. తెలుగు భాషకు సంస్కృత ప్రాకృత భాషలతో సన్నిహిత సంబంధాలు వున్న కారణంగా తెలుగులో ఈ మార్పులు జరిగాయి.

ఉదా : రెండు చెట్లు, మూడు పక్షులు
ఇద్దరు మనుష్యులు, ముగ్గురు జనులు

పై విషయాల్ని నిశితంగా పరిశీలిస్తే, అమహత్తులతో కలిసేటప్పుడు రెండు మూడు సంఖ్యలు యథారూపంలో వున్నాయి. మహత్తులలో కలిసేటప్పుడు ఇద్దరు ముగ్గురు అనే విధంగా మారాయి.

సాధారణంగా వ్యవహారంలో మహద్విశేషణం చెప్పినట్లు అయిన సంఖ్యావాచకానికి 'మంది' అనే పదం చేర్చి చెప్తుతారు.

ఉదా : నాలుగు మంది, పది మంది

ప్రాచీన కాలంలో 'గురు' అనే పదం మూల విశేషణానికి చేర్చడం వుంది. మహత్తుల్లో ముగ్గురు, నలుగురు అనే రూపాలు ప్రయోగించబడతాయి. మూరు + గురు = ముగ్గురు, నాలుగు + గురు = నలుగురు. ఇక్కడ గమనించవలసిన విషయం ఏమంటే 'రెండు మనుష్యులు' లాంటి ప్రయోగాలుండవు. ఇందలి 'గురు' అనే పదం పూర్వరూపం 'వురు' అనీ, అది 'వారు' అనే సర్వనామ పరిణామ రూపమని భాషావేత్తల అభిప్రాయం.

సంఖ్యా పూరణార్థకాల్లో నేడు అవగాగమం కన్పిస్తుంది. ద్రావిడ భాషలన్నింటిలోనూ దీని మూల రూపం 'అగు' ధాతువు. అంటే పూరణార్థాలు అన్ని ద్రావిడ భాషల్లోనూ, 'అగు' పదం నుంచి పుట్టినవే. ఈ ప్రణాళికా విధానం సంస్కృత భాష కంటే భిన్నమైంది. 'అగు' అనే పదాన్ని వాడాడు.

ఉదా : మూడగు పర్వము. ఈ 'అగు' అనేది క్రమక్రమంగా అగు ట అవు ట అన ట ఓ అని మార్పు చెందుతూ వచ్చింది. మూడవవాడు ట మూడోనాడు.

### 3. ద్రావిడ భాషలు - సంఖ్యా వాచకాల పట్టిక :

| వ.న. | తెలుగు | తమిళం | కన్నడం | మలయాళం | తుళు |
|---|---|---|---|---|---|
| 1. | ఒకటి | ఒన్డు, ఒండు | ఒందు | ఒన్ను | ఒంజి |
| 2. | రెండు | ఇరండు | ఎరడు | రండు | రడ్డు |
| 3. | మూడు | మూన్జు | మూరు | మూన్ను | మూజి |
| 4. | నాలుగు | నాలుగాంగి, నాల్కు | నాల్కు | నల్, నాక్కు | నాక్ |
| 5. | ఏను, ఐదు | అంజు | ఐందు, ఐదు | అంజు | ఐను |

| | | | | | |
|---|---|---|---|---|---|
| 6. | ఆరు | ఆరు | ఆరు | ఆరు | ఆజి |
| 7. | ఏడు | ఏళ్ళు | ఏళు | ఎక్లు | ఏళు |
| 8. | ఎనిమిది | ఎట్టి | ఏంటు | పెట్టు | ఎణ్కా |
| 9. | తొమ్మిది | ఒన్బదు | ఒంబత్తు | ఒంబదు | బద్ |
| 10. | పది | పత్తు | హత్తు | పత్తు | పాద్ |

## 4. ద్రావిడ భాషలు - సంఖ్యా వాచకాలు - పరిణామ వికాసాలు :

### 1. ఒకటి : తెలుగు :

ఒకటి ప్రాథమిక సంఖ్యావాచకం. ద్రావిడ భాషలన్నింటిలోనూ ఒక, ఒక్క అనేవి విశేషరూపాలుగా కన్పిస్తాయి. 'ఒక' అనే దాని మీద 'కు' అనే ప్రత్యయం చేరి / ఒక + కు > ఒర్క > ఒక్క / 'ఒర్క' అనే రూపం వచ్చింది. తర్వాత 'ఒర్క' వర్ణసమీకరణం పొంది 'ఒక్క' గా మారింది. 'ఒక్క' ఔపవిభక్తికాంతమై 'టి' వర్ణం చేరి కాలక్రమంలో అనుచిత విభాగం కారణంగా 'ఒక్కటి' అనే రూపం ఏర్పడింది. వ్యవహారంలో 'ఒకటి' లోని ద్విత్వం లోపించి 'ఒకటి' అనే రూపంగా స్థిరపడింది. 'ఒకటి' అమహత్తులో అటు విశేష్యంగానూ ఇటు విశేషణంగానూ వాడబడుతుంది.

ఒక్ + కు ట ఒర్కు ట ఒక్కు ట ఒక్క + టి - ఒకటి

ఒకటి, ఒక్కటి, ఒక్కంటి, ఒకడు, ఒకానొకడు, ఒక్కరోడు, ఒక్కొరడు అమహద్విశేషణాలు, ఒక్కర్తి, ఒక్కతె, స్త్రీవాచక విశేషణ రూపాలు. 'ఒక్కడు మహత్. అమహత్ రూపంపై రూపాలన్నీ ఒక్క / ఒక్క / అనే విశేషణం నుండి పుట్టినవే.

తెలుగు భాషలో ఒండు, ఒరుడు, ఓరి అనే రూపాలు కూడా వున్నాయి. ఈ రూపాలకు 'ఒరు' అనే విశేషణం మూలరూపం. 'ఒండు' రూపం తమిళ భాషలోని 'ఒన్టు' అనే రూపం యొక్క పరిణామం.

తమిళం : ఒన్టు, మలయాళం : ఒన్టు, కోత : ఒద్, తోద : విడ్, కన్నడం : ఒందు, తుళు : ఒంజి, గోండి : ఉందీ, కొండ : ఉన్టి, కూయి : ఓన్, ఓంద్, మాల్తో : బంద్, బ్రాహుయి : అసిట్ ఎ మూ. ద్రా. జ ఒన్ ఱ్.

మూల ద్రావిడ భాషలో దీని విశేషణ రూపం * ఒర్ / అచ్చుల ముందు /
* ఒరు / హల్లుల ముందు /

### రెండు :

'రెండు' ప్రాథమిక సంఖ్యా వాచకం ద్రావిడ భాషలిన్నంటిలోనూ 'రెండు విశేషణ రూపంగా ఇర్, ఈర్ రూపాలు కన్పిస్తున్నాయి. ఇరుసార్వమానికి విశేషణం ఇరంటు > రంటు > రండు > రెండు.

తమిళభాషలో 'రెండు' పై 'టు' ప్రత్యయం చేరి 'ఇరండు' అనే రూపం ఏర్పడింది. కన్నడ భాషలో 'ఎరడు' అయింది. తెలుగులో మాత్రం ఊనిక మార్పు వల్ల వర్ణవ్యత్యయం పొంది 'రెండు' అనే రూపం ఏర్పడింది. తెలుగులో 'ఇరు' అనే రూపం ఇప్పటికీ వుంది.

ఇరుతెగలు, ఇరుమూడు.

మలయాళం : ఇరంటు, రంటు, కోత : ఎయిద్, తోద : ఏడ్, కొండ : దండ, తుళు : రడ్డు, గోండి : రండ్, పెంగో : రి, మండ : రి, కూయి : రీండె, కువి : రీ / రింది, కోలామి : ఇందిజ్, నాయికీ : ఎర్ండి, పర్జి : ఆర్డు, గదబ : ఇండి, మాల్తో : ఇవ్, బ్రాహూయి : ఇరట్ మూల ద్రావిడ భాష ఇరంట్.

**మూడు :**

మూడు పదానికి పూర్వ రూపం మూన్టు. మూ, ము అనేవి విశేషణాలు. తెలుగు శాసనాల్లో 'మూన్టు' విశేషణంగానూ, విశేష్యంగానూ ఉపయోగించబడింది. తమిళంలో 'మూన్టు' అనే రూపం వుంది. 'మూన్టు' రూపమే తెలుగు భాషలో మార్పు చెంది మూండు > మూంద్రు > మూడుగా మారింది.

మలయాళం : మూన్ను, కోత : మూండ్, తొద : మూద్, కన్నడం : మూఱు, తుళు : మూజి, గోండి : కొండ : ముంద్రి, కూయి : మూంజి, కోలామి : మూందిజ్, నాయికీ : మూంది, పర్జి : మూదు, గదబ : మూండ్, బ్రాహూయి : ముసిద్ ఎ మూలద్రావిడ భాష. మూన్జ్.

**నాలుగు :**

తెలుగు శాసనాల్లో నాల్నాలు, నాలుగు నాలువు, నాల్కు, నాల్గు అనే రూపాలు కన్పిస్తున్నాయి. ద్రావిడ భాషలన్నింటిలోనూ నాలుగుకి నలు, నాల్ అనే విశేషణ రూపాలు వున్నాయి. తెలుగు భాషలో మాత్రం శ్వాసత, నాదత కారణంగా నాల్గు > నాలుగు అనే రూపం ఏర్పడింది.

మలయాళం : నాల్, నాంకు, తుళు : నాలు, గోండి : నాలూజ్, తోద : నోన్గ్, కన్నడం : నాల్, కొండ : నాల్గి, కూయి : కోలామి : నాలిజ్, నాయికీ : నాలి, పర్జి : నాలు, గదబ : నాలిగ్, కూయి : నాఖ్ ఎ మూ. ద్రా జ నాల్, జ నాల్క్.

**ఐదు :**

ఐదు, ఏను అనే రూపాలు తెలుగుభాషలో వున్నాయి. అయిదు, ఏను రెండూ ప్రాథమిక సంఖ్యావాచకాలు. ఏను, ఏన్ విశేషణాలు, ఆచార్య గంటి జోగి సోమయాజి గారు అయిదు, ఏను అనే రెండూ ప్రాచీనమైన 'అయ్' నుంచి ఏర్పడి వుండవచ్చునని అభిప్రాయపడ్డారు.

నన్నయ తన మహాభారతంలో నేను' అనే పదాన్ని మాత్రమే వాడడంవల్ల ఈ పదమే చాలా ప్రాచీనమైందని భాషా శాస్త్రజ్ఞులు అభిప్రాయపడ్డారు. ఒకటి నుంచి ఐదు వరకు గల మొత్తం సంఖ్యల్ని కలిపి ఒక హస్తంగా లెక్కించడం వ్యవహారంగా వుంది. ఒక హస్తం అనగా 'ఐదు' అని అర్థం. 'హస్తం' నే 'చేయి' అని కూడా అంటారు. హస్తం, చేయి అనే రెండూ ఐదు అనే అంకెకు పర్యాయపదాలుగా వాడుతున్నారు. రెండు చేతులు అంటే రెండు అయిదులని అర్థం. మూడు చేతులు అంటే మూడు అయిదులని అర్థం.

తమిళం : ఐంతు, మలయాళం : అంచు, కోత : అంజ్, తొద : ఉజ్, కన్నడం : అయ్దు, తుళు : అయ్ను, కోలామి : అయ్దు, నాయికి : సేంది, పర్జి : చేదే, గోండి : స్మెయూంగ్, కూయి : సింగి, ఎ మూ.ద్రా. జ చయ్ - /మ్/.

**ఆరు :**

'ఆఱు' అనేది విశేష్య; విశేషణ రూపాలుగా కన్పిస్తుంది. అఱు అనేది విశేషణం. ఇది తుళుభాషలో తప్ప అన్ని ద్రావిడ భాషల్లోనూ ఇంచుమించు విశేషణ విశేష్యాల్లో ఒకే రూపంలో కనిపిస్తున్నది. దీన్ని తుళు భాషలో 'ఆజి' అంటారు.

తమిళం : ఆఱు, మలయాళం : ఆఱు, కోత : ఆర్, తొద : ఓఝ్, కన్నడం : ఆఱు, గోండి : సారూంగ్, కూయి : సజ్గి, కొండ : ఆర్, నాయికీ : సాది ఎ మూ.ద్రా. జ చాట్.

**ఏడు :**

తెలుగు శాసనాల్లో 'ఏఱు' అనే పదం ప్రయోగించబడింది. కాలక్రమంగా ఎఱు 'ఏడు' గా మారింది. తెలుగులో ఇది విశేష్యంగానూ, విశేషణంగానూ వుపయోగపడుతుంది. 'డెబ్బది' మొదలైనచోట్ల వర్ణవ్యత్యయం వల్ల 'డె' అనే రూపం వచ్చింది. 'డె' అనేది విశేషణం.

ఉదా : ఏడు + పది - డెబ్బది. తెలుగులో 'డెబ్బది' అనేది గ్రాంథిక రూపం
డెభై 'డెబ్బై' అనేవి వ్యావహారిక రూపాలు

తమిళం : ఏళ్, మలయాళం : ఏళు, కోత : ఏయ్, తొద : ఒన్, కన్నడం : ఏళు, తుళు : ఏళు, గోండి : ఏడూంగ్, కుయి : ఒడ్, కొండ : ఏడు, కోలామి : ఏడ్ ఎ మూ.ద్రా జ పళ్.

**ఎనిమిది :**

ఎనిమిదిలోని 'మిది' పది శబ్దరూపాంతం. శాసనాల్లో ఎనిమిదికి బదులుగా ఎఱుంబొది, ఎత్బొది, ఎణ్మ, ఎన్మిది అనే రూపాలు వున్నాయి. కొంతమది భాషా పండితులు ఇరు పది ఎనిమిదిగా విభజించారు. మరికొందరు ఏను+మిది - ఎనిమిదిగా విభజించారు.

తమిళం : ఎట్టు, మలయాళం : ఎట్టు, కోత : ఎట్, తొద : ఒట్, కన్నడం : ఎంటు, తుళు : ఎణ్మ, గోండి : అఢ్, మూ.ద్రా. *ఎణ్.

**తొమ్మిది :**

తొమ్మిది విశేష్య విశేషణరూపం తోల్ పది అనేవి భాగంలో 'పది' అనే పదం అనునాసిక్యం పొంది తొల్+మిదిగా మారి పిదప వర్ణసమీకరణం వల్ల తొమ్మిది అయింది. తొల్ + పది - తొమ్మిది > తొమ్మిది.

తమిళం : ఒన్‌పత్తు, ఒన్‌పాన్, మలయాళం : బంపతు, కోత : ఒర్బాద్, ఒన్బాద్, తోద : విన్‌బోత్, కన్నడం : ఒంబత్తు, ఒంభత్తు, తుళు : ఒర్ంబ, గోండి : ఉత్మా.

**పది :**

పది విశేష్య విశేషణ రూపం. ఇది అన్ని ద్రావిడ భాషల్లోనూ ఇంచుమించు ఒకేరకంగా వుంది. 'పది' సమాసాల్లో 'పన్' అనే రూపాంతరం పొందింది.

ఉదా : పన్నిద్దరు, పన్నెండు

దశ సంఖ్యాల్లో పది విశేషణ రూపాలపై చేరుతుంది.

ఉదా : ఇరువది, ముప్పది, నలుబది

క్రమక్రమంగా ఈ పది అనే పదం పది > పిఇ > పయి > పై > బై > వై అనేవిధంగా మార్పు చెందింది.

ఉదా : నలభై, నలవై, యాభై, అరవై, డెభై

## 2. ద్రావిడ భాషలు - సర్వనామాలు :

### 1. సర్వనామాలు - నిర్వచనం :

'సర్వనామం' అనే పదం సంస్కృత లక్షణ గ్రంథాల నుంచి తెలుగులోకి వచ్చింది. సర్వనామాలు నామాల్లో ఒక అంతర్భాగం. 'రాముడు అయోధ్యకు రాజు, అతడు ప్రజల్ని తన బిడ్డలవలె ఆదరించాడు' అనే వాక్యంలో అతడు, తన అనే రెండు పదాలు వున్నాయి. ఈ రెండూ సర్వనామాలు, రాముడు, రాముని యొక్క అనే వాటికి బదులుగా అతడు, తన అనే పదాలు వాడడం జరిగింది. కాబట్టి నామాలకు బదులుగా వాడబడే పదాల్ని సర్వనామాలు అని అంటారు. అతను కంటే ఆయన, అంతకంటే వారు అనే పదాలు గౌరవాధిక్యాన్ని సూచిస్తాయి. మీరు కంటే ఎక్కువ గౌరవాన్ని 'తమరు' సూచిస్తుంది. భాష యొక్క ప్రత్యేకతను నిరూపించడంలో సర్వనామాలు ప్రధానమైన పాత్ర వహిస్తాయి.

వ్యక్తినిగానీ, వస్తువును కానీ పేర్కొనక, వాటిని నిర్దేశించడానికి కానీ, వాటి సంఖ్యను లేక పరిణామాన్ని తెలపడానికి కానీ వుపయుక్తాలైన నామాలకు బదులుగా వచ్చే పదాలు సర్వనామాలు అవుతాయి.

### 2. సర్వనామాలు - విశిష్ఠత :

ఒక వస్తువును పేర్కొనే 'నామం' ఎక్కడ వచ్చినా, ఏ సందర్భంలో వచ్చినా ఆ వస్తువుని మాత్రమే బోధిస్తుంది. మరొక వస్తువును బోధించదు. కాని సర్వనామం అలా కాదు. సందర్భానుసారంగా ఏ వస్తువునైనా సర్వనామం బోధిస్తుంది. ఉదా : 'చెట్టు' అనే నామం భాషలో ఎక్కడ వచ్చినా చెట్టునే బోధిస్తుంది. కొండను గానీ, నదినికానీ బోధించదు. 'అది' అనే సర్వనామం సందర్భాన్ని బట్టి చెట్టునీ, కొండనీ, నదినీ మరి యే వస్తువునైనా బోధిస్తుంది. ఉదా : 'మ' గ్రామం ప్రక్కన ఒక కొండ వుంది. అది పెద్దది. దాని క్రింద ఒక మర్రిచెట్టు వుంది. అది మిక్కిలి విశాలమైంది. ఆ ప్రక్కనే ఒక నది ప్రవహిస్తుంది. అది ఎండాకాలంలో కూడా ఎండిపోదు. ఇందులో 'అది' అనే సర్వనామం మూడుచోట్ల వచ్చింది. మూడు వేర్వేరు వస్తువుల్ని నిర్దేశిస్తుంది. 'ఆమె' అనే సర్వనామం ఏ స్త్రీ వ్యక్తినైనా నిర్దేశిస్తుంది. ఇది అన్ని సర్వనామాలకు సమానమైన లక్షణం.

ఒక వ్యక్తినిగానీ, వస్తువును కానీ ఉద్దేశించి చెప్పేటప్పుడు, అన్ని వేళలా ఆ వ్యక్తి వస్తువుల నామాలనే వాడడం మంచిదికాదు. అలా వాడితే వాక్య రచనలో కమనీయత గోచరించదు. ఉదా : దశరథుడు అయోధ్యకు రాజు, దశరథునికి ముగ్గురు భార్యలు. దశరథునికి సంతానం లేదు. దశరథుడు సంతాన ప్రాప్తికై పుత్రకామేష్టి చేయగా దశరథునికి నలుగురు కొడుకులు కలిగారు. పై వాక్యాల్లో 'దశరథ' అనే పదం పదేపదే రావడం వల్ల వాక్యరచనలో రమణీయత లేక మీదు మిక్కిలి ఒకే పదం పునరుక్తి అవుతుంది. ఇలాంటి రచన సహృదయ పాఠకులకు ఆనందం కలిగించదు. విసుగును కల్గిస్తుంది. అతనికి, అతడు మొదలైన సర్వనామాలు వాడడం వల్ల నామ పునరుక్తిని నివారించడమే పాఠకుని శ్రవణానందాన్ని కలిగించవచ్చు.

నామాలు వ్యక్తి వస్తువుల చిత్రణం చేయడంలో సమర్థమైనవి. చెట్టు, సముద్రం, శిశువు, నర్తకి అనే నామాల్లో ఎంతో అర్థం నిబిడీకృతమై వుంది. సర్వనామాలకు అటువంటి పరిపూర్ణశక్తి - వస్తువుల్ని నిర్దేశించడం వాటి సంఖ్యను పరిమాణాల్ని

తగ్గించడం మాత్రమే సర్వనామాల లక్షణం. ఇక్కడ పాఠకుడు ఒక విషయం తెలుసుకోవాలి. సర్వనామాలు నామాలకు బదులుగా వచ్చే పదాలు.

## 3. ద్రావిడ భాషలు - సర్వనామాలు - వర్గీకరణ :

ద్రావిడ భాషల్లో సర్వనామాలని నాలుగు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి ఇవి -

1. యుష్మదస్మదర్థక సర్వనామాలు (Personal Pronouns)
2. సూచక సర్వనామాలు లేక ఏతత్తదర్థక సర్వనామాలు (Remonstrative Pronouns)
3. ఆత్మార్థక సర్వనామాలు (Reflexive Pronouns)
4. యత్కిమర్థక సర్వనామాలు (Interrogative Pronouns)

యుష్మదస్మర్థక సర్వనామాలలోనూ, ఆత్మార్థక సర్వనామాలలోనూ ఏకవచన బహువచన భేదం మాత్రం వుంటుంది. కాని లింగభేదం వుండదు. కాని లింగభేదం వుండదు. మిగిలిన రెండు రకాల సర్వనామాలలోనూ లింగభేదమూ వచన భేదమూ కూడా వుంటాయి. యుష్మదస్మదర్థకాత్మార్థక సర్వనామాలలో * న్ ఏకవచన ప్రత్యయం, * మ్ బహువచన ప్రత్యయం. వీటిలో ధాతువులు * యా/ ఇది ఉత్తమ పురుష సూచకం/, * నీ -/ ఇది మధ్యమ పురుష సూచకం/, జ తా - / ఇది ఆత్మార్థకం/, సూచక యత్కిమర్థక సర్వనామాలలో ధాతువుకి లింగవచన ప్రత్యయాలు చేరతాయి. సూచక సర్వనామాలలో ధాతువులు ఆ - / అ - దూరసూచకం (Distant Demonstrative) ఊ - / ఉ - అనతిదూర సూచకం లేక శ్రోతృసామీప్య సూచకం (Intermediary Demonstratve) ఈ- / ఇ సామీప్య సూచకం (Proximate Demonstrative) యత్కిమర్థక సర్వనామంలో ధాతువు * యా - / * ఏ - / * ఎ-, కోతలో ఈ - /ఇ, ఊ-/ఉ ల నించి వచ్చిన రూపాలు ఉన్నా వీటికి అర్థభేదం లేదు, రెండూ సామీప్య సూచకాలే. అదేవిధంగా తుళులో స్త్రీ వాచకైక వచనాలకి మోళు జ ఉపళ్ కి ఇంబళ్ జ ఇవళ్ కి అర్థభేదం లేదు. పర్జి ఊద్ 'వీడు', ఊర్ 'వీరు' ఉ - నించి వచ్చినవి. ఈ భాషలో వీటికి ఇ. నించి వచ్చిన రూపాలు లేవు. తమిళ, కన్నడాలలో ఉ- ధాతు రూపాలు ప్రాచీన సాహిత్యాలలోనే ఉన్నాయి. అప్పటి భాషల్లో లేవు.

కూయి, బ్రాహుయిలలో ఊ ఓగా మారుతుంది. కూయి ఓ - , కువి హూ - లు అనతిదూర సూచకాలు కాక ఆ - కన్న ఇంకా దూరంలో వున్న వాటిని సూచిస్తాయి. కాబట్టి ఈ రెండు భాషలలో దీనికి అర్థ విపరిణామం జరిగింది అని మనం భావించాలి.

## 1. యుష్మదస్మర్థక సర్వనామాలు :

తెలుగులో యుష్మదస్మదర్థక సర్వనామాల్ని మిగిలిన ద్రావిడ భాషల్లో సజాతి పదాలతో పోల్చి పరిశీలిస్తే వాటి పరిణామక్రమం మనకు స్పష్టమవుతుంది. ఇంతేకాకుండా, తెలుగు ప్రత్యేక భాషగా రూపొందే ముందు అది యే ఇతర ద్రావిడ భాషలతో సన్నిహిత సంబంధం కలిగి ఉండేదో కూడా యీ పరిశోధన స్పష్టం చేస్తుంది / కుండలీకరణాలలో ఉన్నవి ఔపవిభక్తిక రూపాలు ఏటవాలు గీత మాండలిక భేదాలని సూచిస్తుంది.

### అస్మదర్థకైకవచనం /5160/ :

| | | |
|---|---|---|
| తమిళం | యాన్, నాన్ | /ఎన్-/ |
| మలయాళం | ఞాన్ / ప్రాచీన శా. నాన్/ | /ఎన్-/ |

| | | |
|---|---|---|
| కోత | ఆన్ | /ఎన్-/ |
| తొద | ఓన్ | /ఎన్-/ |
| కన్నడం | ఆన్, / ఆ. / నాను | /ప్రా. / ఎన్., / ఆ. / నన్ - / |
| తుళు | ఏను / / సో. / యాను | /ఎన్., ఎన-/ యన-/ |
| తెలుగు | ఏను, నేను | /నన్ -, నా-/ |
| గోండి | అనా / నన్నా | /నా - / |
| కొండ | నాన్ | /నా -/ |
| పెంగో | అన్. ఆనెజ్ | /నా - / |
| మండ | ఆన్ | /నా -/ |
| కూయి | ఆను / నాను | /నా -/ |
| కువి | నాను | /నా -/ |
| కో.నా.ప.గ. | ఆన్ | /ఆన్ - / |
| కూ. మాల్తో | ఏన్ | /ఎంగ్-/ |
| బ్రా | ఈ | /కన్-/ |
| మూ.ద్రా. | *యాన్ / *యన్./ | |
| అస్మదర్థక బహువచనం : | | |
| తెలుగు | యామ్, యాంకళ్, నాంకల్, | / ఎమ్. ఎంకళ్ -/ |
| మలయాళం | ఞాఞ్ఞళ్, ఞఞ్ఞళ్ | / ఎజ్జళ్, జజళ్ -/ |
| కోత | ఆమ్ | / ఎమ్ -/ |
| తొద | ఎమ్ | / ఎమ్ -/ |
| తుళు | ఎంకుళు | / ఎంకళె -/ |
| తెలుగు | ఏము, మేము | / మమ్, మా -/ |
| గోండి | అమ్మట్ / మాఘట్ / | / మా -/ |
| | మమొ / మరాట్ | |
| కొండ | మాన్, మాప్ | / మా -/ |
| పెంగో | ఆప్, ఆపెజ్, 'మేం' | / మా -/ |
| | ఆస్, అహెజ్, అసెజ్ 'మనం' | |
| మండ | ఆం | / మా -/ |
| కూయి | ఆము, మాము, 'మేం' | / మా -/ |
| | ఆజు, 'మనం' | |
| కో.నా.ప.గ. | ఆమ్ | / ఆమ్ -/ |
| పర్జి | ఆమొర్ 'మనం' | |
| కూ.మా. | ఏమ్ | / ఎమ్ -/ |
| మూ.ద్రా. | *యామ్ | /* యమ్ -/ |

**యుష్మదర్థకైక వచనం :**

| | | |
|---|---|---|
| తమిళం | నీ | /ప్రా. నిన్ -/ ఆ. ఉన్ -/ |
| మలయాళం | నీ | / నిన్ -/ |
| కోత | నీ | /నిన్ -/ |
| తొద | నీ | /నిన్ -/ |
| కన్నడం | నీన్, / నీను | /నిన్ -/ |
| తుళు | ఈ | /నిన్ -/, నీ -/ |
| తెలుగు | నీవు, ఈవు | /నిన్ -, నీ -/ |
| గోండి | ఇమ్మా / నిమ్మె | / నీ -/ |
| కొండ | నీన్ | /నీ -/ |
| పెంగో | ఏన్, ఏనెజ్ | /నీ -/ |
| మండ | ఈన్ | /నీ -/ |
| కూయి | ఈను / నీను | /నీ -/ |
| కువి | నీను | /నీ -/ |
| కోలామి | నీవ్ | /ఇన్ -/ |
| నా | ఈవ్, నీవ్ | /ఇన్ -/ |
| ప. గ. | ఈన్ | /ఇన్ -/ |
| కూ. మా. | నీన్ | / నింగ్ -/ |
| బ్రా. | నీ | /నే -, షష్ఠీ విభక్తి, నా -/ |
| మూ.ద్రా. | * నీ / న్/ | / * నిన్ -/ |

**యుష్మదర్థకం బహువచనం :**

| | |
|---|---|
| తమిళం | నీమ్, నీర్, నీయిర్, నీవిర్, నీంకళ్ |
| | / ప్రా. నుమ్ -, ఆ, ఉమ్, ఉంకళ్ -/ |
| మలయాళం | నిజ్జళ్ / నిజ్జళ్ -/ |
| కోత | నీమ్ /నిమ్ -/ |
| తొద | నిమ్- / నిమ్ -/ |
| కన్నడం | నీమ్, నీవు / నిమ్ -/ |
| తుళు | ఈరు / నికుళు / నింక్ళు / నింక్ ళె - / |
| తెలుగు | ఈరు, మీరు, / మిమ్ -, మీ -/ |
| గోండి | ఇమ్మట్ / నిమెట్ / మిరాట్ / మీ / |
| కొండ | మీరు / మీ -/ |
| పెంగో | ఏవ్, ఏపెజ్ / మీ -/ |
| మండ | ఈమ్ / మీ-/ |

| | |
|---|---|
| కూయి | ఈరు / మీరు / మీ -/ |
| కువి | మీంబు, మీరు / మీ -/ |
| కో.నా. | నీర్ / ఇమ్ -/ |
| నా. | ఈమ్ / ఇమ్ -/ |
| ప. గ. | ఈమ్ / ఇమ్ -/ |
| కూ. మా. | నీమ్ / నిమ్ -/ |
| బ్రా. | నుమ్ / నుమ్ -/ |
| మూ.ద్రా. | * నీమ్ / * నిమ్ -/ * నీర్ |

**2. సూచక సర్వనామాలు :**

**పురుషవాచకైక వచనం :**

| | | | |
|---|---|---|---|
| త. | అపన్ | ఇవన్ | ఉవన్ |
| మ. | అవన్ | ఇవన్ | |
| కో. | అవ్న్ | ఇవ్న్ | ఊన్ |
| కొడ | ఆవె / న్/ | ఇవె / న్/ | |
| క. | అవం, అవను | ఇవం, అవను | ఉవం |
| తు. | అయె | ఇంబె | ఉంబె |
| తె. | వాడు | వీడు | |
| గోం. | ఓల్ / వోర్ | ఏల్ / వేర్ | |
| కొం. | వాన్డు / అకన్ | వేన్డు / ఇకన్ | |
| పెం. | అవన్, ఎవన్ | ఇవన్ | |
| కూయి | అలంజు | ఇఅంజు | ఓ అంజు |
| కువి | అ అసి | ఈ వసి | ఊ అసి |
| కో. | అమ్ / అమ్ద్ / అవ్ంద్ | ఇమ్ / ఇమ్ద్, ఇవ్ంద్ | |
| నా. | /చాం. / ఓన్ | ఈన్ | |
| ప. | ఓద్ | | ఊద్ |
| గ. | ఓంద్ | | |
| కూ. | అన్ | ఈన్ | హూన్ |
| మా. | అహ్ | ఈ హీ | |
| మూ.ద్రా | * అవన్త్ | ఇవన్త్ | ఉవన్త్ |

**స్త్రీవాచకైక వచనం :**

| | | | |
|---|---|---|---|
| త. | అవళ్ | ఇవళ్ | ఉవళ్ |
| మ. | అవళ్ | ఇవళ్ | |

| | | | |
|---|---|---|---|
| కో. | అవ్ళ్ | ఇవ్ళ్ | ఊళ్ |
| కొడ | అవ / ళ్ / | ఇవ / ళ్ / | |
| క. | అవళ్ | ఇవళ్ | ఉవళ్ |
| తు. | ఆళు | ఇంబళ్ ఇంబాళ్ | |
| | | ఇంబొళు | మోళు, ఉంబళు |
| / పెం. అదెల్ / అందెల్ / ఇదెల్ / ఎదెల్ | | | |
| మూ.ద.ద్రా. | * అవళ్ | * ఇవళ్ | ఉవళ్ |

**మనుష్యవాచక బహువచనం :**

| | | | |
|---|---|---|---|
| త. | అవర్, అవర్కళ్ | ఇవర్, ఇవర్కళ్ | ఉవర్ |
| మ. | అవర్ | ఇవర్ | - |
| కోత. | అవ్ర్ | ఇవ్ర్ | ఊర్ |
| కొడ. | అవు, అఎంగ | ఇవు, ఇఎంగ | - |
| క. | అవర్ | ఇవర్ | ఉవర్ |
| తు. | ఆరు, అకుళు | మేరు, ఇంబెరఉ | మోకుళ |
| తె. | వారు, వారలు, వీరు, | | |
| | వీరులు, వాళ్ళు | వీళ్ళు | |
| గోం. | ఎడ్ / పూర్ | ఏడ్ / వీర్ | |
| కొం. | వార్ | వేర్ | - |
| పెం. | అవర్ / ఎవర్ | ఇవర్ | - |
| కూయి. | అఅరు | ఇఅరఉ | ఒఅరు |
| కువి. | ఆఆరి | ఈవరి | ఊఅరి |
| కో. | అవ్ర్ | ఇవ్ర్ | - |
| నా / చా / ం. | ఓర్ | ఈర్ | - |
| ప. | ఓర్ | - | ఊర్ |
| గ. | ఓర్ | - | - |
| కూ. | అర్ / అబ్డర్ | ఈర్ / ఇబ్డర్ | హూర్ / హుబ్డర్ |
| మా. | ఆర్ | ఈర్ | - |
| మూ.ద్రా. | * అవర్ | * ఇవర్ | * ఉవర్ |

**పురుషేతర / మనుష్యేతర వాచకైక వచన బహువచనాలు :**

| | | | |
|---|---|---|---|
| తమిళం | అతు, అవ్ / అవై | ఇతు, ఇవ్ / ఇవై | ఉతు, ఉవ్ / ఉవై |
| మలయాళం | అతు, అవ | ఇతు, ఇవ | - |

| | | | |
|---|---|---|---|
| తొద | అత్, అతాం | ఇత్, ఇతాం | - |
| కన్నడం | అదు/ఆతు, ఆత్తు, ఆవు | ఇదు/ఇతు/ఇత్తు, ఇవు | ఉదు, ఉవు |
| తుళు | ఆవు, అయ్‌కుళు | ఇందు | ఉందు? ఉందెకుళు |
| తెలుగు | అది, అవి | ఇది, ఇవి | - |
| గోండి | అద్, అవ్ | ఇద్, ఇవ్ | - |
| కొండ | వాద్ / అక / త్ / | వేద్ / ఇక / త్ / | - |
| | వాక్ / అకేజ్ | వేక్ / ఇకెజ్ | |
| పెంగో | అది/అదజ్ | ఇది/ఇదజ్, ఇవజ్ | - |
| | ఎది / ఎదజ్ | | |
| | అవజ్ / ఎవజ్ | | |
| కూయి | అరి, అవి | ఈరి, ఈవి | ఓరి, ఓవి |
| కువి | అది, అఆతి | ఈది, ఈవతి | ఊది, ఊఅది |
| | | ఈవి, ఈవస్క | హూది, హూఅస్క |
| కోలామి | అద్, అదావ్ | ఇద్, ఇదావ్ | - |
| నాయి | అద్, అంద | ఇద్ | - |
| పర్జి | అద్, అవ్ | ఇద్, ఇవ్ | - |
| గదబ | అద్, ఆవ్ | ఇద్, ఇవ్ | - |
| మాల్తో | అత్, / అవ్ అవె/ | ఈత్ / ఈవ్ ఈవె / | - |
| బ్రాహూయి | - | - | ఓ / ఓద్, ఓఫ్క్ |
| మూ.ద్రా. | * అత్, * అవ్ / | * ఇత్ / * ఇవ్ / | * ఉత్ / * ఉవ్ / |
| | * అవయ్ | * ఇవయ్ | * ఉవయ్ |

### 3. ఆత్మార్థక సర్వనామాలు :

త. మ. తాన్ / తన్ -/, కో. తాన్ / తన్ -/ త -/, తొ, తోన్ / తన్ -/ కొడ. తాను / తన్ -/, తు, తాను, / గౌరవార్థక బహు. వచ. తనుకుళు /, తె. తాను / తన -/, గోం. తన్నా, పెం. తాన్, కూయి, కువి. తాను, కో.ప.గ. తాన్ / తన్ -/ , కూ. మా. తాన్ / తంగ్ -/, బ్రా. తేన్. మూ. ద్రా. * తాన్ / * తన్ -/.

త. తాం / తమ్ -/, /గౌ. బ. / తాంకళ్ / తాంకళ్ -/, మ.తాం. / తమ్ -/, తాంకళ్ / తంకళ్ -/, కో. తాం / తమ్ -/, తొ. తమ్ - / తమ్ -/, కొడ. తంగ / తంగ /, క. తాం. / తమ్. /, తె. తాం / తమ-/, తమరు, తారు, గోం, తమ్మా, తమ్మట్, కూయి. తారు / తాడన్ -/, కువి. తాంబు, కో. నా. ప. గ. తాం / తమ్ -/, కూ. మా. తాం / తమ్. /, మూ.ద్రా. * తామ్-/* తమ్-/, తెలుగు కూయి 'తారు' లో * మ్ బహువచన ప్రత్యయం స్థానాన్ని దానికన్న ప్రచురమైన * ర్ బహువచన ప్రత్యయం ఆక్రమించింది. తె. తమరులో జ ర్ ప్రత్యయం ప్రాచీన ప్రత్యయం పక్కన చేరింది. ఇదే విధంగా తమిళ మలయాళ కొడగులలో *మ్ కన్న ప్రచురమైన *కళ్ ప్రత్యయం దాని పక్కన చేరింది. తమిళ, మలయాళ, కన్నడ, తెలుగులలో ఈ శబ్దం 'మీరు' అనే అర్థంలో దాని కన్న ఎక్కువ గౌరవసూచకంగా వాడబడుతోంది.

### 4. యత్ప్రశ్నార్థక సర్వనామాలు :

వీటిలో ధాతువు * యా -, * ఏ-, *ఎ- అని మూడు రూపాలతో ఉంటుంది. ఈ మూడింటిలో యా - ప్రాచీన తమం, త. యావన్ / ఎవన్ ఏవడు, యావళ్, యారళ్, ఎవళ్, 'ఎవర్తి', యార్, ఆర్, యావర్, అవర్, ఎవర్ / కళ్ / 'ఎవరు', యావతు, యాతు, ఎతు 'ఏది' యా, యాభై, 'ఏవి', మ. యావన్, ఏవన్ 'ఎవడు' యావళ్ / ఏవళ్ 'ఎవర్తి' యావర్, ఏవర్, యార్, ఆర్ 'ఎవరు', యా. యాతు, ఏతు, ఏన్, 'ఏది', ఏవ 'ఏవి', కోత. ఎవ్న్, ఎవ్ళ్, ఎవర్, ఎద్ / ఎద్న్ / ఏద్ / ఎన్, తొ. ఏత్, 'ఎవరు / లింగ భేదం లేదు /, బ.వ. ఏతాం, కొడ. ఆరు, దారు 'ఎవరు' / వచనభేదం లేదు /, ఏవె / న్ /, ఏవ, ఏవు, ఏదు, క. యావను / అవం / అవె, యావళు / అవర్, యార్ ఆర్ / దారు, అవుదు, అవువు, తు. ఏరు, ఏరణె 'ఎవరు', తె. ఎవడు, ఎవ్వతె / ఎవర్తె, ఎవరు / ఏరు, ఏది / ఎది, ఏవి / ఎవ్వి, గోం. బోర్ / బోల్'ఎవరు / ఏ.వ. /, బూర్ /బోడ్ / బ.వ. /, బద్, 'ఎవర్తె, ఏది', / బ.వ. / బవ్, కొం. ఏవ్ / అయెన్, ఏర్ / అయెర్, ఏం / అయెద్, ఏవ్ / అయెక్, పెం. ఇన - 'ఏ', ఇవెన్, ఇందెల్, 'ఎవర్తి', ఇనెర్, మం. అం - 'ఏ' అమ్నన్ 'ఎవరు' అమ్ది 'ఏమిటి', కూయి. అన్ / ఇన్ - 'ఏ'. అనంజు, అనరు, అనరి, అని, కువి. అంబసి / ఇంబ అని, అంబరి / ఇంబ అరి, ఏనరి, అంబయి / ఇబయి, అంబ ఇ/ఇంబ ఇ.కో. ఎం / ఎయ్ద్ / ఏ / న్ / ఏంద్, ఏర్, ఎద్, ఎదాన్, నా / చాం /, ఏన్ 'ఎవరు / వు / ఏద్ 'ఏది'/, ఏ.వ./, నేనే ఎవరు / బ.వ./, ఎక్దస్ 'ఎవడు', ఎక్దా 'ఎవర్తి' 'ఏది' ఎంద్రద్ 'ఏమిటి', మా, నేరే / హ్ // ఇకె / హ్ /, నేరెర్ / ఇకెర్, నేరి / త్ /, నే / త్ /, ఇకి /త్ /, బ్రా. ఆరా ఏ, దేర్, దే 'ఎవరు / వచన భేదం లేదు /, అంత్ ఏమిటి.

గోండీ రూపాల్లో బకారం మొదట ఉండడం విశేషం. కూయి ఇంబి, ఎంబఇ, 'ఎవరు', కువిలో అంబసి 'ఎవడు' మొదలైన రూపాలవల్ల గోండీ రూపాలు వర్ణవ్యత్యయం వల్ల ఏర్పడ్డాయని చెప్పవచ్చు. మనుష్య బహువచన రూప ఏకవచన రూపాలకి బదులు తెలుగులాగే చాలా భాషలతో వాడబడుతోంది.

సూచక, యత్ప్రశ్నార్థక సర్వనామాల ధాతువులనించి విశేషణాలూ, క్రియా విశేషణాలూ అనేకం ఇంచుమించు అన్ని భాషలలోనూ ఉన్నాయి.

### 3. ద్రావిడ భాషలు - పురుషబోధక ప్రత్యయాలు :

ద్రావిడ భాషా క్రియల్లో పురుష ప్రత్యయాలు వాటికి సంబంధించిన సర్వనామాలని పోలివుంటాయి. కాబట్టి కాల్డ్‌వెలూ మరికొందరు పండితులూ మొదట్లో ద్రావిడ భాషా క్రియల్లో మలయాళంలోలాగా పురుష ప్రత్యయాలు లేవనీ వాటికి సర్వనామాలు స్పష్టత కోసం తర్వాత కాలంలో చేర్చబడ్డాయనీ ఊహించారు. ఇలా చేర్చబడిన సర్వనామాలే ఉచ్చారణ వేగం వల్ల పురుష ప్రత్యయాలుగా మారేయని వారి ఊహ. ఈ ఊహని మొదట వ్యక్తం చేసిన కాల్డ్‌వెలే ద్రావిడ క్రియల్లో పురుష ప్రత్యయాలు లేకుండా వుండడం మూల ద్రావిడ భాష మాండలికాలుగా విడిపోయిన కాలానికి చాలా ముందు కాలానికి చెందినదనీ అనాగరక భాషల్లో సహితం పురుష ప్రత్యయాలు వున్నాయనీ నిర్ణయించాడు.

యలయాళంలో పురుష ప్రత్యయ లోపం :

మలయాళంలో పురుష ప్రత్యయాలు లేకపోవడం ఒక ప్రత్యేకత. ఆధునిక మలయాళంలో దీనివల్ల అసమాపక క్రియల మధ్య భేదం నశించింది. కాని వ్యావహారిక భాషలో ఉచ్చారణార్థకంగా క్వార్థకం చివర సంవృత ఆకారమూ సమాపక క్రియ చివర ఉకారమూ చేరడం వల్ల ఈ భేదం వ్యక్తమవుతుంది. 'వచ్చి', వచ్చాను, మొ ప్రాచీన తమిళాంధ్రాల్లో కూడా పురుష ప్రత్యయాలు లేని కొన్ని ప్రథమ పురుష సమాపక క్రియలు వున్నాయి. వీటి ఆధారంగా మూల భాషా క్రియల్లో పురుష ప్రత్యయాలు వుండేవి కావనీ, ఆ స్థితిని మలయాళం ఈనాటికీ నిలుపుకొందనీ కొందరు పండితులు వాదించారు. కాని ఎల్.వి.

రామస్వామి అయ్యర్ మలయాళం చారిత్రకాధారాలు మూలంగా ఈ వాదాన్ని ఖండించి ఆ భాషలో ప్రాచీన కాలంలో పురుష ప్రత్యయాలు వుండేవనీ ఆర్వాచీన కాలంలో అవి నశించాయనీ నిరూపించారు. దీనికి ఆయన చూపిన ఉపపత్తులు ఇవి -

మలయాళం ప్రత్యేక భాషగా మధ్యకాల తమిళం నించి 10వ శతాబ్ది ప్రాంతంలో మాత్రమే విడిపోయింది. అంతకు ముందు ఈ రెండు భాషలూ ఒకటిగానే వుండేవి.

సాహిత్య గ్రంథాల్లోనూ, శాసనాల్లోనూ పురుష ప్రత్యయాలు లేని రూపాలు ప్రాచీన కాలంలో తక్కువగా వున్నా కాలక్రమంలో అటువంటి వాటి సంఖ్య ఎక్కువయింది. పురుష ప్రత్యయాలు ఉన్న రూపాలకంటె అవి లేనిరూపాలు కాలక్రమంగా ఎక్కువ అవడం భాషలో కాలక్రమంగా పురుష ప్రత్యయాలు లోపించడాన్ని సూచిస్తుంది.

'లీలాతిలకం' అనే 14వ శతాబ్ది మలయాళం వ్యాకరణంలో పురుష ప్రత్యయాలున్న రూపాలు నిమ్నకుల మాండలికాలలో వున్నట్టు సూచించబడింది. దీనివల్ల ఆ కాలంలో ఇంకా కొన్ని మాండలికాల్లో పురుష ప్రత్యయాలు మిగిలివున్నట్లు తెలుస్తుంది.

అమినిదీవు, లక్కదీవుల్లో మహమ్మదీయుల మాండలికంలో నేటికీ పురుష ప్రత్యయాలు నశించకుండా వున్నాయి.

మలయాళం తప్ప మిగిలిన అన్ని ద్రావిడ భాషల్లోనూ పురుష ప్రత్యయాలు ఇంచుమించు తుల్యరూపాలలో వున్నాయి.

## ఉత్తమ పురుషైక వచనం * - ఎన్, * ఏన్ :

ఇది బ్రాహూయీ తప్ప మిగిలిన అన్ని భాషల్లోనూ వుంది. బ్రాహూయీ -ఇవ్, -వ్ ఆర్య భాషల నించి వచ్చినదని జూల్ బ్లాక్ అభిప్రాయం. పెంగొ - ఆజ్ ఆ భాషలో ఉత్తమ పురుష సర్వనామమైన ఆన్ / అనేజ్ రెండో రూపం చివరనున్న -ఎజ్‌కి సంబంధించినది. కాని ఈ - ఎజ్ ఎలా వచ్చిందో తెలియదు.

ప్రాచీన తమిళంలో చారియై - అన్ - తర్వాత హ్రస్వాచ్చు గల పురుష ప్రత్యయాలే వస్తాయి. చారియై లేనిచోట్ల సాధారణంగా దీర్ఘాచ్చుగల రూపాలే ఉంటాయి. కాని ప్రాచీన భాషలో చారియై లేనిచోట్ల హ్రస్వాచ్చు గల ప్రత్యయాలు కొన్ని చోట్ల వస్తాయి. నిఱుప్పెన్ పెడతాను, సంఘవాఙ్మయంలో -అన్ కూడా ఉంది : అఱికువన్ 'నేను ఎరుగుదును'. దీని రూపాంతరం, ఆల్ భవిష్యత్కాల క్రియల్లో వుంది. వేంటువల్ అడుగుతాను.

చాలా భాషల్లో పురుష ప్రత్యయాల అచ్చులు పదం చివర భాగంలో వుండడం వల్ల సూత్రీకరణ సాధ్యం కాని విధంగా చాలా మార్పులు పొందేయి.

## ఉత్తమ పురుష బహువచనం / అనుభవం / * -ఏం, * ఎం :

దీని ప్రతి రూపాలు అన్ని భాషల్లోనూ వున్నాయి.

## ఉత్తమ పురుష బహువచనం / ఉభయం / :

అనుభయార్థక ప్రత్యయం కంటె భిన్నమైన ఉభయార్థక ప్రత్యయం ఈ కింది భాషల్లో మాత్రమే వుంది. కోత - తొద, కన్నడం, తెలుగు, గోండీ - కొండ - పెంగొ - మండ - కూయి - కువి, పర్జీ, కూడుఖ్ - మాల్తో కన్నడం, తెలుగలలో ఇది ఉభయ ప్రార్థనంలో మాత్రమే వుంది. పర్జీలలో కూడా ఇది విధ్యర్థకాల్లో మాత్రమే వుంది. దీనికి చెందిన ప్రత్యయాలు భిన్న శాఖల్లో భిన్నంగా వున్నాయి. కాబట్టి దీని మూలరూపం నిర్ణయించడం దుస్సాధ్యం. కాని కోత - ఓం, తొద - ఉం, కన్నడం - అం, తెలుగు - అము / - అం ఆధారంగా దీని మూలరూపం * అం / * ఆం అని పునర్నిర్మించవచ్చు.

గోండీ - కొండలలో జ - అద్ ప్రతిరూపాలుండడం వీటి సాన్నిహిత్యాన్ని నిరూపిస్తుంది.

పెంగో - మండ - కూయి - కువి ప్రత్యయాల మూలరూపం * అన్.

కూడుఖ్ - మాల్తో ప్రత్యయాల మూలరూపం * - / అ / త్, దీనికి ఈ భాషలలో ఉభయార్థక సర్వనామమైన * నాం కీ సంబంధమే లేదు. మిగిలిన భాషలలో ప్రత్యయాలు వాటికి సంబంధించిన సర్వనామాల్ని పోలి ఉంటాయి.

ఈ ప్రత్యయంలో భాషల మధ్య నున్న భేదం వల్ల ఈ ఉభయానుభయ భేదం క్రియల్లో ఎక్కువ వ్యాప్తి చెందలేదని ఊహించవచ్చు. సర్వనామాల్లో ప్రాచీనకాలం నించీ ఉన్న ఈ భేదం క్రియలలోకి భిన్న భాషా శాఖలలో కాలక్రమంగా వ్యాప్తిచెంది వుండవచ్చు.

## మధ్యమ పురుషైక వచనం * అయ్, * - ఇ :

తెలుగు, కోలామీ, నాయకీ, పర్జీ, గదబ, బ్రాహూయీలు తప్ప మిగిలిన అన్ని భాషల్లోనూ వీటి ప్రతిరూపాలు వున్నాయి. పర్జీలో - -త్, గదబలో -వ్ ఉండటం వీటి ప్రత్యేకత బ్రాహూయీ ప్రత్యయం ఆర్య భాషల నించి వచ్చింది.

తెలుగు -వు, -వి భూతభవిష్యత్కాలాల్లో వైభాషికం : వచ్చితి / వి /, వత్తు / వు /, సర్వనామమైన * నీ నీవుగా మారిన తర్వాత క్రియలో వు, వి, చేరేయి. ఇవి వైభాషికం కావడం వీటి ఆర్వాచీనతని తెలుపుతుంది.

ప్రాచీన తమిళంలో -ఇ భవిష్యత్కాల ప్రత్యయమైన త్త్ / త్ తర్వాత మాత్రమే వస్తుంది. -అయ్ మిగిలినచోట్ల వస్తుంది. చారియె. ఉంటే దీని హల్లు హ్రస్వమై ఇది బాగా మారుతుంది.

## మధ్యమ పురుష బహువచనం * అయ్ - *ఈర్ :

గోండీ తప్ప మిగిలిన అన్ని భాషల్లోనూ దీని ప్రతిరూపాలు వున్నాయి. గోండీ -ఈవ్ ఆ భాషలో సర్వనామమైన నిమ్మేట్ / ఇమ్మట్‌కి సన్నిహితమైనది. ఈ సర్వనామం మూ.ద్రా. * నీమ్ కి ఏట్ / అట్ అనే క్రొత్త బహువచన ప్రత్యయం చేరి ఏర్పడ్డది. కోయమాండలికంలో -ఈరి మిగిలి వుంది.

మూలభాషలో మధ్యమ పురుష బహువచన సర్వనామానికి జ నీం, జనీర్ అని రెండు రూపాలు వున్నాయి. వీటిలో జనీం ప్రాచీన తరమని ఇంతకుముందే చూశాం. కాని జ-ఈర్ ప్రత్యయం ఆర్వాచీనమైన జ నీర్‌కి సంబంధించింది. జనీం కి చెందిన జ-ఈంకోత, వ్యావహారిక తమిళాలలో మాత్రమే వుంది. /వ్యా.త. వంతింకె ఎజ వంతీంకళ్, లిఖిత భాషారూపం వంతిర్‌కళ్ /. అతి ప్రాచీన కాలంలో మూలభాషలో జ ఈం ఉండేదనీ, జ నీర్ వ్యాప్తిలోకి వచ్చాక జ-ఈంకి బదులు జ-ఈర్ వ్యాప్తిలోకి వచ్చిందనీ మనం ఊహించవచ్చు.

## ప్రథమ పురుష :

ప్రథమ పురుషలో మనుష్య బహువచనానికి తప్ప మిగిలిన వాటికి మొదట్లో పురుష ప్రత్యయాలు లేవు. కాబట్టి ప్రథమ పురుషలో ఏకవచన పురుష ప్రత్యయాలూ, మనుష్యేతర బహువచన పురుష ప్రత్యయమూ కొంత ఆర్వాచీన కాలంలో అర్థ సందిగ్ధతని నివారించడానికి ఆయా సర్వనామ రూపాలు ఆధారంగా సృష్టించబడ్డాయని అనాలి.

**పురుషైక వచనం :**

దక్షిణశాఖలో ప్రత్యయం * -అన్, * అన్ మధ్య శాఖలో * అన్‌ట్, ఇది ఈ శాఖలో సర్వనామరూపమైన * అవన్‌ట్‌కు సన్నిహితం.

కూడుఖ్ - అన్, మాల్తో - ఆహ్ సర్వనామాలైన కూ. అస్, మా. అహ్‌లకు సన్నిహితాలు, గోండీ - ఓల్ ఆ భాషలో సర్వనామమైన ఓల్ / వోర్ కు సన్నిహితం.

ప్రతి భాషలోనూ లేక శాఖలోనూ సర్వనామాల పొందిన మార్పులకు అనుగుణమైన మార్పు దానికి సంబంధించిన పురుష ప్రత్యయంలో కూడా జరగడం గమనించదగినది. దీనివల్ల పురుష ప్రత్యయాలు సర్వనామాలు ప్రభావానికి లోనవుతాయి అనే విషయం స్పష్టమవుతుంది.

**స్త్రీ లింగైక వచనం - ఆళ్, * - అళ్ :**

ఇది దక్షిణ శాఖలో మాత్రమే వుంది. ఈ ప్రత్యయం మొదట్లో * ఆళ్ 'స్త్రీ' అనే ప్రత్యేక పదం.

**మనుష్య బహువచనం * - ఆర్ :**

లింగభేదం వశించిన తౌద తప్ప మిగిలిన అన్ని భాషల్లోనూ బ్రాహూయీతో సహ్ దీని ప్రతిరూపాలు వున్నాయి.

తెలుగు తప్ప మిగిలిన అన్ని మధ్య భాషల్లో ఈ ప్రత్యయం పురుష బహువచన సూచకమే అయినా కర్తృపదబంధం లో స్త్రీ పురుష వాచక పదాలు కలిసి వున్నప్పుడు కూడా అఖ్యాత పద బంధంలో ఈ ప్రత్యయంలో వున్న క్రియరూపమే వుంటుంది. దీనికి ఉదాహరణలు :

పర్జీ : కూయెద్ ఏరోడ్ ఓర్ ఎకె వెర్రర్ గె 'వాడు పిలిచినప్పుడు వాళ్ళు / వాడి అన్నలూ వారి భార్యలూ / వచ్చారు.

గోండీ : వెడీల్ వెయ్‌లో వేర్నీ తెరీసీ సూడ్‌లే లాక్తేర్ 'ముసలివాడూ ముసలిదీ మూతతీసి చూశారు.

దీనివల్ల ఈ శాఖలో కూడా ప్రాచీన కాలంలో ఈ ప్రత్యయం మనుష్య బహువచన సూచకమే అని తెలుస్తుంది.

ప్రాచీన తమిళంలో భవిష్యత్కాల ప్రత్యయం తర్వాత -ఆర్, -అర్ కి బదులు వైభాషికంగా -ఆ కూడా వుంటుంది. ఎన్‌ప ' /వాళ్ళు / అంటారు'.

**పురుషైతరైక వచనం / అమనుష్యైక వచనం *-/అ/త్ :**

దీని ప్రతిరూపాలు అన్ని దక్షిణశాఖా భాషల్లోనూ, తెలుగు, కొండ, పెంగొ, మండ, కోలామి, నాయకీ, ఛాందా/, కూడుఖ్ -మాల్తోల్లోనూ వున్నాయి. ఇది దీనికి సంబంధించిన సర్వనామమైన * అత్‌కి చాలా సన్నిహితం.

**అమనుష్య బహువచనం / పురుషేతర బహువచనం / * -అవ్ :**

మూలద్రావిడంలో అమనుష్య బహువచనం తెలుగు తప్ప మిగిలిన మధ్య భాషలలో పురుషేతర బహువచనంగా మారింది. మిగిలిన భాషల్లో దీని అర్థంలో మార్పు లేదు.

ప్రాచీన తమిళ మలయాళాల్లోనూ, తుళులోనూ దీనికి ప్రత్యయం -అ. ప్రాచీన తమిళం తోన్‌ఱువ / అవి / కనబడతాయి. తుళంకిన ' / అవి/ కదిలేయి', జ -అవ్ వకార లోపం వల్ల -అగా మారిందని చెప్పడానికి ఆధారాలు వున్నాయి.

కన్నడం, తెలుగు, కోలామీ, పర్జీ, గదబలలో ప్రత్యయంలో వకారం ఉంది. కూయి - కువిలో పశ్చిమాచ్చులు కూడా జ-అవ్ నించి వచ్చినవి కావచ్చు. ప్రత్యయమైన జ - అవ్‌కీ సర్వనామమైన జ అవ్ / అవయ్‌కీ సన్నిహిత సంబంధం ఉంది.

గోండీ -ఆజ్, పెంగొ -ఇజ్ అజంత నామాలలో అమనుష్య బహువచన ప్రత్యయమైన జ్‌కి సంబంధించినవి. ఇది సామ్యం వల్ల క్రియకి చేరింది. పెంగొలో బహువచనంలో స్త్రీకి లింగంలో -ఇక్, ఆమనుష్య లింగంలో -ఇజ్ ప్రత్యయాలు వున్నాయి. పెంగొకి సన్నిహితమైన భాషల్లో క్రియారూపాల్లో ఇలాంటి భేదం లేదు.

వ్యావహారిక తమిళం, కూడుఖ్ - మాల్తోలలో అమనుష్య బహువచనానికి వేరే ప్రత్యయం లేదు. ఏకవచన రూపాలే బహువచనానికి కూడా వాడబడతాయి. ఈ పరిస్థితి మొదట్లో అమనుష్య బహువచన ప్రత్యయం వైకల్పికం అనే సత్యాన్ని నిరూపిస్తుంది.

## 4. కృదంత రూపాలు

'కృత్తు' అనేది వ్యాకరణ సంజ్ఞ 'కృ' ధాతువునకు 'క్విప్' అనే కృతకృత్యయం చేరితే ఏర్పడే రూపం 'కృత్తు'.

తెలుగులో ప్రాచీన వ్యాకరణాలయిన ఆంధ్రభాషా భూషణం, చింతామణి మొదలైన వానిలో కృదంతాల్ని విశేషంగా చెప్పలేదు. చిన్నయసూరి కృదంత రూపాల్ని గూర్చి విశేషంగా చెప్పాడు. సూరి సంస్కృత వ్యాకరణ బాణీలో తెలుగు వ్యాకరణం రాశాడు. కృదంత రూపాలు అదే బాణీ నడిచాయి. చిన్నయసూరి 'ధాతువునకు చేరుపడు ఇన్న ప్రత్యయంబు కృత్తు నాబడు' అని నిర్వచించాడు.

### ద్రావిడ భాషలు :

I మధ్య ద్రావిడ భాషలు :

### 1. తెలుగు :

| | |
|---|---|
| క. | అలుక, ఎఱుక, కలక, నడక, మూఁక, మొలక, రాక |
| ఇమి. | కలిమి, ఓరిమి, కూరిమి, వ్రేరిమి |
| త్ర. | చేఁత, ఆలఁత, కూఁత, కోఁత, వ్రాఁత, మ్రోఁత |
| కువ. | అడఁకువ, మెలఁకువ, లోఁకువ |
| ట. | ఆట, ఊట, ఓట, పాట, మంట, వంట |
| టు. | పాటు, చేటు, కాటు, పోటు |
| పము. | కలపము, మురిపము |
| త. | ఆవులింత, ఓకిలింత, గిలిగింత |
| పు. | మాపు, మేపు, ఇంపు, కానుపు, కాపు, చూపు, తలఁపు |
| ఇక. | కోరిక, కూడిక, ఓపిక, అమరిక, ఆరయిక |
| బడి. | ఏలుబడి, కట్టుబడి, తీఱుబడి, పెట్టుబడి, రాబడి |

గడ. చేరుగడ, మనుగడ

ఇకి. పూనికి, పోలికి, కోరికి, చూడికి

వు. మనువు, కావు, కొలువు, చావు, పోవు, పూవు

అ. గీఱ, ఎండ, కాయ, వ్రయ్య, వెల

అకము. అమ్మకము, మాఱకము, నమ్మకము

డు. అమ్ముడు, అల్లుడు, త్రొక్కుడు, దంపుడు

వడి. కొలుపడి, నడవడి

వి. తనివి, తెలివి

అవు. తగవు, నగవు

ఇ. చేయి, వ్రాయి

కలి. వినుకలి, కనుకలి

**2. కొండ :**

ఉణ్ : నేంజుణ్ 'ఊపిరి'
/ నేంజ్ 'ఊపిరిపీల్చు2 /

కు : మూల్కు 'మూత్రము'
/ మూల్ 'మూత్రము' విడుచు /

**3. కూయి :**

ఎడి : పంగెడి 'కర్రపలక'

కిసెడి : 'చెవిపోగు'

ఎరి : కో ఎరి 'కోతలు'

బడి : సీపాడి 'గరిటె'

బరి : దేస్పారి 'ఎత్తడం'

ఒలి : డ్రుంగొలి 'ఉయ్యాల'

**4. పెంగొ :**

కొండ్ : కేచేకొండ్ 'కల'
కేర్కొండ్ 'పాట'

పొండ్ : కుత అస్పొండ్ 'దగ్గు'

అ : డప 'తవ్విన యట్టి'

పక : చీలిక

ఇ : క్యేంజి 'కల'

**5. కోలామీ : ఊడ్ :**

సీ ఊడ్ 'ఇవ్వడం', 'ఇచ్చినది'.

| | | |
|---|---|---|
| పండూడ్ | : | పండు |
| ఏలూడ్ | : | చూడబడినవాడు |
| ఉంబులూడ్ | : | మూత్రం |

**6. పర్జీ :**

ఉర్జుకుడ్ 'చెయట'

| | | |
|---|---|---|
| తుమ్‌కుడ్ | : | తుమ్ము |
| నొయ్‌కుడ్ | : | నెప్పి |
| ఆల్ | : | నేఞల్ 'ఊపిరి' |
| | | ఊబల్ 'చెప్పడం' |
| | | కాచల్ 'కావడిబద్ద' |
| ఉచ్ | : | ఉయ్‌కుచ్ 'పాముకూసం' |

**II దక్షిణ ద్రావిడ భాషలు :**

**1. తమిళం :**

| | | |
|---|---|---|
| ఇ | : | వెకుళి 'కోపం' |
| వక | : | పార్వల్ 'చూడడేం' |
| పు | : | ఒప్పు 'పోలిక' |
| | | మాణ్బు 'గొప్పతనం' |
| ఇల్ | : | మిచ్చిల్ 'మిగులు' |
| ఉళ్ | : | మిక్కుళ్ 'ఎక్కిళ్లు' |
| | | విళైదుర్ 'పంట' |
| కాటు | : | సాక్కాటు 'చావు' |
| ఐ | : | విలై 'వెల' |
| | | కొలై 'చంపడం' |
| | | నకై 'నవ్వు' |
| వు | : | అఱివు 'జ్ఞానం' |
| | | వాళ్‌వు 'బ్రతుకు' |
| | | ముఱివు 'అంతం' |
| ఆవు | : | చెలవు 'పోవడం' |
| | | ఉణవు 'తిండి' |
| | | కళవు 'దొంగతనం' |

తి : మికుతి 'ఎక్కువ'
పకుతి 'విభాగం'

క్కై : వాళ్క్కై 'బ్రతుకు'
వరుకై 'రాక'

వి : కేళ్వి 'ప్రశ్న'
కల్వి 'చదువు'

చి : ముయట్చి 'ప్రయత్నం'
ఆటి 'ప్రభుత్వం'
ముకిళ్చి 'సంతోషం'

అం : ఆకలం 'వెడల్పు'
చినం 'కోపం'
అచ్చం 'భయం'

**ధాత్వచ్చుదీర్ఘయవడం :**

కేటు 'చేటు' / కెటు 'చెడు' /
పేఱు 'పొందడం' / పెఱు 'పొందు' /
కోళ్ 'సిద్ధాంతం' / కోళ్ 'తీసుకొను' /
ఊణ్ 'తిండి' / ఉణ్ 'తిను, తాగు' /
తిన్ 'తిండి' / తిన్ 'తిను' /

**అంత్య స్పర్శం ద్విరుక్తమవడం :**

ఎఴుత్తు 'అక్షరం' / ఎఴుతు 'రాయు' /
విళక్కు 'దీపం' / విళంకు 'ప్రకాశించు' /
పాట్టు 'పాట' / పాటు 'పాడు' /

**2. మలయాళం :**

తల్ : పాచ్చల్ 'పరిగెత్తడం'
కెటుతల్ 'చెడడం'

పు : కిటప్పు 'పడుకోవడం'
పార్పు 'బ్రతకడం'

వు : అఱివు 'జ్ఞానం'
నినవు 'జ్ఞాపకం'

చ్చ : చేర్చ 'సంబంధం'
విళ్చ్చ 'పడడం'

తి : 'అఱుతి 'అంతం'
పొఱుతి 'ఓర్పు'

త్తు : నెయ్‌త్తు 'నేత'
కొయ్‌త్తు 'కోత / లు / '

త్తం : పిటిత్తం 'పట్టిడం'
నటత్తం 'నడక', 'నడత'

ఆ : నిల 'స్థానం'
కోట 'దానం'

ఇ : కేళి 'వినడం'
తోలి 'ఓడిపోవడం'

అం : నీళం 'పొడుగు'
అళం 'లోతు'
ఎణ్యం 'అంకె'
కళ్లం 'అబద్దం'

మ : ఓర్మ 'జ్ఞాపకం'
కూర్మ 'వాడి'
తాళ్మ 'లోతు'

వి : మఱవి 'మరుపు'
పిఱవి 'పుట్టుక'
తోల్వి 'ఓడిపోవడం'

పటి : నటపట 'నడవడి'

తల : మఱుతల 'ఇంకొకవైపు'
నటుతల 'మధ్యభాగం'

మానం : తేమానం 'ఆరుగుదల'
వరుమానం 'రాబడి'
తీరుమానం 'తీర్మానం'

టు : సుమటు 'నెత్తిమీద బరువు'

**ధాత్వచ్చు దీర్ఘమవడం :**

ఊణు 'భోజనం' / ఉణ్ 'తిను' /
చూటు 'వేడి' / చూటు 'కాలు' /

**అంత్య స్పర్శం ద్విరుక్తమవడం :**

పాట్టు 'పాట' / పాటు 'పాడు' /
ఓత్తు 'చదవడం' / ఓతు 'చదువు' /

ఊట్టు 'ఊట' / ఊఱు /
విళక్కు 'దీపం' / విలఙ్గు 'వెలుగు' /

## 3. కన్నడం :

అల్ : అళల్ 'దుఃఖం'
ఏఱల్ 'సింహాసనం'
ఇ : పుట్టి 'పుట్టినవాడు'
ఆడి 'ఆడేవాడు'
అర్ : బెళర్ 'వెలుగు'
కె / క్కె : అగల్కె 'విడదీయడం'
అఱికె 'ప్రసిద్ధి'
ఇర్కె 'నివాసం'
కాణ్కె 'చూపు'
బెంకె 'వేడి'
గె : ఆడుగె 'వంట'
బేగె 'మంట'
ఇగె : తొడిగె 'భూషణం'
ఇల్ : మిగిల్ 'గొప్పతనం'
పుగిల్ 'ప్రవేశం'
కుళి / గుళి : పోర్కుళి 'పోట్లాడేవాడు'
అం : అగలం 'వెడల్పు'
గెల్లం, 'జయం'
పొంకం 'పొంగు'
ఆటం 'ఆట'
పాటం 'పాట'
ఆవు : తొడవు 'భూషనం'
గెలవు 'జయం'
బరవు 'రావడం'
వు : అఱివి 'జ్ఞానం'
అళివు 'నాశం'
నోవు 'నెప్పి'
నావు 'చావు'
పు : పొళెపు / పొళవు 'తెలుపు'
కాయ్పు 'కోపం'
కాపు 'రక్షణ'

తె : పొగళ్తె 'పొగడ్త'
నెగళ్తె 'కీర్తి'
పె : కయ్పె 'చేదు'
మె : కూర్మె 'ప్రేమ'
పి : నోంపి 'నోము'
కల్పి 'చదువు'
వి : నెరవి 'పోగుచేయడం'
ఆళవి 'కొలత'
ఇసు/సు : ఉణిసు 'భోజనం'
మునిసు 'కోపం'
పం : తోనెపం 'ఊగడం'
బరెపం 'వ్రాత'
తం : గెయ్తం 'పని'
మేతం 'మేత'

## ధ్వాత్వచ్చు దీర్ఘమవడం :

కోళ్ 'తీసుకోవడం' / కొల్ తీసుకొను /
సూడు 'వేడి' / సుడు 'కాలు' /
కేడు 'చేటు' / కిడు కెటు 'చెడు' /
కోడు 'దానం' / కుడు కొట్టు 'ఇచ్చు' /

## 4. తుళు :

ఇ. మెంచి 'మరుపు
గుత్తి 'మోడు'
ఎ. కట్టె 'కట్టినది'
పత్తె 'గుర్తు'
ఎలు. ముచ్చెలు 'మూత'
కడపెలు 'తిరగలి'
కిర్ంబెలు 'దురద'
బాపెలు 'చావు'
కొద్దెలు 'పులుసు'
అంద : ఒప్పంద 'ఒప్పందం'
డి : తిండి 'తిండి'
ఆలు : కావలు 'కావలి'

| | | |
|---|---|---|
| వు | : | మేవు 'మేత' |
| | | కళవు 'దొంగతనం' |
| అయ | : | బత్తయ 'చాలాసార్లు అడగడం' |

**5. కొడగు :**

| | | |
|---|---|---|
| పు | : | ఒప్పు 'ఒప్పందం' |
| | | నిప్పు 'నిలబడడం' |
| /ఇ/కె | : | బాకె 'జీవితం' |
| | | సందికె 'నమ్మకం' |
| /అ/వు | : | చావు 'చావు' |
| | | అరివు 'జ్ఞానం' |
| | | తరవు 'ఇవ్వడం' |
| పె | : | కుడిపె 'తాగడం' |
| ఇ | : | తిని 'తిండి' |
| ఇట | : | తమ్మాట 'తుమ్మడం' |
| | | నడకాట 'నడవడం' |
| ఆమె | : | ఉక్కామె 'వ్యవసాయం' |
| కు | : | పోకు 'నడవడి' |

**6. తొద :**

| | | |
|---|---|---|
| క్య్ | : | నొబ్క్య్ 'నమ్మకం' |
| | | కోణ్క్య్ 'కానుక' |
| ఫ్ | : | కేళ్ఫ్ 'వార్త' 'మాట' |
| య్ | : | పోత్య్ 'పక్క' |
| | | పఖియ్ 'భాగం' |
| మ్ | : | ఒణ్మ్ 'లెక్కపెట్టడం' |
| | | వీడమ్ 'పరుగు' |
| ప్ | : | నడప్ 'నడవడి' |
| | | నెన్ప 'జ్ఞాపకం' |
| ఇల్ | : | కోఫిలా 'కాపలా' |
| | | కూసిల్ 'కుప్ప' |
| ఫ్య్ | : | కల్ఫ్య్ 'చదువు' |
| త్ | : | వేస్త్ 'ఇల్లునెయ్యడం' |
| ఖా | : | ముచ్ఖా 'మూత' |
| ఖుళ్య్ | : | పూత్ఖుళ్య్ 'చొక్కా' |

**3. ఉత్తర ద్రావిడ భాషలు :**

**1. బ్రాహూయీ :**

అ : చండ 'కదలిక' / చండ్ 'కదులు' / జక్క 'దగ్గు'

స్ : తిస్ప్ 'దానం' / తిన్ - 'ఇచ్చు' / ఖులీస్ 'భయం' / ఖుల్ - 'భయపడు'

పీరేస్ 'వాపు' / పిర్ - 'వాచు'

అర : ఈ కృదంత రూపం ధ్వనుల్ని సూచించే క్రియలకే చేరుతుంది.

గార్రార 'గొర్రె' / మేక అరుపు'

పక్కార 'కుక్క అరపు'

ఈ ఝూర 'ఈల వెయ్యడం'

మధ్య, ఉత్తర ద్రావిడ భాషల సాహిత్య భాషల్లో ప్రాచీన కృత్ప్రత్యయాలు చాలా వరకు నశించాయి. ఈ విషయంపై సమగ్రమైన పరిశోధన జరగవలసి వుంది. సాహిత్యభాషల్లో కూడా కృదంతాలని ఇంకా పరిశోధన చేయాలి. ఒక భాషలో ఒకే ధాతువుకి భిన్నార్థాల్లో కానీ, ఏకర్థంలోనేకానీ భిన్న ప్రత్యాయాలు చేరడం కూడా వుంది.

ఉదా : నడక, నడత, చూపు, చూడి, చేఁత, చేయి, వ్రాఁత, వ్రాయి

టు, ఉలతో అంతమయ్యే ద్వ్యచ్క ధాతువుల్లోనూ, ఏకాచ్క ధాతువుల్లోనూ అచ్చు దీర్ఘమవడంవల్ల కృదంత రూపం ఏర్పడడం సాహిత్యవంతమైన భాషలు అన్నింటిలోనూ వుంది. కాబట్టి ఇది మూలద్రావిడ ప్రక్రియ కావచ్చు. ఇదే విధంగా చివరి స్వర్శం కృదంత రూపంలో అనే ప్రక్రియ కూడా మూల ద్రావిడానికి చెందినది చెప్పవచ్చు.

తెలుగు : పాట

తమిళం, మలయాళం : పాట్టు

కొన్ని కృదంతాల్లో ప్రత్యయమేమీ లేకపోవడం కూడా సాధారణ ద్రావిడ భాషా లక్షణంగా చెప్పవచ్చు.

'ఆల్' దక్షిణ ద్రావిడ భాషా ప్రత్యయం. ఇది మధ్య ద్రావిడ భాష అయిన తెలుగు భాషలో లేదు. మిగిలిన ప్రత్యయాలు కూడా చాలా వరకు మూలభాషకు చెందినవే కాని అవి వచ్చే ధాతువుల విషయంలో మాత్రం భాషకీ భాషకీ మధ్యబేధాలు ఉన్నాయి.

**5. తద్ధిత రూపాలు :**

సంస్కృత భాషలో అనేక విధాలుగా తద్ధిత ప్రత్యయాలు చోటుచేసుకున్నాయి. ఆపత్యార్థంలో 'తైజసము' 'రాజతము' దాశరథి' 'జా మదగ్న్యుడు' మొదలైన రూపాలు కలుగుతాయి. ఇలాంటి విధానంలో ద్రావిడ భాషల్లో లేదు. ప్రత్యయాత్మక భాషలైన సంస్కృత భాషల్లోని నిస్సృత ప్రణాళిక సంయోగాత్మక భాషలైన తెలుగు మొదలైన భాషలకు అన్వయించదు. అయినప్పటికీ తెలుగుభాషకు సంస్కృత భాషకు సంబంధం వున్న అనేక లక్షణాలున్నాయి. తెలుగుభాషపై సంస్కృత భాష ప్రభావం ఎనలేనిది. విడదీయరానిది. ఇది ఎవరూ కాదనరానిది.

తెలుగుభాషలో 'మద్దెలవాడు', 'తములపాకులవాడు' మొదలైన విధంగా తచ్ఛబ్దాన్ని చేర్చి మనం మాటలాడుతాం. సంస్కృత భాషలో 'ఇక' అనే ప్రత్యయం కలిగి 'మార్దలింగికః' 'తాంబూలికః' మొదలైన విధంగా రూపాలు ఏర్పడతాయి.

సంస్కృత భాషను అనుసరించి కన్నడంలో 'మద్దలింగం', 'తంబులింగం' మొదలైన విధంగా వాడుచున్నారు. వీనిని సంస్కృత రూపాలు నుండి ఉద్భవించిన తద్భవాలుగా మనం గ్రహించవచ్చు. వీనిని సంస్కృత రూపాలు నుండి ఉద్భవించిన తద్భవాలుగా మనం గ్రహించవచ్చు. వీని ప్రభావం వల్ల కేవల దేశ్యాలపై 'ఇగ' ప్రత్యయం చేరి క్రొత్త రూపాలు ఏర్పడం స్వాభావికమే అన్న విషయాన్ని మనం మరచిపోకూడదు. ఉదా॥ "సుంకిగం", "అటిమటిగం", "హాస్యకారః" మొదలైన సంస్కృత రూపాలు కన్నడ భాషలో 'పగెకాఅం' మొదలైన విధంగా 'కార' ప్రత్యయంలో వుంటాయి. తమిళంలో కూడ 'వాద్యక్కారన్' మొదలైన విధంగా 'కార' ప్రత్యయం కన్పిస్తుంది. తెలుగు భాషలోని 'ఆటగాడు', 'వేటగాడు' మొదలైన రూపాల్లోని 'కా' ప్రత్యయం 'కార' ప్రత్యయం తోడి పోలికను కలిగి వుంది. బహువచనంలో 'వేటకాలు', 'వీలుకాలు', మొదలైన విధంగా 'ఉ' కారంతో వున్న రూపాలు ఈ సామ్యాన్ని బలపరుస్తున్నాయి.

తెలుగు భాషలో వున్న 'కమ్మరము', 'కుమ్మరము' మొదలైన శబ్దాలు కన్నడభాషలో 'కమ్మరం' 'కుంబరం' అనే విధంగా వున్నాయి. ఇవి 'కర్మకారః', 'కుంభకారః' అని సంస్కృత శబ్దాలకు వికృతులుగనే ఏర్పడి వుండవచ్చు. ఉత్తరాది భాషల్లోను వీనితో పోలిక గల 'కుంభార్' మొదలైన రూపాలు వున్నాయి. కాబట్టి కమ్మర, కుమ్మర మొదలైనవి ప్రాకృతం నుంచి వచ్చి యుండవచ్చు. అయినప్పటికి 'ఇ' ప్రత్యయం చేరి 'కమ్మరి', 'కుమ్మరి' మొదలైన రూపాలు ఏర్పడ్డాయి. వీనిని మరల విడదీయగా 'అరి' అనేది ప్రత్యయంగా వేరుపడింది. 'సుంకరి', 'జాలరి' మొదలైన మతుబర్థయుక్త శబ్దాలు ఇలాగే ఏర్పడి వుండవచ్చు.

సంస్కృతంలోని 'కార' ప్రత్యయం కారణంగా కన్నడంలోనూ తమిళంలోనూ 'కార' అనీ, తెలుగులో 'కాడు' అనీ, కన్నడ భాషలో 'గం' అనే రూపాలు కలిగినట్లు మనం ఊహించవచ్చు.

'కార' అనేది ప్రాకృతంలో 'అర' యై 'ఇ' వర్ణంనొంది 'అరి' వర్ణకంగా మరల వాడబడుచున్నది. ద్రావిడ భాషల్లో వాఁడు, అది అనే తచ్ఛబ్దాన్ని చేర్చుటే స్వాభావికం. నల్లవన్, నల్లదు. మంచివాడు, మంచిది. వాఁడు అనే శబ్దం 'వ' ధ్వనిని కోల్పోయి ఆఁడు అని మతుబర్థకంగా వాడడం వుంది. ఉదా॥ వగలాఁడు. తెలుగులో స్త్రీ వాచకమైనప్పుడు ఇత్వం కలిగి 'వగలాడి' మొదలైన విధంగా వుంటాయి. కన్నడంలో 'సిగ్గాళి' మొదలైన రూపాలు ఉన్నాయి.

'ఆయుష్మంతుడు' మొదలైన తత్సమ రూపాలు తెలుగులో వున్నాయి. కన్నడభాషలో 'ఆయువంతం' అనే విధంగా వికృతులుగా వాడుకలో వున్నాయి. తమిళంలో కూడా ఇలాంటి రూపాలు వున్నాయి. 'పశుప్రాయుడు' మొదలైన చోటుల్లో 'పశుప్రాయన్' అనే విధంగా తత్సమ రూపాలు కన్పిస్తున్నాయి. తెలుగుభాషలో 'పనిమంతుడు' మొదలైన రూపాలు వాడుకలో ఒకటి రెండు ఏర్పడ్డాయి. తమిళంలో 'పుత్తియుళ్ళవసి' అనే రూపాలే ఎక్కువగా వున్నాయి. తెలుగులో 'తెలివైనవాడు', 'తెలివిగలవాడు' అనేవిధంగా వున్నాయి.

'మంచితనం', 'రామునితనం' మొదలైన విధంగా 'తనము' అనే ప్రత్యయంతోడి శబ్దాలు వున్నాయి. తమిళంలో 'తన్మై' అని స్వభావార్థంలో ఒక శబ్దం వుంది. ఇదే తమిళంలో 'తనమ్' అనీ, కన్నడంలో 'తనం' అనీ భావార్థకంగా అగుచుంది. 'పురషతనం' 'జాణతనం' వీనికి సంస్కృతంలో వున్న ప్రాక్తన, నూతన, అధునాతన మొదలైన శబ్దాల్లోని 'తన' ప్రత్యయానికి సంబంధం వున్నట్లు భ్రమ కలగడానికి అవకాశం వుంది. కానీ తెలుగులోని 'తనము' కేవలం పదం. ఆత్మార్థం గల సర్వనామరూపమైన 'తన' అనేది 'స్వభావం' అనే అర్థంలో 'తనము' అని అయింది. సంస్కృతంలోని 'తనకు' ఇలాంటి సంబంధమునూ, ఉపయోగమునూ లేవు.

'మేర్మి', 'ఓర్మి' మొదలైన రూపాల్లో 'మి' వర్ణం తద్ధిత ప్రత్యయం. 'కర్మి', 'ఓర్మి' మొదలైన చోటుల్లోని 'మి' వర్ణానికి దీనికి న్యాయంగా భేదం లేదు. నామంపై వచ్చుటచేత తద్ధితమనీ, క్రియా ధాతువు మీద వచ్చుటచేత కృత్ప్రత్యయమనీ పరిగణించారు. అయితే ఈ విభాగానికి ప్రయోజనం కన్పించదు. తమిళంలో 'పెరుమై' అనీ, కన్నడంలో 'పెర్మె' అని రూపాలు వున్నాయి.

'తెలుపు', 'మునుపు' మొదలైన శబ్దాల్లోని 'పు' వర్ణం తద్ధిత ప్రత్యయం. అయితే 'చూపు', 'మాపు' మొదలైన శబ్దాల్లోని 'పు' వర్ణమే ఇది. కాబట్టి ఇది కూడా తద్ధితంగానూ, కృత్ప్రత్యయంగానూ కూడా వాడబడుచున్నది. తమిళ, కన్నడ భాషల్లో కూడా ఇదే స్థానంలో 'పు' వర్ణం వాడబడుచున్నది.

'పెద్దటికము' 'చిన్నటికము' మొదలైన చోటుల్లో 'టికము' తద్ధితాలు అవుతాయి. వీటిని కృత్ప్రత్యయంగా వాడడం లేదు.

'ముక్కడి' మొదలైన శబ్దాల్లో అభివార్థంలో 'ఇడి' ప్రత్యయం అవుతుంది. కన్నడంలో 'వాలిరి' మొదలైన విధంగా అభావార్థంలో కొన్ని చోట్ల 'ఇడి' వర్ణకం కన్పిస్తుంది. 'రాయిడి', 'రాపిడి' మొదలైనచోట్ల కృత్ప్రత్యయంగా కూడా వుంది.

'తిండిపోతు', 'నిద్రపోతు' మొదలైన చోటుల్లో 'పోతు' తాచ్ఛీల్యంలోని తద్ధిత ప్రత్యయం. కానీ 'పాఱఁబోతు', 'వదరుఁ బోతు' మొదలైన చోట్ల కృత్ప్రత్యయంగా కూడా వుంది.

'ఒయారి' మొదలైన చోటులో 'ఇ' వర్ణకం వుంది. మతుబర్థకంలో 'వెళ్ళి' మొదలైన విధంగా తమిళంలోనూ, 'చాగి' మొదలైన విధంగా కన్నడంలోనూ 'ఇ' వర్ణకం కలుగుచున్నది. 'బాసవ్ఁడు' మొదలైనచోట్ల 'ఈ' వర్ణం కూడా తెలుగులో తద్ధిత ప్రత్యయంగా వాడబడుచున్నది.

'పర్యాయం' అనే అర్థంలో తెలుగులో 'మెయి', 'మై' అనేవి తద్ధిత ప్రత్యయాలుగా వున్నాయి. తమిళంలో 'ఒరుమై' అనే విధంగానూ, కన్నడంలో 'ఒర్మె' అనే విధంగానూ ప్రయోగాలు వున్నాయి.

పై విషయాల్ని బాగా పరిశీలిస్తే ఒకే ప్రత్యయంకృత్ప్రత్యంగానూ, తద్ధిత ప్రత్యయంగానూ వాడుతున్నట్లు కన్పిస్తుంది. చాలా ప్రత్యయాలు స్వతంత్ర ప్రయోగం గల శబ్దాలుగానే కన్పిస్తాయి. 'కొంది', 'బంది' మొదలైన శబ్దాలు కొన్ని తద్ధిత ప్రత్యయాలుగానే స్థిరపడ్డాయి. సంస్కృత ప్రభావం వల్ల 'అరి', 'ఇ' మొదలైన ప్రత్యయాలు ద్రావిడ భాషల్లో ఏర్పడినట్లు అనుమానించడానికి అవకాశం వున్నప్పటికీ సంస్కృత సంబంధంలేని స్వతంత్ర విధానమున్నట్లు స్పష్టంగా గ్రహించవచ్చు.

### 4.2.3 తద్ధిత రూపాలు - విభజన :

1. మతుబర్థం
2. భావార్థం
3. స్వార్థం

పరిమాణార్థం

దఘ్నార్థం

తాచ్ఛీల్యం

## 1. మతబర్థం :

1. అ : ఆడప / తాంబూల కరండవాహి /
చెడుగఁడు,దుడుకఁడు, నిడుపఁడు, ముదుకఁడు.
2. అము : పెండ్లము
3. అరి : జాలాదులు
జాలరి, ఒఱపరి, కల్లరి, చదువరి, జూదరి, టక్కరి, తగవరి, తిరుపరి, తెంపరి, తెరుపరి, వేఁటరి, సిగ్గరి, సుంకరి, కాపరి, కూర్పరి, చనవరి, చొరవరి, టెక్కరి, తెగువరి, త్రిప్పరి, దొఁపరి, పాడుగరి, పొదుపరి, మేపరి, లావరి, వేగరి.
4. ఆ : వగాదులు
వగలాఁడు, చిన్నెలాఁడు, ఒప్పులాఁడు, ముద్దులాఁడు
5. ఆఁడి : వగాదులు
వగలాఁడి, చిన్నెలాఁడి, కులుకులాఁడి, వన్నెలాఁడి, బొమ్మిలాఁడి, ఎమ్మెలాఁడి, టక్కులాఁడి, టెక్కులాఁడి, బొంకులాఁడి, ముద్దు లాఁడి.
6. ఇ : ఓయారాదులు
ఓయారి, అక్కసి, కడలి, చాగి, జోగి, మతకరి, తుటారి, బండారి, బిత్తరి, బిటారి, బేహారి, మచ్చరి, మిటారి, విన్నాణి, చెక్కసి, కంచరి, కమసాలి, కమ్మరి, దొమ్మరి, మంగలి, మేదరి మున్నగునవి.
7. ఇఁడి : / అభావార్థము / ముక్కులోనగునవి.
ముక్కిఁడి, కాలిఁడి, చెరవిఁడి, సిగ్గిఁడి, ఉప్పిఁడి
8. ~~ఈ~~ : అటమటాదులు
అటమటీఁడు, కమ్మతీఁడు, కన్నడీఁడు, కొండీఁడు, బానసీఁడు, బూటకీఁడు, మందడీఁడు, సుంకీఁ డు, ఉక్కివము - ఉక్కీఁడు,
/ వ లోపము / కోడిగీఁడు, గారడీఁడు, తిండీఁడు, మావటీఁడు, వెట్టిఁడు.
9. కత్తియ/ గత్తియ : ఆటాదులు
ఆటకత్తియ, ఆడపకత్తియ, ఎమ్మెకత్తియ, అందగత్తియ, కొండె గత్తియ, బేరగత్తియ
10. కా / గా : ఆటాదులు
ఆటకాఁడు, ఆడపకాఁడు, ఎమ్మెకాఁడు, అందగాఁడు, కొండెగాఁడు, బేరగాఁడు.
11. త : / స్త్రీనిదెల్పు కులవాచకము /
కొఱవత, చాకిత, బోయత, వానెత, వ్రేత, సాలెత, చెంచెత, మాలెత.
ఇతరములు / 21 / గుబ్బెత, మిండత, ముట్టత

## 2. భావార్థం :

1. ఇక : అంగలాదులు
అగ్గలిక, ఒమ్మిక, ఎచ్చరిక, ఒరిమ

2. ఇమి : పేర్వాదులు
పేరిమి, కడిమి, ముచ్చిలి, మేలిమి, చెలిమి, పోఁడిమి, వాఁడిమి, వేడిమి, పసిమి.
3. తన : రామునితనము, సీతతనము, మనుమనితనము, నల్లఁదనము
4. న : నల్లాదులు / గుణవచనములు /
నల్లన, తెల్లన, పచ్చన, ఎఱ్ఱన, చామన, మెత్తన
5. ఱకి : చిన్నాదులు
చిన్నఱికము, కన్నెఱికము, చుట్టరికము, తొత్తఱికము, వెడ్డఱికము, మేనఱికము / ఉ ఆ/ కోడఱికము / అంతిమవర్ణలోపము /
6. మగటిమ్యాదులు

| | | | | | |
|---|---|---|---|---|---|
| - ఱిమి | : | మగఁటిమి | - అంట్రము | : | కోడంట్రము |
| - ఱిమి | : | పేదఱిమి | - అంట్రికము | : | కోడంట్రికము |
| - అనము | : | ఒజ్జనము | - ఇకము | : | కోమలికము |
| | | | - కారము | : | చెలికారము |
| - అరము | : | కోటరము / డ ట / | - పు | : | తెలుపు, ఎరుపు, పసుపు |

## 3. స్వార్థం :

1. ఇక : అరమరాదులు
అరమరిక, ఆమిక, అల్లిబిల్లిక, గండిక, పొత్తిక, మానిక, మెలిక, వాలిక
2. ఉక : చిఱుతాదులు
చిఱుతుక, నాతుక, నెలఁతుక, మెలఁతుక, పడఁతుక, నిప్పుక, పాదుక, వెలుక.
3. ఈ : మొక్కలీఁడు, కల్లరీఁడు
4. కత్తియ : చెలికత్తియ, హెగ్గడికత్తియ
5. కా : చెలికాడు, హెగ్గడికాఁడు
కొమ్మకాఁడు, పరికాఁడు / మృగవాచకములు /
6. గా : ఇబ్బందిగాఁడు, ఒంటిగాఁడు / మృగవాచకములు /

## పరిణామార్థం :

1. ఎఁడు : మానాదులు
మానెఁడు, తూమెఁడు, ముంతెఁడు, కమికెడు, కొడిదెఁడు, దోసెఁడు, పిడికెఁడు, పుడిసెడు, సందెఁడు.

దఘ్నార్థం :
1. బంటి : మోకాలిబంటి, ఱొమ్ముబంటి;
2. కొలఁది : మోకాలికొలఁది, ఱొమ్ముకొలఁది.

తాచ్ఛీల్యం :

1. మారి : మంటిమారి
2. పోతు : తిండిపోతు

### వృత్తియందలి మార్పులు :

1. ఉ అ : తొత్తు - తౌత్తటికము
2. ఉ ఎ : చెంచు + త = చెంచెత
3. క గ : కా, కత్తి యలకకారము గకార మగును.
   అందగాఁడు, అందగత్తియ.
4. లి లోపము : ఎఁడు పరమగునపుడు 'దోసిలి' మున్నగు వానిలో :
   దోసెడు, కమికెఁడు, మొదలైనవి.

### 4.2.4. గుర్తుంచుకోవలసిన ముఖ్యాంశాలు :

1. ఈ పాఠ్యాంశంలో ఇచ్చిన తద్ధిత రూపాల్ని జాగ్రత్తగా అధ్యాయనం చేయండి.
2. తద్ధిత రూపాల్ని విభజన చేసే విధానాన్ని తెలుసుకోండి.
3. దఘ్నార్థం
4. మతుబర్థం
5. తాచ్ఛీల్యం
6. పరిణామార్థం
7. భావార్థం
8. స్వార్థం

### 4.2.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

ఈ పాఠం మీద పరీక్షలో అడగబోయే ప్రశ్నల్ని దృష్టిలో వుంచుకొని ప్రధానమైన ప్రశ్నలు ఇక్కడ ఇచ్చాం. ఈ విషయాన్ని విద్యార్థులు గ్రహించగలరు.

### 1. ఈ క్రింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

1. తద్ధిత రూపాల్ని గూర్చి విపులంగా విశదీకరించండి.

6. ద్రావిడ భాషలు - విశేషణం

### 1. విశేషణం - నిర్వచనం :

"విశేష్యతే అనేన ఇతి విశేషణమ్"

విశేష్యంలోని విశేషాన్ని తెలియజేసేది 'విశేషణం'. నామవాచకాన్ని సర్వనామాల్ని కలిపి విశేష్యములని అంటారు. నామవాచకాల యొక్క సర్వనామాల యొక్క విశేషాల్ని తెలిపే పదాలు విశేషణాలు. ఈ విశేషణం ఒక జాతిని కానీ, గుణాన్ని కానీ, సంఖ్యను కానీ, సంజ్ఞను కానీ ఆశ్రయించి వుంటుంది.

విశేషణం రెండు రకాలు. ఒకటి నామ విశేషణం. రెండు క్రియా విశేషణం. నామాన్ని గూర్చి విశేషించేది నామ విశేషణం. దీన్నే విశేషణం అనీ అంటున్నారు. క్రియల అర్థాన్ని విశేషించేది క్రియా విశేషణం విశేషణ భాగాలైన నామ విశేషణాలకూ, క్రియా విశేషణాలకూ గల రూప భేదం చాలా స్వల్పం.

## 2. విశేషణాలు - అవి ఏర్పడే విధానం :

తెలుగు భాషలో ఒక పదాన్ని విశేషణం అని కానీ, విశేష్యం అని కానీ స్పష్టంగా నిర్ణయించడం చాలా కష్టం. ఎందుకంటే తెలుగులో ఒకే పదం విశేష్యంగా, విశేషణంగా కూడా వాడుకలో వుంది.

ఉదా : తీపిమాట / తీపి - విశేషణం/
మాటతీపి / తీపి - విశేష్యం /

నామవాచకాలు విశేష్యానికి పూర్వం వుంటే అవి విశేషణాలు అవుతాయి.

ఉదా : తెల్లపువ్వు, వెలుగుబాట

అయిన, అగు చేర్చడం వల్ల నామం విశేషణమౌతుంది.

ఉదా : అందమయిన, చల్లనగు

ధాతుజ విశేషణం నామానికి పూర్వం వస్తే అది విశేషణమౌతుంది.

ఉదా : వచ్చినవాడు రాముడు

పరిమాణ వాచకాలైన పదాలు కొన్ని నామాలకు చేరితే విశేషణాలౌతాయి.

ఉదా : చాలాదూరం, కొన్ని మాటలు

సంఖ్యా వాచకాలు నామాలకు ముందు చేరితే విశేషణాలౌతాయి.

ఉదా : రెండు మద్దిచెట్లు

నిర్దేశ సర్వనామాంగాలైన ఆ, ఈ లను, నా, నీ, తన మున్నగు నామాలకు ముందు చేరిస్తే అవి విశేషణాలైతాయి.

ఉదా : ఆ, ఈ జాతి

ఔప విభక్తిక ప్రత్యయాలైన ఇ, టి, తి, అ, చేరితే నామం విశేషణంగా మారుతుంది.

ఉదా : ఆలమంద, నూతినీరు, రోకటిపాట

## ద్రావిడ భాషలు - విశేషణాలు - వర్గీకరణ :

### ద్రావిడ భాషలు - విశేషాలు

| 1 | 2 | 3 | 4 |
|---|---|---|---|
| నిర్దేశాత్మక విశేషణాలు | నామవాచకముల నుండి విశేషణాలు | విధేయ విశేషణాలు | క్రియాజన్య విశేషణాలు |

### 1. నిర్దేశాత్మక విశేషణాలు :

తెలుగులో 'ఆ ఈ ఏ' అను మూడు సర్వనామాలకు త్రికము అను పేరు సామూహికంగా వ్యవహరింతుము. సర్వనామ ప్రకరణం నందు వాని యూధారమున నేర్పడు పెక్కు రూపాల్ని చూశాం. సర్వనామాలయిన ఈ మూడు వర్ణాలను పెక్కుచోట్ల విశేషణములై వ్యవహరించును.

తమిళంలో ఆ, ఈ, ఏ - అనువానితోపాటుగా అన్ద, ఇన్ద, ఎన్ద - అనే విశేషణాలు కూడా వున్నాయి. వీనిని కూడ ప్రయోగాన్ని బట్టి నిర్దేశాత్మక విశేషణాలనే పేర్కొనవలసి వుంటుంది. ఆ చెట్టు అనే అర్థంలో 'ఆన్ద మరమ్' అనీ, ఈ నేల అనే అర్థంలో 'ఇన్ద నిలమ్' అనీ, ఎవరు అనే అర్థంలో 'ఎన్దఆళ్' అనీ వాడుట వుంది. కాని ఇలాంటి వాడుక యితర ద్రావిడ భాషల్లో కన్పించదు. ప్రాచీన తమిళంలోనేకానీ, మలయాళంలోకానీ, ఇలాంటి రూపాలు వాడుక లేనందువల్ల, ఇది తర్వాతి కాలంలో ఏర్పడెనని నిశ్చయంగా చెప్పవచ్చు. తమిళ మలయాళములందు ఉద్దేశ్యాలుగా అదు, ఇదు అనువానిని వాడు నభ్యాసం కలదు. అదు, పొఱుదు, ఇదు కారియమ్. ఇట్లు ప్రయుక్తములయిన అదు, ఇదు శబ్దాలే యనంతర కాలంలో అన్ద, ఇన్ద అని మారి విశేషాలై వుండవచ్చును.

మొత్తం మీద సర్వనామాలై పెక్కు సర్వనామ రూపాలకు మూలభూతాలైన ఆ, ఈ, ఏ - అనేవి సమాసంలో పూర్వశబ్దాలై విశేషాలుగా కూడా వ్యవహరించుచున్న వన్నది సారాంశం.

### 2. నామవాచకముల నుండి విశేషణాలు :

ద్రావిడ భాషల్లోని విశేషణాల్ని సౌకర్యం నిమిత్తం రెండు వర్గాలుగా విభజించవచ్చు. మొదటి వర్గం నిరనుబంధాలు, రెండో వర్గం సానుబంధాలు.

### 1. నిరనుబంధం :

నిరనుబంధం అంటే విభక్తిని కానీ, ధాతుజన్య విశేషణాలను కానీ చేర్చుకోకుండా ప్రయోగం నందు విశేషణాలని అర్థం. ఇవి నామవాచకంనకు ముందు మాత్రమే వుండి, తర్వాత పదంతో సమసించును. సమస్త రూపంగానే కానీ, వ్యస్త రూపంగా వీనికి ప్రయోగం లేదని తాత్పర్యం. ఇచ్చట విశేషణ మూలరూపం సంధిగతమైన మార్పులను మాత్రమే పొందుతుంది.

### 1. ఆద్యక్షరానికి దీర్ఘం :

కారుడల్ / తమిళం /, కారొడల్ / కన్నడం /, కారొడలు / తెలుగు /.

పేరడవి / తమిళం /, పేరడవి / కన్నడం /.

### 2. తుది వర్ణమునకు ద్విత్వం :

నట్టడవి, నిట్టూరుపు, చిట్టెలుక, కుట్టుసురు, కట్టెండ / తెలుగు /,

బెళ్ళలె, మెల్లుసిర్, నట్టిరుళ్ / కన్నడం /

వెళ్ళునై, నల్గొఱుక్కుమ్ / తమిళం /.

### 3. మార్పు లేకుండుట :

మంచి మాట, చెడు నడత / తెలుగు /, బెళ్గొడే, మెల్నుడి / కన్నడం /,
నల్ల పైయన్ / తమిళం /.

తర్వాతి కాలంలో తమిళాది భాషల్లో విశేషణాలు ఇయాంతములుగా మారి కనుపట్టును, పెరియ, శిఱియ, అరియ / తెలుగు /, పురియ, వలియ / మలయాళం /, తెలుగు కన్నడములు అదంతములుగా ప్రతిష్టనొందినవి. పెద్ద, చిన్న, నల, తెల్ల / తెలుగు /, దొడ్డ, చిక్క / కన్నడం /, కన్నడమునందు కూడ పిరియ, కిఱియ మున్నగు విశేషణ రూపాలు కూడా ఎక్కువగానే వున్నవి. వీనిని గూడ నిరనుబంధములుగానే పరిగణింతుం.

### 2. సానుబంధం :

సానుబంధం అంటే విభక్తిని గానీ, ధాతుజన్య విశేషణమునుగానీ, రెండింటినిగానీ చేర్చుకొని ప్రయోగమునొందు విశేషణాలని అర్థం. ఇవి నామవాచకమునకు ముందున్నపుడు విభక్తిని పొందవు. కానీ ధాతుజన్య విశేషణమును చేర్చుకొనును. నామవాచకమునకు పిమ్మట ప్రయోగింపబడినప్పుడు విధేయ విశేషణాలుగా వ్యవహరించి విభక్తిని చేర్చుకొనును.

### 1. భవత్యర్థకం :

ప్రాచీన ద్రావిడంనందలి 'ఆగుమ్' నుండి యుత్పన్నమయిన విశేషణ రూపాన్ని చేర్చుకొనటచేత నామవాచకము విశేషణంగా మారుతుంది.

తెలుగులో అగు, ఔ, అయిన, ఐన అని నాలుగు విధాలుగా నుపయోగపడును. అందమగు - చక్కనౌ - నెమ్మదయిన - శుభమైన.

కన్నడంలో 'ఆద' అనే రూపంలో వుండును. శుభవాద - పిరిదాద.

తమిళ మలయాళ భాషల్లో 'ఆన' అని వుండును. పెరుమై యాన - నిలైయాన - వయదాన.

### 2. అస్త్యర్థకం :

'కలుగు' అనే అర్థం గల ధాతువు యొక్క విశేషణ రూపాన్ని జేర్చుకొనుటచేత నామవాచకం విశేషణంగా మారును.

తెలుగలో 'ఉన్న, కల' అనే రెండును భావార్థం నందునూ 'లేని' - వ్యతిరేకార్థం నందునూ వ్యవహరించును. బుద్ధియున్న, తెలవి గల, నోరులేని.

కన్నడంలో భావార్థంలో ఉళ్ళ అనీ, వ్యతిరేకార్థమున ఇల్లద అనీ వ్యవహరించును. పొన్నుళ్ళు, అఱివుళ్ల, ఓదిల్లద.

తమిళ మలయాళ భాషల్లో భావార్థంలో ఊళ్ళ, ఉడైయ అనీ, వ్యతిరేకార్థంలో ధాతుజన్య విశేషణము గానీ, చేర్చుకొనుట చేతనే విశేషణాలు అగుచున్నాయి. ఈ లక్షణం ద్రావిడ భాషల సంయోగాత్మకత్వానికే సాక్ష్యమిచ్చుచున్నవి.

### 3. విధేయ విశేషణాలు :

నిరనుబంధ విశేషణాలుగానీ, సానుబంధ విశేషణాలుగానీ తమంత తాము విభక్తిని పొందుట ద్రావిడ భాషా సంప్రదాయం కాదు. సంస్కృతంలో 'ఉత్తమో బాలకః పఠతి' అని అన్నపుడు 'ఉత్తముడు బాలకుడు చదువుచున్నాడు' అని తెలుగులో చెప్పుట

విడ్డూరంగా అనిపిస్తుంది. 'ఉత్తముడైన బాలకుడు చదువుచున్నాడు' అని కానీ, 'మంచి బాలకుడు చదువుచున్నాడు' అని కానీ, చెప్పుట సహజంగా వుండును.

**ఉదా :**

| | | |
|---|---|---|
| తెలుగు | : | మంచి బాలుడు |
| కన్నడం | : | నల్ల హుడుగ |
| తమిళం | : | నల్ల పైయన్ |
| మలయాళం | : | నల్ల పైయన్ |

**బహువచనంలో కూడా విశేషణం మార్పు నొందదు.**

| | | |
|---|---|---|
| తెలుగు | : | మంచి బాలురు |
| కన్నడం | : | నల్ల హుడుగరు |
| తమిళం | : | నల్ల పైయన్‌గళ్ |
| మలయాళం | : | నల్ల పైయన్‌గళ్ |

విశేష్యమునకు పిమ్మట వాడినప్పుడు తచ్ఛబ్దమును చేర్చుకొని విశేషణం లింగవిభక్తి వచనాల్ని పొందుతాయి.

| | |
|---|---|
| బాలుడు మంచివాడు | /తెలుగు/ |
| బాలిక మంచిది | /తెలుగు/ |
| ఇల్లు పెద్దది | /తెలుగు/ |
| హుడుగ నల్లవను | /కన్నడం/ |
| హుడుగి నల్లవళు | /కన్నడం/ |
| మనై పిరియదు | /కన్నడం/ |
| పైయన్ నల్లవన్ | /తమిళం, మలయాళం/ |
| పెణ్ నల్లవళ్ | /తమిళం, మలయాళం/ |
| వీడు పెరియదు | /తమిళం, మలయాళం/ |

ఇతర భక్తుల్ని చేర్చినపుడు 'నల్లపై యనుక్కు' మొదలయిన విధంగానే వుండును. విధేయం స్థానంలో వ్యవహరించేటప్పుడు మాత్రమే ద్రావిడ విశేషణం విభక్తిని పొందునని తాత్పర్యం.

అన్యార్థకమునకు విశేషణమైనపుడు తచ్ఛబ్దమును చేర్చుకొని విధేయము స్థానమును పొందుట పైన చూచితిమి. ఇలాగే అస్మదర్థకమునకూ, యుష్మదర్థకమునకు, సైతం విధేయ విశేషణాలు వుంటాయి. అట్టి యెడల క్రియా పదాలకు చేరినట్లే పురుష ప్రత్యయాలు చేరుట గమనింపవచ్చు. పురుష ప్రత్యయాలు ద్రావిడ భాషలందు సర్వనామాల యవశిష్టములే అన్న విషయాన్ని గుర్తు చేసుకొనుట అవసరం.

ఉదా :

| | | |
|---|---|---|
| తెలుగు | : | వాడు మంచివాడు, వారు మంచివారు |
| | | నేను మంచివాడను, మేము మంచివారము |
| | | నీవు మంచివాడవు, మీరు మంచి వా/ర/రు |

తమిళం : నల్లవన్, నల్లవర్
నల్లేన్, నల్లేమ్
నల్లాయ్, నల్లీర్

ఇలా నామవాచకాలపై పురుష ప్రత్యయాలు చేరుటచేత విధేయ విశేషణం ఏర్పడతాయి.

**ఉదా :**

తెలుగు : వాడు దేవుడు, నేను దేవుడను, నీవు దేవుడవు
తమిళం : అపన్ తేపన్, తేవనేన్, తేవనాయ్

యుష్మదస్మత్ శబ్దముల విశేషణముల నిట్లు పురుష ప్రత్యయములను చేర్చివాడుట తెలుగుభాషలో ఇప్పటికీ ప్రచురంగానే వున్నది. ప్రాచీన తమిళ, కన్నడ భాషల్లో వున్న ఈ వాడుక ఇప్పుడు దాదాపుగా లోపించి పోయింది. కానీ గోండి, కురుఖ్, కుయి, మాల్తో, మున్నగు అనాగరిక భాషల్లో వాడుక కొనసాగుతూనే వున్నది.

## 4. క్రియాజన్య విశేషణాలు :

క్రియాధాతువుల నుంచి పుట్టిన విశేషనాలు అగుటచేత వీనికి క్రియాజన్య విశేషణాలని పేరు వచ్చింది. వీనిని ధాతుజ / ధాతుజన్య / విశేషణములని కూడ అందురు. వీనిని అసమాప క్రియలలో సంతర్భవింపజేసి పరిగణించుచున్నప్పటికిని, ప్రయోజన ప్రకారమును బట్టి వీనిని విశేషణములుగా పరిగణించుటయే సమంజసము. ఆర్య భాషలందున్న సంబంధబోధక సర్వనామములు ద్రావిడ భాషలందు లేవు. అవి లేని లోపమును ధాతుజన్య విశేషణాలు రూపాంతరమున పూరించుచున్నవి.

ధాతువులకు కాలసూచక ప్రత్యయం చేరిన పిమ్మట 'అ' వర్ణం చేరగా క్రియాజన్య విశేషణం ఏర్పడతాయి.

| | | | |
|---|---|---|---|
| భూతకాలం | : | చేసిన | / తెలుగు / |
| | | గెయ్ద | / కన్నడం / |
| | | శెయ్ద | / తమిళం / |
| వర్తమానకాలం | : | చేయుచున్న | /తెలుగు/ |
| | | గెయ్యుత్తిపన్ | /కన్నడం/ |
| | | శెయ్యానిన్త | /తమిళం/ |
| భవిష్యత్కాలం | : | చేయు | /తెలుగు/ |
| | | గెయ్యుమ్ | /కన్నడం/ |
| | | శెయ్యుమ్ | /తమిళం/ |
| వ్యతిరేకార్థం | : | చేయని | /తెలుగు/ |
| | | గెయ్యద | /కన్నడం/ |
| | | శెయ్యాద | /తమిళం/ |

పై వాన్ని విశేషణాలని అనుటచేత, ఇవి విశేష్యములకు ముందు మాత్రమే ప్రయుక్తం అగునన్నది స్పష్టం. చేసిన పని / తెలుగు /, గెయ్దకెలస / కన్నడం/, శెయ్దవినై / తమిళం / మున్నగు విధంగా ఇవి వాడుక నొందును.

విభక్తి చేరవలసినపుడు తదర్థకమును చేర్చుకొని చేసినవాడు, చేసినది, చేసినవారు, చేసినవి - మున్నగు రూపాలు ఏర్పడతాయి. ఇవి నిజమునకు సమాపక క్రియా రూపాలే. కావుననే యివి విధేయ విశేషణములుగా విశేష్యములకు పరమందు మాత్రమే వుపయోగపడును.

**ఉదా :**

| | | | | |
|---|---|---|---|---|
| తమిళం | : | ఇన్రు | పోగిఱ | పయ్యన్ |
| తెలుగు | : | నేడు | పోవుచున్న | బాలుడు |

పై వున్న విశేషణాల్ని విధేయ విశేషణాలుగా మార్చినపుడు కింది విధంగా ప్రయోగాలు వుంటాయి.

**ఉదా :**

| | | |
|---|---|---|
| తమిళం | : | ఇన్ద పైయన్ తాన్ ఇన్రు పోగిఱవాన్ |
| తెలుగు | : | ఈ బాలుడు నేడు పోవుచున్నవాడు |
| తమిళం | : | అవన్ వాఙ్గియ పశు |
| తెలుగు | : | అతడు కొన్న ఆవు |
| తమిళం | : | ఇన్ద పశు అవన్ వాఙ్గియదు |
| తెలుగు | : | ఈ ఆవు అతడు కొన్నది. |

## 7. మాదిరి ప్రశ్నలు :

1. విశేషణాలు గూర్చి వ్రాయండి.
2. తద్ధితరూపాన్ని గూర్చి వివరించండి.
3. కృదంత రూపాలు గూర్చి విశదీకరించండి.
4. పురుష బోధక ప్రత్యయాలు గూర్చి తెలియజేయండి.
5. సర్వనామాల గూర్చి సంగ్రహంగా విపులీకరించండి.
6. సంఖ్యా వాచకాలు గూర్చి విశ్లేషించండి.

## 8. ఆధార గ్రంథాలు :


1. ఆంధ్ర భాషా వికాసం - ఆచార్య గంటిజోగి సోమయాజి
2. తెలుగు భాషా చరిత్ర - డా॥ వెలమల సిమ్మన్న
3. దక్షిణ దేశ భాషా సారస్వతము - ఆచార్య కోదాడ రామకృష్ణయ్య
4. ద్రావిడ భాషలు - ఆచార్య గంటిజోగి సోమయాజి
5. ద్రావిడ భాషలు - ఆచార్య పి.యస్. సుబ్రహ్మణ్యం
6. ద్రావిడ భాషా పరిశీలనము 1,2 భాగాలు - శ్రీ వజ్ఝల చినసీతారామయ్య
7. ద్రావిడ భాషా విజ్ఞానం - ఆచార్య జి.ఎన్. రెడ్డి


**డాక్టర్ వెలమల సిమ్మన్న**

**పాఠం - 7**

# క్రియ

## (అకర్మక, సకర్మక ప్రేరణా క్రియలు)

**పాఠ్యాంశ నిర్మాణక్రమం :**

7.1. క్రియా నిర్వచనం

7.2. క్రియా నిర్మాణం

7.3. అకర్మక క్రియా నిర్వచనం - అకర్మక క్రియలు

7.4. సకర్మక క్రియా నిర్వచనం - సకర్మక క్రియలు

7.5. ప్రేరణక్రియా నిర్వచనం ప్రేరణ క్రియలు

**ఉపోద్ఘాతం :**

మొట్టమొదట క్రియ గురించి ఋగ్వేదంలో ప్రతీకాత్మకంగా తెలిపబడింది.

"చత్వారి శృంగా త్రయోఅస్యపాదా
ద్వే శీర్షే సప్తహస్తా సోఅస్య
త్రిధాబద్ధో వృషభో రోరవీతి
మహో దేవో మర్త్యాన్ ఆ వివేశ (ఋగ్వేద : 4-58-3)ఔ

శబ్ద రూపుడయిన ఈ దేవుడికి కొమ్ములు నాలుగు. పాదాలు మూడు. తలలు రెండు. చేతులు ఏడు. మూడుచోట్ల ప్రతిష్ఠించబడ్డ (కట్టబడ్డ) (కోరికల్ని ప్రసాదించే) శబ్దరూపుడయిన ఎద్దు; మానవుల్ని ఆవేశించింది.

అగ్నిదేవతావరమయిన ఈ మంత్రం శబ్దశాస్త్రంచే ప్రతిపాదించబడ్డ శబ్ద బ్రహ్మపంగా వైయాకరణములచే వ్యాఖ్యానించబడింది. లాక్షణికంగా ఈ విధంగా చెప్పవచ్చు అని ప్రాచీనులు భావించగా దానిని ప్రతీకగా భావించవచ్చు అని ఆధునికులు అభిప్రాయపడుతున్నారు.

మనుష్యులలో అంతర్యామిగా ఉన్న పరాశబ్దం లోకంలోని సాధారణ వృషభం కంటే విలక్షణంగా ఈ మంత్రంలో పేర్కొనబడింది.

**శృంగాలు (కొమ్ములు) 4 :**

1. సుబంతం (నామం)
2. తిజంతం (ఆఖ్యాతం)
3. ఉపసర్గం
4. నిపాతం.

ఈ నాలుగు విధాలుగా పదాలుంటాయని భావం.

**పాదాలు (కాళ్ళు) 3 :**

1. భూతకాలం, 2. వర్తమాన కాలం, 3. భవిష్యత్కాలం

**శిరస్సులు (తలలు) : 2**

1. నిత్యం (స్ఫోట); 2. అనిత్యం (వైఖరి)
హస్తాలు (చేతులు) : 7 ఏడు విభక్తులు

**స్థానాలు 3 :**

వక్షఃస్థలం, కంఠం, శిరస్సు, ఈ మూడు స్థానాలు శబ్దాభివ్యక్తి స్థానాలు.

వృషభ శబ్దానికి కోరికల్ని ఇచ్చేది అని అర్థం. (సుశబ్ద ప్రయోగం వల్ల కోరికలు నెరవేరతాయని ఆర్య సంప్రదాయం) 'రోరవీతి' అంటే రంకెలేస్తుంది అని అర్థం. నాద రూపంలో ఎల్లప్పుడూ శబ్దం గోచరమవుతుంది. శబ్ద బ్రహ్మజ్ఞానంవల్ల మానవుడు బ్రహ్మసామ్రాజ్యాన్ని పొందుతాడు అని అర్థం.

"అఖ్యాతకు, క్రియా, ధాతుః" అనే మూడు పదాలు సంస్కృత వాఙ్మయంలో ప్రచురంగా ప్రయోగించబడ్డాయి. ప్రాచీన సంస్కృత గ్రంథాలలో ఆఖ్యాత శబ్దం అనేక పర్యాయాలు కన్పిస్తోంది.

ఆ + ఖ్యా + త = పూర్తిగా చెప్పేది అని ఈ శబ్దవ్యుత్పత్తి. ఇది వ్యాక్యార్థాన్ని పూర్తిగా తెలుపుతుందని అర్థం.

'కిం నామాఖ్యాతమ్' అని గోపథ బ్రాహ్మణ ప్రయోగం.

యాస్కాచార్యులు శబ్దాలను 4 విధాలుగా ఉపయోగించారు. "తద్యానిచత్వారి పద జాతాని నామాఖ్యాతే చోపసర్గని పాతాశ్చ తానీమానిభవన్తి" (నిరుక్తమ్ 1-1-1) భూస్క మతప్రకారం, శబ్దాలను నామం, ఆఖ్యాతం ఉపసర్గ, నిపాతాలుగా ఉన్నాయి. ఈ క్రమంలోనే శబ్దాలను నికరించవలసి ఉండగా "భావప్రధాన ముఖ్యాతం, సత్త్వ ప్రధానాని నామాని" అని ఆఖ్యాతనామాల లక్షణాల్ని భూస్కాచార్యులు తెలిపారు. లోకవ్యవహారంలో నామాఖ్యాతలనే క్రమంలో శబ్దాలు ఉండగా ప్రాముఖ్యాన్ని బట్టి ఆఖ్యాతను పేర్కొనడాన్ని తర్వాత నామాన్ని యాస్కుల వారు తెలిపారు. ఇది ఉచితం. పదాలన్నిటిలోను ఆఖ్యాతకే ప్రాముఖ్యం ఉంటుంది. ధాతు శబ్దాన్ని పాణిన్యాచార్యులు ప్రయోగించారు.

భూవాదయోధాతవతః' (అష్టాధ్యాయి 1-3-1) క్రియావాచినో భ్వాదయో ధాతుసం జ్ఞాంస్యుం" అని సిద్ధాంతకౌయుది. క్రియను బోధించే భూ (సత్తాయామ్) ఆదిగాకల విధాతువులు అని అర్థం.

'క్రియతే ఇతిక్రియా' క్రియ అంటే చేష్ట, వ్యాపారం అనే అర్థాలున్నాయని సూర్యరాయాంధ్ర నిఘంటుకారులు అర్థం ఆఖ్యాతధాతు క్రియా శబ్దాలు పర్యాయ పదాలు.

**'క్రియాధాతుః' (ఆంధ్ర శబ్దచింతామణిః 26 సూ)**

భూ మొదలయినవి సంస్కృత ధాతువులు. అవి ఇక్కడ క్రియలనిపించుకుంటాయి. ఆచ్ఛిక క్రియలయిన తిను, విను, ఉండు, నడచు మొదలయిన వాటికి ఇది ఉపలక్షణం.

## 7.1 క్రియా నిర్వచనం :

"అద్యః క్రియాసుభూతార్థ ద్యోతినమాద్యగం వినాసర్వః"

(ఆంధ్రశబ్ద చింతామణిః సంజ్ఞా. 17సూ)

అని క్రియాశబ్దాన్ని ఆంధ్ర చింతామణికర్త తన వ్యాకరణంలో పేర్కొన్నాడు.

భర్తృహరి తన వాక్యపదీయంలో క్రియను స్పష్టంగా వివరించారు.

'కృ' (చేయు) అనే సంస్కృత ధాతువుకు 'య' అనే ప్రత్యయాన్ని (క్యచ్) చేర్చగా క్రియా అనే శబ్దరూపమేర్పడుతుంది. 'వ్యాపారం' పని అని శబ్దార్థం. క్రియా శబ్దానికి పర్యాయపదాలుగా ఉన్నా మరికొన్ని శబ్దాలు - 'వ్యాపారః, భావః, భావనా, ఉత్పాదనా" జరగటానికి దేనిని సంకల్పిస్తామో అది అంతా క్రియ అవుతుంది.

| | | |
|---|---|---|
| 'కిమ్‌కరోతి' | = | ఏమి చేస్తున్నాడు ? |
| గచ్ఛతి | = | వెళ్తున్నాడు |
| పచతి | = | వండుతున్నాడు |
| వదతి | = | మాట్లాడుచున్నాడు |

మొదలయినవి క్రియలు. ఈ పనులను జరిగిపోయినట్లు, జరుగుతున్నట్లు, జరగబోయేటట్లు చెప్పవచ్చు. వీటిని కాలబేధాలని పేర్కొంటారు. క్రియలు కాలబేధాన్ని సూచించవచ్చు. క్రియా నిర్వచనం నష్టమైనా ప్రతి క్రియకు ఒకఫలం, ఒక ప్రయోజనం ఉంటుంది. క్రియాఫలం ప్రత్యక్ష్యం కావచ్చు. పరోక్షమయితే ఊహించవచ్చు.

క్రియకు క్షణాలు ఆధారాలని నాగేశభట్టు పేర్కొన్నాడు. (క్షణాధారం (క్రియా)

"యావత్సిద్ధ మసిద్ధంవా<br>సాధ్యత్వేనాభిధీయతే<br>ఆశ్రితక్రమరూపత్వా<br>త్సా క్రియేత్యభిధేయతే" (వాక్య 3-8-1)

పూర్తి అయినది (సిద్ధమ్) పూర్తికానిది (జరగబోయే యేది అసిద్ధమే) ఏది అంతా సాధించతగ్గదిగా చెప్పబడుతుందో అది ఒక కర సక్రమంలో ఉండటంవల్ల క్రియ అని చెప్పబడుతుంది. సంకల్పించబడేది క్రియ. ఇది భర్తృకంక్రియా నిర్వచనం. సృష్టినిబట్టి స్రష్టను తెలుసుకున్నట్లుగా ఫలాన్నిబట్టి క్రియను తెలుసుకోవాలని నాగేశభట్టు 'ఫలానుమేయాక్రియా' (క్రియా ఫలాన్ని బట్టి ఊహించతగ్గది) అని నిర్ధారించాడు.

"కారకాణాం ప్రవృత్తి విశేషః క్రియా" అని పతంజలి భగవానుని మరో నిర్వచనం.

'కారకాలయిన ద్రవ్యాల వ్యాపారం క్రియ అని ఈ నిర్వచనార్థం. వ్యాపారం లేకుండా ఫలం పుట్టదు. కాగా వ్యాపారం క్రియ అవుతుంది. సాధనమయిన ద్రవ్యం కంటే సాధ్యమయిన క్రియ వేరని స్పష్టమవుతుంది.

క్రియ చలనాత్మకమైనది కావచ్చు లేదా చలనరహిత మయినది (ఉండు మొ॥వి) కావచ్చు. కర్తృకర్మల వ్యాపారమే క్రియ అనటం కూడా సరికాదు. వివక్షాధీనంగా సకల కారకాల వ్యాపారం కూడా క్రియ కావచ్చు.

క్రియను చెప్పేది ధాతువు అని మరో నిర్వచనం. ఉదా : వద్, పచ్ (సంస్కృత ధాతువులు)

వండు, తిను (తెలుగు ధాతువులు) సంస్కృత ధాతువులకు తిజ్ ప్రత్యయాలు చేరుతుండగా తెలుగులో డుమువులు నుముఞ్లు చేరతాయి.

ఉదా : 'పచతి' వండుతున్నాడు.

వాక్య కదీయంలోని కురోశ్లోకం క్రియను విశదీకరిస్తోంది.

"గుణభూలై రవయరైః
సమూహః క్రయజన్మనామ్
బుద్ధ్యా ప్రకల్పితా భేదః
క్రియేతి వ్యపదిశ్యతే" (వాక్యపదీయమ్ 3-8-4)

మనసు చేత అప్రధానావయవాలలో కల్పించబడ్డ ఏకతకల క్రమంకల కణాల సముదాయం క్రియ అని చెప్పబడుతుంది. వండు అనే క్రియను ఉదాహరణగా తీసుకోండి. ఈ 'వండు' ధాతువుకు ఫలం 'ఉడకటం' బియ్యాన్ని పొయ్యి మీద పెట్టటం మొదలుకొని కర్రలకు నిప్పు వెలిగించటం, ఉడికిన తర్వాత పొయ్యి మీద నుండి కుండను దింపటం వరకు ఎన్నో క్షణాలుంటాయి. ఈ క్షణాల సముదాయమే క్రియ. క్రియ ఒక్కటే అనీ ఒక్కో క్రియకు ఒక్కో ధాతువుంటుందనీ తెలుస్తోంది. గమ్, పచ్, వద్, లిక్ వంటి సంస్కృత ధాతువులు, తిను, విను, వండు వంటి తెలుగు ధాతువులు ఇటువంటివే.

క్రియా పదాన్ని బాల ప్రౌఢవ్యాకర్తలు ప్రయోగించారు.

"మధ్యమ పురుష క్రియలయందిత్తునకు సంధియగును" (బాలవ్యా.సంధి. 7 సూ)

"వ్యతిరేక క్రియ యర్థత్రయ బోధకంబగు" (ప్రౌఢవ్యా. క్రియా. 8 సూ.)

ఇక్కడ క్రియా శబ్దం తిజంత రూపాలకు వాడబడింది.

## ధాతువు, ధాతు నిర్మాణం :

ప్రాచీన కాలంనుంచి ధాతువు అనే మాట ప్రత్యేకార్థములో వ్యవహరించబడుతుంది.

చేశాడు, చేస్తున్నాడు, చేయటం, చేయకపోవటం మొదలయిన మాటలను గమనించి ప్రత్యయాలను పరికరించి వ్యాకర్తలు, భాషాశాస్త్రజ్ఞులు 'చేయు' ధాతువును పేర్కొన్నారు. 'చేయు' ధాతువునుంచి అనేక శబ్ద రూపాలను నిష్పన్నం చేయవచ్చు. ప్రత్యయాలతో కూడి శబ్ద రూపాలన్నీ ధాతు జన్యాలు. ఇటువంటి శబ్దధాతువుల నుండి వివిధ భాషలు పుట్టాయని కొందరు వ్యాకర్తలు పేర్కొన్నారు. ధాతు శబ్దం క్రియాజన్యం కాబట్టి భాషక్రియా జన్మమనే సిద్ధాంతాన్ని ప్రాచీనులయిన యాస్కాదులు ప్రతిపాదించారు. 'చేయు' ధాతుజన్యాలుగా చేయటం, చేయకపోవటం, చేత, చేశాడు మొదలయినవన్నీ క్రియాజన్యాలే కదా. కాని ఇల్లు, కాలు, కన్ను వంటి మాటలు ఏ క్రియ నుండి పుట్టాయి ? అని కొందరు ప్రశ్నిస్తున్నారు. శాకటాయనాదులు శబ్దాలు అన్నీ ఆఖ్యాతజాలు (క్రియ నుండి పుట్టాయి) అని పేర్కోగా అన్నిశబ్దాలు ఆ విధంగా ఆవిర్భవించలేదని గార్గ్యాదులు, పతంజలి మొదలయిన వ్యాకర్తలు తెలిపారు. తత్రనామాన్యాఖ్యాత జానీతి శాకటాయనో నైరుక్తసమయశ్చన, సర్వాగీతి గార్గ్యో వైయాకరణానాంటైకే" అని నిరుక్తం పేర్కొంది. "ఉగాదయోబకులమే" అనే పాణిని సూత్రాన్ని వ్యాఖ్యానిస్తూ పతంజలి తన మహాభాష్యంతో 'ఉగాదయోబకులశ' అనే పాణిని సూత్రాన్ని వ్యాఖ్యానిస్తూ పతంజలి తన మహాభాష్యంలో "ఉగాతాదయో అవుత్పన్నాని ప్రాతిపదికా ?" అని పేర్కొని కొన్ని అవుత్పన్న పదాలు భాషలో ఉన్నాయని తెలిపారు. తొల్కాప్పియానరు కూడా

నా మాలనన్నిటిని ధాతునిష్పన్నాలని పేర్కోలేదు. ప్రభంజనా హోబల పండితుడు తన అహోబలపండితీయ గ్రంథంలో తెలుగు పదాలలో కొన్ని ధాతుజన్యాలు కావని, మరికొన్ని ధాతుజన్యాలని పేర్కొన్నాడు. "అజన్యజన్య భేదేన శబ్దాః స్యుర్ద్విన్నృతామతాః"

"జన్యంతర్గత వర్ణానాం భూయసీ సీన్యాద్విచిత్రతా, అజన్యా అధాతు ప్రకృతికా గోడ, మేడ, మోరు, మోని, బావి, దీవి ఇతాద్యాః జన్యధాతు ప్రకృతికాం, ఓకిరింత, వెక్కిరింత ఇత్యాదయో బహవఃశబ్దా ప్రయోగత్యోవగంతవ్యా" (అహోబల పండితీయకు)

భాషలోని పదాలన్నిటిని ధాతుజాలని చెప్పలేక పోయినప్పటికి, చాలా పదాలకు ధాతువులను కనిపెట్టవచ్చు పదాల మూల స్వరూపాన్ని తులనాత్మకాధ్యయనం వల్ల కనిపెట్టవచ్చు.

ఉదా : వెలుగు, వెలుతురు, వెల్ల శబ్ద రూపాలను తెలుగులో పరిశీలించి దీని ప్రాచీన తెలుగు ధాతురూపాన్ని వెళ్‌గా పరిగణించవచ్చు

తమిళంలో 'విళ్' వెలయు, 'విళంగు' ప్రక్షాళం, కన్నడంలోని 'వెళ్' తెల్లని 'బెళమ్' 'దీపం' మొదలయిన రూపాలను గమనిస్తే మూల ద్రావిడ 'వెళ్' రూపాన్ని మనం పునర్నిర్మించవచ్చు.

తెలుగులో వున్న కను, విను, తెను, చచ్చు, పోవు, ఇచ్చు మొదలయిన 1236 తెలుగు ధాతువులను తులనాత్మకంగా పరిశీలించి ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి గారు తమ తెలుగు ధాతువులు గ్రంథంలో పేర్నొన్నాడు.

వ్యుత్పత్తి పరంగా పరిశీలించి చూస్తే తెలుగు ధాతువుల్ని రెండు రకాలుగా విభజించవచ్చు.

ఒకటోరకం (హ) అ, హ = హల్లు; అ = అచ్చు = దీర్ఘం, ల = హ్రస్వం లేదా (హ) అహ
రెండో రకం నిష్పాదక ప్రత్యంతో కూడనది. (హ) హ లేదా అ (హ) హ

తులనాత్మక పరిశీలన వల్ల ధాతువు నిష్పాదక ప్రత్యయం ( ) మధ్య బేధం తెలుస్తుంది. సజాతిపదాల ( ) పరిశీలన వల్ల పదాలలోని కొన్ని వర్ణాలు సాధారణంగా సమానంగా ఉంటాయి. ధాతువులలో కొన్ని వర్ణాలు కొద్దిగా మార్పు పొందినా వాటిని గుర్తించటం భాషాశాస్త్ర పరిజ్ఞానంవల్ల కష్టంకాదు. ఆ కొన్ని మార్పులను భాషాశాస్త్ర సహాయంతో గుర్తించవచ్చు.
ఈ క్రింది ఉదాహరణు పరిశీలించండి .

**1. (హ) ఆ - (హ) అ**

తెలుగు కా - చు 'రక్షించు'
తమిళం - కన్న, తుళు, కాడాగు, కౌ - పర్జీ కా

**2. (హ) అ హ -**

తెలుగు ఇడు
తమి. కన్న, ఇటు ; గోండి ఇరు

**3. (హ) ఆహ -**

తెలుగు ఆడు
తమిళం కుల, ఆటు, కన్న. తుళుఆడు
కోలామి నాయకి ఆడ్

**4. (హ) అహహ**

తెలుగు నవల

తుళువుల నంపు; కోత నంబ్

తుళుమల నంపు; కోత నంబ్

రెండోది నిష్పాదక ప్రత్యయాలు చేరిన పదాలు. ఈ నిష్పాదక ప్రత్యయాలు ధాతుభాగాలయి ధాతుభాగంగా రూపొంది ప్రత్యేక ధాతువులయ్యాయి.

(హ) అ హ హ

తెలుగు దాఁటు

తమిళుల తాంటు; కోత దాట్

తెలుగులోని ధాతువుల వింగడింపు విశ్లేషణ

## మొదటిరకం

| | | |
|---|---|---|
| 1. | హ (అ - అ) | ఉదాహరణ |
| 2. | (హ) అ క - క - అ | ఎక్కు |
| 3. | (హ) అ - హ హ అ | ఇ-చ్చు |
| 4. | (హ) అ - హ అ | తూ - ఱు |
| 5. | (హ) అ - హఅ | తా - కు స్పృశించు |
| 6. | హఅ - హహఅ | డి - గ్గు దిగు |
| 7. | హ అ - హ అ | డాయు సమీపించు |
| 8. | హ హ అ - హ హ అ | బ్రుంగు మునుగు |
| 9. | హ హ అ - అ | క్రాలు కదల్చు |

## మూడోరకం :

త్ర్యచ్క ధాతువులు

1) (హ) అహ - అహఅ అలయు (అల్ - అంతకలియు (కల్ - ఇ)

2) (హ) అ హ - క క అ అడ్ - ఁగు (అడ్ + అంగ్)

## నిష్పాదక ప్రత్యయాల విశ్లేషణ :

మూలద్రావిడ ధాతు స్వరూపాన్ని (హ) అ (హ) అనే సూత్రంతో ఆచార్య కృష్ణమూర్తి గారు నిరూపించారు. దీని నుండి తెలుగులోని ధాతువులు కొన్ని నిష్పాదక ప్రత్యయాలు మూలద్రావిడ ధాతువులకు చేరగా ఏర్పడ్డాయి. ఆ నిష్పాదక ప్రత్యయాలను గమనిద్దాం. ఈ నిష్పాదక ప్రత్యయాలు బహుళంగా హ్రస్వంగాను విరళంగా దీర్ఘంగా ద్రావిడభాషలో ఉంటాయి. ఈ క్రింద పేర్కొనబడ్డ హల్లులతో ఏదో ఒకటి లేదా హల్సముదాయం ఉంటుంది.

- ప్, మ్ప్; ప్ప్; త్; న్త్; త్త్
- త్, న్త్; త్త్; ట్, ణ్ట్; చ్;
- న్చ్; చ్చ్; న్క్; క్క్; కు; న్;
- ణ్; ల్; ళ్; ర్; ఱ్, య్;

వ్

అ = అచ్చు

శ్వా = శ్వాస స్పర్శ

నా = నాదవర్ణం (అనునాసికం, పార్శ్వికం, త్కారం, ఊష్మం లేదా అంతస్థం)

పూర్వానా = స్పర్శలకు ముందు వచ్చే అనునాసికం, ఇది నా కాదు.

| | |
|---|---|
| ధాతువు + | పరప్రత్యయం |
| (హ) అ + | నా |
| | శ్వా |
| | పూర్వనాశ్వా |
| | శ్వా శ్వా |
| (హ) అహ | అ |
| | అనా (ఉ) |
| | అశ్వా |
| | అనాశ్వా |
| | అశ్వాశ్వ |

ఈ పై సూత్రం తమిళ మలయాళ భాషలలో బాగా సరిపోతుంది. నిష్పాదక ప్రత్యయాలలో పదాది అచ్చు ఉన్న పరప్రత్యయాలు కొన్ని మాత్రమే ఉన్నాయి.

| | | | |
|---|---|---|---|
| ఉదా : | తెలుగు | - అగు - | అగ్ + ఉ |
| | తెగు | - | తెగ్ + ఉ |
| | తెగు | - | తెగ్ + ఉ |

మిగిలిన ద్రావిడ భాషలలో అచ్చు మాత్రమే పరప్రత్యయంలో ఉండగా తెలుగులో అచ్చు + హల్లు కూడా ఉంటుంది

తమిళం కంటే అధిక వర్ణాలతో కూడిన పరప్రత్యయాలు మూ.ద్రా. ధాతువుకు చేరాయి.

| మూ.ద్రా | తమిళం | తెలుగు | అర్థం |
|---|---|---|---|
| కట్ | కడ | కడ - చు | దాటు |
| పార్ | పర | పర - చు | వ్యాపించు |
| కత్ | కటి | కఱ - ఱు | కొరుకు |

పరప్రత్యయాల (నిష్పాదక ప్రత్యయాలలోని అచ్చులు మధ్యోత్తర ద్రావిడ భాషలలో లోపించగా తెలుగులో అని మిగిలి ఉన్నాయి.

**ఉదా :**

| తెలుగు | తమిళం | గోండి | అర్థం |
|---|---|---|---|
| నఱకు | నఱుకు | నడ్క్ | ఛేదించు |
| కొఱుకు | కొఱి | కోర్డ్ | కరుచు |
| ఉదుక్ | | సుక్క్ | ప్రక్షాళించు |

కాల్డ్వెల్ ధాతువుకు కొన్ని నిష్పాదక ప్రత్యయాల ద్రావిడ భాషలలో చేరతాయి అని తెలిపాడు. ద్రావిడ భాషలలోని కొన్ని ధాతువులలో కొన్ని మూల ధాతువులు నిష్పాదక ప్రత్యయాల కలయిక వల్ల ఏర్పడ్డాయని వారు భావించారు. కాల్డ్వెల్ సరిగా భావించారు. మూల ద్రావిడంలో 'అట్ కొట్టు' అనే ధాతువు తెలుగులో 'అడుచు' అనే ధాతువు 'అడ్ + ఊచు' ఏర్పడింది. దీనిలో 'అడ్ + ధాతురూపంకాగా ఉచు' అనేది నిష్పాదక ప్రత్యయం. వ్యాకర్తల ప్రకారం 'అడుచు' అనే ధాతువు.

మూల ద్రావిడ అట్ సమీపించు. దీనికి అ, లు చేరగా 'అడయు' రూపమేర్పడి వర్ణవ్యత్యాసం కారణంగా డాయు అనే తెలుగు ధాతువు ఏర్పడింది. డాపు (అడ్ + అ + వు) అని మరోరూపం కూడా ఉంది. తెలుగులో నిష్పాదక ప్రత్యయాలు ఇంకా చాలా ఉన్నాయి.

## ద్రావిడ భాషలలోని క్రియాపద నిర్మాణ సూత్రం :

ధాతువు + సకర్మక ప్రత్యయం + ప్రేరణ ప్రత్యయం

( ) ( ) ( )

కాల ప్రత్యయం పురుష ప్రత్యయం

( ) ( )

వ్యతిరేక ప్రత్యయం చేదర్థకం

( ) ( )

## అకర్మక క్రియలు :

సంపూర్ణ వాక్యంలో అకర్మక క్రియలు లేదా సకర్మక క్రియలు ఉంటాయి. వాక్యంలోని క్రియకు కర్మ లేకపోతే వాటిని సకర్మక క్రియలని వ్యవహరిస్తారు. అన్ని క్రియలకు కర్మలుండాలని లేదు.

## అకర్మక క్రియా ప్రత్యయం - గు

ఊగు ఉదా : రమ ఉయ్యాలలో ఊగుతుంది.

కాగు నీళ్ళు పొయ్యి మీద కాగుతున్నాయి

తూగు తక్కెడ అటు వైపు తూగుతుంది.

ఉండు రాముడు ఇంట్లో ఉండిపోయాడు

తెగు తాడు తెగింది

దిగి కడుపు దిగింది

చెరుగు ముగ్గు చెరిగింది

| | |
|---|---|
| వంగు | వాడ వంగిపోయాడు |
| అకర్మకధాతువు | అకర్మక వాక్యం |
| మునుగు | పుట్టి మునిగింది |
| పెరుగు | ఆ అబ్బాయి పెరిగాడు |
| ఆగు | రాముడు ఊరు వెళ్తూ దారిలో ఆగాడు |
| ఊగు | రామారావు తాగి ఊగుతున్నాడు |
| జరుగు | నీవు జరుగు |
| తిరుగు | రమేష్ పనిలేక ఊరికే తిరుగుతున్నాడు |
| చ్ | |
| కుడుచు | దూడ పాలు కుడుస్తోంది |
| నడు-చు | పోతురాజు వేగంగా నడుస్తాడు |
| లేచు | బాబు నిద్రలో లేస్తుంటాడు |
| పో | శ్రీ పతి ఇంటికి పోతున్నాడు |
| రా | నీవురా |
| పో | శ్రీపతి ఇంటికి పోతున్నాడు |

## సకర్మక క్రియలు :

వాక్యంలో కర్మకల క్రియలు ఉంటాయి. ఏ క్రియాధాతువుకయితే కర్మ ఉంటుందో దాన్ని సకర్మక క్రియ అని వ్యవహరిస్తారు. భాష నుండి కొన్ని ప్రత్యయాలను చేర్చడం ద్వారా సకర్మక క్రియలు ఏర్పడతాయి. మొదట సహజంగా శబ్దగతంగా కర్మ కలిగిన వాటిని గూర్చి తెలుసుకుందాం. వీటిని సిద్ధ సకర్మక క్రియలని వ్యవహరిస్తారు.

| సకర్మక క్రియాధాతువు | వాక్యం |
|---|---|
| వండు | భీముడు అన్నం వండుతున్నాడు |
| తిను | వెంకట్రావు మిఠాయి తింటున్నాడు |
| చూచు | సీత సినిమా చూస్తోంది |
| విను | రామారావు పాట వింటున్నాడు |
| పాడు | సూర్యారావు మంచి పాట పాడుతున్నాడు |

అకర్మక ధాతువుకు సకర్మక ప్రత్యయం చేర్చటం ద్వారా సకర్మక క్రియలు ఏర్పడతాయి. వీటిని సాధ్య సకర్మక క్రియలని వ్యవహరిస్తారు.

ద్రావిడ భాషలలోని ఈ సకర్మక క్రియా విధానాన్ని పరిశీలిద్దాం. ఈ విధానం భాష భాషకు ద్రావిడ భాషలలో మారుతూ ఉంటుంది. మొదట తమిళంలోని పద్ధతులను పరిశీలిద్దాం.

## తమిళంలోని సకర్మక క్రియావిధానం :

తమిళంలో సాధ్యసకర్మక క్రియలను 3 విధాలుగా ఉన్నాయి.

1. తమిళ శబ్దాల అకర్మక క్రియ చివర ఉన్న అనునాసిక స్పర్శవర్ణం లేదా అద్విరుక్త స్పర్శవర్ణం స్థానంలో దానిస్థానే ద్విరుక్త స్పర్శవర్ణం ఆదేశమవుతుంది.

| తమిళం (అ.క్రి.) | | తమిళం (స.క్రి.) | |
|---|---|---|---|
| అకర్మకం | అర్థం | సకర్మకం | అర్థం |
| అటంకు | అడగు | అటక్కు | అడచు |
| పెరుకు | పెరుగు | పెరుక్కు | పెంచు |
| ఊంకు | ఊగు | ఊక్కు | ఊపు |
| ఆటు | ఆడు | ఆట్టు | ఆడించు |
| ఏఱు | నెక్కు | ఏఱ్ఱు | ఎక్కించు |

**2. అకర్మక క్రియకు త్తు, ప్పు (వు) చేర్చటం ద్వారా తమిళంలో సకర్మకక్రియ లేర్పడతాయి. 'త్తు' చేర్చినప్పుడు కొన్ని సంధికార్యాలేర్పడతాయి.**

| తమిళం | అర్థం | తమిళం | అర్థం |
|---|---|---|---|
| అ.క్రి. | | స.క్రి | |
| అలక | వికసించు | అలకత్తు | నివసింపచేయు |
| కాయ్ | కాగు | కాయ్‌త్తు | కాచు |
| పర | వ్యాపించు | పరత్తు | వ్యాపింపచేయు |
| నిల్ | నిలబడు | నిఱుత్తు | నిలుపు |
| మరుళ్ | భయపడు | మరుట్టు | భయపెట్టు |

**3. క్రియారూపాన్ని మార్చకుండా భిన్నకాల ప్రత్యయాలను ఉపయోగించటం ద్వారా సకర్మక క్రియ లేర్పడతాయి.**

| తమిళం (అ.క్రి.) | అర్థం | తమిళం (స.క్రి.) | అర్థం |
|---|---|---|---|
| కెటు | చెడు | కెటుతాన్ | చెడగొట్టెడు |
| ఉటై | పగులు | ఉటైప్పాన్ | పగలగొడతాడు |

**మలయాళం :**

మలయాళభాష తమిళభాష నుండి 10 - 12 శతాబ్దాల మధ్య కాలంలో ప్రత్యేక భాషగా విడిపోయింది. కాబట్టి ఇందులో కూడా తమిళంలోవలె అకర్మకాలు సకర్మకాలుగా మారటంలో మూడు పద్ధతులున్నాయి.

1.

| మలయాలం | అర్థం | మలయాళం | అర్థం |
|---|---|---|---|
| అక్రి. | | సక్రి. | |
| అటఙ్ఞు | అడగు | అటక్కు | అడచు |
| పెరుకు | పెరుగు | పెరుక్కు | పెంచు |

| | | | | |
|---|---|---|---|---|
| 2. | నట | నడచు | నట - త్తు | నిడిపించు |
| | నీళ్ | | నీట్టు | సాగదీయు |

3. ఇతి 'దిగు, దింపు' ఒకటి "పగులు, పగలగొట్టు" మొదలయిన క్రియలు ఈ రకానికి చెందినవి.

**కన్నడం :**

"సు" ప్రత్యయం అకర్మక ధాతువుకు చేరటంవల్ల సకర్మక ధాతువు ఏర్పడుతుంది.

| అ.క్రి. | అర్థం | స.క్రి. | అర్థం |
|---|---|---|---|
| ఓడు | పరిగెత్తు | ఓడిసు | పరిగెత్తించు |
| కెరళ్ | కోపపడు | కెరళిసు | కోపంపచేయు |

నాదస్పర్శం స్థానంలో శ్వాస స్పర్శాన్ని ఆదేశించటం వల్ల సకర్మక క్రియల్ని నిర్మించే పద్ధతి కన్పిస్తుంది.

| అ.క్రి. | అర్థం | స.క్రి. | అర్థం |
|---|---|---|---|
| అడంగు | అడగు | అడకు | అడచు |
| ముడుగు | వంగు | ముడుచు | వంచు |

**తెలుగు :**

కర్మను కూర్చిన ఆకాంక్షను కల్గించని, క్రియాపదం అకర్మకంకాగా, కర్మను కూల్చిన ఆకాంక్షను పుట్టింపచేసే క్రియ సకర్మక క్రియ అవుతుంది. (బాల వ్యాకరణం క్రియా. 48). వాక్యంలో కర్మను ఆపేక్షించే క్రియసకర్మక క్రియ. వాక్యంలో కర్త్మ ఉన్నప్పటికీ లేకున్నప్పటికీ క్రియా వాచకాన్ని దేనిని, ఎవరిని, వేటిని అని ప్రశ్నించినప్పుడు సమాధానం లభిస్తే దానిని సకర్మక క్రియ అంటారు. చిన్నయ సూరి బాలవ్యాకరణంలో సకర్మక ప్రేరణ క్రియలకు భేదాన్ని పాటించలేదు.

"రావణుడు చచ్చిపోయాడు" అనే వాక్యంలో అకర్మకక్రియ చచ్చిపోయాడు

'రాముడు రావణుణ్ణి చంపాడు' అనే వాక్యంలో 'చంపాడు' అనేది సకర్మకక్రియ. దీనిలో 'చంపు' అనేది సకర్మక క్రియ. దేనిలో 'చంపు' అనేది సకర్మకక్రియా ధాతువు. అకర్మక క్రియాధాతువుల పై - ఇంచు, చు; పు లు చేరి సకర్మక ధాతువులు ఏర్పడతాయి. అయితే అన్ని అకర్మక ధాతువులకు ఈ ప్రత్యయాలు చేరవు కొన్ని అకర్మక ధాతువులకే ఈ ప్రత్యయాలు చేరతాయి. అప్పుడవి సకర్మక క్రియా ధాతువులవుతాయి.

తెలుగులో ఒకే ధాతువు అకర్మకం, సకర్మకం కావటం ఉంది. ఇటువంటివి అరుదు. ఆగుధాతువు అకర్మకంగాను సకర్మకంగాను ప్రయోగించబడుతుంది. 'వాడు దారిలో ఆగాడు' అంటే వాడు తనంతట తానే ఆడిపోయాడు అని అర్థం. ఇతరులు ఆపటం వల్ల ఆగిపోవచ్చు. అప్పుడు 'ఆగు' సకర్మక ధాతువవుతుంది. ఇటువంటిదే 'కరుగు' ధాతువు. మంచు కరిగిపోయింది. మంచు తనంతటతానే కరిగిపోయిందని అర్థం. ఇక్కడ కరుగు ధాతువు అకర్మకం.

'బంగారం కరిగి పోతపోసారు' 'కంసాలి బంగారాన్ని కరిగించి పోతపోసాడు' అని అర్థం. ఇక్కడ కరుగు అనే ధాతువు నమ్మకం. అకర్మక ధాతువు మీద చు నిష్పాదక ప్రత్యయం చేర్చి సకర్మక ధాతువును తెలుగులో నిర్మించవచ్చు.

| అ.క్రి. | స.క్రి. |
|---|---|
| అమరు | అమరుచు / అమర్చు |
| కాఱు | కాఱుచు / కార్చు |
| చేరు | చేర్చు |
| కాలు | కాల్చు |

**(చు) పరమయినపుడు ధాతువులో కొన్ని మార్పులు :**

| | |
|---|---|
| పూడు | పూడుచు / పూడ్చు |
| మాను | మానుచు / మాన్చు |
| చెడు | చెరుచు |
| ఆడు | ఆరుచు / ఆర్చు |
| ఓడు | ఓరుచు / ఓర్చు |
| కూడు | కూరుచు / కూర్చు |

సకర్మక (చు) ప్రత్యయం ధాతువుకు చేరినప్పుడు ధాతుగతమయిన ధాత్వంతమందున్న కంఠానునాసిక పూర్వగు వర్ణం లోపించి దానిబదులుగా తాలవ్యానునాసికం సర్వాదేశంగా వస్తుంది.

| ధాతువు (అ.క్రి.) | స.క్రి.ప్రత్యయం | స.క్రి. |
|---|---|---|
| అడుగు / అడఁగు | చు | అడంచు / అడఁచు |
| కాఁగు | చు | కాఁచు |

సకర్మక 'ంచు' ప్రత్యయం చేరినప్పుడు అకర్మనధాతు ఆది అచ్చు తర్వాతి వర్ణాలన్నీ లోపించి సకర్మక ధాతువు ఏర్పడుతుంది.

| అ.క్రి. | సకర్మక ప్రత్యయం | స.క్రి. |
|---|---|---|
| చిరుఁగు | ంచు | చించు |
| నెచ్చు | ంచు | నెంచు |
| దిగు | ంచు | దించు |

సకర్మక -చు ప్రత్యయం చేరినప్పుడు అకర్మక ధాతువు ఆదివర్ణం మిగిలి మిగిలిన వర్ణాలన్నీ లోపించి సకర్మక ధాతువేర్పడుతుంది.

| అ.క్రి. | సకర్యక ప్రత్యయం | స.క్రి |
|---|---|---|
| ఉండు | చు | ఉంచు |

సకర్మక పు ప్రత్యయంపరమయినపుడు అ.క్రి. ధాతువు తొలి అచ్చు దీర్ఘమవుతుంది.

| అ.క్రి. | స.క్రి.ప్రత్యయం | స.క్రి. |
|---|---|---|
| కను | పు | కానుపు / కాన్పు |

సకర్మక - పు వర్ణం పరమయినప్పుడు అకర్మక ధాతువుకు చివరి వర్ణం లోపిస్తుంది

| అ.క్రి. | స.క్రి.ప్రత్యయం | స.క్రి. |
|---|---|---|
| ఉడుగు | పు | ఉడుపు |
| కడచు | పు | కడపు |
| ఎడయు | పు | ఎడపు |
| మాయి | పు | మాపు |

ఇంచు సకర్మక ప్రత్యయం చేరటం ద్వారా అనేక కర్మక క్రియలు, సకర్మక క్రియలయ్యాయి.

| అ.క్రి. | స.క్రి.ప్రత్యయం | స.క్రి. |
|---|---|---|
| కలుగు | ఇంచు | కలిగించు |
| నడచు | ఇంచు | నడిపించు, కావించు |
| నలఁగు | ఇం చు | నలఁగించు |
| మాయు | ఇంచు | మాయించు |
| నవ్వు | ఇంచు | నవ్వించు |
| వెలుగు | ఇంచు | వెలిగించు |
| అగు | ఇంచు | కావించు |

**కొండ (కూబి) :**

అకర్మక క్రియా ధాతువు చివర ఉన్న నాదాక్షరాలు జ్, గ్, ద్, ంబ్, వ్, ని లు శ్వాసాక్షరాలు కీ, త్, ప్, ట్ లుగా సకర్మకంగా అయ్యేటప్పుడు మారతాయి.

| అ.క్రి. | అర్థం. | స.క్రి. | అర్థం. |
|---|---|---|---|
| దూజ్ | నదులు | దూక్ | నదివించు |
| నిజ్ | లేచు | నిక్ | లేపు |
| ముడ్గ్ | ములుగు | ముడ్క్ | ముంచు |
| ఊద్ | ములుగు | ఊత్ | ముంచు |
| తె | తెగు | తెప్ | తెంచు |
| నిన్ని | నిండు | నిట్ | నింపు |

కూడు ఖ్, మాల్తో, బ్రాకు ఈ లలో సకర్మక ప్రేరణా క్రియలకు వేర్వేరు ప్రత్యయాలు కాకుండా ఒకే రకం ప్రత్యయాలు చేయటం విశేషం. తెలుగులో కూడా ఈ స్థితి ఉందని "సర్వంబునకుం బ్రేరణంబునందిచుక్కగు" (బాల. వ్యా.క్రియా. 70) అనే సూత్రం తెలుపుతుంది.

**కుదుఖ్ :**

| అ.క్రి. | అర్థం | స.క్రి. | అర్థం |
|---|---|---|---|
| ఎస్ | సగులు | ఎస్తా అ | పగలగొట్టు |

తా అ అనేది సకర్మక ప్రత్యయం.

**మా ల్తో లో సకర్మక ప్రేరణ ప్రత్యయాలు :**

త్రో; ద్

| అ.క్రి. | అర్థం | స.క్రి. | అర్థం |
|---|---|---|---|
| అల్ఖ్ | నవ్వు | అల్ఖ్‌త్ర్ | నవ్వించు |
| ఖంద్ర్ | నిద్రించు | ఖంద్ర్‌త్ర్ | నిద్రించేటట్లు చేయు |

**బ్రాహు ఈ :**

అకర్మక క్రియను సకర్మకంగా చేయాలనుకుంటే ఇఫ్ - చేర్చాలి. ప్రేరణా ప్రత్యయం కూడా ఇదే.

| అ.క్రి. | అర్థం | స.క్రి. | అర్థం |
|---|---|---|---|
| బార్ర్ | ఎండు | బారిఫ్ | ఎండబెట్టు |
| బన్ | వచ్చు | బనిఫ్ | రప్పించు |

**ప్రేరణ ప్రత్యయాలు - ప్రేరణ క్రియలు :**

సకర్మక క్రియకు ఒక కర్త ఉంటుంది. ప్రేరణ క్రియకు హేతుకర్త ప్రయోజ్యకర్త (మొత్తం రెండుకర్తలు) ఉంటాయి. సుకర్మక క్రియకు ప్రేరణ ప్రత్యయం చేర్చటం ద్వారా ప్రేరణక్రియ ఏర్పడుతుంది

**తమిళం :**

ప్రేరణ ప్రత్యయం వి / ప్పి / ప్రాక్ తమిళంలో ప్రేరణ ప్రత్యయాలు తక్కువ. తమిళం 'చెయ్‌విత్తాన్'' చేయించాడు. "మఱప్పిత్తాన్'' మరిపించాడు.

**మలయాళం :**

ఇ(వి) / ప్పి

| | |
|---|---|
| చెయ్యిచ్చు | చేయించాడు / చేయించింది |
| కొల్లిచ్చు | చంపించాడు / చంపించింది |

**తుళు :**

ప్రేరణ ప్రత్యయం - అవు / ఓ ఏకాచ్కధాతువులపై ప్రేరణలో పావు / పో చేరుతుంది.

| స.క్రి. | అర్థం | ప్రే.వు | అర్థం |
|---|---|---|---|
| తళ్ళు | తోయు | తళ్ళో | తోయించు |
| తిన్ | తిను | తిన్పో | తినిపించు |
| సేరు | చేరు | సేరో / సేర్పో | చేర్చు |

**తెలుగు :**

ఈ తెలుగు భాషలో ప్రేరణ ప్రత్యయాలు ఇంచు; ఇపించు; పించు.

చిన్నయసూరి "సర్వంబునకుంబ్రేరణంబు నందిచుక్కగు" (బాల.వ్యా. క్రియా. 70 సూ) అనే సూత్రం ప్రసిద్ధమయింది.

| స.క్రి. | ప్రేరణప్రత్యయం | ప్రేరణ క్రియారూపం |
|---|---|---|
| వచించు | ఇంచు | వచింపించు |
| వండు | ఇంచు | వండించు |
| కాల్చు | | కాల్పించు |
| తడుపు | ఇంచు | తడిపించు |
| తిను | ఇపించు | తినిపించు |
| చూచు | పించు | చూపించు |

**గోండి :**

ఈ భాషలో ఊస్ / ప్రేరణ ప్రత్యయం

| స.క్రి. | ప్రేరణ ప్రత్యయం | | ప్రేరణ క్రియ |
|---|---|---|---|
| తున్ 'తాగు' | హ్ | ఉహ్ | తాగించు |
| తిన్ 'తిను' | హ్ | తిహ్ | తినిపించు |

అట్ 'వండు' ఊస్ అట్టూస్ వండించు

**కొండ (కూబి) :**

-స్ (-ఇస్); -సిస్ (-బస్)

ప్రత్యయాలు చేర్చటం వల్ల ప్రేరణ క్రియలు ఏర్పడతాయి.

| స.క్రి. | | ప్రేరణ ప్రత్యయం | ప్రేరణ క్రియ | |
|---|---|---|---|---|
| కట్ | 'కోరుకు' | -పిస్ | కట్‌పిస్ | 'కోరికించు' |
| త | 'తెచ్చు' | -పిస్ | తపిస్ | 'తెప్పించు' |
| ఉణ్ | 'తాగు' | -పిస్ | ఉణ్పిస్ | 'తాగించు' |

నాయకీ (చాందా) : ప్రేరణ ప్రత్యయాలు -ప్, -ఇప్, -ఉప్‌లు

వయ్ (కాలు, జ్వలించు) వయిప్ (<వయ్ + ఇప్) 'కాల్చు'

ఉత్తర ద్రావిడ భాషలలో సకర్మక ప్రత్యయాలకు ప్రేరణ ప్రత్యయాలకు భేదం లేదు.

## సకర్మక ప్రేరణ ప్రత్యయాల క్రియల తులనాత్మక పరిశీలన :

ద్రావిడ భాషలలో 3 రకాల పద్ధతులున్నట్లుగా మనకు అవగతమవుతుంది.

**మొదటి పద్ధతి :**

అకర్మక క్రియ చివర ఉన్న శ్వాస స్పర్శం లేదా అనునాసికంతో కూడిన శ్వాస స్పర్శం స్థానంలో ద్విరుక్త శ్వాస స్పర్శాన్ని ఆదేశించటం వల్ల సకర్మక ప్రేరణ క్రియలు ఏర్పడతాయి. ఈ పద్ధతి తమిళం, మలయాళం, కోత, తొద భాషలలో ఉంది. కన్నడంలో కూడా ఈ పద్ధతి కొంతవరకు ఉంది. తెలుగులో ఈ పద్ధతి లేదు. తెలుగులో సకర్మక ప్రత్యయంగా -చు ధాతువుకు చేర్చుతారు. తమిళంకు -(అ.క్రి.) 7 కలక్కు (స.క్రి) తెలుగు కలఁగు (అ.క్రి.) > కలచు (స.క్రి.).

**రెండో పద్ధతి :**

ద్రావిడ భాషలలో ఉన్న అనేక క్రియలకు ఒక సకర్మక ప్రత్యయాన్ని లేదా ప్రేరణ ప్రత్యయాన్ని చేర్చటం వల్ల సకర్మక రూపాలు లేదా ప్రేరణక్రియలు ఏర్పడతాయి. ఈ ప్రత్యయాలు -త్త్- (సంధి రూపాలు -ట్ట్-; -ఱ్ఱ్-); -ప్ప్-; -చ్చ్ ; -ఇ-.

**ఉదా :**

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1) | తమి. | తిన్ | 'తిను' | తీఱ్ఱు | 'తినిపించు' |
| | కన్న | తిన్ | 'తిను' | తీఱు | |
| | గోణ్డి | తిన్ | | తీహ్ | |
| | మూ.ద్రా. | తిన్ | | తీఱ్ఱ్ | |
| 2) | తమి. | ఉణ్ | 'తాగు' | ఊట్టు | 'తాగించు' |
| | కన్న | ఉణ్ | తిను | ఊడు | తినిపించు |
| | పెంగో | ఉణ్ | తిను | ఉట్ప | తినిపించు |
| | మూ.ద్రా. | ఉణ్ | | ఊట్ట్ | |
| 3) | తమి. | పూణ్ | 'పూను' | పూట్టు | 'పూన్చు' |
| | కన్న | పూణ్ | 'పూను' | హూడు | 'పూన్చు' |
| | కుఇ | పూండ్ | కలియు | పూట్ | కలుపు |
| | మూ.ద్రా | పూణ్ | | పూట్ట్ | |

మూ.ద్రా. -ఇ- ప్రత్యయం తమిళ మలయాళాలలోని ప్పి/ని లలోను తెలుగులో -ఇంచులోను కన్పిస్తుంది.

| తమి | తెలుగు |
|---|---|
| కాణ్పి | కాన్పించు |
| నటప్పి | నడపించు |
| మఱప్పి | మఱపించు |

**మూడోపద్ధతి :**

ఈ పద్ధతిలో అకర్మక క్రియలో ఉపయోగించే కాలప్రత్యయాల కంటే వేరయిన కాల ప్రత్యయాలను ఉపయోగించటం వల్ల సకర్మకార్థాన్ని సూచించటం జరుగుతుంది. ఈ పద్ధతి తమిళం, మలయాళం, కోత, తొద, కొడగు భాషలకు పరిమితం. ఈ పద్ధతి మధ్యోత్తర ద్రావిడ భాషలలో లేదు. దక్షిణ ద్రావిడ భాషలయిన కన్నడం, తుళులలో కూడా లేదు. కాబట్టి ఇది తమిళాదిభాషలలో ఏర్పడ్డ తదనంతర పరిణామంగా మనం భావించవచ్చు.

సకర్మక ప్రత్యయాలకు భిన్నంగా ఉన్న ప్రేరణ ప్రత్యయాలు ప్రాచీన తమిళం, మలయాళం, తెలుగు, మాల్తో, బ్రాహుఈ లలో ఉన్నాయి. సకర్మక ప్రేరణ ప్రత్యయాలకు మధ్య భేదం ప్రాచీన కాలంలో లేదని చెప్పవచ్చు.

సంస్కృతేతర ఇండో-యూరోపియన్ భాషలలో ప్రేరణ ప్రత్యయాలు లేవు. సంస్కృతంలోను దాని నుండి ఉద్భవించిన హిందార్య భాషలలోను ప్రేరణ ప్రత్యయాలు కన్పిస్తున్నాయి.

**సంస్కృత భాష :**

| స.క్రి. | అర్థం | ప్రేరణ క్రియ | అర్థం |
|---|---|---|---|
| కరోతి | చేస్తున్నాడు | కారయతి | చేయిస్తున్నాడు |
| హారతి | హరిస్తున్నాడు | హారయతి | హరించేటట్లు చేస్తున్నాడు |

ద్రావిడ భాషలన్నింటిలోను ప్రేరణ క్రియలు ప్రచురంగా ఉన్నాయి. కాబట్టి ద్రావిడ భాషల ప్రభావం ఆర్యభాషల మీద ఉన్నట్లు చెప్పవచ్చు. సకర్మక ప్రేరణ క్రియావిధానం ద్రావిడ భాషల ఏకతను నిరూపిస్తుంది.

**మాదిరి ప్రశ్నలు :**

1. క్రియను నిర్వచించి, అకర్మక క్రియలు ద్రావిడ భాషలలో ఏవిధంగా ఉన్నాయో సోదాహరణంగా పేర్కొనండి.
2. అకర్మక క్రియలు సకర్మక క్రియలుగా ద్రావిడ భాషలలో ఏవిధంగా ఏర్పడతాయో నిరూపించండి.
3. ద్రావిడ భాషలలో ప్రేరణ క్రియలేర్పడే విధానాలను పేర్కొని సోదాహరణంగా వివరించండి.
4. ద్రావిడ భాషలలో సకర్మక ప్రేరణ ప్రత్యయాలను తులనాత్మకంగా పరిశీలించండి.
5. **ఈ క్రింది వాటికి లఘువ్యాఖ్య వ్రాయండి.**

అ) క్రియా నిర్వచనం
ఆ) క్రియా నిర్మాణం
ఇ) సకర్మక క్రియలు - సిద్ధాలు
ఈ) సకర్మక క్రియలు - సాధ్యాలు
ఉ) అకర్మక క్రియలు ద్రావిడ భాషలలో సకర్మక క్రియలుగా మారే మూడు పద్ధతులు
ఊ) ద్రావిడ భాషలలోని ప్రేరణ ప్రత్యయాలు
ఋ) సంస్కృత ద్రావిడ భాషలలోని ప్రేరణ క్రియలు

**గ్రంథ సూచి :**


1. అరుణాచల శాస్త్రి ఆకెళ్ల. 1972. కవిశిరోభూషణ వికృతి, ఆకెళ్ల అరుణాచల శాస్త్రి, విజయనగరం.
2. చిన్నయసూరి పరవస్తు. 1987. బాల వ్యాకరణము (ఘంటా పథ వ్యాఖ్యాన సహితము), వంతరాం, రామకృష్ణారావు, ఆంధ్ర శాఖాధ్యక్షులు, ప్రభుత్వ కళాశాల, రాజమండ్రి.
3. జోగి సోమయాజి, గంటి. 1947. ఆంధ్ర భాషా వికాసము, తెలుగు శాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం - 3.
4. పురుషోత్తమం, బొడ్డుపల్లి 1974. తెలుగు వ్యాకరణ వికాసము, శేషాద్రి నిలయం, బొడ్డుపల్లి వారి వీధి, బాపట్ల.
5. భర్తృహరి, 1974. వాక్యపదీయమ్, తెలుగు అకాడమి, హైదరాబాదు - 29.
6. సుబ్రహ్మణ్యం, పి.ఎస్. 1997. ద్రావిడ భాషలు, శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, పబ్లిక్ గార్డెన్స్, నాంపల్లి, హైదరాబాదు - 4.

**Bibliography**

Krishna Murti, Bha©driraju, 1961. 'Telugu Verbal Basis' University of California Press, Berkeley, Los Angeles, U.S.A.

Lakshman, Sarup, 1967. "The Nighantu and the Nirukta, Motilal Banarasidas, Varanasi.

# సంధి - చరిత్ర

## సంధి - నిర్వచనం :

'సమ్' పూర్వక 'ధా' ధాతువు నుంచి 'సంధి' శబ్దం వచ్చింది. సంధి అనే దానికి కూడిక, కలయిక, చేరిక మొదలైన అర్థాలున్నాయి. వ్యాకరణశాస్త్రవ్యవహారాల్లో 'సంధి' అంటే వర్ణసంయోగం. దీనినే సంహిత అని కూడా అంటారు. భాషల్లో ఉచ్చారణ సౌలభ్యం కోసం ఒక శబ్దం చివర్లో వుండే వర్ణం దానికి సన్నిహిత పరమైన ఇంకో శబ్దం యొక్క ఆదివర్ణం కలిస్తే 'సంధి' అవుతుంది. భాషాస్వరూపాన్ని బోధించే వ్యాకరణ ప్రక్రియాలిన్నింటిలోనూ 'సంధి' చాలా ముఖ్యమైంది. భాషా చారిత్రక దృష్టితో సంధి స్వరూప స్వభావాల్ని తెలుసుకోవడం ఎంతైనా అవసరం.

## సంస్కృతంలో సంధి :

తెలుగు భాషలోని 'సంధి' విధానానికి సంస్కృత భాషలోని 'సంహిత' (వర్ణ-సంయోగం) కు చాలా తేడా ఉంది. "పరస్పన్నికర్షస్సంహితా" (అష్టాధ్యాయి 1-4-109) అని పాణిని పేర్కొన్నాడు. మిక్కిలి సన్నికర్షముకల ధ్వనుల కూడిక 'సంహిత' సంస్కృతవైయాకరణులు, రెండు అక్షరాలు ఉచ్చరించే టప్పుడు అర్థమాత్రకమైన కాలం కంటే అధిక వ్యవధానం లేకపోవడాన్ని 'సంహిత' అని అన్నారు. సంస్కృతంలోని సంధులకు ద్రావిడ భాషలోని సంధులకు ఎలాంటి సంబంధం లేదు. సంస్కృత సంధులైన సవర్ణ దీర్ఘ, గుణ, వృద్ధి, యణాదేశం, మొదలైన సంధులు ద్రావిడ భాషలు స్వభావానికి పూర్తిగా భిన్నమైనవి.

## ద్రావిడ భాషలు :

సంధి స్వరూప స్వభావాల విషయాల్లో ప్రాచీన తెలుగు వైయాకరుణులకు, ఆర్వాచీన తెలుగు, వైయాకరణులకు కొంచెం భేదం కన్పిస్తుంది. ప్రాచీన వైయాకరణులైన కేతన, విన్నకోట పెద్దన, మొదలగున్నవారు చెప్పిన సంధి లక్షణాలను, ఇతర ద్రావిడ భాషావ్యాకర్తలు చెప్పిన సంధి లక్షణాలను నిశితంగా పరిశీలిస్తే సంస్కృత వ్యాకరణ సంప్రదాయాల్ని తు.చ. తప్పకుండా అనుసరించి ముఖ్యంగా సంస్కృతంలో - రచించిన అధర్వణ కారికల్ని అనుసరించి చెప్పినట్లు కన్పిస్తుంది. సర్వసాధరణంగా దక్షిణ భారతదేశ భాషవ్యాకరణాలన్ని అంటే తెలుగు, కన్నడం, మళయాళం మొదలైన భాషలన్ని సంస్కృతవ్యాకరణ సంప్రదాయాల్ని అనుసరించాయి. అయితే సంస్కృత వ్యాకరణ సంకేత పద్ధతిని కూడా విశేషంగా అవలంబించి, అనుసరించి, ఆర్వచీన వ్యాకర్తల్లో బాల వ్యాకరణకర్త చిన్నయసూరి మొదటివాడు అని చెప్పక తప్పదు.

## 1. తమిళంలో సంధి: తొల్కాప్పియనార్ - తొల్కాప్పియం :

ద్రావిడ భాషల్లో చాలా ప్రాచీనమైన వాఙ్మయం గల భాష తమిళం. తమిళ భాషలో మొట్టమొదటిగ్రంథం "తొల్కాప్పియం" దీన్ని రాసినవాడు తొల్కాప్పియనార్ - తొల్కాప్పియం లో సంధి స్వరూపం చాల చక్కగా చెప్పబడింది.

పూర్వపదాంత్యభాగానికి పరపదాది భాగానికి సంధి జరుగుతుంది. తమిళంలో సంధి నాలుగు విధాలుగా జరుగుతుంది. అచ్చుకు అచ్చుపరమైనపుడూ, హల్లుకు అచ్చు పరమైనపుడూ, అచ్చునకు హల్లుపరమైనపుడు, హల్లుకి, హల్లుపరమైనపుడు సంధి అవుతుంది. ఇవి నామపదాలుకాని, క్రియాపదాలుకాని కావచ్చు. సంధికార్యాలు నాలుగు విదాలు. అందులో మూడు విధాలుగా మార్పుతో కూడుకున్నవి. ఒకటి మార్పులేనిది. ఈ మార్పు మూడు విధాలుగా ఉంటుంది. ఒకటి ఆదేశం, రెండు ఆగమం, మూడు లోపం.

**1. ఆదేశం :**

ఉదా: మణ్+కుడుం = మట్కుడం

**2. ఆగమం :**

ఉదా: అనై+కొడు = అనైకోడు

**3. లోపం :**

ఉదా: మరమ్ + వేర్ = మరవేర్

మొత్తం మీద తమిళభాషలో సంధి జరిగే సందర్భాలు రెండు విధాలుగా కన్పిస్తున్నాయి. ఒకటి ప్రతిపదికకు విభక్తి ప్రత్యయం పరమైనప్పుడు సంధి జరుగుతుంది. అప్పుడు ఒక వర్ణంగాని, ఔపవిభక్తి ప్రత్యయం కాని ఆగమం అవుతుంది.

## 2. కన్నడంలో సంధి : కేశిరాజు -"శబ్దమణిదర్పణం" :

కన్నడ వైయాకరణుల లక్షణాలు తమిళవైయాకరణుల లక్షణాలకు దగ్గరగా వున్నాయి.

"ఎరడం పలవుల వర్ణం
పరస్పరం కూడు వందమదు సంధివలం
స్వర రహితవ్యంజనమవు
పరవర్ణమనైదు తిర్పునా సంహితెయుళ్" (శబ్దమణి దర్పణం-49)

రెండుకాని, అంతకంటే ఎక్కువగాని వర్ణాలు పరస్పరం కలిస్తే 'సంధి' అవుతుందని కేశిరాజు చెప్పాడు. ఆ సంహితలో స్వరరహితమైన వ్యంజనం పరస్పరంతో కలుస్తుంది.

ఉదా: కుర్తు +ఈవం = కుర్తీవం
ఎన్న + అరసం = ఎన్నరసం

పరమద్యం పద దంత్యం
దిదగ్గరిం సంధి విషయమెరడక్కుమిళా,
విదిత ప్రకృతి ప్రత్యయ
మొదవిద పదముగద చెరకెచేడిర్దుర అం " (శబ్దమణి దర్పణం - 50)

కన్నడ భాషలో వ్యాకర్తలు సంధిని రెండు విధాలుగా విభజించారు.

1. పదమధ్య సంధి 2. పదాంత్య సంధి.

## 1. పదమధ్యసంధి :

ఉదా: 1. నామవిభక్తి : మాతు + అం = మాతం
2. ధాతు విభక్తి : నుడిద + అం = నుడిదం, నుడిద + ఇర్ = నుడిదిర్.

**2. పదాంత్య సంధి :**

ఉదా: అవన + అళనం = అవనాళ్తనం

జెసదిదెవు+బళ్ళం = బెససిదెవొళ్ళం

కన్నడంలో సంధికార్యలు మూడు విదాలుగా ఉంటాయి, ఒకటి లోపం రెండు ఉచితాక్షరాగమం, మూడు అంత్యాక్ష రదిత్వం.

**1. లోపం :**

స్వరం పరమైనపుడు విభక్తి స్వరానికి , ప్రకృతి స్వరానికి (ఆ,ఇ, ఉ, ఎ లకు ) లోపం అవుతుంది.

ఉదా: క్రమద + ఆయ్తు = క్రమదాయ్తు

చలద + ఆణ్మం = చలదాణ్మం

అరస + ఆళ్ = అరసాల్

**2. ఆగమం :**

ఆ,ఇ,ఈ,ఎ,ఏ,ఐ,ఓ, వర్ణాలకు అచ్చు పరమైనపుడూ, అవధారణార్థక 'ఏ' కారం, పరమందుగల షష్ఠివిభక్త్యంత 'అ' కారానికి మధ్య 'యు' కారం వస్తుంది.

ఉదా : ఆ + ఇర్ద = అయుర్థ

కవి + అర్ = కవియార్

పసె + ఇర్దం = పసెయిర్దం

జో+ఎందు = జో యొందు

అతన + ఎ = అతనయె - ఉ, ఊ, ఋ, ఋా, ఓ,ఔ, ల తర్వాతా 'వ' కారం వస్తుంది.

ఉదా: మనవిన, పూవిన, గోవిన

**3. ద్విత్వం :**

ఉదా: కణ్ + అం = కణ్ణం

పన్ + బన్డు = పన్నొండు

**3. తెలుగులో సంధి - వ్యాకర్తలు :**

1. మూల ఘటిక కేతన - "ఆంధ్రభాషా భూషణం"

"మొదలి పదము తుది వర్ణము
వదలకై పదము మొదలి వర్ణము తోడం
గదియఁగ సంధులు నాఁదగు
విదితపఁతద్సంధులెల్ల వివరింతుఁదగన్ " - (ఆంధ్రభాషా భూషణం - 44)

పై చెప్పిన సంధి నిర్వచనంలో రెండు పదాలు కలిసేటప్పుడు మొదటి పదంలోని చివరివర్ణం, తర్వాత పరమయ్యోపదంలోని మొదటివర్ణం కలిసేటప్పుడు సంధి జరుగుతుందని చాలా స్పష్టంగా తెలియజేసాడు కేతన.

ఒ - విన్నకోట పెద్దన - "కావ్యాలంకార చూడామణి'

ఆది శబ్దాంతవర్ణంబు నంత్యశబ్ద
పూర్వవర్ణంబుతోఁ గూడఁ బొత్తు
చేత సంధియగు..............................నని విన్న కోట పెద్దన చెప్పాడు.

-(కావ్యాలంకార చూడమణి = 9-45)

బాగా పరిశీలిస్తే కేతన, విన్నకోటపెద్దనలు ఇద్దరూ చెప్పిన సంధి లక్షణాలకు తమిళ, కన్నడ, వ్యాకర్తలు, చెప్పిన సంధి లక్షణాలకు దగ్గర పోలిక ఉంది.

### 3. అదర్వణా చార్యులు : "వికృత వివేకం".

"అద్యంత వర్ణయోరైక్యం
సన్థిరిత్యూచ్యతేబుధైః
పూర్వ స్వపరరూపత్వ

మత్రైవనియతం భవేత్" - (వి.విః సంధిః1) - అని తన కారికాల ద్వార తెలియజేసాడు. సంస్కృత భాషలో కన్పించే పరరూప సంధి, తెలుగు భాషలో స్వర సంధి విషయంలో సర్వేసర్వత్ర నియతంగా జరగడం విశేషమని అదర్వణాచార్యులు చెప్పారు.

### 4. - "అప్పకవీయం" : అప్పకవి :

"ఎచటం సంధి గలుగునఁచట బూర్వపదాంత
హల్లుతోఁడ గూడనట్టిస్వరము
లోపముగ నొనర్చి మాపొల్లుతోమీది
మక్షరంబు గుర్చనయ్యె సంధి"

పూర్వ పదం చివర హల్లుతో కలిసివున్న స్వరాన్ని లోపింపజేసి మిగిలిన పొల్లుహల్లుతో తర్వతి పదంలోని మొదటి అక్షరం (పోలిస్తే) కలిస్తే సంధి అవుతుందని అప్పకవి చెప్పాడు.

### 5. పరమస్తుచిన్నయసూరి - "బాలవ్యాకరణం"

"పూర్వ పరస్వరంబులకు పరస్వరం
బేకాదేశంబగుట సంధి యనంబడు" - (బాల-సంధి-01)

మూలఘటిక కేతన, విన్నకోట పెద్దన, ఇరువురూ పూర్వాత్య వర్ణాలు- అచ్చులు మాత్రమే అని కాని, పరరూపత్వం అని కాని, స్పష్టంగా తెలియజేయలేదు. అదర్వణాచార్యులు. అచ్చు అనకుండా వర్ణశబ్దం వాడినప్పటికి పరరూపాన్ని చెప్పాడు . చిన్నయసూరి స్వరం అని నిర్దేశించడమే కాక పరరూపత్వాన్ని విధించాడు. అయితే సూరి బాలవ్యాకరణంలో సంధి పరిచ్ఛేదంలో హల్సంధుల్ని, కూడా రాశాడు. బహుజన పల్లి సీతారామాచార్యులు" ప్రౌఢవ్యాకరణం" లో ఇదే విషయాన్ని గూర్చి పునరుద్ఘాటించాడు కూడా.

దినికి కారణం ఏమంటే సంధి, సంధితుల్యాలైన వాని నన్నింటిని అతడు గ్రహించడాని తెలుస్తుంది. అంటే సంధిశబ్దం, సంధి కార్యవిశేషంలో రూఢమైందని తెలుసుకోవాలి.

తెలుగు భాష అజంత భాష కాబట్టి చిన్నయసూరి స్వరాలకు సంబంధించిన మార్పులకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు. అంచేత పరస్పర ఏకాదేశ రూప కార్యమే 'సంధి' అని చెప్పాడు. అదర్వణా చార్యులు, కూడా ఇలాగే చెప్పాడు ఇలాగే చెప్పాడు. "పూర్వస్య,పరరూపత్వ మత్రైవ నియతంభవేత్" చిన్నయసూరి పూర్వాంధ్రవైయాకరణులు మతానుసారం పరరూప సంధియే 'సంధి' అని గ్రహించాడు.

పై విధంగా 'సంధి' అనే పదాన్ని గూర్చి ప్రముఖ వ్యాకర్తలు పలు విధాలుగా నిర్వచించారు. ఎవరు ఎన్ని రకాలుగా 'సంధి' ని నిర్వచించినా భావం మాత్రం ఒక్కటే. ఒక్క మాటలో చెప్పాలంటే అద్యంత వర్ణాల కలయికే 'సంధి'.

## 2. తెలుగులో సంధి :

చిన్నయ సూరి "బాల వ్యాకరణం" లో సంధి పరిచ్ఛేదంలో వరసగా మొదటి అచ్చంధుల్ని తర్వాతా హల్సంధుల్ని రాశాడు. అచ్సంధుల్లోనూ, హల్సంధుల్లోనూ, అనేక రకాలైన అంతర్భాగాలు చోటు చేసుకున్నాయి. వాటి వివరాలు విపులంగా విశ్లేషణ పూర్వకంగా ఇందులో పొందుపర్చబడ్డాయి. పరిశోధకులు గమనించగలరు.

సాధరణంగా అ, ఇ, ఉ, అనే వరుస క్రమాన్ని బట్టి ఈ సంధుల్ని "అత్వసంధి" తో ప్రారంభించాలి. అయితే చిన్నయసూరి "ఉత్వసంధి" తో సంధి పరిచ్ఛేదాన్ని మొదలుపెట్టాడు. ఇలా చిన్నయసూరి సూత్రాల వరస మార్చడంలో కారణాలు లేకపోలేదు. నిశితంగా పరిశీలిస్తే నిగ్గుతేలుతుంది.

తెలుగు భాషలో "అత్వసంధి" 'బహుళం' , 'ఇత్వసంధి' 'వైకల్పికం' ఉత్వసంధి' నిత్యం, తక్కిన అచ్చులకి ఇంచుమించు సంధి జరగలేదు. జాగ్రత్తగా పరిశీలిస్తే తెలుగులో అచ్చులకు సంధి జరిగే చోటులకంటే సంధిలేని తావులే ఎక్కువగా కన్పిస్తాయి.

చిన్నయ సూరి సంధిపరిచ్ఛేదాన్ని మంగళాదికంగా రాయాలని అనుకొని ఉండవచ్చు. అందువల్ల బహుళంగా విదించవలసిన ఆకారసంధితో ప్రారంభించడం ఎందుకని అక్షర క్రమం కొంచెం అటూఇటూ మార్చుకొని సంధికార్యం నిత్యంగా వచ్చిన ఉత్వసంధితో సంధి పరిచ్ఛేదాన్ని మొదలుపెట్టి ఉండవచ్చు. ఏది ఏమైనా సంధి పరిచ్ఛేదం ప్రారంభం బాగుంది. సంధి పరిచ్ఛేదం రచనా ప్రణాళిక విశిష్టమైంది. ఈ సంధి పరిచ్ఛేదంలో మొదటి అచ్చంధులు తర్వాతా హల్సంధులు చోటు చేసుకున్నాయి. మొదటి 11 సూత్రాలు అచ్చందులకు మాత్రమే సంబంధించనవి అనే విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి.

"సంధియగును" అని సంది శబ్దం ఉచ్చరించి రాసనవి సంధి పరిచ్ఛేదం, మొత్తం 55 సూత్రాల్లో 11 మాత్రమే ఉన్నాయి. అంతేకాక ఇవి ఇన్ని 1 నుండి 11 వరకు వరుస క్రమంలో వున్నాయి. ఈ 11 స్వరసందుల్ని సాంకేతిక సంధులు. పరరూపసంధులు, చిన్నయసూరి 12వ సూత్రం నుండి 54 వ సూత్రం వరకు ఏ సూత్రంలోను "సంధి" శబ్దాన్ని ప్రయోగించలేదు. 55వ సూత్రంలో మరల సంధి శబ్దాన్ని ప్రయోగించాడు. ఎంతో మెలుకువతో, కడు జాగ్రత్తగా, సూరి రచనా ప్రణాళికను వేసుకొని ఈ పరిచ్ఛేదాన్ని చాల చక్కగా తీర్చిదిద్దారు. పండితులు విమర్శకుల మన్ననల్ని ప్రశంసల్ని అందుకున్నాడు. అందరితో శభాష్ అనిపించుకున్నాడు.

అచ్చంధులు మూడు. 1. ఉత్వసంధి , 2- అత్వసంధి, 3 - ఇత్వసంధి., పరమస్తు చిన్నయసూరి 'బాలవ్యాకరణం' లో "ఉత్వసంధి" నిత్యం అనీ "అత్వసంధి" బహుళం అని, 'ఇత్వసంధి' వైకల్పికం అని చెప్పాడు వ్యాకరణంలో హ్రస్వఉకారాన్ని 'ఉత్తు' అనీ హ్రస్వ అకారాన్ని "అత్తు" అనీ హ్రస్వ ఇకారాన్ని 'ఇత్తు' అనీ వ్యవహరిస్తాడు. సంస్కృతంలో దీనినే 'తపకరణం' అని అంటారు.

తెలుగు భాషలో సంధి నాలుగు విధాలుగా వుంటుంది.

1. స్వరసంధులు 2. ఆగమసంధులు, 3. ఆమ్రేడిత సంధులు 4. ఇతర సంధులు.

## 1. స్వర సంధులు :

'ఉత్వసంధి' నిత్యమని, ఇత్వసంధి వైకల్పికమని, అత్వసంధి బహుళమని బాల వ్యాకర్త సోపపత్తికంగా నిరూపించాడు. అకారాన్ని 'అత్తు' అని అంటారు.

## 1. ఉత్వసంధి :

1. నిత్యం 2. వైకల్పికం

"ఉత్తునకచ్చు పరంబుగునపుడు సంధియగు" (బాల-సంది.01) అని సూరి "ఉత్త్వసంధి" నిత్యంగా వస్తుందని చెప్పాడు.

ఉదా: సోముడు + ఇతడు = సోముడితడు

ఇతడు + ఒకడు = ఇతడొకడు - ఉత్వ సంధి వికల్పం అని

కూడ చిన్నయసూరి చెప్పాడు. "ప్రథమేతర విభక్తి శత్రర్థ చువర్ణంబులందున్న యుకారంబునకు సంధి వైకల్పికంబుగానగు" (బాల.సం.2)

ఉదా : వినుచున్ + ఉండెను = వినుచుండెను, వినుచుచుండెను.

నాకొఱకున్ + ఇచ్చె = నాకొఱకిచ్చె, నాకొఱకునిచ్చె.

## 2. అత్వసంధి :

"అత్వసంధి" ని వ్యాకర్తలు బహుళకార్యంగా పేర్కొన్నారు. స్త్రీవాచక, తత్సమ, సంబోధాంతాలలోని అత్వానికి సంధిలేదని నిషేదించాడు.

1. "అత్తునకు సంది బహుళమునగు" అని సూరి సూత్రీకరించాడు (బాల- సంది 4)

(ఉదా: మేన + అల్లుడు = మేనల్లుడు, మేనయల్లుడు,

పుట్టిన + ఇల్లు = పుట్టినిల్లు, పుట్టినయిల్లు

చూడక + ఉండెను = చూడక నుండెను, చూడకుండెను

ఈ సూత్రంలో సంధి వచ్చిన రూపాలు, సంధిరాని రూపాలు రెండు ఉన్నాయి. సంధి రూపాలు జన సామాన్యవ్యవహారంలో వున్నాయి. సంధిరాని రూపాలు కవుల వ్యవహారంలో ఉన్నాయి. మేనయల్లుడు పుట్టిన యిల్లు, చూడకయుండెను, అని యడగమా రూపాలు, ఎవ్వరూ ఎక్కడా వ్యవహారంలో వాడరు.

2. పై సూత్రానికి అనుబంధంగా సూరి "బహుళ గ్రహణంబు చేత స్త్రీవాచక తత్సమ సంబోధానాంతంబులకు సంధిలేదు. అని చెప్పాడు.

ఉదా: అమ్మ+ఇచ్చెను = అమ్మెచ్చెను, అమ్మయిచ్చెను.

దూత +ఇతడు = దూతితడు, దూతయితడు.

చెలువుడ + ఇందము = చెలువుడిందము, చెలువుడ యిందము.

'అమ్మ' స్త్రీవాచకం కాబట్టి అత్వానికి సంధిలేదు. సంధిలేని చోట, యడాగమం వచ్చింది. 'దూత' అనే పదం = తత్సమం, కావున అత్వానికి సంధిలేదు. సంధిలేని చోట యడాగమం, చెలువుడయిందము, చెలువుడ, అనేది సంబోదనాంతం కాబట్టి అత్యానికి సంధిలేదు. సంధిలేని చోట యడాగమం వచ్చింది, చెలువడయిందము.

3. సూత్రవివరణలో సంస్కృతీయంబునకు సందీయగునని యదర్వణాచార్యులు చెప్పిరి. కాని దానికిం బూర్వ కావ్యంబులందు ప్రయోగంబు మృగ్యంబు. ఆధునిక కృతులందు నొకనొక చోట స్త్రీవాచక తత్సమంబులకు సంధిగానంబడియెడి". అని సూరి చెప్పాడు. ఆధునికలు ఇచ్చిన సంధి రూపాలు నెలతిచ్చెను. నెలత+ఇచ్చెను= నెలతిచ్చెను. అనే రూపం ఏర్పడింది. "గంగ" శబ్దం తత్సమం అయినప్పటికి అత్వసంధి గంగ+అనుకాసె=గంగనుకాసె అని రూపమైంది. ఈ రెండు రూపాలు శ్రీకృష్ణదేవరాయలు రాసిన ఆముక్తమాల్యద' గ్రంధంలోనిది.

"వెలయాల్వాదులు సంధి లేమి బాహుళకంబు చేతనే యని యూహించునది. అని సూరి చెప్పాడు. ఇక్కడ బహుళకం చేత వెళయాల్వదులు సంధిలేదని తెలుస్తుంది. సూరి వెలయాలును. గూర్చి చెప్పాడు. కాని 'వెలాలు' ను గూర్చి సూత్రీకరించలేదు. అంటే వెలాలు, రూపం, చిన్నయసూరి అంగీకారం కాదని తేటతెల్లమౌతుంది. వెలయాలు (వెల+య్+అలు) అనే రూపం జన వ్యవహరంలో లేదు కాని సాహిత్యంలో చోటు చేసుకుంది. వెలయాలు అంటే వేశ్య, ఉంపుడుగత్తె, అనే అర్థాలున్నాయి. 'వెల'కు 'వచ్చెడి' 'ఆలు' అని అర్థం.

## 3. ఇత్వసంధి :

తెలుగు భాషలోని ఇత్వసంధి మూడు రకాలుగా విభజించవచ్చు.

ఇత్వసంధి

1. వైకల్పికం 2. నిత్యం అప్రవృత్తి

1. "ఏమ్యాదులు ఇత్తునకు సంధి వైకల్పికముగానగు" (బాల-సంధి-5) ఏమి+ఆదులు = ఏమ్యాదులు. ఏమి, మఱి, కి(షష్ఠి), అది, ఇది, అవి, ఇవి, ఏది. ఏవి, మొదలైనవి. 'ఏమి' పదం మొదలుగా గలది కాబట్టి ఏమ్యాదులు అని అర్థం. ఇది ఆకృతి గణం. ఆకృతి గణం అంటే ఆకారాన్ని బట్టి పోల్చుకోదగిని పదజాలం. ఏమి మొదలగుగా గల పదంలోని హ్రస్వమైన ఇకారానికి అచ్చుపరమైనపుడు సంధికార్యం వికల్పంగా వస్తుంది. ఏమి+అంటివి. = ఇందులో 'ఏమి' ఏమ్యాదులందలిది. 'ఏమి' ఇకారానికి అంటివిలోని 'అ' కారం (అచ్చు) పరంగా ఉంది. కాబట్టి సంధివికల్పంగా వస్తుంది. సంధివచ్చిన రూపం ఏమీ+అంటివి = ఏమంటివి. వికల్పం కాబట్టి సంధి జరగకపోతే యడాగమం వచ్చి ఏమి+య్+అంటివి=ఏమియంటివి అని అవుతుంది. మఱి+ఏమి=మఱేమీ, మరియేమి, ఇందులోని సంధి రూపాలు జనవ్యవహారంలో వున్నాయి. యడాగమ రూపాలు పండిత ప్రయెగాలని మనం గ్రహించాలి. తెలుగు వ్యాకరణాలన్నీ ఇంచుమించు సంస్కృత భాషా , పయనించాయి. అంతేకాక ఈ వ్యాకరణాల పరిధి కూడా చాలా తక్కువ. తెలుగు వ్యాకరణ సంప్రదాయాలిన్ని కావ్య భాషను మాత్రమే , ఆధారంగా చేసుకున్నాయి. వ్యావాహారికి భాషను వ్యాకర్తలు ప్రామాణికంగా తీసుకోలేదు.

2. క్రియాపదంబులందిత్తునకు సంధి వైకల్పికముగానగు (బాల.సం.6) క్రియా సదంలోని హ్రస్వం 'ఇ' కారానికి అచ్చుపరమైనపుడు సంధి వికల్పంగా అవుతుందని సూత్రార్థం. వచ్చిరి +అపుడు. వచ్చిరి అనేది క్రియాపదం ఇందులో చివర 'రి' లోని ఇకారానికి, అప్పుడులోని 'అ'కారం (అచ్చు) పరంగా ఉంది. కాబట్టి పై సూత్రంవల్ల సంధి వికల్పంగా ఉంది. సంధివచ్చిన రూపం వచ్చిరి+అపుడు = వచ్చిరపుడుగా అవుతుంది. వచ్చితిమి + ఇప్పుడు = వచ్చితిమిప్పుడు, వచ్చితిమియిప్పుడు, ఇందులోని రూపాలు సామాన్య జనవ్యవహారంలోలేవు. జనవ్యవహారంలో వచ్చారపుడు, అప్పుడొచ్చారు.

వచ్చామిపుడు, ఇప్పుడే వచ్చాము. అనే రూపాలు చోటు చేసుకున్నాయి. మన వ్యాకర్తలు వ్యావాహారికి భాషను పట్టించుకోలేదు. అంచేత మన వ్యాకరణాల్లో వ్యావాహారికి భాష చోటు చేసుకోలేదు.

### 3. "మధ్యమ పురుష క్రియలందిత్తునకు సంధియగు" (బాల - సంధి - 7 )

నీవు, మీరు, కర్తలుగా వున్నపుడు వచ్చే క్రియాలు మధ్యమ పురుష క్రియలు. ఆలాంటి మధ్యమ పురుష క్రియాల్లో చివరి ఉన్న హ్రస్వ 'ఇ' కారానికి అచ్చు పరమైనపుడు సంధి నిత్యంగా వస్తుంది. ఏలితివి+అపుడు= ఇందులో "ఏలితివి" అనేది మధ్యమ పురుష ఏకవచన క్రియ. దీనిలోని చివర ఉన్నా 'వి' లోని ఇకారానికి అప్పుడులోని ఆకారం (అచ్చు) పరంగా వుంది. కాబట్టి సంధి ఇక్కడ నిత్యం. అందువల్ల ఏలితివపుడు అవుతుంది. ఏలితివి+ఇపుడు, ఏలితివిపుడు. ఏలితిరి+ఇపుడు= ఏలితిరిపుడు ఏలితిరి మద్యమపురుష బహువచన క్రియ. రూపాలు జనవ్యవహారంలో లేవు. ఇపుడే రావు, ఇపుడేలుతున్నావు, ఇ.పుడేలుతున్నారు. అనే రూపాలు సామాన్య జనవ్యవహారంలో వున్నాయి.

4. 'క్త్వార్థంబైన యిత్తునకు సంధిలేదు" (బాల.సంధి. 8) త్యక్త్వా(విడిచి) కృత్వా (చేసి) గత్వా (వెడలి) మొదలైనవి సంస్కృత భాషలో'క్త్వా' ప్రత్యయాంతక్రియలు సంస్కృత భాషలో క్త్వా ప్రత్యయాంతక్రియలు ఎలాంటి అర్థాన్ని ఇస్తాయో ఆలాంటి అర్థాన్ని ఇచ్చే తెలుగు క్రియాలు క్త్వార్థాన్ని (ఇచ్చే తెలుగు క్రియాలు అంటారు) తెలుగు క్రియాక్త్వార్థాలు అవుతాయి. వీటినే భూతకాల అసమాపక క్రియలని అంటారు. క్త్వార్థాన్ని ఇచ్చే తెలుగు క్రియలు యొక్క హ్రస్వ ఇకారానికి అచ్చుపరమైనపుడు సంధిరాదని సూత్రార్థం. వచ్చి+ఇచ్చెను= ఇందులో వచ్చి అనేది క్త్వార్థక క్రియ. ఇందులోని ఇకారానికి 'ఇచ్చెను' అనే పదంలోని 'ఇ' పరంగా ఉంది. ఇపుడు ఈ సూత్రం చేత సంధి రాదు కాబట్టి యడాగమం వచ్చి వచ్చి + య్ + ఇచ్చెను = వచ్చియిచ్చెను అవుతుంది. జనవ్యాహారంలో ఈ రూపం వచ్చిచ్చెను అని అవుతుంది.

### 5. 'ఇ' ప్రత్యయాంతవ్యయంబునకు సంధియుఁ జూపట్టెడి" (ప్రౌఢ-సంధి-2)

ఉదా : అంది+ఇమ్ముం=అందిమ్ముం, వెఱచి+ఇట్లు = వెఱచిట్లు
ఎటెంగి+ఎటెంగి = ఎటెంగెటెంగి, చెప్పి + అంపఁడే = చెప్పంపఁడే

ద్రావిడ భాషల్లో ప్రతీ పదానికి తొలి అచ్చు మీది 'ఉనికి' ఉంటుంది. 'ఊనిక' తో కూడినపుడు అచ్చు "ఊది" పలకబడ్తుంది. కాబట్టి అది ప్రధానమై ఉంటుంది. 'అ' ఉచ్చారణలో తుది అచ్చు మిక్కిలి నీరసమైనదై క్రమంగా జారవిడవ బడ్తుంది అయితే ప్రత్యేకార్థబోధకం కావడం తటస్థించితే అంటే అది లోపించితే ఆపద స్వరూపానికి ఏ మాత్రం భంగం కలిగినా అర్థహానికలుగుతుంది. కాబట్టి ఆ అచ్చు తన స్థానంలో నిలిచే ఉంటుంది. అపుడు ఆ రెండు అచ్చు మధ్య సంధ్యక్షరమ్ 'య్' వచ్చి చేరుతుంది. దానినే యడాగమం అంటారు.

ఇ, ఈ, ఎ, ఏ ల సందర్భంలో తాలవ్యాంతస్థమైన 'య'కారం ఉచ్చారానికి సహకారమైంది కావడం సహజమైకాని మా+ఊరు, నా+ఉంగరం, మొదలైన సందర్భాల్లో 'య' గాగమమే రావడం విచిత్రంగా తోచకపోదు వ్యవహారిక భాషల్లో ఇక్కడ ఓష్ఠ్యాంతస్థమైన 'వ' కారం వస్తుంది. కావ్యభాషలో మాత్రం 'య' కారమే సర్వత్రవిధించటానికి కారణం ఏమిటంటే సామాన్యంగా 'ఉ'కార 'ఓ' కారాన్తశబ్దాలన్నింటిని 'ఉ' వర్ణాంతాలుగా గ్రహిండటం అందువల్లనే తెలుగు భాషలో 'వ' కార ఆగమానికి అవశ్యకం లేకపోయింది.

సంస్కృత 'ఉ'కారాంత శబ్దాలు తత్సమాలైనపుడు తుదిని 'ఉ' వర్ణం గ్రహించడంగా తలచడం చేత ఈ భాషల్లో అచ్చుపరమైనపుడు 'ఉ' వర్ణం పైనున్న 'ఉ'కారం లోపించి, పరస్పర ఏకాదేశ సంధి జరగటానికి అవకాశం ఏర్పడింది. నిత్యంగా వర్తిస్తుంది. 'ఉ'కారం. కారణంగా ఏమంటే ఈ ద్రావిడ భాషలో చాలా (రకాల) వరకు పదాలు హలంతాలు. ఒక కాలంలో

ఉచ్చారణకై ఒక 'ఉ' కారాన్ని గ్రహించి 'ఉ'కారాంతాలైనాయి. ఈ 'ఉ'కారం సంధిలో లోపించినా, నామరూఢికి భంగం కలగదు. ఈ విషయాన్ని మనం చాల జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి.

స్త్రీవాచక తత్సమ సంభోదానాంత శబ్దాల్లో తుది 'అ'కారం సహజంగా శబ్దగతమవడమో, తేదా ప్రత్యేక అర్థాన్ని బోధించడమో జరుగుతుంది. కాబట్టి ఇక్కడ 'అ' కారం లోపించదు. కొన్ని శబ్దాల్లో సంధి వైకల్పికం మేనత్త, మేనయత్త, కాబట్టి ఇక్కడ మేనత్త, (మేని+అ+అత్తా).

అంత,అమ్మ, ఇత్యాది శబ్దాల 'అ' కారానికి సంధి నిత్యం. కారణం ఇవి స్వీమార్థం కొల్పోయి. మొదటి పదంతో కలిసి లింగభేదాన్ని మాత్రమే సూచించే పైభాషలో చిరకాలం కిందటనే ఏర్పాడ్డాయి.

గంగనుకాసె, చేష్టుడిగె, రంగభర్తంచు, ఇత్యాది సందర్భాల్లో తత్సమ అకార సంధిని కవులు చేశారు. ఊనికస్వరం: ఊదా: గంగ+అనుకాసె = గంగనుకాసె.

క్త్వార్థక కారం ప్రత్యేకార్థంలో వచ్చింది కాబట్టి అది లోపిస్తే, అర్థానికి భంగం కలుగుతుంది. కాబట్టి ఇది లోపించదు కావునే క్త్వార్థానికేకారానికి సంధి లేదని సూత్రం. అయితే కొన్ని ప్రయోగాలు సంధికలిగిన ఉదహరణలు కూడ వున్నాయి.

ఉదా: వెఱచిట్లు = వెఱచి+ఇట్లు - పరమందు 'ఇ'కారమే వున్నది కాబట్టి ఇక్కడ అర్థస్ఫురణకు భంగం వాటిల్లలేదు. మధ్యమ పురుష క్రియలకు (వాటిల్ల) సంధి నిత్యంగాను, ఉత్తమ, ప్రథమ పురుషుల 'ఇ'కారానికి వైకల్పికంగాను, వ్యాకరణాల్లో విధించబడింది. నిజానికి మూడు పురుషుల్లోనూ సంధి నిత్యంగానే జరగవలసి ఉంది. కారణం ఏమంటే ఈ పురుషద్యోతకు ప్రత్యయాలు ప్రాచీనకాలంలో హలంతాలై ఉచ్చరణ విషయంలో అజంతాలైనవి. భూతకాలిక 'ఇ' కారం మీద ఇకారాంతాలైన (ఊ,నీ+,మూ) ఈ రూపాలన్నీ ఒక్కరీతిగా ఏర్పడినవై వుండుటచే తుది 'ఇ' కార సంధి విషయంలో మధ్యమ పురుష క్రియకు భేదం ఏర్పడటానికి అవకాశం ఉంది. మూడు పురుషుల్లోను కూడా ఈ క్రియా రూపంలో ఈ 'ఇ'కారం అచ్చుపరమైనపుడు లోపించడమే సహజమైకన్పిస్తుంది. ఇదే విధంగా భాషలో కూడా లోపిస్తునే ఉన్నాయి. అయితే మరికొంత కాలానికి ఈ శబ్దాల తుది 'ఇ' కారాలు ఆ శబ్దాలకు సహజలే అని తలంచడం చేతా, లేక ఛందస్సు సౌకార్యానికి కొందరు కవులు సంధిచే 'య' డాగమం చేసిన రూపాలు వాడడం చేతా 'య' డగమ రూపాలు సహితం భాషలో బయలుదేరాయి.

ఏమ్యాదులు ఇత్తునకు సంధి వైకల్పికం. అని చెప్పబడింది. కాబట్టి ఈ శబ్దాల తుది 'ఇ' కారం సహజమో ఆగంతకమో అనే విషయం విచారించవలసి వుంది. ఇతర ద్రావిడ భాషారూపాలతో పోల్చి పరిశీలింపగా ఈ శబ్దాల్లోని ఇకారాంత శబ్దాల సామ్యంవల్ల ఈ రూపాల్లో కూడ ఇకారం సహజం అనే భ్రాంతిచే 'య' డాగమ రూపాలు భాషలో బయలు దేరి ఏమ్యాదుల ఇత్తునకు సంధి వైకల్పికం అయ్యాయి.

## 2. ఆగమ సంధులు :

తెలుగు వ్యాకర్తలు ఆగమ సంధుల్ని కూడ పేర్కొన్నారు. ఆగమం అంటే వర్ణాధిక్యం. (APPEARNACE OF AN EXTRA PHONEME IN SANDHI) వున్న అక్షరాలు యధాతదంగా వుండగా అదనంగా మరో వర్ణంకానీ. వర్ణసముదాయంకానీ వచ్చి చేరితే దాన్ని 'ఆగమం' అంటారు.

### 1. యడాగమం :

"సంధిలేని చోట స్వరంబుకంటే బరంబయిన స్వరంబునకు యడాగమం బగు' (బాల-సంధి.3)

మా+య్+అమ్మ = మాయమ్మ మా+య్+ఊరు = మాయూరు వ్యవహారంలో
మీ+య్+ఇల్లు + మీయిల్లు 'మావూరు' అని అంటారు.

## 2. నుగాగమం :

1. సమాసంబులనుదంతంబులగు స్త్రీసమంబులకుం బుంపులకుం పురుష సరళంబులు పరంబగునపుడు నుగాగమంబగు (బా-సంధి-25)

   ఉదా: సింగము+కొదమ = సింగపుంగొదమ, సింగపుంగొదమ, సింగపునొదమ.

2. "ఉదంతంబగు తద్ధర్మార్థ విశేషణంబున కచ్చు పరంబగునపుడు నుగాగమంబగు" (బాల-సంధి.33) ఉదా: చేయు+అతడు, చేయు+న్+లతడు, చేయున్ + అతడు. = చేయునతడు, చేసేడు + అతడు, చేసెడునతడు.
3. "షష్ఠి సమాసమునందుకార ఋకారములకచ్చు పరంబగనపుడునుగాగమంబగు (బాల- సంధి. 34) ఉదా: రాజు(యొక్క)+అజ్ఞ = రాజునాజ్ఞ, విధాతృ(యొక్క)+అనతి= విదాతృనానతి.
4. కొన్ని చోట్ల షష్ఠి సమాసంబునందుకారంబున కచ్చు పరంబగునపుడు నుగాగమంబునకు లోపంబునగు (ప్రౌడ-సంధి -10 ) ఉదా: గోకులము+ఇల్లిలు =గోకులమిల్లిలు.
5. ఉదంత స్త్రీ సమంబులకును బుంపులకును నొదంతగుణ వాచకంబులకును దనంబు పరంబగునపుడు నుగాగమంబగు (బాల-సంధి.35)

   ఉదా: సొగసు+తనము= సొగసుందనము, సొగసుదనము, సొగసున్తనము

## 3. టుగాగమం :

1. "కర్మదారయంబులందుత్తున కచ్చు పరంబగునపుడు టుగాగమంబగు" (బాల.సంధి. -28)

   ఉదా: కఱకు + అమ్ము = కరకుటమ్ము, నిగ్గు +అద్దము = నిగ్గుటద్దము.

2. "కర్మదారయంబునందు బేర్వాది శబ్దంబుల కచ్చు పరంబగునపుడు టుగాగమంబు విభాషనగు" ఉదా: పేరు+ఉరము = పేరుటురము, పేరురము, చిగురు + ఆకు = చిగురుటాకు, ప్రధానంగా టుగాగమం కర్మదారయన సమాసంలో వస్తుంది. కర్మదారయణ సమాసం విశేషణ, విశేష్యభావ సంబంధం గల రెండు పదాలు చేసిన సమాసం.
3. కర్మధారయమున ఉత్వేతరమునకు కూడా టుగాగమము కానాంబడియెడి'

   ఉదా: తేనె+ఈగ= తేనె+ట్+ఈగ = తేనేటిగ, దుక్కి + ట్ +ఎద్దు = దుక్కిటెద్దు.

4. షష్ఠిసమాసము నందుతు&తన కచ్చు పరంబగునపుడు టుగాగమము కానంబడియెడి" ఉదా: వేలుపు +ఆవు = వేలుపు+ట+ఆవు = వేలుపుటావు.

   సముద్రపు +ఒడ్డు - సముద్రపు +ట్ + ఒడ్డు = సముద్రపుటొడ్డు.

## 4. రుగాగమం :

1. పేదాది శబ్దంబుల కాలుశబ్దం పరంబగునపుడు కర్మధారయంబునందు రుగాగమంబగు (బాల-సంధి-30) ఉదా: పేద + ఆలు =పేదరాలు, బీద+ ఆలు = బీదరాలు,

2. కర్మధారయంబునాందత్సమంబులకాలు శబ్దముపరంబగునపుడు డత్వంబునకు కుత్వంబును రుగాగమంబగు (బాల-సంధి. 31)

ఉదా: ధీర+ఆలు = ధీరురాలు, గుణవంత+ఆలు = గుణవంతురాలు.

**5. అలిగాగమం :**

'అంద్వాదులకలిగాగమంబు సమాసంబునందగు ' (బాల- సంధి. 44) అందు మున్నగు వానికి సమాసములందు 'అలి' ఆగమం అవుతుంది.

ఉదా: నాయందు + కరుణ - నాయందు + అలి+ కరుణ + నాయందలి కరుణ

ఇందున్ + జనులు = ఇందలిజనులు, ఎందున్ +వారు =ఎందలి వారు.

**6. పుగాగమం :**

"తామర కాకు పరంబగునపుడు పుగాగమంబగు"

ఉదా: తామర+ఆకు = తామర + ప్ + ఆకు. తామరపాకు, 'తామర' శబ్దానికి 'ఆకు' శబ్దం పరంబగునపుడు పుగాగమమవుతుంది. పుక్+ఆగమం = పుగాగమం.

**7. ముగాగమం :**

ధ్వన్యనుకరణ శబ్దములకనుధాతువు పరంబగుచో గొన్నియెడల 'ము' గాగమంబగు" (ప్రౌఢ -సంధి -19) ఉదా: కలకల+అని = కలకలమని, సలసల + అని = సలసలమని

**8. దుగాగమం :**

"యుష్మదస్మదాత్మార్థకం బులకుత్తరపదంబు పరంబగునపుడు దుగాగమంబువిభాషనగు" (బాల-సమాస-19) ఉదా: నీ+కరుణ = నీదుకరుణ, నా+ నెరమి = నాదునెరమి,

తన+రూపు = తనదురూపు.

**3. ఆదేశ సంధులు :**

తెలుగు పదాల్లో సంధి జరిగే టపుడు కొన్ని అక్షరాలు తొలగి దాని స్థానంలో మరి కొన్ని అక్షరాలు చేరుతాయి. దీనిని ఆదేశం (New phoneme Replacing Another) అంటారు. తెలుగు భాషలో కచటతపలకు, గజడదబలు, గసడదవలు ఆదేశమవడం ఉంది.

**1. గసడదవాదేశ సంధి :**

**1. "ప్రదమం మీది పరుషములకు గసడదవలు బహుళంబుగానగు"**

ఉదా: వాడు + కొట్టె = వాడుగొట్టె, అపుడు + చనియె = అపుడుసనియె

నీవు + టక్కరివి = నీవు డక్కరివి, మీరు + తలడు = మీరదలడు.

కళలైన క్రియాపదంబుల మీది సహితం పరుషములకు గసడదవలు వస్తాయి ఉదా: రారు+కదా = రారుకదా, వత్తురు + పోదురు = వత్తురువోదురు. ఈ రూపాల్లో రారు గదా అనేది సామాన్య వ్యవహారం, వత్తురు వోదురు, అనేది పండిత కృతం, దేశిపదాలపైన పరుషాది పదాలు పరమైనపుడు గసడదవాదేశం వస్తుంది. కాని దేశీ పదాలకు సంస్కృత పరుషాది పదాలు పరమైనపుడు గసడదవలు ఆదేశంగా రావు.

**2. "తెనుగు మీది సాంస్కృతిక పరుషములకు గసడదవలు రావు "**

(బాల-సంధి = 14) ఉదా: వాడు +కంసారి = వాడుకంసారి, మీదు +చక్రపాణి = వీడు చక్రపాణి, అయది+ టంకృత = అయదిటంకృతి, అది+తద్యము = అదితధ్యము, ఇది+పధ్యము = ఇది పధ్యము.

**3. ద్వంద్వంబునం పదంపై పరుషములకు గసడదవలుగు (బాల-సంధి -15)**

ఉదా: కూర+కాయ = కూరగాయ, కాలు + సేతులు = కాలుసేతులు, టక్కు + డెక్కు = టక్కుడెక్కులు, తల్లి + తండ్రి = తల్లిదండ్రులు, ఊరు+పల్లె = ఊరువల్లెలు, ఇందులో కూరగాయలు, కాలుసేతులు, తల్లిదండ్రులు అనేవి సామాన్య జనవ్యవహారంలోని రూపాలు టక్కుడెక్కులు, ఉరువల్లెలు అనేవి పండిత వ్యవహారంలోనివి.

**4. "కొన్ని యెడల ద్వంద్వంబునంబదంబు మీది చతపలకు సదవలు గానంబడవు" (ప్రౌడ - సంధి -6)**

ఉదా: అందచందములు.

**5. "కొన్ని యెడల దెనుఁగుమీది సాంస్కృతిక కతపలకు గదవలు గానంబడియెడి" (ప్రౌడ. సంధి - 5 )**

ఉదా: వీరల్ + కోపించి = వీరల్గోపించిన, ఇట్లు+తపంబు = ఇట్లుదపంబు, వేయి + పణములు + వేయివణములు.

**2. సరళాదేశం :**

**"ద్రుతప్రకృతముమీది పరుషములకు సరళములగు" (బాల-సంధి-16)**

ఉదా: పూచెను+కలువలు=పూచెనుగలువలు, తోచెను + చుక్కలు = తోచెనుజుక్కలు, ఇక్కడ పరుషాలకు సరళాదేశం నిత్యంగా వస్తుంది.

**3. పుంప్వాదేశం :**

**"కర్మధారయంబున 'ము' వర్ణంబునకు పుంపులగు" (బాల -సంధి -32)**

ఉదా: సరసము+వచనము = సరసపువచనం, సరసంపువచనం,
విరసము+ మాట = విరసపుమాట, విరసంపుమాట

**4. ద్విరుక్తటకారాదేశం :**

**1. కుఱు, చిఱు, కడు, నడు, నిడు, శబ్దముల ఉడలకచ్చుపరంబగునపుడు ద్విరుక్తటకారంబగు" (బాల -సంధి -12)**

ఉదా: కుఱు + ఉసురు = కుట్టుసురు, చిఱు + ఎలుక = చిట్టెలుక

కడు+ ఎదుట = కట్టెదుట, నడు + ఇల్లు = నట్టిల్లు.

**2. ఆమ్రేడితంబు పరంబగునపుడు కడిదుల తొలి యచ్చుమీది వర్ణంబుకెల్ల అదంతంబగు, ద్విరుక్తటకారంబగు" (బాల-సంధి- 40)**

ఉదా: కడ+కడ= కట్టకడ, ఎదుట + ఎదుట = ఎట్టయెదుట.

### 4. ఇతర సంధులు :

పడ్వాది సంధులు ప్రాతాది సంధులు మొదలైనవి ఈ వర్గీకరణలో వస్తాయి.

భాషా దృష్టితో సంధిని నిశితంగా పరిశీలిస్తే ఎన్నో ప్రత్యేక విశేషాలు కనబడుతున్నాయి. ప్రబంధ యుగానికి ముందు "తెలుగు సాహిత్య చరిత్రలో " నన్నయ యుగం, శివకవియుగం, తిక్కన, యుగం, ఎర్రనయుగం, శ్రీనాధయుగం, మొదలైన ఐదు యుగాలున్నాయి. ఈ ఐదు యుగాల్లోని భాష ఇంచుమించు ఒకే రకంగా వుంది. ప్రబందయుగం వచ్చేసరికి, తెలుగు భాషలో పెను మార్పులు వచ్చాయి అంటే ప్రాచీన నియమాల్ని, నిబంధల్ని కవులు చాలవరకు పాటించలేదు. అంచేతనే సూరి రాయుల యుగాన్ని. అంటే 16వ శతాబ్ధిని 'ఆధునికయుగం' గా పరిగణించాడు. బాలవ్యాకరణంలో ఇలా సూరి, రాయల యుగాన్ని "ఆధునిక యుగమని" అనడానికి చాల కారణాలున్నాయి. 11వ శతాబ్దంలో నన్నయ వైదిక మత ఉద్ధరణ కోసం, నేను మహాభారతం రాస్తున్నాను అని నొక్కివక్కానించాడు. ఆ తర్వాత వచ్చిన కవుల, శివకవులు, శైవ సాహిత్యానికి, ప్రాముఖ్యం ఇచ్చారు. తిక్కన కవి, అయినప్పటికి ప్రముఖ రాజనీతిజ్ఞుడిలామనకు కన్పిస్తాడు. హరిహరనాధతత్త్వం ప్రవేశపెట్టి రెండు మతాలు వారిని ఒక దగ్గర చేర్చి తగవులు లేకుండ సర్దుబాటు చేసిన మహానుభావుడు తిక్కన. ఎర్రన, నన్నయ, తిక్కనల మార్గాన్ని అనుసరించాడు. శ్రీనాధుడు తనముందు కవులు బాటనే పయనించాడు. ఈ 5 వందల సంవత్సారాల "తెలుగు సాహిత్య చరిత్ర" ను విమర్శనాదృష్టితో విశ్లేషించకుంటే, మతసాహిత్యానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చినట్లు కన్పడుతుంది. ఇలాంటి మత సాహిత్యానికి 'బ్రేక్' చేసి , నాయిక నాయకుల ప్రాముఖ్యం ఇచ్చి అనేక ప్రబంధాలు వచ్చాయి. ఈ దృష్టితోనే సూరి ప్రబంధయుగాన్ని "ఆధునిక యుగం" అన్నాడు. ఇది నూటికి నూరుపాళ్ళు నిజం. ప్రబంధయుగాన్ని భాషాపరంగా విమర్శన దృష్తితో నిశితంగా పరిశీలిస్తే ప్రబంధయుగం "ఆధునిక యుగమే".

ప్రబంధ కవులు వ్యాకరణ నియమాల్ని పూర్తిగా అనుసరించలేదు. కొత్త కొత్త వింత, వింత స్వతంత్ర్య పద ప్రయోగాలు చేశారు. రాయులు రాసిన "ఆముమాల్యద" లో క్త్వార్థకే కార సందులు, తత్సమాకార సంధులు, బాగా కనబడుతున్నాయి. కాసె సర్వప్ప చెప్పిన "సిద్దేశ్వర చరిత్ర" లో రకరకాల భాషాపరమైన మార్పులు, విసంధులు, వ్యావహారిక రూపాలు, అన్యదేశ్యపదాలు మాండలిక పదాలు చోటు చేసుకున్నాయి. ఈ ప్రబంధ యుగానికి ముందు తర్వాత కూడా కనబడుతున్నాయి. అరబ్బీ, పార్సీ, తమిళ, కన్నడ పదాలు ఈ ప్రబంధ యుగంలో చోటుచేసుకున్నాయి. వలపల గిలకలతో పాటు, నణలశషలు, తారుమారయ్యే ప్రయోగాలు య, వు, వూ, వొ, వో లతో ప్రారంభమయ్యే పదాలు ప్రబంద యుగంలో కనబడుతున్నాయి. ప్రాచీన వ్యాకరణ సంప్రదాయాల్ని ప్రబంధకవుల చరిత్ర పట్టించుకోలేదు. కారణం, ప్రబంధకవుల్లో ఆధునిక భావ జాలం బాగా చోటు చేసుకోవడమే ఈ భాషాపరిణామం "తెలుగు సాహిత్య చరిత్ర" లో హర్షించదగ్గవిషయం, అహ్వానించదగ్గవిషయం.

చిన్నయసూరి తన "బాలవ్యాకరణంలో" ప్రబంధకవులు ప్రయోగాల్ని, పరమ ప్రామాణికంగా తీసుకోలేదు. తన వ్యాకరణంలో ప్రబంధయుగానికి ముందుకవులు వాడిన ప్రయెగాల్ని ఎక్కువగా ఇచ్చాడు. ఇంకా చెప్పాలంటే కవిత్రయ ప్రయోగాల్ని సూరి

అధికంగా వాడాడు. ఈ కవిత్రయంలో నన్నయ ప్రయోగాల్ని మరి ఎక్కువగా వాడాడు. చిన్నయకు, నన్నయ అంటే అభిమానం. వ్యాకర్తలు "ప్రయోగశరణం వ్యాకరణం" అని అన్నారు. సూరి రాసిన బాలవ్యాకరణాల్ని బాగా విశ్లేషిస్తే మనకు అర్థమయ్యేది ఏమిటంటే, నన్నయ ప్రయోగమే చిన్నయకు శరణ్యం" "బాల వ్యాకరణంలో అక్కడక్కడ తిక్కన ప్రయోగాల్ని అసాధువులు అని కూడ సూరి చెప్పాడు. అసలు "బాల వ్యాకరణం " తెలుగు సాహిత్యం మొత్తానికి అన్వయించడం, ఎనిమిది వందల సంవత్సరాల సంప్రదాయ సాహిత్యానికి మాత్రమే అన్వయిస్తుంది. అది కూడ మొత్తం సాహిత్యానికి కాదు.

చిన్నయ సూరి "బాలవ్యాకరణంలో" "అత్తునకుసంధి బహుళము" (సంధి. 4) అని చెప్పాడు. ఈ సూత్రం కింద వికల్పరూపాలు, సంధి రాని రూపాలను కూడ ఉదా. గా ఇచ్చాడు.

చిన్నయ సూరి, రామయ్య, లక్ష్మమ్మ మొదలైన రూపాల్ని తన బాలవ్యాకరణంలో సాధించలేదు. ఇలాంటి శబ్దాలు తప్పనిసరిగా సంధి జరిగి తీరుతుంది. ఇందులో అనుమానమైనలేదు. నిత్య సంధుల్ని సాధించడానికి బహుజన పల్లి సీతారామాచార్యులు 'ప్రౌఢవ్యాకరణంలో" శ్రేష్టతో వాచకంబులగు నార్యాంచార్షక శబ్దంబులగుచో నన్నయచ్చుకును సంధి నిత్యము" (సంధి-1) అని సూత్రించాడు.

సమాసగతాలైన అమ్మ, అక్క, అన్న మొదలైన శబ్దాల్లో ఒక్కొక్కపుడు. ద్విత్వం పోతుంది. ఇలాంటి శబ్దాలు ప్రబంధకవులు ప్రయోగించారు.

ఉదా: లక్ష్మమ్మ (తెనాలి రామకృష్ణుడు - పాండురంగామహాత్మ్యం -1-24)
గౌరమా (తెనాలి రామకృష్ణుడు - ఉద్భాటారాధ్య చరిత్రం -3-327)
కృష్ణమా (చరికొండ ధర్మాన్న -చిత్రభారతం -పీఠిక -19 )

చిన్నయ సూరి "బాలవ్యాకరణం" (అత్తునకు సంధి బహుళంబుగానగు) ప్రకారం. తామర+ఆకు అని రాయాలి. అయితే 16వ శతాబ్ది ప్రబంధ సాహిత్యంలో కొన్ని చోట్లు "తామరపాకు" అని 'పు' ఆగమంగా కనబడుతుంది.

ఉదా: తామరపాకు = తామర + ఆకు
(కృష్ణదేవరాయాలు - ఆయుక్తమాల్యద -3-82)
తామరపాకుల మీద
(పొన్నగంటి తెలగనార్యుడు - యయాతిచరిత్రం -4-9)
తామరపాకులన్ ( అద్దంకి గంగాదరకవి -తపతీ సంవారోపాఖ్యనం -3-10)

తామరకు, ఆకుపరమైనపుడు సంధిరాక యడగామం వచ్చిన రూపాలు కూడ ప్రబంధ సాహిత్యంలో కనబడుతున్నాయి.
ఉదా: తామరయాకుః (తెనాలిఅన్నయ = సుదక్షిణాపరిణమా -3-164)

తెనాలి రామకృష్ణుడు రాసిన "పాండురంగా మహాత్మ్యంలో" "చింతయాకు" అనే ప్రయోగం ఉంది.
చింతయాకంతైనన్ ః (తెనాలి రామకృష్ణుడు - పాండురంగమహాత్మ్యం -4-225)

బాలవ్యాకరణంలో సంధిపరిచ్ఛేదం నాలుగో సూత్రంలో వృత్తి వాక్యంలో "బహుళ గ్రహణం చేత స్త్రీవాచక తత్సమ సంబోధానాంతములకు సంధిలేదు". అని సూరి చెప్పాడు. అయితే 16వ శతాబ్దంలో ప్రబంధాల్లో స్త్రీవాచక, తత్సమ, సంబోధానాంతాలకు సంధి కన్పిస్తుంది.

**1. స్త్రీవాచకాలపై సంధి రావడం :**

ఉదా: కొమ్మ+అంచున్ = కొమ్మంచున్
(రామరాజ భూషణుడు - వసు చరిత్ర -6-65)

చింతలమ్మ + అను = చింతమ్మను.

(తాళ్ళపాక చినతిరువేంగళానాధుడు - అన్నమాచార్యచరిత్ర -పు-6)

భద్రాంగన + అపుడు = భద్రాంగనపుడు (పచ్చకప్పురపుతిరువేగాళరాజు - చొక్కనాథ చరిత్ర -224)

**2. తత్సమ పదాలపై సంధిరావడం :**

ఉదా: చేష్ట+ఉడిగె = చేష్టుడిగె (కృష్ణదేవరాయులు - ఆముక్తమాల్యద -4-118)
చండవర్మ+అనువాడు = చండవర్మనువాడు (కొసెనర్వప్ప-సిద్దేశ్వర చరిత్ర -29)
దూత + అని = దూతని (సంకుసాల నృషింహకవి - కవికర్ణరసాయనం -2-128)

**3. సంబోధనాంతాలపై సంధి రావడం :**

ఉదా: చలమేలమ్మ+ అని = చలమేలమ్మని (రామరాజభూషనుడు - వసుచరిత్ర - 6-80)
అయ్యమ్మంచు (తెనాలి రామకృష్ణుడు - ఘటికాచలమహాత్మ్యం -2.24)
పాతుకులారని (శ్రీకృష్ణదేవరాయులు - ఆముక్తమాల్యద -7-13)

చిన్నయసూరి "బాలవ్యాకరణం" లో ఇకార సందులు గూర్చి చెప్తూ "క్వార్థంబైన యిత్తునకు సంధిలేదు" (సంధి-8) అని చెప్పాడు. అయితే ప్రబంధ కవులు సంధి నియమాల్ని పాటించలేదు. ప్రబంధ సాహిత్యంలో క్వార్థక 'ఇ'కారంపై సంధి చేయడం రెండు విధాలుగా కనబడుతుంది.

1. -'ఇ కారంపై 'ఇ-కారం వచ్చిన చోట్ల సంధి చేయడం ఒక విధానం

2.-'ఇ -కారంపై ఇతర అచ్చులు చేరేటప్పుడు సంధి చేయడం రెండో విధానం. రెండు ఇకార సంధుల్లో మొదటి విధానాన్ని కొంతమంది పండితులు ఆమోదించారు.

'ఇ- ప్రత్యయాంత వ్యయంబునకు సంధిజూపట్టెడి" (సంధి -2) అని బహుజన పల్లివారి "ప్రౌడవ్యాకరణంలో చెప్పాడు. ఉదా: గా అందిమ్మను, వెఱచిట్లంబుది, చెట్టువట్టిపుడు, మొదలైన ప్రయోగాలు ఇచ్చాడు.

ప్రబంధ సాహిత్యంలో పైన చెప్పిన రెండు రకాల సంధులు కన్పిస్తాయి.

**1.'ఇ'కారానికి 'ఇ'కారం పరమైనపుడు సంధి వచ్చేరూపాలు.**

ఉదా: కదలి+ఇటు = కదిలిటు (పచ్చికప్పురపు నృసింహకవి-చొక్కనాథ చరిత్ర -113)
ఎగసి +ఇలు = ఎగసిల (సంకుసాల నృసింహకవి - కవికర్ణరసాయనం -2-81)
సేవించీశ్వర (తెనాలి రామకృష్ణుడు - ఉద్భాటారాధ్య చరిత్ర 3-315)

## 2. క్త్వార్థకేకారానికి ఇతర అచ్చులు పరమైనపుడు సంధి జరిగే రూపాలు.

ఉదా: మండి + ఆడగ = మండాడగ (పొన్నగంటి తెలగన - యయాతి చరిత్ర 3-16)
చెప్పి+అంప = చెప్పంపం (తరిగొండ ధర్మన్నా - చిత్ర భారతం 6-79)
దూరి+ అటు బోవ = దూరటుబోవ (కాసెసర్వప్ప - సద్దేశ్వర చరిత్ర -57)
కూడి + ఆడు = కూడాడు ( తెనాలి రామకృష్ణుడు - పాండురంగమహాత్యం -2-95)

బాలవ్యాకరణంలో 'కుఱు' చిఱు, కడు, నడు, నిడు, శబ్దములు 'అడల' కచ్చు పరంబుగునపుడు ద్విర్తుటకారంబగు" అని చెప్పాడు. సూరి, దీనని ఉదాహరణంగా

చిఱు + ఎలుక = చిట్టెలుక అని విభజించాడు. బహుజన పల్లి సీతారామా చార్యులు "ప్రౌడవ్యాకరణం" లో ఈ సూత్రాన్ని సవరిస్తు "చిట్టడవిజిట్టి" (సంధి-4) అని సూత్రం చెప్పాడు. ప్రౌడ వ్యాకర్త "చిఱు" శబ్దం కాదు "చిట్టి" శబ్దమే అని చూపించాడు. అంతేకాక వీటికి సంధినిత్యం అని కూడా చెప్పాడు.

16వ శతాబ్దంలో ప్రబందాల్లో చిట్టుములు, చిట్టుట, చిట్టుట, లాంటి పదాలు కన్పిస్తాయి.

ఉదా: చిట్టంటు (పింగళి సూరన -కళాపుర్ణోదయం -7-155)
చిట్టముదంబు (ధూర్జటి-శ్రీకాళాహస్త్రీమహాత్మ్యం -3-27)
చిట్టుములు (అల్లసానిపెద్దన -మనుచరిత్ర -3-120)

'చిట్టి' శబ్దానికి హల్లుపరమైతే ద్విత్వానికి లోపం కన్పిస్తుంది. ద్విత్వం లోపించిన రూపాలే ఎక్కువగా కనబడుతున్నాయి.

### 1. ద్విత్వ సహిత రూపాలు :

ఉదా: చిట్టి బొట్టు ధరించి (తెనాలి రాముడు -పాండురంగమహాత్మ్యం -3-74)

### 2. ద్విత్వ రహిత రూపాలు :

ఉదా: చిటిపోటి (తెనాలి అన్నయ -సుదక్షిణ పరిణయం -3-19)
చిటిబొట్టు (మాదయగారి మల్లన -రాజశేఖర చరిత్ర -2.144)
చిటితాళములు (శ్రీకృష్ణదేవరాయలు -ఆముక్తమాల్యద -6-6)

చిన్నయ సూరి "ప్రథమ మీది పరుషములకు గసడదవలు బహుళముగా నగు" (సంధి-13) అని చెప్పాడు ప్రబంధ సాహిత్యంలో అక్కడక్కడ గసడదవలు మారుగా ప్రథమం మీది సరళాదేశం రావడం ఉంది.

ఉదా: ప్రజల్ + పొగడ = ప్రజల్బొగడ (కందుకూరి రుద్ర కవి - నిరంకుశోపాఖ్యానం -4.48)
పున్తుతుల్ జేసి (పచ్చకప్పరపుతిరువేగళరాజు-చొక్కనాధచరిత్ర -287)

బహుజనపల్లివారి ప్రౌడవ్యాకరణ ప్రకారం కొన్ని చోట్ల ద్వంద్వ సమాసంలో "పదం మీది చతపలకు, సదవలురావు" కొన్ని యెడల ద్వంబునం బదం మీది చతపలకు సదవలు గానంబడవు" -(ప్రౌడ -సంధి. 6)

ఉదా: దవ్వు చేరువల (అల్లసాని పెద్దన -మన చరిత్ర -4-115)
రాకపోకలు (తెనాలి రామలింగడు-పాండురంగ మహాత్మ్యత -3.40)
ఊరుపల్లె (ధూర్జటి-శ్రీకాళహస్తీమహత్మ్యం -4-66)

కందుకూరి రుద్రకవిరాసిన "నిరంకుశోపాఖ్యనం" లో ద్వంద్వ సమాసంలో పదం మీది 'స'కారానికి మారుగా సరళాదేశం కన్పిస్తుంది ఉదా: అక్కజెల్లెండ్రు (2-28)

చిన్నయసూరి "కర్మధారయంబులందుత్తునకు కచ్చుపరంబగునపుడు టుగాగమంబగు" (సంధి -28) అని చెప్పాడు. 16వ శతాబ్ది ప్రబంధాల్లో 'టు' గాగమం రాని రూపాలు కూడ కన్పిస్తున్నాయి.

ఉదా: సమీప పూరనె (శ్రీకృష్ణదేవరాయులు-ఆముక్తమాల్యద -6-82)
పట్ట పేనుగు (పిగళిసూరన - కళాపూర్ణోదయం -8-31)
పట్ట పేనుంగు (ముక్కు తిమ్మన -పారిజాతపాహరణం 3-38)
గారవల్లుని (మాదయగారి మల్లన -రాజశేఖర చరిత్ర 3-168)

బాల వ్యాకర్త కర్మ ధారయంబులందు 'ము' వర్ణకంబునకు బుంపులగు" అని చెప్పాడు. ప్రబంధ సాహిత్యంలో కర్మధారయంలో 'ము' వర్ణానికి 'పుంపు' లురాని రూపాలున్నాయి.

ఉదా: పట్టపేనుంగు (తెనాలి (రామకృష్ణుడు) అన్నయ - సుదక్షిణ పరిణయం -5 -110)
మదమేనుగు (కాసెసర్వప్ప-సిద్దేశ్వరచరిత్ర-34)

ఇక్కడ 'పు' ఆగమమూ 'టు' ఆగమమూ రెండు రాలేదూ. ప్రబంధకవులు స్వేచ్ఛగా పదాల్ని ప్రయోగించారని అనడానికి ఇది ప్రబంధల నిదర్శనం. సూరి తను "షష్ఠి సమాసంబునందుకారబుకారంబుల కచ్చు పరంబగునపుడు నుగాగమంబగను (సంధి-34) అని చెప్పాడు. అయితే ప్రబంధసాహిత్యంలోను 'ను' గాగమం రాని రూపాలు కూడ కన్పిస్తాయి.

బహుజనపల్లివారు 'ప్రౌఢవ్యాకరణంలో' 'ను-గాగమానికి లోపం కలుగుతుందని చెప్పి, కళాపూర్ణోదయం, పాండురంగమహత్మ్యం, నుండి మాత్రమే ఉదా. లు ఇచ్చారు. ఇతర ప్రబంధాల్లో కూడా ఇలాంటి రూపాలు కన్పిస్తున్నాయి.

ఉదా: రాజండన్ (పొన్నగంటి తెలగన- యయాతి చరిత్ర . 2-27)
గట్టురాజల్లుడు (అయ్యలరాజరామభద్రుడు-రామాభ్యుదయం-పీఠిక-43)
సోమదేవరాజవులు (కాసెసర్వప్ప - సిద్దేశ్వర చరిత్ర -31)

'బాలవ్యాకరణ' కర్త "ఉదంతమగు తద్దర్మార్థ విశేషణంబున కచ్చు పరంబగునపుడు నుగాగమంబగు" (సంధి-33) అని అన్నాడు. ఉదంత తద్దర్మార్థ విశేషణానికి అచ్చుపరమైతే 'ను-గాగమం' రాని రూపాలు కూడ ఉన్నాయి.

ఉదా: నిగుడంబుజము (తెనాలి రామలింగడు- ఘటికాచలమహాత్మ్యం -2-69)
చిదమృతం (ధూర్జటి- శ్రీకాళాహస్తీ మహాత్మ్య-2-135)

'ఉదంత తద్దర్మార్థ విశేషణంబు అచ్చు పరమైనపుడు కాక, హల్లు పరమైనపుడు కూడా 'ను'-గాగమం కన్పిస్తుంది. ప్రబంధ సాహిత్యంలో.

ఉదా: ఊరుంగాయలున్ (శ్రీకృష్ణదేవరాయలు- ఆముక్తమాల్యద-1-82)
మించుంబ్రాయవు (అల్లసానిపెద్దన-మనుచరిత్ర -6-77)
అమరుందుమ్మచాలు ( రామరాజభూషుడు -వసుచరిత్ర-2-72)
పోలుందెలనాకున్ (తెనాలి రామలింగడు - పాండురంగమహాత్మ్యం -1-26)

చిన్నయసూరి బాలవ్యాకరణ సూత్రాన్ని లక్షణాల్ని చూపే సందర్భాల్లో ప్రయోగాలను ప్రమాణాలుగా చూపించాడు. అయితే ఉదా. లు ఏ ప్రబంధాల్లో ఉన్నయో, ఎక్కడున్నయో, కవి ఎవరో, సూరి ఇవ్వలేదు. ఉదా.లు ఇవ్వడం వరకు మాత్రమే దృష్టిపెట్టుకున్నాడు కాని. ఏ ప్రబందాల్లో వున్నాయో చెప్పలేదు. అందువల్ల 'బాలవ్యాకరణం'లోని ప్రయోగాలు ఏ గ్రంధం ఆధారంగా ఇచ్చాడో చెప్పడం చాల కష్టం.

ఉదా: గతానుగతికోలోకో (పెంగళి సూరన - కళాపూర్ణోదయం -7-110)
దుర్బలస్య బలం రాజాయనవినే (పెద్దన -మను చరిత్ర -4-74)
పేరురము (తరిగొండ ధర్మన్న - చిత్ర భారతం. 4- 56 )
పేరురంబున (తెనాలి రామకృష్ణుడు - ఉద్భటరద్య చరి(. 2- 121)
ఇఱ్ఱింకులింక (శ్రీకృష్ణదేవరాయలు - ఆముక్తమాల్యద -4-43)
తుత్తుమురాడివచ్చు (మల్లన-రాజశేఖర చరిత్ర 2-39)
తుత్తుమురుగ (ధూర్జటి-శ్రీకాళాహస్తీశ్వర మహాత్మ్యం 2-130)

పై భాషా విశేషాల్ని బాగా పరిశీలిస్తే ప్రబందకవులు వ్యాకరణ నియమాల్ని. సడలించిన స్వేచ్ఛగా, స్వతంత్ర్యంగా అనేక కొత్త ప్రయోగాలు ప్రవేశపెట్టారని చెప్పక తప్పదు. భాషకు మార్పు అనేది సహజలక్షణం. ప్రపంచంలో మార్పుకాని భాషంటూ ఏది లేదు. తెలుగు సాహిత్యంలో కాలాను గుణంగా భాషా పరిణమం చోటు చేసుకుంది. ఈ పరిణామం "ప్రబందసాహిత్యం" లో మరి ఎక్కువ కన్పిస్తుంది. పండితలోకం, వ్యాకర్తలు, ఈ విషయాన్ని గమనించాలి.

**ఆధునిక యుగంలో సంధి :**

చిన్నయాసూరి చెప్పిన సంధినియమాలకు భిన్నమైన రూపాలు ఆధునిక కావ్యాల్లో కూడ బాగా కన్పిస్తున్నాయి.
ఉదా: చోక్కనమిండ్లు- కట్టావరదరాజు రామయణం

పనసాకు పందిరి
వెండుంగరం
తనిచ్చ హంసవింశతి
దానిల్ల

అనవలసంటి, గారెరుగవ,-విజయవిలాసం, అనర్ఘరాఘవం

ఈ క్రింది పదాల్లో జరిగిన పదమద్య సంధి విశేషంగా కన్పిస్తుంది.
రెన్నాళ్ళుతిరుమ
బంట్రోతు కట్టావరదరాజురామాయణం, తెప్పరిల్లి-ఉత్తర రామయణం

ఆధునిక తెలుగులో సంధికార్యాలు జరిగేటప్పుడు స్వరలోపము, దాని ఫలితంగా దగ్గరగి వచ్చిన వ్యంజనాల్లో సమీకరణాది మార్పులు జరుగుతాయి.

సర్వాదాది ప్రత్యయం పరమైనపుడు సంధికి వికల్పతలేదు.
ఉదా: మూర+ఎడు = మూరెడు
వచ్చింది+అ = వచ్చిందా

దగ్గరగా వచ్చిన రెండు అచ్చుల్లో పూర్వాచ్చులు లోపిస్తుంది.

ఉదా: అమశ+ఎదురు = అమశెదురు

వారు +ఉన్నారు = వారున్నారు.

దీర్ఘస్వర్భాతరూపాలు తాలవ్యాచ్చులు పరమైతే 'య' ఆగమం ఒష్ఠ్యాచ్చులు పరమైతే 'వ' ఆగమం వస్తాయి.

ఉదా: మాయిల్లు = మా+ఇల్లు, మా+ఊరు = మావూరు.

పుర్వవ్యంజనం మూర్తన్యమై పరవ్యంజనం దంతమూలీయమైనపుడు మద్యస్వరంలోపిస్తుంది.

ఉదా: మూట+లో = మూట్లో, వాడి+ని = వాణ్ని,

రెండు సమవ్యంజనాలు మద్య సమీకరణం జరుగుతుంది.

ఉదా:చేప+పిల్ల = చేప్పిల్లు, పిరికిగ్గుండే = పిరికి+గుండె.

నలలు మూర్థన్య వర్ణ సంయోగంలో మూర్థన్యవర్ణాలుగా మారుతాయి.

ఉదా: వేడి+నీళ్ళు = వేన్నీళ్లు

పూర్వవ్యంజనం 'ల- 'న' ల్లో ఒకటైన పరవ్యంజన దంత్యం దంతమూలీయ, తాలవ్యమూర్థన్య వర్ణాల్లో ఒకటైనపుడు మద్యస్వరం

ఉదా : కాలి+తో = కాల్తో, నూనె+తో = నూన్తో

తల+నూనె = తల్నూనె, మన + లో = మన్లో

ద్వికర్తువంజనంతో ఇంకో వ్యంజనం ముందు అద్విరుక్తమౌతుంది. బహువచనాది ప్రక్రియల్లో స్వరలోపం వల్ల ఈ రకంగా ఏర్పడటం జరుగుతుంది. ఉదా: చెట్+లు = చెట్లు

ఆధునిక, ప్రామాణికాంధ్ర వ్యాకరణంలో వజ్ఝల మేకటేశ్వర్లుగారు "వ్యావహారిక భాషావ్యాకరణం"లో వడ్లమూడి గోపాలకృష్ణయ్యగారు "తెలుగు వాక్యం" లో ఆచార్య చేకూరి రామారావు ఆధునిక యుగంలో సంధి జరిగే అనేక తీరుల్ని గూర్చి విపులంగా వివరంగా విశ్లేషణాత్మకంగా తెలియాజేసారు.

## 3. ద్రావిడ భాషల్లో సంధి :

ద్రావిడ భాషల్లో పరరూప సంధివుంది. అర్య భాషల్లో సవర్ణదీర్ఘ, గుణ, వృద్ధి, యణదేశ మొదలైన సంధులున్నాయి. ఈ సంధులు ద్రావిడ భాషల్లో లేవు. 'య' డాగమ సంధి ద్రావిడ భాషలో ఉంది. 'య' డాగమసంధి ఆర్యభాషల్లోలేదు. ద్రావిడ భాషల్లో సంధి జరిగేటప్పుడు 'య' కార 'వ' కారలు ఆగమాలుగా వస్తాయన్నీ విషయం మనం గుర్తుంచుకోవాలి. విసంధి ద్రావిడ భాషల లక్షణం కాదు.

## ద్రావిడ భాషల్లో సంధి సాధరణంగా పరరూప సంధి

తెలుగు : ఉదా: వాడు+ఎక్కడ = వాడెక్కడ

తమిళం : ఉదా: ఆమ్బు+అదు = అమ్బదు, ఆదు + ఎన్న = ఆదెన్న

వాగ+ఎన = వాగెన

కన్నడం: ఉదా: మాతు+అమ్ = మాతమ్, మాతిన+ఒళ్ = మాతినోళ్

క్రమదె+ఆము = క్రమదాయు - ద్రావిడాది భాషల్లో రెండు అచ్చుల మధ్య జరిగే సంధి ఇది. సంస్కృత భాషల్లో స్వర, హల్సంధులు రెండూ వున్నాయి.

**1 స్వరసంధులు :**

సవర్ణదీర్ఘసంధి : ఉదా: కవి+ఇంద్రుడు = కవీంద్రుడు
గుణసంధి : ఉదా: చంద్ర +ఉదయం = చంద్రోదయం
వృద్ధి సంధి : ఉదా: ఏక + ఏక = ఏకైక
యణదేశసంధి : ఉదా: అతి+ ఆశ్చర్య = అత్యాశ్చర్యం
అయవాయవాదేశసంది : ఉదా: నై+అకః = నాయకః

**2 హల్సంధులు :**

అనునాసికం సంధి : ఉదా: వాక్ + మయ = వాఙ్మయ
వర్గసంధి : ఉదా: తపః + సాధనం = తపస్సాధనం.
శ్చుత్వసంధి : ఉదా: సత్ + చరిత్ర = సచ్చరిత్ర
జశ్త్వసంధి : వాక్ + అదిపతి = వాగదిపతి.

సంస్కృత భాషలో వున్న సవర్ణదీర్ఘ గుణ, వృద్ధి, యణాదేశ మొదలైన సంధులు ద్రావిడ భాషల్లో లేవు. అయితే సంస్కృత భాషనుంచి అనేక పదాలు తెలుగు, కన్నడ మళయాళ భాషల్లో ప్రవేశించాయి. ఇలా సంస్కృత పదజాలం ద్రావిడ భాషల్లో రావడానికి అనేక కారణాలున్నాయి. ద్రావిడ భాషల్లో సంస్కృత భాషల్లో సంస్కృత భాషల కలయికతో సంస్కృత భాషలోని సంధి విధానామే ఈ భాషల్లో కూడ చోటు చేసుకుంది. సంస్కృత భాషలోని సంధుల్ని ఈ భాషల్లో కూడ చెప్పుకొవలసిన అవసరం తప్పనిసరిగా ఏర్పడింది. అయితే తమిళ భాషలో పైన చెప్పన సవర్ణదీర్ఘసంధి, గుణ, వృద్ధి, యణాదేశాది సంధులు లేవు. ద్రావిడ భాషల్లో ప్రధాన భాషలైన తెలుగు, కన్నడం, మళయాళం, భాషల్లో సంస్కృత సంధులు ఉండాడానికి కారణం ఆయా భాషల వ్యాకర్తలు తమ తమ వ్యాకరణాలని, సంస్కృత వ్యాకరణ నియమాల్ని, పద్దతాల్ని, సూత్రాల్ని తు.చ. తప్పకుండా అనుసరించారు. ఆచారించారు. అయితే తమిళ భాషలో సంస్కృత భాషలు సంధులు లేకపోవడానికి కారణం ఉంది. తమిళ భాషలో మొట్టమొదటి వ్యాకరణం "తొల్కాప్పియం" ఈ వ్యాకరణానికి మూలం"ఇంద్రావ్యాకరణం" ఈ వ్యాకరణంలో తమిళవ్యాకర్తలు సంస్కృత వ్యాకర్తాల్ని అనుసరించలేదు. వ్యాకరణ విషయంలోనే కాక ప్రతీ విషయంలో కూడ ఇతర ద్రావిడ భాషల వారికంటే తమిళులు స్వంతంగా అలోచిస్తారనే దానికి ఇది ప్రబల ఉదాహరణ.

దక్షిణ భాషలైన ద్రావిడ భాషలన్నింటికి వున్నా వ్యాకరణాల్లో చాల ప్రాచీన మైంది (తెలుగు) తమిళభాషలోని 'తొల్కాప్పియం' ఈ వ్యాకరణాన్ని రాసినవాడు 'తొల్కాప్పియనార్'. ఇతరని కాల నిర్ణయంలో భాషావేత్తల్లో భిన్నాభిప్రాయాలు చోటు చేసుకున్నాయి. తెలుగు భాషల్లో మొట్ట మొదటి వ్యాకరణం "ఆంధ్రశబ్ద చింతామణి" ఈ వ్యాకరణ కర్త విషయంలో కూడా భాషా వేత్తలు - అభిప్రాయ భేదాలు చోటు చేసుకున్నాయి. కన్నడ భాషలో మొదటి వ్యాకరణం నాగవర్మరాసిన "కర్ణాటక భూషణం" "మళయాళం" లీలాతిలకం" తెలుగు, మళయాళ, కన్నడ భాషల్లో , వచ్చిన మొదటి వ్యాకరణాలు సంస్కృత వైయాకరణులు పద్ధతుల్లో జరిగింది. "తొల్కాప్పియం" లో సంస్కృత భాషా ప్రభావం లేదు. పాణిని ప్రభావం అంతకన్నా లేదు తమిళం ప్రత్యేకత ఇది.

తొల్కాప్పియంలో 1600 సూత్రాలు మూడు అధికారాల్లో వచ్చాయి. 1- ఎళుత్తీదాకారం(వర్ణాదిక్యం) 2. చొల్లదికారం (పదాధికారం) 3. పోరుళదికారం(అర్థాధికారం) ఎళుత్తధికారములో 480 సూత్రాలు తొమ్మిది విభాగాల్లో వున్నాయి. మొదటి రెండు విభాగాల్లో తమిళ ధ్వనులు, వాటి ఉచ్చారణ విధానం పదంలో వివిధ స్థానాల్లో ధ్వనులు ఉండటం లోని నియమాలు వున్నాయి. చివరి ఆరు భాగాలు సంధి గూర్చి వర్ణించ బడింది. చోల్లధికారంలో 460 సూత్రాలు తొమ్మిది విభాగాల్లో ఉన్నాయి. వాటిని మొదటి నాలిగింటిలో వాక్యనిర్మాణం, చివర అయిదింటిలో పదనిర్మాణం చోటు చేసుకున్నాయి. 'పోరులధికారం' అలంకారశాస్త్రం, ఛందస్సు, మొదలైన వాటికి సంబంధించింది భాషావేత్తలు "తొల్కాప్పియం". లో పద నిర్మాణం కన్నా వాక్యా నిర్మాణానికి ఎక్కవ ప్రాధాన్యం ఇవ్వబడిందని అభిప్రాయపడ్డారు.

తెలుగు భాషలో 'అ- కారానికి అచ్చు పరమైనపుడు సంధి జరగనిచో 'య'డాగమం వస్తుంది.

తెలుగు : 1. సంధి జరిగేటప్పుడు వచ్చే రూపాలు.

ఉదా: రాముడు+ అతడు = రాముడతడు

మనము+ ఉంటివి = మనముంటివి

## 2. సంధి జరిగనపుడు వచ్చే రూపాలు

ఉదా: మా + అమ్మ = మా +య్ + అమ్మ = మాయమ్మ

మీ+ఇల్లు = మీ + య్+ఇల్లు = మీ యిల్లు

మీ+ఊరు = మీ +య్+ఊరు = మీయూరు.

తెలుగు భాషల్లో స్వర సంధులు, హల్సందులు, సమాస సంధులు మొదలైనవి అనేకం చోటు చేసుకున్నాయి.

## 1. స్వర సంధులు :

తెలుగు భాషలో పదాలన్నీ చాలా వరకు అజంతాలు, కాబట్టి స్వరసంధికే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వబడింది.

ఉదా : మేన+అత్త = మేనత్త, మేనయత్త

మఱి+ఏమి = మరిఏమి, మఱియేమి

## 2. హల్సంధులు :

ఉదా: వాడు + కొట్టె = వాడుగొట్టె

పూసెను+కలువలు = పుసెన్గలువలు

పూచెంగలువలు ద్రుతసంధి

పూచెఁగలువలు

## 3. సమాస సంధులు :

ఉదా: తేనె+ఈగ = తేనెటీగ (ట్ = ఆగమం వియ్యము + ఆలు = వియ్యపురాలు (పు. ఆదేశం, రుక్. ఆగమం)

తెలుగు భాషలోని ఇతర ద్రావిడ భాషల్లోను వి సంధి రూపాలుండవు.

తెలుగు భాషలో వలె తమిళ, కన్నడ, భాషల్లో 'అ-కారానికి అచ్చు పరమైనపుడు సంధి జరగనిచో 'య'డాగమమేకాక 'వ' ఆగమంగా కూడా వస్తుంది. తమిళం, కన్నడం, భాషల్లో 'వ' ఆగమం రావడం ప్రత్యేకం.

తమిళం : 1. సంధి జరిగేటపుడు వచ్చేరూపాలు

ఉదా: అదు+ఎన్న = అదెన్న

అమ్బు+అదు = అమ్బుదు

**2. సంధి జరగనపుడు వచ్చే రూపాలు :**

ఉదా: కరి+యన్ = కరియన్

చే+ఆగమ్ = చేయగమ్

అ+యాళ్ = అవ్యాళ్

అ+ఆడై = అవ్వాడై

అ+ఇలై = అవ్ఇలై

మక+ఇన్+కై = మకవ్ఇన్ కై

చే+ఎటి = చేవెటి

పలా+ఇన్ = పలావిన్

కన్నడం : 1. సంధిజరిగేటప్పుడు వచ్చే రూపాలు

ఉదా: మాతు + అమ్ = మాతమ్

క్రమదె + అము = క్రముదాము

2. సంధి జరగనపుడు వచ్చే రూపాలు

ఉదా: కవి+అర్ = కవియార్

మర+ఇల్లు = మరవిల్లు

ఆ+వద్ద = అయిద్ద

ద్రావిడ భాషల్లో సంధి లేని చోట య,వ లు ప్రకృతి భావ నివార్థమైవస్తాయి. ద్రావిడ భాషల్లో అచ్చుల్లో పరస్పర ఆకర్షణ లేదా, సమస్వరత ఎక్కువగా కన్పిస్తుంది.

ఉదా: హరి+కి = హరికి

ములికి + లు = ములుకులు

**మళయాళం :**

మళయాళ భాషలో అత్వానికీ ఇత్వానికీ రెండింటికీ 'వ' కారం వస్తుంది. దానికి ద్విత్వం. వైకల్పికం, సంధిలేని చోట 'ఉ' త్వానికి పరమందు 'ర' కారం మిగిలిన చోట్ల 'య' కారం వస్తుంది.

1. -'య' కార రూపాలు ఉదా: ఆ+ఎడె = ఆయెడె

సతి+ ఇవళ్ = సతియివళ్

2. -'వ' కారరూపాలు ఉదా: ఆ + ఉదకం = ఆవుదకం

కుడు+ఉదు = కుడువుదు

పూ+ఇల్లదు = పూవిల్లద

పితృ+ఇవం = పితృవివం.

ద్రావిడ భాషల్లో పూర్వ పదాంత్యస్వరం పరపదాది స్వరానికి సన్నిహితమై వుండగా, నామారూఢికి హానికాని అర్థానికి భంగం గాని కలగకుండా వుండే పూర్వస్వరం లోపించి, పరస్వరం ఏకాదేశం అవుతుంది. అంటే పరస్పర పూర్వ హల్లుతో కలియడమో, లేదా రెండు స్వరాల మధ్య ఉచ్చారణ సౌలభ్యం కోసం ఒక అక్షరం, ఆగమం కావడం జరుగుతుంది. ఇలా ప్రధానంగా సంధి కార్యం ద్రావిడ భాషల్లో కన్పిస్తుంది.

పూర్వస్వరం లోపించి వెనుకటి హల్లుముందు స్వరంతో కలసినా కొత్త హల్లు మరల వచ్చి అది ముందు స్వరంతో చేరినా ఒక హల్లు తర్వాతా అచ్చుతో కలవడమే ఇక్కడ సంధి కార్యం.

వర్ణ సమీకరణాది సంధికార్యాలు మరికొన్నివున్నపుడు ఈ సందర్భంలో సంస్కృత భాషలోని సంధికీ తెలుగు భాషలోని సంధీకి గల భేదాన్ని గూర్చి మళ్ళీమళ్ళీ ఇక్కడ తెలుసుకోవడం మంచిది. సంస్కృతంలోని ఏకాదేశ సంధి (అయితే) అంటే పూర్వ పరస్వరాలు రెండు లోపించి వానికి బదులుగా ఆ రెండు కంటే భిన్నమైన ఏకాక్షరం రావడం.

**"అవర్ణాదచి పరేపూర్వపరయో రేకోగుణః ఆదేశః స్యాత్ "**

ఉదా: గంగా + ఉదకం = గంగోదకం

ఇక్కడ 'అ- కారానికి 'ఉ' కారం పరమైనపుడు 'గంగుదకం' అని కానీ, 'గంగయుదకం'' అని కానీ "గంగవుదకం' అని కానీ, రాక పూర్వ పరస్థానీయూలైన 'అ-కార 'ఉ' కారాలు రెండూ లోపించి వాటి స్థానంలో 'ఓ' కారం వచ్చింది.

ఇదే విధంగా గచ్చ+ఇత్ = గచ్చేత్ అని 'అ-' కార 'ఇ' కారాలస్థానంలో 'ఏ' కారం వచ్చింది. కానీ గచ్చిత్, గచ్చయిత్, అని కాలేదు.

ఈ విషయంలో అంటే ఏకాదేశ సంధి విషయంలో ద్రావిడ భాషల్లోని విధానానికి సంస్కృత భాషలోని విధానానికి ఏలాంటి సంబంధంలేదు.

ద్రావిడ భాషల్లో పూర్వ స్వరాలు లోపించి పరస్వరం ఏకాదేశం వచ్చినా, పూర్వ పరస్వరాలు రెండు లోపించి, ఆ రెండింటికి భిన్నమైన అచ్చు రెండు స్థానాలనూ అక్రమించడం వీటిలో కన్పించదు.

సంస్కృతంలోని పరరూపసంధి తెలుగులో కన్పిస్తున్నాప్పటికి తక్కిన విషయాలు అంటే 'య- డాగమ గుణ సంధ్యాదుల్లో చాల వత్యాసం వుంది.

తెలుగు భాషలోని సంధికీ, తమిళం, కన్నడం, మళయాళం, భాషల్లోని ఇతర ద్రావిడా భాషల్లోని సంధీకి నియమితమైన సబంధం ఉంది. నిశితంగా పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లమవుతుంది.

తమిళ, కన్నడ భాషల్లో అంత్యహల్లుల ద్విత్వం వుంది. తెలుగు అజంత భాషగా మారడం వల్ల ఇలాంటి దానికి అవకాశం లేదుకాని అనేక స్థలాల్లో ప్రాచీనంగా నిలిచివుంది.

తెలుగు : ఉదా: కణ్ + అఖగు = కణ్ణఖగు (కంటిసొగసు)

తమిళం : ఉదా: పెణ్ + అంతె = పెణ్ణంతె (స్త్రీవలె)

కన్నడం : ఉదా: అన్ + ఇష్టసఖి = అన్నిష్టసఖి

తటిత్ + ఉ = తటిత్తు

ప్రకృతి భావనివారణం అన్ని భాషలోని వుంది కాని తెలుగు భాషలో అది పరిపూర్ణం. య,వ,న,లు అన్ని భాషల్లోను, ఆగమాలుగా వచ్చి చేరుతాయి. అయితే తెలుగు భాషలో 'య-' న ' నిలిచాయి. 'వ' కారం జనవహారంలో నిలిచింది.

ద్రావిడ భాషల్లో పదాంతంలోని అ, ఇ, ఉ, ఏ లు లోపించి పరరూప సంధి జరగడం క్వాచిత్కంగా వుంది.ఈ విధానం తెలుగు భాషలోనే పరిపూర్ణమై మిక్కిలి వ్యాప్తి చెందింది.

తెలుగు : ఉదా: మాతు + అమ్ = మాతమ్ (మాటను)
మాతిన + బళ్ = మాతినోళ్ (మాటలో)

తమిళం : ఉదా: వాఖగ+ఎన్ = వాకగెన (బ్రతుకుగా మతమనన్)

కన్నడం : ఉదా: అమ్మ+అదు = అమ్మదు (అది అమ్మ)
అదు+ ఎన్న = అదెన్నా ( అదేమి)

ద్రావిడ భాషల్లో పదాంత్యవర్ణం పరపదాది వర్ణంతో కలియడమే సంధి. అవుతుంది. సంధి కార్యాల్లో తమిళ, కన్నడ భాషల అంత్యహల్ ద్విత్వం. ప్రకృతి భావం. అనేవి విశేషాలు. తెలుగు వైయాకరణులు అంత్యహల్ ద్విత్వంను ప్రత్యేక విధిగా చెప్పుకున్నా పదాహతిన్ +ఎగసి = పదాహతిన్నెగసి, సర్వమున్ + అతని= సరమున్నతిని, అనేవి ఇలాంటి కవి ప్రయోగాల్లో అంత్యహల్ ద్విత్వం కన్పిస్తూనే ఉంది. ఇలాంటి స్థలాల్లో ద్విత్వం. 'న' కారం కలగడానికి కారణం తొలి పదాంతంలో చేరిన ఒక సముచ్చయ 'ను' కారమే కానీ వేరుకాదని కొందరు పండితులు అభిప్రాయపడ్డారు.

సంస్కృత భాషల్లో కూడ హ్రస్వపూర్వకమైన పదాంతానునాసికం అచ్చుపరమైనపుడు ద్విత్వాన్ని పొందుతుంది.

ఉదా : ప్రత్యఙ్ + ఆత్మా = ప్రత్యఙ్ఙాత్మా
సన్ + అచ్యుతః = సన్నచ్యుతః
సుగణ్ +ఈశం = సుగణ్ణీశః

తమిళ భాషలో కూడ ఇలాంటి మార్పులు కన్పిస్తుంది.

ఉదా : కణ్ + ఆశై = కణ్ణాశై
ఎన్ + ఆశై = ఎన్నాశై
కల్ + అణువు = కల్లణవు
మెయ్ + ఆశై = మెయ్యాశై

ఇక్కడ విశేషం ఏమంటే సంస్కృత భాషలో ఒక అనునాసికమే, ద్విత్వాన్ని పొందుతుండగా హ్రస్వాచ్చు పూర్వకాలైనా, నాసికేతరా హల్లుకు అచ్చు పరమైనపుడు ప్రధానంగా అనుకరణంలో ద్విత్వం రావడం తెలుగు భాషలో ఉంది. ఉదా: కింతత్+అనియె = కింతత్తనియె.

కొన్ని స్థలాల్లో సంధి కలగకపోవడం, తమిళ, కన్నడ భాషల్లో వలెనే తెలుగు భాషలో కూడ ఉంది. అయితే సంధిలేనిచో ఉచ్చారణాసౌకార్యానికై సంధ్యక్షరంగా 'మీ-కారం నియమితంగా కలుగుతుందే కాని కేవల ప్రకృతి భామనేది తెలుగు భాషలో లేదు. తమిళ కన్నడ భాషల్లో వలే 'వ-కారం సంధ్యక్షారంగా తెలుగు భాషలో గ్రహించడము లేదు.

ఈ ద్రావిడ భాషలో అచ్చు పరమైనపుడు పదాంతంలోని అ,ఇ,ఉ,ఏ లు సామాన్యంగా లోపించి సంధి జరుగుతుంది.

తెలుగు భాషలవలె ఈ భాషల్లో అచ్చు కంటే పరమై పదాది కతప వర్ణాలు, గదవలు అవుతాయి. కాని కన్నడంలోని విశేషమేమంటే 'స' వర్ణం 'బ' కారంగా మారడమే కాక ప, బ,మ లు మూడు కూడా 'వ' కారంగా మారుతున్నాయి.

తెలుగు భాషలో 'చ-కారం 'ప' కారమవుతుండగా, కన్నడ భాషలో 'ప-కారం 'చ-కారంగా మారడం కన్పిస్తుంది.

ఈ విధంగా ద్రావిడ భాషల్లోని సంధికి ఒకే రీతిగా జరుగుతూ ఉంటుంది. అందువల్లే భాషావేత్తలు, నిశితంగా పరిశీలించి ద్రావిడ భాషలు సంస్కృతం నుండి పుట్ట లేదని చెప్పారు. అంతేకాక ద్రావిడ భాషలన్ని ఒకే కుటుంబానికి చెందినవని పేర్కొన్నారు. ద్రావిడ భాషల్లో ప్రధానమైన తెలుగు తమిళం, కన్నడం, మళయాళ్ మొదలైన భాషల్లో స్వల్ప భేదం వున్నప్పటికి అనేక విషయాల్లో సామ్యం చాల స్పష్టంగా కన్పిస్తుంది. సంధి పండిత కృతమని అనుకుంటారు. కాని అది నిజం కాదు. సాహిత్యభాషలో సంధికార్యాలు చాలవరకు పండిత కృతాలేకాని సాధరణ వ్యవహారంలో ఈ సంధి నిరూప ధ్వని పరిణామంగా పరిగణిస్తారు. ఇక తెలుగులో సంధి ప్రవర్థిల్లిన వైనం గమనిద్దాం.

తెలుగు అజంతభాష "ఉత్తునకచ్చుపరంబగునపుడు సంధి యగునని" మొదట నిత్యసంధి ఎచ్చట కలుగుతుందో దానిని గూర్చి చెప్పుటకై చిన్నయసూరి సూత్రీకరించెను. పూర్వమందలి చివరి వర్ణం ఉత్తర పదమందలి తొలివర్ణముల స్థానంలో మలిపదంలో తొలవర్ణం నిలిచునని అతని వివరణము. దానికితోడు సూరి ఇచ్చిన ఉదాహరణలు.

రాముడు+అతడు = రాముడతడు

సోముడు+ఇతడు = సోముడితడు

మనము+ఉంటిమి = మనముంటిమి

అతడ+ఎక్కడ = అతడెక్కడ

ఇతడు+ఒకడు = ఇతడొకడు

ఈ సంధి స్వాభావికమే కాని ఇచ్చిన ఉదాహరణలో మన ముంటిమి. అనేది సూత్రం జన వ్యవహారంలో వినబుడుతుంది. మిగిలినవన్నీ పండిత వ్యవహారములు. కాగా రాముడతడు, అనేది కనబడుతుంది. వాడు రాముడట, మాత్రమే ఉంది. అట్లే మిగిలిన ఉదహరణలు (వాడక) వాడు సోముడు, వీడొకడు, అనేవి మిగిలిన వాటికి వ్యవహరమందుగలరూపాలు.

ఇక ఈ ఉకారముపై సంధి నిత్యమగుట కారణం పై పదగతంగా భాషించుచున్న, డుము,వులు (ప్రధమావిభక్తి ప్రత్యయాలు) అన్ని ఉత్త్యముతో అంతమౌతున్నాయి. కాని ఈ ఉత్వం స్వాభావికంగా ఇతర కారణాల వలన ఆ ప్రత్యయములపై చేరినది. అనగా ఆగమము, సంధివశాన ఈ ఆగమం తొలగి పరపదముపై గల అచ్చు ఆస్థానమున నిలిచినందున్న ఉత్త్వ సంధి నిత్యమైంది. అయితే ప్రథమేతరములైన విభక్తులపై గల ఉకారానికి శత్రర్థము ఈ వర్ణములందున్న ఉకారమునకు సంధి వైకల్పికవటానికి కారణం, ఆరెంటి యందు ప్రవర్తించు చున్న ఉకారము అవయకమో। ఆగమమో। అనుదానిపట్ల భాషావ్యవహర్తలు గల సందేహమని, సోమయాజిగారి ఉవాచ అయితే సూరి ఇచ్చిన ఉదా.లోగల ద్వితిమాంత రూపాలన్నీ పండిత కృతమే తప్ప। జన వ్యవహారంలోనివి కావు నన్నడిగె, నాకిచ్చె, నాకాదరువ, నామీద,ఆశ,లేకా నాపైయాశ, ఇందున్నాడు, (నిజానికి ఇక్కడున్నాడు) అనేది స్వాభావికోచ్చారణ, (ఎందుంటుంది)(అక్కడుంటివి) వచ్చుచుండెను.(వస్తోంది, వస్తూఉండేను) వైకల్పికమనేది. కేవలం పండిత వ్యవహారంలోనే కన్పించున. అనగా కవులు తమ సౌలభ్యం కొలది సృష్టించినవి. సౌలభ్యం, కొరకై కేవలం పండిత. వ్యవహారంలోనే కన్పించదు. అనగా కవులు తమ సౌలభ్యం కోసం సృష్టించినవి. సౌలభ్యం కొరకై సంధి చేయకుండుట అట్టివారి అభ్యాసమున కలదు. నవ్వరు ఎవ్వరైనను నన్నుగనుగొని (సానందోపాధ్యానికి).

### ఇత్వసంధి:

దీనికి కొన్ని చోట్ల నిత్యంగా సంధిరాకుండ, మరికొన్ని తావులు వైకల్పికంగాను, సూరి సంధిని సంఘటింప జేసెను. "క్వార్థంబైన యిత్తునకు సంధి లేదు' ఇది కూడ జనవ్యవహారంలో దూరమైన సూత్రీకరణలే। ఏమ్యాదుల యిత్తునకు సంధి వైకల్పికముగా అనునది ఒక సూత్రం. ఏమ్యాదులును ఆకృతి గణంగా నిరపించెను.

ఏమి అంటివి అనుదానికి ఏమంటివి అనే రూపం, ఏమియంటివి అనే యడాగమం రూపం సూరి చెప్పెను. వీటిలో మొదట రూపమే అనగా సంధిరూపమే జనవ్యవహారంలో ఉంది. రెండవది పండిత కృతం. అట్లే మిగిలినది.

మరి-ఏమి : మఱేమి(మరేమి)-జనవ్యవహారం
మఱియేమి-పండితవ్యవహారంలో

హరికిన్+ఇచ్చె: హరికిచ్చె- జనవ్యవహారంలో
హరికినిచ్చె-పండితవ్యవహారం నిజానికి ద్రుతాంగమే పండితకృతంగదా। ఇక ఆకృత గుణంలోని పదములు విషయము.
ఆది-ఇచ్చె: ఆదిచ్చె,జనవ్యవహారంలో
ఆదిలయిచ్చె-పండి"

అవి-ఎక్కడ : అవెక్కడ, ఇవి-ఎక్కడివి = ఇవెక్కడివి
ఏది-ఎక్కడ : ఏదెక్కడ, ఏది-ఇక్కడ = ఏదిక్కడ
ఏవి-అవి : ఏవవి

పైవి జన సామాన్యమందున్నవి కాగా యడాగమం పండితకృతం, పిదప, 'క్రియాపదంబులందిత్తునకు సంధి వైకల్పికముగానగు

వచ్చిరి-అప్పుడు = వచ్చిరపుడు
= వచ్చిరియపుడు

ఇందలి యడగామరూపం స్వాభావికం కాదు. నిజానికి వచ్చిరపుడు అనేది కూడ సాధరణ జనవ్యవహారం కాదు. స్వాభావిక రూపం ఇచ్చారపుడు లేక అపుడొచ్చాడు.

వచ్చితిమి-ఇపుడు = వచ్చితిమిపుడు, వచ్చితిమిపుడు,

ఇందులో జనవ్యవహారంలో దగ్గరగా వచ్చితిమిపుడు రూపం మాత్రమే తప్ప, వచ్చితిమియిపుడు అనేది కాదు. అత్యంత స్వాభావిక రూపం వచ్చామిపుడు, ఇపుడేవచ్చాము అనేవి.

"మద్యమ పురుష క్రియలందిత్తునకు సంధియగును" ఉదహరణలుగా సూరి ఈ క్రింది చూపెను.
ఏలితివి-అపుడు = ఏలితివపుడు
ఏలితి-ఇపుడు = ఏలితిపుడు
ఎలితిరి-ఇపుడు = ఏలితిరిపుడు

ఉద్దిష్టరూపాలు పండిత భాషలోనివి. జన సామాన్యంలో 'ఇపుడేలా' ఇపుడేలుతున్నారు. అనే విధంగా ఉంటాయి. 'వ-రుగాగమలు సార్వనామికను బంధములు.

ఇక 'చివరగా' క్త్వార్థంబైనయిత్తునకు సంధిలేదు క్త్వార్థం అనగా భూత వ్యావహారంలో వచ్చిచ్చెను. (ఇక్కడసంధిలేదు) అనే రూపముంటుంది. లేఖనంలోనూ ఇట్లువున్న ఉచ్చారణలో వచ్చియిచ్చెను. అనువిధంగా చకాద్విరుక్తంగా తర్వాత అవ్యవహితోచ్చరణమున కొద్ది విరామంలో మకారం చోటు చేసుకుంది. అనగా యడాగమం స్వాభావికం. వ్యవహారికంగాంలో ఆ భావాన్ని చూచించటానికి'చూస్తాడు' అనే దానినే ఉపయోగిస్తారు. అనగా భూతకాలిక సమకార్థస్ఫూర్తియే ఉంటుంది. కొంత నిశితంగా పరిశీలిస్తే వ్యవహారాన్ని భూతకాలిక సమాపక- అసమాపక భావాల మద్య పెద్ద భేదం ఉండదు. అనగా ఉచ్చారణను

లేఖనంలో చూపించిన కాని ఉచ్చారణలో అభేదం కన్పిస్తుంది. చూశాడురూపం. నిశ్చదురక భూత కాలిక, సమాపక క్రయారూపంగా యధాతదంగా వర్తిస్తుంది. కాని కొంత ఆర్ధోక్తిగా ఉచ్చరిస్తే ఆసమాపక క్రియాభావన కలుగుతుంది. లేఖన రూపం ఒక్కటే అవటంవలన ఉద్దిష్ట భావ ప్రసరణకు (బాగా) బాధ కల్గుతుంది. కావునా (లేఖ) కవులు లేఖనంలో భూత కాలిక అసమాపక క్రియా భావం సూచించుపట్ల సంధి చేయక యడాగమ రూపాన్ని స్వీకరించాలే తప్ప। అన్యం కాదని బోధపడ్తుంది. వ్యవహారానికి లేఖన పద్ధతికి గల భేదక కారణం ఇది. కానుక సంధి నిరూపణమున ఏకాసూత్రలే ఘటించు -ట దుర్ఘటము. ప్రత్యక్ష శ్రవణం బటి యిబ్బంది వల్ల భావమున కనబడదు. లేఖనమున (పరోక్షం) ఈ మారుపాటు సంభవించునదనుట స్పష్టం.

**అత్వసంధి:**

'అత్తునకు సంధి బహుళముగానగు'' అని సూరి సూత్రీకరించెను. దీనికి అనుబంధంగా "బహుళ గ్రహణం చేత స్త్రీవాచక తత్సమ సంబోధనాంతంబులకు సంధిలేదని'' చెప్పాడు. బహుళముగాఅని అనడం వలన ప్రవృత్తి , అప్రవృత్తి, విభాష, అన్యదేవ భావాలు కల్గుతాయి. సంధి రావటానికి మేనల్లుడు, పుట్టినిల్లు, పుట్టినయిల్లు, చూడకయుండెను, అనే ఉదా.లు ఇవ్వబడ్డాయి. సంధిరూపాలు తెలుగు వారి సామాన్య వ్యవహారంలోనివి సంధిలేని రూపాలు కేవలం కవుల వ్యవహారం (నుంచి) లోనివి.

'మేనయల్లుడు' అని తెలుగు వాడే వాడు పలుకడు. అట్టే, 'చూడకయుండెను' కూడ. పుట్టినయిల్లు అనే చోటు పుట్టినిల్లు అనడం ఉద్దిష్టార్థాన్నికి, భంగం కల్గుతుంది. కనుక , పుట్టినిల్లు' లను పుట్టినయిల్లు అను రూపం లోకంలో ప్రసిద్దంగా ఉంది. పుట్టినిల్లు అను రూపం మెట్టినిల్లు అను రూపసామ్యం నుండి ఏర్పడింది. మాపుట్టింటివారు, ఆమె పుట్టింటికి వెళ్ళింది అని తప్ప మాపుట్టినింటి వారు, ఆమె పుట్టినింటికి వెళ్ళింది. అని వ్యవహరించరు. పుట్టినయిల్లు అంటే జన్మనిచ్చినయిల్లు కాక తాతక్కర్మైన కుటుంబం వారు ఉంటే తావు అనే ఆర్థమేకాని గృహం కాదు కదా। కాని పుట్టిన యిల్లు అనుచోట జన్మనిచ్చిన ఇల్లు అను అర్థం వస్తుంద. ఇది వ్యవహారానికి విరుద్దం.

ఇక అనుబంధ సూత్రవిషయంలో అమ్మఇచ్చెను, అమ్మయిచ్చెను అనేది ఉదా. రూపం. ఇచ్చట సంధి చేస్తే 'అమిచ్చింది', అనే విక్రయార్థం స్ఫురించే అర్థం వస్తుంది. కనుక సంధిలేని రూపమే సమంజసంగా కనిపిస్తుంది. ఇక 'దూత ఇతడు' అనేది తెలుగు వారికి స్వాభావికం కాదు. తెలుగు వారి పలుకుబడివీడు (వీడుదూత), దూత అనిగాని దూతీడు అనిగాని ఉంటుంది. రెండవ రూపం దూతీయ ఉచ్చారణలో (యడాగమం వర్తిస్తుంది. 'చెలువదిందము' అనేది కేవలం పండిత సృష్టి.

సూత్ర వివరణలో ''సంస్కృతీయంబునకు సంధియగునని యదర్వణాచార్యులు చెప్పిరి కాని, దానికిం "పూర్వకావ్యంబులందు ప్రయోగంబుమృగ్యంబు'' అంటు గంగనుకాసె, నెలతిచ్చెను. అనే సంధి రూపాలను (స్త్రీవాచక ప్రత్యయాలగు) ఆధునికులు రాశారంటు చూపటంజరిగింది. అనగా సూరికి ఈ ప్రయోగాలు ఆంగీకార్యం కాదనుట స్పష్టం. అయితే జనవ్యవహారంలో గగంను కాసె, నెలతిచ్చెను. రూపాలకు ఎట్టి అభ్యంతరం లేదు. ఎట్లాగయిన సాధరణ వ్యవహారం అట్టి రూపాలు చోటు చేసుకొవుకదా।

ఇక బహుళకం చేత వెలయాల్వాదులకు సంధి లేదని' సూరి మతం. అనగా వెలాలు రూపం అయనకు ఆంగీకారం కాదని తెలుచున్నది. వెళయాలే అనే పదం, సాహిత్యంలో పలుపర్యాయాలు కన్పిస్తుంది. లోకవ్యవహారంలో లేదు. దీనికి ఆర్థం వేశ్య, ఉంపుడుగెత్తె మొ॥ నవి అయితే లోకంలో 'ఇల్లాలుంది' తతేరికంగా వెలియాలు(వెలయాలుకాదు) ఉన్నది. వెలుకవచ్చెడి, 'ఆలు- అనే అర్థం. ఇల్లాలు కానిది వెలయాలు. ఈ రెండింటికి గల భేదం అది వెలకు వచ్చిన, రాదా అనేది ఇక్కడ పుస్తకం కాద, అట్టి సందర్భాలలో

వెలి+ఆలు = వెల్వాలు (సంస్కృత సంధి ప్రభావం కావలేను)

'ఇట్టి రూపాలు తెలుగులో కలవు.

ఉదా : నంది-అలా = (అవన్త్రీ అను అర్థంకాదు) అపుడు 'నంద్యల' అవుతుంది. ఆ విధంగా వ్రాయుచున్నాము. ఆ పద్ధతిలో వెల్వాలు అవ్వాలి. (వ్రాతలో) కాని వ్యవహారంలో నంధ్య ఇచ్చటి 'ద- పై కొంత యత్వవిశిష్టత కలదు. అట్లే 'వెలి' - 'ఆలు = వెలాలు అని వ్రాసె అట్లే చదివినచో యిబ్బంది కలుగుతుంది. "అభ్యాసవాసన యత్వవిశిష్టంగా పలకటం జనవ్యవహారంలో ఉంది. అయితే 'వెలాలను' సూరి చెప్పాడు. గూర్చె కాని 'వెలి ఆలును' గూర్చి సూత్రించలేదు కదా! అనే ప్రశ్న వస్తుంది. ఇక్కడొక విషయం సాహిత్య ప్రయోగాలు గూర్చి సూరి సూత్రీకరణ చేయటం, ప్రయోగాలను కవులను తబ్బిబుపాటుతో ప్రయోగం చేయటం మూలం. వారు 'వెలి ఆటు' ను 'వెల ఆలుగా' భావించి ఉండాలి. లేదా! వేలాలు, (మత్వవిశిష్టరూపం) రూపమందలి మత్వోచ్చారణమును లేఖల రూపంలో చూపుట దుర్ఘటం కావునా! దని సమీపవర్తి అగు! 'మ- కారాన్ని ఆగమంగా చేసిండవచ్చు కనుక, ఈ వెలియాలు' శబ్దమే అత్వసంధి విషయాన్ని పుస్తకం కానవసరం లేదు.

## ఆగమ- ఆదేశ సంధి:

'మ- 'వ- ల ఆగమం, .. ఇవి తమిళ, కర్ణాటక భాషల్లో ఉంది. బాలవ్యాకర్త, సంధిలేని చోట స్వరంబుకంటే బరంబైన స్వరంబునకు యడాగమంబగు" అని సూత్రించెను. సన్నికర్షములైన పదాలలో రెండవ పదాదిని ఇ, ఈ, ఎ, ఏ లు ఉన్నచో యడగామం ఉ,ఊ,ఒ,ఓ లు ఉన్నచో 'వ-గాగమం తెలుగులో ప్రవర్ధిల్లటం కన్పిస్తుంది.

ఆ+ఇల్లు = ఆయిల్లు, దినికి కారణం ముఖమంత్రం "ఆ" ధ్వని తీవ్రత 'ఇ' ధ్వనిని పలకటం కష్టం. అందువల్ల రెంటిమధ్య 'య-కారం సిద్దిస్తుంది. 'మాయమ్మ' అనేది గ్రాంధిక భాషకు (పుట్టి) బప్పతుంది. వ్యవహారంలో కుదరదు. 'మాఅమ్మ ఇంతస్పష్టంగా కాదుగాని' వ్యవహారంలో ఇట్లే ఉంటుంది తప్ప। యడాగమప్రసక్తి ఇక్కడుండదు. మా- ఊరు= మాయూరు. కూడ వ్యవహారంలో కూదరదు. ఇక్కడ 'వ- గామమం, నియంతగా వర్తిస్తుంది. కనుక 'మావూరు' అనేది మాత్రమే సిద్దిస్తుంది. సూరి యడాగమనం విధించటానికి కారణం 'వ- గాగమం నిరోధించటానికి 'సంధిలేని చోట యడాగమమే కల్గుతుందని అతని నిశ్చితాభిప్రాయం. పూర్వ శాసనాల్లో 'యడాగమం' కన్పించదు. పదాదిన, 'య-కారము లేదు. కనుకనే యకారంబును 'వు- 'వూ- ఒ, ఓ, లోను తెలుగు మాటలు మొదటన లేవు. అను సూత్రం ఏర్పడింది. సూరి లేవన్న వ్యవహారంలో ఉన్నవి. అన్నము, వన్నము, ఊరు, వూరు, వచ్చారు, వొచ్చారు. అట్లే ఎవడు -యెవడు, ఎందుకు-మెందుకు, ఏలా-యోలా, మెదులైనవి ఉచ్చారణలో వినపడుచున్నవి. ఏమైనప్పటికి ఈ ఆగమాలు తెలుగున స్వాభివికములు గ ఇవి కళలకు వర్తిస్తాయి. ద్రుతాంతములపై రావు. ద్రుతంపండిత భాషలో మాత్రమే కన్పిస్తుందన్నమాట మరవరాదు.

## ద్విరుక్తటకారం :

"కుఱు, చిఱు, కడు, నడు, నిడు శబ్దముల అడల కచ్చుపరంబగునపుడు ద్విరుక్తాటాకారంబుగు" అగునని సూరి. సూరి వ్యాకరణ పద్దతి ప్రాదుకంగా వర్ణాణాత్మక పద్ధతికి చెంది. అనగా కన్పిస్తున్న రూపాలను వివరించి, వాటిని సూత్రబద్ధం చేయుట కుట్టసురు, చిట్టడవి, రూపాలను, కుఱు, చిఱు, అనేవి ప్రధమశబ్దాలని అయన భావన తమిళంలో కుట్రసురు, చిట్రై, అనే రూపాలన్నాయి. తెలుగు శాసనాల్లో "ముద్యులికుట్టు" అని పదం ఉపయోగించబడింది. ఇదే పదం నన్నయ నాటి శాషనాల్లో ముయ్యలి కుటుగా భాసిస్తుంది. సామ్యం వలన కుట్రు, చిట్రు అనేవి. కుట్టు, చిట్టుగా రూపొందాయి అనగా ద్విరుక్తటకారం పదాగలమే. తప్ప ఆగమం కాదు. కట్టుకడ, నిట్టనిలువు, అనేవి బృషార్షంలో ఉన్నట్లు కనిపిస్తుంది. వీటిలో తొలిశబ్దం. 'కట్ అని కావచ్చు, లేకపోతే 'డా- కారాంతపదాలపై నియతంగా, 'ట-కారం ఆగమంగా వచ్చుట అనుభంలోని విషయం ఉదా: పురుడ-ఇల్లు, పురిటిల్లు దుక్కిటెదు&ద, దుక్కుడు ఎద్దు. కేవలం మహద్వాచాకాలపై కాక ఇతరమైన చోట్లమైన కూడ కన్పిస్తుంది. ఉదా: ఆంకుడు, కుంకుడు, చిక్కుడు, ఇట్లేవుకూడ, బాతు, బాతువు, కనుక తేనెప 'డు' చేరిన రూపం కనించకుండా శూన్యప్రత్యయాగమం

భావిస్తే 'తేనిటీగ' ఏర్పడటానికి అభ్యంతరం ఉండదు. ఇది కేవలం 'ట- 'టు. ఆగమాలుగా ఆంగీకరించవలేను. అట్లే "చిట్టచివర" లో ' చిట్ట' యొక్క పూర్వరూపం 'చిట్ర', నట్టనడుమ, నిట్టూర్పు పదాలలో పూర్వరూపం 'నట్ర,'నిడ్ర 'నిట్ర ' కావక, నిజానికి (ఛిట్ట) 'నిట్ట' కుమారుగా వ్యవహారంలో 'నిట్ర' శబ్దం ఉంది. 'నిట్రాడు' నిట్టాడు. తమిళశబ్దం 'కుట్రు' తెలుగులో కుట్టుగా కన్పిస్తున్నట్లుగా పైవి కూడ కట్ట, నట్ట, నిట్లగా తెలుగులో ఉండి ఉంచాలి. వ్యస్తంగా అట్టిపదాలు వ్యవహారంలో లేకపోవడం వలన 'ట్ర' శబ్దం ద్విరుక్తట కల్గిందని భావించవలసివచ్చింది.

## గసడదవాదేశం :

తెలుగున కచట తపలకు, గజడదబల గసడదవలు, ఆదేశమవ్వటం కన్పించటం జరుతుగుంది. "ప్రథమమీది పరుషములకు గసడదవలు బహుళంగానగు" "తేనుఃమీది సాంస్కృతిక పురుషములకు గసడదవలు రావు, "ద్వంద్వంబునం పరంబుపయి పరుషములకు, గసడదవలగు" అను సూరి చిత్రీకరించెను.

మొ॥ సూత్రంలో బహుళముగా అవటం వలన అతడు చూపిన గసడదవలు కల్గిన రూపాలు, వాడుగొట్టె, అపుడుసనియె, మొదలగు రూపాలు పండిత కృతమని, పరుషాలు నిల్చుని రూపాలే, సాధరణ వ్యవహారంలో ఉన్నట్లు గ్రహించవలసివస్తుంది. కళలపై చూపిన రూపాలు, 'వత్తురువోదురు', పండిత కృతం, 'రారుగద' సామాన్యవ్యవహారంలో, ద్వంద్వ రూపాలలో కూరగాయలు 'కాలు చేతులు - తల్లిదండ్రులు అనేవి జనవ్యవహార సామాన్యాలు. టక్కుడెక్కలు, ఊరుపల్లెలు, పండిత వ్యవహరములు, సంస్కృత పరుషాల రూపాలు, అటుపండిత, ఇటు సామాన్య జనవ్యవహారాల్లో సామాన్యం. అయితే అట్టి పదవ్యవహారమే జన వ్యవహారంలో ఉండదనేది సత్యం.

పరుషాలు మారటానికి గల కారణం ఆచ్చుల నడుమ ఉండటం, అచ్చులు నాదములు కాగా 'చ' వర్ణం, 'స' వర్ణం, 'సవర్ణంగా మారటం ఎలాగంటే 'చ' తాలవ్యస్పర్శం. 'శ' తాలవ్యోష్మం, 'స' వర్ణం ఉష్మమము. 'చ- 'స' గా మారిన, 'స' గా పరిణామించింది ఐతే జనవ్యవహారంలో 'శ' వర్ణం వినిపిస్తునే ఉంది. కనుకనే కచటతపలు, గజడదబలు, గసడదవలు, ఉచ్చరింపబడుచున్నాయి.

ఏమైనప్పటికి సంధి రావడానికి, రాకపోవటానికి ఆగమాలు కారణం ఉచ్చరణ సౌలభ్యమే, వ్యవహారానికి భిన్నంగా కేవల సాహిత్యంలోనే కన్పించేవి వ్యవహార రూపాల సామ్యంతో పండితులు కల్పించినవి. ఇలా కల్పించబడిన వాటిలో కొన్ని వ్యావహారికంలోని మార్పును సమంగా గ్రహింపక తచ్చిచ్చుపడటం వలన ఏర్పడినవని ముందు నిరూపించబడింది.

## ఆధార గ్రంథాలు :


1. జోగి సోమయాజి, గంటి, ఆంధ్రభాషా వికాసము
2. రామకృష్ణయ్య, కోదాడ, సంధి
3. సిమ్మన్న, వెలమల, ఆంధ్రభాషా చరిత్ర
4. కృష్ణమూర్తి, భద్రిరాజు (ఎడిటర్) తెలుగు భాషాచరిత్ర


- ఆచార్య లకంసాని చక్రధరరావు

పాఠం - 8

# సమాపక, అసమాపక క్రియాలు భూతకాలిక క్రియారూప నిర్మాణం

## విషయసూచిక


**8.1.0** పరిచయం

**8.1.1** ఉద్దేశం

**8.1.2** క్రియ-నిర్వచనం

**8.1.3** క్రియ-భేదాలు

**8.1.4** భూతకాలిక క్రియారూప నిర్మాణం

**8.1.5** మధ్య ద్రావిడ భాషలు

**8.1.6** దక్షిణ ద్రావిడ భాషలు

**8.1.7** ఉత్తర ద్రావిడ భాషలు

**8.1.8** గుర్తించుకోవలసిన ముఖ్యాంశాలు

**8.1.9** మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 8.1.0 పరిచయం :

'సర్వేంద్రియాణాం నయనం ప్రధానం' అన్నట్లు భాషాంగాలన్నింటిలోను క్రియలు ప్రధానమైనవి. క్రియా స్వరూపాన్ని బాగా గుర్తించి వుపయోగించినపుడే భాషా ప్రజ్ఞా పాటవం గోచరిస్తుంది. బాల వ్యాకరణంలో క్రియా పరిచ్ఛేదంలో క్రియల స్వరూప స్వభావాల్నీ గూర్చి విపులంగా వివరంగా విస్తారంగా చిన్నయసూరి వివరించాడు. 'క్రియ' అనే పదం సంస్కృతం నుంచి వచ్చిన పారిభాషిక పదం.

## 8.1.1 : ఉద్దేశం

ఈ పాఠం చదివిన తర్వాత మీరు ఈ కింది అంశాల్ని తెలుసుకుంటారు.

ఉత్తర ద్రావిడ భాషలు

క్రియ-భేదాలు

వర్తమాన కాలికక్రియ

దక్షిణ ద్రావిడ భాషలు

క్రియా-నిర్వచనం

భూతకాలిక క్రియ

కాలబోధక క్రియలు

మధ్య ద్రావిడ భాషలు

భవిష్యత్ కాలిక క్రియ

ఇంకా ఇతర ప్రధాన ప్రత్యేక విశేషాల్ని తెలుసుకోవడం.

### 8.1.2 : క్రియ-నిర్వచనం

'క్రియతే ఇతి క్రియా' క్రియ అంటే చేష్ట /వ్యాపారం/ అని అర్థం. సామన్య జన వ్యవహారంలో కాల, పురుష, వచన, లింగ భోధకతను సూచిస్తూ పని (Action) ని తెలియచేసే పదాన్ని క్రియ అంటారు. అంటే వ్యాపార బోధకాలైనవి క్రియలని అర్థం. చేశారు, చేయగలవు మొదలైన క్రియా రూపాలకు మూల రూపమైన 'చేయు' అనేది క్రియాధాతువు. తెలుగు భాషలోని క్రియలన్నీ అచ్చు అంతంగా వుంటాయి. క్రియల్లో ప్రధానమైన భాగం ప్రాతిపదిక. క్రియా ప్రాతిపదికకు ప్రత్యయాలు చేరి క్రియా నిర్మాణం జరుగుతుంది. వ్యక్తి వస్తువుల్ని ఉద్దేశించి ఏదో ఒక విషయం చెప్పడానికి ఉపయోగపడేది, వ్యాపారాదుల్ని బోధించేది అయిన దాన్ని క్రియ అని అంటారు.

### 8.1.3 : క్రియ - భేదాలు :

క్రియ - భేదాలు

సమాపక క్రియలు

- కాలబోధక క్రియలు
  - భూతకాలిక క్రియ
  - వర్తమాన కాలిక క్రియ
  - భవిష్యత్‌కాలిక క్రియ
- అర్థబోధక క్రియలు
  - తద్ధర్మాద్యర్థకాలు
  - వ్యతిరేకార్థకాలు
  - ప్రార్థనాద్యర్థకాలు
  - వ్యతిరేక ప్రార్థనాద్యర్థకాలు
  - ఆశీరాద్యర్థకాలు
  - విధి క్రియ రూపాలు

అసమాపక క్రియలు

1. క్త్వార్థం
2. శత్రర్థకం
3. ఆనంతర్యార్థకం
4. తుమున్నర్థకం
5. బేదర్థకం
6. భావార్థకం
7. వ్యతిరేకభావార్థకం
8. ధాతుజ విశేషణం /క్రియాజన్య విశేషణం/

### క్రియలు - భేధాలు :

తెలుగు భాషలోని క్రియలన్నింటినీ ప్రయోగ నిర్మాణాన్నిబట్టి ప్రధానంగా రెండు రకాలుగా విభజించవచ్చు. ఒకటి సమాపక క్రియ. రెండు అసమాపక క్రియ చేసెను, చేయగలడు, చేయును, చేసితిని, చేయును మొదలైనవి సమాపక క్రియలు. చేసినన్, చేయ, చేయక, చేసి, చేయని, చేసెడు, చేసిన మొదలైనవి అసమాపక క్రియలు.

**ఎ. సమాపక క్రియలు :** (Finite Verbs)

ధాతువు (Root) లపై పురుష ప్రత్యయాలు (Personal Suffix) కాలవాచక ప్రత్యయాలు (Tense mood Suffix) చేర్చుకొని వాక్యాన్ని ముగించడానికి వాడే క్రియా రూపాల్ని సమాసక క్రియలని అంటారు. ఉదా॥ వచ్చాడు, వస్తాడు, సమాపక

క్రియలు చివర లింగ, వచన, పురుష బోధక ప్రత్యయం వుంటుంది. సమాపక క్రియలు వాక్యాన్ని పూర్తి చేస్తాయి.

సమాపకక్రియలు రెండు విధాలు. ఒకటి కాలబోధక క్రియలు. రెండు అర్థబోధక క్రియలు.

### 1. కాలబోధక క్రియలు :

కాలాన్ని తెలియజేసేవి కాలబోధక క్రియలు. ఇవి మూడు విధాలు. ఒకటి భూతకాలిక క్రియలు. రెండు వర్తమానకాల క్రియలు.

'కాలం' అనే పారిభాషిక పదం క్రియా రూపాల్ని పేర్కోడానికి వుపయోగపడుతుంది.

### 1. భూతకాలం :

ఉదా: నీవు నాకు గొప్ప ఉపకారం చేశావు

ఇక్కడ 'చేశావు' అనేది క్రియ, భూతకాలం /భూత - అయిపోయింది/ వాక్య రచనా కాలానికి పూర్వమే జరిగిపోయిన పనిని తెలుపుతుంది.

### 2. భవిష్యత్ కలం :

ఉదా: రేపు మేము బయలుదేరుతాం

ఇందులో 'బయలు దేరుతాం' అనే క్రియ భవిష్యత్ కాలం /భవిష్యత్ - కానున్నది / వక్త ఆ వాక్యం పలికేటప్పటికి బయలుదేరలేదు.

### 3. వర్తమాన కాలం :

ఉదా॥ వాడు ఇటువైపే వస్తున్నాడు.

ఇక్కడ 'వస్తున్నాడు' అనే క్రియ వర్తమానకాలం /వర్తమాన-జరుగుతున్నది/ రావడం అనే పని వాక్యరచనా కాలంలో జరుగుతుండడం సూచిస్తుంది.

### 8. 1.4 : భూతకాలిక క్రియలు (Part Tense)

### 8.1.4.1. : మధ్య ద్రావిడ భాషలు :

1. మధ్య ద్రావిడ భాషలు

### 1. తెలుగు :

జరిగిపోయిన పనిని తెలియజేసేది భూతకాలం. భూతకాలాన్ని సూచించడానికి 'ఇ' ప్రత్యయం చేరుతుంది. అంతేకాక 'తి' అనే వర్ణం కూడా ఆగమంగా వస్తుంది.

ఉదా॥ చేసితిని

ఇందులో 'ఇ' వర్ణం భూతార్థకం.

'తి' వర్ణం ఆగమం.

మరికొన్ని ఉదా॥ వచ్చితిని, వచ్చితిరి, వచ్చెను, వచ్చిరి.

| పురుషాలు | ఏకవచనం | బహువచనం |
|---|---|---|
| ఉత్తమపురుష | నేను వచ్చితిని | మేము వచ్చితిమి |
| మధ్యమపురుష | నీవు వచ్చితివి | మీరు వచ్చితిరి |
| ప్రథమపురుష | వాఁడు వచ్చెను | వారు వచ్చిరి |

ప్రథమ పురుషలో కర్త అమహద్వాచకం అయినప్పుడు బహువచనానికి ఏకవచనం వస్తుంది.

ఉదా॥ చిలుక పలికెను

మహతీ వాచకం బహువచనంలో మహత్తుతో సామ్యం కలిగి వుంటుంది.

ఉదా॥ బాలురు వచ్చిరి

మధ్యమ పురుష 'వ' కారానికి లోపం వికల్పంగా వస్తుంది.

ఉదా॥ నీవు వచ్చితి

## 2. గోండి :

### ఏ. సమాపక క్రియలు :

భూతకాల ప్రత్యయం 'త్' 'ఉన్' తర్వాత మాత్రం 'ట్' /ఉన్ + త్ - ఉట్ట్/. నకారాంతాల్లో 'న' కారం 'త్' ముందు 'థ' కారం అవుతుంది.

తిన్ 'తిను' /తిత్త్/

పా - కొట్టు

| ఏకవచనం | బహువచనం |
|---|---|
| పాతోన్ | పాతోం |
| పాతీ | పాతీత్ |

### బి. క్త్వార్థకం :

ప్రత్యయం సీ, చీ, జీ, . నకారాంతాల తర్వాత చీ, చ, జ, త, ద, హలలో అంతమయ్యే వాటి తర్వాత, 'తర్' 'సీ' మిగిలిన వాటి తర్వాత వస్తుంది.

| | | |
|---|---|---|
| కాచ్చీ | - | తవ్వి |
| ఉచ్చీ | - | కూర్చొని |

**సి. భూతధాతుజ విశేషణం :**

భూతప్రాతిపదికకి 'ఆ' చేరుతుంది.

వెహ్‌తా - చెప్పిన

**డి. చేదర్థకం చేదవ్యర్థకాలు :**

చేదర్థకంలో భూత ప్రాతిపదికకి ఏకే చేరుతుంది.

సూడ్‌తేకే - చూస్తే

చేదర్థకానికి తేర్/ గిర్ చేరిస్తే చేదవ్యర్థకం ఏర్పడుతుంది.

**3. పెంగో :**

**ఏ. సమాపక క్రియలు :**

భూతకాల ప్రత్యయం 'త్' ఈ ప్రత్యయం చేరేటప్పుడు చాలా రకాల సంధి మార్పులు వుంటాయి.

హి - ఇచ్చు

ఉణ్ - తాగు

హుడ్ - చూచు

| | | |
|---|---|---|
| ఏకవచనం | - | బహువచనం |
| హుడ్ | - | /అనుభవం/హుడ్ తప్ |
| | | /ఉభయం/ హుడ్ తస్ |
| హుడ్‌తయ్ | | హుడ్ తదెర్ |

**బి. క్త్వార్థకం :**

ప్రత్యయం సి, చి, హి, జి, జి, ఇన్.

అస్సి - పట్టుకొని

కూక్సి - పిలిచి

**సి. భూతధాతుజ విశేణం :**

భూతప్రాతిపదికకి 'ఇ' చేరుతుంది.

ఏంద్‌తి - ఆడిన

వెచ్చి - చెప్పిన

**డి. చేదర్థకం చేదపూర్థకాలు :**

చేదర్థకానికి భూత ప్రాతిపదికకి 'ఇన్' చేరుతుంది.

వాతిన్ - వస్తే

దీనికి 'ప' కూడా చేరిస్తే చేదపూర్థకం అవుతుంది.

**8.4.2. దక్షిణ ద్రావిడ భాషలు :**

**1. తమిళం :**

**ఎ. సమాస క్రియలు :**

భూతకాలిక ప్రత్యయానికి త్, ంత్, త్త్, ఇ - / ఇన్ అనే రూపాంతరాలు వున్నాయి.

ధాతువుకి భూతకాల ప్రత్యయాన్ని చేర్చడం వల్ల భూత ప్రాతిపదిక ఏర్పడుతుంది. భూతప్రాతిపదికే భూతకాలిక క్రియా రూపాలు ఏర్పడడానికి అధారం. దీనికి పురుష ప్రత్యయాలు చేర్చడం వల్ల సమాపక క్రియలు ఏర్పడతాయి. క్వార్థకం, చేదర్థకం, చేదప్యర్థకం, భూత ధాతుజ విశేషణం మొదలైన వాటికి కూడా చాలా భాషల్లో ఇదే ఆధారం.

**1. 'త్' :**

పెయ్ - కురియు /పెయ్‌త్/

**2. ంత్ :**

నట - నడచు /నటంత్/

**3. త్త్ :**

అటి - ఆడుగు /ఆటంకి/

తూంకు - నిద్రపోవు /తూంకి/

**1. ఇ - / న్ :**

అటంకు - అడుగు /అటంకి/

తూంకు - నిద్రపోవు /తూంకి/

**బి. క్వార్థకం :**

భూతప్రాతిపదికే క్వార్థకంగా పనిచేస్తుంది. ఇది హలంతమైతే దీని చివర ఉచ్చాధణార్థకమైన ఉకారం చేరుతుంది.

ఉళుతు - దున్ని

ఉంటు - తిని

ప్రాచీన తమిళంలో వీటితోపాటు ఆఅ, ఊఉ, పు, ఈఇ అనే ప్రత్యయాలు కూడా వున్నాయి.

పుకాఅ / పుక్కు - ప్రవేశించి

కాణూఉ / కంటు - చూచి

**సి. భూతధాతుజ విశేషణం :**

భూత ప్రాతిపదికకి విశేషణ ప్రత్యయమైన 'ఆ' చేర్చడం వల్ల ఇది ఏర్పడుతుంది.

వంత - వచ్చిన

ఉంటి - తిన్న, తాగిన

**డి. చేదర్థక, చేదప్యర్థకాలు :**

సంఘ వాఙ్మయంలో ధాతువుకి 'ఇన్' చేర్చడం వల్ల చేదర్థకం ఏర్పడుతుంది.

కాణిన్ - చూస్తే

వరిన్ - వస్తే

తర్వాత కాలపు భాషలో భూతప్రాతిపదికకి 'ఆల్' చేర్చడం వల్ల చేదర్థకం ఏర్పడుతుంది.

కంటాల్ - చూస్తే

చేదప్యర్థకం చేదర్థానికి 'ఉం' అనే సముచ్చయార్థకం చేర్చడం వల్ల ఏర్పడుతుంది.

కాణిను / కంటాలుం - చూసినా

చెయ్యినం / చేయ్తాలుం - చేసినా

**2. కన్నడం :**

**ఎ. సమాపక క్రియలు :**

భూతకాల ప్రత్యయాలు ద్, త్, ంద్, ఇద్ 'ంద్' చాలా కొద్ది క్రియల్లోనే వస్తుంది. దీని ముందు వాటికి /హ/ అ రూపం వుంటుంది.

**1. ద్ :**

తిన్ - తిను /తింద్/

కొయ్ - నేయు / నెయద్

నెయ్ - నేయు / నెయద్

**2. త్ :**

ఉళ్ - దున్ను /ఉళ్త్/

కాయ్ - కాయు /కాయ్త్/

**3. ంద్ :**

బర్ / బార్ - వచ్చు /బంద్/

తర్ / తార్ - తెచ్చు /తంద్/

**4. ఇద్ :**

మూడు - చేయు /మూడిద్/

కట్టు - కట్టు /కట్టిద్/

**బి. క్త్వార్థకం :**

భూతప్రాతిపదికే క్త్వార్థకంగా పనిచేస్తుంది.

బందు - వచ్చి

సత్తు - చచ్చి

**సి భూతధాతుజ విశేషణం :**

భూత ప్రాతిపదికకి 'అ' చేరుతుంది.

బంద - వచ్చిన

సత్త - చచ్చిన

**డి. చేదర్థకం , చేదప్యర్థకాలు :**

ప్రాచీన కన్నడంలో చేదర్థకానికి భూత ప్రాతిపదికకి 'బడె' చేరుతుంది.

| | | |
|---|---|---|
| పేళ్ దొడె | - | మాట్లాడితే |

ఆధునిక భాషలో 'అరె' చేరుతుంది.

| | | |
|---|---|---|
| బందరె | - | వస్తే |
| బరెదరె | - | రాస్తే |
| బరెదరె | - | రాస్తే |

చేదప్యర్థకం ఏర్పరచటానికి భూత ప్రాదిపాదికకి 'ఆరూ' చేర్చాలి.

| | | |
|---|---|---|
| బందరూ | - | వచ్చినా |
| బరెదరూ | - | రాసినా |

**3. కొడగు :**

**ఏ. సమాపక క్రియలు :**

ధాతువుకి ద్, ంద్, త్, ఇ, చేర్చడం వల్ల భూత ప్రాతిపదిక ఏర్పడుతుంది.

**1. ద్ :**

తిన్ - తిను /తింద్/

బూళ్ - పడు /బుద్ద్/

**2. ంద్ :**

ఆళ - కొలుచు /ఆళంద్/

కర - పితుకు /కరంద్/

**3. త్ :**

నెన - ఆలోచించు /నెనత్/
నెర - నిండు /నెరత్/

**4. ఇ :**

నంబ్ - నమ్ము /నంబి/
ఒద్ - చదువు /ఒది/

**బి. క్త్వార్థకం :**

భూతప్రాతిపదికకి 'ఇతు' చేరుతుంది.

బందితు - వచ్చి
తందితు - ఇచ్చి

**సి. భూతధాతుజ విశేషం :**

భూత ప్రాతిపదికకి 'ఎ' చేరుతుంది. దీని యందు 'ఇ' వైకల్పింగా 'ఇన్' గా మారుతుంది.

బందె - వచ్చిన
మాడినె/మాడియె - చేసిన

**డి. చేదర్థకం :**

భూత ప్రాతిపదికకి 'ఏంగి' చేరుతుంది.

బందేంగి - వస్తే
కాజ్జేంగి - చేస్తే

**8.4.3 ఉత్తర ద్రావిడ భాషలు :**

**1. బ్రాహుయీ :**

భూత ప్రాతిపదిక ఏర్పడడానికి ధాతువుకి అ, ఏ, క్ /నకారం తర్వాత గ్ /, ఇన్ / న్,న్స్ / చేరుతాయి. చాలా ధాతువులకి 'ఆ' చేరుతుంది.

బిన్ - ఏరు /బినా/
తిఖ్ - పెట్టు /తిఖా/

భూత ప్రాతిపదికకి మిగిలిన భాషల్లోలాగా పురుష ప్రత్యయాలు చేరవు. కాని దానికి 'ఆన్' /ఉండు/ అనే సహాయక క్రియ వర్తమాన రూపాలు చేర్చడం వల్ల అర్థ విశేషాలు వస్తాయి.

కున్ - తిను

| ఏకవచనం | బహువచనం |
|---|---|
| కున్గుట్ | కన్గున్ |

ఇందులో ఉంట్, ఉర్ మొదలైనవి 'అన్' అనే క్రియ భూతకాల రూపాలు. బ్రాహుయిలో అసమాపక క్రియారూపాలు లేవు.

**2. మాల్తో :**

**1. సమాపక క్రియలు:**

భూతకాల ప్రత్యయం. చ్, ల్, స్, య్.

| | | | |
|---|---|---|---|
| బర్ | - | వచ్చు | /బర్చ్/ |
| ఓన్ | - | తాగు | /బంఢ్/ |

**2 క్త్వార్థకం :**

ప్రత్యయం ఇ / లె.

| | | |
|---|---|---|
| ఏచి / ఏచ్లె | - | కట్టి |
| బండి / బండ్లె | - | తాగి |

**3. భూతధాతుజ విశేషణం :**

'పె' ధాతువుకి చేరుతుంది.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | బంద్‌పె | - | లాగిన |
| | దర్య్‌పె | - | పట్టుకొన్న |

**3. కురుఖ్ :**

**1. సమాపక క్రియలు :**

మధ్యమ ఉత్తమ పురుషాల్లో కొన్ని క్రియల్లో భూత ప్రత్యయం 'క్', మరి కొన్నింటిలో 'చెక్' ప్రథమ పురుష ప్రత్యయాలు ముందు 'త్' లోపిస్తుంది. 'చెక్' కి బదులు 'చ్' మాత్రం వుంటుంది. ఇవి చేరేటప్పుడు ధాతువుల్లో చాలా రకాల మార్పులు వున్నాయి.

| | | | | |
|---|---|---|---|---|
| ఉదా॥ | ఎన్ | - | పగలగొట్టు | /ఎస్క్/ |
| | ఎర్చ్ | - | వెతుకు | /ఇర్చ్‌క్/ |

**2. క్త్వార్థకం :**

ప్రత్యయం 'ఆర్'

| | | |
|---|---|---|
| చిఅర్ | - | ఇచ్చి |

**3. భూత ధాతుజ విశేషణం :**

ప్రత్యయం 'కా'

కుంద్ర్ కా - పుట్టిన

**గుర్తించుకోవలసిన ముఖ్యాంశాలు**

1. ఈ పాఠంలో భూతకాలిక క్రియారూప నిర్మాణం గూర్చి గమనించండి.
2. ఈ పాఠ్యాంశంలో ఇచ్చిన ఉత్తర ద్రావిడభాషల్లోని భూతకాలిక క్రియా రూప నిర్మాణం గూర్చి అధ్యయనం చేయండి.
3. ఈ పాఠంలో ఇచ్చిన మధ్య ద్రావిడ భాషల్లోని భూతకాలిక క్రియా రూప నిర్మాణం గూర్చి బాగా చదవండి.
4. ఈ పాఠ్యాంశంలో ఇచ్చిన దక్షిణ ద్రావిడ భాషల్లోని భూతకాలిక క్రియా రూప నిర్మాణం గూర్చి జాగ్రత్తగా గమనించండి.
5. విద్యార్థులు సౌలభ్యంకోసం ఈ పాఠంలో క్రియా భేదాల్ని వర్గికరించడం జరిగింది.

**8. మాదిరి పరీక్షా ప్రశ్నలు**

**ఈ క్రింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

1. క్రియాభేదాల్ని గూర్చి విపులీకరించండి.
2. భూతకాలిక క్రియారూప నిర్మాణం గూర్చి రాయండి.

**ఈ క్రింది లఘు ప్రశ్నలకు సమాధానాలు తెలియజేయండి.**

1. ఉత్తర ద్రావిడ భాషలో - భూతకాలిక క్రియ
2. క్రియ - నిర్వచనం
3. వర్తమాన కాల క్రియ
4. మధ్య ద్రావిడ భాషలు - భూతకాలిక క్రియ
5. భవిష్యత్ కాల క్రియ
6. దక్షిణ ద్రావిడభాషలు - భూతకాలిక క్రియ

# 2. వర్తమాన భవిష్యత్ క్రియా రూప నిర్మాణం

**విషయక్రమం :**


**8.2.1** ఉద్దేశం

**8.2.2** వర్తమాన, భవిష్యత్ క్రియా పద నిర్మాణం

**8.2.3** మధ్య ద్రావిడ భాషలు

**8.2..4** దక్షిణ ద్రావిడ భాషలు

**8.2.5** ఉత్తర ద్రావిడ భాషలు

**8.2.6** గుర్తించుకోవలసిన ముఖ్యాంశాలు

**8.2.7** మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 8.2.1 : పరిచయం

ఈ పాఠంలో వర్తమాన కాల క్రియల గూర్చి భవిష్యత్కాలిక క్రియల గూర్చి వివరంగా విపులంగా తెలుసుకుంటారు.

1. భవిష్యత్ కాల క్రియలు.
2. దక్షిణ ద్రావిడ భాషలు - భవిష్యత్కాల క్రియలు
3. ఉత్తర ద్రావిడ భాషలు - భవిష్యత్కాల క్రియలు
4. మధ్య ద్రావిడ భాషలు - భవిష్యత్కాల క్రియలు
5. వర్తమాన కాల క్రియలు
6. మధ్య ద్రావిడ భాషలు -వర్తమాన కాల క్రియలు
7. ఉత్తర ద్రావిడ భాషలు - వర్తమాన కాల క్రియలు
8. దక్షిణ ద్రావిడ భాషలు -వర్తమాన కాల క్రియలు
9. వర్తమాన భవిష్యత్ కాల క్రియలు
10. ఇంకా ఇతర ముఖ్యమైన అంశాల్ని గూర్చి తెలుసుకుంటారు.

## 8.2 : వర్తమాన, భవిష్యత్ క్రియాపద నిర్మాణం :

## 8.3 : మధ్య ద్రావిడ భాషలు

## ఎ. వర్తమాన కాల క్రియలు :

### 1. తెలుగు :

జరుగుతున్న పనిని తెలియజేసేవి వర్తమాన కాలక్రియలు. ధాతువునకు వర్తమాన బోధకమైన 'చు' ప్రత్యయం చేరుతుంది. తర్వాత దానిపై 'ఉన్న' అనే అనుబంధం చేరుతుంది. ఉదా॥ చేయుచున్నాడు, వండుచున్నాడు, చదువుచున్నాడు. అనుబంధం తర్వాత పురుష ప్రత్యయాలు చేరుతాయి. అలాంటప్పుడు ఉన్నానుబంధానికి దీర్ఘం అగమంగా అగుతుంది. 'ది', 'వి' ప్రత్యయాలు పరమైనప్పుడు దీర్ఘం రాదు.

| పురుషాలు | ఏకవచనం | బహువచనం |
|---|---|---|
| ఉత్తరపురుష | నేను వచ్చుచున్నాను | మేము వచ్చుచున్నాము |
| మధ్యమపురుష | వాడు వచ్చుచున్నాడు | వారు వచ్చుచున్నారు |
| | అది వచ్చుచున్నది | అవి వచ్చుచున్నవి |

వర్తమానార్థకం 'చు' వర్ణం ద్రుతాంతం. కాబట్టి ఇక్కడ 'ఉ' కారానికి సంధి వైకల్పికంగా వస్తుంది. పై విసంధియైన రూపాలు సంధిరానప్పుడు ఈ కింది విధంగా రూపాలుంటాయి.

ఉదా॥ వచ్చుచు సున్నాను
వచ్చుచు సున్నాము

మహతీవాచకం ఏక వచనంలో అమహత్తుతోనూ, బహువచనంలో మహత్తులోనూ సామ్యం కలిగి వుంటుంది.

ఉదా॥ అది వచ్చుచున్నది
ఆమె వచ్చుచున్నది
బాలురు వచ్చుచున్నారు
బాలికలు వచ్చుచున్నారు

కొన్ని ధాతువులకు ఈ మూడు కాలాల్లో వున్న రూపాల్ని పరిశీలిద్దాం.

**1. పిలుచు - స్వార్థకం :**

**1. భూతకాలం /పలిచితి/ :**

| పురుషాలు | ఏకవచనం | బహువచనం |
|---|---|---|
| ఉ. పు. | పిలిచితిని | పిలిచితిమి |
| మ. పు. | పిలిచితివి | పిలిచితిరి |
| ప్ర. పు. | పిలిచెను | పిలిచిరి |

**2. వర్తమాన కాలం /పిలుచుచున్నా-/**

| పురుషాలు | ఏకవచనం | బహువచనం |
|---|---|---|
| ఉ. పు. | పిలచుచున్నాను | పిలుచుచున్నాము |
| మ. పు. | పిలుచుచున్నావు | పిలుచుచున్నారు |
| ప్ర. పు. | పిలుచుచున్నా(డు | పిలుచుచున్నారు |
| | పిలుచుచున్నది | పిలుచుచున్నవి |

**3. భవిష్యత్కాలం /పిలువ(గల-/**

| పురుషాలు | ఏకవచం | బహువచనం |
|---|---|---|
| ఉ. పు. | పిలువ(గలను | పిలువ(గలము |
| మ. పు | పిలువ(గలవు | పిలువ (గలరు |

| | | |
|---|---|---|
| ప్ర.పు. | పిలువఁగలఁడు | పిలువఁగలరు |
| | పిలువఁగలదు | పిలువఁగలవు |

**2. పిలుచు - కర్మార్థకం :**

**1. భూతకాలం /పిలువఁబడితి/ :**

| | | |
|---|---|---|
| ఉ. పు. | పిలువఁబడితిని | పిలువఁబడితిమి |
| మ. పు. | పిలువఁబడితిని | పిలువఁబడితిరి |
| ప్ర.పు. | పిలువఁబడెను | పిలువఁబడిరి |

**2. వర్తమానకాలం /పిలువఁబడుచున్నా -/ :**

| | | |
|---|---|---|
| ఉ. పు. | పిలువఁబడుచున్నాను | పిలువఁబడుచున్నాము |
| మ. పు. | పిలువఁబడుచున్నావు | పిలువఁబడుచున్నారు |
| ప్ర. పు. | పిలువఁబడుచున్నాడు | పిలువఁబడుచున్నారు |
| | పిలువఁబడుచున్నది | పిలువఁబడుచున్నవి |

**3. భవిష్యత్కాలం /పిలువఁబడఁగలం-/ :**

| | | |
|---|---|---|
| ఉ. పు. | పిలువఁబడఁగలను | పిలువఁబడఁగలము |
| మ. పు. | పిలువఁబడఁగలవు | పిలువఁబడఁగలరు |
| ప్ర. పు. | పిలువఁబడఁగలఁడు | పిలువఁబడఁగలరు |
| | పిలువఁబడఁగలదు | పిలువఁబడఁగలవు |

**3. తెలియు - ఆత్మనే పదార్థకం :**

**1. భూతకాలం /తెలిసికొంటి -/**

| | | |
|---|---|---|
| ఉ. పు. | తెలిసికొంటిని | తెలిసికొంటిమి |
| మ. పు. | తెలిసికొంటివి | తెలిసికొంటిరి |
| ప్ర. పు. | తెలిసికొనెను | తెలిసికొనిరి |

**2. వర్తమానకాలం / తెలిసికొనుచున్నా -/**

| | | |
|---|---|---|
| ఉ.పు. | తెలిసికొనుచున్నాను | తెలిసికొనుచున్నాము |
| మ. పు. | తెలిసికొనుచున్నావు | తెలిసికొనుచున్నారు |
| ప్ర. పు. | తెలిసికొనుచున్నాఁడు | తెలిసికొనుచున్నారు |
| | తెలిసికొనుచున్నది | తెలిసికొనుచున్నవి |

**3. భవిష్యత్కాలం /తెలిసికొనఁగల -/**

| | | |
|---|---|---|
| ఉ. పు. | తెలిసికొనఁగలను | తెలిసికొనఁగలము |
| మ. పు. | తెలిసికొనఁగలవు | తెలిసికొనఁగలరు |
| ప్ర. పు. | తెలిసికొనఁగలఁడు | తెలిసికొనఁగలరు |
| | తెలిసికొనఁగలదు | తెలిసికొనఁగలవు. |

**1. తెలియు-ఆత్మనేపది-కర్మార్థకం :**

**1. భూతకాలం /తెలిసికొనఁబడితి-/**

| | | |
|---|---|---|
| ఉ. పు. | తెలిసికొనఁబడితిని | తెలిసికొనఁబడితిమి |
| మ. పు. | తెలిసికొనఁబడితివి | తెలిసికొనఁబడితిరి |
| ప్ర. పు. | తెలిసికొనఁబడెను | తెలిసికొనబడిరి |

**2. వర్తమానకాలం /తెలిసికొనఁబడుచున్నా -/**

| | | |
|---|---|---|
| ఉ. పు. | తెలిసికొనఁబడుచున్నాను | తెలిసికొనఁబడుచున్నాము |
| మ. పు. | తెలిసికొనఁబడుచున్నావు | తెలిసికొనఁబడుచున్నారు |
| ప్ర. పు. | తెలిసికొనబడుచున్నాఁడు | తెలిసికొనఁబడుచున్నారు |
| | తెలిసికొనబడుచున్నది | తెలిసికొనఁబడుచున్నవి. |

**3. భవిష్యత్కాలం /తెలిసికొనఁబడఁగల -/**

| | | |
|---|---|---|
| ఉ. పు. | తెలిసికొనఁబడఁగలను | తెలిసికొనఁబడఁగలము |
| మ. పు. | తెలిసికొనఁబడఁగలవు | తెలిసికొనఁబడఁగలరు |
| ప్ర. పు. | తెలిసికొనఁబడఁగలఁడు | తెలిసికొనఁబడఁగలరు |
| | తెలిసికొనఁబడఁగలదు | తెలిసికొనఁబడఁగలవు |

**బి. భవిష్యత్కాలిక క్రియలు**

జరగబోయే పనిని తెలియజేసేవి భవిష్యత్కాలిక క్రియలు.

ఉదా॥ చేయగలను

చూడగలను

చదవగలను

ధాతువుయొక్క నుజ్యంత రూపానికి 'కల' అనేది ఆగమంగా అవుతుంది. దీనిపైన పురుష ప్రత్యయాలు చేరుతాయి. 'విను' ధాతువునకు నజ్యంత రూపం 'వినన్' అనేది. దీనికి పైన 'కల' అని వచ్చినప్పుడు ద్రుతకార్యం కాగా వినగల, వినంగల అని అవుతుంది. అప్పుడు పురుష ప్రత్యయాలు చేరుతాయి. అమహదర్థంలో ప్రథమ పురుషకు ఏకవచనంలో 'దు' అనీ, బహువచనంలో 'వు' అని ప్రత్యయాలు వస్తాయి.

| పురుషాలు | ఏకవచనం | బహువచనం |
|---|---|---|
| ఉత్తమపురుష | నేను వినగలను | మేము వినగలము |
| మధ్యమపురుష | నీవు వినగలవు | మీరు వినగలరు |
| ప్రథమ పురుష | వాడు వినగలడు | వారు వినగలరు |
| | అది వినగలదు | అవి వినగలవు |

## 2. గోండీ :

### ఎ. వర్తమాన భవిష్యత్కాలం :

హలంతాల్లో 'ఆంత్', అజంతాల్లో 'ంత్'

సూడ్ - చూచు

| ఏకవచనం | బహువచనం |
|---|---|
| సూడాంతోన్ | సూడాంతోం |
| సూడాంతీ | సూడాంతీట్ |
| పురుషం. సూడాంతోర్ | సూడాంతేర్ |
| పురుషేతరం. సూడాంతా | సూడాంతాజ్ |

### బి. భవిష్యత్కాలం :

ఉత్తమ మధ్యమ పురుషాల్లో 'క్', ప్రథమ పురుష అమనుష్యైక వచనంలో 'ఆర్', మిగిలిన వాటిలో 'ఆన్'.

ఆట్ - వండు

| ఏకవచనం | | బహువచనం |
|---|---|---|
| అట్కా | /అనుభయం/ | అట్కోం |
| | /ఉభయం/ | అట్కాట్ |
| అట్కీ | | అట్కీట్ |
| పురుషం. అట్టానూర్ | | అట్టావీర్ |
| పరుషేతరం. అట్టార్ | | అట్టానూజ్ |

### సి. శత్రర్థకం :

ప్రత్యయాలు సేర్, చేర్, జేర్.

| | | |
|---|---|---|
| వాచ్చేర్ | - | పాడుతూ |
| తొహ్చేర్ | - | చూపెడ్తూ |
| ఉంజేర్ | - | తాగుతూ |

**డి. తద్ధర్మ ధాతుజ విశేషణం :**

వాల్ ప్రత్యయం చేరిన కృదంతమే తద్ధర్మధాతుజ విశేషణంగా వుపయోగపడుతుంది.

వెహ్వాల్ మాయ్‌నాల్ - చెప్పే మనిషి

**3. కొండ:**

**ఎ. వర్తమానకాలం :**

ప్రత్యయం సిన్, జిన్

కి - చేయు

| ఏకవచనం | | బహువచనం |
|---|---|---|
| కిజిన | /అనుభయం/ | కిజినప్ |
| | /ఉభయం/ | కిజినట్ |
| కిజిని/ద్/ | | కిజినిదెర్ |
| పురుషం. కిజినన్ | | కిజినె |
| పురుషేతరం. కిజినద్ | | కిజినె |

**బి. భవిష్యత్కాలం :**

ప్రత్యయం 'న్'

త - తెచ్చు

| ఏకవచనం | | బహువచనం |
|---|---|---|
| తన | /అనుభయం/ | తనప్ |
| | /ఉభయం/ | తనట్ |
| తని /ద్/ | | తనిదెర్ |
| పురుషం. తనన్ | | తనర్ |
| పురుషేతరం. తనద్ | | తనె |

**సి. తద్ధర్మ ధాతుజ విశేషణం :**

భవిష్యత్కాల ప్రాదిపదికకి 'ఇ' చేరుతుంది.

డూని - దున్నే

గూర్ని - నిద్రపోయే

**8.4 : దక్షిణ ద్రావిడ భాషలు :**

ప్రాచీన కాలంలో వర్తమాన కాలాన్నీ భవిష్యత్కాలాన్నీ సూచించడానికి ద్రావిడ భాషల్లో ఒకే ప్రత్యయం వుండేది. తర్వాత కాలంలో భవిష్యత్కాలిక క్రియల కంటె భిన్నమైన వర్తమానకాలిక క్రియారూపాలు ఏర్పడ్డాయి. తుళు, కోలామ్ మొదలైన భాషల్లో వర్తమానకాలిక ప్రత్యయాలకీ, భవిష్యత్కాలిక ప్రత్యయాలకీ మధ్య ఇప్పటికీ స్వల్పభేదం మాత్రమే వుంది. చాలా భాషల్లో వర్తమాన

కాలిక క్రియలు అనేక శబ్దయుక్త నిర్మాణాలు. ఒకే శాఖకు చెందిన భాషల్లో కూడా వర్తమాన కాలిక రూపాలు అర్వాచీనాలని మనం చెప్పవచ్చు. భవిష్యత్కాలిక రూపాలు తద్ధర్మార్థాల్ని కూడా సూచిస్తాయి.

**1. తమిళం :**

**ఎ. వర్తమాన కాలం :**

సంఘ వాఙ్మయానికి తర్వాత కాలంలో దీనికి ప్రత్యయం 'కిన్ఱ్' అయితే 14వ శతాబ్ది నించి దీనిలో నకారం లోపించి 'కిఱ్' అనే రూపాంతరం కూడా ఏర్పడింది. ప్రస్తుతం లిఖితభాషలో అమహద్బహువచనంలో 'కిన్ఱ్' వాడుతారు. మిగిలిన చోట్ల 'కిన్ఱ్', 'కిఱ్' రెండూ వాడుతారు.

| | |
|---|---|
| చేయ్ - | చేయు |
| ఏకవచనం | బహువచనం |
| చెయ్ /న్/ ఱేన్ | చెయ్కి /న్/ ఱోం |
| చెయ్ /న్/ ఱాయ్ | చెయ్కి /న్/ ఱీర్ /కళ్/ |
| పురుషం. చెయ్కి /న్/ ఱున్ | మ. చెయ్కి /న్/ ఱార్/ కళ్/ |
| స్త్రీ. చెయ్కి /న్/ ఱాళ్ | |
| అమ. చెయ్కి /న్/ ఱతు | చెయ్ కిన్ ఱన్ |

మధ్యకాల తమిళంలో ధాతువుకి 'ఆ' ప్రత్యయం చేర్చి దానికి 'నిల్' /నిలచు/, కిల /పండివుండు/, 'ఇరు' /వుండు/ అనే క్రియల్లో ఒక దాని భూతకాలిక రూపాన్ని చేర్చడం వల్ల కూడా వర్తమాన కాలం సూచించండబడేది.

ఉదా॥ చేయ్యానిన్ ఱాన్ - చేస్తున్నాడు.

**బి. భవిష్యత్కాలం :**

లఘు క్రియల్లో ప్రత్యయం వ్, ఇది అనునాసిక తర్వాత 'ప్' గా మారుతుంది. గురుక్రియల్లో 'ప్ప్' /ల్/ళ్ + ప్ప్ ఱ్ప్/ట్ప్/ . అమనుష్యైక వచన బహువచనాల్లో లఘు క్రియల్లో 'ఉయ్', గురుక్రియల్లో 'క్కుయ్'.

సంఘ వాఙ్మయం 'ఉమ్', 'క్కుమ్' లు వున్న రూపాలు పురుషైక వచన, స్త్రీ లింగైక వచన, అమనుష్య బహువచనాల్లో కూడా వుండేవి. కొన్ని క్రియలు అకర్మకార్థంలో లఘు క్రియలు గానూ, సకర్మకార్థంలో గురు క్రియలుగానూ వుంటాయి.

ఉదా॥ చేర్వేన్ - చేరతాను
చేర్ప్పేన్ - చేరుస్తాను

**2. మలయాళం :**

**ఎ. వర్తమాన కాలం :**

ప్రత్యయం 'ఉన్'

చెయ్యున్ను - చేస్తున్నాను

**బి. భవిష్యత్కాలం :**

ప్రత్యయం 'ఉం'

వరుం - వస్తాను

**సి. వర్తమాన ధాతుజ విశేషణం :**

ధాతువు + ఉన్ + అ - చెయ్యున్న - చేస్తున్న

నటక్కున్న - నడుస్తున్న

**డి. తద్ధర్మ ధాతుజ విశేషణం :**

ధాతువు + ఉం -అజియం - తెలిసే

వరుం - వచ్చే

**3. తొద :**

**ఏ. వర్తమాన భవిష్యత్కాలం :**

ద్వితీయ ప్రాతిపదికకి పురుష ప్రత్యయాలు చేర్చడం వల్ల ఇది ఏర్పడుతుంది.

కియ్ - /కిస్/ - చేయు

| ఏకవచనం | | బహువచనం |
|---|---|---|
| కిస్పిని | /అనుభయం/ | కిస్పిమి |
| | /ఉభయం/ | కిస్పుమి |
| కిస్పి | | కిస్‌త్‌శి |
| /అస్నీ/కిస్తి | | |

**బి. భవిష్యత్కాలం :**

ప్రత్యయం 'క్'

కియెకిన్ - చేస్తాను

**సి. తద్ధర్మ ధాతుజ విశేషణం :**

ధాతువుకి త్ / త్ చేరుతుంది.

నడ్‌త్ - నడిచే

పొద్‌త్ - వచ్చే

**8.5 : ఉత్తర ద్రావిడ భాషలు**

**1. బ్రాహుయీ :**

**ఏ. వర్తమాన కాలం :**

ప్రత్యయాల ఇ, ఏ. 'ఇ' కి ప్రథమ పురుషైక వచనంలో రూపాంతరం 'ఎ'

బిన్ - విను

| ఏకవచనం | బహువచనం |
|---|---|
| బినివ్ | బినిన్ |
| బినిస్ | బినిరె |
| బినె | బినిరె |

వర్తమాన భవిష్యత్కాలరూపాలుసై వాటిలో హలంతాలకి అకారం చేర్చడం వల్ల ఏర్పడతాయి.

బినిప - వింటున్నాను/వింటాను

మధ్యమ పురుష బహువచనం రెండింటిలోనూ సమానమే. ప్రథమ పురుషైక వచనం చివరి 'ఎ' కి బదులు 'ఇన్' వస్తుంది.

బినిక్ - వింటున్నాడు /వింటోంది.

**బి. భవిష్యత్కాలం :**

ప్రత్యయం 'ఒ'.

| ఏకవచనం | బహువచనం |
|---|---|
| బినొట్ | బినొన్ |
| బినొస్ | బినొరె |
| బిన్నొ | బినొర్ |

**సి. శత్రర్థకం :**

ఇస, బిసిన - వండుతూ

కరిస - చేస్తూ

**డి. తద్ధర్మ ధాతుజ విశేషణం : 'ఒక్'**

బినొక్ - వినే

పారొక్ - చెప్పే

**2. మాల్తో :**

**ఎ. వర్తమానకాలం :**

ప్రత్యయాలు 'న్', 'ఇ', న కారం మధ్యమ పురుష , ప్రథమ పురుష మనుష్య బహువచనాల్లో వుంటుంది.

బి. భవిష్యత్కాలం : 'ఒ'

| ఏకవచనం | | బహువచనం |
|---|---|---|
| బందొన్ | /అనుభయం/ | బందొం |
| | /ఉభయం/ | బందొత్ |

బందొ బందొర్

పురుష. బందొహ్ మ. బందొర్

పురుషే. బందొద్

**సి. శత్రర్థకం :**

ప్రత్యయాలు నె/లె/ఇ/ఎ.

బంద్నె/బంద్లె/బందిబందె -లాగుతూ

**డి. తద్ధర్మధాతుజ విశేషణం :**

ప్రత్యయం 'ఉ'.

బజు - కొట్టే

**3. కురుఖ్ :**

**ఏ. వర్తమానకాలం :**

ప్రత్యయం 'ద్'. దీని రూపాంతరమైన 'న్' మనుష్య బహువచనంలో వుంటుంది.

ఎస్ - పగలగొట్టు

| ఏకవచనం | | బహువచనం |
|---|---|---|
| ఎస్దన్ /ఎస్ఏన్/ | /అనుభయం/ | ఎస్దం /ఎస్ఏం/ |
| | /ఉభయం/ | ఎస్దత్ |
| ఎస్దయ్ /ఇస్ది/ | | ఎస్దర్ /ఎస్దయ్/ |
| పు. ఎస్దస్ | | మ. ఎస్నర్ /ఎస్సయ్/ |
| పురుషే. ఇస్ఇ | | |

**బి. భవిష్యత్కాలం :**

ప్రత్యయం 'ఒ'.

| ఏకవచనం | బహువచనం |
|---|---|
| ఎస్బన్ | /అనుభయం/ఎస్ఒం |
| | /ఉభయం/ ఎస్బత్ |
| ఎస్బయ్ | ఎస్బర్ |
| పు. ఎస్బస్ | ఎస్బర్ |
| పురుషే. ఎస్ఒ | |

**సి. శత్రర్థకం :**

ప్రత్యయం నూ / నుం, ఎన్నూ.

ఎన్నూం - పగలగొడుతూ

**డి. తద్ధర్మ ధాతుజ విశేషణం :**

ప్రత్యయం 'ఊ'

ఇసూ - పగలగొట్టే

అభ్యాసం - 1

## 8.6 గుర్తించుకోవలసిన ముఖ్యాంశాలు

ఈ పాఠంలో వర్తమాన కాలిక క్రియా రూప నిర్మాణం గూర్చి బాగా అధ్యయనం చేయండి.

ఈ పాఠ్యాంశంలో ఇచ్చిన భవిష్యత్ క్రియా రూప నిర్మాణం గూర్చి జాగ్రత్తగా చదవండి.

ఉత్తర ద్రావిడ భాషలు

దక్షిణ ద్రావిడ భాషలు

మధ్య ద్రావిడ భాష

విద్యార్థులు సౌలభ్యంకోసం ఈ పాఠంలో వర్తమాన, భవిష్యత్ కాలక్రియలు ఇచ్చాం. వీటిని జాగ్రత్తగా గమనించండి.

## 8.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

విద్యార్థులు ఈ కింది విషయాల్ని జాగ్రత్తగా గమనించండి.

**1. ఈ కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

1) వర్తమాన కాల క్రియలు గూర్చి విపులీకరించండి.

2) భవిష్యత్కాల క్రియలు గూర్చి విశదీకరించండి.

**2. ఈ కింది లఘు ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

1) దక్షిణ ద్రావిడ భాషలు

2) ఉత్తర ద్రావిడ భాషలు

3) మధ్య ద్రావిడ భాషలు.

# 3. ద్రావిడ భాషల్లో ధాతుప్రత్యయ స్వభావం

ద్రావిడ భాషల్లోని ధాతువు  నిష్పాదక ప్రత్యయం (Derivative) ఈ రెండింటికీ వున్న భేదం తెలుసుకోవడం అవసరం. సోదర ద్రావిడ భాషల్లో వున్న సజాతి పదాల (Congnates)  లో మొదటి కొన్ని వర్ణాలే తుల్యంగా వుంటాయి. ఇలా అన్ని భాషల్లోనూ తుల్యంగా వున్న వర్ణ సముదాయాన్ని ధాతువు అంటారు.

ధాతువులో వర్ణాలు తుల్యంగా లేకపోయినా కొన్ని భాషల్లో నియతమైన ధ్వని పరిణామాలు పొంది వుండవచ్చు. ధాతువు తర్వాత వున్న వర్ణ సముదాయాన్ని నిష్పాదక ప్రత్యయం అంటారు. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో నిష్పాదక ప్రత్యయం లేకుండా కేవలం ధాతువు మాత్రమే వుండవచ్చు.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | తమిళం | : | ఎలి |
| | మలయాళం | | |
| | కోత | : | ఎయ్జ్ |
| | కన్నడం | : | ఎలి, ఇలి |
| | తెలుగు | : | ఎలుక |
| | పర్జి | : | ఎల్ |
| | బ్రాహుయి | : | ఆల్ |

పై ఉదాహరణను బాగా పరిశీలించిన ఎల్ అనేది అన్ని భాషల్లోనూ వుంది. కాబట్టి ఇందులో అదే ధాతువు అన్న మాట. ఇందులోని 'ల' కాలం కోత భాషలో 'జ' కారంగా మార్పుచెందింది. ఎ కారం కన్నడం 'ఇలి' లో ఇ కారంగాన, బ్రాహుయిలో ఆ కారంగాను మారింది. ఈ మార్పులు ఈ భాషల్లో నియతమైనవే కాబట్టి ఎల్ -ని ధాతువుగా పరిగణించడానికి ఇవి ప్రతిబంధకాలు కావు.

ఎల్ - తర్వాత వున్న తమిళం, మలయాళం, కన్నడం 'ఇ' , కోత 'య్' , తెలుగులో 'ఉక' నిష్పాదక ప్రత్యయాలు. పర్జీ, బ్రాహుయి భాషల్లో ధాతువు మాత్రమే వుంది. నిష్పాదక ప్రత్యయం లేదు. దీనిని బట్టి అన్ని భాషల్లోనూ తుల్యంగా వుండే ధాతువునే మూలద్రావిడ భాషలో వుండేది అని తులనాత్మక పరిశీలన లోనే చెప్పవచ్చు.

ద్రావిడ భాషా కుటుంబంలోని ధాతువుల్ని వాటి స్వరూపాన్నిబట్టి ఆరు విధాలుగా భాషావేత్తలు వర్గీకరించారు. అవి ఇవి:

1. /హ/ అ
2. /హ/ ఆ
3. /హ/ ఆహ
4. /హ/ ఆహ
5. /హ/ ఆహహ
6. /హ/ ఆహహ

## 4. పురుష బోధక క్రియా ప్రత్యయాలు:

ద్రావిడ భాషా క్రియల్లో పురుష ప్రత్యయాలు వాటికి సంబంధించిన సర్వనామాల్ని పోలివుంటాయి.

1. ఉత్తమ పురుష ఏకవచనం : ఎన్, ఏన్

ఇది బ్రాహుయీ తప్ప మిగిలిన అన్ని భాషల్లోనూ వుంది.

2. ఉత్తమ పురుష బహువచనం : ఏం, ఎం

దీని ప్రతిరూపాలు అన్ని ద్రావిడ భాషల్లోనూ వున్నాయి.

3. ఉత్తమ పురుష బహువచనం (ఉభయం)

అనుభయార్థక ప్రత్యయంకంటె భిన్నమైన ఉభయార్థక ప్రత్యయం కోత, తొద, కన్నడం, తెలుగు, గోండీ,కొండ, పెంగొ, కుండ, కూలు, కులి, పర్జీ, కొడుగ్, మాల్తో భాషల్లో వుంది.
మధ్యమ పురుషైకవచనం:

ఆయ్, ఇ

తెలుగు, కోలామీ, నాయక్, పర్జీ, గదబ, బ్రాహుయీలు తప్ప మిగిలిన అన్ని భాషల్లోనూ వీటి ప్రతిరూపాలు వున్నాయి.
మధ్యమ పురుష బహువచనం : ఈర్

గోండీ తప్ప మిగిలిన అన్ని భాషల్లోనూ దీని ప్రతి రూపాలు వున్నాయి.

## స్త్రీలింగైక వచనం : ఆళ్, అళ్

ఇది దక్షిణ శాఖాది మాత్రమే వుంది. ఈ ప్రత్యయం మొదట్లో ఆళ్ స్త్రీ అనే ప్రత్యేక పదం.
మనుష్యబహువచనం : ఆర్

లింగభేదం నశించిన తోద తప్ప మిగిలిన అన్ని భాషల్లోనూ (బ్రాహుయితో సహా) దీని ప్రతిరూపాలు వున్నాయి.
పురుషేతరైకవచనం/ అమనుష్యైకవచనం: (అ) త్

దీని ప్రతి రూపాలు అన్ని దక్షిణ శాఖా భాషల్లోనూ తెలుగు, కొండ, పెంగో, మండ, కోలామీ, నాయక్, కొడుగ్, మాల్తోల్లోనూ వున్నాయి. ఇది దీనికి సంబంధించిన సర్వనామమైన అత్‌కి చాలా సన్నిహితం.

అమనుష్యబహువచనం(పురుషేతరబహువచనం): అవ్

మూల ద్రావిడంలో అమనుష్య బహువచనం తెలుగు తప్ప మిగిలిన మధ్య భాషల్లో పురుషేతరబహువచనంగా మారింది. మిగిలిన భాషల్లో దీని అర్థంలో మార్పులేదు.

# 5. తద్ధర్మార్థక, వ్యతిరేక క్రియలు

**విషయసూచిక**


**8.5.0** ఉద్దేశం

**8.5.1** పరిచయం

**8.5.2** ద్రావిడ భాషలు - వ్యతిరేక క్రియానిర్మాణం

**8.5.3** మధ్య ద్రావిడ భాషలు

**8.5.4** దక్షిణ ద్రావిడ భాషలు

**8.5.5** ఉత్తర ద్రావిడ భాషలు

**8.5.6** గుర్తించుకోవలసిన ముఖ్యాంశాలు

**8.5.7** మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 8.0 : ఉద్దేశం

ఈ పాఠ్యాంశం చదివిన తర్వాత మీరు ఈ కింది అంశాల్ని తెలుసుకుంటారు.

ఆర్థబోధక క్రియలు - రకాలు

ద్రావిడ భాషలు - వ్యతిరేక క్రియా నిర్మాణం

ఉత్తర ద్రావిడ భాషలు

దక్షిణ ద్రావిడ భాషలు

మధ్య ద్రావిడ భాషలు

ఇంకా ఇతర ప్రధాన ప్రత్యేక విశేషాల్ని తెలుసుకోవటం

## 8.1 : పరిచయం

### ఆర్థబోధక క్రియలు :

ఆర్థబోధక క్రియలు అర్థాన్ని బోధిస్తాయి. ఆర్థబోధక క్రియలు ఇవి.

1. తద్ధర్మాద్యర్థక క్రియలు
2. వ్యతిరేకార్థక క్రియలు
3. ప్రార్థనాద్యర్థక క్రియలు
4. వ్యతిరేక ప్రార్థనాద్యర్థక క్రియలు
5. ఆశీర్వాద్యర్థక క్రియలు
6. విధి క్రియా రూపాలు

**తద్ధర్మాద్యర్థక క్రియలు :**

తత్ - ధాతువు యొక్క ధర్మ - స్వభావమైన, ఆర్థకం - అర్థాన్ని తెల్పేది. సందర్భాన్నిబట్టి భూత భవిష్యత్ వర్తమాన కాలాలు మూడింటిలో దేనినైనా తెలియజేసేది తద్ధర్మార్థక క్రియలు. ఉదా॥ చాకలి బట్టలు ఉతుకును /భవిష్యత్/.

తద్ధర్మాద్యర్థకంలో ధాతువునకూ, పురుష ప్రత్యయానికి నడుచు 'దు' వర్ణం అదనంగా వస్తుంది. ప్రథమైకవచనంలో 'డు' వర్ణానికి బదులుగా 'ను' వర్ణం ప్రత్యయంగా వస్తుంది. దానికి పూర్వ 'దు' వర్ణంవ కలుగుదు.

| పురుషాలు | ఏకవచనం | బహువచనం |
|---|---|---|
| ఉత్తమపురుష | చేయుదును | చేయుదుము |
| ఉత్తమపురుష | చేయుదువు | చేయుదురు |
| ప్రథమ పురుష | చేయును | చేయుదురు |

'వచ్చు' మొదలైన ధాతువుల యొక్క 'న' కారం మీది 'ద' కారంతో కలిసి 'త' కారంగా మారుతుంది. అప్పుడు రూపాలు ఈ కింది విధంగా వుంటాయి.

| పురుషాలు | ఏకవచనం | బహువచనం |
|---|---|---|
| ఉత్తమ పురుష | వత్తును | వత్తుము |
| మధ్యమ పురుష | వత్తువు | వత్తురు |
| ప్రథమ పురుష | వచ్చును | వత్తురు |

ఇక్కడ 'ద' కారానికి ముందు ద్విత్వచకారం వున్నది కాబట్టి ద్విత్వతకారం గలిగింది.

'ద' వర్ణానికి బదులుగా 'ఎద' అనేది ఆగమంగా వస్తుంది. 'ద' వర్ణానికి ప్రథమైన వచనంలో ఈ ఆగమం రాదు.

| పురుషాలు | ఏకవచనం | బహువచనం |
|---|---|---|
| ఉత్తమ పురుష | చదివెదను | చదివెదము |
| మధ్యమ పురుష | చదివెదవు | చదివెదరు |
| ప్రథమ పురుష | చదువును | చదివెదరు |

ఇత్వం కానీ ఎత్వంకానీ వున్నప్పుడు ధాతువు యొక్క అనాద్యమైన ఉత్వానికి ఇత్వం వస్తుంది. అంచేతనే చదువ + ఎదను - చదివెదను అని అయింది. ఇదే విధంగా తక్కిన రూపాలు వుంటాయి.

ప్రథమ పురుషలో విని, ఎడు, అనేవి ఆగమాలుగా వుంటాయి ఇవి ఎడి ఉభయ రచనాల్లోనూ 'ను' మాత్రమే కలుగుతుంది ఇ కారం మీది సువర్ణకం 'ని' గా మారుతుంది.

| | | |
|---|---|---|
| ఉదా॥ | అది వచ్చెడిని | అది వచ్చెదును |
| | వాడు వచ్చెడివి | వాడు వచ్చెదును |
| | అవి వచ్చెడిని | అవి వచ్చెదును |
| | వారు వచ్చెడిని | వారు వచ్చెదును |

మధ్యమ పురుష 'వ' కారానికి లోపం వైకల్పికంగా అగుతుంది.

ఉదా॥ చేయుదువు చేయుదు

| | |
|---|---|
| వత్తువు | వత్తు |
| చేసెదవు | చేసెదు |

## 2. వ్యతిరేకార్థక క్రియలు :

పని జరగని దానిని తెలపేవి వ్యతిరేకార్థక క్రియలు. ధాతువునకూ, ప్రత్యయానికి మధ్య 'ఆ' వర్ణం అదనంగా వస్తుంది. అమహద్వాచకం కర్త అయినప్పుడు ప్రథమపురుష ఏకవచనంలో 'దు' అనీ, బహువచనంలో 'వు' అనీ ప్రత్యయాలు వస్తాయి.

ఉదా॥

| పురుషాలు | ఏకవచనం | బహువచనం |
|---|---|---|
| ఉత్తమ పురుష | చేయను | చేయము |
| మధ్యమ పురుష | చేయవు | చేయరు |
| ప్రథమ పురుష | చేయడు | చేయరు |
| | చేయదు | చేయవు |

## 3. ప్రార్థనాద్యర్థకం :

ప్రార్థనాన్ని కానీ, విధినికానీ తెలిపేది ప్రార్థనాద్యర్థక క్రియలు. మధ్యమ పురుష క్రియలు ప్రార్థనాద్యర్థకాలు అవుతాయి. ఏకవచనంలో 'వు' ప్రత్యయానికి బదులుగా 'ము' ప్రత్యయమూ, బహువచనంలో 'రు' ప్రత్యయానికి బదులుగా బిందుపూర్వక 'డు' వర్ణం వాడుతారు.

| | ఏకవచనం | బహువచనం |
|---|---|---|
| ప్రార్థనం | రక్షింపుము | రక్షింపుడు |
| విధి | వ్రాయుము | వ్రాయుడు |

'విధి' లో ధాతువునకు 'అది' అనేది చేరుతుంది. అలాంటప్పుడు పురుష ప్రత్యయాలు చేరవు. తన్ను తాను విధించుకొనుట సాధారణంగా జరగదు. కాబట్టి ఉత్తమ పురుషలో 'అది' తోడి విధ్యర్థకం కన్పించదు.

| పురుషాలు | ఏకవచనం | బహువచనం |
|---|---|---|
| మధ్యమ పురుష | నీవు వచ్చునది | మీరు వచ్చునది |
| ప్రథమ పురుష | వాడు వచ్చునది | వారు వచ్చునది |
| | అది వచ్చునది | అది వచ్చునది |

## 4. వ్యతిరేక ప్రార్థనాద్యర్థక క్రియలు :

ఇది ప్రార్థనాద్యర్థక క్రియలకు వ్యతిరేక రూపం. కాబట్టి ఇది కూడ మధ్యమ పురుష క్రియ అయి వుంటుంది. ధాతువునకూ, మధ్యమ ప్రత్యయాలకూ /ము, డు/ నడుమ 'అకు' అనేది అదనంగా చేరుతుంది.

| | ఏకవచనం | బహువచనం |
|---|---|---|
| | చేయు + అకు | చేయుకు + ము - చేయుదము |
| మ.పు. | చేయుకుము | చేయకుడు |

**5. ఆశీర్యాద్యర్థక క్రియలు :**

ఆశీస్సులోనూ, శాపంలోనూ, క్రియా రూపం ఆశీర్యాద్యర్థకం అవుతుంది. మధ్యమ పురుషలోనూ, ప్రథమ పురుషలోనూ, ఉభయ వచనంలోనూ ఎడమ, తన్ను, అన్న, ప్రత్యయాలు ధాతువుకు చేరతాయి. ఉత్తమ పురుషలో ఆశీశ్శాపాలు సాధారణంగా వుండవు. కాబట్టి పై ప్రత్యయాలతోడు రూపం ఉత్తమ పురుషలో వుండవు.

| | ఏకవచనం | బహువచనం |
|---|---|---|
| మధ్యమపురుష | ప్రసన్నుడుయ్యెడను | ప్రసన్నులరయ్యెడును /ఆశీస్సు/ |
| | రాక్షసుడు వయ్యెడును | రాక్షసుల రయ్యెడును /శాపం/ |
| | ప్రసన్నుడనగుతిని | ప్రసన్నులరగుతను /ఆశీస్సు/ |
| | రాక్షసుడవగుతను | రాక్షసులరగుతను /శాపం/ |

| | ఏకవచనం | బహువచనం | |
|---|---|---|---|
| ప్రథమ పురుష | శభము కల్గెడును | శుభములు కల్గెడును | /ఆశీస్సు/ |
| | కీడు కలిగెడును | కీళ్ళు కలిగెడును | /శాపం/ |
| | శుభముకల్గుతను | శుభములు కల్గుతను | /ఆశీస్సు/ |
| | కీడు కల్గుతను | కీళ్ళు కల్గుతను | /శాపం/ |

**6. విధి క్రియారూపాలు :**

విధికి సంబంధించిన క్రియలు. విధి క్రియా రూపాలు.

ఉదా॥ నీవు నా వెంటరా
నీవులే

**8.5.2. : ద్రావిడ భాషలు - వ్యతిరేక క్రియా నిర్మాణం :**

ద్రావిడ భాషల్లో క్రియా పదాల్లో వ్యతిరేక ప్రత్యయం వుండటం ఒక ప్రత్యేకత. వ్యతిరేక ప్రత్యయంతో సమాపక క్రియలూ, వ్యతిరేక క్త్వార్థకమూ, వ్యతిరేక ధాతుజ విశేషణమూ, వ్యతిరేక నామమూ, వ్యతిరేక విధ్యర్థకాలూ వున్నాయి. వీటన్నింటిలో వ్యతిరేక రూపాలు కూడా ఏక శబ్ద నిర్మాణంగా వున్నాయి. వీటిలో భూత ప్రత్యయం వ్యతిరేక ప్రత్యయం తర్వాత వుంటుంది.

**8.5.3 : మధ్య ద్రావిడ భాషలు :**

**1. తెలుగు :**

**ఎ. సమాపక క్రియలు :**

వ్యతిరేక ప్రత్యయం 'ఆ' దీర్ఘాచ్చుతో అంతమయ్యే క్రియల తర్వాత ఇది లోపిస్తుంది. రాడు, లేడు, కాడు, తేడు మొ॥

| | ఏకవచనం | బహువచనం |
|---|---|---|
| | చెప్పను | చెప్పం |
| | చెప్పవు | చెప్పరు |
| పురుష | చెప్పడు | మ. చెప్పరు |
| పురుషే | చెప్పదు | అమ. చెప్పవు |

ప్రాచీన భాషలో ఇది భూతకాలానికి కూడా వర్తిస్తుంది. ప్రాచీన భాషలో భూత కాలార్థంలో భూతకాలికమైన 'అగు' ధాతువు అనుప్రయుక్తమవుతుంది.

రాడయ్యెను

తమున్నర్థకానికి 'లేదు' చేరడం వల్ల కూడా భూతకాలిక వ్యతిరేకం వ్యక్తమవుతుంది.

రాలేదు

వర్తమాన కాల వ్యతిరేకానికి భావార్థకానికి 'లేదు' చేరుతుంది.

వచ్చుట / రావటం లేదు

### బి. వ్యతిరేక క్త్వార్థకం :

అక, చెయ్యక, రాక.

### సి. వ్యతిరేక ధాతుజ విశేషణం : అని

చెయ్యని, రాని

### డి. వ్యతిరేకనామా : అమి, చూడమి, రామి.

ఆధునిక భాషలో వ్యతిరేక క్త్వార్థకానికి 'పోవు' భావార్థకం చేరుతుంది.

చూడకపోవడం, రాకపోవడం.

### 2. గోండీ :

### ఎ. సమాపక క్రియలు :

వ్యతిరేక ప్రత్యయం మధ్యమ పురుషలో 'వ్' మిగిలిన చోట్ల 'ఓ'

తిన్ - తిను

| | ఏకవచనం | బహువచనం |
|---|---|---|
| | తిన్వోవ్ | తిన్వోం |
| | తిన్వీ | తిన్విట్ |
| పు. | తిన్వోర్ | తిన్వేర్ / తిన్మూర్ |
| పురుషే. | తిన్వో | తిన్వోజ్ |

**బి. వ్యతిరేక క్వార్థకం : వాక్**

సూడ్‌వాక్ - చూడకుండా

3. మండ :

**ఎ. భూతేతర వ్యతిరేకం :**

ప్రత్యయం వ్, ఊ.

| | |
|---|---|
| ట్రక్ - | కొట్టు |
| ఏకవచనం | బహువచనం |
| ట్రకూ | ట్రకూజ్ |
| ట్రక్వి | ట్రక్విర్ |
| పు. ట్రకూన్ | ట్రక్విర్ |
| పురుషే ట్రకూద్ | ట్రక్విజ్ |

**బి. భూత వ్యతిరేకం :**

ధాతువు + ప /వ్యతిరేకం/ + త్ /భూతం/ + పు. ప్ర.

హర్ - వెళ్లు

| | |
|---|---|
| ఏకవచనం | బహువచనం |
| హల్పతు | హల్పతుజ్ |
| హల్పతి | హల్పతిర్ |
| హల్పతున్ | హల్పతిర్ |
| హల్పఇ | హల్పతిజ్ |

**8.5. 4 : దక్షిణ ద్రావిడ భాషలు**

**1. తమిళం :**

**ఎ. సమాపక క్రియలు :**

ప్రథమ పురుష అమనుష్యైక వచన బహువచనాల్లో ప్రత్యయం 'అ'. మిగిలిన పురుష ప్రత్యయాల్లో ఇదిలోపిస్తుంది. దీని తర్వాత అమనుష్య బహువచన ప్రత్యయం లోపిస్తుంది. ఈ రూపాలు భూతేతికాలంలో వ్యతిరేకతని సూచిస్తాయి.

కాణ్ - చూచు

| | |
|---|---|
| ఏకవచనం | బహువచనం |
| కాణేన్ | కాణేన్ / కాణోం |
| కాణాయ్ | కాణీర్ / కళ్/ |
| పు. కాణాన్ | మ. కాణార్ /కళ్/ |

స్త్రీ . కాణాళ్

అమ. కాణాతు కాణా

ఆధునిక భాషలో అన్ని క్రియలకి ఇలాంటి రూపాలు అమనుష్యైక వచనంలో మిగిలివున్నాయి.

చెయ్యాతు చెయ్యదు

వరాతు రాదు

మిగిలిన చోట్ల తుమ్మున్నర్థక రూపంలోవున్న ప్రధాన క్రియకి 'మాట్టు' అనే సహాయక క్రియ వ్యతిరేక రూపాలు చేరుతాయి.

చెయ్యమాట్టేన్ - చెయ్యను

## బి. సంఘ వాఙ్మయంలో వ్యతిరేక క్రియలు :

సంఘ వాఙ్మయంలో 'ఆల్' - కాకుండా వుండు, 'ఇల్' లేకుండా వుండు అనే వ్యతిరేక క్రియలు అన్ని పురుష వచనాలలోనూ వున్నాయి. 'ఆల్' రూపాలు పేరు ధాతువుకి చేరినప్పుడు భూతేతర కాలంలో వ్యతిరేకతని సూచిస్తాయి. 'ఇల్' రూపాలు వేరు ధాతువు క్త్వార్థక రూపానికి చేరి భూతకాలంలో వ్యతిరేకతని సూచిస్తాయి.

## సి. వ్యతిరేక క్త్వార్థకం :

'ఆ', 'ఆతు', 'ఆయల్'.

చెయ్యా, చెయ్యాతు, చెయ్యామల్ - చెయ్యకుండా

## డి. వ్యతిరేక ధాతుజ విశేషణం :

'ఆ' , 'త'.

చెయ్యా, చెయ్యాత - చేయని

## ఇ. వ్యతిరేక నామం :

ధాతువు + ఆ /వ్యతిరేకం/ + మై /కృత్తు/

చెయ్యామై - చేయక పోవడం

## 2. మలయాళం :

## ఎ. సమాపక క్రియలు :

ప్రాచీన మలయాళంలో అటియోం -/ఎరగము/ మొదలైన లోప ప్రత్యయ సహితరూపాలు వున్నాయి. ఇవి కాక చెయ్యాలాంటి 'ఆ' ప్రత్యయ సహిత రూపాలు అన్ని పురుష వచనాల్లోనూ వున్నాయి. ఈ రెండూ కాక 'ఆయ్' వ్యతిరేక ప్రత్యయం తర్వాత కాల ప్రత్యయమూ, పురుష ప్రత్యయమూ వున్న సమాపక క్రియలు కూడా ప్రాచీన భాషలో వున్నాయి.

**వర్తమానకాలం :** కాణాయిన్ను - చూడడంలేదు

**భూతకాలం :** వరాఞ్ఞు - రాలేదు

**భవిష్యత్కాలం :** ప్రాచీన భాషలో 'ఆతు' నేటి భాషలో 'ఆతె'

ఉణ్ణాతె - తినకుండా

**సి. వ్యతిరేక ధాతుజ విశేషణం :**

భూతకాలంలో 'ఆజ్జ'. కాణాఇఇ

భూతేతర కాలంలో 'ఆత్త'. కాణాత్త - చూడని

**డి. వ్యతిరేక నామం :**

ధాతువు నామం :

ధాతువు + ఆయ్ /వ్యతిరేకం/ + క /కృత్తు/

చెయ్యాయ్క - చేయకపోవడం

**3. కన్నడం :**

**ఎ. సమాపక క్రియలు :**

ప్రథమ పురుషా మనుష్యైక వచన బహువచనాల్లో వ్యతిరేక ప్రత్యయం 'అ' మిగిలినచోట్ల లోపం.

నోడు - చూచు

| | | |
|---|---|---|
| | ఏకవచనం | బహువచనం |
| | నోడెం/నోడె/ను/ | నోడెం/నోడెవు |
| | నోడయ్ / నోడె | నోడిర్ / నోడిరి |
| పు. | నోడం / నోడ /ను/ | మ. నోడర్ / నోడరు |
| స్త్రీ. | నోడళ్ / నోడళు | |
| అ.మ. | నోడదు | నోడమ |

ఆధునిక భాషలో ఇది వ్యాప్తిలో లేదు. దీనికి బదులు భూతకాలంలో తమున్నర్థ కానికి ఇల్ల /లేదు/ చేరే నిర్మాణం వుంది.

నోడలిల్ల - చూడలేదు

భూతేతర కాలంలో ధాతుజ విశేషణ నామానికి 'ఇల్ల' చేరుతుంది.

బరుపదుఇల్ల - రాను

**బి. వ్యతిరేక క్త్వార్థకం : 'అదె'**

ఇరదె - అదె ఉంది

సి. వ్యతిరేక దాతుజ విశేషణం : 'అద్'. 'అ'.

మాడద - చెయ్యని

కరెయద - పిలవని

### 8.5.5 : ఉత్తర ద్రావిడ భాషలు :

### 1. బ్రాహూయీ :

### ఏ. భూతేతర వ్యతిరేకం :

వ్యతిరేక ప్రత్యయం 'ప'. అచ్చుల ముందు ప్రథమ పురుషైక వచనంలో దీనిలో 'అ'కారం లోపిస్తుంది.

| | |
|---|---|
| తిఖ్ - | పెట్టు |
| ఏకవచనం | బహుబచనం |
| తిఖ్‌పర్ | తిఖ్‌పన్ |
| తిఖ్‌పేస్ | తిఖ్‌పేరె |
| తిఖ్‌ప్ | తిఖ్‌పస్ |

### బి. భూతవ్యతిరేకం :

ఇందులో ప్రాచీన భూత ప్రాతిపదిక నిలిచి వుంది. ఇది ధాతువుకి భూత ప్రత్యయమైన 'త్' చేర్చడం వల్ల ఏర్పడుతుంది. దీనికి 'అన్' అనే క్రియ భూతేతర

వ్యతిరేక రూపాలు కొన్ని మార్పులతో చేరడం వల్ల భూత వ్యతిరేకం ఏర్పడుతుంది.

| ఏకవచనం | బహువచనం |
|---|---|
| తిఖ్‌తపట్ | తిఖ్‌తవన్ |
| తిఖ్‌తపేస్ | తిఖ్‌తవేరె |
| తిఖ్‌తవ్ | తిక్‌తవస్ |

### 2. మాల్తో :

ఈ భాషలో ఏక శబ్ద నిర్మాణం గల వ్యతిరేక క్రియా రూపాలు లేవు. వ్యతిరేకతగా సూచించే పదం 'మల' /లేదు, కాదు/

| | | |
|---|---|---|
| అదెన్‌మల | - | నేను ఏరను |
| అదెంమల | - | మేం ఏరం |

### 3. కురుఖ్ :

ఈ భాషలో కూడా ఏక శబ్ద నిర్మాణం గల వ్యతిరేక క్రియా రూపాలు లేవు. వ్యతిరేకతని సూచించడానికి మల్/ మాల్/ మల్ ? ఆ /లేదు, కాదు/ అనే పదం ఉపయోగపడుతుంది.

మల్ కెరస్, మల్ కబస్ - వాడు వెళ్ళలేదు, వెళ్ళడు

'మల్' /- లేకుండా ఉండు / అనే క్రియ భూతభవిష్యత్కాలాల్లో వుంది.

| | | |
|---|---|---|
| ఈస్ ఎంబస్ మల్యస్ | - | ఈయన మా తండ్రి కాదు |
| ఈర్ కుడ్ ఖార్‌మల్యర్ | - | వీళ్ళు కూడుఖ్ జాతివాళ్ళు కారు |

ఉత్తర ద్రావిడ భాషల్లోని మాల్తో, కురుఖ్ భాషల్లో తప్ప మిగిలిన దక్షిణ దేశ భాషలన్నింటిలోనూ వ్యతిరేక ప్రత్యయంగల ఏకశబ్ద నిర్మాణం వుంది. మధ్య ద్రావిడ భాషల్లోని తెలుగు, గోండీ భాషల్లో తప్ప మిగిలిన అన్ని మధ్య ద్రావిడ భాషల్లోనూ భూత వ్యతిరేకానికి ఏకశబ్ద నిర్మాణం వుంది.

## 8.5.6 గుర్తించుకోవలసిన ముఖ్యాంశాలు

1. ఈ పాఠంలో ఇచ్చిన వ్యతిరేక క్రియా నిర్మాణం గూర్చి అధ్యయనం చేయండి.
2. అర్థబోధక క్రియలు గూర్చి గమనించండి
3. ఉత్తర ద్రావిడ భాషలు
4. దక్షిణ ద్రావిడ భాషలు
5. మధ్య ద్రావిడ భాషలు
6. విద్యార్థులు సౌలభ్యం కోసం ఈ పాఠ్యాంశంలో క్రియల్ని వర్గీకరించడం జరిగింది.

## 8.5.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు :

విద్యార్థులు ఈ కింది విషయాల్ని జాగ్రత్తగా గ్రహించాలి.

1. ఈ కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

ఎ. అర్థబోధక క్రియల్ని వాటిలోని భేదాల్ని గూర్చి విపులీకరించండి ?

బి. ద్రావిడ భాషల్లోని వ్యతిరేక క్రియా నిర్మాణం గూర్చి విశదీకరించండి?

2. ఈ కింది లఘు ప్రశ్నలకు సమాధానాలు తెలియజేయండి.

ఎ. ఉత్తర ద్రావిడ భాషలు - వ్యతిరేక క్రియలు

బి. మధ్య ద్రావిడ భాషలు - వ్యతిరేక క్రియలు

సి. దక్షిణ ద్రావిడ భాషలు - వ్యతిరేక క్రియలు.

## ఆధార గ్రంథాలు :

1. ఆంధ్ర భాషా చరిత్ర వల 1,2, భాగాలు - డా॥ బిలుకూరి రామారావు
2. ఆంధ్ర భాషా వికాసం - ఆచార్యగంటిజోగి సోమయాజి
3. దక్షిణ దేశ భాషాసారస్వరులు -ఆచార్య కోదాడ రామకృష్ణయ్య
4. ద్రావిడ భాషలు - ఆచార్య గంటిజోగి సోమయాజి
5. ద్రావిడ భాషలు - ఆచార్య డి.యస్. సుబ్రహ్మణ్యం
6. ద్రావిడ భాషా పరిశీలనము 1,2, భాగాలు : శ్రీ వజ్ఝ లచిన సీతారామయ్య
7. తెలుగు భాషా చరిత్ర - డా॥ వెలమల సిమ్మన్న.

**- డా॥ వి. సిమ్మన్న**

పాఠం - 9

# ఆర్యద్రావిడ భాషల పరస్పర ప్రభావం

## పాఠ్యాంశ నిర్మాణక్రమం :

9.1 ఆర్యద్రావిడ భాషల సంబంధం
9.1 ధ్వనులు
9.2 పదజాలం
9.3 సంధి
9.4 సమాసరచన
9.5 నామవాచకాలు
9.6 సర్వనామాలు
9.7 సంఖ్యావాచకాలు
9.8 విభక్తులు
9.9 లింగం,వచనం
9.10 అవ్యయం
9.11 కృదంతాలు
9.12 తద్ధితాలు
9.13 వ్యాకరణం
9.14 క్రియలు
9.15 ఛందస్సు
9.16 వాక్యం
9.17 ఇతరాలు

## లక్ష్యం :

సంస్కృతాది ఆర్య భాషలమీద ద్రావిడ భాషలు ఎలాంటి ప్రభావాన్ని చూపాయో, అదే విధంగా ఆర్య భాషలు ద్రావిడ భాషలు ఎలాంటి ప్రభావాన్ని చూపాయోపరిశీలించటం ఈ పాఠ ప్రధాన లక్ష్యం.

## 9.1.0 ఆర్య ద్రావిడ భాషల సంబంధం :

క్రీ.పూ. 3000 సంవత్సరాల నాటకే భారతదేశంలో ద్రావిడలనే ఒక జాతి ప్రజలు ఉన్నారని, వారి భాష ఎంతో అభివృద్ధి చెందిన భాష అనీ, వ్యవసాయకంగానూ, సంస్కృతీపరంగానూ ఎంతో అభివృద్ధి చెందారనీ చరిత్రకారులు చెబుతున్నారు. క్రీ.పూ.1500 ప్రాంతంలో ఆర్యులు భారతదేశంలో ప్రవేశించటం పరస్పరం జరిగిన యుద్ధాలలో ద్రావిడుల ఓటమి, ఆర్యుల విజయం సంబంవించాయని కూడా చరిత్రకారులు చెబుతున్నారు. ఓడిపోయిన ద్రావిడులు పీఠభూముల నుంచి తరిమివేయబడి

వింధ్యపర్వతాలకు ఈ వలి ప్రాంతమయిన దక్షిణ ప్రాంతానికి ప్రధానంగా పరిమితమయినా మిగిలిన ఉత్తరాది ప్రాంతంలో కూడా మిగిలిపోయారు. సహజంగానే యుద్ధాలలో ఒకరు విజేతలు మరొకరు విజితులు కావడం సహజం. విజేతలు విజితులు మీద అన్ని రంగాలలోనూ ఆధిపత్యం చలాయిస్తారు. అంటే విజేతల ప్రభావం విజితులుమీద చాలా ఉంటుంది. అయినా విజితుల ప్రభావం కూడా అంతో ఇంతో విజేతల మీద కూడా ఉండకపోదు.

రెండుగాని అంతకన్నా ఎక్కువ భాషలుగాని ఒకే ప్రదేశంలో వాడుకలో ఉన్నప్పుడు ఆభాషలు ఒకదాని వల్ల మరొకటి ప్రభావితం అవుతాయనేది అందరికీ తెలిసిన విషయమే. ఇలాంటి ప్రభావం ఆభాషలు భిన్న భాషా కుటుంబాలకు చెందిన వయినా సరే ప్రముఖంగానే ఉంటుంది. ఇలా రెండు విభిన్న భాషా కుటుంబాలకు చెందిన భాషలు ఒకే ప్రదేశంలో ఉండి పరస్పర ప్రభావానికిలోనవుతయానుకున్నాం కదా. ఇలా ఉన్నపుడు ఈ ప్రదేశాన్ని "Linguistic Area' అంటారు. ఇలాంటి పరిస్థితి రెండు అంతకంటే ఎక్కువగా ఉన్నప్పుడు దీనిని బహుభాషాప్రదేశం అంటారు. భారదేశానికి సంబంధించినంతవరకు అప్పటికే ఆస్ట్రో-ఏషియాటిక్ భాషా కుటుంబానికి చెందిన ముండారీ భాషను మాట్లాడే ప్రజలు ఉండటంచేత భారతదేశాన్ని బహుభాషా ప్రదేశం. Inddia as a Linguistic Area అనవచ్చు. ద్రావిడ భాషలలో ఉన్న ఎన్నో ప్రత్యేక లక్షణాలు ఆ భాషలని మిగిలిన భాషల నుంచి వేరు చేస్తున్నాయి. ద్రావిడభాషల తులనాత్మకవ్యాకరణ పితామహుడయిన రాబర్టు బిషప్ కాల్డ్వెల్ ద్రావిడ భాషలకీ సంస్కృతానికీ జన్యజనక సంబంధం లేదని నిరూపించడానికి ఈ క్రింది లక్షణాలను పేర్కొన్నాడు. వాటిని పరిశీలించుదాం:

## 9.1 ధ్వనులు :

మూల ద్రావిడ భాషలో 26 వర్ణాలు మాత్రమే ఉండగా సంస్కృతాది ఆర్యభాషల మూలంగా అవి 50 నుంచి 55 వరకు పెరిగాయి. ప్రధానంగా ఋ, ౠ, : ఖ, ఘ, ఛ, ఝ, ఠ, ఢ, థ, ధ, ఫ, భ, శ, ష మొదలయిన వర్ణాలు ద్రావిడ భాషలలోకి వచ్చిచేరాయి. అలాగే మూల ద్రావిడ భాషలలో లేని నాదస్పర్శాలు గజడదబలు తమిళంలో తప్ప మిగిలిన ద్రావిడ భాషలలో ఉన్నాయి. పూర్వంలేని ధ్వనులు ఇప్పటి ద్రావిడ భాషలలోకి రావటానికిగల కారణం సంస్కృత భాషా ప్రభావమే. అదేవిధంగా హిందీ మొదలయిన ఆధునిక ఔత్తరాహిక భాషల ప్రభావంతో ఫ తెలుగాది భాషలలో చేరింది. ద్రావిడ భాషలలో సంయుక్తాక్షరాల్ని విడగొట్టి రాయడం ఉంది. ఇది ద్రావిడ భాషల ప్రత్యేక లక్షణం. కాగా సంస్కృత భాషా ప్రభావంతో ద్రావిడ భాషల్లో సంయుక్తాక్షర రచన చోటు చేసుకొంది.

ఇక ద్రావిడ భాషల్లో ప్రచురచమయిన మూర్ధన్యధ్వనులు ట, డ, ణ, ళ సంస్కృతాది ఆర్యభాషల్లోకి ప్రవేశించాయి. ఒక్క సంస్కృతం దానికి సంబంధించిన ఔత్తరాహిక భాషలలో తప్ప ఇండో-యూరోపియన్ భాషల్లో మూర్ధన్యధ్వనులు లేవు.

తెలుగు భాషల్లో దంత్యచజలున్నాయి. ఇవి ఆర్య భాషలయిన మరాఠీ, కాశ్మీరీ భాషలలో కూడా ఉన్నాయి. ఈ భాషలలో ఉన్న చ జ లు ద్రావిడ భాషల ప్రభావంతో వెళ్ళి చేరినవేనని భాషావేత్తల అభిప్రాయం. సంయుక్తాక్షరాలు సయితం ద్రావిడ భాషల్లో పదాదిలో ఉండవు. పదమధ్యంలోని సంయుక్తాక్షరాలు ద్రావిడభాషల్లో స్వరభక్తివల్ల విడగొట్టడంకాని, వర్ణ సమీకరణం పొంది ద్విత్వాక్షరం అవడంగానీ జరుగుతుంది. ప్రాకృతంలో కనిపించే ఈ భాషా లక్షణం ద్రావిడభాషల ప్రభావమే.

సంస్కృతాది ఆర్య భాషల్లో ప్రకృతి భావ నివారణార్థం సంధ్యక్షరాలు రావు. ద్రావిడ భాషల్లో ప్రకృతి భావ నివారణకు య ద వ అనే ధ్వనులు సంధ్యక్షరాలుగా రావటం ఉంది. ఈ విషయంలో ద్రావిడభాషల ప్రభావం ఆర్యభాషల మీద ఉంది. ప్రకృతిభావ నివారణ ప్రాకృతంలో ఉంది.

సంస్కృత 'కతి' > ప్రాకృత 'క ఇ' కయి

## 9.2 పదజాలం :

సహజంగానే ఇండో-యూరోపియన్ భాషా కుటుంబంలోని సంస్కృతం నుంచి ద్రావిడభాషల్లోకి లెక్కలేనంత పదజాలం ప్రవేశించింది. (అయితే తమిళభాషదీనిని చాలా వరకు నివారించింది) తెలుగు, మలయాళ, కన్నడ భాషల్లోకి తత్సమ, తద్భవాలనే రెండు విధాలుగా పదాజాలం వచ్చిచేరింది. పైన పేర్కొన్న మూడు భాషలలో తత్సమాల ఎక్కువ వచ్చిచేరగా తమిళంలో మాత్రం 'తొల్కాప్పియమ్' తత్సమాలను తీసుకురాకూడదని శాసించడం చేత వికృతిరూపాలు ఎక్కువ కనిపిస్తాయి.

ఉ: చైత్రము : చిత్తరమ్
సీసమ్ : ఈయమ్
గార్దభ : కఴుదై

వ్యక్తినామాలలోనూ అంతే

రామ : ఇరామన్
లక్ష్మణ : ఇలక్కుమన్
లంకేశ్వర : ఇలంకీశ్వరన్

అంతేగాక ఆధునికి ఔత్తరాహిక భాషలయిన హిందీ, మరాఠీ, ఒరియా మొదలయిన భాషల నుంచి కూడా అనేక పదాలు ఈ భాషలలో ప్రవేశించాయి.

ఇక విజతుల భాషయిన ద్రావిడ భాష నుంచి కూడా ఎన్నో పదాలు వైదిక సంస్కృతంలోనూ, లౌకిక సంస్కృతంలోనూ ఉన్నట్లు భాషావేత్తలు కనుగొన్నారు. ఋగ్వేదంలోనే ఉలూఖల, కటుక, కుండ, ఖల, దండ, పిండ, బల, బిల, మయూర, కాంచిక, కానన, తాళ, బిడాల, శవ, నీర, బిడాల, హేరంబ, కాక, కుంతల.... ఇత్యాది సమారు 750 పదాలున్నట్లు బరో, ఎమెనో మొదలయిన పాశ్చాత్య పండితులు పేర్కొన్నారు.

ప్రాకృత భాషలో క్రీ.శ. 1వ శతాబ్దిలో హాలుడు సంకలనం చేసినగాధా సప్తశతిలో తెలుగు భాషాపదాలతో రూపాసామ్యం, అర్థసామ్యం ఉన్నవి. కనిపిస్తాయి.

ఉదా: కరణి, అత్తా, పొట్టి, పాడి, పిలూఆ, బోణ్ణీ మొ॥లి.

అలాగే ప్రాకృతంలో మరోకవి హేమచంద్రుడు రాసిన దేశినామమాలలో కూడా ద్రావిడ భాషా పదాలున్నట్లుగా పరిశోధకులు చెప్పారు.

ఉ : ఉడిదో 'మాషాధాన్యం'
పసిండీ 'కనకం'
పుల్లీ 'వ్యాఘ్ర'
ఊరో 'గ్రామః'

## 9.3 సంధి :

ద్రావిడ భాషలలో పరరూప సంధి సహజసిద్ధమయిన ప్రక్రియ. సంస్కృతభాషలోని సంధి విధానం. ద్రావిడ భాషలమీద ప్రసరించింది.

సంస్కృత భాషలో పరరూపసంధిలేదు. సంస్కృతంలో సవర్ణదీర్ఘ, గుణ, వృద్ధి, యణాదేశసంధులున్నాయి. ఇవి ద్రావిడ భాషలకు సహజంకాదు. సంస్కృతంలోని సంధివిధానం తెలుగులో ఎలా ఉంటుందో చూడండి.

ఉ: 1) రామ + అయ్య = రామాయ్య (స.దీ.సంధి) రామయ్య (తెలుగు పరరూప సంధి)

2) మహ + ఈశ్వర = మహేశ్వర (గుణసంధి) మహీశ్వర (తెలుగు)

3) దొంగ + ఎక్కడ = దొంగైక్కడ (వృద్ధి సంధి) దొంగెక్కడ (తెలుగు)

4) కాకునూరి + అప్పకవి = కాకునూర్యప్పకవి (యణాదేశ సంధి) కాకనూరప్పకవి (తెలుగు)

వెయ్యి సంవత్సరాలకు పయిగా తెలుగు కవులు సంస్కృత సాహిత్యాన్ని అనుకరించారు. అనుకరిస్తున్నారు. అందుచేత సంస్కృత భాషా ప్రభావానికి ఎంతగానో తెలుగు భాషలోనయింది. తమిళం దీనికి పూర్తివిరుద్ధం. ఈ భాషలో సంస్కృత సంధులు కానరావు.

## 9.4 సమాస రచన :

ద్రావిడ భాషలలో చిన్నచిన్న పదాలలతో సమాసాలు ఉంటాయి. రెండు లేదా మూడు పదాల కంటే ఎక్కువ ఉండవు.

సంస్కృత భాషలో సమాసరచన ఎంతో దీర్ఘమయింది. అనేక పదాల కలయిక సంస్కృతాది ఆర్య భాషలలో ఉంటుంది. సంస్కృత భాషా ప్రభావంతో దీర్ఘ సమాసరచన తెలుగు, కన్నడ, మలయాళాది భాషలలో కనిపిస్తుంది. అయితే ఆ పదాలన్నీ సంస్కృత సమాసాలే. చూడండి.

ఉ : 1. అటజని కాంచె భూమిసురుడంబర చుంబి శిరస్సరజ్ఝరీపటల నిర్ముహుర్లుఠదభంగ తరంగ మృదంగ నిస్వనస్ఫుటనటనానుకూల ......

2. కాంచెన్ వైష్ణవుడర్థయోజన జటాఘాటోత్థశాఖోపశాఖోపశాఖంచద్ఘాట......

సంస్కృతభాషలో ఉన్న కర్మదారయ, తత్పురుష, ద్వంద్వ, ద్విగు, బహు వ్రీహి మొదలయిన సమాసాలు ఉన్నవి ఉన్నట్లుగా తెలుగు, కన్నడ, మలయాళాది ద్రావిడ భాషల్లోకి వచ్చిచేరాయి.

మలయాళ కన్నడ భాషలలో సంస్కృతంలో ఉన్న దీర్ఘ సమాస రచన తెలుగులో కంటే ఎక్కువగా చోటుచేసుకుంది. అదేవిధంగా మలయాళ భాషలో ఉన్న 'మణి ప్రవాళశైలి' (సంస్కృతం, మలయాళ రెండూ కలసి ఉన్న రచన) ద్రావిడ భాషల మీద సంస్కృత భాషా ప్రభావం ఎలాంటిదో పట్టి చూపుతుంది.

## 9.5 నామవాచకాలు :

నామవాచకాల విషయంలో కూడా సంస్కృతాది ఆర్యభాషల ప్రభావం తెలుగాది ద్రావిడ భాషలమీద ఎంతో ఉంది. సంస్కృతభాషలోని నామవాచకాలు ఎన్నో తెలుగు భాషలోకి వచ్చిచేరాయి. ఈ విషయాన్ని గమనించిన తెలుగు వైయాకరణులు వీటి కోసం ఒక ప్రత్యేక పరిచ్ఛేదాన్నే కెటాయించారు. కొన్నింటికి తెలుగు ప్రత్యయాలు చేర్చి, కొన్నింటికి అవి కూడా చేర్చకుండాయధాతథంగానూ తీసుకోవడం జరిగింది.

ఉ: రామః - రాముడు

హరి - హరి

శ్రీ - శ్రీ
లతా - లత
వృక్షః - వృక్షము
ధేనుః - ధేనువు

## 9.6 సర్వనామాలు :

'సర్వనామం' అనే పదమే సంస్కృత లక్షణ గ్రంధాలనుంచి తెలుగాది ద్రావిడ భాషలలోకి ప్రవేశించింది. సర్వ, విశ్వ, అన్య, ఇతర, పూర్వ, పర, ఉత్తర, దక్షిణ, అపర, స్వ, అస్మత్, భవత్ మొదలయిన అనేక సర్వనామాలు సంస్కృతం నుంచి తెలుగు, కన్నడ, మలయాళది ద్రావిడ భాషల్లో వచ్చిచేరాయి.

సంబంధబోధక సర్వనామ రచనా విధానం ద్రావిడ భాషలకు సహజంకాదు. ఒక వేళ అలాంటి సందర్భాలు వచ్చినప్పుడు క్రియాజన్యవిశేషణాలు వాడారు.

ఉదా: సంస్కృతం : యదిచ్ఛసి తత్కురు
తమిళం : ఎద్దైవిరుంబిరియో అద్దైసెయ్
మళయాళం : ఏదువేణమో అదుచెయ్
కన్నడం : యావదన్ను ఇచ్ఛుసుత్తియో అదన్నుమూడు
తెలుగు : ఏది ఇష్టమో దాన్ని చెయ్యి.

ద్రావిడ భాషల్లో ఉత్తమ పురుష బహువచనంలో రెండు సర్వనామరూపాలున్నాయి. మధ్యమ పురుష సర్వనామాన్ని కలుపుకున్న మనం (We Inclusive), మధ్యమ పురుష సర్వనామాన్ని కలుపుకోని మేం (We exclusive) అనేవి.ఇవి ద్రావిడ భాషలలో మాత్రమే ఉన్నాయి.

| | | ఏ.వ. | బ.వ. |
|---|---|---|---|
| ఉదా : | తెలుగు | ఏను, నేను | మనం, మేం |
| | తమిళం | నాన్ | నాంగళ్ |

ఇలాంటి సర్వనామాలు సంస్కృతం, ఇతర ఇండో - యూరోపియన్ భాషలలో లేకపోయినా ఆధునిక ఔత్తరాహిక భాషలయిన హిందీ, గుజరాతీలలో కనిపిస్తోంది. అయితే దీనికి కారణం ద్రావిడభాషల ప్రభావమే.

ఉదా : హిందీ : హమ్ (మనం) అపన్ (మేం)
గజరాతీ : అమే (మనం) ఆపణీ (మేం)

## 9.7 సంఖ్యావాచకాలు :

సంఖ్యావాచకాలు ఏ భాషలో అయినా ప్రాధమిక పదజాలం (Basic Vocabulory) కోవలోకి వస్తాయి. భాషలో ఇతర అంశాలు మార్పు చెందినా ఇవి మాత్రం మారవు. ద్రావిడ భాషల్లో సంఖ్యావాచకాలు ఒక్క తెలుగు తప్ప మిగిలిన వాటిలో 'నూరు' కంటే ఎక్కువ లేవు. తెలుగులో దీనికి సమానంగా వంద అనే పదం ఉంది. అయితే ఇది సంస్కృతభాషలోని బృంద - మంద - వంద గా ప్రాక్షతంలో మారి ప్రాకృతం నుంచి తెలుగులోకి వచ్చిచేరింది. అందుకే తెలుగులో తొంభై తొమ్మిది తరువాత కొంత

మంది వంద అన్నప్పటికీ వందా ఒకటి, వందా రెండు అనకుండా నూట ఒకటి, నూట రెండు.... అంటారు. అంటేదీని ప్రథమిక రూపం నూరు అనేది తేటతెల్లమేకదా.

ఒక్క తెలుగులో మాత్రం వెయ్యి, వేయి పదాలు (పెంగో, మండ, అవూత్, ఆవె), కొన్నింటిలో మూడు (బ్రాహూఈ) ఆపయిన బెలూచీ, గోండీలో 7 దాకా ద్రావిడ పదాలు అక్కడ నుంచి మరాఠీ పదాలూ ఉన్నాయి. కుఇ, కువిలలో కూడా 1,2 సంఖ్యావాచకాలకు మాత్రమే ద్రావిడ పదాలు ఆ తరువాత ఒరియా పదాలు, కురుఖ్‌లో 4 దాకా ద్రావిడ పదాలు ఆ పైన హిందీ పదాలు ఉన్నాయి.

కొన్ని ద్రావిడ భాషలలో రెండు (పెంగో, మండ, అవూత్, ఆవె) కొన్నింటిలో మూడు (బ్రాహూఈ), ఆపయిన బెలూచీ పదాలు, గోండీలో 7 దాకా ద్రావిడపదాలు అక్కడ నుంచి మరాఠీ పదాలు ఉన్నాయి. కుఇ, కువిలలో కూడా 1,2 సంఖ్యావాచకాలకు మాత్రమే ద్రావిడపదాలు ఆ తరువాత ఒరియాపదాలు, కురుఖ్‌లో 4 దాకా ద్రావిడపదాలు ఆపయిన హిందీ పదాలు ఉన్నాయి.

తెలుగులో 20, 30 మొదలయిన సంఖ్యలకి పదాలు 10 రూపానికి 2,3,4 మొదలయిన వాటి విశేషణ రూపాలు ముందు చేర్చడం వల్ల ఏర్పడతాయి. పదిపయిన ఉండే అంకెలు (సున్న ఉన్నవి కాక మిగిలినవి) సున్న ఉన్న అంకె తరువాత 1,2,3 మొదలయిన పదాలు చేర్చడం వల్ల ఏర్పడతాయి.

సంస్కృత భాషలో సంఖ్యావాచక నిర్మాణం విస్తృత మయినది. ఆ భాషలో లక్ష, కోటి వరకు ఉన్నాయి. ఇవి ద్రావిడ భాషల్లోకి ఎరవుతెచ్చుకున్న పదాలు.

పది తర్వాత వచ్చే సంఖ్యా వాచకాలలో ద్రావిడ భాషలలో నిర్మాణానికి, సంస్కృతాది ఆర్యభాషల నిర్మాణానికి తేడా కొట్టోచ్చినట్లు కనిపిస్తుంది. ఉదాహరణకు సంస్కృతంలో ఒకట్లు... వచ్చిన తర్వాత పదులు .... వస్తాయి. ద్రావిడ భాషలలో పదులు ..... వచ్చిన తర్వాత ఒకట్లు ..... వస్తాయి.

| | | |
|---|---|---|
| ఉ: | సంస్కృతం | తెలుగు |
| | ద్వాత్రింశత్ | ముప్పయ్ రెండు |
| | చతుష్షష్టి | అరవయ్ నాలుగు |

## 9.8 విభక్తులు :

ద్రావిడ భాషల్లో ప్రాతిపదికే ప్రథమ ఏక వచన రూపంగా ఉంటుంది. ఈ భాషల్లో ప్రథమా విభక్తికి వేరే ప్రత్యయాలు ఉండవు. ఈ ప్రథమా ఏకవచన రూపమే విభక్త్యంగంగా ఉంటుంది.

| | | | |
|---|---|---|---|
| ఉదా: | ప్రాతిపదిక | పథమరూపం | ప్రథమేతర విభక్త్యంగరూపం |
| | తల్లి | తల్లి | తల్లిని, తల్లికి |
| | గుడి | గుడి | గుడిని, గుడికి |

సంస్కృత భాషలో ప్రథమా విభక్తికి వేరే ప్రత్యయాలు ఉన్నాయి. ప్రథమ రూపమే విభక్త్యంగంగా ఉండడానికి ఈ భాషలో వీలుపడదు.

ఉదా: రామ - రామమ్ - రామేణ

(సంస్కృత భాషలో మరొక ప్రత్యేకత ఉంది. విభక్తులు ఏక, బహువచనాలలోనే గాక ద్వివచనంలో కూడా ఉంటాయి. ద్రావిడ భాషలలో ఈ ద్వివచనం అనేది ఉండదు.)

ద్రావిడ భాషల ప్రభావం వల్ల హిందీలో కూడా నామవాచకం మీద

ఉదా: రామ్ - రామ్‌సే - రామ్‌కో

ద్రావిడ భాషల్లోలాగా ఆధునిక ఔత్తరాహిక భాషలలో కూడా నామవాచకం మీద బహువచనం చేరిన తర్వాతనే విభక్తి ప్రత్యయం చేరుతుంది. ఇది ద్రావిడ భాషల ప్రభావం.

ఉదా: తెలుగు హిందీ
రాముల-చేత రామ్-ఓం-కో
రాము-ల-వలన రామ్-ఓం-సే

ద్రావిడ భాషల్లో ఏక వచనంలోనూ, బహువచనంలోనూ ఒకే ప్రత్యయం ఉంటుంది.

ఉదా: అక్కకు, అక్కను
అక్కలకు, అక్కలను

సంస్కృతభాషలో విభక్తి ప్రత్యయాలు వచనాన్ని అనుసరించి మార్పు చెందుతాయి.

ఏ.వ. ద్వి.వ. బ.వ.

రామ: - రామౌ - రామా:

సంస్కృతాది ఆర్యభాషల్లో ఉన్న సప్తవిధ విభక్తి ప్రణాళిక ద్రావిడ భాషల్లోలేదు. ద్రావిడ భాషల్లో ఏక, బహు వచనాలకు మాత్రమే విభక్తి ప్రత్యయాలుండగా సంస్కృతంలో ఏక, ద్వి, బహువచనాలకు విభక్తి ప్రత్యయాలున్నాయి. అయితే ద్రావిడ భాషల ప్రభావం వల్ల నవీన ఔత్తరాహిక భాషలయిన హిందీ, మరాఠీ. మొదలయిన భాషలలో కూడా ఇప్పుడు ద్వివచన ప్రత్యయం పోయి ఏక, బహువచనాలకు మాత్రమే విభక్తి ప్రత్యయాలున్నాయి.

ఉదా: రామ్‌కో
రామోంకో

సంస్కృత భాషలో విభక్తి ప్రత్యయాలకు మూలరూపాన్ని చూపించలేం. ఇక్కడ విభక్తి ప్రత్యయాలు ప్రత్యేక పదం నుంచి వచ్చినవికావు. కేవలం ప్రత్యయాలు మాత్రమే.

ద్రావిడ భాషలలో వ్యాకర్తలు చూపించే చాలా విభక్తి ప్రత్యయాలు పదాలనుంచి వచ్చినవే. చాలావాటికి మూలరూపాలను చూపించవచ్చు. ద్రావిడ భాషల ప్రభావం వల్ల ఆర్య భాషల్లో కూడా కొన్ని ప్రత్యేక పదాల నుంచి ఏర్పడిన విభక్తి ప్రత్యయాలు కనిపిస్తున్నాయి.

ఉదా : హిందీ మే (మధ్య)
కో (కక్ష్య)
పాస్ (పార్శ్వ)

ద్రావిడ భాషల్లో ఒక విభక్తి ప్రత్యయం మీద మరొక విబక్తి ప్రత్యయం చేరటం ఉంది. ఈ ప్రణాళిక ఆధునిక ఔత్తరాహిక భాషల్లో నామ ప్రాతిపదికల మీద బహువచన ప్రత్యయం చేరిన తర్వాత ఇతర విభక్తి ప్రత్యయాలు చేరడం ఉంది. ఉదా: హిందీ: వనోం, వనోంమే, వనోంసే.

**9.9.0 లింగం, వచనం :**

ద్రావిడభాషల్లో లింగభేదం అర్థాన్ని అనుసరించి ఉంటుంది. ద్రావిడ భాషల్లో లింగం, మహత్, అమహత్ అని రెండు భేదాలుగా వర్గీకరించబడి ఉంటుంది. మహత్‌లో పురుష వాచకాలు, అమహత్‌లో స్త్రీ, నపుంసక వాచకాలు చోటుచేసుకున్నాయి.

తమిళభాషలో లింగం ఉయర్‌తిణై, అఫ్ఱిణై అని రెండు విధాలు. ఏకవచనం మళ్ళీ అణ్‌పాల్, పెణ్‌పాల్, ఒన్ఱన్‌పాల్ అని మూడు విధాలు. ఈ భాషలో లింగం మూడు రకాలు కావడానికి గల కారణం సంస్కృత భాషా ప్రభావమని భాషా శాస్త్రవేత్తల అభిప్రాయ పడుతున్నారు.

ఒక్కమాటలో చెప్పాలంటే ద్రావిడ భాషలలో లింగభేదం సహజలింగ భేదానికి దగ్గరగా ఉంటుంది. అంటే సంస్కృతంలో

ఉదా: కళత్రం (స్త్రీని సూచించే పదమయినా నపుంసకం)
లతా (జడ పదార్థాన్ని సూచించే దయినా స్త్రీ లింగం)
వృక్షః (జడపదార్థాన్ని సూచించేదయినా పుంలింగం)

పయిన పేర్కొన్న ఉదాహరణలలో సహజలింగానికి, వ్యాకరణ లింగానికి భేదమున్నట్లుగా ద్రావిడ భాషలలో ఉండదు. ఇండో-యూరోపియన్ భాషా కుటుంబంలోని ఇతర భాషలలో కూడా సంస్కృతం లాగానే సహజలింగానికి, వ్యాకరణ లింగానికీ చాలా భేదం ఉంటుంది.

ద్రావిడ భాషలలో లింగ భేదాన్ని మూడు రకాలుగా వర్గీకరించారు. తొద, బ్రాహూఈ లలో లింగ భేదం లేదు. తొదతప్ప మిగిలిన ద్రావిడ భాషలలో ఈ కింది విధంగా ఉంటుంది.

| | | |
|---|---|---|
| మొదటిరకం : | ఏకవచనం | బహువచనం |
| | పుంలింగం | స్త్రీ-పుంలింగం |
| | స్త్రీలింగం | |
| | నపుంసకం | నపుంసకం |

రెండోరకం : తెలుగు, కురుఖ్; మాల్తోలు ఈ కోవకు చెందుతాయి. కురుఖ్; మాల్తోలలో నపుంసక బహువచనంలేదు.

| | |
|---|---|
| ఏకవచనం | బహువచనం |
| పుంలింగం | స్త్రీ-పుంలింగం |
| స్త్రీ,నపుంసకలింగం | నపుంసకం (ఒక్క తెలుగులోనే) |

మూడోరకం : తెలుగు తప్ప మిగిలిన మధ్య ద్రావిడ భాషలు ఈ కోవకు చెందుతాయి.

| | |
|---|---|
| ఏకవచనం | బహువచనం |
| పుంలింగం | పుంలింగం |
| స్త్రీనపుంసకలింగం | స్త్రీనపుంసకలింగం |

పైన పేర్కొన్న మూడింటిలోనూ రెండోరకమే మూల ద్రావిడ భాషకు చెందినదని భాషా పరిశోధకుల అభిప్రాయం.

సంస్కృతాది ఆర్య భాషలలో వచన విధానం ఏకవచన, ద్వివచన, బహువచనాలని మూడు విధాలుగా ఉంటుంది. ద్రావిడ భాషలలో ఏకవచన, బహువచనాలని కేవలం రెండు రకాలుగానే ఉంటుంది. వచన విధాన విషయంలో ద్రావిడ భాషల

ప్రభావం నవీన ఔత్తరాహిక భాషలయిన హిందీ మొదలయిన వాటి మీద పడి వాటి లోకూడా ద్వివచనం పోయి ఏకవచనం, బహువచనం మాత్రమే నిలబడ్డాయి.

## 9.10 అవ్యయం :

అవ్యయాల విషయంలో ఆర్యభాషలయిన సంస్కృతాది ప్రభావం తెలుగు, కన్నడ, మలయాళాది భాషల మీద చాలా అధికంగా ఉంది. సంస్కృతంలోని సదా, సర్వదా, వృథా, యథా, తథా, బహుశః, సర్వత్ర, అన్యత్ర, అన్యథా మొదలయిన అనేక అవ్యయాలు ద్రావిడ భాషలలో ప్రవేశించాయి.

## 9.11 కృదంతాలు :

కృత్ప్రత్యయాలు ధాతువుల మీద వస్తాయి. ద్రావిడ భాషలయిన తమిళంలో మొదటి వ్యాకరణ గ్రంథమయిన తొల్కాప్పియమ్‌లో కృత్ప్రత్యయాల గురించి ఎక్కడాలేదు. 11వ శతాబ్ధంలోని వీరచోళియమ్ అనే వ్యాకరణంలోమొదటగా ఈ ప్రత్యయాల గురించి ఉంది. కన్నడ శబ్దమణి దర్పణంలోనూ, తెలుగులో ఆంధ్ర భాషాభూషణంలోనూ వీటి చర్చఉంది.

అయితే సంస్కృతంలో పాణిని అష్టాధ్యాయిలో ఉన్నట్లు కృదంతాల గురించి ప్రాచీన ద్రావిడభాషావ్యాకరణాలలో స్పష్టంగా గుర్తించడం జరగలేదు. దీనికి గల కారణం సంస్కృతభాషలాగా తెలుగాది ద్రావిడ భాషలలో క్రియాప్రకృతులయిన ధాతువులకూ, నామ ప్రకృతులయిన తద్ధిత, కృదంతాలకు భేదమేర్పడలేదు. సంస్కృత భాషా ప్రభావంతో ద్రావిడ భాషలలో కృదంత ప్రత్యయాలు బాగానే చేరాయి.

ఉదా: చేయు-చేత, నడత, నడక, ఓరిమి, పాటు, చేటు మొదులుగున్నవి.

## 9.12.0 తద్ధితాలు :

కృత్ప్రత్యయాలు ధాతువల మీద రాగా, తద్ధిత ప్రత్యయాలు నామాల మీద వచ్చిచేరతాయి.

గొప్ప-తనము=గొప్పతనము, పేరు - ఇమి = పేరిమి,
చూచి-చూపు, మోయు-మోపు, కన్నె - ఱకము,
అంద-కాడు, అంద-కత్తె, అటమట-ఈడు =అటమటీడు మొదలుగున్నవి.

తర్ధిత ప్రత్యయాల విషయంలో కూడా సంస్కృత భాషా ప్రభావం ద్రావిడ భాషల మీద ఉన్నట్లుగా కనిసిస్తోంది.

## 9.13.0 వ్యాకరణం :

ఒక్క తమిళభాషలో తప్ప మిగిలిన ద్రావిడ భాషల్లో వచ్చిన వ్యాకరణాలన్నీ సంస్కృత వ్యాకరణాలను అనుకరించి, అనుసరించే వచ్చాయి. తెలుగులో కొందరు తెలుగు భాషకు సంబంధించిన వ్యాకరణాన్ని సంస్కృత భాషలో రాసిన వారున్నారు. మరికొంద మంది తెలుగులో వచ్చిన వ్యాకరణాలను సంస్కృతంలో అనువదించారు. ఇలా తెలుగు వ్యాకరణాలే సంస్కృత భాషలోకి వెళ్ళాయంటేనే సంస్కృత భాషా ప్రభావం ఎలాంటిదో మనం ఊహించవచ్చు.

ద్రావిడ భాషలలో తమిళ భాషలో క్రీ.పూ.1 వ శతాబ్దిలోనే 'తొల్కాప్పియమ్' వ్యాకరణం వచ్చింది. ఈ వ్యాకరణం ఐంద్ర వ్యాకరణ పద్ధతి అనుసరించి రాసినట్లుగా కర్తే చెప్పుకున్నాడు. అయితే ఈ వ్యాకరణం మీద సంస్కృత భాషా వ్యాకరణ ప్రభావం ఉన్నట్లు కనిసించదు.

ఆ తరువాత వచ్చిన వ్యాకరణాలు తెలుగు భాషలో కానివ్వండి, కన్నడ, మలయాళాలలో కానివ్వండి...... అన్నీ సంస్కృత భాషా ప్రభావంతో వచ్చినవే.

సంజ్ఞలు, అచ్చు, హల్లు, సూత్రరచన, లింగం, వచనం, అవ్యయం, సర్వనామాలు, సంఖ్యావాచకాలు, విభక్తి, విశేషణం, ధాతువు, క్రియ...... ఇలా ఒకటేమిటి? వ్యాకరణ విషయాలన్నింటిలోను సంస్కృతవ్యాకరణ పద్ధతే ద్రావిడ భాషలలో కనిపిస్తుంది.

## 9.14.0 క్రియలు :

ద్రావిడ భాషలలో అసమాపక క్రియల ప్రయోగం సర్వసాధారణం, అసమాపక క్రియలలో ధాతువు తరువాత కాలప్రత్యయం (భూతం, అభూతం) గాని, వ్యతిరేక ప్రత్యయంగాని ఉంటుంది.

ఉదా: చేసి, చేయుచున్/చేస్తూ, చేయక

ఒక వాక్యంలో ఎన్ని అసమాపక క్రియలయినా ఉండవచ్చు. ఆర్య భాషలలో అసమాపక క్రియల ప్రాచుర్యం ద్రావిడ భాషల సాహిచర్య ఫలితమేనని భాషా పరిశోధకుల అభిప్రాయం.

ద్రావిడ భాషలలో కురుఖ్, మాల్తోలు తప్ప మిగిలిన అన్నింటిలోనూ వ్యతిరేక క్రియారూపాలున్నాయి. వ్యతిరేక క్రియలు ద్రావిడ భాషలముఖ్య లక్షణం. వీటిని నిర్మాణం ఇలా ఉంటుంది.
ధాతువు+(ప్రేరణార్థకం) + వ్యతిరేక ప్రత్యయం + పురుషబోధక ప్రత్యయం

ఉదా: త. చెయ్య్ - -ఏన్
క. గెయ్ - -ఎం
తె. చెయ్ - -ను - అ
గోండి. కియ్య్-ఓ-న్

ద్రావిడ భాషలలో వ్యతిరేక క్రియా విశేషణం (చేయక), వ్యతిరేక క్రియా జన్య విశేషణం (చేయని), వ్యతిరేక క్రియానామం(చేయమి) కూడా ఉన్నాయి.

ఇండో-యూరోపియన్ భాషలలో వ్యతిరేకతని సూచించడానికి వాక్యంలో ప్రత్యేక పదాన్ని వాడాలి

ఉదా: సంస్కృతం. నకరోమి(చేయను)

సంస్కృతంలో 'త్వా' ప్రత్యయంతో ఏర్పడే అసమాపక క్రియ ఉంది.
గ-త్వా(వెళ్ళి)
కృ-త్వా(చేసి)
(వైదిక భాషలో దీనికి 'త్వాయ', 'త్వీ' అనే రూప భేదాలుకూడా ఉన్నాయి)

ఉపసర్గఉన్నప్పుడు దీనికి 'య' (వౌదిక భాషలో 'యా') అనే పదం ఉంది.
ఉదా: ప్రహృత్య (కొట్టి)

ఈ ప్రత్యయాలు ఇండో-యూరోపియన్ నుంచి వచ్చినవే అయినా ఈ క్రియాపదం ద్రావిడ భాషలలో క్త్వార్థకాల లాగానే పూర్వకాలిక క్రియని సూచించడానికి ఉపయోగిస్తుంది. అంటే సంస్కృతంలో కూడా ద్రావిడ భాషలు లాగానే ఈ క్రియా రూపాన్ని ఒక వాక్యంలో ఎన్ని సార్లయినా వాడవచ్చు.

ఉదా: 'వాడువచ్చి, కాళ్ళుకడుక్కొని, ఇంట్లోకి వెళ్ళి, బట్టలు మార్చుకొని , కాఫీతాగి, పుస్తకం తీసి............ పడుకున్నాడు.' ఇలాంటి అసమాపక క్రియా ప్రయోగం మిగిలిన ఇండో-యూరోపియన్ భాషలలో లేదు. కాబట్టి సంస్కృతంలో ఇది ద్రావిడ భాషల ప్రభావంల్లే ఏర్పడిందని చెప్పవచ్చు'

సంస్కృతంలోనూ, దాని నుంచి వచ్చిన భాషలలోనూ ప్రేరణ క్రియలు మిగిలిన ఇండో-యూరోపియన్ భాషలలో కన్న కన్న చాలా ప్రచురంగా ఉన్నాయి.

సంస్కృతం. హారయతి (మోయిస్తున్నాడు)
కారయతి (చేయుస్తున్నాడు.)

ద్రావిడ భాషలన్నింటిలోనూ ప్రేరణ క్రియలున్నాయి. కాబట్టి ఈ విషయంలోకూడా సంస్కృతం మీద ద్రావిడ భాషల ప్రభావం ఉందని చెప్పవచ్చు.

నవీన ఔత్తరాహిక భాషలలో క్రియా నిర్మాణానికీ ద్రావిడ భాషలలో క్రియా నిర్మాణానికీ సాన్నిహిత్యం ఉంది. మరాఠీ, కొంకణీ, నేపాలీ భాషలలో ద్రావిడ భాషలలోలాగా వ్యతిరేక క్రియలు ఉండడం ఆశ్చర్యం కలిగించే విషయమే అయిన అది ద్రావిడ భాషల ప్రభావమే ననేది వేరే చెప్పవలసిన పనిలేదు.

## 9.15 ఛందస్సు :

ద్రావిడ భాషలకు ప్రత్యేక ఛందస్సు లేకపోలేదు. రగడలు, ఏలలు మొదలయినవి ఉన్నా ఒక్క తమిళ భాష తప్ప మిగిలిన రచనాసాహిత్యమున్న తెలుగు, కన్నడ, మలయాళ భాషలలో సంస్కృత భాషలో ఉన్న ఛందస్సులు పయి భాషల మీద దాడి చేశాయి. వృత్తాలయిన చంపకమాల, ఉత్పలమాల, మత్తేభం, శార్దూలం మొదలయినవి తెలుగు, మలయాళ, కన్నడ భాషలలో విరివిగా ప్రవేశించాయి. ఈ భాషల్లో పద్యరచన ఈ ఛందస్సులలోనే ఎక్కువగా సాగింది.

## 9.16 వాక్యం :

ద్రావిడ భాషల్లో వాక్యరచనా విధానం సంస్కృతంలోని వాక్య రచనా విధానానికి విరుద్ధమయినది. ద్రావిడ భాషల్లో వాక్యరచన కర్త, కర్మ, క్రియ వరుసలో ఉంటాయి.

ఉదా: రామారావు అన్నం తిన్నాడు
రాముడు సీతను పెళ్ళాడాడు.

ఒకవేళ విశేషణాలు ఉన్నా వాటికి ముందే వస్తాయి.

ఉదా: బలవంతమయిన ఆస్ట్రేలియా జట్టు బలహీనమయిన బంగ్లాదేశ్ జట్టును సునాయాసంగా ఓడించింది.

సంస్కృతభాషలో ద్రావిడ భాషలలో లాగా కర్త, కర్మ, క్రియ క్రమంలో ఉండవలసిన పనిలేదు. ఈ ప్రభావం ద్రావిడ భాషలయిన తెలుగాది భాషల మీద ఉంది.

ఉదా: వచ్చిన వాడు ఫల్గునడవశ్యముగెల్తుమనంగరాదు....................
కాంచెన్ వైష్ణవుడర్థయోజన...............
కనియెన్ రుక్మిణి............

కన్నడ, మలయాళ భాషల్లో కూడా ఇలాంటి రచన కనిపిస్తుంది.

ఒక వాక్యంలో అసమాపక క్రియలు ఎన్ని ఉన్నప్పటికీ అవి అన్నీ వచ్చిన తర్వాత చివరగా వాక్యం సమాపక క్రియతో ముగుస్తుంది. ఈ రకమయిన వాక్య రచనా పద్ధతి ద్రావిడ భాషలకు ప్రత్యేకం.

ఇంతకు ముందే చెప్పినట్లుగా సంస్కృత భాషలో కర్త, కర్మ, క్రియల వరుసలో వాక్య నిర్మాణం ఉండవలసిన అవసరం లేదు. అయితే ఆధునిక ఆర్య భాషలయిన హిందీ మొదలయిన భాషలలో ద్రావిడ భాషా వాక్య నిర్మాణ పద్ధతికనిపిస్తోంది.

హిందీ : యమ్ హమారాఘర్ యహ్
తమిళం : ఇదు ఇంగళ్ వీడు
కన్నడం : ఇది నమ్మమనె
తెలుగు : ఇది మా ఇల్లు

క్రియ లేకుండా వాక్యం ఉండటమనే లక్షణం ద్రావిడ భాషల నుంచి ఆర్య భాషలకు వెళ్ళిన లక్షణం.

అదేవిధంగా ఇండో-యూరోపియన్ భాషలలో ప్రచురంగా ఉన్న కర్మణి ప్రయోగం (Passie Voice construction) సంబంధ సర్వనామాలు (Relative Pronouns) ద్రావిడ భాషలలో లేవు. లిఖిత సాహిత్యమున్న నాలుగు ద్రావిడ భాషలలోనూ పడు(మల. పెడు) ధాతువు కర్మణి ప్రయోగాను బంధంగా వాడటం జరుగుతోంది.

ఉదా: తమిళం : చొల్లప్పటు కిఱతు
మలయాళం : పఱయప్పెటున్ను
ప్రాచీన కన్నడం : పేళల్ పడువుదు (ఆదునికి కన్నడంలో ఈ ప్రయోగం లేదు)
తెలుగు : చెప్పబడుతోంది

పైన పేర్కొన్న కర్మణి ప్రయోగం సంస్కృత భాష ప్రభావం వల్లనే ద్రావిడ భాషలలోకి వచ్చిందని చెప్పవచ్చు. ఎందుకంటే వ్యవహారంలో ఉన్న ఏ ఇతర ద్రావిడ భాషలోనూ ఈ నిర్మాణం లేకపోవడం, లిఖిత భాషలో కూడా దీనిని అనవసరమయిన చోట్లనే వాడడమూ ఇది ఈ భాషలో కూడా దీనిని అనవసరమయిన చోట్లనే వాడడమూ ఇది ఈ భాషల స్థిరపడలేదనీ, స్వాభావికం కాదనీ చెప్పడానికి వీలవుతోంది.

అలాగే యత్తదర్థక వాక్య నిర్మాణం కూడా ద్రావిడ భాషాలక్షణం కాదు. ప్రశ్నార్థక సర్వనామాలని సంబంధ సర్వనామాలుగా సాహిత్యంలో వాడడం సంస్కృత భాషా ప్రభావం వల్లనే అని చెప్పవచ్చు.

ఉదా : 'ఎవ్వనిచే జనించు జగము' . . . . వానిన్ . . . శరణంబువేడెదన్' ద్రావిడ భాషలలో క్రియాజన్య విశేషణాలు ఉండటం వల్ల సంబంధ సర్వనామాల ప్రయోజనం లేదు.

ఉదా: సంస్కృతం : యశ్చకార స:
తమిళ, మలయాళాలు : చెయ్తవన్
కన్నడం : మాడిదవను
తెలుగు : చేసిన వాడు

వాక్యనిర్మాణంలో కనిపించే లక్షణాలు ద్రావిడ భాషల ప్రభావం ఆర్య భాషల మీద ఉన్నా, ఆర్య భాషల ప్రభావం ద్రావిడ భాషల మీద అధికంగా ఉందని మాత్రం చెప్పవచ్చు.

## 9.17 ఇతరాలు :

### 9.17.1 ధ్వన్యనుకరణ పదాలు :

ధ్వన్యనుకరణ పదాలుండటం ద్రావిడ భాషల ప్రత్యేకతగా భావించవచ్చు.

తెలుగు : గలగల, పటపట, కటకట, చకచక, జలజల, ధ్వన్యను కరణ పదాలు వాస్తవానికి సంస్కృతాది భాషలకు సహజసిద్ధమయినది కాదు. ఇండో-యూరోపియన్ భాషలలో ఇలాంటి పదజాలం లేదు. ద్రావిడ భాషల ప్రభావం వల్ల సంస్కృతంలోనూ, నవీన ఔత్తరాహిక భాషలయిన హిందీ, మరాఠీ మొదలయిన భాషలలోనూ ధ్వన్యనుకరణ పదాలు కనిపిస్తున్నాయి.

సంస్కృతం : కటకటాపయతి (పళ్ళు కొరకడానికి అనుకరణ) కిలకిలాయతే (నవ్వుకి అనుకరణ)

హిందీ : సర్ సరానా (సరసరాపాకు) ఘడ్‌ఘడానా(ఉరుము)

మరాఠీ : సర్‌సర్, (బుద్బుదం) గద్ గద్ ణే (దొల్లు)

### 9.17.2. జంటపదాలు :

ద్రావిడ భాషలలో జంట పదాలుండటం సర్వసాధరణం. ఇవి తెలుగు, కన్నడ, మలయాళాది సాహిత్యమున్న భాషలలోనే గాక గిరజనాది భాషలలో కూడా ఇలాంటి పదాలను విరివిగా వాడటం ఉంది.

తెలుగు : పిల్లా పాపా
పురుగు పుట్రా
గొడ్డుగోదా

ద్రావిడ భాషల ప్రభావం వల్ల హిందీలో కూడా ఇలాంటి పదజాలం చోటుచేసుకోవడాన్ని మనం గమనించవచ్చు.

హిందీ : జల్‌ఉల్
తితర్ బితర్

### 9.17.3 తరతమ భావం :

ద్రావిడ భాషల్లో తరతమ భావాల్ని సూచించడానికి విశేషణానికి ప్రత్యేకించి చెప్పడానికి ప్రత్యయాలు లేవు. ప్రత్యేకమయిన పదాలను ఉపయోగించి తరతమ భావాలను తెలియజేయడం జరుగుతుంది. అంటే ద్రావిడ భాషలకు ఇది సహజమయినది కాదు.

1. తెలుగు : వాడికంటె వీడు మంచివాడు (తరభావం)
   తమిళం : అవనైవిడఇవన్ నల్లవన్ (తరభావం)
2. తెలుగు : వాళ్ళందరిలో వీడు మంచివాడు (తమభావం)
   తమిళం : అవర్ గళెల్లోరిలుమ్ ఇవన్ నల్లవన్ (తమభావం)

సంస్కృతంలో తర, తమ భేదాల్ని సూచించడానికి ప్రత్యేకించి ప్రత్యయాలున్నాయి.

హిందీ : ఉస్ సే అధిక్ (తరభావం)
ఉన్ సబ్‌మే అధిక్ (తమభావం)

**9.17.4.** సంస్కృతం నుంచి పుట్టిన ఆర్య భాషలలో నామాలలో బహువచన ప్రత్యయం చేరిన తరవాత విభక్తి ప్రత్యయాలు చేరతాయి. ఈ నిర్మాణం ద్రావిడ భాషా నిర్మాణానికి సన్నిహితం.

**9.17.5.** సంస్కృతంలో ఇతి శబ్దం ఒక విషయాన్ని యథాతథంగా చెప్పేటప్పుడు ఆ విషయాన్ని సూచించే వాక్యం (Quotation) తరువాత వస్తుంది. ద్రావిడ భాషలలో

తెలుగు : అని

తమిళం : ఎన్రు

కన్నడం : ఎందు

గోండి : ఇంజి అనే పదాలు కొటేషన్ తరవాతనే వస్తాయి. మిగిలిన ఇండో-యూరోపియన్ భాషలలో సంవాదక పదం సంవాదాంశానికి ముందువస్తుంది.

ఉదా: He Said that ............

ఇలా సుమారు మూడున్నర వేల సంవత్సారలకు పైగా కలసి ఉన్న ఆర్య ద్రావిడ భాషలు పరస్పరం ప్రభావితమయ్యాయి. రెండు భిన్న జాతులు వారు కలసి మెలసి ఉన్నప్పుడు ఒకరి భాష మరొకరిమీద, ఒకరి సంస్కృతీ సంప్రదాయాలు మరొకరి మీద పడటం సర్వసామన్యం. ఇందులో తప్పకుండా విజితుల ప్రభావం విజేతల మీద కంటే విజేతల ప్రభావం విజితుల మీద ఎక్కువ ఉంటుందనేది నగ్న సత్యం. ఆకోవలోనే విజేతల భాష అయిన సంస్కృతం తజ్జన్యమయిన నవీన ఔత్తరాహిక భాషల ప్రభావం ద్రావిడ భాషల మీద ఎక్కువగా ఉంది.

**సమీక్ష :**

ఈ పాఠంలో ఆర్య ద్రావిడ భాషల సంబంధం, ఒక భాషా కుటుంబం మరో భాషా కుటుంబం మీద భాషా పరంగా ఎలాంటి ప్రభావాన్ని చూపిందీ వివరంగా తెలుసుకోవడం జరిగింది.

**ప్రశ్నలు :**

1. సంస్కృతాది ఆర్య భాషలపై ద్రావిడ భాషల ప్రభావాన్ని వివరించండి.
2. ద్రావిడ భాషలపై ఆర్య భాషల ప్రభావాన్ని విశదీకరించండి.
3. ఆర్య ద్రావిడ భాషల పరస్పర ప్రభావాన్ని తెలియ పర్చండి.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. సుబ్రహ్మణ్యం, పి.ఎస్. ద్రావిడ భాషలు సత్యవతీ పబ్లికేషన్సు , నెం. 4, చంద్రారెడ్డి రోడ్, అన్నమలైనగర్, 608101, 1977.
2. జోగిసోమయాజి, గంటి ః ఆంధ్రభాషా వికాసము, క్వాలిటీ పబ్లిషర్సు, రామ మందిరం వీధి, విజయవాడ-2, 1985.

పాఠం - 10

# ద్రావిడ భాషలలో తెలుగు స్థానం

## ద్రావిడ భాషలు - సంగ్రహ పరిచయం :

మూల ద్రావిడ వర్ణాలు - ద్రావిడ భాషల ఉపకుటుంబాలు
ఉపభాషా కుటుంబ నిర్ణయంలో పదవ్యుత్పత్తి ప్రాధాన్యం (importance of Etymologies).
శబ్ద రూప నిర్మాణాన్ని బట్టి భాషల ఉపభాషా కుటుంబ నిర్ణయం.
లింగవచన విభక్తి విధానాల బట్టి భాషల ఉపభాషా కుటుంబ నిర్ణయం.
మూల ద్రావిడ భాష ఏయే విధంగా విడిపోయిందో తెలుసుకోవటం.
ద్రావిడ భాషలలో తెలుగు భాషా స్థానం.

## ద్రావిడ భాషలలో తెలుగు స్థానం :

ఫ్రాన్సిస్ వైట్ ఎలిస్ (Francis White Ellis) ఎ.డి. కాంబెల్ (A.D. Campbell) రచించిన తెలుగు వ్యాకరణం (A grammar of Teloogoo Language) నికి ఉపోద్ఘాతాన్ని "Dissertation on the Telugu Language" పేర వ్రాస్తూ తెలుగు, తమిళం, మళయాళం, తుళు, కొడగు భాషలు దక్షిణదేశ మాండలికాలు (Dialects of South India) గా పేర్కొన్నారు. రాజ్ మహల్ కొండలలో మాట్లాడే 'మాల్తొ' భాష తెలుగు తమిళ భాషలతో సంబంధం కలిగి ఉన్న భాష అని ఎలిస్ తెలిపారు. తెలుగు తమిళం, కన్నడం భాషలు తదనంతర ఆకాలంలో సంస్కృత పదాలతో కూడి ఉన్నప్పటికి ప్రత్యేక భాషా కుటుంబానికి చెందినవని చెప్పటమే వారి ఉద్దేశం. ఎలిస్ రచించిన "Dissertation on the Telugu Language" 1816 లో ప్రకటించబడింది. ద్రావిడ భాషలకు ప్రత్యేక భాషా కుటుంబ ప్రతిపత్తిని కల్పించిన ప్రప్రథమ వ్యక్తి ఫ్రాన్సిస్ వైట్ ఎలిస్. సంస్కృతానికి తెలుగుకు జన్యజనక సంబంధం లేదా సోదర సంబంధం లేదని చెప్పింది కూడా ఈయనే. సర్ విలియమ్ జోన్స్ (Sir Villiam Jones) కలకత్తాలో ఏసియాటిక్ సొసైటి ఆఫ్ బెంగాల్ (Asiatic Society of Bangal) లో 2-2-1786 లో భాషా కుటుంబ ఆలోచనకు అంకురార్పణ కావించిన 30 సంవత్సరాల తర్వాత ఎలిస్ ద్రావిడ భాషా కుటుంబ ప్రతిపాదన కావించారు.

రివరెండ్ రాబెర్ట్ కాల్డ్వెల్ (Rev Robert Caldwell) ద్రావిడ భాషలను తులనాత్మకంగా పరిశీలించి క్రీ.శ. 1856 లో "A comparative grammar of the Dravidian or South Indian Family of Languages" అనే పేరుతో దక్షిణ భాషాకుటుంబ వ్యాకరణాన్ని రచించారు. 1856లో కాల్డ్వెల్ చే 12 ద్రావిడ భాషలు పేర్కొబడ్డాయి.

1. తమిళం; 2. మలయాళం; 3. తెలుగు; 4. కన్నడం; 5. తుళు; 6. కొడగు; 7. తొద; 8. కోత; 9. గోణ్డి; 10. కుఇ; 11. ఒరాయన్ (కురుఖ్); 12. రాజ్‌మహల్ (మాల్తొ). 1875 లో తన తృతీయ ముద్రణలో కాల్డ్వెల్ బ్రాహుఈని కూడా పేర్కొన్నాడు. ద్రావిడ భాషలు ఆర్య భాషలకంటె సిథియన్ భాషలతో సన్నిహిత సంబంధం కలిగి ఉన్నాయని తన గ్రంథంలో పేర్కొన్నారు. ఆర్యభాష అయిన సంస్కృతంతో ద్రావిడ భాషాపద పరిశీలన వల్ల ద్రావిడ భాషల వ్యాకరణ పద్ధతి అనుశీలన వల్ల వీటికి పరస్పర సంబంధం లేదని కాల్డ్వెల్ ప్రభృతులు నిస్సంశయంగా నిరూపించారు.

ద్రావిడ భాషలను గ్రూపులుగా విభజించిన ఖ్యాతి స్టెన్‌కొనోకు దక్కింది. లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా 4వ సంపుటి (Linguistic Survey of India 4th Volume - 1906) లో తమిళ సమూహం (Tamil - group) తెలుగు సమూహం (Telugu - group) అని రెండు రకాలుగా స్టెన్ కొనో విభజించారు. ఈ విభజన నిర్దుష్టం కాకపోయినా దక్షిణ ద్రావిడోప కుటుంబం, మధ్య ద్రావిడోప కుటుంబం అనే విభజనకు నాంది పలికినట్లయింది.

ద్రావిడ భాషలలో ఉపకుటుంబ విభజన గురించి శ్రీఎల్.వి. రామస్వామి అయ్యర్ (L.V. Ramaswami Aiyar), ఇ.హెచ్. టటిల్ (E.H. Tuttle), టి. బరో (T. Burrow) లు 1950 లో తెలుగు దక్షిణ ద్రావిడ భాషాకుటుంబానికి చెందినదిగా పేర్కొని ఉపభాషా కుటుంబ విభజనలో నిర్దుష్టతను సాధించటానికి ప్రయత్నించారు.

మూలద్రావిడ భాష క్రీ.పూ. 4000 సంవత్సరాల నాడు వ్యవహారంలో ఉండేదని కాలక్రమంలో అది మూడు ఉపకుటుంబాలుగా విడిపోయి ఒక్కో కుటుంబం తదనంతర కాలంలో మరికొన్ని భాషలుగా విడిపోయి నేడున్న ద్రావిడ భాషలు వ్యవహారంలో ఉన్నాయని ద్రావిడ భాషా శాస్త్రవేత్తల అభిప్రాయం. 1950 తర్వాత జరిగిన ఈ విభజన కార్యక్రమాన్ని గమనించండి.

**ఉత్తర ద్రావిడ భాషలు :**

1. బ్రాకు ఈ; 2. కుడుఏగ్; 3. మాల్తో.

**మధ్య ద్రావిడ భాషలు :**

1. కుఇ; 2. కులి; 3. కూబి (కొండ); 4. గోండి; 5. పర్జి; 6. నాయకీ; 7. ఒల్లారి; 8. కోలామి; 9. గదబ; 10. పెంగొ, 11. మండ, 12. తెలుగు (కోయ గోండి మాండలికం)

**దక్షిణ ద్రావిడ భాషలు :**

1. తమిళం; 2. మలయాళం; 3. కన్నడం; 4. తుళు; 5. కొడగు; 6. తొద; 7. కోత.

ఈవిధంగా ద్రావిడ భాషలను మూడు ఉపకుటుంబాలుగాను ఈ ఉపకుటుంబాలలోని భాషలు మొత్తం 22 గాను పూర్వం విభజించారు.

ఆంధ్రప్రదేశ్ 7,57,27,541 మంది జనాభాతో ఉండి ద్రావిడ భాషలన్నిటిలోను అత్యధిక జనాభా కలదిగాను విశాల రాష్ట్రంగాను ఉంది. ఈ రాష్ట్రంలో ప్రధాన భాష తెలుగు. తెలుగు దక్షిణ ద్రావిడ భాషగా భావించబడేది. దీన్ని మధ్య ద్రావిడ భాషగా పేర్కొని నిరూపించినవారు ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి గారు. వారు తమ "Telugu versal bases : a Comparative and Descriptive study" 1961 లోని "The place of Telugu in the Dravadian family" (PP. 216-274) 4వ అధ్యాయంలో ఈ విషయాన్ని నిరూపించారు. ఈ నిరూపణ ఈ క్రింది విధంగా ఉంది.

**వర్ణాలు** (Plonemes) :

మూలద్రావిడ భాషా వర్ణాలు నేటి ద్రావిడ భాషలలో అనేక విధాలుగా మార్పులు పొందాయి కదా. ఈ ధ్వనుల తులనాత్మక పరిశీలన వల్ల తెలుగు భాష దక్షిణ ద్రావిడ భాషా కుటుంబానికి చెందిందో మధ్య ద్రావిడ భాషా కుటుంబానికి చెందిందో తెలుస్తుంది.

**మూల ద్రావిడ స్వర వర్ణాలు :**

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఇ | ఈ | | | ఉ | ఊ |
| ఎ | ఏ | | | ఒ | ఓ |
| | | అ | ఆ | | |

**మూల ద్రావిడ వ్యంజన వర్ణాలు :**

| | | | | | |
|---|---|---|---|---|---|
| ప | త | <u>త</u> | ట | చ | క |
| | | | టి | | |
| మ | న | | ణ | ఞ | |
| | | ల | ళ | | |
| | | ర | | | |
| వ | | | | | య |

మూల ద్రావిడ భాషలో కల పై వర్ణాలలోని కొన్ని వర్ణాలు అనేక కారణాల వల్ల మార్పులకు లోనై కాలక్రమేణా భిన్న భాషలుగా మారాయి.

తాలవ్యాచ్చులకు పూర్వం కల మూల ద్రావిడ క-కారం తెలుగు, తమిళ, మలయాళ భాషలలో చ-కారంగా మారుతుంది. ఈ మార్పు మధ్య ద్రావిడ భాషలలోను ఉత్తర ద్రావిడ భాషలలోను ఏ పరిస్థితులలోను జరగదు.

| మూ. ద్రా. | తెలుగు | తమిళం | మలయాళం | |
|---|---|---|---|---|
| కెయ్ | చేయు | చెయ్ | చెఇక్క | కెయ్ (ఒల్లారి) |
| కెత్ | చెదరు | చిదర్ | చిదఱుక | కిద్గ్నా (కులగ్) |

తాలవ్యీకరణ విధానంలో తెలుగు దక్షిణ ద్రావిడ భాషా లక్షణాన్ని కలిగి ఉంది. మూల ద్రావిడ పదాది చకారం దక్షిణ, ద్రావిడ భాషలలో లోపిస్తుంది. తెలుగుభాష ఈ విషయంలో దక్షిణ ద్రావిడ భాషల్ని పోలి ఉంది.

| | | | |
|---|---|---|---|
| ఉదా : | తెలుగు : | అల్లుఁడు 'జామాత' | |
| | కన్నడం, తుళు | అళియ | 'పైది' |
| | గోండి | 'సడే' | 'పైది' |
| | పర్జీ | 'చత్ఞెద్' | పైది |
| | బ్రాడు ఈ | 'సడే' | పైది |
| | తెలుగు | 'ఆఱు' | షట్ |
| | నాయకి | 'సాది' | పైది |
| | గోండి | 'సారూంగ్' | పైది |
| | తెలుగు | 'ఇచ్చు' | <ఈ+చు ప్రదానం చేయు |

కన్నడం; తమిళం; 'ఈ' పైది
గోండి, నాయకీ పై

**తెలుగు, తమిళం, మలయాళం :**

| | | |
|---|---|---|
| ఉప్పు | లవణం | |
| కొలామి, నాయకీ, | పర్జీ | 'సుప్' పైది |
| కొండ, పెంగొ | 'హెలార్' | పైది |
| తెలుగు | 'ఏను' | అయిదు |
| పర్జీ | 'చేవిద్' | ' పైది |
| గోండి | సూయాంగ్, | పైది |

ఇగురు, చిగురు వంటి కొన్ని తెలుగు శబ్దరూపాల్లో చకార లోపంతో ఉన్న కొన్ని శబ్దరూపాలు, చకార లోపంలేని కొన్ని శబ్దరూపాలు ఉన్నాయి. వీటి సంఖ్య అల్పం.

త్ర్యక్షర ధాతువులలో సంయుక్తాక్షర అనునాసిక వర్ణలోపం ఆంధ్ర కర్ణాటక భాషలలో ఉంది.
తెలుగు

మూడు < మూఁడు < మూండు < మూన్టు
కన్నడం

మూఱు < మూన్టు
తమిళంలో 'మూన్టు', అనే వ్యవహారం.

మూలద్రావిడ భాషలలోని వర్ణాలు మార్పు పొందేటప్పుడు కొన్ని చోట్ల మధ్య ద్రావిడ భాషలతోను మరికొన్నిచోట్ల దక్షిణ ద్రావిడ భాషలతోను సంబంధం కలిగి ఉంది. దీన్ని బట్టి తెలుగు ప్రాచీన కాలం నుంచి భౌగోళికంగా దక్షిణ భాషలతో సంబంధం కలిగి ఉన్న కారణంగా కొన్ని విషయాలలో దక్షిణ ద్రావిడ భాషల ప్రభావానికి లోనై ఉంటుంది. ఇక పదవ్యుత్పత్తి (Etymology) ని బట్టి శబ్దరూప నిర్మాణాన్ని బట్టి తెలుగు దక్షిణ ద్రావిడ భాషా కుటుంబానికి సన్నిహితమో మధ్య ద్రావిడ భాషాకుటుంబానికి సన్నిహితమో నిర్ణయిద్దాం.

**పదవ్యుత్పత్తి** (Etymology) :

సజాతీయ భాషాపదాల (cognates) ను పరిశీలించి రెండు భాషలు సన్నిహితంగా ఉన్నాయో లేవో తెలపవచ్చు. మూల ద్రావిడ భాష నుండి తెలుగులోకి వచ్చిన దేశి పదాలకు సజాతీయ భాషాదేశి పదాలతో పోల్చి ఒక పట్టికను 'సజాతీయ భాషా పదపట్టికను) తయారు చేయాలి. తెలుగులోని దేశిపదాలకు సజాతీయ భాషా పదాలు (cognates) ఉత్తర ద్రావిడ భాషలలో ఎక్కువగా ఉన్నాయా? మధ్య ద్రావిడ భాషలలో ఎక్కువగా ఉన్నాయా? దక్షిణ ద్రావిడ భాషలలో ఎక్కువగా ఉన్నాయా? అనే విషయాన్ని పరిశీలించి నిగ్గు తేల్చాలి. తెలుగులోని దేశి పదాలను ఏ ద్రావిడ భాషా కుటుంబంలో అధికంగా సజాతీయ భాషా పదాలుంటే తెలుగు ఆ భాషా కుటుంబానికి చెందిందని నిర్ధారించవచ్చు. తెలుగులోని 1056 క్రియా ధాతువులకు సజాతీయ క్రియా ధాతువులను ఆచార్య బి.హెచ్. కృష్ణమూర్తి గారు తమ సిద్ధాంత వ్యాసంలో ప్రదర్శించారు. ఈ ప్రక్రియను బట్టి తాత్కాలికంగా ఒక నిర్ణయానికి రావచ్చు. తమిళ, కన్నడ, మలయాళ భాషలలో సామగ్రి (material) సమగ్రంగా వున్న

గోండి, పర్జి, ఒల్లారి, కుఇ, కువి, కొండ, బ్రాహుఈ, మాల్తో వంటి భాషలలో సమృద్ధిగా సమాచారం లేదు. అయినప్పటికి ఉన్న సామగ్రిని బట్టి పోల్చి చూడాలి. ఈ విషయాన్ని పరిశీలించేటప్పుడు తమిళ, కన్నడ, మలయాళ భాషలలో విపుల సాహిత్యం ఉన్న విషయాన్ని నిఘంటు బాహుళ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మధ్యోత్తర ద్రావిడ భాషలలో సారస్వత రాహిత్యాన్ని దృష్టిలో వుంచుకొని ఈ విషయ పరిశీలన కావించాలి. 1056 సజాతీయ క్రియాధాతువులను సాధ్యమైనన్ని సజాతీయ క్రియాధాతువులకు గ్రహించి తెలుగు ఏ ద్రావిడ ఉపకుటుంబానికి చెందిందో నిర్ణయించారు. ఈ పరిశీలన వల్ల తెలుగు దక్షిణ ద్రావిడ భాషా కుటుంబానికి చెందిందిగా స్థూలదృష్టికి తోస్తుంది.

తెలుగులో 1056 క్రియా ధాతువులు
కన్నడంలో 649 క్రియా ధాతువులు
తమిళంలో 781 క్రియాధాతువులు
తుళులో 500 క్రియాధాతువులు
పర్జీలో 220 క్రియాధాతువులు
కుఇ లో 291 క్రియాధాతువులు
గోండి 196 క్రియాధాతువులు
బ్రాహుఈ 67 క్రియాధాతువులు

తమిళ భాషలో సుమారు 1,000 దేశ్యపదాలు నిఘంటువులలో లభిస్తున్నాయి. అందువల్లనే తమిళం నుండి 781 సజాతీయ క్రియాధాతువులు తెలుగులోని 1056 క్రియాధాతువులకు లభించాయి. పర్జీ, ఒల్లారి, కోలామి భాషలలోతెలుగు క్రియాధాతువులకు (1056) లభించే సజాతీయ క్రియాధాతువులు రమారమి 200, పర్జీ, ఒల్లారి, కోలామి లలో లభించిన మొత్తం పదాలు 2,000. కుఇ భాషలో లభించిన పదాలు 1965 కాగా సజాతీయ క్రియాధాతువులు (1056) 291. పర్జీ, కుఇ, కోలామి, ఒల్లారి భాషలలో కూడా తమిళం భాషల వలె విపుల సారస్వతం, కోశనిర్మాణం జరిగి సుమారు 9,000 పదాలు లభించి ఉంటే తెలుగు క్రియా ధాతువులకు 900 సజాతీయ భాషాపదాలు లభించి ఉండేవి. ఈ లెక్కలను బట్టి దక్షిణ ద్రావిడ భాషల తోడి తెలుగు సంబంధం కంటె తెలుగుకు మధ్య ద్రావిడ భాషలతోడి సంబంధం దృఢతరమని నిర్ధారించవచ్చు.

**శబ్దరూప నిర్మాణం** (Morphology) :

**ద్రావిడ భాషలలోని లింగం :**

ద్రావిడ భాషలలో లింగ విధానం నాలుగు విధాలుగా ఉంది.

అ) ఈ వర్గానికి చెందిన భాషలలో లింగబోధకతా విధానం లేదు. ప్రాచీన ద్రావిడ భాషా స్థితికి ఈ భాషలు ప్రతినిధులు. బ్రాహుఈ, తొదలు ఈ తెగకు చెందినవి. బ్రాహుఈ లో మహత్తుకు సహితం లింగబోధకత నేటికీ లేదు. బ్రాహుఈ మూలద్రావిడంలో లింగబోధకత లేకపోవచ్చు.

ఆ) ఏ) పురుష వాచకాలకు ఏకవచనంలో ఒక ప్రత్యయాన్ని చేరుస్తారు.

బి) పురుష వాచకేతరాలకు ఏకవచనంలో ఒక ప్రత్యయాన్ని చేరుస్తారు.

సి) పురుష వాచకాలకు బహువచనంలో ఒక ప్రత్యయాన్ని చేరుస్తారు.

డి) పురుష వాచకేతరాలకు బహువచనంలో ఒక ప్రత్యయాన్ని చేరుస్తారు. మధ్య ద్రావిడ భాషలలో లింగబోధన పద్ధతి ఈ విధంగానే ఉంటుంది. పర్జీ, కోలామి, గోండి, కుఇ, కువి, ఒల్లారి మొదలయిన మధ్య ద్రావిడ భాషల్లో పద్ధతి ఇదే.

పర్జీ

| ఏ.వ. | బ.వ. |
|---|---|
| ఓడ్ (వాడు) | ఓర్ (వారు పురుషులు మాత్రమే) |
| అద్ (ఆమె, అది) | అర్ (అవి. స్త్రీలు కూడా) |

ఇ) ఎ) మహత్తులకు ఏకవచనంలో ఒక ప్రత్యయం.

బి) అమహత్తులకు ఏకవచనంలో ఒక ప్రత్యయం.

సి) మహన్మహతులకు బహువచనంలో ఒక ప్రత్యయం.

డి) మహతీత రామహత్తులకు బహువచనంలో ఒక ప్రత్యయం. తెలుగుభాష ఈ కోవకు చెందుతుంది. రాముడు, కృష్ణుడు, మగడు

ఇ) ప్రాయికంగా మహతీవాచకాలకు ఏ ప్రత్యయమూ చేరదు. అమ్మ, అక్క, పిన్ని, అత్త మహతీతరామహత్తులకు ము,వులను చేరుస్తారు. అల్లము, బెల్లము, ఆవు, పూవు.

ఎఫ్) మనుష్యులు వచ్చారు; స్త్రీలు వచ్చారు వారు వచ్చారు (స్త్రీలు, పురుషులు)

జి) ఆవులు వస్తున్నవి; చెట్లు కాస్తున్నవి అవి ఉన్నవి.

ఈ) ఎ) స్త్రీ, పుం, నపుంసకాలకు ఏకవచనంలో వేర్వేరు ప్రత్యయాలు చేరతాయి.

బి) స్త్రీ, పుం సామాన్య బహువచన ప్రత్యయం.

సి) నపుంసక బహువచన ప్రత్యయం తమిళ, మలయాళాది దక్షిణ ద్రావిడ భాషలు ఈ తెగకు చెందుతాయి.

అ) మహదేకవచనం (ఆణ్‌పాల్ - న్) అవన్, ఇవన్, రామన్

ఆ) మహత్యేక వచనం (పెణ్‌పాల్ - ళ్) అవళ్, ఇవళ్, మగళ్

ఇ) నపుంసకైక వచనం (ఒన్టన్‌పాల్-తు /-దు)

ఈ) స్త్రీ పుం సామాన్య బహువచన ప్రత్యయం (పలర్‌పాల్ - ర్) అవర్, ఇవర్

ఉ) నపుంసక బహువచనం (పలవిన్‌పాల్ - వ్) అవై, ఇవై.

లింగ విధానంలో తెలుగు భాష ఏకవచన విధానంలో మధ్యోత్తర ద్రావిడ భాషలతోను, బహువచనంలో దక్షిణ ద్రావిడ భాషలతోను సంబంధం కల్గి ఉంది.

## ద్రావిడ భాషలలోని వచన విధానం :

ద్రావిడ భాషలన్నిటిలోను మహద్బహు వచన ప్రత్యయం రేఫ (-అర్; -ఇర్; ఉర్) గానే ఉంది. అమహద్బహు వచన ప్రత్యయం కొన్ని భాషలలో '-క్' గా కాగా మరికొన్ని భాషలలో -శ్; ఇంకొన్ని భాషలలో -కళ్. కుఇ, గోండి, బ్రాహు ఈ భాషలలో '-క్' అ మహద్బహు వచన ప్రత్యయం.

గోండి

| ఏ.వ. | | బ.వ. |
|---|---|---|
| కై | (చేయి) | కైక్ |
| పుల్లి | (పులి) | పుల్క్ |

| | | |
|---|---|---|
| మల్ | (నెమలి) | మల్క్ |
| రోన్ | (ఇల్లు) | రోఁక్ |
| తలా | (తల) | తలఁక్ |

కుఇ

| | | |
|---|---|---|
| ఏ.వ. | | బ.వ. |
| మ్రహ్ను | (మ్రాను) | మ్రహ్క |
| కాడ | (పండు) | కాజ్గ |
| త్లా | (తల) | త్లాక |

బ్రాకుఈ

| | | |
|---|---|---|
| ఏ.వ. | | బ.వ. |
| బా | (నోరు) | బాక్ |
| హోర్ | (వేలు) | హోక్ |

తెలుగు, పర్జీ, కోలామి, ఒల్లారి భాషలు -క్, -కళ్ ప్రత్యయాలను అమహద్బహువచనంగా కల్గి ఉన్నాయి. తెలుగులో - లు వర్ణకం కూడా మహద్బహు వచనంగా ఉపయోగిస్తున్నారు.

ఉదా : యోధులు, వీరులు, తమ్ములు మొ॥నవి. అయినప్పటికి బాలురు, అల్లురు, మల్లురు మొదలయిన పదాలలో ఉన్న '-రు' మహద్బహు వచన ప్రత్యయం.

**తెలుగులో '-కళ్' బహువచన ప్రత్యయం**

**తెలుగు**

| | |
|---|---|
| ఏ.వ. | బ.వ. |
| ఏనుగు | ఏనుగులు |
| నక్క | నక్కలు |
| మ్రాను | మ్రాకులు |
| ఎలుక | ఎలుకలు |

**తమిళం**

| | |
|---|---|
| ఏ.వ. | బ.వ. |
| యానై | యానైగళ్ |
| నరి | నరిగళ్ |
| మరమ్ | మరంగళ్ |
| ఎలి | ఎలిగళ్ |

అనుచిత విభాగం వల్ల తెలుగులో నక్క, ఎలుక మొదలయిన శబ్దరూపాలు ఏకవచనంలో ఏర్పడ్డాయి.

పర్జీ భాషలో అమహద్బహువచన ప్రత్యయం -ల్.

పర్జీ

| ఏ.వ. | | బ.వ. |
|---|---|---|
| గేరి | (గోరు) | గేరిల్ |
| ఏను | (ఏనుగు) | ఏనుల్ |

పర్జీ భాషలోని మరో అమహద్బహువచన ప్రత్యయం -కుల్.

పర్జీ

| ఏ.వ. | | బ.వ. |
|---|---|---|
| కెల్ | (రాయి) | కెల్‌కుల్ |
| పెల్ | (దంతం) | పెల్‌కుల్ |
| తెల్ | (తల) | తెల్‌కుల్ |
| మెర్ | (మ్రాను) | మెర్‌కుల్ |
| ఎల్ | (ఎలక) | ఎల్‌కుల్ |

తమిళ, మలయాళ, కన్నడ భాషలలో అమహద్బహువచన రూపం -కళ్.

**కన్నడం**

| | | |
|---|---|---|
| ఉమ్మి | (పొట్టు) | ఉమ్మికళు |
| ఆనె | (ఏనుగు) | ఆనెగళు |
| మర | (చెట్టు) | మరగళు |
| | | మరంగళు |

తెలుగులో అమహద్బహువచన ప్రత్యయంగా -ళ -లు -ళు ప్రసిద్ధం.

**తెలుగు**

| ఏ.వ. | బ.వ. |
|---|---|
| సంవత్సరంబు | సంవత్సరంబుళ్ (-ళ) |
| కుణ్ణికాలు | కుణ్ణికాళ్ళు (ళు) |
| ఏఁడు | ఏండ్లు (-లు) |
| కల | కలలు (-లు) |

అమహద్బహువచన విధానంలో తెలుగు పర్జీ, కోలామి, ఒల్లారి భాషలను పోలి ఉండి మధ్య ద్రావిడ భాషలతో సంబంధం కలిగి తమిళ కర్ణాటక మలయాళాది దక్షిణ ద్రావిడ భాషలతో సంబంధం లేకుండా ఉంది. ఏవో కొన్ని పదాలలో మాత్రం దక్షిణ ద్రావిడ భాషల ప్రభావం (-కళ్ విషయంలో) కన్పిస్తుంది.

తెలుగు, ఒల్లారి, పర్జీ భాషలలో -తిల్/-తుల్ బహువచన ప్రత్యయం కన్పిస్తోంది.

తెలుగు

| ఏ.వ | బ.వ. |
|---|---|
| చేయి | చేతులు (-తుల్) |
| నూయి | నూతులు (-తుల్) |

పర్జీ

| ఏ.వ | బ.వ |
|---|---|
| వార్ (వేరు) | వార్‌తిల్ (-తిల్) |

ఒల్లారి

| ఏ.వ | బ.వ. |
|---|---|
| కణీర్ (కన్నీరు) | కశీర్ తిల్ (-తిల్) |

'-తులు' బహువచనంలో తెలుగు మధ్య ద్రావిడ భాషలతో సంబంధం కలిగి ఉంది.

## ద్రావిడ భాషలలో విభక్తి విధానం :

ద్రావిడ భాషలలో పదాలకు విభక్తి ప్రత్యయం పరమయినపుడు మధ్యలో '-త్ - / -ట్' వంటి విభక్త్యుపసర్గ (Inflectional suffix) చేరుతుంది.

| | ప్రథమా విభక్త్యంగం | ద్వితీయాదివిభక్త్యంగం |
|---|---|---|
| తమిళం | కాటు (అడవి) | కాట్ - ట్ - (<కాట్+త్) |
| | నిలమ్ (నేల) | నిల - త్త్ - |
| కన్నడం | మరమ్/మరవు (మ్రాను) | మర - ద్ - |
| గోండి | రోన్ (ఇల్లు) | రో - త్ - |
| | కై (చెయ్యి) | కై - ద్ - |
| పర్జీ | మెర్ (మ్రాను) | మెర్ - తా - |
| | కెయ్ (చెయ్యి) | కెయ్ - తా - |

తెలుగులో -యి, -రు, -ఱు, -డు లు చివర కల కొన్ని పదాలకు ద్వితీయావిభక్త్యంగం ఏర్పడాలంటే -తి-/-టి- విభక్త్యుపసర్గగా వస్తుంది.

తెలుగు

| ప్రథమా విభక్త్యంగం | ద్వితీయావిభక్త్యంగం |
|---|---|
| నూయి | నూ - తి - |
| ఏఱు | ఏటి (<ఏఱ్ + -తి-) |
| నోరు | నోటి (<నోన + -తి-) |
| గొడ్డలి | గొడ్డటి (<గొడ్డన్ + -తి) |

తెలుగు, కుఇ, కొండ భాషలలో ద్వితీయాదివిభక్త్యంగరూపంగా -తి- చేర్చబడుతోంది. దాన్ని బట్టి వాటి సన్నిహిత సంబంధం ద్యోతకమవుతోంది.

**సర్వనామాలు :**

తెలుగులోని అస్మద్యుష్మదర్థక సర్వనామాల్ని మిగిలిన ద్రావిడ భాషలతో పోల్చి చూస్తే తెలుగు ఏ ద్రావిడ భాషా కుటుంబంతో సన్నిహితంగా ఉన్నదీ తెలుస్తుంది.

అస్మదర్థక ఏకవచనం

| | | |
|---|---|---|
| తెలుగు | ఏను / నేను | నన్ -, నా- |
| గోండి | అనా/నన్నా | నా - |
| కొండ | నాన్ | నా- |
| పెంగొ, మండ | అన్ | నా- |
| కుఇ | అను / నాను | నా- |
| కోలామి, నాయకీ, పర్జీ | అన్ | అన్- |
| కూబి, మాల్తో | ఏన్ | ఏంగ్ |
| తమిళం | యాన్ / నాన్ | ఎన్- |
| మలయాళం | ఞాన్ | ఎన్- |
| కన్నడం | ఆన్ / నాను | ఎన్ |
| మూలద్రావిడం | * యాన్ | * యన్- |

మూలద్రావిడంలో యా- లోపించి తెలుగు, కురుఖ్, మాల్తోలలో ఏ-గా మారుతుంది. ఈ విషయంలో తెలుగుభాష మధ్యోత్తర ద్రావిడ భాషలతో సంబంధం కల్గి ఉందే తప్ప దక్షిణ ద్రావిడ భాషలతో కాదు.

**అస్మదర్థక బహువచనం :**

| | | |
|---|---|---|
| తెలుగు | ఏము/మేము | మమ్- |
| తమిళం | యామ్, యాంకళ్ | ఎమ్, ఎంకళ్ |
| మలయాళం | ఞా ఙ్ఙళ్ | ఎఙ్ఙళ్ |
| తొద | ఎమ్ | ఎమ్- |
| కొండ | మాన్, మాప్ | మా- |
| మండ | ఆం | మా- |
| కురుఖ్, మాల్తో | ఏమ్ | ఎమ్- |
| మూలద్రావిడం | * యామ్ | * యమ్ |

మూల ద్రావిడ యామ్ తెలుగు, కురుఖ్, మాల్తోలలో 'ఏ' గా మారగా మిగిలిన ద్రావిడభాషలలో 'యా/ఆ' గా ఉంది. తెలుగుకు దక్షిణ ద్రావిడ భాషలతో ఈ అస్మద్బహువచన పరిశీలన వల్ల సంబంధం లేదని తెలుస్తోంది.

**యుష్మదర్థక ఏకవచనం :**

| | | |
|---|---|---|
| తెలుగు | ఈవు / నీవు | నిన్ - / నీ- |
| తమి, మల | నీ | నిన్ - |
| కోత, తొద | నీ | నిన్ - |
| కన్నడ | నీన్ /నీను | నిన్ |
| కొండ | నీను | నీ- |
| మండ | ఈవ్ | నీ- |
| పెంగొ | ఏవ్ / ఏనెజ్ | నీ- |
| పర్జీ | ఈవ్ | ఇర్ |
| కురుఖ్, మాల్తో | నీవ్ | నింగ్- |
| మూలద్రావిడ | * నీ(వ్) | * నివ్ |

తెలుగులోని 'నీకు' 'ఇనక్కు' నుంచి వర్ణ వ్యత్యయం వల్ల ఏర్పడింది. ఈ వర్ణ వ్యత్యయం గోండి, కొండ, పెంగొ, మండలలో జరిగింది. తృతీయాది విభక్త్యంగంగా ఏర్పడిన 'నీ-' ఈ విధంగా ఏర్పడిందే.

**యుష్మదర్థక బహువచనం :**

| | | |
|---|---|---|
| తెలుగు | ఈరు / మీరు | మిమ్- / మీ- |
| తమిళం | నీమ్ / నీర్ | ఉమ్- |
| మలయాళం | నిఙ్ఙళ్ | నిఙ్ఙళ్- |
| కన్నడం | నీమ్ / నీవు | నిమ్- |
| కొండ | మీరు | మీ- |
| పెంగొ | నీప్ | మీ- |
| మండ | ఈమ్ | మీ- |
| కుఇ | ఈరు / మీరు | మీ- |
| కురుఖ్, మాల్తో | నీమ్ | నిమ్ |
| మూలద్రావిడం | * నీమ్ | * నిమ్ |

తెలుగులో కొండ, కుఇ లలోని ఈరు /మీరు పదాలకు మూలరూపం వీర్ అయి ఉండవచ్చు. తమిళంలోని 'వీర్' రూపం అర్వాచీనం.

మూలద్రావిడ భాషలోని యుష్మదస్మదర్థక ఔపవిభక్తిక రూపాలు తెలుగు, కువి భాషల్లో వర్ణప్రత్యయం పొంది నకార, మకార శబ్ద రూపాలు ఏర్పడ్డాయి. దీనిని బట్టి తెలుగు, కువి భాషలు ఒకే భాషాకుటుంబానికి చెంది ఉంటాయని మనం నిర్ధారించవచ్చు.

సర్వనామాల సమీక్ష వల్ల తెలుగుకు గోండి, కువి భాషలతో అత్యంత సన్నిహిత సంబంధం ఉన్నదని స్పష్టమవుతోంది. ఈ విషయాన్ని ఆచార్య బిహెచ్. కృష్ణమూర్తి గారు "The weight of evidence of the personal pronouns is there-

fore in favour of grouping Telugu with major sub group of Gondi - Kui - Konda Central Dravidian" (Telugu versal bases L. 263).

## క్రియా స్వరూపం :

అకర్మక క్రియా ప్రాతిపదికలకు సకర్మక ప్రేరణ క్రియా ప్రాతిపదికలకు కల సంబంధాన్ని పరిశీలిద్దాం.

అకర్మక క్రియా ప్రాతిపదికకు త్, బ్, ప్‌లు లేదా ఇత్, ఇచ్, ఇప్‌లు గాని చేర్చగా సకర్మక క్రియాప్రాతిపదికలు లేదా ప్రేరణ క్రియాప్రాతిపదికలు ఏర్పడతాయి. ఈ పద్ధతి మధ్యోత్తర ద్రావిడ భాషలలో అవిరళం కాగా దక్షిణ ద్రావిడ భాషలలో విరళం.

| | అకర్మక క్రియా ప్రాతిపదిక | సకర్మక క్రియాప్రాతిపదిక |
|---|---|---|
| కుఇ | అడ్- | అట్ (<అడ్ - త్-) చేర్చు |
| తెలుగు | అడఁగు | అడఁచు |
| | జరుగు | జరుపు |
| | కాలు | కాల్చు |
| కుఇ | పుహ్ (తడియు) | పుహ్ - ప్- |

'-ఇంచు' అకర్మక క్రియాధాతువుకు చేరటం.

| | అకర్మక క్రియాధాతువు | సకర్మక క్రియాధాతువు |
|---|---|---|
| తెలుగు | ఆడు | ఆడించు (ఆడు+-ఇంచు) |
| | ఓడు | ఓడించు (ఓడు+ఇంచు) |
| | నొచ్చు | నొప్పించు (<నొచ్చు+-ఇంచు) |
| | నవ్వు | నవ్వించు (<నవ్వు+-ఇంచు) |
| కొండ | పిండ్ (మోయు) | పిండిన్ - (<పిండ్+-ఇన్) |

ఈ అకర్మక ప్రేరణ క్రియాధాతు నిర్మాణంలో కుఇ, కొండ, తెలుగు భాషలు ఒక పద్ధతిని అనుసరించగా దక్షిణ ద్రావిడ భాషలు వేరే విధానాన్ని అనుసరించాయి. ఈ విషయంలో తెలుగుకు దక్షిణ ద్రావిడ భాషలతోడి సంబంధం కంటె మధ్య ద్రావిడ భాషలతోడి సంబంధం ఎక్కువ అని స్పష్టంగా తెలపవచ్చు.

తెలుగు, గోండి, కొండ, పర్జీ, ఒల్లారి భాషలకు సన్నిహిత సంబంధముంది అని తెలపటానికి క్త్వార్థ బోధకమయిన -చి ప్రత్యయం (నిబద్ధ పదాంశం) ఈ భాషలన్నిటిలోను సమానం (Common) గా ఉండటం వల్ల ఈ సంబంధం ఋజువవుతుంది.

### క్రియాధాతువు

| | | |
|---|---|---|
| | తెలుగు | |
| వర్ | | వచ్చి (<వర్ + -చి) |
| | గోండి | |
| తిన్ | | తిన్ జీ (<తిన్ + -చీ) |

| | | |
|---|---|---|
| | కొండ | |
| వా | | వాజీ (<వర్ + -చీ) |
| | పర్జీ | |
| నిల్ | | నిల్చి (<నిల్ + -చి) |
| | ఒల్లారి | |
| తిన్ | | తిన్జి (<తిన్ + -చి) |
| | గదబ | |
| ఇన్- | | ఇన్జి (<ఇన్ + -చి) |

తెలుగులోని నిలిచి, చూచి, చచ్చి మొదలయిన వాటిలోని -చి క్త్వార్థక ప్రత్యయంగా నిలుచు + -ఇ; చూచు + -ఇ, చచ్చు + -ఇ అని తప్పుగా విడదీసి '-ఇ' ని క్త్వార్థక ప్రత్యయంగా వ్యాకర్తలు గుర్తించి త్రాగు, సాగు మొదలయిన ధాతువులపై '-ఇ'ని చేర్చి త్రాగి, సాగి మొదలయిన క్త్వార్థక రూపాలను తయారుచేశారు. '-చి' క్త్వార్థక రూపంలో తెలుగు మధ్య ద్రావిడ భాషలయిన గోండి, ఒల్లారి, పర్జీ, కొండ భాషలతో సంబంధం కల్గి ఉంది.

## విధ్యర్థకం :

కుఇ, కొండ, తెలుగు భాషలలోని విధ్యర్థక మధ్యమ పురుష క్రియా రూపాలలో ప్రయోగించబడే పురుషార్థక పదాంశం (Person morphene) ఈ భాషలు ఒకే కుటుంబానికి చెందుతాయి అనే విషయాన్ని స్పష్టం చేస్తుంది.

## విధ్యర్థకం

| | ఏ.వ. | బ.వ. |
|---|---|---|
| తెలుగు | కొట్టు (-ము) | కొట్టుఁడు (<-ండు) |
| కొండ | కొల్ అ | కొండు (<కొణ్ + ట్-) |
| కుఇ | తినుము (<తిన్+ఉము) | తిన్జు (<తిన్ + త్ -) |

మధ్యమ పురుష విధ్యర్థక బహువచన పురుషార్థక పదాంశం తు అని స్పష్టమవుతోంది. ఈ తు అనేదే సన్నివేశాల్ని బట్టి మార్పుపొందుతూంటుంది. దీన్ని బట్టి తెలుగుకు ఇ, కొండ భాషలతో సన్నిహిత సంబంధం కలదిగా తోస్తోంది. వ్యతిరేక క్త్వార్థ బోధక పదాంశమయిన -అక తెలుగు పర్జీల సన్నిహిత సంబంధాన్ని తెలుపుతుంది.

| **తెలుగు** | **పర్జీ** |
|---|---|
| ఈయన (<ఈయ్ + -అక) | చేయక (<చేయ్ + -అక) |
| కొట్టక (<కొట్టు + -అక) | |
| రాక (<వర్ + -చ + -అక) | వెరక (<వెర్ + -అన) |

ఈ పై ఉదాహరణలు తెలుగు పర్జీ భాషల సన్నిహిత సంబంధాన్ని తెలుపుతున్నాయి.

తెలుగు భౌగోళికంగా దక్షిణ ద్రావిడ భాషలతో అత్యధిక సంబంధం కలిగి ఉన్నప్పటికి శబ్దరూప ప్రమాణాన్ని (Morphological evidence) బట్టి మధ్య ద్రావిడ భాషలతో ఎక్కువ సంబంధం కల్గి ఉన్నదని చెప్పవచ్చు.

ఈ విషయాన్ని ఆచార్య కృష్ణమూర్తి గారు తమ తెలుగు క్రియాధాతు (Telugu versal bases P. 269) గ్రంథంలో ఈ ఈ విధంగా తెలిపారు : "Since it has also served exclusive features in common with South Dravidian in phonology rather than in morphology, it may be considered that Telugu has been in intimate geographical contact with the members of South Dravidian from a veryremote fast. The morphological evidence but it rather conclusively with Central Dravidian."

బ్రాహుఈ, కుడుఖ్, మాల్తోలు భౌగోళికంగాను శబ్దనిర్మాణం బట్టి కూడా వేరే కుటుంబంగా నిర్వివాదంగా పరిగణించబడ్డాయి.

దక్షిణ ద్రావిడోపకుటుంబంలో ఉన్న తమిళం, మలయాళం, కన్నడం, తుళు, కొడగు, తొద, కోత భాషలు వేరే ఉపద్రావిడ కుటుంబంగా భౌగోళికంగాను శబ్దరూప నిర్మాణాన్ని బట్టి భావించబడ్డాయి. ఉత్తర మధ్య ద్రావిడోపకుటుంబాలలో లేని పదాలు రమారమి 200 ఈ దక్షిణ ద్రావిడ భాషలలో ఉన్నాయి.

**ఉదా :**

| | | |
|---|---|---|
| తమిళం | : | అరణై 'ఒక రకం బల్లి' |
| కన్నడం | : | అరణె, రాణె |
| తుళు | : | అరణె, రాణె |
| తమిళం | : | అరి, అరిసి "బియ్యం" |
| మలయాళం | : | అరి |
| కన్నడం, కొడగు | : | 'అక్కి' బియ్యం |
| తమిళం | : | ఇలై 'ఆకు' |
| తుళు | : | అరి, అక్కి |
| మలయాళం | : | ఇల 'ఆకు' |
| కన్నడం | : | ఎల, ఎలె 'ఆకు' |
| తమిళం, మల., కోత కేళ్ | : | విను, అడుగు |
| తొద | : | కేళ్ విను, అడుగు |

మూల దక్షిణ భాష నుండి మొదట విడిపోయిన భాష తుళు, తర్వాత కన్నడం వీటి నుంచి విడిపోయింది. తర్వాత తమిళ, మలయాళ భాషలు విడిపోయాయి. తమిళ మలయాళ భాషా సముదాయం నుంచి కొడగు విడిపోయింది. తొద, కోతలు తమిళ, మలయాళ, కొడగుల నుంచి విడిపోయాయి.

## మధ్య ద్రావిడ భాషలు :

మధ్య ద్రావిడ భాషల సంఖ్య ఎక్కువ. దీనితోపాటు వీటి మధ్య వైవిధ్యం కూడా అధికమే. వీటిన ప్రత్యేక ద్రావిడోపకుటుంబంగా భావించటానికి ఈ భాషలలోని విలక్షణతలే కారణం.

1. లింగవచన విలక్షణతలు
2. అళ్‌తో ఉన్న స్త్రీ వాచక పదాలు అనేకం వీటిలో ఉండటం.
3. అమహద్బహువచనం నిత్యంగా వీటిలో ఉండుట.
4. మూలద్రావిడలోని య - అ - గా మారటం.
5. యుష్మదర్థక సర్వనామాల్లో న- లోపించటం.
6. మహదేకవచన సర్వనామం ఒకే రీతిలో ఉండటం.
7. క్త్వార్థక ప్రత్యయం -చి కావటం.
8. మధ్య ద్రావిడ భాషలకే పరిమితమయిన విశిష్ట పదాల సంఖ్య 50 కు పైగా ఉండటం.

| | | | |
|---|---|---|---|
| అ) | తెలుగు | : | డప్పి, డప్పిక, దప్పిక, 'దాహం' |
| | కోలామి | : | అడ్డ్- 'దాహంవేయు' |
| | నాయకి | : | అడ్ 'దాహం' |
| | పర్జీ, గదబ | : | 'దాహం, దాహంవేయు'. |
| ఆ) | తెలుగు | : | రాలు, రాల్చు |
| | కోలామి | : | రాల్, రావ్ |
| | నాయకీ | : | రాల్, రాల్ప్ |
| | గోండి | : | ఆర్ |
| | కొండ | : | ఆర్ |
| ఇ) | పర్జి | : | ఏయిర్, ఏదిళ్ 'పడవళ్ళు' |
| | గదబ | : | ఆదిర్, ఆదుర్ 'పడవళ్ళు' |
| ఈ) | తెలుగు | : | ఇలుగు / ఈలుగు / నీలుగు 'చచ్చు' |
| | పర్జి, గదబ | : | ఈల్ 'పడు' |
| ఉ) | తెలుగు | : | దువ్వు |
| | కోలామి | : | దువ, డూ |
| | గోండి | : | డువ్, డువ్వాల్ |
| ఊ) | తెలుగు | : | ఆకు 'పత్రం' |
| | కొండ | : | అక్ 'పత్రం' |
| | పెంగొ, మండ | : | అకి 'పత్రం' |
| | కుఇ, కువి | : | ఆకు 'పత్రం' |
| ఎ) | తెలుగు | : | పండు 'ఫలం' |
| | పర్జి | : | వెంద్, వెండ్ 'ఫలం' |
| | గదబ | : | పండ్ |

పెంగొ, మండ : పంజ్ 'ఫలం'
కుఇ, కువి పజ్

మధ్య ద్రావిడ భాషల అంతర్విభాగాన్ని పి.ఎస్.ఎస్. ఈ విధంగా విభజించారు.

**అ) మూల ద్రావిడ భాష మొట్టమొదట రెండుగా విభక్తమయింది.**

మూల మధ్య ద్రావిడ భాష

తెలుగు, కుని కోలామి, పర్జి

కోలామి, పర్జి ఉపకుటుంబం తర్వాతి కాలంలో కోలామి, నాయకీ; పర్జీ గదబలుగా రెండుగా చీలిపోయింది.

తెలుగు కువి భాషలు ఏకభాషగా ఉన్న కాలంలో కొన్ని భాషా పరిణామాలు జరిగాయి.

1. వర్ణ వ్యత్యయం : గోండి, కొండ భాషలలో పదాదిని అచ్చులు కల పదాలలోనే వర్ణ ప్రత్యయం జరిగింది.
2. యుష్మదస్మదర్థక సర్వనామాల ఔపవిభక్తిక రూపాలలోనే వర్ణ వ్యత్యయం జరుగుతుంది.

మూల ద్రావిడంలో అన్, అమ్, ఇన్, ఇమ్‌లు వర్ణ వ్యత్యయం వల్ల క్రమంగా నా-; మా -; నీ-; మీ- లుగా మారాయి. అర్వాచీనాంధ్రంలోను, కొన్ని గోండి మాండలికాలలోను, కొండ, కుఇ మాండలికాలలోను, కువి లోను ఈ ఔపవిభక్తి రూపాల సామ్యం వల్ల ప్రథమావిభక్తి రూపాలలోను ఏకవచనంలో నకారాన్ని బహువచనంలో మకారాన్ని పదాదిలో చేర్చుకున్నాయి.

ముఖ్యంగా ఈ ఉపకుటుంబంలో విధ్యర్థకంలో -ట్ అనే నూతన బహువచన ప్రత్యయం సృష్టించబడింది.

ఈ మధ్య ద్రావిడోపకుటుంబం నుండి మొట్టమొదట విడిపోయిన భాష తెలుగు. ఈ కాలం క్రీ.పూ. 1000 సంవత్సరాల కాలం కావచ్చు. గోండి కువి సముదాయం నుంచి మొదట విడిపోయినది గోండి భాష. కొండ-కువి సముదాయం నుంచి కొండ మొదట విడిపోయింది.

పెంగొ, మండ, కుఇ, కువి భాషలు ఒక సముదాయానికి చెందినవిగా భావించవచ్చు. ఇవి ఒకే ఉపభాషా కుటుంబానికి చెందినవిగా భావించవచ్చు. వీటిని గురించి ఇటీవల విశేష పరిశ్రమ జరిగింది.

మూల ద్రావిడ (మూ.ద్రా) భాష నుండి మొట్టమొదట ఉత్తర ద్రావిడ (ఉ.ద్రా.) భాషలు విడివడ్డాయి. వాటి నుండి బ్రాహుఈ తొలుత విడిపోయింది. తర్వాత కుడుఖ్, మాల్తోలు ప్రత్యేక భాషలుగా ఏర్పడ్డాయి.

మూలద్రావిడం

మూల ఉత్తర ద్రావిడం

బ్రాకుఈ మూలకుడుక్ - మాల్తొ

కుడుఖ్ మాల్తొ

మూల ద్రావిడం నుంచి మూల మధ్య ద్రావిడ (మూ.మ.ద్రా.) భాష ఏర్పడిందని అది తర్వాతి కాలంలో విభిన్న భాషలుగా విడివడిందని ద్రావిడ భాషా శాస్త్రజ్ఞులు భావించారు.

మూల ద్రావిడం

మూల మధ్య ద్రావిడం

| | | |
|---|---|---|
| మూల తెలుగు - కువి | | మూలకోలామీ - పర్జి |
| మూలగోండి - కువి | | మూలకో. నాయకీ మూపర్జి - గద |
| మూలకొండ - కువి | కోలామి నాయకీ పర్జీ | గది |
| మూలపెంగొ - కువి | | |
| మాత్ర పెంగో - మంక | మలకున్నా - కువి | |
| పెరగొ | దుండకుఇ | కువి |

మధ్య ద్రావిడ భాషలలో తెలుగుకు మాత్రమే ప్రాచీన సాహిత్యం ఉంది. క్రీ.శ. 6వ శతాబ్ది నుంచి శాసనాలు, క్రీ.శ. 11వ శతాబ్ది నుండి సారస్వతం ఉంది.

మూలద్రావిడం నుండి విడివడిన మరో ఉపభాషా కుటుంబం మూలదక్షిణ ద్రావిడ (మూ.ద.ద్రా.) భాష. ఈ ఉప భాషా కుటుంబ విభజన ఈ విధంగా ఉంది.

మూల ద్రావిడం

మూల దక్షిణ ద్రావిడం

మూల కన్నడం - తమిళం

మూల తమిళం - మలయాళం

మూలకోత - తొద

తమిళం మలయాళం కొడుగు కోత తొద కన్నడం తు ళు

ఆచార్య బిఎచ్. కృష్ణమూర్తి గారు ద్రావిడ భాషలను నాలుగు ఉపభాషాలుగా విభజించారు. ఆచార్య పి.ఎస్. సుబ్రహ్మణ్యం గారు ద్రావిడ భాషలను మూడు ఉపభాషా కుటుంబాలుగానే నేటికీ భావిస్తున్నారు. ఉత్తర ద్రావిడ భాషల విషయంలో వీరికి బేధాభిప్రాయం లేదు. దక్షిణ ద్రావిడ భాషల విషయంలోను అంతగా భేదాభిప్రాయం ఉన్నట్లు కన్పించటంలేదు. ఇంతవరకు తమిళం, మలయాళం, కొడగు, కోత్, తొద, కన్నడం, తుళు భాషల్ని (7) మాత్రమే దక్షిణ ద్రావిడ భాషలుగా అందరూ గుర్తిస్తుండగా ఆచార్య కృష్ణమూర్తి గారు ఇరుళ, కుఱుంబ, బడగ, కొరగ భాషలను పై ఏడింటికి చేర్చి మొత్తం 11 భాషలను దక్షిణ ద్రావిడ భాషలు (1) (Southern group [SD1] అని పేరు పెట్టారు. బడగ, కన్నడ, మాండలికమని, కొరగ, తుళుమాండలికమని ఇరుళ, కుఱుంబలు ప్రత్యేక భాషలు కావని ఆచార్య పి.ఎస్. సుబ్రహ్మణ్యం గారు పేర్కొన్నారు.

మధ్య ద్రావిడ భాషల విషయంలో అభిప్రాయ భేదాలు అధికంగా ఉన్నాయి. మధ్య ద్రావిడ భాషలలో "కోలామి, నాయకి, నాయకి (చంద), పర్జి, ఒల్లారి, గదబలను మధ్య ద్రావిడ భాషలుగా ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి గారు పేర్కొన్నారు. వీటిలోని నాయకి ని కోలామి మాండలికంగా ద్రావిడ భాషలు గ్రంథకర్తలు పేర్కొని ఒల్లారిని గదబ మాండలికం గా భావించి వేరేగా గుర్తించలేదు. ఆవె భాషపై పరిశోధన కావించిన ఆచార్య బి. కృష్ణారెడ్డి, పర్వతనేని సుబ్బారావు గారు 'ఆవే' ప్రత్యేక ద్రావిడభాష అని పేర్కొంటున్నారు.

తెలుగు, గోండి, కొండ, కుఇ, కువి, పెంగొ, మండ భాషలను ఆచార్య కృష్ణమూర్తి గారు దక్షిణ మధ్య ద్రావిడ భాషలు 11 (SD II) గా భావించి వేరే ద్రావిడ ఉపభాషా కుటుంబంగా భావించారు. వీరి అభిప్రాయం ప్రకారం ద్రావిడ భాషలను నాలుగు ఉపకుటుంబాలుగా విభజించాలి. ఆవిధంగా చేయనవసరం లేదని ఆచార్య పి.ఎస్. సుబ్రహ్మణ్యం గారు ఐ.జెడి.ఎల్. (జనవరి 2004) లో పేర్కొన్నారు. ఈ విషయాలన్నిటిని పరిశీలిస్తే ద్రావిడ భాషలపై ఇంకా పరిశోధన కొనసాగించాల్సిన అవసరం ఉందని స్పష్టపడుతోంది.

**ఆధార గ్రంథములు :**


చక్రధరరావు, లకంసాని. 1968 : భాషాశాస్త్ర వ్యాసములు, తెలుగుశాఖ, ఆంధ్రా యూనివర్సిటీ, విశాఖపట్నం - 3.

సుబ్రహ్మణ్యం, పి.ఎస్. 2000 : ద్రావిడ భాషలు, పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయం, లలిత కళాక్షేత్రం, పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాదు - 4.


**చదువదగిన గ్రంథాలు :**


Krishnamurti, BL. 2003. : The Dravidian Languages, Cambridge University Press, The Eduinburoph Building, Cambridge (B22RU), United Kingdom.

Subrahmanyam, P.S. 2004. : The Dravidian Languages (BL. Krishnamurti), IJDL, Dravidian Linguistic Association, Kerala Panini Building, St. Xavier's College P.o. Tiruvananthapuram, Kerala.

పాఠం -11

# ద్రావిడ భాషగా తెలుగు : విస్తీర్ణం, జనాభా - సరిహద్దు భాషలు

## ఆంధ్రం - తెనుగు - తెలుగు

**పాఠ్యాంశ నిర్మాణక్రమం :**


**11.1** ద్రావిడ భాష

**11.2** ద్రావిడ భాషగా తెలుగు

**11.3** తెలుగు భాష -విస్తీర్ణం

**11.4** తెలుగు భాష - జనాభా

**11.5** తెలుగు - సరిహద్దు భాషలు

**11.6** తెలుగు భాష

**11.7** ఆంధ్ర పదం -వివరణ

**11.8** ఆంధ్రం (జాతివాచకంగా)

**11.9** అంధర

**11.10** అంధక

**11.11** ఆంధ్రక

**11.12** ఆంధ్రం (దేశవాచకంగా)

**11.13** ఆంధ్రం (భాషా వాచకంగా)

**11.14** తెనుంగు, తెనుఁగు, తెనుగు

**11.15** తెనుగు పదం -వ్యుత్పత్తి

**11.16** తెలుంగు , తెలుఁగు, తెలుగు

**11.17** తెనుగు, తెలుగు -పరస్పరసంబంధం

**11.18** వడుగి/వరుగి

**11.19** జెంతో.


**లక్ష్యం :**

ద్రావిడ భాషా కుటుంబంలో తెలుగు, దాని స్థానం, విస్తీర్ణం, జనాభా, సరిహద్దు భాషలు, తెలుగు భాషకున్న ఇతరపేర్లు వాటి వ్యుత్పత్తి, చరిత్రలను తెలుసుకోవటం ఈ పాఠ లక్ష్యం.

### 11.1 ద్రావిడ భాష :

క్రీ.పూ. 3000 సంవత్సరాలనాడు భారతదేశంలో ద్రావిడులనే ఒకజాతి వారు నివసించారనీ, వారు యావద్భారతదేశంలోనూ ఉన్నారని వ్యవసాయాన్ని ఎంతో అభివృద్ధి చేశారనీ, ఎంతో నాగరికతను అలవర్చుకొన్నారనీ చరిత్రకారుల అభిప్రాయం.

క్రీ.పూ. 3వేల ఏళ్ళనాడు ఒకే భాషగా ఉన్న మూల ద్రావిడ భాషనుండి మొట్టమొదట ఇప్పుడు పాకిస్తాన్‌లోని బెలూచీస్తాన్, ఆఫ్గనీస్తాన్‌లలో మాట్లాడే బ్రాహూఈ భాష మొదటగా విడిపోయిందనీ, క్రీ.పూ. 2500 సంవత్సరాల నాడు కురుఖ్, మాల్తోలు ఆ తరువాత కోలామి, నాయకీ, పర్జీ, గదబలు, ఆ పిదప గోండీ, కొండ, కుఇ, కువి భాషలు విడిపోగా తెలుగు క్రీ.పూ. 1000 వ సంవత్సరాలనాటికి ప్రత్యేక భాషగా విడివడిందనీ ప్రొఫెసర్ ఆండ్రినోవ్, భద్రిరాజుకృష్ణమూర్తి మొదలయిన భాషా శాస్త్రవేత్తలు భావించారు. అంటే వీరి అభిప్రాయం ప్రకారం తెలుగు భాషకు మూడు వేల సంవత్సరాల చరిత్ర ఉంది.

## 11.2 ద్రావిడ భాషగా తెలుగు :

ఇప్పటి వరకు జరిగిన పరిశోధనలో 26 ద్రావిడ భాషలున్నట్లు, ఇంకా అనేక మాండలికాలు, మరికొన్ని భాషలు ఉండిఉండవచ్చని ద్రావిడ భాషల మీద పరిశోధన చేసిన వారంటున్నారు. ప్రపంచంలో ఉన్న ప్రధాన భాషా కుటుంబాలలో ద్రావిడ భాషా కుటుంబం ఒకటి. భారతదేశానికి సంబంధించినంతవరకు ఇండో-యూరోపియన్ భాషా కుటుంబానికి చెందిన హింద్వార్య భాషా ఉపకుటుంబానికి చెందిన భాషలు మాట్లాడే ప్రజలు సుమారు 70 కోట్లమందితో మొదటి స్థానంలో ఉండగా, సుమారు 30 కోట్ల జనాభా కలిగిన ద్రావిడ భాషలకు సంబంధించిన ద్రావిడ భాషా కుటుంబం రెండో స్థానంలో ఉంది. భారతదేశంలో హిందీ తర్వాత అధికులు మాట్లాడే భాష తెలుగు. ద్రావిడ భాషా కుటుంబంలో మొదటి స్థానంలో ఉంది. ద్రావిడ భాషా కుటుంబంలో

1. తమిళం
2. మలయాళం
3. కన్నడం
4. తుళు
5. కొడగు
6. తొద
7. కోత
8. బదగ
9. తెలుగు
10. గోండి
11. కొండ
12. కుఇ
13. కువి
14. పెంగో
15. మండ
16. అవుత్
17. ఆవె
18. కోలామి
19. నాయకీ
20. పర్జీ

21. గదబ
22. ఒల్లారీ
23. కురుఖ్
24. మాల్తో
25. బ్రాహూ-ఈ
26. థంగర్

అని 26 భాషలున్నట్లుగా ప్రస్తుత పరిశోధనలవల్ల తెలుస్తోంది. వీటిని ప్రధానంగా మూడు ఉపకుటుంబాలుగా విభజించారు. తమిళం నుంచి బదగవరకు ఉన్న 8 భాషల్ని దక్షిణ ద్రావిడ భాషలనీ, తెలుగు నుంచి ఒల్లారీ వరకు ఉన్న 14 భాషల్ని మధ్య ద్రావిడ భాషలనీ, కురుఖ్ నుంచీ థంగర్ వరకు ఉన్న 4 భాషల్ని ఉత్తర ద్రావిడ భాషలని పేర్కోవటం జరిగింది.

తెలుగులో ధ్వనులు, వ్యాకరణ నిర్మాణం మిగిలిన ద్రావిడ భాషలతో పోల్చిచూసినప్పుడు తెలుగు మధ్య ద్రావిడ భాష అనీ, దానికి మిగిలిన మధ్య ద్రావిడ భాషలయిన గోండి, కొండ, కుఇ, కువి..... భాషలతో అతి సన్నిహిత సబంధం ఉందనీ స్పష్టమయింది ప్రస్తుతం మనం తెలుగు భాషగా పిలుస్తున్న మధ్య ద్రావిడ భాష గురించి విపులంగా తెలుసుకుందాం.

## 11.3 తెలుగు భాష - విస్తీర్ణం :

తెలుగు భాషను మాట్లాడే ప్రజలకు స్వంత రాష్ట్రం ఒకటుండాలని ఉద్యమించిన తెలుగు ప్రజలు ఉద్యమ ఫలితమే 1956 నవంబర్ 1వ తేదీన ఏర్పడ్డ మొదటి భాషా ప్రయుక్త రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సుమారు 2,77, 000 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో ఉంది.

## 11.4 తెలుగు భాష జనాభా :

'దేశభాషలందు తెలుగు లెస్స' అని శ్రీకృష్ణదేవరాయలచేత పొగడ్తలందుకున్న భాష తెలుగు. ఇది ద్రావిడ భాషలలో అతి ప్రధానమయిన భాష. తెలుగు ప్రజలు దక్షిణ భారతదేశంలో ఇప్పుడున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రధానంగానూ, ఇరుగుపొరుగు రాష్ట్రాలయిన తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాలలోనూ, ఇంకా భారతదేశంలోని అనేక ఇతర రాష్ట్రాలలోనూ, మారిషస్ , మలేషియా, శ్రీలంక, దక్షిణాఫ్రికా, అమెరికా సంయుక్తరాష్ట్రాలు , ఇంకా అనేక పశ్చిమ దేశాలలో మొత్తం సుమారు 10 కోట్ల మంది జనాభా తెలుగు భాషను మాట్లాడుతున్నారు. ద్రావిడ భాషా వ్యవహర్తలలో తెలుగు మాట్లాడే వారే అధికులు. తెలుగునాడును మొదట ఆంధ్రవంశపురాజులు పరిపాలించడం వల్ల దీనికి ఆంధ్రదేశమనీ, ఇక్కడి ప్రజలని ఆంధ్రులనీ, భాషని ఆంధ్ర భాష అంటారనీ చరిత్రకారులు భావిస్తున్నారు.

## 11.5 తెలుగు - సరిహద్దు భాషలు :

తెలుగు భాషను మాట్లాడే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సరిహద్దు రాష్ట్రాలయిన తమిళనాడులో తమిళభాష, కర్ణాటక రాష్ట్రంలో కన్నడభాష, మహారాష్ట్రలో మరాఠీ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్‌లలో హిందీ, ఒరిస్సాలో ఒరియా భాషలు మాట్లాడతారు. ఆంధ్రరాష్ట్రానికి తూర్పువయిపున బంగాళాఖాతం ఉంది.

## 11.6 తెలుగుభాష :

మనం ఇప్పుడు తెలుగుభాషగా పిలుస్తున్నభాషకు ప్రాచీన సంస్కృతసాహిత్యంలోనూ, తెలుగు కావ్యాలలోనూ వివిధ పేర్లతో కనపడుతోంది. సంస్కృత గ్రంథాల్లో అంధ్ర, ఆంధ్ర, అంధ, అంధక, ఆంధ్రక మొదలయిన శబ్దాలు ఆంధ్ర శబ్దానికి రూపాంతరంగా కనిపిస్తోంది. అదేవిధంగా తెలుగు కావ్యాలలో తెనుంగు, తెలుంగు, తెనుఁగు, తెనుగు, తెలుఁగు, తెలుగు, ఇత్యాది పేర్లు కనబడుతున్నాయి. ఇవి గాక వరుగి, వడుగగి, వడగు పదాలు, జెంతో అనేది తెలుగు భాషను సూచించడానికి వాడటం జరిగింది. తెలుగు భాషను గురించి కొంత తెలుసుకున్న తర్వాత ఆ పదాల చరిత్రనూ, రూపనిష్పత్తినీ, పరస్పరసంబంధాన్ని పరిశీలించడం జరుగుతుంది.

ఇప్పుడు తెలుగు భాషను మాట్లాడే ప్రాంతాన్ని మొదట ఆంధ్రరాజులు పాలించారని చెప్పుకున్నాం. ప్రాథమికావస్థలో ఆంధ్రరాజులు దైనిక, రాజకీయ , సాహిత్యవ్యవహారాలలో ప్రాకృతాన్నే వాడేవారు. వారి పేర్లు కూడా ప్రాకృతాలే. తెలుగు నాట కేంద్రస్థానంలో ఉన్న భట్టిప్రోలు, అమరావతి, జగ్గయ్యపేట, నాగార్జున కొండ మొదలయినవి బౌద్ధాలయాలకు ప్రసిద్ధి. అలాగే విశాఖపట్నం మొదలయిన చోట్లకూడా బౌద్ధారామాలు ఉండేవి. బౌద్ధ సన్యాసులు తమ సారస్వతాన్ని, ప్రచారాన్ని ప్రాకృత భాష (పాళీ) లోనే చేశారు. ఈ తరువాత సంస్కృతం రాజభాష అయింది శాసనాలు అన్నీ సంస్కృత, ప్రాకృత భాషలలో ఉన్నా అందులోని గ్రామాల పేర్లు, వ్యక్తుల పేర్లు, తెలుగువే వాడారు.

మార్గకవిత్వం బాగా ప్రచారంలో ఉన్నప్పుడు ఆంధ్రదేశంలో మొట్టమొదట చాళుక్యరాజులు తెలుగు భాషకు ప్రాధాన్యమిచ్చి పోషించారు. క్రీ.శ. 6వ శ॥ నుంచి తెలుగు భాషకు గౌరవం వచ్చిందని భావించవచ్చు. 11వ శతాబ్ది రాజరాజనరేంద్రుడి కాలానికి భారతం తెలుగులో వచ్చి తెలుగు భాషకు పట్టాభిషేకం జరిగిందని చెప్పవచ్చు.

తెలుగులో మొదట లభించిన గ్రంథం 11వ శతాబ్దిలో రాజరాజనరేంద్రుడి ఆస్థాన కవి నన్నయరాసిన ఆంధ్రమహా భారతం. అందులో ఆయన ఆది, సభాపర్వాలు, అరణ్యపర్వంలో కొంతభాగం రాశారు. దానికి ముందున్న తెలుగు భాషా చరిత్రను తెలుసుకోవటానికి మనకు లభించిన తామ్ర శాసనాలూ, శిలా శాసనాలు తోడ్పడతాయి. వీటిలో కడపజిల్లా కమలాపురం తాలూకా ఎర్రగుడిపాడు (క్రీ.శ. 575-600), కలమళ్ళశాసనం (క్రీ.శ. 576-600) లలో దొరికిన శాసనాలు మొదటివిగా భావిస్తున్నారు. అయితే వీటికంటే ముందు క్రీ.శ.200 కి చెందిన శాసనం బ్రాహ్మీలిపిలో ఉంది. ఇది గుంటూరు జిల్లా అమరావతిలో లభించింది. ఇందులో 'నాగబు' అనే మాటలోని 'బు' తెలుగు ప్రత్యయమని (మొదటిగా చెప్పిన వారు వేటూరి ప్రభాకరశాస్త్రి గారు) దీనినే మొదటి శాసనంగా పరిగణించవచ్చని కొందరి వాదన.

ఇప్పటి తెలుగు భాషకి చాలా స్థల మాండలికాలూ, కుల మాండలికాలు (అనుమానమే)ఉన్నాయి. వీటిని గురించిన పరిశోధన కొంత జరిగింది. కాని ఇంకా జరగవలసింది చాలా ఉంది. మన భాషలో కోస్తా లేదా సర్కారు మాండలికం, రాయలసీమ మాండలికం, తెలంగాణా మాండలికం, పూర్వ లేదా కళింగాంధ్ర మాండలికం అని ప్రధానంగా నాలుగు మాండలికాలున్నాయని భద్రిరాజు కృష్ణమూర్తి గారి పరిశోధనల వల్ల తేలింది.

## సాహిత్యం :

మన భాషలో లభించిన లిఖిత సాహిత్యం 11వ శతాబ్దిలో నన్నయ గారి భారత రచన మొదటిది. అయితే అప్పటికే తెలుగులో కవిత్వం రాయటం ఉందనేది పండరంగుని అద్దంకి శాసనం(848), యుద్ధమల్లుని బెజవాడ శాసనం (885), గుణగవిజయాదిత్యుని ధర్మవరం (848) శాసనాలు, ఇంకా ఇతర శాసనాల వల్ల తెలుస్తోంది. అప్పటికే తరువోజ, సీసం, ఆటవెలది,

తేటగీతి, మధ్యాక్కర మొ॥న దేశీయచ్ఛందస్సులలో తెలుగు పద్యాలు ఉన్నాయి. భాషావేత్తలు ఆనాటికే తెలుగులో గ్రంథాలు కూడా ఉండి ఉండవచ్చని భావిస్తున్నారు. కాని మనకు ఇప్పటి వరకు ఏమీ లభ్యం కాలేదు.

తెలుగులో నన్నయ, తిక్కన, ఎర్రన , శ్రీనాధుడు, పోతన, పెద్దన, రామరాజభూషణుడు, తెనాలి రామకృష్ణుడు, పింగళిసూరం పింగళ సురన, నంది తిమ్మన, కృష్ణదేవరాయలు, మల్లికార్జున పండితారాధ్యులు, పాల్కురికి సోమన, వేమన మొదలయిన ఎందరో మహాకవులు రచనలు చేసి వారి పేరును చిరస్థాయిగా నిలచేటట్లు చేసుకున్నారు.

ఆధునికులలో గిడుగు, కందుకూరి, గురజాడలు ప్రసిద్ధులు. శ్రీశ్రీ దాశరథి, విశ్వనాథ, సి. నారాయణరెడ్డి మొదలుగున్నవారు ముఖ్యులు. తెలుగు వ్యాకరణాలలో నన్నయే 'ఆంధ్ర శబ్ద చింతామణి'ని రాశారంటారు. కాని 16 వ శతాబ్దంలో ఎవరో రాసి ప్రామాణ్యతకోసం ఆయన పేరు పెట్టారని పరిశోధకులు భావిస్తున్నారు. కేతన 'ఆంధ్ర భాషా భూషణం', విన్నకోట పెద్దన 'కావ్యాలంకార చూడామణి', గణపరపు వెంకటకవి' సర్వలక్షణ శిరోమణి, కూచిమంచి తిమ్మకవి 'లక్షణసారసంగ్రహం' మొదలుగునవి పేర్కొదగినవి. కాగా ఆధునికకాలంలో చిన్నయసూరి రాసిన 'బాలవ్యాకరణం', బహుజనపల్లి సీతారామాచార్యులు రాసిన 'త్రిలింగ లక్షణశేషము' లేక 'ప్రౌఢవ్యాకరణం' బాగా ప్రచారంలో ఉన్నాయి.

మొత్తం మీద తెలుగు భాషకు అంధ్ర, ఆంధ్ర, అంధక, ఆంధ్రక, అంధ  తెనుంగు, తెనుఁగు, తెనుగు; తెలుంగు తెలుఁగు, తెలుగు, వడగు, వడుగ, వరుగి; జెంతో అనే పదాలు కనిపిస్తున్నాయి. ఏకార్థబోధకాలయిన ఈ పదాల చరిత్రనూ, రూపనిష్పత్తినీ, పరస్పర సంబంధాన్ని పరిశీలించుదాం.

## 11.7 ఆంధ్ర పదం -వివరణ :

ఆంధ్ర శబ్దం సంస్కృత పదం. ఇది అత్యంత ప్రాచీన మయినది. ప్రాచీన కాలం నుంచి నేటి వరకు ఆంధ్రులు నివసించిన భూభాగాన్ని ఆంధ్రదేశమని వ్యవహరిస్తున్నారు. 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడి ఆ తరవాత 1-11-1956 లో తొలి భాషా ప్రయుక్తరాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. జనాభా విషయంగా చూసినప్పుడు భారతదేశంలో హిందీ తర్వాత రెండో అధిక సంఖ్యాకులు మాట్లాడే భాష తెలుగు భాష. ఇది 25 జిల్లాలు కలిగిన సువిశాల రాష్ట్రం.

### 11.7.1 అంధ్రపదం - వ్యుత్పత్తి :

అంధ్ర పదానికి 1. చీకటిని నాశనం చేసేవాడు లేదా తొలగించేవాడు 2. నీటిమీద గమనం కలవాడు అంటే జలయానం చేసేవాడు 3. అన్నం హస్తంగా కలవాడు అనగా అన్నదాత అని మూడువ్యుత్పత్తుల్ని చెప్పారు.

ఆర్యులు దక్షిణాపథంలో నివసిస్తున్న ఒక జాతి వాళ్ళను అంధ్రులని పేర్కొన్నారు. దక్షిణాపథం గురించి సరయిన అవగాహన లేని ఆర్యులు దక్షిణ భూభాగాన్ని చీకటి దేశంగానూ, అక్కడి ప్రజల్ని అజ్ఞానులుగానూ, అమాయకులుగానూ భావించి వారిని 'అంధ్రులు' గా పిలిచినట్లు కనిపిస్తుంది.

### 11.7.2. అంధ్ర-ఆంధ్ర :

ఉచ్చారణలో కాలక్రమేణా 'అంధ్ర' శబ్దమే 'ఆంధ్ర' గా మారి ఉంటుందనేది భాషా పరిశోధకులు అభిప్రాయం. ఆంధ్ర పదం మొదటి జాతి వాచకంగానూ, దేశవాచకంగానూ ఆ తర్వాత భాషా వాచకంగానూ వాడటం జరిగింది.

## 11.8 ఆంధ్ర (జాతి వాచకంగా) :

క్రీ.పూ. 800-600 సంవత్సరముల నాడు ఐతరేయ బ్రాహ్మణంలోని శునశ్శేపుని వృత్తాంతంలో మొట్టమొదటి ఆంధ్రశబ్దం జాతి వాచకంగా ప్రయోగించబడింది. శునశ్శేపుణ్ణి తమ జ్యేష్ఠభ్రాతగా అంగీకరించడానికి నిరాకరించిన మొదటి యాభై మంది పుత్రుల్ని అనార్య జాతులయిన ఆంధ్ర, పుండ్ర, శబర, పుళింద, మూతిబాది దస్యులలో కలసి పొందని విశ్వామిత్రుడు శపించి బహిష్కరించి నట్లు ఒక ఐతిహ్యం ఉంది. ఇప్పటి వరకు పరిశోధనలో తెలిసి నంతవరకు జాతిని పేర్కొంటూ ఆంధ్ర శబ్దానికి సంస్కృతంలో మొదటి ప్రయోగం ఇదే, మ్లేచ్ఛులయిన ఈ అయిదు జాతుల వారూ ఆర్యావర్తానికి సరిహద్దు ప్రాంతాల్లో ఆనాడు నివసిస్తున్న ద్రావిడులుగానీ లేదా ముండాభాషలకు సంబంధించిన ప్రజలు గానీ అయి ఉండవచ్చు. దీనని బట్టి ఆంధ్రులు అనార్యులయిన ద్రావిడులలో ఒక తెగవారని అభిప్రాయపడటంలో తప్పులేదు.

9.8. 1 వ్యాసమహర్షి విరచితమయిన భారతంలో ఆంధ్రుల ప్రసక్తి అయిదు చోట్ల కనిపిస్తోంది.

1. సభాపర్వంలో ధర్మరాజు రాజసూయయాగం చేసే సందర్భంలో సహదేవుడు దక్షిణ దిగ్విజయ యాత్రచేస్తాడు. అప్పుడు సహదేవుడు పౌండ్రుల్ని, ద్రవిడుల్ని, కేరళీయుల్ని, ఆంధ్రుల్ని , తాలవనుల్ని, కళింగుల్ని, ఉష్ట్రకర్ణికుల్ని, ఆటవికుల్ని, యవనుల్ని ఓడించినట్లుంది.
2. అరణ్యపర్వంలో మార్కండేయుడు ధర్మరాజుతో కలియుగ ధర్మాల్ని చెప్పే సందర్భంలో ఆంధ్రులు, శకులు, పుళిందులు, యవనులు, కాంభోజులు, ఔర్ణికులు, శూద్రులు, అభీరులు పాపాత్ములని ఉంది.
3. సంజయుడు ధృతరాష్ట్రుడికి భారతదేశంలోని నదీ, దేశ, జన పదాల నామాలను చెబుతూ ఔష్ట్రుల, పుండ్రుల , పసుల, ఆంధ్రుల, పార్వతీయుల, ద్రావిడుల, కేరళీయుల, ప్రాచ్యుల, భూషికుల , వనవాసుల, ఉన్నతకుల, మాహిషికుల, మూషకుల జన పదాల్ని పేర్కొన్నాడు.
4. కర్ణ పర్వంలో పాండ్యరాజు కౌరవ సైన్యంలోని పూళిందుల్ని, ఖసుల్ని, బాహ్లికుల్ని, నిషాదుల్ని, ఆంధ్రకుల్ని, దాక్షిణ్యాత్యుల్ని, భోజుల్ని చంపినట్లుంది.
5. అర్జునుడు అశ్వమేధయాగ సందర్భంలో దిగ్విజయ యాత్ర చేస్తూ ఆంధ్రులు, ద్రవిడులు, ఔడ్రులు , మాహిషికులు, కోలగిరేయులతో యుద్ధంచేసినట్లుంది.

11.8.2. సంస్కృతభాగవతంలో శుకుడు హరిస్తుతిగావిస్తూ కిరాతులు, హూణులు, ఆంధ్రులు, పుళిందులు మొదలైయిన జాతులవాల్లు తమ పాపాలనుంచి విముక్తి పొందటానికి హరిని ఆశ్రయించినట్లుంది.

11.8.3. మనువు తన మనుస్మృతిలో కారావరస్త్రీకి వైదేహుని వల్ల జన్మించి వేటాడి జీవించే వేటగాళ్ళు ఆంధ్రులని చెప్పాడు.

11.8.4. క్రీ.శ. 1వ శతాబ్దిలో భరతుడు తన నాట్య శాస్త్రంలో పాత్రోచిత భాషను గూర్చి చర్చిస్తూ బర్బర, కిరాత, ఆంధ్ర, ద్రమిళ జాతుల వారు శౌరసేనివంటి ప్రాకృత భాషల్ని ఉపయోగించడానికి వీలు లేదని నిషేధించాడు.

11.8.5 వాయుపురాణంలో ఆంధ్రభృత్యుల పేర్లు, వారి పరిపాలనా కాలం వివరంగా ఉంది. శాతవాహనరాజులే ఆంధ్రభృతులు. వీరు రాజ్యమేలిన కాలం క్రీ.పూ. 2వ శతాబ్దం నుంచి క్రీ.శ. 2వ శతాబ్ది. ఇంకా బ్రహ్మాండ, మత్స్య పురాణాల్లో కూడా ఆంధ్రుల ప్రసక్తి ఉంది.

11.8.6. క్రీ.శ. 9వ శతాబ్దానికి చెందిన ఉద్యోతనుడు తన 'కువలయమాల' అనే ప్రాకృత గ్రంథంలో ఆంధ్రులు అందమయిన వారనీ, ఆహార విహార ప్రియులనీ వర్ణించాడు.

11.8.7. చంద్రగుప్తమౌర్యుని దర్శించిన గ్రీకురాయబారి మెగస్తనీసు (క్రీ.పూ 4వ శతాబ్ది) మౌర్యుల తరవాత ఆంధ్రులు ఎన్నతగిన చతురంగ బలం కలవారని శ్రంసించాడు. ఆంధ్రులకు ముప్పైయ్ దుర్గాలు, లక్ష కాల్బలం, రెండువేల అశ్వక దళం, వెయ్యి ఏనుగులు ఉన్నాయిని చెప్పాడు.

11.8.8. క్రీ.పూ. 3వ శతాబ్దిలో అశోకుడు వేయించిన 13 వ ధర్మశిలా శాసనంలో ఆంధ్రులు అశోకుని సామ్రాజ్యంలో వారనీ, ఆయన ధర్మబోధల్ని అనుసరించారనీ ఉంది.

## 11.9 అంధర :

ప్రముఖ గ్రీకు చరిత్ర కారుడు ప్లినీ 'అంధర' జాతి వారినీ, వారి గుణ గణాల్ని, వైభవాన్ని వర్ణించి ప్రశంసించాడు. వారికి లక్ష కాల్బలం, రెండు వేల అశ్వక దళం, వెయ్యి ఏనుగులు, 80 దుర్గాలున్న పురాలు ఉన్నాయిన పేర్కొనడం జరిగింది.

## 11.10 అంధక :

భారత, భాగవత, మత్స్యపురాణ, బౌద్ధ, జైన మత గ్రంథాదుల్లో 'అంధక' పదం ఉంది.

1. భారతంలో ఆది, అరణ్యపర్వాలలో అంధకులు ప్రస్తావన ఉంది. ద్రౌపది స్వయంవరానికి వచ్చిన వాళ్ళలో అంధకులు ఉన్నట్లుగా ఉంది.
2. యదు, వృష్ణి, భోజ ,కుకురులతో పాటు అంధకులు కూడా యాదవుల్లో ఒక తెగ అనీ, వీళ్ళు ద్వారకానగర సంరక్షకులనీ భాగవతంలో ఉంది.
3. మత్స్యపురాణంలో అంధకాసురుని సంతతివారే అంధకులని ఉంది.
4. బౌద్ధమత గ్రంథాలు త్రిపిటకాల్లోను, తదంతర్గతమయిన జాతకకథల్లోనూ అంధకుల ప్రసక్తి ఉంది.
5. జైన మత గ్రంథాలలోనూ అంధకుల ప్రస్తావన ఉంది.

## 11.11 ఆంధ్రక :

1. వ్యాసభారతం కర్ణపర్వంలో ఆంధ్రక , పుళింద, కిరాతాది మ్లేచ్ఛ జాతులు కౌరవపక్షాన యుద్ధం చేసినట్లు, వారెంతో పరాక్రమవంతులయినట్లు ఉంది.
2. భారతంలోనే అరణ్యపర్వంలో రాజసూయయాగ సమయంలో ధర్మరాజును సేవించడానికి వచ్చిన రాజులలో పాండ్య, ఓఢ్ర, చోళ, ద్రావిడులతో పాటు 'ఆంధ్రకులు' కూడా ఉన్నట్లు ధర్మరాజుకు కృష్ణుడు గుర్తు తెస్తాడు.
3. శాంతి పర్వంలో భీష్ముడు ధర్మరాజుకు సర్వభూతోత్పని గురించి చెబుతూ దక్షిణాపథంలో జన్మించిన పుళింద, శబరాది జాతులలో 'ఆంధ్రకులు' ఒకరని చెప్పాడు.

వీటన్నింటిని పరిశీలించినప్పుడు మనకు ఇప్పటి వరకు వివిధ గ్రంథాల్లో అంధ్ర, అంధర, అంధక, ఆంధ్రక అనే పదాలను జాతిని ఉద్దేశించివాడినట్లుగా కనిపిస్తుంది.

## 11.12 దేశవాచకంగా ఆంధ్రపదం :

ఆంధ్రులు నివసిస్తున్న ప్రాంతం ఆంధ్రదేశం. అంధాపథం, అంధరట్టి, ఆంధ్రపథం, ఆంధ్రమండలం, ఆంధ్ర విషయం మొదలగున్నవి పర్యాయపదాలుగా కనిపిస్తున్నాయి.

1. వాల్మీకి రామాయణం కిష్కింధకాండలో సుగ్రీవుడు వానరుల్ని దక్షిణ దిక్కుకు పంపుతూ సీత కోసం వెతకవలసిన రాజ్యాల్లో ఆంధ్ర, పుండ్ర, చోళ, పాండ్యాది దేశాల్ని పేర్కొన్నాడు.
2. భారతం సభాపర్వంలో దక్షిణ దిగ్విజయయాత్రా సందర్భంలో సహదేవుడు జయించిన రాజ్యాల్లో ఆంధ్రదేశముంది.
3. భాగవతంలో బలి చక్రవర్తికి ఆరుగురు కుమారులున్నట్లు ఆ ఆరుగురు తమ తమ పేర్లతో ప్రత్యేక రాజ్యాలు స్థాపించుకున్నారనీ వారిలో ఆంధ్రుడనేవాడు ఆంధ్ర రాజ్యాన్ని స్థాపించాడనీ ఉంది.
4. క్రీ.శ. 555 నాటి ఈశాన వర్మ వేయించిన హరహ శాసనంలో 'జిత్వాంధ్రాధిపతిమ్ ' అనీ, క్రీ.శ. 553 నాటి 'జవానుపూర్' శాసనంలో 'ప్రతిరంధమాంధపతినా' అనీ ఉంది.
5. క్రీ.శ. 6వ శతాబ్దంలో ప్రాంతం వాడయిన వరాహమిహిరుడు 'బృహత్సంహిత'లో 'కౌశికవిదర్భవత్సాంధ్ర ఛేదికాశ్చోర్ధ్వ తండకా:' అని ఆంధ్ర దేశాన్ని పేర్కొనడం కనిపిస్తుంది. ఇక్కడ తండక అంటే ఇప్పుడు మనం వాడుతున్న తండా (లంబాడీ తండా) అని అర్థం. అనగా ప్రాంతం లేదా ప్రదేశమని అర్థం.
6. చైనా యాత్రికుడు హుయాన్‌త్సాంగ్ (క్రీ.శ. 7వ శ॥) రచనల్లో ఆంధ్రదేశ ప్రసక్తి ఉంది.
7. ఆంధ్రదేశాన్ని పాలించిన వెలనాటి దుర్జయులు (క్రీ.శ. 12వ శ॥ ) వేయించిన శాసనంలో 'ఆంధ్ర' దేశపరంగా వాడటం జరిగింది. 'పూర్వాంభోనిధి కాళహస్తిశిఖరి శ్రీమన్మ హేంద్రాచల శ్రీశైలములచే వలయీకృతమని' అప్పటి ఆంధ్రదేశపు ఎల్లలు చెప్పడాన్ని గమనించవచ్చు.

### 11.12.1 అంధ :

1. పల్లవరాజు శివస్కంధవర్మ (క్రీ.శ. 240) మైదవోలు శాసనంలో "అగివెసనగోత్తసగోనం దిజస అంధాపథీ యోగామోవిటిపఅమ్" అని అంధా పథీయాన్ని ఆంధ్ర దేశమనే అర్థంలో వాడారు. ఆంధ్ర పదం దేశ పరంగా ఆంధ్ర ప్రాంతంలో కనిపిస్తున్న మొదటి శాసనం ఇదే.

### 11.12.2 అంధరట్ట :

బౌద్ధ వాఙ్మయంలో పాళీ గ్రంథాల్లో అంధకరట్ట అనే పదం ఉంది. ఇది ఆంధ్రరాష్ట్రమనీ, ఆంధ్రులూ, అంధకులూ ఒక్కరే అనీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారిలాంటి విమర్శకులు అభిప్రాయపడ్డారు.

11.12.3.0. ఆంధ్రుల నివాసం గురించి మొదటగా బౌద్ధ జాతక కథల్లో కనబడుతుంది. ఆంధ్ర పదం మొదట ప్రస్తావించినది 'భీమసేనజాతకకథ' .

### 11.12.4 ఆంధ్రమండలం :

1. మల్లదేవనంది వర్మ (క్రీ.శ. 340 ) వేయించిన దానశాసనంలో 'ఆంధ్రమండలే ద్వాదశ సహస్రగ్రామ సప్తార్థ లక్ష విషయాధిపతే: అని ప్రదేశానికి మండలమనే సమానార్థకాన్ని వాడారు.
2. వీరరాజేంద్రచోళుని (క్రీ.శ. 1169) ప్రశంసించే శాసనం ఒక దానిలో 'ఆంధ్రమండలమ్' అని ఉంది.

### 11.12.5 ఆంధ్రవిషయం :

1. నన్నెచోడుని కుమార సంభవం లో 'ఆంధ్రవిషయం' ప్రయోగం ఉంది.
2. రాజరాజు పరిపాలనా క్షేత్రాన్ని తెలియజేసే శాసనంలో కూడా 'ఆంధ్రవిషయం' ప్రస్తావన ఉంది.

### 11.13 ఆంధ్ర (భాషావాచకంగా) :

క్రీ.శ. 1వ శ॥ కి పూర్వం సంస్కృతవాఙ్మయంలో భాషాపరంగా ఆంధ్రశబ్దానికి ప్రయోగం లేదు.

1. భాషాపరంగా మొట్టమొదటి ప్రయోగం భరతుడి 'నాట్యశాస్త్రం' లో కనిపిస్తుంది. నాటకంలో ఉపయోగించదగిన విభాషలు ఏడు విధాలనీ అవి శకార, అభీర, చండాల, శబర, ద్రమిల, ఆంధ్ర వనచరుల వ్యవహారంలోనివనీ చెప్పడం జరిగింది.
2. నన్నయ భట్టు రాసిన నందంపూడి శాసనం (11వశ॥) లో నారాయణభట్టును 'యస్సంస్కృత కర్ణాటప్రాకృత పైశాచికాంధ్ర భాషాసుకవిరాజశేఖర ఇతి ప్రథిత: సుకవిత్వ విభవేన' అని ప్రశంసించాడు.
3. ఒకవేళ నన్నయేగనుక 'ఆంధ్రభాషాభూషణము' రాశారని భావిస్తే (ఇది ఆయన రాయలేదని విమర్శకులుంటున్నారు) ఆంధ్ర పదం భాషాపరంగా కూడా వ్యాకరణ గ్రంథంలో రాసిన ఘనత ఆయనకే దక్కుతుంది.
4. మహాభారతం విరాటపర్వంలో తిక్కన నన్నయను 'ఆంధ్ర కవిత్వ విశారదుండు' అని సంబోధించాడు. తిక్కన ఆంధ్ర పదాన్ని ఇక్కడ భాషా పరంగావాడాడు.
5. మూలఘటికకేతన రాసిన వ్యాకరణ గ్రంథానికి పెట్టిన పేరు 'ఆంధ్రభాషాభూషణం''
6. క్రీ.శ. 1273 నాటి శ్రీకాకుళంలో లభించిన శాసనంలో 'ఆంధ్రీచకార వరభారతవంశ వృత్తమ్' అని ఆంధ్ర పదాన్ని భా × భాషాపరంగా వాడటం జరిగింది.

ఇప్పటివరకూ జరిగిన చర్చనుబట్టి ఆంధ్రపదం మొదట జాతివాచకంగానూ, తర్వాత దేశవాచకంగానూ, ఆతర్వాత భాషావాచకంగానూ వాడకలోకి వచ్చినట్లు చెప్పవచ్చు.

### 11.14 తెనుంగు, తెనుఁగు, తెనుగు :

తెనుంగు, తెనుఁగు - ఈ రెండు రూపాలూ భాషాపరంగా మొదటిసారిగా నన్నయ భారతంలో కనిపిస్తున్నాయి. తెలుగు భాషలో ధ్వని పరిణామంలో హ్రస్వంమీద పూర్ణ బిందువుకు లోపం విభాషగా జరిగింది. ఇది కావ్యభాషలో ప్రస్ఫుటంగా ఉంది. అందుచేత తెనుంగు, తెనుఁగు రూపాంతరాలేనని చెప్పవచ్చు. నన్నయ భారతంలో తెనుంగుకు ఒక ప్రయోగం, తెనుఁగుకు ఒక ప్రయోగం కనిపిస్తున్నాయి.

#### 11.14.1 తెనుంగు :

**1. నన్నయ భారతం :**

సారమతింగవీంద్రులు ప్రసన్న కథాకలితార్థయుక్తిలో
నారసి మేలునా నితరు లక్షరమ్యత నాదరింప నా
నారుచి రార్థసూక్తినిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా
భారతసంహితారచన బంధురుఁడు
య్యె జగద్ధితంబుగాన్

**2. నన్నెచోడునికుమారసంభవము: రెండు ప్రయోగాలు కనిపిస్తున్నాయి.**

మునుమార్గకవితలోకం
బున వెలయఁగ దేశికవితఁ బుట్టించి తెనుం
గున నిలిపిరంధ్ర విషయం
బునఁ జనఁజాళుక్యరాజు మొదలుగఁబలువుర్.

సరళముగాగభావములు జానుఁదెనుంగున నింపు పెంపుతోఁ
బిరిగొన వర్ణనల్ ఫణితి పేర్కొన నర్థము లొత్తగిల్లబం
ధురముగఁ బ్రాణముల్ మధు మృదుత్వ రసంబునఁగందళింప న
క్షరములు సూక్తులార్యులకుఁ గర్ణ రసాయనలీలఁగ్రాలఁగాన్

3. పాల్కురి కి సోమన: ఒక్కప్రయోగం ఉంది.

ఉరుతరగద్యపద్యోక్తులకంటె-సరసమై పరగిన జానుఁ దెనుంగు
చర్చింపగా సర్వ సామాన్యమగుటఁ-గూర్చె ద్విపదలుగోర్కిదైవాఱఁ

4. తిక్కన : భారతావతారికలో ఒక చోట ప్రయోగించాడు.

హృదయాహ్లాది చతుర్థి మూర్జిత కథోపేతంబునానారసా
భ్యుద యోల్లాసి విరాటపర్వమటయుద్యోగాదులుంగూడఁగాఁ
బదియేనింటిఁ దెనుంగు బాస జన సంప్రార్థంబులై పెంపునం
దుది ముట్టన్ రచియించు టొప్పు బుధసంతోషంబు నిండారఁగన్.

## 11.14.2 తెనుఁగు :

1. నన్నయ : మహాభారతంలో ఒక ప్రయోగం ఉంది.

జననుత కృష్ణ ద్వైపా
యనముని వృషభాభిహిత మహాభారత బ
ద్ధనిరూపి తార్థమేర్పడఁ
దెనుఁగున రచియింపుమధికధీయుక్తిమెయిన్

2. తిక్కన : భారతంలో ఒక ప్రయోగం ఉంది.

తెనుఁగు బాస వినిర్మింపఁ దివురు టరయ
భవ్యపురుషార్థతరు పక్వఫలముగాదె
దీనికెడనియ్యకొని వేడ్కనూని కృతిప
తిత్వ మర్థించి వచ్చితిఁదిక్కశర్మ

## 11.14.3 తెనుగు:

తెనుంగు > తెనుఁగు > తెనుగు

ధ్వని పరిణామంలో తెనుంగు తెనుఁగుగానూ ఆ పిమ్మట తెనుగు గానూ పరిణామం చెందింది.

## 11.15.0 తెనుగు పదం - వ్యుత్పత్తి :

1. త్రినగః తెనుగు పదం త్రినగ శబ్ద భవమని కొందరు విమర్శకులంటున్నారు. త్రినగాలు అనగా మూడు కొండలు, శ్రీకాళహస్తి, శ్రీశైలం, శ్రీ మహేంద్రగిరి లమధ్య ఉన్న ఆంధ్రదేశానికి త్రినగ దేశమనీ అదే కాలక్రమంలో తెనుగు దేశంగా మారిందనీ వీరి ఊహ అయితే తెనుగు దేశానికి త్రినగ దేశమనే వ్యవహారం ఎక్కడాఉన్నట్లు కనిపించదు. పైపెచ్చు తెలుగు దేశం ఎల్లలు ఇంతకంటె విస్తృతమయినవి. అందుచేత ఈ వ్యుత్పత్తి సరిపడదు.

2. తేనె+అగు = తెనుగు

సర్‌జార్జ్‌గ్రీయర్సన్ Linguistic Survey of India" లో తెనుగు అనే పదం తేనె+అగు అనే రెండు పదాల కలయిక వల్ల ఏర్పడిందని భావించాడు. ఈయన అభిప్రాయం ప్రకారం తెనుగు తేనెలాంటి తియ్యనయిన భాష. ఇదే అభిప్రాయాన్ని బిషప్ కాల్డ్‌వెల్ కూడా వెలిబుచ్చారు. శబ్ద సామ్యం వల్ల వీరు ఇలాంటి అభిప్రాయాన్ని వెలిబుచ్చారే గాని ఇది సరయినదికాదు. ఎవరి మాతృభాష వారికి మధురంగానూ, తేనె లాగానూ ఉంటుంది. అదీగాక ఇలాంటివ్యుత్పత్తులు చాలా భాషలకు చెప్పారు.

## 3. తెన్ - గు = తెనుగు

తెన్ అంటే మూల ద్రావిడంలో దక్షిణ దిక్కు అనే అర్థం ఉంది. దక్షిణాది అనే అర్థంలో 'తెనుగు' శబ్దం ప్రయుక్తమయి ఉండవచ్చని సి.పి. బ్రౌన్ తన తెలుగు - ఇంగ్లీషు నిఘంటువులో పేర్కొన్నాడు.

తెన్ పదానికి దక్షిణం అని అర్థం. ఈ పదం మీద కుఇ, కువి, కుబి(కొండ), కోలామీ, గోండి శబ్దాల్లోని 'కు' తో అభిన్నమయిన 'గు' ప్రత్యయం చేరి 'తెనుగు' శబ్దం ఏర్పడిందని మరికొంత మంది ఊహిస్తున్నారు.

తెనుగు శబ్దం దిక్కును బట్టే వచ్చిందని ఎక్కువమంది అభిప్రాయపడుతున్నారు. తెనుగు దేశ్యపదమనీ, దిగ్వాచి అని గంటిజోగి సోమయాజి గారి అభిప్రాయం. తెనుగు శబ్దంలోని 'తెన్' దిగర్థమున్న ద్రావిడ పదాంశమని Dravidian Etymological Dictionary లో చెప్పారు. తెలుగు భాషలోని తెన్ శబ్దం నేటి వ్యవహారం నుంచి తొలగిపోయిందిగాని తెమ్మెర, తెన్నేరు, టెంకాయ, తీరూతెన్నూ, దారీతెన్నూ మొదలయిన సమాసాల్లో నిలచిఉంది. సాధారణంగా ఒక సమాజంలో ఒక భాష రూపొందే ప్రాథమిక దశలో ఆ భాషకు నామకరణం జరగదు. ఈనాడు కూడా కొన్ని గిరిజనాది భాషలకు ఆభాషావ్యవహర్తలలో ప్రత్యేకమయిన పేర్లు లేని స్థితి కనిపిస్తుంది. ఒక బాషా సమాజంలోనే ఒక ప్రాంతం వారు మరొక ప్రాంతం వారిని సూచించవలసినప్పుడు దిక్కుల్ని బట్టి తూర్పువారనీ, పడమటివారనీ, ఉత్తరాది వారనీ, దక్షిణాది వారనీ వ్యవహరించటం ఉంది. ప్రాచీన ద్రావిడ భాషా సమాజంలోని వారు దక్షిణ ప్రాంతం వారిని దక్షిణ దిక్కును సూచించే 'తెన్' శబ్దంచేత 'తెనుంగు' అని నిర్దేశించి ఉంటారు. ఆ ప్రాంత మాండవికం ప్రత్యేక భాషగా పరిణమించినప్పుడు ఆ ప్రజలను నిర్తేశించిన 'తెనుంగు' వారి భాషకు పేరుగా ఏర్పడి ఉండవచ్చు ద్రావిడ ప్రజలు ప్రాచీన కాలంలో భారతదేశమంతా వ్యాపించి ఉండిన వారే. కాబట్టి ఆనాడు ఉత్తర ద్రావిడ ప్రజలు దక్షిణ దిక్కులో నివాసం ఉన్నవారిని 'తెన్' శబ్దంతో నిర్దేశించి ఉండవచ్చు అని చెప్పటం సరయినదే. తమిళదేశానికి ఉత్తర దిక్కున ఉన్న తెలుగు వారిని వారు 'వడుగర్' అని తెలుగు భాషను 'వడుగ' అని వారి సాహిత్యంలో పేర్కొనడం ఈ అభిప్రాయానికి బలం చేకూరుస్తోంది.

## 11.16 తెలుంగు, తెలుఁగు, తెలుగు :

### 11.16.1 తెలుంగు:

తెలుంగు పదానికి ప్రయోగాలు తెలుగు సాహిత్యంలో కనిపించవు. (తెనుంగు - తెలుంగు గామారి ఉంటుందని ఊహ)

### 11.16.2 త తెలుఁగు:

1. పాల్కురికి సోమన మొదట తెలుఁగును భాషా పరంగా ప్రయోగించాడు.
తెలుఁగు మాటలనంగావలదు - వేదములు
కొలదియకాఁ జూడు డిల నెట్టులనిన
2. తిక్కన నిర్వచనోత్తర రామాయణంలో 'తెలుఁగుబడి' అనే ప్రయోగం కనిపిస్తుంది.

13వ శతాబ్దం నుంచి తెలుగు కావ్యాల్లో వీటి ప్రయోగం సర్వ సాధారణంగా కనిపిస్తోంది.

### 11.16.3 తెలుగు :

నన్నయ, నన్నెచోడులెవ్వరూ పయి మూడు పదాలనుం ప్రయోగించలేదు. తిక్కన మొదటగా నిర్వచనోత్తర రామాయణంలో 'తెలుగు కవిత్వము' అనే ప్రయోగించాడు. ఆతర్వాత తెలుగు కావ్యాలలో విరివిగా ఈ ప్రయోగం ఉంది.

### 11.16.4 ప్రాచీనత - వ్యుత్పత్తి :

తెనుగు, తెలుగు - ఈ రెండు పదాలూ ఆంధ్రంలాగానే జాతి, దేశ, భాషావాచకాలుగా వాడారు. తెలుగు పదానికి తెలుఁగు, తెలుంగు రూపాంతరాలుగా వాడుకలో ఉన్నాయి. త్రిలింగ, త్రికళింగ, తెళుగన్నడం మొదలయిన పదాల నుంచి తెలుగు ఉద్భవించిందని కొంతమంది పండితులు భావించారు. వీటిని గురించి వివరంగా తెలుసుకుందాం.

**1. త్రిలింగ (దేశివాచకంగా) :**

క్రీ.శ. 2వ శతాబ్దిలో భారతదేశాన్ని సందర్శించిన గ్రీకుదేశస్థులుయిన టోలమీ, ప్లినీలు దేశవాచకంగా వాడారు. మొదట టోలమీ తెలుగు దేశాన్ని త్రిలింగం (Trilingam) గానూ, ప్లినీ మూడోగలింగం (Modogalingam) గానూ పేర్కొన్నారు. వీళ్ళిద్దరూ 'త్రిలింగం' గంగానదీస్థలమని పేర్కొన్నారు. బహుశా గోదావరిని వీరుగంగానదిగా భావించి ఉండవచ్చు.

2. దేశవాచకంగా బ్రహ్మాండ, స్కాందపురాణాల్లో ఉంది.
'శ్రీశైల భీమకాళేశ మహేంద్రగిరి సంయుతం
తత్కాల ప్రభృతిక్షేత్రం త్రిలింగమితివిశ్రుతం' (బ్రహ్మాండపురాణం)
'కర్ణాటకాశ్చైవ త్రైలింగ్య ఘూర్జర రాష్ట్ర వాసిన:
ద్రావిడౌ ద్రావిడ పంచవింధ్య దక్షిణ వాసినః (స్కంద పురాణం)

3. ఆంధ్రవిష్ణువు త్రిలింగ దేశాన్ని స్థాపించినట్లుగా ఆంధ్రకౌముదిలో ఉంది.
'త్రిలింగ రూపీన్యవసత్రి ద్వారేషు గణైర్వృత:
ఆంధ్రవిష్ణు: సురయుతో దనుజీనని శంభువా'

4. రాజశేఖరుడు (10వ శతాబ్ది) 'విద్ధసాలభంజిక' లో 'జయతు జయతు త్రిలింగాధిపోదేవ:' అని ఉంది.

5. సింగనాయకుడు (క్రీ.శ. 1318) అక్కలపూడి శాసనంలో 'త్రిలింగ దేశాధిపతిః శ్రీమాన్' ప్రయోగం ఉంది.

6. కాకతీయ ప్రతాపరుద్రుని ఆస్థానంలోని విద్యానాథుడు (క్రీ.శ. 13వ శ॥) శ్రీశైల, ద్రాక్షారామ, కాళేశ్వరాలలోని శివలింగాలవల్ల తెలుగు దేశానికి త్రిలింగ దేశమని పేరు ఏర్పడిందని 'ప్రతాపరుద్రీయం' లో చెప్పాడు.

7. విన్నకోటపెద్దన (క్రీ.శ. 14వ శ॥) ఆంధ్రదేశానికి త్రిలింగదేశమనే పేరు కావ్యాల్లో ఉన్నట్లు, తెలుగు త్రిలింగ శబ్దభవమయినట్లు కావ్యాలంకార చూడామణిలో పేర్కొన్నాడు.

ధర శ్రీ పర్వత కాళే
శ్వరదాక్షారామ సంజ్ఞవఅలు త్రిలింగా
కర మగుట నంధ్ర దేశం
బరుదారఁద్రిలింగ దేశమనఁజనుఁగృతులన్

తత్త్రిలింగ పదము తద్భవంబగుటచేఁ
దెలుఁగు దేశమనఁగఁ దేట పడియె
వెనుఁకఁ దెనుఁగు దేశమును నంద్రు కొందఱ
బ్బాస పంచగతులఁ బరఁగు చుండు

అయితే తెలుగు శబ్దం ఎంతో ప్రాచీనమయినదనీ అది త్రిలింగ శబ్దభవం కాదని కొమర్రాజులక్ష్మణరావు గారు తన లక్ష్మణ రాయ వ్యాసావళిలో నిరూపించారు. వీరి అభిప్రాయం ప్రకారం తెలుగే ప్రాచీనం. దాని సంస్కృతీకృతరూపమే 'త్రిలింగం' చేబ్రోలును తామ్రపురీ, తామ్రనగర్ అనీ, ముడియనూరును చూడగ్రామం అనీ, పెనుగొండను ఘనగిరి అనీ, కందుకూరును స్కంధపురి అనీ, ఓరుగల్లును ఏకశిలానగరమనీ, గుంటూరును గర్తపురి అనీ, పొన్నూరును స్వర్ణపురి అనీ సంస్కృతీకరించినట్లే తెలుగును త్రిలింగంగా సంస్కృతీకరించారని వీరి అభిప్రాయం. ఇది యుక్తియుక్తమేననేది విమర్శకులు భావిస్తున్నారు.

ఇక గ్రీకు దేశస్థుడు ప్లినీ పేర్కొన్న 'మూడోగలింగం' అనే దానికి కింది విధంగా వ్యుత్పత్తుల్ని ఊహించారు. వీరు దీనిని 1. మూడవ లింగం 2. మూడోక లింగం అని విడదీశారు.

1. మూడవ లింగం : మూడవది అయిన లింగం అని చెప్పారు. అయితే 'లింగం' బట్టి తెలుగు దేశానికి ఆ పేరు ఎలావచ్చిందని గానీ, ఇది మూడో లింగమయితే మిగిలిన రెండు లింగాల సంగతేమిటి.....? ఇత్యాది విషయాల గురించి మాట్లాడలేదు.

2. మూడో+కలింగం = మూడోగలింగం అని విడదీసి ఆంధ్ర దేశం త్రికలింగా (త్రికళింగ) లలో ఒకటని శలవిచ్చారు. ఈ వ్యుత్పత్తిలో కూడా మిగిలిన రెండు కళింగాల సంగతేమిటని ప్రశ్నించుకోలేదు.

ఏది ఏమయినా ఈ వ్యుత్పత్తులు విమర్శకుల ఊహాశక్తి ఎలాంటిదో చెబుతుందే గాని ఈ వ్యుత్పత్తులు నిలబడేవికావు.

## 11.16.4.1 త్రిలింగ :

1. చిలుకూరినారాయణరావుగారు తన 'ఆంధ్రభాషా చరిత్రము' లో త్రికళింగ శబ్దం నుంచి తెలుగు పదం ఉద్భవించిందని చెప్పారు. తెలుగు మాట్లాడే వారున్న దేశం మొత్తానికి అంటే ఆంధ్రరాష్ట్రానికి త్రికళింగమనే పేరు ఎవ్వరూ, ఎప్పుడూ వాడలేదు. ఆంధ్రదేశంలోని పూర్వ భాగానికి కళింగమనే పేరున్నా తెలుగు భాష మాట్లాడే ప్రాంతం మొత్తానికి ఆ పేరులేదు. కాబట్టి ఇది సరయినది కాదు.

2. గంటిజోగిసోమయాజి 'ఆంధ్రభాషావికాసము'లో తెలుగు త్రికళింగ శబ్దభవమనీ, ధ్వని పరిణామం వల్ల కాల క్రమంలో ఆది త్రికళింగ > త్రి ఆలింగ > తెలింగ > తేలింగ > తెలుగుగా మారిందని అభిప్రాయపడ్డారు. ఇది కూడా సరయిన వ్యుత్పత్తిగా కనిపించదు.

### 11.4.2. తెళుగన్నడ :

చిలుకూరి నారాయణరావుగారు 'ఆంధ్రభాషా చరిత్రము' లో తెళుగన్నడం' అనే పదం నుంచి 'తెలుగు' పుట్టినట్లుగా కూడా భావించారు. కన్నడ భాష అయిదు విధాలుగా ఉందనీ అందులో తెళుగన్నడం ఒకటనీ, తెళుగన్నడం అంటే కన్నడిగులు తమ మూల స్థానాన్ని విడిచి దూరదేశాలకు పోయి తమ భాషను తేలికగా ఉచ్చరించటం వల్ల కలిగిన భాష అని ఒక కర్ణాటక భాషాలాక్షణికుడు పేర్కొన్నట్లుగా చెప్పారు.

తెళుగన్నడం తెలుగు కావటం ధ్వనిపరిణామ సూత్రాలకు విరుద్ధం. తెళుగన్నడం అంటే తేటకన్నడం అనే అర్థంకాని తెలుగు అనే అర్థం మాత్రం కాదు. తెలుగు భాషను తెళుగన్నడం అని ఎవరూ పేర్కొనలేదు. అంతేగాక అలా చెప్పిన కన్నడ లాక్షణికుని గురించి గాని, ఆయన రాసిన పుస్తకం గురించి గాని మనకు తెలియదు. కాబట్టి ఈ వ్యుత్పత్తి కూడా నిలబడదు.

పయిన పేర్కొన్న వ్యుత్పత్తులు కాక కొంతమంది మరి కొన్ని వ్యుత్పత్తుల్ని చెప్పారు.

1. తెళి+అగు = తెలుగు అన్నారు కొందరు. 'కన్నడకత్తురి, తెలుగుతేట, అరవం అధ్వాన్నం' అనే కన్నడ సామెత ఈ పద వ్యుత్పత్తికి ప్రధాన ఆధారం. ఇక్కడ తెళి > తెలి అంటే తేట అని అర్థం చెప్పుకొని తేట తెలుగు అన్నారు. ఎవరి భాషవాళ్ళకు తేటగానూ, అందంగానూ, మధురంగానూ ఉంటుంది. ఈ వ్యుత్పత్తి కేవలం భాషాభిమానంతో చెప్పుకోవటమే తప్పవేరు కాదు.

2. 'తిలలవలె గోవులున్నదేశం తెలుగు ' అన్నారు కొందరు. తిలలు అంటే నువ్వులు. గు ప్రత్యయం గోవుకు సంబంధించిందని అర్థం చెప్పి తిలలు లాగా వేలకువేలగోవులు ఏ దేశంలో ఉన్నాయో అది తిలగు (తెలుగు) దేశమని కల్లూరి వెంకట నారాయణ గారు భావించారు. దీనికి ఎలాంటి ఆధారములేదు.

3. తేల్ - అగు = తెలుగు. తేల్ అనే నదీ ప్రాంతంలో నివసించి ఆంధ్రదేశానికి వచ్చిన వారని మరొకవ్యుత్పత్తి చెప్పారు. తేల్‌నది ఎక్కడిది, ఇక్కడకు ఎలావచ్చారు? ఇత్యాది ప్రశ్నలకు ఈ వ్యుత్పత్తి సమాధానం చెప్పదు.

4. తలైంగు: తలస్థానంలో ఉన్న భాష అన్నారు. బర్మాలో 'తలైంగ్' అనే జాతి వారు అక్కడ నుంచి తెలుగు దేశానికి వచ్చి స్థిరపడ్డారనేవాదాన్ని ఖండవల్లి లక్ష్మీ రంజనం గారు ప్రతిపాదించారు. తలైంగు - తిల్లింగు - త్రిలింగ శబ్దాలకు మూలమని కూడా అన్నారు. ఈ వాదాన్ని ఆరుద్రగారు సమర్థించడం జరిగింది. అయితే దీనికి కూడా సరయిన చారి త్రిక ఆధారాలు లేవు.

5. తెల్ల+అగు =తెలుగు. తెల్లగా ఉండే ప్రజలు మాట్లాడే భాషకాబట్టి తెలుగు అన్నారు. తెలుగు మాట్లాడే వారంతా తెల్లవాళ్ళని అనగలమా?

6. తెఱిక్కు > తెలుగు. కొంతమంది తెఱిక్కునుంచి తెనుగు శబ్దం వచ్చిందని పేర్కొన్నారు. తమిళ భాషలో తెఱిక్కుకు దక్షిణ దిక్కు అని అర్థం. అంటే దక్షిణ దిక్కులో ఉండేవారు. తెఱిక్కు - తెలుగుగా మారిందిని వీరివాదం. ఇది కొంతవరకు యుక్తి యుక్తంగా, ఉన్నట్లునపించినా తెలుగుకు సంబంధించి చెప్పిన ప్రతివ్యుత్పత్తిలోనూ ఏదో ఒక లోపం ఉంది. ఏ ఒక్క వ్యుత్పత్తీ 'తెలుగు' ఎలా పుట్టిందనేది సరిగా చెప్పలేకపోయాయి.

## 11.17 తెనుగు, తెలుగు - పరస్పర సంబంధం :

తెనుగు, తెలుగు - రెండూ రూపాంతరాలేగాని భిన్నధాతుజాలు కావు. ద్రావిడ భాషలలో న/ల ల వినిమయం ఉంది. అంటే నకారం లకారంగా మారటం లేదా లకారం నకారం గా మారటం. అదే విధంగా ద్రావిడ భాషలలో ళ - ల గానూ, ణ - న గానూ మారిన సందర్భాలున్నాయి.

తెలుగులో న/ల ల వినిమయం ఇప్పుడు కూడా కొన్ని ప్రాంతాల గ్రామీణుల వ్యవహారంలో ఉంది. ప్రత్యేకించి కళింగాంధ్ర మాండలికంలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

### న-ల గా మారటం :

మునగ - ములగ
చెనగు - చెలగు
మునుకోల - ములుకోల
జన్మం - జల్మం
సెనగలు - సెలగలు
సెనక్కాయలు - సెలక్కాయలు
తెనుగోళ్ళు - తెలుగోళ్ళు

### ల- నగా మారటం

లచ్చి - నచ్చి
లెగు - నెగు
లేదు - నేదు
లావు-నావు
లేత - నేత
లాగు - నాగు
లంజ - నంజ

తెలుగు భాషలో న-ల ల పరస్పర వినిమయం చాలా ప్రసిద్ధమయినది. ఈ ధ్వని పరిణామం రెండు విధాలుగానూ జరిగింది. అందుచేత తెనుగు తెలుగుగా మారిందా లేక తెలుగు తెనుగుగా మారిందా అని చెప్పటం అంతసుల భమయనదికాదు.

కొంతమంది తెలుగే ప్రాచీన రూపం, తెలుగు నుంచి తెనుగు ఏర్పడి ఉంటుందని వీరు వాదిస్తున్నారు. వారిలో ఆరుద్ర లాంటి వారుకూడా ఉన్నారు.

అయితే సి.పి. బ్రౌన్, గంటిజోగి సోమయాజి, జి. ఎన్. రెడ్డి మొదలయిన అనేక మంది సిద్ధాతం ప్రకారం తెన్గ్ దిగ్వాచి దిక్కును సూచించేది కాబట్టి తెనుగే ప్రాచీన మయినదనే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇదే యుక్తి యుక్తమనిపిస్తుంది. తెలుగులో ఆదికవిగా పేరుగాంచిన నన్నయ గారు మొట్టమొదటగా తెనుంగు, తెనుఁగు లనే ప్రయోగించాడు. ఆ తరువాత కాలంలో రచయితలు తెలుగును ప్రయోగించారు. ఏతావాతా చెప్పొచ్చేదేమంటే దిగ్వాచి అయిన తెనుగు అనంతర కాలంలో తెలుగుగా మారింది.

త్రిలింగ నుంచి తెలుగు వచ్చిందనేది సరయినది. కాదు. అసలు తెలుగు దేశానికి త్రిలింగ దేశమనే పేరు కేవలం కొన్ని గ్రంథాలలో తప్ప వ్యవహారంలో లేదు. శైవమతం ప్రాబల్యం వహించిన కాలంలో పండితులు తెలుంగును త్రిలింగ గా మార్చి ప్రయోగించి ఉంటారు.

## 11.18 వడుగి/వరుగి:

తమిళభాషలో అతిముఖ్యమయిన సంగవాఙ్మయంలో తెలుగు వాళ్ళకు సంబంధించిన కథలు అనేకం ఉన్నాయి. తమిళ సంగవాఙ్మయంలో తెలుగు వారిని గురించి చెప్పవలసి వచ్చినపుడు వడగు, వడగర్లు అని సంబోధించారు. వడగర్లు వేటను వేటను ముఖ్య వృత్తిగా చేసుకొని వేటకుక్కలతో సంచరించేవారని ఉంది. వడుగర్ లంటే ఉత్తరదిక్కున నివశించేవారని అర్థం. డచ్చిదేశస్థులు కూడా వారి రికార్డుల్లో తెలుగు వారిని గురించి చెప్పవలసివచ్చినప్పుడు వడుగర్లు అనీ భాషను వరుగి/వడుగి అనీవాడారు.

## 11.19 జెంతో :

పోర్చు గీసు వారు తెలుగు వారిని జెంతియొ (Gentio) అనీ, తెలుగు భాషను జెంతో (Gentoo) అనీ, 16,17 శతాబ్దాలలో వ్యవహరించారు. 1816 లో ఏ.డి. కాంబెల్ తాను రాసిన వ్యాకరణానికి ‘A Grammar of Gentoo or Teloogoo Language` అని పేరు పెట్టాడు.

మొత్తంమీద తెలుగు భాషకు ఆంధ్రం, తెనుగు, తెలుగు, వడుగి, జెంతో అనే పేర్లను వాడగా ఇప్పుడు బహుళ వ్యవహారంలో ఉన్న తెలుగు పదం దక్షిణ దిక్కును సూచించే తెనుగునుంచి ధ్వని పరిణామం వల్ల వచ్చిందని సిద్ధాంతీకరించవచ్చు.

## సమీక్ష :

ద్రావిడ భాష, ద్రావిడ భాషగా తెలుగు, తెలుగు భాషకున్న వివిధ పేర్లనూ, పుట్టుక, చరిత్ర, వ్యుత్పత్తులను గురించి ఈ పాఠంలో వివరించడం జరిగింది.

## ప్రశ్నలు :

1. ఆంధ్రం, తెనుగు, తెలుగు పదాల చరిత్రను, వ్యుత్పత్తిని వివరించండి.
2. తెలుగు భాసకున్న వివిధ పేర్లను వాటి చరిత్ర వ్యుత్పత్తులను విశదపరచండి.

## సంప్రదించవలసిన గ్రంథాలు :


1. కృష్ణమూర్తి, భద్రిరాజు (సంపాదకుడు) ‘తెలుగు భాషా చరిత్రి’ (రెండవముద్రణ), ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు. 1979.
2. జోగిసోమయాజి, గంటి, ఆంధ్ర భాషావికాసము, త్రివేణీ పబ్లికేషర్సు, మచిలీపట్నం, 1968.

పాఠం - 12

# తెలుగు భాషలో భిన్న యుగాలు

**వ్యాస సంగ్రహం :**

క్రీ.పూ. 200 నుండి క్రీ.శ. 575 వరకు ఉన్న సంస్కృత ప్రాకృత శాసనాలలోను, గాథాసప్తశతిలోను ఉన్న తెలుగు పదాలు గ్రామ నామాలు వ్యక్తి నామాలు మొదలయినవి - క్రీ.శ. 575 నుండి క్రీ.శ. 1000 సంవత్సరాల వరకు గల తెలుగు శాసనాలలోని పదాలు, భాషా విశేషాలు, ఛందో విశేషాలు - ఎఱ్ఱగుడిపాడ, కలమళ్ళ, తిప్పలూరు, మాలెపాడు, కొరవి, అద్దంకి, యుద్ధమల్లుడి బెజవాడ, ధర్మవరం, గూడూరు శిలాశాసనాలు, ఈ శాసనాలలోని భాషా విశేషాలు.
తెలుగు భాషా వికాసం

## అ. శాసనయుగ పూర్వకాలం (క్రీ.పూ. 200 నుండి క్రీ.శ. 575 వరకు) :

క్రీ.పూ. 600 సంవత్సరాల నుండి క్రీ.శ. 1000 సంవత్సరాల వరకు జైన బౌద్ధమతాల వ్యాప్తి కోసం పలు ప్రాకృత గ్రంథాలు రచించబడటమే కాకుండా అనేక ప్రాకృత శాసనాలు వేయబడ్డాయి. సుమారు 1600 సంవత్సరాలు ప్రాకృత భాషలు విస్తృత ప్రచారంలో భారత దేశంలో ఉన్నాయి. అశోకుని ధర్మశాసనాలలోను సంస్కృత నాటకాలలోను ప్రాకృత భాష ప్రయోగించబడింది. పాత్రోచిత భాషగా ప్రాకృత భాష సంస్కృత నాటకాలలో ప్రయోగించాలని నిర్దేశం. హాలుని 'గాథాసత్తసఈ' వంటి సంకలన గ్రంథాలు ప్రాకృత గ్రంథాలలో శ్రేష్ఠమయినవిగా ప్రసిద్ధాలే. వర రుచి ప్రాకృత ప్రకాశ గ్రంథం (క్రీ.పూ. 300 సం॥) లో మహారాష్ట్రీ, మాగధీ, శౌరసేనీ, పైశాచీ, ప్రాకృతాలు పేర్కొబడ్డాయి.

"మాగధ్యవంతిజాప్రాచ్యా శూరసేన్యర్ధ మాగధీ
బాహ్లీకా దాక్షిణాత్యాచ సప్త భాషాః ప్రకీర్తితాః" (నాట్యశాస్త్రమ్ 17-49)

అని భరతుడు (క్రీ.శ. 300) తన నాట్యశాస్త్రంలో ప్రాకృతాలను ఏడుగా పేర్కొన్నాడు.

ఆర్య భాషలయిన సంస్కృత ప్రాకృతాలు ఉత్తర భారతదేశంలో విస్తృత ప్రచారంలో ఉండగా, దక్షిణ భారతదేశంలో ద్రావిడ భాషల వ్యాప్తి అవ్యాహతంగా ఉంది. ఇటువంటి పరిస్థితులలో ఆర్యభాషల ప్రభావం తద్భాషా వ్యవహర్తలు దక్షిణా పథానికి క్రీస్తు పూర్వమే దక్షిణా పథానికి వచ్చి స్థిరవాసమేర్పరచుకొన్న కారణంగా ద్రావిడ భాషలపై పడటంలో ఆశ్చర్యం లేదు. ఆంధ్ర భాషకు పశ్చిమోత్తరంగా మరాఠీ భాష, ఉత్తరంగా ఒడియా భాష సన్నిహితంగా ఉన్నాయి. మరాఠీ భాషకు మూలమయిన మహారాష్ట్రీ ప్రాకృతంతోను, ఒడియా భాషకు మూలమయిన మాగధీ ప్రాకృతంతోను ఆంధ్ర భాషకు పూర్వకాలం నుంచి సంబంధాలున్నాయి. శాతవాహన చక్రవర్తుల కాలం నుంచి ఆంధ్రులకు, మహారాష్ట్రులకు సంబంధ బాంధవ్యాలున్నాయి. శాతవాహనుల కాలం (క్రీ.పూ. 200 నుండి క్రీ.శ. 200 వరకు) లో ప్రాకృతాల ప్రభ ప్రకాశించింది. శాతవాహనుల కాలంలో కొద్ది కాలం, తర్వాత ఇక్ష్వాకులు, విష్ణుకుండినుల కాలంలోను సంస్కృత భాష ఆదరించబడింది. క్రీ.శ. 575 కు పూర్వం ఉన్న అనేక సంస్కృత ప్రాకృత శాసనాలు లభించాయి. ఈ శాసనాలలో అనేక తెలుగు మాటలు కన్పిస్తున్నాయి.

"నేటి కర్నూలు, కృష్ణా, గుంటూరు, గోదావరి మండలములలో దొరికిన ప్రాకృత శాసనముల సంఖ్య 252. దక్షిణా పథమునకు చెందిన ప్రాకృత శాసనావళిలో చాల పాలు ఆంధ్రదేశమున లభ్యమైనట్లు శాసన పరిశోధక శాఖ వారి నివేదిక - - - - ఒకే యుగము నందు ఒకే వంశమునకు చెందిన రాజుల పాలనమునందున్న మహారాష్ట్రాంధ్ర దేశములలో మహారాష్ట్ర దేశము

నందు దొరికిన శాసనముల సంఖ్య కంటే ఆంధ్రదేశ ప్రాకృత శాసన సంఖ్య అధికమగుట ప్రాకృత భాషలకు ఆంధ్రదేశము నందు ఉండిన ప్రచుర వ్యవహారమునకు ప్రబల నిదర్శనము" (వైకృత పద స్వరూప నిరూపణము, పుటలు 32,33) అని ఆచార్య తూమాటి దొణప్ప గారు ఆంధ్రదేశంలోని ప్రాకృత భాషల వ్యాప్తిని వెల్లడించారు.

క్రీ.శ. 2వ శతాబ్దిలోని పులోమావి శాసనం అమరావతిలో లభించినది. ఈ శాసనంలో సర్వం ప్రాకృతమే, ఒక్క తెలుగు మాట కూడా లేదు. మనకు దొరికిన మొట్టమొదటి తెలుగు మాట 'నాగబు' అమరావతి స్తూపంపై ఉంది. క్రీ.పూ. 200 సంవత్సరాల నుంచి క్రీ.శ. 200 సంవత్సరాల వరకు అమరావతి స్తూప నిర్మాణం 3 అంచెలుగా సాగినట్లు తెలుస్తోంది. 'నాగబు' ఉన్న శాసనం ప్రాకృత శాసనమనటంలో విప్రతిపత్తిలేదు. ఇది శిథిల శాసనం. ఈ పదాన్ని గుర్తించిన వారు కీ.శే. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు. ఈ 'నాగబు' మాట "నాగవల్బ, నాగంబు, నాగమ్ము, నాగము, నాగం" గా కాలక్రమేణ మారినట్లు భాషా శాస్త్రజ్ఞులు భావించారు. సంస్కృత నాగ' శబ్దానికి "పాము, ఏనుగు" అనే రెండు అర్థాలు ప్రసిద్ధంగా ఉన్నాయి. "నగేభవః నాగః " (నగంపై పుట్టింది నాగం' అని పదవ్యుత్పత్తి. నగ శబ్దానికి చెట్టు, పర్వతం అని రెండు అర్థాలు. చెట్టు మీద ఉన్నది పాము అనీ, పర్వతంపై ఉన్నది ఏనుగు అని అర్థం. ప్రాకృత శాసనాలలోని 'నాగబు' పదానికి 'పాము' అనే అర్థాన్నే అభిజ్ఞులు తీసికొన్నారు. 'నాగబు' అనేది తెలుగు పలుకు ఏవిధంగా అవుతుంది? ప్రశ్న. '-బు' అనేది తెనుగు మహతీతరామకప్రత్యయం. ఈ '-బు' ప్రత్యయం చేరిన సంస్కృత 'నాగ-' శబ్దం సంస్కృత సమ (తత్సమ)మైన 'నాగబు' గా మారి తెలుగు పదంగా పరిణమించింది అనేది సముచిత సమాధానం. తెలుగులో మొదటి మాట అన్యదేశ్యం కావటం విశేషం. 'నాగబు' అచ్చ తెలుగు మాట మాత్రం కాదు.

ఊళ్ళ పేర్లు వ్యక్తుల పేర్లు సంస్కృత ప్రాకృత శిలాశాసనాలలో క్రీ.శ. 575 కు పూర్వమే మనకు అనేకం కన్పిస్తున్నాయి. గ్రామ నామ పరిశీలనకు వ్యక్తి నామ పరిశీలనకు ఈ పేర్లు ఎంతగానో ఉపకరిస్తాయి. నామ విజ్ఞానానికి (Gnomastics) ఇవి ప్రయోజనకారులు. ఈ పేర్లలో తెలుగు మాటలున్న వాటిని పరిశీలిద్దాం :

క్రీ.శ. 200 సంవత్సర ప్రాంతానికి చెందిన ఆంధ్ర రాజుల బళ్ళారి మండలంలోని శ్రీ పులోమావి జంగిలి గుండు శాసనంలో వేపురకే' అని ప్రయోగించబడింది. ఆ రాజు మాక్య దోని దోని శాసనంలో కూడా 'వేపురకే' అని ప్రయోగించబడింది. ఈ పదంలోని తెలుగు మాట ఊరు' (ఎవేప + ఊరు) అనేది స్పష్టం. అత్తి వర్మ గోరంట్ల తామ్ర శాసనం (క్రీ.శ. 350) లో 'అన్తుక్కూర' పదం కన్పిస్తుండగా క్రీ.శ. 5వ శతాబ్దికి చెందిన విజయదేవరవర్మ ఏలూరు తామ్రశాసనంలో 'ఏళూర' ( ఎ వెళు+ఊర) శబ్దం కన్పిస్తోంది. ఆ కాలంలో 'ఊరు' శబ్దం గ్రామవాచిగా ఉండేది అని స్పష్టమవుతోంది.

క్రీ.శ. 385 కు చెందిన రెండవ విజయస్కంద వర్మ ఒంగోడు దాన శాసనంలో ఒమ్ గోడు' అనే పదం ఉంది. ఇది ఒన్, కోడు శబ్దాల కలయిక వల్ల ఏర్పడ్డ శబ్దరూపం.

మాధవవర్మ ఈపూరు తామ్రశాసనం (క్రీ.శ. 495) లో కూడా వాడ పదం గ్రామనామంగా కన్పిస్తుండగా 4వ శతాబ్దికి చెందిన నందివర్మ కంతేరు, త్రామ శాసనంలో 'కురువాడా' 'ఊరు పేరు కన్పిస్తోంది. వాడ గ్రామవాచిగా ఆనాటికే ప్రసిద్ధి పొందింది. రెండవ సింహవర్మ (క్రీ.శ. 363-385) ఒంగోడు శాసనంలో 'కడాకుదురు' అనే ఊరు పేర్కోబడింది. క్రీ.శ. 538 కు చెందిన పృధ్వీమాలుని గోదావరి తామ్ర శాసనంలో చూయిపాక గ్రామ నామం పేర్కోబడింది. ఊళ్ళ పేర్ల చివర -పాకు ఉండటం మనం గమనించవచ్చు. క్రీ.శ. 350 కు చెందిన అత్తివర్మ గోరంట్ల తామ్రశాసనంలో 'తాన్తి కొన్త' అని పేర్కోబడింది. క్రీ.శ. 537కు చెందిన విక్రమేంద్ర వర్మ చిక్కుళ్ళ తామ్రశాసనంలో 'రావిరేవ, రేగొన్త' అనే ఊర్లు పేర్కోబడ్డాయి. క్రీ.శ. 390 కు చెందిన శాలంకాయన నందివర్మ పెదవేగి శాసనంలో 'అఋతొటె' ఊరి పేరు కన్పిస్తోంది. తొటె, రేవ, రేవు పదాలకున్న అర్థం నేటి రేవు'. నీటి రేవు కల ఊరు అని అర్థం. క్రీ.శ. 5వ శతాబ్దానికి చెందిన ప్రభంజనవర్మ చికాకోల్ తామ్రశాసనంలో 'పారపల్లి'

పదం గ్రామనామంగా పేర్కొబడింది. 'పల్లి' పదం నేటికి చాలా ఊళ్ళ పేర్ల చివర ఉంది. క్రీ.శ. 475కు చెందిన శాలంకాయన నందివర్మ పెద వేగి శాసనంలో 'కమ్బురాఞ్చెరువే' పేర్కొబడింది. ఇందలి కుమ్బురాఞ్చెరువు గ్రామనామం. క్రీ.శ. 475కు చెందిన అదే శాసనంలో 'చెఞ్చెరువ గ్రామే' అని పేర్కొబడింది. కమ్బురాఞ్చెరువు, చెఞ్చెరువులు తెలుగు మాటలే అని మనం దృఢంగా చెప్పవచ్చు.

సంస్కృత ప్రాకృత శాసనాలలోని పై గ్రామ నామ పదాల పరిశీలన వల్ల గ్రామ నామానుబంధాలుగా -ఊరు, -కుదురు, -కొన్ఱ, -కోడు, -చెఱువు, -పాక, -వాడ, -తొఱె, -రేవ, -రేవు పదాంశాలున్నట్లుగా స్పష్టమౌతుంది.

క్రీ.శ. 4వ శతాబ్దికి చెందిన అత్తివర్మ గోరంట్ల శాసనంలో 'కొట్టి శర్మ' అనే వ్యక్తి నామం, అదే శతాబ్దికి చెందిన విజయస్కంధ వర్మ ఒంగోడు శాసనంలో 'గోలశర్మ' అనే మరో వ్యక్తి నామం ప్రయోగించబడ్డాయి.

కొన్ని ప్రాకృత గ్రంథాలలో కూడా తెలుగు మాటలు ప్రయోగించబడ్డాయి. క్రీ.శ. 78వ సంవత్సరానికి చెందిన శాతవాహనులలో 7వ వాడైన హాలుడు 'సత్తసఈ' అనే గ్రంథాన్ని సంకలనం కావించాడు. మహారాష్ట్ర ప్రాకృత గ్రంథమైన ఈ 'సత్తస ఈ' లో కొన్ని తెలుగు మాటలు కన్పిస్తున్నాయి.

'సత్తస ఈ' లో 11 చోట్ల 'అత్తా' శబ్దం ప్రయోగించబడింది. ఈ పదం ద్రావిడ శబ్దంగా ద్రావిడ వ్యుత్పత్తి కోశం (Dravidian etymological dictionary) లో ఇవ్వబడింది.

| | | |
|---|---|---|
| తమిళం | : | అత్తన్ తండ్రి, పెద్దవాడు, హోదా కల వ్యక్తి; అత్తె అత్తైవర్, తండ్రి సోదరి, అత్త హోదా కల స్త్రీ; అత్తాన్ అక్క భర్త, తండ్రి సోదరి; కుమారుడు, మేనమామ కొడుకు, బావమరిది; అత్తి అక్క; అత్తో ఆశ్చర్యార్థకం; |
| మలయాళం | : | అత్త తల్లి, తల్లి సోదరి; అత్తన్ తండ్రి; |
| కన్నడం | : | అత్త, అత్తి అత్త ; అత్తికె అక్క; అత్తిగె వదిన; |
| తుళు | : | అత్తె అత్త; అత్తిగె వదినె; |
| తెలుగు | : | అత్త భర్త తల్లి, తండ్రి సోదరి, తల్లి సోదరుని భార్య |
| నాయకి | : | అతి అన్ తండ్రి సోదరి |
| గదబ, ఒల్లారి | : | అత, అత్త తండ్రిసోదరి; |
| గోణ్ణి | : | అతీ తండ్రి సోదరి |
| కుఇ | : | అత, అతలి అమ్మమ్మ లేదా నాయనమ్మ |
| కువి | : | అత్త అత్త |

సంస్కృతంలోని 'అత్తా' శబ్దం ప్రాకృత భాషలోని 'అత్తా' శబ్దమే. ప్రాకృత 'అత్తా' పదం తెలుగు నుండి అక్కడక్కడ అర్థ భేదాలతో గ్రహించబడిందే. సంస్కృతంలోని అత్తా శబ్దానికి ప్రయోగాలు అంతగా లేవు. సంస్కృతంలో ఈ అర్థంలో 'శ్వశ్రూ' శబ్దం ప్రసిద్ధం. అత్తా శబ్దం తెలుగు శబ్దమే.

ఉదరార్థకమయిన 'పొట్ట' పదం గాథాసత్తస ఈ లో 'పోట్ట' అని ప్రయోగించబడింది. ఇది ద్రావిడ శబ్దమని నిరూపితం (చూ. Dravidian etymological dictionary 397, 398). ప్రాకృతంలో ఉదరార్థంలో ఉన్న "పుట్ట, పోట్ట" పదాలు ద్రావిడ భాషా సంబంధులనటంలో సందేహం లేదు. ఈ శబ్దాలకు ఇండో-యూరోపియను భాషలలో సజాతీయ భాషా పదాలు

(cognates) లేవు. ప్రాకృత 'పోట్ట' తెలుగు మాట అని మనం నిర్ధారించవచ్చు. గాథాసప్తశతి (సత్తస ఈ) ఆంధ్రదేశంలో హాలుని చే సంకలనం చేయబడ్డ గ్రంథం కదా. దీనిలోని ద్రావిడ పదాలన్నిటినీ తెలుగు మాటలుగా స్వీకరించవచ్చు.

'సత్తస ఈ' లోని 'పీలు ఆ' పదం తెలుగు 'పిల్ల' నుండి ఏర్పడినదే. 'భోండీ' పదం సూకరి (ఆడపంది) అనే అర్థంలో 'సత్తస ఈ' లో ప్రయుక్తం. ఇది తెలుగు 'పంది' నుండి ప్రాకృతంలోకి ప్రతిదేయ పదంగా తీసుకోబడ్డదే.

ఈవిధంగా సంస్కృత ప్రాకృత శాసనాల ప్రాకృత సారస్వతంలోను క్రీ.శ. 575 కు పూర్వమే అనేకాంధ్ర పదాలు ప్రవేశించాయి.

## ఆ. ప్రాఙ్నన్నయ శాసన వాఙ్మయ యుగం (క్రీ.శ. 575 నుండి 1000 వరకు)

ధనంజయుని కలమళ్ల శిలాశాసనం కడప జిల్లా కమలాపురం తాలూకాలోని కలమళ్ళ గ్రామంలో లభించిన శిలాశాసనం. ఎరికల్ముత్తురాజు బిరుదు కల ధనంజయుడు రేనాటి పాలకులలో మొదటివాడు. ఇతడు క్రీ.శ. 575 నుండి 600 వరకు రేనాటి రాజ్యాన్ని పరిపాలించినట్లుగా ఆంధ్ర చరిత్ర విశదం చేస్తోంది. కడప జిల్లాలోని కమలాపురం తాలూకాలో ఉన్న కలమళ్ళలో ఒక దాన శాసనం ఇతని పరిపాలన కాలంలో వేయబడినట్లు ఈ కలమళ్ళ శాసనం స్పష్టపరుస్తోంది. బౌద్ధ భిక్షువయిన రేవణకాలు ప్రేరణ వల్ల చెనూరుకాజు, అతి కళా ఊరి ప్రజలు దానం చేశారు. ఆచార్య కోరాడ మహదేవశాస్త్రి గారు దీనిని తెలుగులో మొట్టమొదటి శాసనంగా పేర్కొన్నారు.

1. ................................
2. కల్ము (తు) రా
3. జు ధనంజ -
4. యుఋ రేనా
5. ణ్డు ఏళన్
6. చిఋమ్బ్రురి
7. రేవణ కాలు (పం)
8. పు చెనూరు (కాజు)
9. అ టి కళా (ఊ) రి
10. ణ్డ వారు (ఊరి)
11. ................................
12. ................................
13. ................................
14. ................................
15. ........................ (పఞ్చ) (మ-)
16. హా పాంతక స
17. (కు)

రెండో వైపు శిథిలం.

నకారానికి మారుగా ణ కారం ప్రత్యయస్థంగా ఉంది. లకారానికి మారుగా ళకార ప్రయోగం. ఏళన్ = ఏలన్. 'చెనూరు' కడప జిల్లాలో ఉంది.

## ధనంజయుని ఎఱ్ఱగుడిపాడు శిలాశాసనం :

కడపజిల్లా కమలాపురం తాలూకాలోని ఎఱ్ఱగుడిపాడు గ్రామంలో లభించిన శిలాశాసనం. ఎరికల్ముత్తురాజు బిరుదు కల ధనంజయుడు రేనాటి పాలకులలో మొదటివాడు. ఎరికల్ముత్తు రాజు అనేది రేనాటి చోళ పాలకుల బిరుదు. ఈ బిరుదుకు 'జ్ఞానేశ్వరుడు' అని అర్థం. ఈ ధనంజయుడు క్రీ.శ. 575 నుండి 600 వరకు రేనాటి రాజ్యాన్ని పరిపాలించినట్లుగా చారిత్రికులు విశదపరిచారు. కడపజిల్లాలోని కమలాపురం తాలూకాలో ఉన్న 'ఎఱ్ఱగుడిపాడు' లో ఈ దాన శాసనం లభించింది.

ఎఱికల్ముత్తు రాజు బిరుదు కల ధనంజయుని కుండి కాళ్ళు (బౌద్ధ భిక్షువులు) కారణంగా (బౌద్ధ భిక్షువుల ప్రేరణచే) దు జయ రాజుల ముత్తురాజులు, నవప్రియ ముత్తు రాజులు, పల్లవ యువ రాజులు సాక్షిగా బ్రాహ్మణునికి ఇచ్చిన పన్నస. కుండి కాళ్ళు ఇచ్చిన పన్నస 24 మురున్తుర్క్కు నేల. ఇదా దాన శాసనం.

1. స్వస్తి శ్రీ ఎరిక-
2. ల్ముత్తు రాజుల్ల
3. కుణ్డి కాల్కు (ని) వబుకా-
4. ను ఇచ్చిన పన్నస
5. దుజయ రాజుల
6. ముత్తు రాజుల నవ-
7. ప్రియ - ముత్తు రాజులు
8. వల్లవ - దుక రాజులు శక్షి-
9. కాను ఇచ్చి (న) పన్నస

**రెండో వైపు**

10. కొట్టమ్బున పా-
11. ఱకు కుణ్డి కాళ్ళు-
12. ల ఇచ్చిన పన్నస
13. ఇరవది యాదినా-
14. ల్కు మఱున్తుర్క్కు నేల.

బౌద్ధ భిక్షువులను 'కుణ్డి పాదాః' అని వ్యవహరిస్తారు. 'గురుపాదాః', పూజ్య పాదాః, పితృ పాదాః' పదాలను బట్టి "కుణ్డి పాదాః" అనే సంస్కృత సమాసం ఏర్పడుతుంది. పాదాః = కాళ్ళు. కుండి కాళ్ళు అనేది సంస్కృత "కుణ్డి పాదాః" అనే దానికి Loan-translation. ఇటువంటి సమాసాలు (సంస్కృతాంధ్ర పదాల సమాసాలు) శాసనాలలో సాధారణ విషయం.

నిభ (సంస్కృతం) > నెపము 'కారణం'.

కొంత పరిమాణం కల స్థలాన్ని 'పన్నస' అంటారు.

పఞ్చాశత్ (సం.) > పణ్ణాస (ప్రా) > పన్నస

'పన్నస' పదానికి భూపరిమాణం అని అర్థం.

దుగరాజులు < యువరాజులు

పల్లవ (సం) > వల్లవ (గసడదవాదేశం కావచ్చు)

గోష్ఠ - (సం) > గొట్ఠ - (ప్రా) > కొట్టము (తె.)

కొట్టంబు = కుగ్రామం అని ఇక్కడ అర్థం.

నాల్కు = నాలుగు

సాక్షి పదానికి 'శక్షి' అని శాసనకారుని దోషం.

**తిప్పలూరి శిలాశాసనం :**

శత్రురాజులకు వజ్రాయుధమ (పిడుగ) యిన, లెక్కించ తగ్గవాడయిన, ఉత్తమోత్తముడయిన ఎరికల్ముత్తు రాజు బిరుదు కల పుణ్యకుమార చోళ రాజుకు శుభం (మేలు, స్వస్తి) సంపద (శ్రీ) కలుగుగాక. చిర్వల్లియ రాజధానిగా చేసికొని రేనాటి దేశాన్ని పరిపాలిస్తూ తర్కపు ఓోలకు చెందిన భారద్వాజ గోత్రుడయిన కిఓేవురు కత్తి శర్మకు తిప్పలూరులోని పన్నసను (భూభాగాన్ని) పునః పుష్యమి కొండ కార్తీక అమావాస్య రెండో రోజు విదియ సోమవారం బృహస్పతి హోరా కాలంలో (దానంగా) ఇచ్చారు. ఇది చామణకాలుని ధర్మం.

ఈ శాసనం కడప జిల్లా తిప్పలూరులో క్రీ.శ. 625-50 మధ్య కాలంలో ఎరికల్ముత్తు రాజు బిరుదు కల పుణ్యకుమారునిచే వేయించబడింది. ఇది శిలాశాసనం, దాన శాసనం.

1. స్వస్తి శ్రీ ఎరికల్ల ముతు -
2. (రా) జు పుణ్యకుమారున్డు గణ్య-
3. మానున్డు మఱున్డ పిడుకు మదము-
4. ది తున్డు త్తమోత్తమున్డయిన వా
5. న్డు చిర్వలియ పటుకాను రేనాణ్డే-
6. ళు చు తర్క్కపుటోల పారదాయ
7. కి టేవురు కత్తి శర్మకు తిర్పలూ-
8. ర పనాశ కొణ్డ కా (ర్తి) య చీకు-
9. న బిదియ సోమవారమ్బు పుణ రు-
10. పుష్యమ్బు బ్రహస్పతి హోర కా -
11. ను ఏమ్బుదియె చామణకాల ధ (-)

ఎరికల్ముత్తు రాజు బిరుదు చాలా మంది రాజులకు ఉన్నట్లు తెలుస్తోంది. 'చీకు' శబ్దంలో అరసున్న లేనట్లు ఈ శాసనం వల్ల తెలుస్తోంది. ప్రోలుకు పూర్వరూపం 'పుటోల' ఈ శాసనంలో కన్పిస్తోంది. ఱ కార ప్రయోగం ఆనాడు సర్వ సాధారణం.

మాలెపాడు తామ్రశాసనం

క్రీ.శ. 650-700 మధ్య కాలంలో సత్యాదిత్యుడు కడప జిల్లా మాలెపాడులో వేయించిన తామ్ర శాసనం. ఇది దానశాసనం. శ్రీ చోళమహారాజాధిరాజ పరమేశ్వర బిరుదాంకితులయిన విక్రమాదిత్య మహారాజు కుమారులైన కుమార విక్రమాదిత్యుల

కుమారులు కాశ్యప గోత్ర సంభవులు సత్యాదిత్య మహారాజు సిద్ధి వేయి (గ్రామాలను, జిల్లాలను, ప్రదేశాలను) రేనాటి ఏడు వేల (గ్రామాలను, జిల్లాలను, ప్రదేశాలను) పరిపాలిస్తున్నారు. (ఆ సమయంలో) (ఆమహారాజు) కాశ్యప గోత్రోద్భవులైన కొమరి వాస్తవ్యులయిన బ్రాహ్మణులయిన రేవశర్మకు ఉత్తరాన చిఱుంబూరు ................ చెరోవైపు ......................... జుగిపాలాలు సరిహద్దుగా; దక్షిణాన ...................... అయిదు మమన్తురు నేలను (దానంగా) ఇచ్చారు. దీనిని (ఈ దానాన్ని) నిర్వహించినవానికి వేయి గుళ్ళను నెలకొల్పినంత, వేయి చెరువులను త్రవ్వించినంత, వేయి అగ్రహారాలను స్థాపించినంత పుణ్యం కల్గుతుంది. దీనికి విరుద్ధంగా ప్రవర్తించిన వారికి (దీనిని భంగం చేసిన వారికి) పుత్ర వధ, స్త్రీ వధ, గో హత్య (మొదలయిన) పంచమహాపాతకాలు చేసి వాడు పడే లోకంలో ఉంటారు.

## మొదటి ముఖం

1. స్వస్తి శ్రీ చోఱి మ-
2. హా రాజాధిరాజ ప-
3. రమేశ్వర విక్రమాది-
4. త్య సక్తికొమరవి
5. క్రమాదిత్యుల కొడుకు-
6. ళ్ కాశ్యప గోత్రు
7. (న్డు) సత్యదితున్డు సిద్ధి-
8. వేయు రేనాణ్డు ఏఱు (వే-
9. ల) ఏళుచుని కొ (మ-
10. రి) పార రేవ శ-
11. మ్మన్ కాశ్యపగో-
12. త్రినికి ఇచ్చిన
13. ...................... చిఱుమ్బూరి ఉత్త-
14. ...................... శ తూర్పున దిశ
15. ....................... (డు) జుగ్గి పాలగ (రు)-
16. సు ద (క్షి) న (దిశ)
17. ....................... పాఱ (మ)

## రెండో ముఖం

18. ఏను మఱుత్రుగా-
19. ను తాగిరి దేని
20. సల్పిన వానికి
21. వే గు (ళ్) ళ వు వేసె-
22. ఱువుళు వేవాన్టా

23. ఋ్ల నిల్పినం పుణ్యమ్బు
24. దీనికి వక్రమ్బు
25. వచ్చు వన్డు పుత్రన-
26. ద్య స్త్రీ వద్య (గోవ) -
27. ద్య పఞ్చమ (హా)
28. పాతక ఞ్చేసి (న)-
29. వాని లోకమ్బు
30. నున్డు వాన్డు.

శ్వాసన ప్రథమ పాదంలోనే 'చోటి' లో 'టి' కార ప్రయోగం. 'కొడుకుళ్' లో ళ కారం బహువచన ప్రత్యయం.

'ఏఱు' సంఖ్యావాచకమయిన 'ఏడు' కు పూర్వరూపం. మూ.ద్రా. ఏఢ్. రెండు అచ్చుల మధ్య ఉండే 'ఱ' కారం తెలుగులో 'డ' కారంగా మార్పు చెందుతుంది. ఇది ధ్వని పరిణామం. శాసనాలలో తెలుగు పదాల ప్రాగ్రూపాలు లభిస్తాయి.

గరుసు పదానికి హద్దు, మేర అని అర్థం.

"ఏక భోగంబు గా౦గ నేలేఱుగరుసు" అని శ్రీనాథ మహాకవి (భీమఖండము 5 ఆ - 85)

## కొరవి శిలాశాసనం :

వరంగల్లు జిల్లా కొరవిగ్రామంలో క్రీ.శ. 892-922 మధ్యకాలంలో మొదటి చాళుక్య భీముడు వేయించిన దాన శిలాశాసనం. ఈ శాసనం అసంపూర్ణమని తోస్తోంది. శ్రీ విక్రమాదిత్య నృపతి జ్యేష్ఠ తనూజునికి కుసుమాయుధుడు అని పేరు. ఈ రాజు బలపరాక్రమాల వల్ల 'చాళుక్య భీముడు' అనే బిరుదు కల్గింది. చాళుక్య భీమ బిరుదాంకితులలో ఇతడు మొదటివాడు. కాబట్టి చాళుక్య భీమ I అని ఈ రాజును చారిత్రికులు వ్యవహరించారు. ఇతడు పరాక్రమశాలియే అని ఈ శాసనాన్ని బట్టి మనకు విశదమవుతోంది. కుసుమాయుధుని పెద్దకొడుకు దాత, కృతజ్ఞుడు, శౌర్యశాలి.

శ్రీ విక్రమాదిత్య నృపతి జ్యేష్ఠ కుమారుడు, నిష్కళంక మన్మథునికి, వేంగీ రాజ్యాధిపతికి, అనేక శత్రురాజులను మర్దించినవానికి, కుమార బల్లహుని హస్తగతమయిన రాజ్యాన్ని పునః స్వాధీనపరచుకొన్న కుసుమాయుధుడు చాళుక్యభీమ బిరుదాంకితుడై ఖడ్గ సహాయుడై కంటెను (విజయ చిహ్నంగా) ధరించి రాజ్యాభిషిక్తుడై మంచికొండ నాడు మొదలయిన వేగి దేశాన్ని విష్ణువర్ధన సహాయుడై సగం రాజ్యాన్ని పరిపాలిస్తున్నాడు.

ఈ సమయంలో చాళుక్యభీముని పెద్దకొడుకు, శత్రురాజులను జయించి పాదాక్రాంతులను చేసుకొన్నవాడు చాళుక్య భీముడు II అనే పేరుతో రాజ్యం చేస్తూ, ఇష్ట విషయ కామోప భోగాలను అనుభవిస్తూ సుఖంగా ఉన్నారు. ఒక రోజు ఆ రాజు కొరవి నల్ల మెతెయ కొడుకు పెద్దనను రప్పించి "నీవు నా ప్రాణ స్నేహితుడవు. నీవు చేసిన ఉపకారానికి నేను ప్రత్యుపకారం చేయాలి. నీకేమి కావాలో కోరుకో" అని అడగగా పెద్దన "నీకు కల సంపద అంతా నాదే. ఇంకా నాకేమి కావాలి? అయినప్పటికి నన్ను కోరుకొమ్మన్నారు. కాబట్టి నాకు కొరవి గ్రామాన్ని ఇవ్వండి" అని కోరుకొన్నాడు. ఈ లోగా ఆ ప్రభువు మరణించగా అతని తమ్ముడు మహాపరాక్రమశాలి చాళుక్య వంశాలంకారుడు రాజ్యాభిషిక్తుడై అన్న మాట ప్రకారం పెద్దనకు కొరవి గ్రామాన్ని దానం చేశాడు. ఆ సందర్భంగా శిలా స్తంభాన్ని ప్రతిష్ఠించాడు. ఈ రాజు చెరువులు తవ్వించాడు. చెరువులను రక్షించిన వారికి పూడిక తీయించినవారికి ఇరవై ద్రమ్మల్ని, అరవై ద్రమ్మల్ని కానుకగా ఇవ్వాలని, పాడు చేసిన వారి నుండి ద్రమ్మల్ని వసూలు చేయాలని నియమం ఏర్పరిచాడు.

## మొదటి ప్రక్క

1. శ్రీ విక్రమాదిత్య నృపా
2. గ్ర తనయుణ్డయ్న చాళుక్య
3. భీమనకు శౌచ కన్దర్ప
4. నకు వే (జ్) గీశ్వరునకు రన
5. మర్దన్వయ కుల తిలకు
6. ణ్డయ్న కుసుమాయు ధుణ్డుగ
7. మర బల్లహుని కన్త ప్రాప్త
8. మ్బయ్న రణ మర్దన్ కణ్ఠియ (౦) దన
9. భుజవీర్యబల పరాక్ర
10. మమ్బున న్దెచ్చి కణ్ఠియజ్గట్టి
11. పట్టమ్బెత్తి ఖడ్గిసహాయు
12. ణ్డై నేల యెల్లంగావంబూని
13. మఞ్చి కొణ్డనాణ్డాదిగ
14. వేఙ్గి దేసము విష్ణువ
15. ర్ధను తోనర్ధ రాజ్యమ్బుసే
16. యుచున్న కుసుమాయుధుపె
17. ద్ద కొడుక నేకరిపున్పతి
18. మణి మకుట మకరికా
19. కషన మసృణిత చరణయు ......
    విన్దమయమ్మ కట్టి
20. పట్టమ్బు గావంబూని ధ
21. ర లేలే రాముణ్డై తన చె
22. తి వాల తోడు గాననుంగు
23. గోణం గణ్ద ను పేరితో జ
24. ళుక్య భీమణ్డు న్ద గు (ద?)

## రెండో పక్క

25. గల కలావర్తమ్బు రా
26. జ్యమ్బు సేయుచున్ ఇష్టావి
27. షయ కామోప భోగమ్బుల
28. నుభవించుచు సుఖంబు
29. ణ్డి యొక్క నాణ్డు కొరవి నల్ల
30. మెఱెయ కొడుకు పెద్దన

31. రావించి నీవు నా ప్రాణ స
32. మానుణ్డవయిన చెలివి (నీ)
33. చేశిన యుపకారంబు నా
34. కు బత్యుపకారమ్బు సేయ
35. వల యుంగాన నీ కేమి వ
36. లయు దానివే
37. ణ్డి కొమ్మనిన (నీ)
38. శ్రీ నాకెల్లకు గల దేమి లే
39. కున్న వేణ్డి కొణ్డుమయినను
40. బరోపకారంబు పొణ్ధెనా
41. ని కొరవి యన్న దిముదు
42. గొణ్డ స (ల్కు) ల కుల సన్న
43. గాలమ్బున ........... (లో)
44. కాంతరితుణ్ణై చనిన నా
45. తని తమ్ముణ్డు సకల (లో)
46. కాశ్రయ మణి కణక (ము)
47. క్తాలంకార చలుక్య కు (లో)
48. ద్ధ వేసి తగ చలుక్క పి

## మూడోపక్క

49. సంటానెగల్ల శ్రీ నిరవ
50. ద్యుణ్డ నేక సమర స (ం) ఘ
51. (ట) న భుజాసి భాసుర
52. ణ్డై తమ యమ్మ రాజశ్రీ
53. కెల్లం దాన యదు హుణ్డై
54. చేకొని నిల్చి భూమ సొలు
55. కియన్ద నేక వస్తు వా
56. హనోత్సవ (ం) బుల్ వడయు
57. చు తమయ్మ గోణ (ం) గయ్య
58. చేసిన ధమ్మున్ వులు నస
59. ంబువు నెగఱ్పువు గావను
60. రక్షింపను వలయునేని
61. చేకొని కొరవి కిచ్చినా
62. స్తితి సల్చి శిలాస్థ మ్బ (ం)

63. బు బ్రతిష్ఠి (ం) చి భిమాశ్వ
64. ర (ం) బునునాతని కొట్పించి
65. న చెఱువులు మఱియు యె
66. న్విఁయె నినా తని చేయంబడి
67. ........................... వలది అ ...................
68. ఇచ్చిన స్తితి యు పఱియలా
69. యు (ం) చేయు దెరెయంబు జి
70. ట్టరి యల్లమ్ దక్కి చాంబొడి
71. చిన నాట యిరువది ద్ర
72. మ్మలు మన (ం) బొడిచిన
73. నరువది ద్రమ్మలు
74. అక్కలకు కఱ కూలి
75. లేదు

## నాలుగో పక్క

76. ముక్కు దఱి గినను చఱి
77. చి నాను చురియు వెరికినా
78. ను ము (వలా) ఱ్చి లినాను ఉంకాది
79. నను ఇరవాద్యది ఎనూ (ం)
80. ద్రమ్మలు మాణిసి చేసినా
81. దోషంబునకు వాని జీవిత (ం)
82. బ దణ్డువు వరియార (ం) బ (ం)
83. బు పడువర (ం) బు వెల్లార (ం)
84. బపు ఎర గద్యాణ (ం) బు పే
85. రామణి పున్నమ నాణ్డు ఏ
86. పూరు (ం) ద్రమ్మలరిపె
87. ట్టి సుఖ (ం) బు మనువారు
88. నాయకుణ్డయ్ను కాపులయ్ను
89. వెర రా(జు) లు జొచ్చి మ
90. ణ జనదు (యి) స్తితియఱి
91. సి ల్కొన్న రాజుల్ గలరేని
92. యు (యా) స్తితి యడ సిన కవ
93. ణ సక ఇన్డు మన్నక (ం) పు

94 నుంచి 100 వరకు న, ణ ల భేదం పాటించబడలేదు. 'ర న' పదం ర ణ కుమారుగా ప్రయుక్తం.

కణ్ఠికా సంస్కృత శబ్ద భావం కణ్ఠి ఆ (పా) () కణ్ఠియ (తె.) 'కంటె' అని అర్థం. ఆభరణ విశేషం. ఆనాడు వీర చిహ్నం. 'ఖడ్గ' శబ్దాన్ని 'ఖ ఙ్గి' గా చెక్కటం విలోమ లేఖనానికి 'ఙ' కార వ్యాప్తికి నిదర్శనం.

'మఞ్చి కొణ్డ, నాణ్ణు, వేణ్డి' పదాల పరిశీలన వల్ల ఆనాటి వర్గ పంచమాక్షరాలు పూర్ణానుసారానికి మారుగా వాడబడేవి అనే విషయం స్పష్టపడుతోంది. ఈ శాసనంలో నీవు నా ప్రాణ సమానుణ్డ వయిన చెలివి'' మొదలయిన సంభాషణలను యథాతథంగా పేర్కోవటం విశేషం. దానాన్ని రక్షించిన వానికి బహుమానాలివ్వటం, అతిక్రమించిన వారిని దండించటం ఆ రోజుల్లో ఉండేది.

"శౌచకన్దర్పునకు, అనేక రిపు నృపతి మణిమకుట మకరికా కషన మసృణిత చరణ, ఇష్టా విషయ కామోప భోగమ్బులు, సకల లోకాశ్రయమణి కణక ముక్తాలంకార చలుక్యకు లోద్ధ ........... వంటి స త స సంస్కృత సమాసాలు ఈ శాసనంలో ఉన్నాయి. 'గద్యాణము' అనేది ఆనాటి నాణెం.

## అద్దంకి శిలాశాసనం :

పద్యశాసనాలలో ఇది మొదటిది. ఈ శాసనాన్ని తూర్పు చాళుక్య వంశీయుడు సుప్రసిద్ధుడయిన గుణగ విజయాదిత్యుని ప్రథమ రాజ్య సంవత్సరం నాటిది. ఈ రాజు క్రీ.శ. 848 నుండి 892 వరకు పరిపాలించటం చేత ఈ శాసనం క్రీ.శ. 848 నాటిది అని చెప్పవచ్చు. ఈ రాజు రాజధాని బెజవాడ. ఈ శాసనంలో పరమ మాహేశ్వరుడయిన పండ రంగడు ప్రస్తుతించబడ్డాడు. పండ రంగడు తన భూపాలకుడు పట్టాభిషిక్తుడయిన సంవత్సరంలోనే తాను సైన్యాధిపతియైనట్లు, సామంత సైన్యంతో బోయరాజుల కోటలు పండ్రెండు పట్టుకొని వేంగీ రాజ్యాన్ని విజృంభింపచేసి, త్రిభువనాంకుశుల (అంటే త్రిభువనాంకుశ బిరుదు కల వేంగీ చాళుక్యుల) పతాకను నిలిపెననియు కట్టెపు దుర్గాన్ని పాడు చేసి కందుకూరును మెచ్చి బెజవాడతో సమానమైన పట్టణంగా చేశాడని ధర్మవరంలో ఆదిత్య భట్టారకులకు భూదానం చేశాడని ఈ శాసనంలో తెల్పబడింది. ఈ దాన భూభాగాన్ని రక్షించిన వారికి అశ్వమేధ ఫలం. పండ రంగడు మహాబల పరాక్రమశాలియై గుణగ విజయాదిత్యుని ఆజ్ఞప్తిగా ఉండి ఆతని శాసనాల్ని అనేకం వేయించాడు. ఈ శాసనానికి పండరంగడు ఆజ్ఞప్తి. రాజు గారి ఆజ్ఞలను శాసన మూలకంగా అమలుపరిచేవాణ్ణి 'ఆజ్ఞప్తి' అని వ్యవహరిస్తారు.

పట్టంబుగట్టిన ప్రథమంబు నేణ్డు
 బలగర్వ మొప్పంగ ఁబై లేచి సేన
పట్టంబు గట్టించి ప్రభుఁ బండ రంగుఁ
 బంచిన సామంత పడువతోఁబోయ
కొట్టముల్ పండ్రెణ్డు గొని వేంగి నాఁటి
 గొఱలిచ్చియ త్రిభువనాంకుశ బాణ నిల్పి
కట్టెపు దుర్గంబు గడు బయల్సేసి
 కందుకూర్బెజవాడ గాలించె మెచ్చి

## గద్యం :

పండ రంగు పరమ మాహేశ్వరుండు ఆదిత్య భట్టారనికి ఇచ్చిన భూమి ఎనుబొది పుట్ల ఆఖ్ల పట్టు నేల ధర్మ పురంబున ధర్మువులు వీని రక్షించిన వారికి అశ్వమేధంబున ఫలంబగు.

3 ఇంద్రగణాలు 1 సూర్యగణం మళ్ళీ 3 ఇంద్రగణాలు 1 సూర్యగణం ఉండి 3,5,7 గణాల ఆద్యక్షరాలు యతి స్థానాలుగా కల ప్రాస నియమం కల 4 పాదాల పద్యం 'తరుర్కెజ'. ఇదే మొదటి తెలుగు పద్యం, మాత్రాగణ ప్రధానమైనది.

'పడువ' శబ్దానికి సేన అని అర్థం.

కొట్టము శబ్దానికి 'కోట' అని అర్థం.

కొటిల్చియ = నశింపచేసి ఈ పదాన్ని (ల్చిని) తేల్చి పలకాలి.

## యుద్ధమల్లుని బెజవాడ శిలాశాసనం :

ఈ శాసనం కృష్ణా జిల్లా విజయవాడ శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయంలో భద్రపరచబడి ఉన్న నాపరాతి (పాలరాతి) మీద చెక్కబడి ఉన్నది. ఈ శాసనం క్రీ.శ. 898 సంవత్సరంలో యుద్ధమల్లుడు వేయించాడు. ఈ శాసనంలో అయిదు మధ్యాక్కర పద్యాలున్నాయి.

మొదటి మధ్యాక్కరలో యుద్ధమల్లుని ప్రశంస ఉంది. చాళుక్య భూ వల్లభుడయిన యుద్ధమల్లుడు నృపాంకుశాత్యంత వత్సలుడనీ, సత్య శివుడనీ, ప్రఖ్యాత విఖ్యాత కీర్తి అనీ, ప్రస్తుత రాజాశ్రయుడనీ, త్రిలోకాభరణుడనీ సకల వస్తు సమేతుడనీ ప్రశంసించబడ్డాడు. రెండో పద్యంలో ఈ యుద్ధ మల్లుడు బెజవాడలో కుమారస్వామికి గుడిని దానికి చేర్చి ఒక మఠాన్ని కట్టించాడనీ, ఈ మఠంలో శైవులే కాని మరెవరూ ఉండకూడదనీ ఒక వేళ ఎవరైనా దీనికి వ్యతిరేకంగా ఉంటే వారు కాశిలో హత్య చేసినంత పాపాన్ని పొందుతారనీ ఉంది. ఎవరైనా ఈ ఒట్టును మన్నింపకుండా (మఠంలో) నివసిస్తే, దేవస్థానాధికారులును రాజును వాళ్ళను వెళ్ళగొట్టాలి. ఈవిధంగా వెళ్ళగొడితే అశ్వమేధ ఫలాన్ని, ఉపేక్షిస్తే లింగాన్ని నాశనం చేసిన పాపాన్ని పొందుతారు అని మూడో మధ్యాక్కరలో ఉంది. ఒకానొక సమయంలో కుమారస్వామి చేబ్రోలు నుండి బెజవాడ జాతరకు వచ్చి బెజవాడను చూచి అన్ని చోట్ల కంటె ఈ ప్రదేశమే బాగుందని ఇక్కడే ఉండగా దీన్ని తెలుసుకున్న యుద్ధమల్లుడు కార్తికేయునకు (కుమారస్వామికి) గుడిని మఠాన్ని కట్టించాడని నాలుగో పద్యంలో రెండో పద్యంలోని విషయాన్నే వివరణాత్మకంగా చెప్పబడింది. మూడో పక్క ఉన్న అయిదో పద్యంలో బెజవాడకు అలంకారంగాను, రక్ష గాను తన తాతమల్లపరాజు కట్టించిన గుడికి కలశమెత్తించినట్లు యుద్ధమల్లుడు ముఖ మండపమో గోపురమో కట్టించినట్లుంది. నాల్గో పద్యం తర్వాత కొంత అస్పష్ట వచన భాగం ఉంది. తన ధర్మ మెడఁబడి కాచు నృపులకు ..... " అని శాసనం అసంపూర్ణంగా ముగిసింది.

1. స్వస్తి నృపాంకు శాత్యన్తవత్సల సత్యత్రిణేత్ర
   విస్తర శ్రీ యుద్ధమల్లుఁడనవద్య విఖ్యాత కీర్తి
   ప్రస్తుత రాజాశ్రయుండు త్రిభువనాభరణుండు సకల
   వస్తు సమేతుండు రాజ సల్కి భూవల్లభుడర్థి

2. పరగంగ బెజవాడ ఁగొమరసామికి భక్తుఁడై గుడియు
   నిరుపమ మతినృపధాముఁడెత్తించె నెగి దీర్చె మఠము
   గొరగ లాకొరులిందు విడిసి బృందంబు గొనియుండువారు
   గరిగాక యవ్వారణాసి వ్రచ్చిన పాపంబుగొంద్రు

3. వెలయంగ నియ్యొట్టు జిస్సిమలినురైవిడిసిన ఁబ్రోలఁ
   గల తాన పతులను రాజు పట్టంబు గట్టిన పతియు
   నలియఁ బైవారల వెల్వరించిన నశ్వమేధంబు
   ఫలముపేక్షించిన లింగమటిసిన పాపంబు దమకు

4. జననుత చేబ్రోల నుండి బెజవాడ జాత్రకు వచ్చి
త్రినయన సుతుఁడొండు సోటుమెచ్చక తివిరియిన్నెలవ
యనఘుండు సేకొని యిందు ప్రత్యక్షమైయున్న నిచ్చి
గని మల్లఁడెత్తించెగుడియు మఠమును గార్తికేయునకు

5. రమనతో బెజవాడకెల్ల బెడఁగును రక్షయుంగాను
న్దమ తాత మల్లపరాజు వేఱెలు దాను ఁగట్టించెఁ
గ్రమబుగ దానికి కల శబిడ్డట్లుగా మొగమాడు
వమరంగ శ్రీయుద్ధమల్లు ఁడెత్తించె నమిత తేజుణ్డు.

2 ఇంద్రగణాలు 1 సూర్యగణం మళ్ళీ 2 ఇంద్రగణాలు 1 సూర్యగణం కలిగి 5వ గణం మొదటి అక్షరం యతిగా కలిగి ప్రాసనియమం కలిగి 4 పాదాలతో ఉన్నది మధ్యాక్కర.

"అలయుద్ధమల్లు పనుపునఁ
దెలుఁగున మధ్యాక్కరలను దెలిపెను దొలిదా
నిల శ్రీపతి పండితకవి

లలితగతిన్ విజయనగర రామయలింగా" అనే పద్యం వల్ల యుద్ధమల్లుని బెజవాడ శిలాశాసనాన్ని శ్రీపతి పండితుడు రచించినట్లు తెలుస్తోంది.

'అఱిసిన, ఱిస్సి" పదాల వల్ల ఱ కార ప్రాచుర్యం ప్రస్ఫుటం.

## చాళుక్య భీమమహారాజు ధర్మవర శిలాశాసనం :

వేంగీ రాజ్యాన్ని పాలించిన పూర్వచాళుక్య రాజులలో 'విజయాదిత్యుడు' అనే బిరుదు ధరించిన వారిలో చాళుక్య భీమ మహారాజు మూడోవాడు. ఈతడు పట్టాభిషిక్తుడైన మొదటి సంవత్సరంలో అంటే క్రీ.శ. 897 లో పండ రంగనికి సైన్యాధిపతిగా నియమించాడు. ఆ పండరంగడు కన్నర భూపతిని ఓడించినట్లు, సంకిలుని గర్వభంగం కావించినట్లు, చోడ ప్రభుని రక్షించినట్లు, కిరణపురము, డహల నిరుతము, తఱెనాడు, అచలపురము మొదలయిన ప్రదేశాలలో ప్రవేశించినట్లు ఈ శాసనాన్ని బట్టి తెలుస్తోంది. ఈ శాసనాన్ని చాళుక్య భీమమహారాజు నెల్లూరు జిల్లా ధర్మవరంలో లభించింది. ఈ శాసనంలో పండరంగని శౌర్యం ప్రస్తుతించబడింది. ఈ శాసనంలో సీసపద్యం ఉండటం విశేషం.

1. స్వస్తి సర్వలోకాశ్రయ ...............(క్య) భీమమహారా (జు లవి)
2. జయ రాజ్యస (ం) వత్సరమ్బు ............... (యే) నగునే (ణ్డి) ఉత్త (రా) యన స (ంక్రా)
3. (న్తి) స్తితి ధమ్మాన్పురమ్మున ............ (స్వస్య) నేక గు(ణ) గణాలంక్రిత (స)
4. (మ) స్త మహిమణ్డల ప్రకాశితకీర్తి శ్రీమాత్ పణ్డరంగు
5. న్నేలు నలరామ విభతో గతినెడరి (నతో) యలనడవిసొ (న్నె) లోహస (నం)
6. బెక్కి రాహునునొడిచిన వల్లభుకొల్పున
నెల్ల నెఱుంగ కన్నరా భూ (పతి)

7. వెన్నాజి లోంజూపెసంకిలాణ్డును
(ఢే) ని (బి) (ంక) ముడి (సె) (ద) ణ్డు వై వచ్చిన (బెణ్డై)

8. (న) చో, ఱినింజేకొనికాచె బూ (లోకం)
బెఱుంగ కిరనపురము దహాలని

9. రుతమ్బు దలెనాణ్డున చలపురము
(సొ) చ్చె నచలితుణ్డు వల్లభు

10. ణ్డు గుణకెనల్లుణ్డు (వచ్చి) (నం)
బణ్డరంగ చూరె పండరంగు
(నాబ) ర (గి)

11. న రెయమఱెమె నాన్ని నల్లాతణ్డయ్ను
అయ్యనరాజు తమ్ముణ్డు బెజెయ

12. రాజు ఈపురము నీ శానంబున
గుడి నిల్పె నడియ సేయకున్న సే
............................
ఈ శాసనంలోని సీసపద్యం
"............................ నలరామ విభుతోడ
నెడరిన బోయలనడవి సొచ్చె
లోహాసనం బెక్కిరాహనునొడి చిన
వల్లభు కొల్చిన నెల్లనెఱుఁగ
కన్నరా భూపతి వెన్నాజిలోఁ జూపె
సంకిలాండ నుఱేని బికముడిసె
దండువై వచ్చిన బెండైన చోడుని
చేకొని కాచె భూలోకమెఱుఁగ
కిరణపురము దహల నిరుతంబుదలెనాఁడు
న చలపురము సొచ్చెన చలితుండు
వల్లభుండు గుణకె నల్లుండు పంచిన
పండరంగు చూరె పండరంగు

ఎడరు పదానికి మీరు, అతిక్రమించు అని అర్థం. తమిళంలోని ఇడర్ పదానికి కన్నడంలోని ఎడఱు పదానికి ఇదే అర్థం. కన్నర భూపతి రాష్ట్రకూట చక్రవర్తి ఐన ఇమ్మడి కృష్ణరాజు. సంశిలుడు దాహల పురాధిపతి. మధ్య పరగణాలలోని బుందేల్‌ఖండ్ ప్రాంతాన్ని దహల / దాహల దేశంగా పేర్కొంటారు. కిరణపురం మధ్య పరగణాలలోని బాలేఘాట్ జిల్లాలో ఉంది. నిరుతంబు, తలెనాడులు ఎక్కడివో ఇంకా గుర్తించలేదు.

**విరియాల కామసాని గూడూరు శిలాశాసనం :**

ఈ శాసనంలో పేర్కొబడ్డ బేతరాజు కాకతీయ వంశంలో తొలిరాజు. ఈతని కాలం క్రీ.శ. 1000 సంవత్సరాల ప్రాంతంగా చారిత్రికులు నిర్ణయించారు. బేతరాజు రాజ్యం శత్రురాజులచే ఆక్రమించుకోబడగా విరియాల కామసాని తన కొడుకయిన సూరభూపతి సాయంతో బేతరాజును పునఃప్రతిష్ఠితుణ్ణి చేసింది.

1. అనుపమ దుర్జయాన్వయసుధాబ్దినేకులు రాజనందనుల్
సనినఁబొరంటి వెననఁడను సంభవుఁడయ్యెనతి ప్రసిద్ధుఁడై
వినుత విరోధి మండలిక వెన్నఁడు వెన్నఁడు వోలె వానికిన్
ఘనుఁడగు నెఱ్ఱిభూపతిజగద్విదితుండు దయించెఁగీర్తితో

2. భావిత కీర్తి యాతనికి ఁబాండవమధ్యమ భీముఁడోయనం
గావిరియాల భీమనృపఘు స్మరుఁడై జనియించె వానికిన్
భూవినుతుండు మండలిక భూషణుఁడెఱ్ఱ నరేంద్రుఁడుత్తమ
శ్రీ వినుతుండు బంధుజన సేవ్యుఁడు దావినుతించె నున్నతిన్.

3. అతఁడని బొట్ట బేతవసుధాధిపుఁ జేకొని, వాని వైరిను
ద్ధ్రితముగ ఁజంపియాకొరవి దేశము నందు ప్రతిష్ఠ సేసిత
త్తనయురు పేరు పోడ గలదాయము బిట్టరగద్యనంబున
ప్రతిముఁడు వాని (ఁదా) మొగుడు పల్లియు పంద్రెడునేలు నిప్పుడే

4. అరుదగునట్టి యెఱ్ఱనృపునంగన కామమసాని యొక్కమే
ల్గరుదని భేతభూవిభుని ఁగాగతివల్లభుఁభిన్నవానిఁదాఁ
బరఁగఁగఁజేతఁబట్టి ఘనుబల్లవరాయని యన్వయాబ్జ భా
స్కర విభు చక్రవర్తి గని కాకతినిల్పుట కోటి సేయదే.

5. కారక కాలుఁడై పడసె ఁగాడయనాయకుఁజంపె సూరఁడ
న్వేలుపుఁగొండ రవ్వనృపువేలుపు గొండననిల్చి వానిచే
మేలుగ మూడముప్పయిని మేలుగ నేరెడు బోదెపాడునుం
మేలుగ టేకుమావడులు మేలుగ రెండెయరాజు సంగడై
సూత్ర ధారికొమ్మోజన బరహం ఆడ
శ్రీశ్రీ అడవగట్టు దేవరకు, జేను.

ఈ శాసనంలో రెండు ఉత్పలమాలలు మూడు చంపకమాలలు ఉన్నాయి. ఈ పద్యాలు తెలుగులో ప్రసిద్ధాలు.

**3వ పద్యంలోని ప్రాసచింత్యం**

**వేంకయ్య చోడని దొంగలసానిశాసనం :**

'దొంగల సానికనుమ' అనేది ఒక ప్రాంతనామం. వేంకయ్య చోడడు ఈ శాసనాన్ని వేయించాడు. ఇది క్రీ.శ. 950వ సంత్సరంలో కడపజిల్లాలో దొంగలసాని ప్రాంతంలో లభిస్తోంది. వేంకయ్య చోడుడు రేనాటి చోళులలో ప్రసిద్ధుడు.

శత్రురాజులకు అంకుశమయిన వాడు, కరికాల చోళపాదపద్మ విహితలోచనుడయిన త్రిలోచనాది రాజులచే నిర్మింపచేసిన కరికాలుని వంశరత్నమయిన వేంకయ్య చోళ మహారాజు పట్టాభిషిక్తుడయిన నలభై ఒక్క సంవత్సరంలో చైత్రమాసం అష్టమి ఆదివారం నాడు కుఱువ భట్టారకునకు కరరహితంగా (ఏ పన్నూ లేకుండా) ఆ రాజు (అన్ని పన్నులను మినహాయించి) పడమట కొండ ఉత్తరాన కురువు డొంక, తూర్పు దక్షిణ దిక్కులలో రెండు రేవులు సరిహద్దులుగా కల మధ్యభాగంలోని భూమికి (నేలను) దానంగా ఇచ్చాడు. రాజుకు స్వస్తి.

నిష్కళంకమయిన ఓర్పు కల టెంకణాదిత్య కొమర భీమ బిరుదాంకితుడయిన వేంకయచోళ మహారాజు ధర్మం (దానం) ఆచంద్రార్కతారకంగా వర్ధిల్లుగాక.

వారణాసిలో (శివలింగాన్ని) భగ్నం చేసినప్పుడు శ్రీపర్వతంలో లింగాన్ని నాశనం చేసినప్పుడు కలిగే పాపం కల్గుతుంది.

## మొదటిపక్క

1. స్వస్తి (విజయచోడ) చర (ణ సరోరు)
2. (హ) విహితవి (లోచన త్రి-)
3. లోచన ప్రముకాకిల (ప్రి-)
4. ధివీశ్వర కారిత కావేరీ- (తీ)
5. రకరికాల కులరత్న ప్రదీపా -
6. హితాంకుశ శ్రీ వెంకయాచోఱ
7. మహారాజుల పట్టం(బు) గట్టిన
8. ప్రవర్ద్దన్ మాన విజయ రాజ్యసం
9. వత్సరమ్బుల్ నళ్వాద్యది యొకొ-
10. టి యగు నేణ్టి చిట్టది పెం
11. పునందష్టమియు ఆదిత్య-
12. వరంబు నాణ్డు కుఱువ
13. భటరికి రెణ్డు ఱేవులు
14. పొలగఱుసు గాను
15. పడుమటన్ గొణ్డ (యు) గ-
16. రుసు గాను ఉత్తరంబున నే (ల)
17. కు గరువ డొంక లోపలినే
18. ల యెల్ల సర్వపరిహారువు ఇచ్చె
19. శ్రీ వెంకయాచోఱ మహ
20. రజు తెంకణాదిత్యుణ్డు కొమరు
21. ర భీముణ్డు పుసిఇల్ల ధాత్మి
22. నీ ధమ్మన్ మాచన్ద్రార్కతారకంబున
23. వా (ర్ధిన్లుచునుణ్డు)

## రెండో పక్క

24. ................................
25. ................................
26. వాణ్డు ......................
27. వాణ్డు బరన (పి) .................... టి
28. న వాణ్డు శ్రీ పబ్బన్ తంబు (న) -
29. ంగల లింగంబులనటి (పి)
30. (న) వాణ్డు - (నురుమూర్కు)
31. న్నను గలణ్డు ఇస్త -
32. నమ్బు గలవారు ఈసా-
33. నశివులు

34 నుండి 37 వరకు imfrecatory verses in Sanskrit

ఈ శాసనంలో అక్షర దోషాలు ఉన్నాయి.

ప్రముకాకిల (తప్పు)  ప్రముఖాఖిల (ఒప్పు)
ప్రవద్దన్మాన (తప్పు)  ప్రవర్ధన్మాన (ఒప్పు)

ఈ శాసనంలో చోఅ పదంలో అ కారం ఉంది. ఈ విధంగానే అటిసి. 'తాట్మి'లో విలోమ లేఖనం. శాసనాలలో లేఖన దోషాలు చాలా కన్పిస్తున్నాయి.

శిలాశాసనాలపైన తామ్రపత్రాలపైన శాసన విషయాలను లేఖకులు భాషా జ్ఞానవంతులు కాని కారణంగా అనేక అక్షర దోషాలకు పాల్పడ్డారు. "లేఖకో గండాచార్యః" అని నందంపూడి శాసనంలో నన్నయభట్టారకులు వీరిని లేఖకులని పేర్కొన్నారు.

క్రీ.శ. 575 నాటి ఎట్టుగుడిపాడు శిలాశాసనంలో 'సాక్షి' కి మారుగా 'శక్షి' అని లిఖించబడింది.

| **సరయిన పదం** | **లేఖన దోషం** | **శాసనం** |
|---|---|---|
| అగ్ని | అగ్భ | ద.హిం.శా. 0నపు. 697 శాసనం |
| నాంణ్డు | నాణ్డు / నాండు | ఆంధ్రభాషాచరిత్ర పుట |
| బైయ్దుమ్బు | బైదుమ్బు | " |
| ఎడ్లుకు | ఎడ్లకు | " |
| ఒకాడు బోళ | ఒకబోళ | " |
| వేవుగ్గన్ విలాకు | వేయి కవిలలకు | " |

## క్రీ.శ. 1000 సంవత్సరాలకు పూర్వ తెలుగు వర్ణాలు

### అచ్చులు

| తాలవ్యాచ్చులు | | తాలవ్యేతరాచ్చులు | |
|---|---|---|---|
| ఇ | ఈ | ఉ | ఊ |
| ఎ | ఏ | ఒ | ఓ |
| | | అ | ఆ |

ఈ అచ్చుల సంఖ్య మొత్తం 10. దీర్ఘం వర్ణ భేదక సామర్థ్యం కలది.

### హల్లులు

| | కంఠ్యాలు | తాలవ్యాలు | మూర్ధన్యాలు | దంత్యాలు | దంతమూలీయాలు | ఓష్ఠ్యాలు |
|---|---|---|---|---|---|---|
| శ్వాసం | క | చ | ట | త | | ప |
| నాదం | గ | జ | డ | ద | | బ |
| అనునాసిక్యం | | | ణ | న | | |
| అంతస్థ | య | | | | | మ |
| కంపితం | | | | | | వ |
| తాడితం | | | | | ఱ | |
| పార్శ్వికం | | | ళ | | ల | |
| స్పర్శోష్మం | | ఴ | స | | | |

జ్ఞ, ఞలు ప్రత్యేక వర్ణాలు కావు. 21 హల్లులను ప్రాచీనాంధ్రంలో ఉన్నట్లుగా భాషాశాస్త్రవేత్తలు గుర్తించారు.

సంస్కృతంలోని 'ఋ' తెలుగులోని శాసనాలలో 'రి' వర్ణంగా మారింది.

ప్రిథివీశ్వర < సం. పృథివీశ్వర

ప్రిథ్వి < సం. పృథ్వీ

సంస్కృతంలోని ఖ, చ, ఠ, థ, ఫ, ఘ, ధ, భ, శ, ష వర్ణాలు తెలుగు శాసనాలలో (క్రీ.శ. 1000 వరకు) ప్రవేశించాయి. ఝ, ఢ వర్ణాలు ఈవిధంగా ప్రవేశించలేదు.

ఈ కాలం శాసనాలలో ద్రావిడ భాషలలోని విశిష్ట వర్ణంగా భావింపబడే 'ఴ' కారం తెలుగు పదాలయిన చోఴ, అఴిసిన మొదలయిన పదాలలో కన్పిస్తోంది.

తాలవ్యీకరణం చెందని ('క' కారం తర్వాత ఇ, ఈ, ఎ, ఏ లు ఉన్నప్పుడు చకారంగా మారవలసి ఉండగా ఆవిధంగా కాకుండా ఉన్న శబ్ద రూపాలు) పదాలు ఈ కాల ప్రాచీనాంధ్ర శాసనాలలో కన్పిస్తున్నాయి. ఉదా : "శ్రీ కుఱువది ఆచార్ల కేసిన పణియు" 6వ శతాబ్దపు భైరవకొండ శాసనం. "శ్రీ వేళుగుణ్డ ఆచాఌ్లు పణికేసిరి" (పైఱ).

'నాలుగు' శబ్దంతోపాటు 'నాల్కు' రూపం కూడా శాసనాల్లో కన్పిస్తోంది.

ఈ కాలం శాసన పదాలలోని 'ణ' కారం తర్వాతి కాలంలో 'న' కారంగా మారింది.

'ఏణుంబొది' (విప్పర్ల శాసనం 3 పం.)

"కొణిరి" (ఆంధ్రపత్రిక, 1941 పుట. 15)

"పణి" (ఆంధ్రపత్రిక, 1941 పుట. 15)

ఈ కాలం శాసన పదాలలోని 'ళ' కారం తర్వాతి 'ల' కారంగా కన్పిస్తుంది.

'ఏళు' (కలమళ్ల శాసనం 5 పం)

'-ళ్' (మాలెపాడు శాసనం 6 పం)

'సంవత్సరంబుళ్' (దొంగలసాని శాసనం 9 పం)

'ఱ' కారం రెండచ్చుల మధ్య తెలుగులో డకారంగా మారుతుంది. 'చోర' శబ్దంతోపాటు 'చోడ' శబ్దం కూడా ఈ కాలపు శాసనాలలో కన్పిస్తోంది. "చోడ మహారాజు" అని ముద్దనూరు (8 పంక్తి) శాసనంలో కన్పిస్తోంది. 'ఱ' కారం పదానికి వర్ణవ్యత్యయం కారణంగా వచ్చినప్పుడు రేఫగా వైకల్పికంగా మారింది. ఈ మార్పు క్రీ.శ. 1000 సంవత్సరాల తర్వాత నియతమయింది.

ఉదా : క్ఱొచ్చె (ద. హిం.శా.సంపు. 10. శా. సం. 601 క్రీ.శ. 700)

క్రొచ్చె (ద. క.శా. సంపు. 10. శా.నం. 597 క్రీ.శ. 925-50)

పదాది య,వలు ఈ శాసన కాలంలో ఉన్నాయి.

యలమ్మ(ద. హిం.. సం.పు. 10. శా. సం. 29 క్రీ.శ. 971)

వకట్టి (ద.హిం.శా. సంపు. 10. శా.సం. 614 క్రీ.శ. 8వ శతాబ్దం)

అనుస్వారాన్ని పూర్ణబిందురూపంలో వాడుట లేదా అనుస్వారానికి మారుగా పర సవర్ణాదేశం చేయటం రెండు పద్ధతులూ తెలుగులో ఉన్నాయి.

'పులొంబున' (ద.హిం. శా. సం. పు. 6. శా. సం. 584 క్రీ.శ. 641)

పఱ్ఱైణ్డు (అద్దంకి శాసనం క్రీ.శ. 848)

## సంధులు : అత్వ ఇత్వ ఉత్వ సంధులు

అన్నీ ప్రాఙ్నన్నయ యుగ శాసనాలలో వైకల్పికాలే. యడాగమం వైకల్పికంగా రావటం కూడా ఉంది.
అత్వ సంధి జరగకపోవటానికి :

'పన్నస ఇరవది' (ఎఱ్ఱగుడిపాడు శిలాశాసనం క్రీ.శ. 575)

అత్యసంధి జరగటానికి 'ఇడ్డట్లు' ఇడ్డ + అట్లు (యుద్ధమల్లుని బెజవాడ శాసనం)

## యడాగమానికి ఉదాహరణ :

'కలయన్త' (ద.హిం.శా.సం.పు.అశా.సం. 585 క్రీ.శ. 633 - 63)

## ఇత్వసంధి :

ఇత్వసంధి రానప్పుడు యడాగమం వస్తుంది. ఎఱ్ఱగుడిపాడు శాసనంలో 'ఇరవిది మాదునాల్కు' అని ప్రయోగం.

సంధి రాకపోవటానికి మాలెపాడు శిలాశాసనంలో 'ఇరువదియదిఏను' అని ప్రయోగం.

"శ్రీకెల్లన్' అన్నచోట ఇత్వసంధి (కొరవిశాసనం)

**ఉత్వసంధి :**

ప్రాఙ్నన్నయ యుగశాసనాలలో ఉత్వసంధి నిత్యంగా జరగదు. సంధి జరగకపోవటానికి "కేనాణ్ణు ఏళన్" (కలమళ్ళ శాసనం క్రీ.శ. 575)

సంధి జరగటానికి "ఊడ్లందు" ఊడ్లు + అందు

ద.హి.శా.సంపు.6 శా.సం. 585 క్రీ.శ. 633 - 68)

**యడాగమానికి ఉదాహరణ :**

"వారు యిఱ్ఱకాను" (విప్పర్ల శాసనం క్రీ.శ. 641)

**ప్రాఙ్నన్నయ యుగంలోని వచనవిభక్త్యాదుల పరిశీలన :**

**మహద్వాచక ప్రథమైకవచనంలోని వచనం చేరకపోవటం :**

"గణ్డ" ద.హిం.శా.సం.పు. 10 శా.సం. 635 క్రీ.శ. 825 "పాతకు" ఉరుటూరు శిలాశాసనం క్రీ.శ. 600 - 625. మహద్వాచక ప్రథమైకవచనం రూపం చేరటానికి ఉదాహరణలు :

"ఓజన్డు'"

"పఞ్చమహాపాతకున్డు" - వెలుదుర్తి శిలాశాసనం క్రీ.శ. 725

**ఏ ప్రత్యయమూ చేరని అమహత్తులు :**

"పన్నస, నేల" (ఎఱ్ఱగుడిపాడు శిలాశాసనం క్రీ.శ. 575 - 600)

**ప్రత్యయ సహిత శబ్దరూపాలు :**

"దక్షిణ-ము" (ద. హిం.శా.సంపు. 6 శా.సం. 250 క్రీ.శ. 742-798)

"వక్ర-ంబు" (ద.హిం.శా.సంపు.10 శా.సం. 617 క్రీ.శ. 739)

దేశ-ము (నె.శా.సంపు. 10 శా.సం. 1151 క్రీ.శ. 650)

"ముత్తురాజు-లు' (ఎఱ్ఱగుడిపాడు శిలాశాసన - క్రీ.శ. 575 - 600)

ద్వితీయావిభక్తికి "రడ్డిని" (ద.హిం.శా.సంపు. శా.సం. 250 క్రీ.శ. 742 -98)

**తృతీయా విభక్తి :**

"బోళ చేత" (కలమళ్ళ శిలాశాసనం క్రీ.శ. 600-25)

"అలరామవిభుతోటి" (ధర్మవరం శిలాశాసనం క్రీ.శ. 897)

"పరోపకారంబు పొణ్టె" (కొరవి శాసనం క్రీ.శ. 892-922) అనేది చతుర్థి విభక్తికి ఉదాకృతి.

**సప్తమి విభక్తికి ఉదాహరణ :**

"ఊడ్లందు" (ద.హింశా. సంపు. 6. శా.సం. 585 క్రీ.శ. 638-68)

**ఈ కాలంలోని సంఖ్యావాచకాలు :**

ఏకార్థద్యోతక శబ్దాలు : ఒకొటి, దకొట్టి, ఒణ్ణు

ద్విత్వద్యోతక పదం : రెణ్డు

ఇను, ఇరు అనేవి విశేషణ రూపాలు

ఇన్మడి (ఏడువాడల పాలెం శాసనం)

మూను, మూన్టు అనే వాటికి మూడు అని అర్థం.

నాలుగు, నాల్కులు చతురర్థకాలు

'ఏను' శబ్దమే పంచ సంఖ్యార్థంలో ప్రయుక్తం.

'ఆఱువుట్లు' (మాచెర్ల శిలాశాసనం. క్రీ.శ. 641)

ఆఱుషష్ఠ్యర్థకం

"ఏఱు, ఏడు" పదాలు సప్తార్థకాలు.

"ఎణ్మ, ఎణుంబొది, ఎనుబొది, ఎన్బొది, ఎన్మిది" శబ్దరూపాలు అష్టార్థంలో ప్రయోగించబడ్డాయి.

"తొన్బు, తొన్భు" శబ్దాలు నవార్థంలో ప్రయుక్తాలు. పది పదానికి వ్యస్త ప్రయోగం లేదు. "ఇరవది" మొదలయిన పదాలలో సమస్త పదంగా ఎఱ్ఱగుడిపాడు శిలాశాసనం నుంచి ప్రయోగాలున్నాయి. వంద అనే అర్థంలో "నూరు, నూఱు" శబ్దాలు ప్రయుక్తాలు.

"నూఱు" (రామేశ్వరం శిలాశాసనం క్రీ.శ. 625-50)

"నూర" (ద.హిం.శా.సంపు. 10. శా.సం. 37 క్రీ.శ. 8వ శతాబ్ది)

"వేయు కవిలలా .............. వచ్చినవారు" అని విప్పర్ల శిలాశాసనం (క్రీ.శ. 633-63) లో సహస్రార్థంలో 'వేయు' ప్రయుక్తం.

ప్రాఙ్నన్నయ యుగకాలంలో భూతకాలిక క్రియలు మాత్రమే కన్పిస్తున్నాయి.

"కొణిరి" (కలమళ్ళ శిలాశాసనం క్రీ.శ. 600-25)

"క్టొచ్చె" (నల్లచెరువుపల్లి శిలాశాసనం క్రీ.శ. 700-725)

"వినియణ వ్రాసె" (రామేశ్వర శిలాశాసనం క్రీ.శ. 625-50) క్త్వార్థక ప్రయోగం ఉంది.

"పొడుచ్చి" (ద.హిం.శా.సంపు. 10 శా.సం.614 క్రీ.శ. 7 / 8 శతాబ్ది)

"అయి" (తిరుమెళ్ళ శిలాశాసనం క్రీ.శ. 680)

**వాక్యం :**

ప్రాఙ్నన్నయ యుగ శాసనాలలో కర్మణి ప్రయోగాలు సంస్కృత భాషా ప్రభావం వల్ల తెలుగులో కర్మణి ప్రయోగాలు ఏర్పడ్డాయి. వీటి సంఖ్య కేవలం మూడు మాత్రమే.

1. "పట్టం కట్టబడినవారు" (ద.హిం.శా. సంపు. 10 శా.సం 629 క్రీ.శ. 825)
2. "అతని చేయంబడిన ధమ్మున్పుం" (లె. శా.సంపు. 1 క్రీ.శ. 892-922)
3. "వైదుంబుళ చేతుం బట్టంకట్టబడియేలి" (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 640 క్రీ.శ. 9 / 10 శతాబ్దులు)

ప్రాఙ్నన్నయ యుగాంధ్ర శాసనాలు ప్రాచీనాంధ్ర రాజుల దాతృత్వాన్ని, మత సామరస్యాన్ని, గుణగణాలను, భక్తి ప్రపత్తులను విశదపరుస్తున్నాయి. పండ రంగని అద్దంకి శిలాశాసనం, యుద్ధమల్లుని బెజవాడ శిలాశాసనం, కామసాని గూడూరు శిలాశాసనం నన్నయ భట్టాది ఆంధ్రకవీంద్రుల కవితకు మార్గదర్శులయ్యాయి.

**ప్రశ్నలు :**

1. క్రీ.శ. 575 సంవత్సరానికి పూర్వం ఉన్న సంస్కృత ప్రాకృత శిలాశాసనాలలోని సాహిత్యంలోని తెలుగు పదాలను గూర్చి వ్రాయండి.
2. క్రీ.శ. 575 - 1000 సంవత్సరాల కాలం నాటి శాసనాలలోని తెలుగు భాషా స్వరూపాన్ని వివరించండి.
3. క్రీ.శ. 1000 సంవత్సరాలకు పూర్వమున్న శాసనాలలోని ఛందో విశేషాలను వివరించండి.
4. యుద్ధమల్లుని బెజవాడ శాసన విశేషాలను పేర్కొనండి.
5. పండ రంగని అద్దంకి శిలాశాసన విశేషాలను వివరించండి.

**ఆధార గ్రంథాలు :**

ఆరుద్ర, 1989 మార్చి 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' మొదటి సంపుటం, ప్రజాశక్తి బుక్, కారల్‌మార్క్స్ రోడ్ - విజయవాడ-2.

వేంకటరావు, నిడదవోలు 1953 తెనుఁగు కవుల చరిత్ర, మదరాసు విశ్వవిద్యాలయము, మద్రాసు, తమిళనాడు.

Mahendera Sastri, Kerala 1969. Historical Grammer of Telugu, (2000 BC. - 1000 A.D.) Registrar, S.V. University, Tirupathi.

కృష్ణమూర్తి, భద్రిరాజు (సంపాదకులు) 1974. తెలుగుభాషా చరిత్ర, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, కళాభవన్, హైదరాబాదు.

రాధాకృష్ణ, బూదరాజు. 1971 ప్రాచీనాంధ్ర శాసనాలు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, కళాభవన్, హైదరాబాద్.

సోమయాజి, జి.జె. 1947 ఆంధ్రభాషా వికాసము, ఆంధ్రవిద్యాకళాపరిషత్తు, విశాఖపట్నం.

-

పాఠం -13

# నన్నయ యుగాంధ్రభాష

**వ్యాస సంగ్రహం :**

తూర్పు చాళుక్యరాజుల పరిపాలన ఆంధ్ర భాషావ్యాప్తి - నన్నయ యుగ శాసనాలలోని లేఖన దోషాలు - ప్రాఙ్నన్నయ యుగవర్ణాలు నన్నయయుగంలో మారిన విధం - నన్నయయుగ భాషా విశేషాలు - నన్నయ యుగంలోని సంధి విధానం - నన్నయ యుగంలోని లింగ,వచన, విభక్తి వాక్య విశేషాలు.

## నన్నయ యుగాంధ్ర భాష - క్రీ.శ. 11వ శతాబ్ది శాసన సారస్వత భాష-శాసన సారస్వత భాషాభేదాలు :

తూర్పు చాళుక్య రాజులు క్రీ.శ.624 నుంచి 1102 వరకు వేంగిరాజ్యాన్ని పరిపాలించారు. వేంగిదేశానికి ఉత్తరంగా ఓఢ్రదేశం (నేటి ఒరిస్సా రాష్ట్రం), పశ్చిమోత్తరంగా కర్ణాటక రాష్ట్రం ఉన్నాయి. గాంగులు, రాష్ట్ర కూటులు, కాళింగులు వేంగిని చుట్టు ముట్టి ఉన్నారు. రెండో చాళుక్య భీముని కాలం (క్రీ.శ. 934 నుంచి 945 వరకు) నుంచి చోళులతో తూర్పు చాళుక్యులకు సంబంధ బాంధవ్యాలుండేవి. ఈ సంబంధబాంధవ్యాలు శక్తివర్మ తమ్ముడయిన విమలాదిత్యుని కాలానికి (క్రీ.శ. 1011-1018) మరింత సన్నిహితమయ్యాయి. రాజరాజకేసరివర్మ కూతురు కుందమాంబ విమలాదిత్యుని వివాహమాడింది. విమలాదిత్యతనూజుడయిన రాజరాజనరేంద్రుడు తనమామ అయిన గంగై కొండ రాజేంద్ర చోళుని కుమార్తె అయిన అమ్మంగదేవిని వివాహమాడాడు. తూర్పు చాళుక్యులు చోళులు ఈ విధమయిన సంబంధ బాంధవ్యాల కారణంగా పరస్పరం సహాయం చేసుకునేవారు.

సంస్కృత వ్యాస మహాభారతాన్ని ఆంధ్రీకరించవలసిందిగా నన్నయ భట్టారకులను కోరిన వేంగీదేశాధిపతి అయిన రాజరాజనరేంద్రుడు క్రీ.శ. 1022 ఆగస్టు 16న రాజమహేంద్రవరం (రాజమండ్రి)లో పట్టాభిషిక్తుడయ్యాడు. ఈప్రభువు క్రీ.శ. 1062 వరకు రాజ్యపాలనకావించాడు. ఈ కాలంలోనే నన్నయ భట్టారకులు తెలుగులో భారతంలోని ఆదిసభా పర్వాలను ఆరణ్య పర్వంలో నాలుగో ఆశ్వాసంలో 142 వ పద్యమయిన శారద రాత్రులుజ్జ్వలలసత్తర తారకహారపంక్తులం జారుతరంబయ్యె......." వరకు రచించారు. క్రీ.శ. 11వ శతాబ్దపు ఆంధ్ర వాఙ్మయ (సారస్వత) భాషకు ప్రధానాధారం ఈ నన్నయ భారత భాగమే. నందంపూడి తామ్ర శాసనకర్త నన్నయ భట్టు (నన్నయ భట్టు) కాగా శాసనం చెక్కినవాడు గండాచార్యుడు. "కావ్యానాంకర్తా నన్నయ భట్టో లేఖకో గణ్ణాచార్యః ద్వాత్రింశత్తమే విజయరాజ్యవర్షే వర్త (మా)నే కృతమిదం శాసనమ్" అని మనకు తెలుస్తోంది. శాసన కాలం 23-11-1053 అని కూడా విజ్ఞులు తెలిపారు. సంస్కృత కర్ణాట ప్రాకృత పైశాచికాంధ్ర భాషా ప్రవీణుడు,కవిరాజశేఖరుడు, **కవితత్రాంకుశాష్టా విధాన చక్రవర్తి** సరస్వతీ కర్ణావతంస నన్నిదనారాయణ భట్టుకు రాజరాజ చక్రవర్తి నందంపూడి గ్రామాన్ని దానం చేసిన విషయం ఈ తామ్ర శాసనంలో ఉంది. ఈ తామ్ర శాసనం నేటికీ తూర్పు గోదావరి జిల్లా నందంపూడి గ్రామంలో ఉంది. ఈ శాసనం చాలా భాగం సంస్కృతంలో ఉండగా చివర కొంతభాగం మాత్రం తెలుగులో ఉంది. ఈ శాసనం మరికొన్ని ఇతర శాసనాలను బట్టి 11వ శతాబ్దపు భాషా స్వరూపం తెలుస్తోంది. శాసనభాషను నన్నయ మహాభారత భాషను పోల్చిచూస్తే మనకు ఈ రెండింటి (శాసన సారన్యత) భాషల భేద సాదృశ్యాలు తెలుస్తాయి. నన్నయ యుగ శాసనాలలోను లేఖన దోషాలు కన్పిస్తాయి కాని లేఖన పరిణతి వల్ల ప్రాఙ్నన్నయ యుగశాసనాలలోని లేఖనదోషాలతో పోలిస్తే ఈ నన్నయ యుగ కాలం (క్రీ.శ.11వ శతాబ్ది)లోని వాటి సంఖ్య తక్కువ.

"ధేనుహ వ్యాఘ్ర లాంచన చన్ద్ర కుళతిళక కమలభాస్కర మహ మహేశ్వర"(ద.కల.శా.సంప్ర.10.శా.గం.443 క్రీ.శ.1023) అని జగదల్పూరు శిలా శాసనంలో ఉంది. ఇది "ధేను వ్యాఘ్రలాంఛనన చన్ద్ర కుల తిలక కమలభాస్కర మహా మహేశ్వర" అని ఉండాలి "దీనికి (యా) చన్ద్రక్కముజ్ము వేయి సరియంచు వారు" (ద.కిం.శా.సంప్ర.4 శా.సం.1014 క్రీ.శ. 1038) అని ద్రాక్షారామశాసనంలో ఉంది. "దీనికి (ఆ) చన్ద్రార్కుజ్ముసరియించువారు" అని ఉండాలి.

"ప్రతిష్ట చేసిన...." (ద.కిం.శా.సంపి.10 శా.సం. 644 క్రీ.శ. 1060) అని ఉంది. "...ప్రతిష్ఠ చేసిన" అని ఉండాలి. "శన్తానక్రమమునంగాచి" (ద.కిం.శా.సంప్ర.6. శా.సం.109. క్రీ.శ. 1076) అని చేబ్రోలు శాసనంలో ఉంది. "సన్తాన క్రమము నంగాచి" అని ఇక్కడ ఉండాలి. "షూరేశ్వరపండితులు" (ద.హిం.శ.సంప్ర.10 క్రీ.శ. 1008) అని వేలూరు శాసనంలో ఉంది. ఇక్కడ "షూరేశ్వర పండితులు" అని ఉండాలి.

ప్రాఙ్నన్నయ యుగ శాసనాలలో ఉన్న వలపలగిలక లేఖన సంప్రదాయం ఈ యుగంలో కూడా కొనసాగింది. "పటుపటహ గాంభీర్య్యాయశో" ద.హిం.శా.సంప్ర.శా.సం.643 (క్రీ.శ. 1023) అని జగదల్పూరు శిలా శాసనంలో వలపలగిలక కన్పిస్తోంది.

"కార్త్తికమాసబు' (ద.కిం.శ.సంప్ర.10. శా.సం. 644 క్రీ.శ. 1060) అని బారసూళ శాసనంలో కూడా వలపల కిలక ఉంది "అఖణ్డ వర్త్తిడ్ లో హదివియ దీనికి నా చంద్రర్క్కమునేయి..." (ద.హిం.శా.సంప్ర.4.శా.సం.1012 క్రీ.శ. 1068) అని ద్రాక్షరామ శాసనంలో వలపలకిలక పలుమార్లు ప్రయోగించబడింది.

**వర్ణాలు :**

ప్రాఙ్నన్నయయుగంలో ఉన్న అచ్చులు, హల్లులు నన్నయ యుగంలో అన్నీ ఉన్నా ప్రాఙ్నన్నయ యుగంలోని ఱకార ప్రాచుర్యం తగ్గింది. రెండు అచ్చుల మధ్య ఉన్నప్పుడు ఈ -టి-కారం -డ-కారం గా మారింది. -టి- కార ప్రయోగం అరుదు.

"కాస్యుతోటి నేల " (ద.కిం.శా.సంపు.4. శాసనం. 10165 క్రీ.శ.1087)

-డ- కార ప్రయోగం (-తి-) నన్నయ కాలంలో అధికంగా ఉంది.

"ఓఱయూరి పురవరేశ్వర చోడవంశోద్భవ..." (ద.హిం.శా.సంపు.10. శాసనం 7 క్రీ.శ. 1058)

శ్రీచోడ గగ్గదేవరిచ్చి.... " (ద.హిం. శ.సంపు 54 శాసనం 1118 క్రీ.శ. 1033)

పదమధ్యలో ఉన్న -టి-కారం అజ్లోపంవల్ల పదాదికి వచ్చి తర్వాతి కాలంలో సంయుక్త రేఫ వర్ణంగా మారింది.
ఉదా:- " వ్రచ్చినవారు " (ద.హిం.శా.సంపు.10 శాసనం. 7. క్రీ.శ. 1058)

మూ.ద్రా. 'వత్, నాశమగు. ఈవిధంగా ప్రాచీన 'టి' కారం తదనంతర కాలం (నన్నయకాలం) నాటికి రెండచ్చుల మధ్య-డ-కారం గాను పదాదికి సంయుక్తస్థితిలో రేఫగాను మారింది. దీనిని వర్ణభంగం అంటారు.

నన్నయ యుగశాసనాలలో (ఇష్టానుసారంగా) పూర్ణబిందు వర్ణ పంచమాక్షరాలను ప్రయోగించారు. ఈ పద్ధతి వైకల్పికం.
".........శ్రీమన్మహామణ్డలేశ్వర చంద్రాదిత్య మహారాజులు....." (ద.హిం.శా.సంపు.5 శా.సం. 1123 క్రీ.వ.1058)

"మహాదేవరకు ఇచ్చిన అఖణ్డవర్త్తి లోహదివియ 1దీనికి నా చంద్రార్క్కము "
(ద.హిం.శా.సంపు.4 శా.సం. 1013 క్రీ.శ. 1064)

నన్నయయుగ శాసనాలలో అర్థాను స్వార ప్రయోగం లేదు. 11వ శతాబ్ది శాసనాలలో అర్థాను స్వారానికి మారుగా పూర్ణానుస్వారమే లిఖించబడేది. శాసనం ఛందోబద్ధంగా ఉంటే ఛందోనుసారంగా చదవబడేది.

ఉదా : "కూంతుసరియె పోల్పంగాంతలంచు"

**(భీమనప్రెగడ స్వామద్దేవి శాసనం క్రీ.శ.1065)**

ఇది ఆటవెలది పాదం కూంతు... కాంత" పదాలు ప్రాసస్థానంలో ఉన్న కారణంగా (ప్రాసయతికాబట్టి) ఈరెండు పదాలూ పూర్ణబిందు ఘటితాలు. "పోల్పం..." అన్న చోట గణానుసారంగా పోల్పం...' అనే దృష్టితో తీసికొని అక్కడ ఉన్న పూర్ణానుస్వారాన్ని అర్థానుస్వారంగా చదవాలి.

ద్విత్వ శకటరేఫం తమిళంలో ట్ర గా ఉచ్చరించబడుతుంది. నన్నయ కాలంలో కూడా ఇటువంటి 'ట్ర' ఉచ్చారణ ఉన్నట్లు రణస్థిపూడి శాసనంలో "ముయ్యలికుట్టు" అని రెండు సార్లు ప్రయోగించబడింది. రాజరాజు నందంపూడి శాసనంలో కూడా "ముయ్యలికుట్రసీమా" అనీ కుట్రు ప్రయోగించబడింది. దీని శబ్ద పరిణామం.

**కుఱు - కుట్టు- కుట్రు- కుట్టు- గుట్ట**

"మూడు +ఎల్ల+గుట్ట " అని శబ్ద రత్నాకరం బ్రౌణ్యం 'ముయ్యెలగుట్ట' నను విభజించటాన్ని ఈ సందర్భంగా మనం గమనించవచ్చు. 'ఏఱు' మొదలయిన శకటరేఫాంత పదాది ద్వితీయాది విభక్త్యంగాలు 'ట' వర్ణాంతాలు కావటం "కుఱుచిఱు" శబ్దాలకు అచ్చు పరమయినప్పుడు ద్విరుక్తటకారం రావటం ఈవిషయాన్నే దృఢ పరుస్తున్నాయి. నన్నయ భారతంలో ద్విరుక్తటకారం నిత్యంకాగా ఆనాటి శాసనాలలో ఈవిధి వైకల్పికం.

నన్నయ భారతంలో 'క్ష' కారానికి యతివేయవలసివచ్చినప్పుడు క కారంతోనేయతి వేశారు కాని 'ష' కారాన్ని గ్రహించి ఛకారాదులతో యతి వేయలేదు. సంస్కృతంలోని 'క్ష' కారం కొన్ని ప్రాకృతాలలో ఖకారంగాను మరికొన్ని ప్రాకృతాలలో ఛకారంగానుమారింది. నన్నయ ఖ కారోచ్చారణను గ్రహించినట్లు మనం గ్రహించవచ్చు. నన్నయ భారతంలో ఈ నియమానికి అపవాదంలేదు. అపవాదాలుగా పేర్కొబడ్డ రెండు భారతోదాహృతులకు పాఠాంతరాలున్నాయి.

"క్షమయ తాల్చియుండ జనదెల్లప్రొద్దు" దీని పాఠాంతరం (భార.ఆరణ్య..3 -136)

"క్షమయ తాల్చియుడ గ్రాదెల్ల ప్రొద్దు"
"క్షత్త్రచరిత్రుడై పరగు సత్త్వమునన్" దీనికి పాఠాంతరం
"క్షత్రచరిత్రుడై పరగు గర్భమున్.... ".

నన్నయ 'జ్ఞ' కారానికి 'క' కారం తోయతివేయలేదు. కాబట్టి 11వ శతాబ్దిలో జ్ఞ కారానికి కంఠోచ్చారణ లేదని మనం ఊహించవచ్చు.

11వ శతాబ్ధంలో న,ల లు నలలు గానే ఉచ్చరించబడినట్లు ణ,ళలు గాలేనట్లు నన్నయ భారత భాగాన్ని బట్టి మనకు అవగతమవుతోంది.

**సంధులు :**

ఉత్వసంధి నిత్యమని వ్యాకరణ శాస్త్రజ్ఞులు "ఉత్తునకచ్చు పరంబగునపుడు సంధియగు" నని చిన్నయసూరి ప్రభృతులు పేర్కొన్నప్పటికి 11వ శతాబ్ది శాసనాలలో ఉత్వసంధి జరిగిన చోట్లు అనేకం కన్పిస్తున్నాయి.

"సాసనము ఇవ్విధంబున" (ద.హిం.శా.సంపు.10 శా.సం. 645 క్రీ.శ.1050)

"బోయిని కొడుకు ఎఱియ మబోయణ్డు" (ద.హిం.శా.సంపు.10.శా.సం.15 క్రీ.శ. 1092)

ఈ కాలపు శాసనాలలో ఉత్వ సంధి జరిగిన రూపాలున్నాయి.

"స్థాపితంబైన" (స్థాపితంబు +ఐన) (ద.హిం.శా.సంపు. 10శా.సం 645 క్రీ.శ. 1050)

"చన్ద్రాదిత్యేతరంబైన" (చన్ద్రాదిత్యేతరంబు+ఐన)

ఉత్వసంధి జరగకపోగాయడాగమంతో ఉన్న శాసన ప్రయెగాలు

"గోటియలు యేబంది " (గోటియలు+ఏబది) (ద.హిం.శా.సంపు. 10 శా.సం.7 క్రీ.శ. 1058 )

"సంవత్సరములు యగు" (సంవత్సరములు + అగు) (ద.హిం.శా.సంపు.5 శా.సం. 1123 క్రీ.శ.1053)

11వ శతాబ్దపు శాసనాలలో అత్వ సంధి జరగనప్పుడు యడాగమం కొన్ని చోట్ల వచ్చింది.

"యోగముల యందెవ్వడేని" (యోగములు+అందు) (ద.హిం.శా.సంపు.10.శా.సం.9 క్రీ.శ. 1061 )

అత్వసంధి జరగకుండా ప్రకృతి భావంతో ఉన్న రూపాలు ఈ 11వ శతాబ్దిలో అనేకం ఉన్నాయి. "మహాదే వరకుం బెట్టిన అఖర్పై" (దేవరకుబెట్టిన+అఖర్) (ద్రాక్షారామశాసనం క్రీ.శ. 1063)

**అత్వసంధి జరిగి నందుకు ఈకాలపు శానాలలో కొన్ని ఉదాహరణలు :**

"వెల్లెడ్ల" (వెల్ల+ఎడ్ల) (ద.కిం.శా.సంపు.6 శా.సం.109 క్రీ.శ. 1076)

"దేవరిచ్చి" (దేవర+ఇచ్చి) (ద.హిం.శా.సంపు.6 శా.సం. 109 క్రీ.శ. 1076)

"దేవరిచ్చి" (దేవర+ఇచ్చి) (ద.హిం.శా.సంపు.4 శా.సం. 1015 క్రీ.శ. 1084)

ఇత్వ సంధి జరగనప్పుడు యడాగమం జరగటం ఈశాసనాలలో కన్పిస్తోంది.

"శ్రాహియుత్తరయన" (శ్రాహి+ఉత్తరాయణ) (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1115 క్రీ.శ. 1084)

ఇత్య సంధి జరగని సందర్భాల్లో ప్రకృతి భావం ఉంటుంది.

"డాకరేమి అయ్య" (ద.హిం.శా.సంపు.4 శా.సం.1016 క్రీ.శ. (1087)

ఈ యుగ శాసనాలలో క్వార్థేకారానికి సంధి ఎక్కడా జరగకపోవటం గమనార్హం.

"జల్పి ఈఖంభస్తితి" (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 645 క్రీ.శ. 1060)

ద్రుతం తర్వాత అచ్చు వచ్చినప్పుడు ప్రకృతి భావంతో ఉండటం విశేషం.

"మణిగాను ఆచంద్రార్క్కము" (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1123 క్రీ.శ. 1058)

ద్రుతంతో తర్వాత పరంగా వచ్చే అచ్చు కలిసిపోవటం నన్నయ యుగ శాసనాలలో ఉంది.

"దీపము నురవిచ్చె" (దీపము+ఉరవిచ్చె) (ద.హిం.శా.సంపు 5 శా.సం. 1007 క్రీ.శ. 1065)

ద్రుతం తర్వాత అచ్చు పరమయినప్పుడు యడాగమం కూడా రావటం ఈకాలం శాసనాల్లో కన్పిస్తోంది.

"దక్షిణ మ్బున యాఋవేల" (దక్షిణమ్బున ) (ద.హిం.శా.సంపు.10. శా.సం. 8 క్రీ.శ. 1061)

నన్నయ కాలంలోని శాసనాలలో గసడదవా దేశం వైకల్పికంగా జరిగేది. గసడదవాదేశం జరగటానికి ఉదాహరణః "కొడుకు దిక్కయ" (కొడుకు+తిక్కయ) (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 109 క్రీ.శ. 1076 )

సంస్కృతసమ శబ్దానికి సంస్కృత సమ శబ్దం సరముయినప్పుడు కూడా గసడదవాదేశం జరగటం విశేషం

"సరసిజాస్య గనకరుచిరరచిత...." (సంజాస్య+కనక)

(భీమన ప్రెగడ సోమలదేవి శాసనం క్రీ.శ. 1065)

గసడదవాదేశం జరగకపోవటానికి ఉదాహరణలు

"మహాదేవి పెట్టిన" (ద.హిం.శా.సంపు.5. శా.సం. 12 క్రీ.శ. 1074)

"భీమన బోయని కొడుకు కాటియ బోయణెన" (ద.హిం. శా.సంపు.5 శా.సం.21 క్రీ.శ.1078)

నన్నయ కాలంనాటి శాసనాలలో 'టు' గాగమ రూపాలున్నాయి.

ఉదా: 'ఉప్పుటేఱు' (ద.హిం.శా.సంపు.10 శా.సం. 651 క్రీ.శ. 1090 -11)

సంస్కృత వ్యాకరణ నియమాలను బట్టి సాంస్కృతిక సమాసాలలో గుణ సంధి జరగవలసిన చోట్ల, తెలుగు సంధులు నియమాలను బట్టి పర రూప సంధులు జరిగిన స్థలాలు 11వ శతాబ్ది శాసనాలలో కన్పిస్తున్నాయి.

ఉదా:- "సోమీశ్వర దేవరకు" (సం.సోమ +ఈశ్వర) (ద.హిం.శా.సంపు. 10. శా.సం. 60 క్రీ.శ. 1091)

"నీవీశ్వరదేవరకు"(ను.నీల+వం. ఈశ్వర) (ద.హిం.శా.సంపు.10 శా.సం. 652 క్రీ.శ. 1095)

పై శాసనాలలో గుణసంధి సూత్రానుసారం సోమేశ్వర, నీలేశ్వర అనే విధంగా సంధి జరగిన రూపాలు ఏర్పడవలసి ఉండగా ఆంధ్ర సంధి పద్దతిలో పర రూపసంధులేర్పడి సోమీశ్వర, నీలీశ్వర శబ్ద రూపాలేర్పడ్డాయి. సంస్కృతంపై పరరూప సంధుల ప్రభావం దీన్ని బట్టి తెలుస్తోంది. సంస్కృత భాషలో ఏర్పడ్డ పరరూప సంధులు కూడా ఈ విధంగా ఏర్పడ్డ వే.

సంయుక్తాక్షరాల్లోని రేఫ అకారంగా శాసనాల్లో మారింది. పద మధ్య సంధి లో ఇది ఒక పరిణామం. నన్నయ కాల శాసనాల్లో ఈ పరిణామం లేదు.

ఉదా:- వాఱ్ఱుడు (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 1016 క్రీ.శ. 1084)

నన్నయ భారతంలోని సంధి విధానాన్ని పరిశీలిద్దాం.

"కర్మధారయంబు నందు బేర్వాది శబ్దముల కచ్చు పరంబగునప్పుడు టుగాగమంబు విభాషనగు"

(బాలవ్యా.సంధి. 29)

అనే బాలవ్యాకరణ సూత్ర ప్రకారం "సామాన్యాధి కరణ్యేషూదన్తానాం టుగాగమోః చిస్యాత్" అనే ఆంధ్రశబ్ద చింతామణి సూత్ర ప్రకారం పేర్యాదులకు అచ్చు పరమైనప్పుడు టు గాగమం విభాషగా రావలసి ఉండగా నన్నయ భారతంలో టు గాగమ రూపాలు మృగ్యాలు. ఆ కాలం శాసనాలలో 'ఉప్పుటేఱు' మెదలయిన చోట టుగాగమ రూపాలున్నట్లుగా మనం గమనించాం. పేర్వాదులకు అచ్చు పరమయినప్పుడు మాత్రం టు గాగమం లేదు.

"అత్తునకు సంధి బహుళముగానగు" (బావ్యా.సంధి. 4 సూ) అని చిన్నయసూరి. నన్నయ భారతంలో సంధి జరగని రూపాలే అధికం.

"తృష్ణయునైన యెడల" (భార. ఆరణ్య.2-74)

"మిన్నకయలయుచు" (భార. ఆరణ. 2-26)

"నృప సూనులయొద్దకు" (భార. ఆది. 1-11)

కొన్నిచోట్ల అత్యసంధి జరిగిన రూపాలూ ఉన్నాయి.

"విధియించుటెంతయు" (విధియించుట+ఎంతయు) (భార. ఆరణ్య 1-274)

"ఒడకఱుచుచు" (ఒడక+అఱుచుచు) (భార.ఆరణ్య.2-12)

మేనకు అత్త పరమైనప్పుడు సంధి వైకల్పికమని చిన్నయసూరి.

"తనమేనయత్తనందనుడపుత్త్రకుడైన" (భార.ఆది. 5-17)

"సాత్వతిఁదనమమేనయత్తనుముదంబున జూడఁగఁగోరి (భార. సభా. 2-55)

స్త్రీవాచక తత్సమ సంబంధకార్థకాలకు మాదిరిగానే అవధారణార్థకాలకు అత్వసంధిలేదు.

"అరిగి ముందున్న యందయుండి" (భార. ఆది. 6-153)

అరిగిన చోటికి యరుగుదమని వారి (భార. ఆరణ్య. 1-56)

"మీతోనయరుగుదెంతుమనిరి" (భార. ఆరణ్య.1-36)

అది అవి శబ్దాల అత్తుకు సంధి నన్నయ భారతంలో సంధి వైకల్పికంగా జరుగుతుంది.

"విచారావసరాస్తికిన్ విషయమైనది" (భార. ఆరణ్య. 1-257)

"మధ్యమనీవు చెప్పియది కార్యమ" (భార.ఆరణ్య. 267)

"అడవులు నేఱులు నవినీపడసినయవియట్టె" (భార.సభా. 1-50)

దాని, వాని, వారి, వీరి శబ్దాలకు అది, అవిశబ్దాలు పరమయినప్పుడు వాటి అత్యలోపం నిత్యం.

"నీవు వారిదయిన నేర్పెఱింగి" (భార.సభా.1-25)

"వానిది కలరూపెఱుంగ" (భార. ఆది. 4-30)

సమాసంలో ఇత్వంవచ్చిన తోడకు (తోడికి) అది, అవి శబ్దాలు పరమయినప్పుడు వాటి అత్వానికి లోపం కలుగుతుంది. దాని

తోడిదేమి (భార. ఆది. 3-148)

తోడి+ఆది+ఏమి)

పెద్ద మొదలయిన అదంత విశేషణ రూపాలకు, నా, మీ, మా, నీ, తన మొదలయిన వాటికి అది, అవి శబ్దాలు పరమయినపుడు అది అవి శబ్దాలలోని అత్తుకు లోపం కలగదు. అప్పుడు యడాగమం వస్తుంది.

"సేవ్యంబు కాయది నీయదిమే" (భార. ఆది. 7-40)

"రాజ్యంబునీయదిదమయంతినాయది" (భార. ఆరణ్య. 2-223)

"అందుబెద్దయదియైనయంబ" (భార.ఆది. 4-211)

'అగు'క్త్వార్థక రూపం అయి. అయికి. క్త్వార్థక రూపానికి 'ఉ' సముచ్చయం చేర్చగా 'అయుము' అనే రూపం ఏర్పడాలి, కాని నన్నయ మహాభారతంలో 'అయ్యూ' అనే రూపమే కన్పిస్తోంది. 'అయి'లోని ఇత్వం లోపించటంములోని యనారానికి ద్విత్వంరావటం విశేషం.

అయి+ అయి+యు అయ్+యు అయ్యు

"దానికి శివుడు ప్రత్యక్షమయ్యు " (భార.ఆది. 7-35)

"చక్రధరుండయ్యు జలరుహనాభుండు గాండీవధరుడయ్యు ఁబాండవుండు" (భార. ఆది. 8-261)

"ఏమ్యాదులయిత్తునకు సంధి వైకల్పికముగానగు" (బాలవ్యా.సంధి. 5 సూ)

అనిచిన్నయసూరి ఏమ్యాదులకు ఇత్వసంధి వైకల్పికమని తెలిపింది. కి, షష్ఠికి తప్ప మిగిలిన ఏమ్యాదుల ఇత్వానికి అచ్చుపరమైనపుడు సంధిలేని రూపాలే నన్నయ భారతంలో కన్పిస్తున్నాయి.

"వాక్యావసానంబున సంధి లేమి దోషంబుగాదని యార్యులండ్రు" (బాలవ్యా.సంధి.55) అనే సూరి సూత్ర ప్రకారం వాక్యాంతంలో సంధి చేయక పోవటం తప్పుకాదు అని సూరి తెలపి "ఇట్లు సంధి విగ్రహంబు కావ్యంబులందు అదాంతమంద చూపట్టెడు" అని స్పష్టపరిచారు. పద్యాలలో వాక్యాంతం పాదాంతం రెండూ కావాలని తాత్పర్యం. ఇది నన్నయ చిన్నయల మార్గం.

"సర్వ తీర్థాభిగమనంబు సర్వవేద
సమధి గమము సత్యంబుతో సరియు (గావు
ఎఱుగు మెల్ల ధర్మంబులకెందు బెద్ద
యండ్రు సత్యంబు ధర్మజ్ఞులైనమునులు" (భార. ఆది. 4-95)

మొదటి రెండు పాదాలతో వాక్యాంతం కావటంతో పాటు పాదాంతం కూడా అయింది. కాబట్టి తర్వాతి "ఎఱుగుమెల్ల ధర్మంబులకెందు (బెద్దయండ్రు సత్యంబు...." అనేది వేరేవాక్యం కాబట్టి ఇక్కడ సంధిలేదు. ఇది తప్పుకాదు అని ఆంధ్రవ్యాకరణజ్ఞుల అభిప్రాయం. ఛందోభంగం కాని విధంగా సంధి చేసినా చేయవచ్చు అని వైయాకరణులు నిర్ణయించారు.
అచ్చు పరమయినపుడు 'ఏని' శబ్దంలోని ఇత్వానికి లోపం వైకల్పికంగా కలుగుతుంది.

"తిరముగానిష్టంబు దీర్చితేనిందు" (భార.ఆది. 5-145)

"ఎందైనిట్టి సభసూచియెఱుంగుదురే " (ఆది.సభా.1-57)

"నాకు నీవెన్నండేని నవమానంబు దలంచితి" (భార.ఆరణ్య.2-154)

"ఇతనినెద్దియేని యొక్కయపూర్వం బయినదాని నిర్మింపనియోగింపుమనిన" (భార.సభా.1-4)

"క్త్వార్థంబైనయిత్తునకుసంధిలేదు" (బాల వ్యా.సంధి.8సూ.)

అవి చిన్నయసూరి. భారతంలో నన్నయ కాని నన్నయకాలం నాటి శాసనాలలోకాని క్త్వార్థకసంధి లేదు. క్త్వార్థకానికి ప్రత్యేకమయిన అర్థం ఉండటంతో ఆకాలంలో అర్థభంగం కలగకుండా చూసుకుని ఉంటారు.

ఓటమి, ఆనతి "పదాలకు అచ్చుపరమయినప్పుడు నన్నయ సంధి కావించాడు. వీటిని ఏమ్యాది గణంలో పఠించుకోవాలి.

"ఓటమెడ(దలేకయున్నవాడు" (భార. ఆరణ్య. 3-63)

(ఓటమి+ఎడ(ద)

"ఆనతిచ్చినట్ల" (భార. ఆది. 1-117)

(ఆనతి+ఇచ్చినట్ల)

ప్రాసస్థానాల్లోద్రుతానికి మకారం పరమయినప్పుడు ద్రుతంమకారంగా మారుతుంది.

"కమ్మనిలతాంతములకుమ్మొనసివచ్చు" (భార.ఆది.5-138)
(కమ్మనిలతాంతములకున్+మొనసి)

చేసెమ్మహానది దీర్ఘికాసరసీ నందుబులనిండ(గాన్" (భార.ఆది.ఆరణ్య.3-113)
(చేసెన్ + మహానది)

తత్సమపదాలకు తత్సమపదాలు పరమైనప్పుడు కూడా గసడదవాదేశం జరగటం నన్నయ భారతభాగంలో ఉంది. ఈవిధంగా ఉండటం ఈ యుగశాసనాలలో ఉండటం ఇది వరకే గమనించాం.

చేసెమ్మహానది దీర్ఘికాసరసీనదంబులునిండ(గాన్" (భార.ఆది. ఆరణ్య.3-113)

(చేసెన్+మహానది)

తత్సమపదాలకు తత్సమ పదాలు పరమైనప్పుడు కూడా గసడదవాదేశం జరగటం నన్నయ భారతభాగంలో ఉంది. ఈవిధంగా ఉండటం ఈ యుగ శాసనాలలో ఉండటం ఇది వరకే గమనించాం.

"చోరభయవర్జితముగాధారుణి పాలింతె" (భార.సభా.1-41)

(ధారుణి +పాలింతె)

"తెనుఁగులమీది సాంస్కృతిక పరుషములకు గసడదవలురావు" (బాలవ్యా.సంధి.14)

అని చిన్నయసూరి పేర్కొన్నారు. కాని తెలుగు మాటలపై సాంస్కృతిక పరుషాలకు గసడదవలు వచ్చినరూపాలు నన్నయ భారతంలోనే ఆనాటి శాసనాలలోను కనబడుతున్నాయి.

"ఏమిగారణంబునయోనిజయయ్యె" (భార.ఆది. 7-4)

(ఏమి+కారణంబున్)

"పెద్దగాలంబు" (భార.ఆరణ్య.3-81)

(పెద్ద+కాలంబు)

"ఆమ్రేడితంబుపరంబగునపుడువిభక్తిలోపంబుబహుళంబుగానగు

ఇంచుకనాఁడిత్యాదులందు బహుళగ్రహణము చేతనంతిమాక్షరలోపంబునగు" (బాలవ్యాసంధి. 41)

ఇంచుక,నాడు శబ్దాలలో అంతిమాక్షరలోపం నన్నయ భారతంలో కన్పించదు.

"అలయకనాఁడు నాఁటికిలతాంగి" (భార.ఆది.8-183)

"మూడు, రెండు,ఇరు,నలు"శబ్దాలకు సమాసంలో తొలి అచ్చు మిది వర్ణాలకు లోపం వచ్చి మీది హల్లుకు ద్విత్వం కల్గుతుంది.

"మున్నూటయేఁబండువీరభటులును" (భార.ఆది.1-81)

"పదపడిరెన్నాళ్లనెఉక్కపగలున్రేయున్" (భార.ఆది.1-8)

"ఎన్నూఱుశ్లోకంబులు గలిగి" (భార.ఆది. 1-64)

"చిత్రరథుండనువాఁడు నన్నూఱు గంధర్వహయంబులునిచ్చె" (భార. సభా. 2-113)

'ఎనిమిది' కి మారుగా 'ఏనమ' అని నన్నయ ప్రయోగం.

"ఇరువదియొక్కవేయునెనమన్నూట డెబ్బది రథంబులు" (భార.ఆది. 1-81)

'తొమ్మిది' కిమారుగా 'తొమ్మ' అని నన్నయ ప్రయోగం.

"నాలుగువేలుందొమ్మన్నూఱుశ్లోకంబులు గలిగి" (భార.ఆది. 1-48)

పుంప్వాదేశ రూపాలు నన్నయకాలంనాటి శాసనాలలోను, నన్నయ భారతంలోను కూడా ఉన్నాయి.

ద్రాక్షారామ శిలాశాసనం (క్రీ.శ. 1058) లో "లోహపుదివియ" అనే లేఖనాన్ని గమనించవచ్చు.

నన్నయ భారతంలో "బలితంపురక్కసు (భార. ఆది. 6-214)

"లోకనాథయిట్టిలోక విరుద్ధంపువరము" (భార.ఆది. 7-260)

"వీనిపుట్టినపాపంపువేళ" (భార.ఆరణ్య. 1-19)

"నల్లనైన దీర్ఘపుఁదనువును జూచి" (భార.ఆది. 4-253)

నన్నయ భారతంలో తత్పురుష సమాసంలో 'ము' వర్ణానికి పుంపులు లేవు.

ఉదా:- "అమర లోకంబువేశ్యలమైనమాకు" (భార. ఆరణ్య.1-363)

"దమయంతికట్టిన పుట్టంబువెలుఁగు" (భార.ఆరణ్య.2-68)

నన్నయ భారతంలో అ, ల, ఆగాగమానికి మారుగా ఉలఆగమం కన్పిస్తోంది.

ఉదా:- "సంసారము సంసారమ
ఖిలదుఃఖావహముభయనికేతనమతిచం
చలముపరాధీనంబిం
దులజీవనమేలనమ్మొదురుతత్త్వజ్ఞుల్" (భార.ఆది. 6-215)

ఇక్కడ 'ఇందుల'= ఈసంసారం (ప్రపంచం)లోని అరుంధతీసహితుండై వసిష్ఠుఁడిందులవసియంచె"
ఇక్కడ 'ఇందుల' సప్తమ్యంతంగా వాడ బడింది.
'ఉల' అనేదే 'లో'గా తర్వాత కాలంలో మారింది.

## పదాంశాలు

'-ణ్డు' అనే మహాదేకవచన ప్రత్యయం దేశిపదాలలోను,సంస్కృత పదాలలోను కన్పిస్తోంది.

"గణ్డణ్డు" (దీర్ఘాసిశిలాశాసనం క్రీ.శ.1075-76)

"బుద్ధనాయకుణ్డును" (ద.హిం.శా.సంపు. 10శా.సం. 645. క్రీ.శ.1060)

దేశిపదాలలో చాలా వాటికి ఏమహదేకవచన ప్రత్యయమూ చేరకుండా అన్న,అయ్య మొదలయిన ప్రత్యేక పదాలు ప్రత్యమయ (మహదేకవచన) కార్యం నెరవేర్చటానికి గాను ప్రయోగించడబడేవి.

"చామబోలవెణ్టియము
ంగమ్మబోల కాటిమయుబాద బోల
దొడ్డయముంగయమ్మకవ తల్లియము
బెరసిన బోలు (ద.హిం. శా.సంపు. 4. శా.సం. 1011 క్రీ.శ. 1073)

"రేకనుపెనిమిటి కలపన....." (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1117 క్రీ.శ. 1082)

అమహత్తులలో ప్రథమైకవచనం చేరిన రూపాలు ప్రథమైకవచన రూపం చేరని రూపాలు ఈ 11వ శతాబ్ధి శాసనాలలో కన్పిస్తున్నాయి.

అమహత్తులలో ప్రథమై కవచనం చేరని రూపాలు.

"ఇల్లు" (ద.హిం.శా.సంపు. 10. శా.సం. 645 క్రీ.శ. 1060)

"నెత్తురు" (పైది)

"గొఱియ" (పైది)

"నెయు" (ద.హిం. శా.సంపు. 5. శా.సం. 1149 క్రీ.శ. 1060)

"పూట" (ద.హిం. శా.సంపు. 4 శా.సం. 1317 క్రీ.శ. (1081)

అమహత్తులతో ప్రథమైకవచన రూపం చేరిన రూపాలు

'-ము' ప్రత్యయం చేరిన రూపాలు ఫ

"పెండ్లము" (ద.హిం. శా.సంపు. 5. శా.సం. 1044 క్రీ.శ. 1098)

"గురువారము" (ద.హిం.శా.సంపు.5. శా.సం. 1129 క్రీ.శ. 1058)

"ఆచన్ద్రార్కము" (పైది)

"గంగ్గా సింధు పాతము" (ద.హిం.శా.సంపు. 5 శా.సం.1129 క్రీ.శ. 1056)

'-ము' పూర్వరూపంగా భావించబడేపంబు' ఉన్న రూపాలు నన్నయ కాలం నాటి శాసనాలలో కన్పిస్తున్నాయి.

"తటాకంబున" (ద.హిం.శా.సంపు.10 శా.సం. 644 క్రీ.శ. 1060)

"ఈశ్వరాలయంబునకు" (పైది)

"దేవాలయంబునకు" (పైది)

"స్వస్తి శకవరుషంబులు 1015 గు

నివద్యము... (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1347 క్రీ.శ. 1093)

"స్వస్తిసర్వలోకాశ్రయ శ్రీవిష్ణువర్ద్ధమహా రాజులు ప్రవర్ధమాన విజయ రాజ్య సంవత్సరంబుళ్..."

(ద.హిం.శా.సంపు.5. శాసం. 23 క్రీ.శ. 1094)

అమహాదేకవచనంగా '-వు' కొన్ని శాసనాలలో కన్పిస్తోంది. "ప్రాకారువు"

(ద.హిం.శా.సంపు.10. శా.సం. 651 క్రీ.శ. 1090-91)

"ధమ్మకావు" (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 1300 క్రీ.శ. 1095)

కొన్ని సందర్భాలలోను మహదేకవచనం మీద '-రు' ప్రత్యయం చేరి బహువచన రూపం ఏర్పడింది

"వాణ్ణిద్దఱకు జీవిత...." (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 1015 క్రీ.శ. 1084)

మహదమహద్బహువచన ప్రత్యయంగా సాధారణంగా చేరే ప్రత్యయంలు

"బోలవనమున నిచ్చిన ఎడ్లు" (ద.హిం.శా.సంపు. 11 శా.సం. 1010 క్రీ.శ. 1055)

"స్వస్తి శకవరుషంబులు శ్రీమదనంతవర్మ్మ దేవర ప్రవర్ద్ధమాన సంవత్సరములు "

(ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1123 క్రీ.శ. 1058)

"శ్రీమన్మహామణ్ణలేశ్వర చంద్రాదిత్యరాజులు" (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 645 క్రీ.శ. 1060)

"మ్రాంకులు" (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 1016 క్రీ.శ. 12087)

"పగ్గడ్లు" (రాజమండ్రి శాసనం క్రీ.శ. 1072)

"కోమట్లు" (ద.హిం.శా.సంపు. 4 శా.సంపు 4. శా.సం. 1014 క్రీ.శ. 1033

బహువచన ప్రత్యమయమున '-లు' పరమయినప్పుడు కొన్ని చోట్ల పదాంతంలో ఉన్న "ణ,ఱ,య,వ" లు లోపిస్తాయి

పదాంత -ణ కార లోపం :

"బ్రాహ్మల" (ద.హిం.శా.సంపు. 10.శా.సం. 645 క్రీ.శ. 1060)

పదాంత '-ఉ' లోపం

"కూన్తులున్" (ద.హిం.శా.సంపు. 647 క్రీ.శ. 1097)

(కూతుఌ, కూన్తుఌ అని శాసన రూపాలు) పదాంత -య కారలోపం.

"వ్రాలు" (ద.హిం.శా. సంపు10 శా.సం. 644 క్రీ.శ. 1060)

బహువచనం పరమయినప్పుడు ద్విరుక్త టకారంలోని ద్విరుక్తి లోపించటం ఈ యుగ శాసనాలలో కన్పిస్తోంది.

"జన్నియభట్ల కూంతుఌ.." (ద.హిం.శా.సంపు. 10. శా.సం. 8 క్రీ.శ. 1061)

(భట్టు + -లు + -అ)

"పెరువలి (న) గ్గియ షడంగవిభట్లు...." (ద.హిం.శా.సంపు. 10. శా.సం. 6. క్రీ.శ. 1043)

(సం.భట్ట- + -లు)

ఈలోపం సార్వత్రికమని చెప్పవచ్చు. ఐనా సార్వత్రిక వ్యాకరణాలు ఈ విషయాన్ని పేర్కోలేదు. ద్వితీయాది విభక్తులు నన్నయుగ శాసనాలలో కన్పిస్తున్నాయి.

ద్వితీయా విభక్తిగా-న్,-ని, -ను లు కన్పిస్తున్నాయి "దీని నడపనివారు "

(ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1122 క్రీ.శ. 1058)

"వారణి సావేయిగవిలలవేవురు బ్రాహ్మల జంపి నెత్తురు ద్రాగిన వారు"

(ద.హిం.శా.సంపు. 10 శా.సం. 645 క్రీ.శ. 1060)

దీనినా చంద్రార్కౣమునడుపుది"

(ద.హిం.శా. సంపు. 5 శా.సం. 1114 క్రీ.శ. 1060)

చెఱువు నుం గుడియింవేయించె"

(ద.హిం.శా.సంపు. 6. శా.సం. 536 క్రీ.శ. 1074)

తృతీయావిభక్తి ప్రత్యయాలుగా" -తోన్, -తోడన్, తోఌ" ఈ యుగ శాసనాలలో కన్పిస్తున్నాయి. "-వెణ్డియణ్డతోనఖణ్డితద్యుతి..."

(ద.హిం.శా.సంపు. 4 శా.సం. 1007 క్రీ.శ. 1065)

"ఎల్లకాలంబునుమెచ్చుతోడందమకునిచ్చుమణ్డ"

("దీర్ఘాసిశాలా శాసనం క్రీ.శ. 1075-76)

"కాస్యుతోటి" (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 1016 క్రీ.శా. 1087)

'-కిన్, -కున్' లు భాషాశాస్త్రరీత్యా చతుర్థీవిభక్తులే, షష్ఠికాదు. వీటికి శాసన ప్రయోగాలు.

"భీమేశ్వరదేవరకుంజక్రవర్తిన్" (ద.హిం.శా.సంపు. 4. శా.సం. 1010 క్రీ.శ. 1055)

"దివియయొకోట్టికి నిచ్చిన గొఱియలేంబది" (ద.హిం.శా.సంపు. 10. శా.సం. 8 క్రీ.శ. 1061)

"-మీన్ద,-పైన్" అనేవి పంచమ్యర్థకాలుగా నన్నయయుగ శాసనాలలో ప్రయెగించబడ్డాయి.

"గుడిమీన్ధి" (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 1014 క్రీ.శ. 1038)

"భూపతిపై" (దీర్ఘాసిశాసనం క్రీ.శ. 1075-76)

షష్ఠికి ప్రత్యేక ప్రత్యయం ఈయుగ శాసనాల్లో లేదు. ఈ యుగ శాసనాల్లో '-న్' సప్తమ్యర్థాన్ని సూచించింది.

"భూపాలురనినెర్చె చలమర్తి గండణ్డే" (జనపతిశాలాశాసనం క్రీ.శ. 1075-81)

"-న, -లో, మ-అన్" అనేవి సప్తమ్యర్థకాలు.

"ఏడునుటమురిమముంబావనవారంపు విషయంబులోరుద్ద వృత్తి కాదు" (రావిమెట్టశాసనం క్రీ.శ. 1093)

రామ,కృష్ణ, శివ మొదలయిన అదంత పుంలింగ శబ్దాలు తెలుగులో ప్రవేశించేటప్పుడు ఆపదాలకు ఉత్వడుజ్ఞలు రావటం మనం గమనించాం. ఉత్వడుజ్ఞలు లేని తత్సమ రూపాలు కూడా నన్నయ భారతంలో ఉన్నాయి.

"నీవు మాకమరంగదూతనై" (భార. ఆరణ్య. 2-34)

"అనిలుఁడను దూతపోయితోడానియుఁదెచ్చె" (భార. ఆది. 3-56)

అసుర శబ్దానికి "అసుర,అసరుఁడు" అనే రెండు రూపాలూ నన్నయ భారతంలో ఉన్నాయి.

"అయ్యసురనిన్నెఱింగి" (భార.ఆది-132)

"ఈ యన్నిదేవుఁడసురకు" (భార.ఆది. 1-133)

"మూర్ఖ,వృద్ధ" అనే సంస్కృత పదాలలో ఉత్వం ఉంది కానీ డుజ్ లేదు.

"నీవుమూర్ఖవు శిశుపాల" (భార. సభా. 2-24)

"ఈ తనివృద్ధని యెఱిఁగిపూజించితే వసుదేవుఁడుండంగవసుమతీశ" (భార. సభా. 2-11)

నన్నయ భారతంలో ఇయాంత శబ్దరూపాలే కాని ఏదంత శబ్ద రూపాలు లేవు. అయినప్పటికి నన్నయ కృతమని భావించబడే ఆంధ్రశబ్ద చింతామణి వ్యాకరణ గ్రంథంలో "ఏదన్తతాచునావణ్నమన్యతరస్యామియాన్తానామ్" (ఆం.శాచిం. అజన్తపరి. 82) అనే సూత్రమూ "ఇయకుమాఱుగా నామాంతబునకెత్వంబు బహుళంబుగానగు" (బావ్యాఆచ్ఛికపరి.23 సూ.) అని బాలవ్యాకరణ సూత్రమూ తెలుగు పదాలలో ఏదంత రూపాలను అంగీకరించాము.

"పదివేలమొదవులు పదివేలగద్దియల్" (భార. ఆరణ్య. 1-344)

బలిమిఁగొనినధనము పదివేలు లోట్టియల్ (భార. సభా. 1-267)

"మల్లెయులంజెయుగద్దెయు నెల్లెయు ననుపగిది పలుకులొప్పవుకృతులన్" (ఆంధ్రభాషాభూషణము 176)
అని మూలఘటిక కేతన ఎదంత శబ్ద రూపాలను తప్పని చెప్పాడు.

ఉదంతపుంలింగ రూపాలుమకద్యాచ కాలమునపజ్ వర్ణాంత రూపాలుగాను, డుమంత రూపాలుగాను, కొన్ని ఉభయాలుగాను ఉంటాయి. ఉదా:-విష్ణువు, విష్ణుడు, శంభువు,శంఖుడు. కాని మనువటు శబ్దాలకు డుజ్ఞ్ చేరదు నన్నయ భారతంలో ఇది వాస్తవ స్థితి. "చండస్ఫూర్తి వటుండు గాంచె" వంటి (పోతనగారి) శబ్ద రూపాలు భారతంలోనేనని అర్థం.

నన్నయ భారతంలో వువర్ణక రహితంగా రాహుశబ్దం ప్రయోగించబడింది. "రాహు పర్వంబుగాకయభానుఁబట్టె" (భార. సభా. 2-298)

శరణరూప శబ్దాలకు '-ము'

ప్రత్యయం చేరని సందర్భాలలో '-ఉ' త్వం చేరుతుంది.

"శరణన్నఁగాచుచు" (భార.ఆది. 1-7)

"దానిదికలరూపెఱుంగనవనీపతియుత్సుకుండయ్యె" (భార. ఆది. 8-29)

నన్నయ భారతంలో అర్థ శబ్దానికి అర్థము, అర్థువు ధర్మ శబ్దానికి ధర్మము,ధర్మువు అనే శబ్దరూపాలు కన్పిస్తున్నాయి.

"అవనియురాజకంబుయనయప్పుడ భూప్రజలందు సర్వధర్మువులు ద్రొలంగుదేవముని ముఖ్యులూ యుదు రోలిన వృష్టిరే దవుమతియర్థువుల్దఱుఁగునందురు...." (భార. ఆది. 4-250)

హంస శబ్దం స్త్రీ సమంగా ప్రయుక్తం. నన్నయ 'హంసము' అని ప్రయోగించలేదు.

"అంతరిక్షమునను హంసలెల్ల" (భార. ఆరణ్య. 2-13)

"కలహంస పలికిన పలుకుల గణియించి.... " (భార. ఆరణ్య. 2-26)

"ఋత్విగాదులు ప్రథమైకవచనాంతతుల్యంబులు విభాషనగు" (బాలవ్యాతత్సమపరి. 73) అనే సూరి సూత్రప్రకారం "ఋత్విజుఁడు " అనే రెండు శబ్దరూపాలు ఉండవచ్చు. కాని నన్నయ భారతంలో 'ఋత్విజుఁడు" అనే శబ్ద రూపమే కాని 'ఋత్విక్కు' అనే శబ్ద రూపంలేదు.

"ఋత్విజుండని విచారించి పూజించితే"

"స్నాతకుండును ఋత్విజుండును" (భార. సభా. 2-4)

మహద్బహు వచన ప్రత్యయం '-రు' 'సరు' చేరిన శబ్దరూపాలు నన్నయ భారతంలో ఉన్నాయి.

"నీయల్లురఁబాండుపుత్త్రుల" (భార.ఆది. 8-53)

"శూరులెందునీయట్టిరే" (భార.సభా. 1-236)

"బంధులకునెయ్యురకున్ హృదయ ప్రియంబు గావించె "(భార. సభా. 1-16)

'-ఌ' కూడా ప్రథమా బహువచన ప్రత్యయంగా కన్పిస్తోంది.

"పలుకులజెయ్యుల ఁబాండ వులకు బ్రీతిగల యట్లయుండుదు.. " (భార. ఆది. 8-21 )

"ఆంద-ఌ, ఇంద-ఌ, ఎంద-ఌ, కొంద-ఌ" వంటి శబ్దరూపాలలో '-ఌ' బహువచ ప్రత్యయమే వీటికి ఏకవచన రూపంలేదు.

ఏ ఌ శబ్దానికి నన్నయ భారతంలో ఏరులు బ.వ.రూపం

ఏ ఌ శబ్దానికి నన్నయ భారతంలో 'ఏళ్లు' బ.వ. రూపం లేదు.

బహువచనంపై బహువచనం చేరటం నన్నయ భారతంలో ఉంది.

"సుందరి నా కోడంద్రురమందభర్తృతపునీవ" (భార. సభా. 2-257)

"ఒక్కసతికి ఁబతులు పెక్కంద్రరగుటయిది"

"వారలు, వీరలు, మీరలు " (భార. ఆది. 8-25) కూడా బహువచనంపై బహువచనం చేరిన రూపాలే.

"జడంబు ద్వితీయకు బ్రథమ బహుళంగానగు" (బాలవ్యా.కారకం. 24)
అనే దానికి నన్నయ భారతంలో ప్రయోగం ఉంది.

"అమ్మదనాగమైదిర్చి క్రమ్మఱించిన పరికాడువ్యైలె " (భార. ఆది. 4-208)

'చేసి' అనే 'చేయు' ధాతుక్వార్థక క్రియ (అసమాపకం) తృతీయార్థంలో చేరుతుంది.

"భారతభారతీ శభాగభాస్తి చయంబులు జేసి......"

నన్నయ భారతంలో 'కోఱకు' అనే విభాక్త ప్రత్యమం లేకపోవటం విశేషం. -కయి, -వైలు ప్రయోగించబడ్డాయి. -కు+అయి -కయి, -కై

"అనఘ మామామ శకుని నాకైకడంగి" (భార.సభా. 2-172)

'-చేతన్' అనేది చతుర్థి విభక్తి ప్రత్యయంగా నన్నయ భారతంలో ప్రయుక్తం (భార. ఆది. 8-144 )
పంచమీవిభక్త నన్నయ లో '-వలన'.

"కచుండు శుక్రువలన సంజీవనివడసి" (భార. ఆది. 3-128)

'-కంటె' ప్రయోగం.

"సుతశతకంబు కంటె" (భార. ఆది. 4-93)

'యెక్క' అనే షష్ఠీ ప్రత్యయం నన్నయ భారతంలో లేదు.

'అందు' సప్తమీ విభక్తి ప్రత్యయం.

"జనమేజయు సర్పయాగంబు నందయ్యెడు" (భార.ఆది. 5-96)

"శుచులయందెల్లనత్యంతశుచినై" (భార. ఆది. 1-143)

'-నన్' కూడా సప్తమ్యర్థమే.

"తెనుఁగున రచియింపుమధికధీయుక్తిమెయిన్" (భార.ఆది. 1-6)

'ద్వారా' అనే అర్థంలో -నన్
"అహిలోకమునకరిగెభూవివరమునన్" (భార.ఆది. 1-102)

## నన్నయయుగ శాసనాలలోని సంఖ్యావాచకాలు :

'ఒక్కంటి' అని శాసన శబ్దం. దీని నుండి నేటి ఒకటి ఏర్పడి ఉంటుంది.

"దివియ యెక్కణ్టికింగాలారమున" (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 1010 క్రీ.శ. 1055)

11వశతాబ్దిశాసనాలలో 'రెణ్డు' కు ప్రయోగాలున్నాయి.

"విజయరాజ్యసంవత్సరంబులురెణ్డు" (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 77 క్రీ.శ. 1073)

"మూడు,మూణ్ణు" సంఖ్యావాచకాలు-ఈయుగ శాసనాల్లో ఉన్నాయి.

"మూడుగుఱ్రాహి...." (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 12 క్రీ.శ. 1074)

"మూణ్డు మానికలు" (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 109 క్రీ.శ. 1076)

"నాలు,నాలువు" శబ్దాలు నాలుగు అనే అర్థంలో కన్పిస్తున్నాయి.

"రట్టడికము నాలవు పాలు ఆఏనేల నాలువు పుట్లాను" (ద.హిం.శా.సంపు. 4. శా.సం. 1029 క్రీ.శ. 1100)

ఐదుకు ఈ యుగ శాసనాల్లో ప్రయోగంలేదు.

"మాడలేనింటికి" (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1084)

ఏన=అయిదు.

"ఆర్వ్వురు" (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 1014 క్రీ.శ. 1038)

ఇక్క 'ఆర్' అనేది విశేషణ రూపం.

"ఏఱు,ఏడు' లు నన్నయ యుగ శాసనాల్లో మృగ్యాలు.

'ఏన్మిది' ఒక్కచోట మాత్రమే ఈ యుగంలో శాసనాల్లో ఉంది.

"పదినెన్మిది" (ద.హిం. శా.సంపు. 10 శా.సంప. 65 ) క్రీ.శ. 1090-91)

'పది' చాలా శాసనాల్లో కన్పిస్తోంది.

"నేలయంబదిమఱుతురు" (హనుమకొండ శిలాశాసనం క్రీ.శ. 1079)

'పండ్రెండు' ప్రయోగంశాసనాల్లో ఉంది.

"పంణ్డ్రెంఱుమానికలు" (హనుమకొండ శిలాశాసనం 1079)

'పదియేను' (పదిహేను) శాసనప్రయోగం

"పదియేనింటికి " (ద.హిం.శా.సం. సంపు. 5 శా.సం. 21 క్రీ. శ. 1078)

'వంద' అనే అర్థంలో 'నూఱు' ఈ యుగ శాసనాల్లో ఉంది.

వందలేదు.

"మున్నూఱు ఫలములు" (ద.హిం. శా.సంపు. 4 శా.సం. 1235 క్రీ.శ. 1076)

"వెయి,వేయి,వేయు" పదాలు సహస్రార్థంలో ఈ యుగ శాసనాల్లో కన్పిస్తున్నాయి.

"వేయిగవిలలవేగురు బ్రాహ్మల" (ద.హిం. శా.సంపు. 10 శా.సం. 644 క్రీ.శ. 1060)

సగం అనే అర్థంలో 'అర' అని శాసనప్రయోగం

"అరమానిక" (ద.కిం.శా.సంపు. 5 శా.సం. 21 క్రీ.శ. 1078)

నన్నయ 'ఒక' ను విశేషణంగా ప్రయోగించారు. ఈ కవి 'ఒక్కరుడు' అని ప్రయోగించారేకాని 'ఒక్కడు' అని పద్యవాచకంగా ప్రయోగించలేదు.

'ఒక్కడు' ప్రయోగాలకు పాఠాంతరాలున్నాయి. ఇరు విశేషణంగాను రెండు విశేషణ విశేష్యాలుగాను నన్నయ చే ప్రయుక్తాలు.

"ఇరుగడలందులకిడి" (భార. ఆది. 4-94)

"రెండుగా వ్రయ్యుటంజేసి" (భార. ఆది. 2-122)

మూడు, నాలుగు, నాల్గు, ఏను, అయ్యేురు, ఏడ్వురు, ఎన్మిది, తొమ్మిది, పది, ఇరువది, ముప్పది, ఏంబది, అఱువది, డెబ్బది, నూఱు, వేయి, కోట్లు మెదలయిన సంఖ్యావాచకాలు నన్నయ భారతంలో కన్పిస్తున్నాయి.

## క్రియావాచకాలు:

ప్రత్యేక కాలసూచక శబ్దాలను ప్రయోగించకుండా ధాతుజవిశేషణాలతో భావవ్యక్తీకరణ చేయటం ప్రాచీనాంధ్రశాసనాలలోను వాఙ్మయంలోను చోటు చేసుకున్న ఒక పద్ధతి. ఈస్థితిని నన్నయ యుగ శాసనాలు కొంతవరకు స్పష్టపరుస్తాయి.

చేతంగొనియిచ్చిన భూమి ఇరువెదినాలుగుమఱ తుర్లనేల...."

(నెల్లూరు శాసనాలు సంపు. 3 పుటలు 1202, 1203 క్రీ.శ. 1023 )

"బోలవనమునపెట్టినగొఱియలు" (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 1014 క్రీ.శ. 1038)

ధాతుజ విశేషణానికి విభక్తి వివక్షించేటప్పుడు తచ్ఛబ్దం ఉపయోగించి శాసనాలలో వాక్యా నిర్మాణం కావిస్తారు. వీటిలోధాతుజ విశేషణాల ఉనికి సుస్పష్టం.

స్వస్తిసకాబ్దంబులు 960 దదిపట్టలక భీమేస్వదేవరకు నిచ్చిన యాఖణ్డవర్త్తి
దివియ దీనికి, యాచన్ద్ర
క్కఁణమునెయిసరియించువారు. (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 1014 క్రీ.శ. 1038)

......త్రిపురుషదేవరకు
నాచన్ద్రార్కకడ్ముఖణ్డవత్తిన్‌దివియులు
మూణ్టికి దణ్డనాయకతిక్కనయ్యనాయకులిచ్చిన గొఱియలు నూట యేంభది...."

(ద.కిం.శా.సంపు. 10 శా.సం. 6 క్రీ.శ. 1043)

"................. నారాయణభట్లు కుంతురు పెట్టిన అఖణ్డ
వత్తి ఁలోహపుదివియ........." (ద.హిం.శా.శా. సంపు. 4 శా.సం. 1010 క్రీ.శ. 1055)

క్త్వార్థకాన్ని ప్రయోగించి తర్వాత తచ్ఛబ్దోత్తర తచ్ఛబ్ద ప్రయోగం చేయటం నన్నయయుగ శాసనాల్లో కన్పిస్తుంది.

"వేయిగవిలలవేగురు బ్రాహ్మలంజంపినెత్తురు
త్రాగిన మహాపాతకముసేసిన వారు " (ద.హిం.శా. సంపు. 10. శా.సం. 644 క్రీ.శ. 1060)

భూతకాలికసమాపక క్రియ నన్నయయుగ శాసనాల్లో కన్పిస్తుంది.

"కనకరుచిరరచితకల్పావనీరుహ
కుసుమమిచ్చెందమకుననమునెరుగ
వెణ్డిమన్డతోనఖణ్డితద్యుతిదీప
మమరనిచ్చె విమలకమలనేత్రి" (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 1007 క్రీ.శ. 1065)

"చలివిన్దిరివేసె..." (ద.హిం.శా. సంపు. 6 శా.సం. 536 క్రీ.శ. 10

"దీవియపెట్టె" (దీర్ఘాసిశాలాశాసనం క్రీ.శ. 1075-76)

"ఇచ్చితిమి" (ద.హిం.శా.సంపు 10. శా.సం. 10 క్రీ.శ. 1078)

"గుడిచ్చితిమి" (చిట్టివలసశాలాశాసనం.క్రీ.శ. 1086)

భవిష్యత్క్రియారూపాలు నన్నయ యుగ శాసనాలలోకన్పిస్తున్నాయి.

"...............మానిక నాదిత్యచంద్రులకలయన్యతకు బొయ్రగవాణ్డు"

(ద.హిం.శా.సంపు. 5 శా.సం. 71 క్రీ.శ. 1099)

"మున్నూవ్వుఱు రూపాయలుంబ్రతిపాలింపంగలవారు"

(ద.హిం.శా.సంపు. 6 శా.సం. 109 క్రీ.శ. 1076)

ఈయుగ శాసనాలలోయత్తర్దక ప్రయోగాలు కర్మణి ప్రయోగాలు లభించక పోవటంగమనించతగ్గ విషయం.

వర్తమాన భూత భవిష్యత్కాలాలు తద్ధర్మాద్యర్థకం నన్నయ భారతంలో ఉన్నాయి.

## 'వర్తమానకాల రూపాలు :

"వార్తయందు జగము వర్తిల్లు చున్నది." (భార. సభా. 1-50)

"వచ్చుచున్నాడు, వచ్చుచున్నారు, వచ్చుచున్నావు, వచ్చుచున్నారు, వచ్చుచున్నాను. వచ్చుచున్నాము' వంటి దీర్ఘ మధ్య క్రియారూపాలు నన్నయ భారతంలోలేవు.

## భూతకాలం :

భూతకాల క్రియాజన్యవిశేషణాలకు సర్వనామంచేర్చటంచేత భూతకాలక్రియ రూపాలేర్పడతాయి.

వచ్చినవాడు (ఏ.వ.) వచ్చినవారు (బ.వ)

ధాతువుకు భూతకాల ప్రత్యయం చేర్చటంవల్ల భూతకాల రూపాలు ఏర్పడ్డాయి.

వచ్చెను (ఏ.వ.) వచ్చిరి (బ. వ.)

వచ్చితిని (ఏ.వ.) వచ్చితిరి (బ.వ.)

వచ్చును, వత్తురు వంటివి తద్ధర్మాద్యర్థకాలు

## భవిష్యత్కాలం :

తుమ్మన్నర్థక రూపానికి కలానుబంధం చేరిస్తే భవిష్యత్కాల రూపం ఏర్పడుతుంది. తమ్మున్నర్థకానికి కలానుబంధానికి నన్నయ భారతంలో వ్యవధానముంది.

భారతంలో వ్యవధానముంది.

"పరశురాముఁడొండె బలదేవుఁడొండెగా కొరులు నరులు శల్యుగెల్వఁగలరె "

## వాక్యాలు:

ప్రాఙ్నన్నయ యుగ శాసనాలలో కర్మణి ప్రయోగాలు కేవలం మూడే మూడు ఉన్నట్టు మనం గమనించాం. సంస్కృతంలో యత్తదర్ధక ప్రయోగాలు, యావత్తావత్, యధా తధా ప్రయోగాలు అధికంగా ఉన్నట్లు గమనించాం. నన్నయనాటి కాలపు భాషలో వీటి ప్రయోగ విస్తృతి లేక పోయినా పండిత ప్రయోగాలున్నాయి.

ఆనాటి శాసనాలలో కూడా ఇటువంటి ప్రయోగాలు అక్కడక్కడా కన్పిస్తున్నాయి.

శాసనాలలో "దేని(తేని" పదాలు అంతమందు ఉన్న వాక్యాలు కన్పిస్తున్నాయి. ఈ ప్రయోగాలు

"స్వదత్తాం పరదత్తాంవా
యోహరేతవసున్ధరామ్" వంటివి.
దేనికి మారుగా దీనికి అని ఆనాటి శాసన ప్రయోగాలు.
"వేంగినాటికెవ్వరు రాజులైరి వారుం బూర్వపు
స్థితిందప్పకపాలించువారు" (ఆహవమల్లదేవుని శాసనం క్రీ.శ. 1008)

ఇటువంటి సర్వనామాల తోకూడిన వాక్యాలు నన్నయ భారతంలో కన్పించినా కాలక్రమేణ వీటి ప్రయోగం తగ్గిపోయింది.
"చదల(బ్రక్షు లామిషంబెట్లు భక్షించు నట్లు దివిరి యెల్లవారును........... భక్షింతురర్థవంతు............" (భార. ఆరణ్య. 1-27)

"ఎంతయోటువడిన నంతియ జూదంబు
నందు(దగలు (జలమునతిశయిల్లు" (భార. ఆరణ్య. 2-62)

"ఏవానినెఱింగిన సర్వజ్ఞాన సంపన్నులగుదురట్టి
మోక్షధర్మంబులుసెప్పుటయు" (భార.ఆది. 1-109)

"నాకు నీవెన్నండేనినవమానంబుదలంచితి
నా నిన్నుం బాసిపోదు (భార. ఆది. 2-154)

"నీవెయ్యేనినొక్కవేల్పునారాధించి తద్వేల్పు
నీకోరిన పుత్త్రకులనిచ్చు" (భార.ఆది. 5-18)

**కర్మణి ప్రయోగాలు :**

"వా(డుతనయుండన(బడునే" (భార.3-199)

"ధృతరాష్ట్రుపట్టిచేసభ(దలపట్టియీడ్వంబడి
పాపకర్ముచేపరిధానమొలువంబడి" (భార. ఆరణ్య. 1-136)
"అందెఱు(గ(బడిరేని" (భార. సభా. 2-278)
"ఒరుల చేతంజేయంబడుటంజేసి...." (భార. ఆది. 6-272)

"పరమసుఖోపాయంబున
బరసంపదచేకొనంగ (బడునేని..........." (భార.సభా. 2-142)
"బ్రాహ్మచేతననుజ్ఞాతుండై" (భార. ఆది. 1-30)

"కర్ణుచేత(బ్రత్యఖ్యాతుండయి(క్రమ్మఱివచ్చుటయు...." (భార. ఆది. 1-42)

నన్నయ భాష సంస్కృత భాషా ప్రభావానికి లోనయి కర్మణి ప్రయోగాలకు యత్తదర్థక ప్రయోగాలకు లోనయింది. సంస్కృతపద బాహుళ్యం నన్నయ భాషలో ఉంది. నన్నయ యుగ శాసనాలలో ఆనాటి వ్యావహారిక భాష స్పష్టమవుతుంది.

అప్ప కవి మొదలయిన వారు నన్నయ భారతంలోని భాష నే ఉపయోగించాలని నియమంకావించారు. ఈ కారణాలవల్ల వ్యావహారిక భాషకు గ్రాంధిక భాషకు భేధం అంతకంతకు అధికమయింది.

**ఆధార గ్రంథాలు :**

రాధకృష్ణ, బూద రాజు. 1971 ప్రాచీనాంధ్రశాసనాలు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, కళాభవన్, హైదరాబాదు.
వేంకటావధాని, దివాకర్ల. 1960, ఆంధ్రవాఙ్మయారంభదశ, ఉస్మానియా విశ్వవిద్యాయం, హైదరాబాదు.
సోమయాజి,జి, జె. 1947. ఆంధ్రభాషావికాసము, ఆంధ్రవిశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

**ప్రశ్నలు :**

1. నన్నయశాసన భాషలో నిలిపి వర్ణ పరిణామాల్నిసోదాహరణంగా వివరించండి.
2. నన్నయ యుగ భాషా విశేషాలను వివరించండి.
3. నన్నయయుగంలోని సంధి విశేషాలను పేర్కొనండి.
4. లింగ వచన విభక్తి విధానాలు నన్నయ యుగంలో ఏవిధంగా ఉన్నాయో వివరించండి.

-

పాఠం - 14

# మధ్యయుగాంధ్ర భాష - క్రీ.శ. 1101 నుండి 1600 సంవత్సరాల వరకు కల శాసన సారస్వత భాష

**వ్యాససంగ్రహం :**

మధ్యయుగ (క్రీ.శ. 1101 నుండి 1600)
తెలుగు భాషలోని అచ్చులు, హల్లులు
వర్ణాల పరిణామం
శాసన భాషా విశేషాలు
సారస్వత భాషలోని విశేషాలు
విశిష్ట పదాలు
వాక్య విశేషాలు
మధ్యయుగ భాషలోని భాషా పరిణామం

**క్రీ.శ. 1101 నుండి 1600 వరకు కల శాసనభాష :**

11వ శతాబ్దికి పూర్వాంధ్ర శాసనాలు పరిమిత సంఖ్యలోనే ఉన్నా 11వ శతాబ్ది నుండి 16వ శతాబ్ది వరకు ఉన్న తెలుగు శాసనాల సంఖ్య దాదాపు 2,300 ఉంది. ఈ కాలం భాషా స్వరూపాన్ని నిరూపించటానికి ఈ శాసనాలు బాగా ఉపయోగపడతాయి.

**వర్ణాలు :**

**అచ్చులు**

| | తాలవ్యాచ్చులు | | మధ్య | తాలవ్యేతరాచ్చులు | |
|---|---|---|---|---|---|
| సంవృతాలు | ఇ | ఈ | | ఉ | ఊ |
| అర్ధ సంవృతాలు | ఎ | ఏ | | ఒ | ఓ |
| వివృతాలు | | | అ | | |

"ఇ, ఉ, ఎ, ఒ, అ" లను అచ్చులుగా పేర్కొని వీటి దీర్ఘతను మరో వర్ణంగా పేర్కోవచ్చు. సంస్కృత భాషలో ఉన్న వర్ణాలు ౠ వర్ణం తెలుగులో లేవు. శాసన భాషలో 'ఋ' వర్ణం 'రి' గా కాని 'రు' గా కాని మారుతుంది.

"రిషభ" (ద.హిం.శా. సంపు. 4 శా.సం. 990 క్రీ.శ. 1158)
< సం. ఋషభ -.
"పిత్రు స్థానము" (ద.హిం.శా. సంపు. 4 శా.సం. 1248 క్రీ.శ. 1112)
< సం. పితృస్థాన -.
"రుతు" (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 950 క్రీ.శ. 1346)
< సం. ఋతు-.

తెలుగులోని ఐ, ఔ లు క్రమంగా అయ్, అవ్‌లతో సమానం. సంస్కృత భాషలోని ఐ, ఔ లు సంధ్యక్షరాలు. ఈ ఐ, ఔ లు సంస్కృత సమ శబ్దాలతో కూడి తెలుగు భాషలో వ్యవహరించబడుతున్నాయి. వీటి ప్రయోగాలు తెలుగు శాసనాలలోను సాహిత్యంలోను కన్పిస్తాయి. తెలుగు సంస్కృత భిన్నోచ్చారణలు కారణంగా లిపిలో వీటిని వ్రాసేటప్పుడు గందరగోళ పరిస్థితి ఏర్పడి రకరకాలుగా ఈ ఐ, ఔ లు లిఖించబడేవి.

'పౌత్ర' - అనటానికి మారుగా

"పవుత్ర" (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 929 క్రీ.శ. 1088) అని 11వ శతాబ్దిలో కనిపించినట్లుగానే తర్వాతి శతాబ్దులలో కనిపించటమే కాకుండా ఈ పౌత్ర పదం "పవిత్ర" (ద.హిం.శా.సంపు. 6. శా.సం. 141 క్రీ.శ. 1143), (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 154 క్రీ.శ. 1152). మిగిలిన ఐదౌ దంత సంస్కృత పదాలలోను ఈ రూపాంతరాలు కన్పిస్తున్నాయి.

"వైశాఖ" (ద.హిం.శా. సంపు. 5 శా.సం. 1184 క్రీ.శ. 1403)
"వయిశాఖ" (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1167 క్రీ.శ. 1414)
"గౌడీశ్వర" (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1165 క్రీ.శ. 1460)
"గవుడేశ్వర" (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1153 క్రీ.శ. 1470)
"గఊడేశ్వర" (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1165 క్రీ.శ. 1460)

"కౌశిక గోత్రుండు" అనేవిధంగా రాయవలసి ఉండగా
"క ఊసిక గోత్రుండు" (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1194 క్రీ.శ. 1194 క్రీ.శ. 1455)
అని శాసనంలో చెక్కటం దీనికి ఉదాహరణ.
ఈ కాలం శాసనాలలోని హల్లుల స్వరూపాన్ని గమనిద్దాం.

## హల్లులు

| | కంఠ్యాలు | | తాలవ్యాలు | | మూర్ధన్యాలు | | దంత్యాలు | | దంతమూలీయాలు | ఓష్ఠాలు | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| శ్వాసం | క | ఖ | చ | ఛ | ట | ఠ | త | థ | | ప | ఫ |
| నాదం | గ | ఘ | జ | ఝ | డ | ఢ | ద | ధ | | బ | భ |
| స్పర్శోష్మం | | | శ | | ష | | స | | హ | | |
| ఆనునాసిక్యం | | | | | ణ | | | | న | | మ |
| పార్శ్వికోష్మం | | | | | ఴ | | | | | | |
| పార్శ్వికం | | | | | ళ | | | ల | | | |
| తాడితం (ఈషత్ స్పృష్టం) | | | | | | | | ర | | | |
| ఈషత్ స్పృష్టకంపితం | | | | | | | | ఱ | | | |
| అంతస్థం | | | | య | | | | | | | వ |

వర్గ పంచమాక్షరాలకు మారుగా అనుస్వారం (ం) రాయటం ఈ కాలంలో పూర్తయింది. అనుస్వారాన్ని వర్ణంగా గ్రహించి ఙ, ఞ లను ప్రత్యేక వర్ణాలుగా తెలుగులో గ్రహించనక్కరలేదు. సంస్కృతంలో వీటిని ప్రత్యేక వర్ణాలుగా మునిత్రయం గుర్తించింది. 'ఴ' కారం సంజ్ఞా వాచకాల్లో ప్రత్యేక వర్ణంగా కన్పిస్తోంది.

ఉదా : "తాలాంఱ" (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 674 క్రీ.శ. 1131)

"చోఱగంగ" (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 665 క్రీ.శ. 1124)

"ఱుత్తిక" (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 262 క్రీ.శ. 1218)

14వ శతాబ్ది నుండి 'ఱ' కారం శాసనాలలో లేదు. చ, చ, జ, జ లలో చ, జ లను గ్రహించి చ, జ లను మాత్రమే ప్రత్యేక వర్ణాలుగా గుర్తించాలి. ఌ, చ, జ లకు సవర్ణాలు. హల్లులలోని ర, ఱ లు ప్రత్యేక వర్ణాలు అని చెప్పటానికి శాసనాధారాలు ఈ యుగంలో కన్పించటం లేదు.

తత్సమ పదాలలో తాలవ్య హల్లుల తర్వాత 'అ' కారం 'ఎ' గా మారింది.

'విజెయవాడ' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 754 క్రీ.శ. 1135)

< సం. విజయ వాటీ

'ఆ చెంద్రార్క స్థాయి' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1228 క్రీ.శ. 1503)

< సం. ఆచన్ద్రార్క స్థాయిన్

'హరిశ్చెంద్ర' (ద.హిం.శా. సంపు. 5 శా.సం. 165 క్రీ.శ. 1596)

'శెనివారానను' (ద.హిం.శా.సంపు.6 శా.సం. 850 క్రీ.శ. 1418)

< సం. శనివార -.

'యెథోచిత' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 982 క్రీ.శ. 1296)

ఈ మార్పు తెలుగు పదాలలోను య కారం మీద కన్పించటం విశేషం.

'ఊరుంగాయెల తోడను' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 381 క్రీ.శ. 1518)

అ > ఎ మార్పు దేశి పదాలలో య కారం తర్వాత కన్పిస్తోంది.

'యవ్వరు' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 219 క్రీ.శ. 1494)

< ఎవ్వరు

'యట్లు' (నె.శా.సంపు. 1 శా.సం. 23 క్రీ.శ. 1347)

< ఎట్లు

'ఋ' వర్ణం 'రి' గాను 'రు' గాను ఈ యుగశాసనాలలో కన్పిస్తుంది.

'రిషభ' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 990 క్రీ.శ. 1158)

< సం. ఋషభ-.

'శ్రింగార' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 5 క్రీ.శ. 1404)

< సం. శృఙ్గార -.

ఋ > రు

'పిత్రు స్థానము' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 1248 క్రీ.శ. 111)

< సం. పితృస్థాన-

'రుతు' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 950 క్రీ.శ. 134)

< సం. ఋతు -.

'బుందావనం' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 104 క్రీ.శ. 142)

< సం. బృన్దావన-.

'సుక్రుతము' (ద.కిం.న. సం.పూ. 5 శా.సం. 48, క్రీ.శ. 1450)

< సం సుకృత

విలోమ విలేఖనం <

'తల్లితండ్రులకు' (ద.హిం.సం.హి.క.శా.సం. 47, క్రీ.శ. 1424)

< తల్లిదండ్రులకు

'కాశ్యపగోతృలై (ద.కిం.లో.సంపు. 5 శా.సం. 1158 క్రీ.శ. 147)

< కాశ్యపగోత్రులై

ఈ = ఇ ('ఈ' విశేషణ రూపం)

ఇదీపము (ద.హిం.శ.సంపు. 5 శా.సం. 160 క్రీ.శ. 1136)

ఇ,ఈ = యి, యీ

ఉదా : 'నెఇ' (ద.హిం.స.సంపు. 5 శాసం. 5 క్రీ.శ. 1404)

'పినబోఇన' (ద.హి. న. సంపు. శా.సం.5. 26, క్రీ.శ. 1412)

పినబోయిన

ఉ, ఊ = వు, వూ

ఉదా : ధేనుఉన్ను' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 29)

(క్రీ.శ. 1402) = ధేనువున్ను

పోఉవాండు' (ద.హిం.శా.సంపు.5, శా.సం. 104, క్రీశ. 1423)

'చేనువూరి' = పోవువాడు

చేను ఊరి = చేనూరి (ద.హిం.శా.సంపు. 5, శా.సం. 149, క్రీ.శ. 1402)

తెలుగులో ఐ / అయ్‌లకు ఔ/ అవ్‌లకు భేదం లేదు. తెలుగులో ఐ,ఔ లు ప్రత్యేక వర్ణాలుకావు. కాగా సంస్కృత పదాలలో ఐ,ఔ లు సంధ్యక్షరాలు. సంస్కృత సమపదాలలో ఐ, ఔ ఘటితశబ్దరూపాలు అనేక విధాలుగా కన్పిస్తున్నాయి.

'గౌడేశ్వర' (ద.హిం.శా.సంపు.5, శా.సం. 1165 క్రీ.శ. 1460)

'గవుడేశ్వర' (ద.హిం.శా.సంపు. 5, శా.సం. 1153 క్రీ.శ. 1470)

'గఊడేశ్వర' (ద.హం.శ. సంపు. 5, శా.సం. 1165 క్రీ.శ. 1460)

'వయిశాఖ' (ద.హిం.శ.సంపు. 5, శా.సం. 1167 క్రీ.శ. 1414)

ఇయాంత శబ్ద రూపాలు పలు విధాలుగా కన్పిస్తున్నాయి.

**ఇయాంతం :**

'గౌఱియలు' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 667 క్రీ.శ. 1422)

-ఇయ > -య

'గౌఱ్యలు' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1180 క్రీ.శ. 1402)

'పళ్యాలు' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 981 క్రీ.శ. 1518)

-ఇయ > -యె

'పళ్యెము' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 47 క్రీ.శ. 1424)

-ఇయ > -అ

విడం పోంకలు (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 5 క్రీ.శ. 1404)

'పళ్ళం' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 981 క్రీ.శ. 1518)

-ఇయ > -ఎ

'గొట్టెలు' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 656 క్రీ.శ. 1417)

పళెం (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 694 క్రీ.శ. 1516)

ఈ మార్పు తత్సమ పదాలలో కూడా ఈ యుగంలో ఉండటం విశేషం.

సం. హత్య - > హత్తె (తె.) (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 745 క్రీ.శ. 1530)

ఒడయలు శబ్దం ఒడెలుగా మారటం గమనించండి.

'ఒడెలుంగారు' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 748 క్రీ.శ. 1577)

కొన్ని పదాలలోని కకారం గకారంగా మారుతుంది.

'సుగ్రుతంగాను' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 94 క్రీ.శ. 1482)

'సుగ్రుతంగాను' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 104 క్రీ.శ. 1423)

'అఖండము' అవడా(టా) నికి మారుగా 'అగండం' అని రాయటం శాసనాలలో కన్పిస్తుంది.

'అగండ దీపానను' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 667 క్రీ.శ. 1422)

'జ్ఞ' కారానికి 'గ్న' కారోచ్చారణ ఉందని విలోమ విలేఖనం (Inverse yelling) వల్ల తెలుస్తోంది.

'ఆజ్ఞేయభాగం' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 749 క్రీ.శ. 1588)

పదాది డకారం దకారంగా మారటం 10వ శతాబ్ది నుండి జరిగింది. ఈ శాసన కాలంలో పదాది డకార రూపాలు అనేకం కన్పిస్తున్నాయి.

'డాయు' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 734 క్రీ.శ. 1132)

'డున్ను' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 14 క్రీ.శ. 1213)

దకారాదిరూపాలు కూడా కన్పిస్తున్నాయి.

'దుత్తిక' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 364 క్రీ.శ. 1259)

(< డుత్తిక < ఋత్తిక)

'దున్ను' (నె.శా.సంపు. 2 క్రీ.శ. 1314)

టకారాది రూపాలకు మారుగా తకారాదిరూపాలు.

'తెంకాయ' (ద.హిం.శా.సంపు. 5. శా.సం. 1236 క్రీ.శ. 1277)

< టెంకాయ (కొబ్బరికాయ)

పదాదిని హల్లుతో కూడి ఉన్న రేఫ లోపించటం ఈ యుగంలో విశేషం.

'సమప్పించు' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 5 క్రీ.శ. 1305)

< సమప్పిర్ంచు

'కొత్త యింటికి' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 711 క్రీ.శ. 1593)

< క్రొత్త

'పెగ్గడ' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 1027 క్రీ.శ. 1415)

< ప్రెగ్గడ

'చెఱువు కింద' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 702 క్రీ.శ. 1518)

< క్రింద

దీర్ఘం తర్వాత ఉన్న యకారానికి ద్విత్వం రావటం ఆ దీర్ఘానికి హ్రస్వం రావటం ఈ యుగ శాసనాలలో తరచుగా కన్పిస్తుంది.

'పొయ్యంగలారు' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 617 క్రీ.శ. 1408)

'చెయ్యంగాను' (తెలంగాణ శాసనాలు సంపు. 1 శా.సం. 168 క్రీ.శ. 1551)

పదమధ్యంలోని యి -హి- గా మారుతుంది. (-యి- > -హి-).

'నాహిండు' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 321 క్రీ.శ. 1248)

> నాయిండు

'ఆచంద్రార్కస్థాహిగా' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 510 క్రీ.శ. 1315)

< స్థాయి

పసిండి > పయిండి (బంగారం). ఈ శబ్దాలకు మారుగా పహిండి రూపం 12 శతాబ్ది నుంచి కన్పిస్తోంది.

'పహిండి' (ద.హిం.శా. సంపు. 4 శా.సం. 1142 క్రీ.శ. 1142)

తెలుగు మాటలలో 'హ' కార ఘటిత రూపాలలో ఇది మొదటిది.

తాలవ్యాచ్చు పరమౌతున్నప్పుడు సకారం శకారంగా ఈ యుగ శాసనాలలో తరచుగా కన్పిస్తుంది.

'పడశిన' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 845 క్రీ.శ. 1273)

'చేశిన' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 465 క్రీ.శ. 1290)

'శీతాదేవి' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1125 క్రీ.శ. 1349)

'పుట్టెండేశి' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 26 క్రీ.శ. 1412)

'చేశెను' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 87 క్రీ.శ. 1494)

-స- > -శె- > -శ-

'శలవు ఇచ్చి' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 751 క్రీ.శ. 159)

< శెలవు < సెలవు

'సమర్పణ చేశను' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 1073 క్రీ.శ. 1402)

< . . . చేశెను < . . . చేసెను

ద్విత్వానునాసికానికి (-న్ను మొ.) ముందు తరచుగా అనుస్వారం (ం) కన్పించటం విశేషం.

'పుచుకొంన్న గ్రామాలు' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 695 క్రీ.శ. 1519)

'దుంన్ని' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 747, క్రీ.శ. 1574)

మూర్ధన్యద్విత్వరూపాలలోని ద్విత్వం ఈ యుగశాసనాలలో వైకల్పికంగా లోపిస్తుంది.

ఉదా : సోమారెడ్డి (ద.హిం.శా.సంపు.5, శా.సం. 10 క్రీ.శ. 1404)

'సోమారెడి' (ద.హిం.శా.సంపు.శా.సం. క్రీ.శ. 1404)

'ఇంతపట్టు' (ద.హిం.శా.సంపు.శా.సం. 5, క్రీ.శ. 1404)

'ఇంతపటు' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 26, క్రీ.శ. 1412)

జ్యేష్ఠమాసానికి మారుగా శ్రేష్ఠమాసమని జానపదవ్యుత్పత్తి (Fork etymology) ని శాసనాలలో గమనించవచ్చు.

'శ్రేష్ఠ' (ద.హిం.శా.సంపు. 5 శా.సు. 109, క్రీ.శ. 1428)

వర్ణ సమీకరణం పొందిన కొన్ని శబ్దరూపాలు శాసనాలలో కన్పిస్తున్నాయి.

డ్ల > ళ్ళ

'డ్ల' రూపాలన్నీ 14వ శతాబ్ది కాలానికి ళ్ల రూపాలుగా మారాయి.

'మాడ్లు' (ద.హిం.శా.సంపు 10, శా.సం. 476, క్రీ.శ. 1293)

> మాడలు

'మూడ్లు' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 70 క్రీ.శ. 1177)

< మూరలు

'మూళ్లు' (ద.హిం.శా.సంపు.10 శా.సం. 84, క్రీ.శ. 1122)

'గుళ్లు' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 1379 క్రీ.శ. 1381)

'నేరేళుంన్ను' (ద.హిం.శా.సంపు. 10, శా.సం. 737, క్రీ.శ. 1526)

'దేవుళు' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 634 క్రీ.శ. 1516)

'మాళు' (ద.హిం.శా. సంపు. 6 శా.సం 731, క్రీ.శ. 1406)

పదాదిని పదమధ్యంలోను హల్లులు అన్ని అచ్చులతోను వస్తాయి. డ ఘటిత శబ్దరూపాలకు ఈ నియమం వర్తించదు. మూర్ధన్యఘటిత శబ్దరూపాలలోని మూర్ధన్య హల్లులు సాధారణంగా అ, ఆ లతో కూడి ఉంటాయి.

'టంకమాడలు' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 1183 క్రీ.శ. 1221)

'ఠక్కురు' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 897 క్రీ.శ. 1298)

'ఠావు' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 111 క్రీ.శ. 1142)

'ఆటిక' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 1033 క్రీ.శ. 1396)

పదాది డకారం మాత్రం అన్ని అచ్చులతో కూడి ఉంటుంది.

'డంగుంబ్రాలు' (ద.హిం.శా.సంపు. 4 శా.సం 1248 క్రీ.శ. 1112)

'డాపల' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 1034 క్రీ.శ. 1132)

'డిగ్గ' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 201 క్రీ.శ. 1219)
'డున్నవారు' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 1200 క్రీ.శ. 1175)
'డెబ్బదేను' (ద.హిం.శా.సంపు. 2 శా.సం. 28 క్రీ.శ. 1253)
'డేరా' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1216 క్రీ.శ. 1314)

**సంధి వచ్చే రూపాలు :**

**సంధి :**

రెండు పదాలు కలిసినప్పుడు సంభవించే మార్పులు వ్యాకరణ శాస్త్రాలు ఏర్పరచిన నియమాలను బట్టి ఈ శాసనభాషలో జరగవు.

"శాసన భాషలో సంధి కార్యాలు బహుళం" అని చెప్పవచ్చు.

**అత్వ సంధి :**

'తమన్న' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 416 క్రీ.శ. 1280) < తమ + అన్న.

**ఇత్వ సంధి :**

'మహిదేవైన' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 1097 క్రీ.శ. 1378) < దేవి + ఐన.

**సంధి రాని రూపాలు :**

'కొట్టరువు ఎటియమ' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 1114 క్రీ.శ. 1163)
'దేవసెమ్మెళను ఎవ్వండైన' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 9824 క్రీ.శ. 1181)

**యడాగమం వచ్చే రూపాలు :**

'కుంభవాసము యమావాస్య' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1343 క్రీ.శ. 1146)
< కుంభవాసము + అమావాస్య
'సత్యైరాజు యిచ్చిన' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 1098 క్రీ.శ. 1152)
< సత్యైరాజు + ఇచ్చిన

**వడాగమం వచ్చే రూపాలు :**

'విచ్చేశి వుదయగిరి' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 248 క్రీ.శ. 1515)
< విచ్చేశి + ఉదయగిరి
'పఱచూరను వూరగరణము' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 586 క్రీ.శ. 1446)

**గసడదవాదేశం రాని రూపాలు :**

'ఘడియారము పెట్టి' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 10 క్రీ.శ. 1404)

## ద్రుతకార్యం జరగని చోట్లు

'బియ్యంను తిరుబోనములో సపుపెసలును పిండివంటకు' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 4 క్రీ.శ. 1404)

గుణసంధికి మారుగా తెలుగులో వలె సంధి జరగటం (పరరూప సంధి). వీటిలో పర శబ్దం ఈశ్వర పదం కావటం విశేషం.

'భీమీశ్వర' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 510 క్రీ.శ. 1171)

(< సం. భీమ- + సం. ఈశ్వర -)

'నీలీశ్వర' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 712 క్రీ.శ. 1183)

(< సం. నీల- + సం. ఈశ్వర . . . )

'మల్లీశ్వర' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 39 క్రీ.శ. 1241)

(< సం. మల్ల- + సం. ఈశ్వర-)

## గుణసంధి జరిగిన రూపాలు కూడా ఉన్నాయి :

'భీమేశ్వర' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 510 క్రీ.శ. 1315)

(< సం. భీమ- + సం. ఈశ్వర-)

'నీలేశ్వర' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 712 క్రీ.శ. 1183)

(< సం. నీల- + సం. ఈశ్వర-)

'మల్లేశ్వర' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 89 క్రీ.శ. 1241)

(< సం. మల్ల- + సం. ఈశ్వర -)

శాసన భాషలో ద్రుతం 'ను' గా ఉంటుంది. శాసనాల్లో ద్రుతం అజంతంగా ప్రవర్తిస్తుంది.

'వీని సే కొని' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 1000 క్రీ.శ. 1166)

(< వీని + చేకొని)

'భోజనార్థములకు నెట్టింపులకుంగా' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 1098 క్రీ.శ. 1153)

ద్రుతకార్యం జరిగిన రూపాలు లేకపోలేదు.

'క్రిందనుబెట్టిన' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1046 క్రీ.శ. 1187)

(< క్రిందను + పెట్టిన)

'పరలోకానికింజనితేని' (తె. శా. సంపు. 1 శా.సం. 78 క్రీ.శ. 1276)

(< పరలోకానికిని + చనిలేని)

## పదాది సంయుక్తాక్షరాలు :

తెలుగు పదాలలో రేఫ సంయుక్త వర్ణంగా ఉన్నవి కన్పిస్తున్నాయి.

'క్రొత్త' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 472 క్రీ.శ. 1292)

'గ్రొచ్చు' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 655 క్రీ.శ. 1105)

'త్రాసు' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 443 క్రీ.శ. 1278)

'ప్రత్తి' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 935 క్రీ.శ. 1268)

'బ్రతుకు' (నె. శా.సంపు. 2 శా.సం. 727 క్రీ.శ. 1314)

'మ్రొక్కు' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 1302 క్రీ.శ. 1106)

**పదాంశ విజ్ఞానం :**

నామ ప్రాతిపదికలు (noun sterms) రెండు రకాలుగా ఉంటాయి. 1. అవిభాజ్యాలు (simple sterms), 2. విభాజ్యాలు (conflex sterms). అవిభాజ్య దేశి శబ్దాలు, అవిభాజ్య అన్యదేశ్యాలు అని ఇవి మరో రెండు విధాలుగా ఉన్నాయి.

**అవిభాజ్యదేశి పదాలు :**

'ఊరు' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 70 క్రీ.శ. 1177)

'ఇల్లు' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 134 క్రీ.శ. 1154)

**అవిభాజ్య అన్యదేశ్య పదాలు :**

**అ) సంస్కృత పదాలు (సంస్కృత సమాలు) :**

'భూమి' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1046 క్రీ.శ. 1187)

< సం.భూమి -.

**ఆ) ప్రాకృతభవాలు (తద్భవాలు) :**

'ఠక్కురు' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 897 క్రీ.శ. 1298)

'డేరా' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1216 క్రీ.శ. 1314)

**విభాజ్య ప్రాతిపదికలు :**

**కృద్రూపాలు** : మూల క్రియాధాతువుపై ప్రత్యయం చేరటం ద్వారా ఈ రూపాలేర్పడతాయి.

అ) -ఇకి, -ఇక, -క

'ఏలికి' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 649 క్రీ.శ. 1160)

(< ఏలు + -ఇకి)

'ఏలిక' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 465 క్రీ.శ. 1290)

(< ఏలు + -ఇక)

'కాన్క' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 639 క్రీ.శ. 1147)

(< కాను + -క)

ఆ) -అపు / -ఉపు / -పు

'అడపు' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 1020 క్రీ.శ. 1118)

(< అడు + -అపు)

'కొలుపు' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 756 క్రీ.శ. 1113)

(< కొల్ + -ఉపు)

'కాంపు' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 162 క్రీ.శ. 1169)

(<* కాన్ + -పు)

ఇ) -అవు / -ఉవు / -వు

'తొడవు' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 162 క్రీ.శ. 1169)

(*తొడ + -వు)

'తెరవు' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 1178 క్రీ.శ. 1198)

(<* తెరు + -వు)

'పూవు' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 897 క్రీ.శ. 1169)

(<* పూ + -వు)

ఈ) -ఇమి / -మి

'కూరిమి' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1075 క్రీ.శ. 1128)

<* కూర్ + -మి

'పేర్మి' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 132 క్రీ.శ. 1151)

<* పేర్ + -మి

ఉ) -ట

'తోణ్ట' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 203 క్రీ.శ. 1163)

* తోణ్ + -ట

ఊ) - $\phi$

'తప్పు' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1290 క్రీ.శ. 1230)

< తప్పు + $\phi$

**తద్ధిత రూపాలు :**

తెలుగు దేశిప్రాతిపదికలపై వచ్చే తద్ధిత ప్రత్యయాలు కొన్ని ఉన్నాయి.

**అ) -కా- :**

ఈ ప్రత్యయంపై నిత్యంగా మహత్ప్రత్యయం -ణ్డు మహతీ ప్రత్యయం -త్య చేరతాయి. మహతీ ప్రత్యయం ముందున్న -కా- హ్రస్వమౌతుంది.

'అవఱకాణ్డు' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 384 క్రీ.శ. 1251)

ప్రిత్తికత్త్య (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 13 క్రీ.శ. 1141)

ఇ) -అరి / ఆరి / -అఱ / -అటి / -ఱ

'కొట్టరి' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 1114 క్రీ.శ. 1163)

< కొట్ట - + -అరి.

'కోనారి' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 924 క్రీ.శ. 1369)

< కోన + -ఆరి

'తలాఱ' (నె. శా. సంపు. 2 శా.సం. 8 క్రీ.శ. 1188)

తల + -ఆఱ

'తలాటి' (నె. శా. సంపు. 2 శా.సం. 10 క్రీ.శ. 1188)

-తనము / -తనం

'తలారితనము' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 207 క్రీ.శ. 1209)

సంస్కృత సమశబ్దంపై కూడా ఈ ప్రత్యయం చేరింది.

'స్థానాపతి తనము' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 709 క్రీ.శ. 1139)

**లింగ ప్రత్యయాలు :**

**మహదేకవచన ప్రత్యయం :**

తెలుగులో మహదేకవచన ప్రత్యయంగా -న్టు ఉంది. దీని నుండి కలిగిన -ంఱు, -ణ్డు, ండు ఈ యుగశాసనాలలో కన్పిస్తున్నాయి.

'ప్రిత్తికాంఱు' (నె.శా.సంపు. 1 శా.సం. 24 క్రీ.శ. 1187)

'అల్లుణ్డు' (ద.హిం.శా. సంపు. 6 శా.సం. 628 క్రీ.శ. 1262)

'ఉద్దండ ఖానుండు' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 248 క్రీ.శ. 1515)

**మహతి ఏకవచన ప్రత్యయం :**

-ఱాలు / -ఆలు / -త్య

'నాయకుఱాలు' (ద.హిం.శా. సంపు. 5 శా.సం. 1030 క్రీ.శ. 1141)

< నాయకు + - ఱాలు

'మఱందలు' (ద.హిం.శా. సంపు. 6 శా.సం. 634 క్రీ.శ. 1153)

< మఱంది + - అలు (< ఆలు)

'ప్రిత్తికత్య' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 110 క్రీ.శ. 1141)

**క్లీబం ఏకవచన ప్రత్యయం :**

-ంబు / -మ్ము / -ము / -ం (అనుస్వారం)

'దేశంబు' (ద.హిం.శా.సంపు. 1 శా.సం. 402 క్రీ.శ. 1264)

| | |
|---|---|
| 'సుంకమ్ము' | (నె. శా. సంపు. 1 శా. సం. 25 క్రీ.శ. 1284) |
| 'కూటము' | (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 1102 క్రీ.శ. 1150) |
| 'రక్తం' | (నె. శా. సంపు. 1 శా. సం. 24 క్రీ.శ. 1187) |

**వచనం :**

డ ల ర ల తో బహువచన 'లు' (< ళ్) ప్రత్యయం కలిసినప్పుడు ళ్ల (ళ్ళు) గా మారుతుంది. '-డ్లు' వంటి రూపాలు ఈ యుగంలో అరుదు.

| | |
|---|---|
| 'దేవుళ్లు' | (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 749 క్రీ.శ. 1583) |
| 'గుడ్లు గట్టించి' | (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 749 క్రీ.శ. 1583) |

'రాత్రి' కి బహువచనం రాత్రిల్లు

| | |
|---|---|
| 'రాత్రిల్లు' | (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1165 క్రీ.శ. 1460) |

'ఱాయి' శబ్దానికి బహువచనం 'రాళ్లు'

| | |
|---|---|
| 'రాళ్లు' | (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 789 క్రీ.శ. 1518) |

'కూఁతురు' శబ్దానికి బహువచన రూపాలు "కూంతులు, కూతుల్లు" కన్పిస్తున్నాయి.

| | |
|---|---|
| 'కూంతులు' | (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 688 క్రీ.శ. 1437) |
| 'కూతుల్లు' | (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 954 క్రీ.శ. 1441) |

గౌరవార్థంలో బహువచన ప్రత్యయాలు చేరతాయి.

| | |
|---|---|
| 'చక్రవర్తులు' | (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 667 క్రీ.శ. 1422) |

**బహుధాతుకం (సమాసం) :**

**1) దేశిపదాలతో ఏర్పడే సమాసాలు :**

'చలి పందిలి' (తె.శా.సంపు. 1 శా.సం. 37 క్రీ.శ. 1215)

'గుండకుడ్క' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1172 క్రీ.శ. 1293)

'నల్లిల్లు' (తె. శా.సంపు. 1 శా.సం. 17 క్రీ.శ. 1115)

(< నల్- + ఇల్లు) (నల్‌కు స్వతంత్ర ప్రయోగం లేదు)

'ఆంబోతు' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 334 క్రీ.శ. 1293)

(<ఆన్- + పోతు 'ఆన్' నిబద్ధ పదాంశం.)

'మేన మామ' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 634 క్రీ.శ. 1153)

(< మేను + -అ- + మామ)

'ఇనుప ఎడ్లు' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 1156 క్రీ.శ. 1135)

(< ఇనుము + ఎడ్లు) నల్లని ఎడ్లు అని అర్థం.

పైవన్నీ కర్మధారయ సమాసాలని భావించవచ్చు.

**ద్వంద్వ సమాసం :**

'తల్లిదండ్రులు' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 125 క్రీ.శ. 1172)

'కూరకాయలు' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 334 క్రీ.శ. 1251)

సంస్కృత భాషలోని సమాసాలను సిద్ధ సమాసాలుగా యధాతథంగా తీసుకోవటం గమనార్హం.

'సహస్ర నామార్చన' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1212 క్రీ.శ. 1210)

'జలధార' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 943 క్రీ.శ. 1192)

**మిశ్ర సమాసం :**

తెలుగు సంస్కృత పదాల కలయిక వల్ల ఏర్పడ్డ సమాసం.

'వెంజామర' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 1190 క్రీ.శ. 1143)

'చామర కొలుపు' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 756 క్రీ.శ. 1113)

'మంజుతెర' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1216 క్రీ.శ. 1374)

(< సం. మంజిష్ఠ - + తెర)

**విభక్తి ప్రత్యయాలు :**

ప్రథమావిభక్తికి ప్రత్యేక ప్రత్యయాలు లేవు. ద్వితీయాది విభక్తి ప్రత్యయాలు నామపదాలకు చేరతాయి.

'శ్రీ కూర్మనాథుడి సంముఖమందు' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1172 క్రీ.శ. 1583)

'దేవుడికి' (నె.శా.సంపు. 3 శా.సం. 19 క్రీ.శ. 1583)

'బ్రాంహ్మణి జంపిన దోషాన' (ద.హిం.శా.సంపు. 745 క్రీ.శ. 1530)

(< బ్రాహ్మడిని)

'నివేద్యములకు' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 90 క్రీ.శ. 1177)

(< నివేద్యములు + -అ- + -కు)

-ను, -లు, -రు లు చివర ఉన్న కొన్ని పదాలకు -ఇ పాక్షికంగా చేరుతుంది.

'చేనికి' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 488 క్రీ.శ. 1199)

(< చేను + -ఇ + -కు)

'పొరిలోన' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 117 క్రీ.శ. 1118)

(< పోరు + -ఇ + లోన)

'నీరునేల' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 704 క్రీ.శ. 1167)

'నీటినేల' (నె.శా.సంపు. 1 శా.సం. 39 క్రీ.శ. 1141)

(< నీరు + నేల)

'-తి' చేరేటప్పుడు ప్రాతిపదిక చివరి 'యి' లోపిస్తుంది.

'నేతికి' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1107 క్రీ.శ. 1139)

(< నేయి + -తి + -కు)

**తృతీయా విభక్తి ప్రత్యయాలు :**

-న్ / -అన్ / -నన్; -చేతన్ / -చేన్ ; -తోడన్ / -తన్

'సుఖంబున' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 73 క్రీ.శ. 1115)

'వినోదంబులన్' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 384 క్రీ.శ. 1251)

పైవన్నీ సహార్థంలో వచ్చాయి.

**కరణార్థంలో వచ్చినవి :**

'కాలందుడిచెను' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 628 క్రీ.శ. 1124)

'హొడాడదేవన చేతను యెత్తించి' (ద.హిం.శా.సంపు. 14 క్రీ.శ. 1410)

'తిరుమలదేవి అమ్మవారి చేతను' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 248 క్రీ.శ. 1515)

'తల్లి సూరాంబ చే' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 582 క్రీ.శ. 1415)

'ఊరుంగాయల తోడను ఆరగించి' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 981 క్రీ.శ. 1518)

**చతుర్థీ విభక్తి :**

-కొఱకు

'ఆయుష్యాభివృద్ధి కొఱకుంన్ను' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1153 క్రీ.శ. 1471)

'వెలింగిడి కొఱకై' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1184 క్రీ.శ. 1430)

**పంచమీ విభక్తి :**

-నుండి

'గంగకఱుత నుండి' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 1190 క్రీ.శ. 1143)

'ఏలానది వల్ల నుండి' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 3781 క్రీ.శ. 1491)

'భూమిలోన నుండి' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 889 క్రీ.శ. 1518)

-కంటెన్

'నాకాధీశపురంబు కంటె నిది మేలు' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 235 క్రీ.శ. 1158)

ప్రాతిపదికే షష్ఠీ విభక్తి అవుతుంది.

'ప్రోలె బోయి తమ్ముండు' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 667 క్రీ.శ. 1132)

**సప్తమీ విభక్తి :**

-న్, -అన్, -నన్, -లోన్, -లోనన్, -లోపలన్, -అందు / -నందు / -న యందు

| | |
|---|---|
| పడుమటన్' | (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 167 క్రీ.శ. 1200) |
| 'శ్రీ కూర్మమున' | (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1338 క్రీ.శ. 1188) |
| 'ఉత్తర సీమలో' | (ద.హిం.శా.సంపు. 5. శా.సం. 1114 క్రీ.శ. 1164) |
| 'చెల్లావలోన' | (ద.హిం.శా.సంపు. 4. శా.సం. 167 క్రీ.శ. 1200) |
| 'పోరకి నాంటి లోపలన్' | (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 690 క్రీ.శ. 1139) |
| 'చెఱువందు' | (తె.శా.సంపు. 1 శా.సం. 16 క్రీ.శ. 1170) |
| 'భోగము నందు' | (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1081 క్రీ.శ. 1132) |
| 'ఉత్తరాయణమున యందు' | (ద.హిం.శా.సంపు. 10 శా. సం. 177 క్రీ.శ. 1171) |

**సంఖ్యా వాచకాలు :**

'ఒకటి' మాట ఏకార్థంలో ఈ యుగ శాసనభాషలో స్థిరమై పోయింది.

'రెండు, మూడు' అంకెలు అలానే ఉన్నాయి.

'నాలు, నాలుగు' అనే రెండు శబ్దరూపాలూ చతురర్థంలో ఉన్నాయి.

'నాలుకుంచాలు' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 1057 క్రీ.శ. 1514)

ఈ యుగంలో 'ఏను' శబ్దానికి ప్రచారం తగ్గి 'ఐదు' పదానికి ప్రాచుర్యం పెరిగింది.

| | |
|---|---|
| 'ఏను' | (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 101 క్రీ.శ. 1187) |
| 'ఐదు' | (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 228 క్రీ.శ. 1187) |

"ఆఱు, ఏడు" శబ్దాల్లో విశేషాలు లేవు.

"ఎనిమిది, ఎన్మిది, ఎనుమిది" శబ్దాలు అష్టార్థంలో శాసనాలలో ప్రయోగించబడ్డాయి.

ఎణ్ + పది > ఎనిమిది, ఎన్మిది, ఎనుమిది అవుతుంది.

| | |
|---|---|
| 'ఎనిమిది' | (తె. శా.సంపు. 1 శా.సం. 19 క్రీ.శ. 1195) |
| 'ఎన్మిది' | (ద.హిం.శా.సంపు.4 శా.సం. 1248 క్రీ.శ. 1112) |
| 'ఎనుమిది' | (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 1173 క్రీ.శ. 1104) |

తొణ్ + పది > తొమ్మిది. ఈ శబ్దం ఈవిధంగానే ఈ యుగశాసనాలలో కన్పిస్తోంది.

'పది, నూఱు' పదాలలో విశేషాలు లేవు. 'వంద'కు ప్రయోగం లేదు. నూఱు సంఖ్యావాచకానికి మరో సంఖ్యను చేర్చేటప్పుడు 'నూంట' గా మారటం ఈ యుగంలోని విశేషం.

| | |
|---|---|
| 'నూంట పది' | (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 743 క్రీ.శ. 1428) |
| 'మూన్నూంట ముప్పది యేడు' | (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 582 క్రీ.శ. 1415) |

'వేయి, వెయి, వెయు, వెయ్యి' సంఖ్యా వాచకాలు సహస్రార్థంలో ఈ యుగ శాసనాలలో కన్పిస్తున్నాయి.

| | |
|---|---|
| 'వేయి' | (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 207 క్రీ.శ. 1141) |
| 'వెయి' | (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1013 క్రీ.శ. 1148) |

'వేయు' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 930 క్రీ.శ. 1165)

'వెయ్యి' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1202 క్రీ.శ. 1214)

**సర్వనామాలు :**

ఉత్తమ పురుష సర్వనామాలు 'ఏను, ఏము, మేము' పదాలు.

'ఏను' (తె. శా. సంపు. 1 శా.సం. 150 క్రీ.శ. 1170)

'ఏము' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 1186 క్రీ.శ. 1153)

'మేము' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 122 క్రీ.శ. 1561)

మధ్యమ పురుష సర్వనామాల్లో 'మీరు' మాత్రం ఈ యుగ శాసనాల్లో కన్పిస్తోంది.

'మీరు' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 1375 క్రీ.శ. 1444)

ప్రథమ పురుష బహువచన రూపాలుగా 'తారు, తాము' శబ్ద రూపాలు కన్పిస్తున్నాయి.

'తారు' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 1168 క్రీ.శ. 1434)

'తమలోఁదాము' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 748 క్రీ.శ. 1577)

'వాండు, వీండు' అనే ప్రథమ పురుష ఏకవచన సర్వనామాలకు బహువచనంగా 'వారు, వీరు' అనే రూపాలే పూర్వయుగంలో ఉండగా ఈ యుగ శాసనాలలో 'వాండ్లు' రూపం ఉండటం విశేషం.

'అయినవాండ్లు' (ద.హిం.శా.సంపు. 10 శా.సం. 751 క్రీ.శ. 1592)

'పిల్లవాండ్లు' (నె.శా.సంపు. 3 శా.సం. 11 క్రీ.శ. 1570)

**క్రియలు :**

అవిభాజ్య ధాతువులు విభాజ్య ధాతువులు అని క్రియాపదాలు రెండు రకాలు.

**అవిభాజ్య ధాతువులు :** విభజించరానివి.

'అగు' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 672 క్రీ.శ. 1139)

'అమ్ము' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 637 క్రీ.శ. 1147)

**విభాజ్య ధాతువులు :**

-ఇంచు చేర్చటం వల్ల ఏర్పడే ధాతువులు

'ఉదయించు' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 1067 క్రీ.శ. 1149)

'సరియించు' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1138 క్రీ.శ. 1140)

**భూతకాలం :**

'సమర్పించిరి' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 47 క్రీ.శ. 1424)

'ఇస్తిమి' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 860 క్రీ.శ. 1513)

**వర్తమాన భవిష్యత్కాలం :**

"పాదాలు మా సిరస్సున ధరించేము" (ద.హిం.శా.సంపు 6 శా.సం. 248 క్రీ.శ. 1515)

**తద్ధర్మాద్యర్థకం :**

'పరియింతురు' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 945 క్రీ.శ. 1152)

'పోదురు' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 1316 క్రీ.శ. 1113)

**భవిష్యత్కాలం :**

'జరపంగలవాండు' (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 129 క్రీ.శ. 1422)

'కొలువంగలరు' (ద.హిం.శా.సంపు. 6 శా.సం. 1072 క్రీ.శ. 1413)

**శత్రర్థకం : -చు**

'పరగుచును' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 675 క్రీ.శ. 1140)

**విధ్యర్థకాలు :**

'నడపునది' (ద.హిం.శా.సంపు. 4 శా.సం. 1104 క్రీ.శ. )

కొను ధాతువు అను ప్రయుక్తంగా ఉన్న ధాతువులు ఈ యుగ భాషలో ఉన్నాయి.

'చేసుకొని' (ద.హిం.శా.సం. 4వ శా.సం. 709 క్రీ.శ. 1558)

**వాక్యాలు :**

సామాన్య వాక్యాలు సంశ్లిష్ట వాక్యాలు అని వాక్యాలను రెండు రకాలుగా ఈ యగశాసన వాక్యాలను విభజించవచ్చు. సామాన్య వాక్యాలలో క్రియా సమాపక వాక్యాలు విశేషణ సమాపక వాక్యాలు అని మరో రెండు రకాల వాక్యాలు ఈ యుగ శాసనాలలో కన్పిస్తున్నాయి.

"మల్లసానమ్మ సమర్పించెను" (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 34 క్రీ.శ. 1434)

"యీ మండపము నరహరి నేనింగారి పంపున కిరి లేంక శిరిగిరి నేండు గట్టించెను"
(ద.హిం.శా.సంపు. 5 శా.సం. 133 క్రీ.శ. 1416)

"నరహరింనేశిగారి కల్యాణ మండపం గట్టించెను" (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 138 క్రీ.శ. 1416)

కర్త బహువచనంలో ఉండగా క్రియ ఏకవచనంలో ఉండటం విశేషం.

**విశేషణ సమాపక వాక్యం :**

"ఇయ్యవసరం ఆచంద్రార్కస్థాయి" (ద.హిం.శా.సంపు. 5 శా.సం. 14 క్రీ.శ. 1404)

ఈ శాసన వాక్యంలో ఇయ్యవసరం కర్త కాగా, ఆంచంద్రార్క స్థాయి విధేయ విశేషణం.

**సంశ్లిష్ట వాక్యం :**

ఉపవాక్యం ప్రధాన వాక్యం సంశ్లిష్ట వాక్యంలో ఉంటాయి.

"యీ ధర్మానకు యవ్వరు తప్పినాను, గంగలోను గోవు బ్రాహ్మణ వధ చేసిన పాపానం బోవు వారు"
(ద.హిం.శా.సంపు. 4 శా.సం. 981 క్రీ.శ. 1518)

యీ ధర్మానకు యవ్వరు తప్పినాను" - ఉపవాక్యం

"గంగలోను గోబ్రాహ్మణవధ చేసిన పాపానంబోవు వారు" - ప్రధాన వాక్యం.
కావ్యాలలో చోటు చేసుకున్నాయి.

'క్ష' కారానికి సంయుక్తాక్షరంతో ఈ యుగ కావ్యభాషలో యతిలేశారు; ష కారంతో యతివేయటం విశేషం. 'ఱ' కారం కావ్యభాషలో పూర్తిగా నశించింది. తెలుగులో చ, జ లు స్పృష్టోష్మాలు.

దీర్ఘం మీద ఉన్న అనుస్వారం ఊది పలకబడటం కొన్ని మాండలికాలలో ఉండేదని కావ్యప్రయోగాల వల్ల తెలుస్తోంది.

"పోండిగనగజత పశ్మిఖ
మూండు జగమ్ములను . . . .
. . . . కాచిన కాంచన
భాండము క్రియఁదాల్చెఁదత్ప్రభా భాసితమై" (కుమార సంభవము)
అనినన్ని చోడుని ప్రయోగం.

**ధ్వనులలోని కొన్ని మార్పులు :**

లోప దీర్ఘతలు
'మరాకుము' (భార. ఉద్యో.) < మరువకుము
'కళ్యాలన్' (భార. విరాట 1-65) < కళ్యములన్.
'నమ్మీ నమ్మల్' (భార. శాంతి. 2-35) < నమ్మియు + నమ్మల్
ఇయాంతాలు ఎదంతాలుగా మారటం ఈయుగ కావ్యాలలో తరచు కన్పిస్తుంది.

"ఎదన్త తాచనామ్నామన్య తరస్యామియన్తానామ్" అనే ఆంధ్ర శబ్ద చింతామణి సూత్రం ఈ విషయాన్నే తెలుపుతోంది. ఇయాంతాలు ప్రాచీన రూపాలు కాగా ఎదంతాలు అర్వాచీన రూపాలు.

గద్దియ > గద్దె

**క్రీ.శ. 1101 నుండి 1600 వరకు కల సారస్వత భాష :**

**ధ్వనులు :**

అచ్చుల్లో తెలుగు వర్ణాలతో పాటు ఋ, ౠ, వర్ణాలు హల్లుల్లో ఖ, ఛ, ఠ, థ, ఫ, ఘ, ఝ, ఢ, ధ, భ, శ, ష లు సంస్కృత సమశబ్దాల ద్వారా తెలుగులో ప్రవేశించాయి. 'హ' కారం సంస్కృత కర్ణాటక పదాల ద్వారా తెలుగులో ప్రవేశించింది. ఙ, ఞ, ః లకు ప్రత్యేక వర్ణస్థాయి లేదు. జ్ఞానాది శబ్దాలలో 'ఞ' కారం సంయుక్త వర్ణంగా తెలుగులో ప్రవేశించింది. 'జ్ఞ' కు 'గ్న'

ఉచ్చారణ ఈ యుగభాషలో ఉంది. అందుకే అప్పకవి 'జ్ఞ' కారానికి 'క' కారంతో యతివేయవచ్చును అని 'విశేషవళి' పేర పేర్కొన్నాడు. ఋ, ఌ ప్రాచీనకాలంలో రి, లి లు గాను తర్వాతి కాలంలో రు,లు గాను క్రమంగా ఉచ్చరించబడేవి. 'ఋ -రి' యతి దీనిని నిరూపిస్తోంది.

"రు రువర్ణ దేహంబు ఋగ్వేదమునకు" అనే పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్ర ప్రయోగం.

"సప్త ఋషులైరి వారు మరుద్గణంబు" (భార. శల్య. 2-160) అనే తిక్కన ప్రయోగం ఋకారానికి రువర్ణోచ్చారణ ఉండేదని నిరూపిస్తున్నాయి.

రేఫ ఱకారోచ్చారణల మధ్య భేదం ఈ యుగాల్లో లోపించింది. "రాయి, ఱాయి. ముందర, ముందఱ" వంటి ద్విరేఫ ఘటితరూపాలు.

పల్లియ > పల్లె; కన్నియ > కన్నె
లొట్టియ > లొట్టె; తేనియ > తేనె
ఉట్టియ > ఉట్టె; మల్లియ > మల్లె
అయి > ఐ; అవు > ఔ

ఈ మార్పులు కావ్యభాషలో చోటుచేసుకున్నాయి. విలోమ విలేఖనం కూడా ఉంది.

సం. యౌవన- < య్వన (కుమారసంభవము 8-157)

రేఫ సంయుక్తాక్షరం గాకల శబ్దాలే కావ్యాలలో ప్రయోగించబడ్డాయి. రేఫ రహితంగా అంటే 'కొత్త' వంటి శబ్ద రూపాలు కావ్యాలలో లేవు.

**వర్ణ వ్యత్యయం :** వర్ణాలు పదాలలో మారటం.

"నావుడు నవ్వుటాలకనినంబవనాత్మజ . . . " (భార. ఉద్యోగ. 3-116)

'నవ్వులాట' పదసముదాయం వర్ణవ్యత్యయం కారణంగా 'నవ్వుటాల' గా మారింది.

అనవుడు (హర. 1-137) > నావుడు (శృం. శై. 5-71)
ఎలదీగ (శృంశై. 3-177)> లేఁదీగ (కాశీ. 3-239)
నారికేళము (భీమే. 2-53) > నాళికేరము (హర. 6-58)

**లోప దీర్ఘత :**

ఒక పదంలోని వర్ణం ఊనిక లోపం వల్ల లోపించినప్పుడు తత్పూర్వ స్వరం దీర్ఘమవుతుంది. దీన్నే లోపదీర్ఘత (Comfrensatory lengthening) అని అంటారు. ఈ యుగకావ్యభాషలో దీనికి అనేకోదాహరణలున్నాయి.

కడవసము (భీమే. 4-33) > కళాసము (శృం.నై. 6-115)
మొగసాల (కాశీ. 4-105) > మోసాల (కాశీ. 2-4)
సగము (హర. 4-25) > సాము (హర. 5-25)

**స్వరభక్తి** (Anastyscis) :

పదాలలోని సంయుక్తాక్షరాలలో ఒక సంయుక్త వర్ణానికి అచ్చు చేర్చి ఉచ్చారించటం వల్ల స్వరభక్తి ఏర్పడుతుంది.

కన్య (హర. 4-9) > కన్నియ (శృం.నై. 6-12)

నిద్ర (కాశీ. 1-127) > నిదుర (కాశీ. 3-22)

రాత్రి (కాశీ. 5-89) > రాతిరి (హర. 5-13)

**వర్ణ సమీకరణం** (Assimilation) :

రెండు భిన్న వర్ణాలు కలిసి ఒకే వర్ణంగా (సమీపవర్ణ ప్రభావం వల్ల) మారటం వర్ణ సమీకరణం. రెండు వర్ణాలూ ఒకే రకంగా మారి ద్విరుక్తి నొందుతాయి.

కొలది (హర. 4-18) కొద్ది (పల్నా. 25)

భక్తుఁడు (హర. 2-86) బత్తుఁడు (హర. 2-77)

**సంధి :**

పదంలో ప్రాతిపదికకు ప్రత్యయానికి మధ్య జరిగే సంధిని అంతస్సంధి (internal sandhi) అంటారు.

'రెండవ తీర్థము' (భీమే. 3-66)

< రెండు + -అవ

రెండు స్వతంత్ర పదాల మధ్య జరిగే సంధిని బహిస్సంధీ (external sandhi) అంటారు.

'అడియాస' (కాశీ. 2-111) < అడి + ఆస

'చదలేఱు' (శృం.నై. 3-6) < చదలు + ఏఱు.

సంధి కార్యంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి.

ఉత్తుకు అచ్చుపరమైతే సంధి నిత్యం.

| | | | | |
|---|---|---|---|---|
| కదలు + -ఇంచు | | > | కదలించు | (హర. 6-45) |
| జాల + -అరి | | > | జాలరి | (శివరాత్రి. 2-101) |
| నీవు + ఆడెదు | | > | నీవాడెదు | (హర. 7-57) |
| మేలు + ఓగిరము | | > | మేలోగిరము | (హర. 2-128) |

**అత్తుకు సంధి బహుళం :**

| | | | |
|---|---|---|---|
| మేనల్లుఁడు | (భీమే. 2-52) | < | మేన + అల్లుఁడు |
| వంటిల్లు | (భీమే. 3-51) | < | వంట + ఇల్లు |
| ఊరకు + ఉండె | (కాశీ. 4-228) | < | ఊరక + ఉండె |
| కోలుఁది కొని | (హర. 2-88) | < | కోల + ఊఁది కోని |
| ఎంతేని | (శృం.నై. 1-109) | < | ఎంత + ఏని |
| ఇంతొప్పునె | (శృం.నై. 1-144) | < | ఇంత + ఒప్పునె |

వినతయోటువడి (కాశీ. 6-54) < వినత + ఓటువడి

సంస్కృతీయానికి కూడా అత్వసంధి జరగటం విశేషం.

సీమటు (భీమే. 5-77) < సీమ + అటు

అది అని శబ్దాల అత్తుకు సంధి బహుళం.

నాది (హర. 2-55) < నా + అది
నాయది (భీమే. 2-120) < నా + అది
అట్టిది (కాశీ. 1-76) < అట్టి + అది
ఇట్టిది (శృం.నై. 3-144) < ఇట్టి + అది
ఎట్టిది (భీమే. 4-202) < ఎట్టి + అది

ప్రామాణిక కావ్యభాషలో క్త్వార్థమయిన ఇత్తుకు సంధి లేదు.

అరసియరసి (భీమే. 5-28) < అరసి + అరసి
నిండియున్నది (శృం. నై. 7-161) < నిండి + ఉన్నది

త్రికం మీది హల్లు ద్విత్వం కావటం త్రికం హ్రస్వం కావటం ఈ యుగంలో చోటుచేసుకొంది. ఇది వైకల్పికం.

అక్కన్నియ (శృం.నై 3-128) < ఆ + కన్నియ
అవ్వేళ (హర. 3-82) < ఆ + వేళ
ఆవేళ (కాశీ. 2-243) < ఆ + వేళ

ఊష్మ రేఫాలకు ద్విత్వహ్రస్వాలు రావు.

ఈ రహస్యంబు (భీమే. 6-41) < ఈ + రకస్యంబు
ఆ శశాంకవదన (శృం.నై. 5-191) < ఆ + శశాంకవదన
ఆ హరిణాక్షి (శృం.నై. 6-8) < ఆ + హరణాక్షి

ద్రుత నకారానికి అచ్చుపరమైతే ద్రుతానికి ద్విత్వం వస్తుంది.

వినిపించెన్నశరీర భారతి (భీమే. 2-123) < వినిపించెన్ + అశరీరభారతి
దక్ష వాటికిన్న నిచిన (భీమే. 6-10) < దక్షవాటికిన్ + అనిచిన

ధ్వన్యనుకరణ శబ్దాలకు 'అను' ధాతువు పరమైనపుడు రుగాగమం రావటం ఈ యుగంలోని విశేషం.

బుస్సురనఁగ (హర. 5-16) < బుస్సు + అనఁగ

**పదాంశ విజ్ఞానం :**

లింగ వచన ప్రత్యయాల విషయంలో శాసన కావ్యభాషలలో పెద్ద భేదం లేదు.

తెలుగు భాషలోని పెక్కు ధాతువులు ధాత్వర్థంలోను నామార్థంలోను ఏవిధమయిన ప్రత్యయం చేరకుండా యధాతథంగా ప్రయోగించబడుతున్నాయి.

| ధాతువు | అర్థం | ప్రయోగం | నామార్థం | ప్రయోగం |
|---|---|---|---|---|
| అంటు | కలియు | (కాశీ. 3-32) | మురికి | (క్రీడా. 42) |
| అలరు | కలుగు | (హర. 3-74) | పుష్పం | (క్రీడా. 212) |
| ఉఱుము | గర్జించు | (హర. 2-19) | గర్జన | (భీమే. 3) |
| ఒప్పు | ప్రకాశించు | (హర. 2-3) | కాంతి | (శృం.నై. 6-82) |
| కదలు | చలించు | (కాశీ. 2-32) | చలనం | (కాశీ. 3-84) |
| చదువు | పఠించు | (కాశీ. 4-199) | విద్య | (హర. 5-32) |
| వెలుఁగు | ప్రకాశించు | (హర. 4-52) | ప్రకాశం | (శృం.నై. 7-169) |

ధాతువుకు కొన్ని కృత్ప్రత్యయాలు చేరటం వల్ల కృద్రూపాలేర్పడతాయి.

-అ

అలుక (శృం.నై. 8-72) < అలుగు + -అ

పాట (హర. 4-11) < పాడు + -అ

-అడ

కట్టడ (భీమే. 5-77) < కట్టు + -అడ

-ఇ

చేయి (శృం.నై. 1-28) < చేయు + -ఇ

-అవు

తగవు (శృం.నై. 8-55) < తగు + -అవు

## తద్ధిత రూపాలు :

నామాల నుండి నిష్పన్నమయిన నామవాచకాలను తద్ధితరూపాలని వ్యవహరిస్తారు. తద్ధిత ప్రత్యయాలు స్వార్థంతో లేదా త్యార్థ భావార్థ మతుబాద్యర్థాల్లో నామాలకు చేరతాయి.

## మతుబర్థం :

చెలువ (శృం.నై. 2-13) < చెలువు + -అ

## స్వార్థం :

ఇఱు కటము (శృం.నై. 4-124) < ఇఱుకు + -అటము

చెలువము (శృం.నై. 6-39) చెలువు + -అము

మతుబర్థంలో -అరి

నేర్పరి (శివరాత్రి. 1-22) < నేర్పు + -అరి

తెరువరి (కాశీ. 1-92) < తెరువు + -అరి

మతుబర్థంలో -ఆలు

ఇల్లాలు (హర. 7-125) < ఇల్లు + -ఆలు

బావార్థకంలో -ఇమి

చెలిమి (శృం.నై. 3-159) < చెలి + ఇమి

వేఁడిమి (శివరాత్రి. 3-28) < వేఁడి + -ఇమి

పరిమాణార్థంలో -ఎఁడు

చిప్పెఁడు (హర. 6-128) < చిప్ప + -ఎఁడు

తూమెఁడు (హర. 1-17) < తూము + ఎఁడు

మతుబర్థంలో -కత్తియ / -కత్తె తద్ధిత ప్రత్యయాలు

కటారి - కత్తియ (క్రీడా. 92)

కుంటె న కత్తియ (క్రీడా. 274)

అపాణినీయ ప్రయోగాలను శ్రీనాథాది కవులు ప్రయోగించారు.

బృహస్పతి శబ్ద సామ్యం వల్ల గీష్పతి రూపాన్ని రూపొందించి శ్రీనాథుడు ప్రయోగించాడు.

"గీష్పతి యేమి చెప్పెన్" (శృం.నై, 4-28)

గీః పతి, గీర్పతి శబ్దాలు మాత్రం పాణిని సమ్మతాలు

**ముష్టా ముష్టి :**

ముష్టితో ముష్టిని తీసుకొని పోరాడటం 'ముష్టాముష్టి' అని శ్రీనాథుడు ప్రయోగించాడు.

"ముష్టాముష్టిని బాహాబాహిఁగచాకచి" (కాశీ. 5-150)

'ముష్టీ ముష్టి' అనేదే పాణిని సమ్మతిని పొందిన శబ్ద సంపుటి.

కన్యాసంతానం అనే అర్థంలో "కన్యాయాః కనీన చ" అనే పాణిని సూత్ర ప్రకారం కానీన శబ్దం ఏర్పడుతుంది. తెలుగులో 'కానీనుఁడు' అని ప్రయోగించాలి. కాని శ్రీనాథుడు 'కానినేయుఁడు' అని ప్రయోగించాడు.

"కాశికాపట్టణము మీఁద గానినేయ" (భీమే. 2-144)

ప్రౌఢి, ప్రౌఢత్వ శబ్దాలే తద్ధిత రూపాలుగా సంస్కృతంలో ఉన్నాయి; కాని ప్రౌఢిమ శబ్దం సంస్కృతంలో లేదు. కాని తెలుగులో శ్రీనాథుడు ప్రౌఢిమ శబ్దాని ప్రయోగించాడు.

"గంభీర వాక్ప్రౌఢిమన్" (శృం.నై. 1-12)

ఈ యుగ కావ్యభాషలో కొన్ని వ్యావహారిక ప్రయోగాలు కన్పిస్తున్నాయి.

"ఇరువై నాలుగు మూళ్లమేర" (కాశీ. 1-53)

"ఇరువది నాలుగు మూరలమేర" అనేది గ్రాంథికం.

"ఎంత జడుఁడైన ఁగానీ' (శృం.నై. 6-23)

"ఎంత జడుఁడైన ఁగానిమ్ము" అనేది గ్రాంథికం.

"మోహింపఁజేతురు" (శృం.నై. 2-88)

"మోహింపఁజేయుదురు" అనేది గ్రాంథికం.

"వినీ వినని భంగి" (శృం.నై. 6-33)

"వినియును వినని భంగి" అనేది గ్రాంథికం.

"అంతామిథ్య తలంచి చూచిన" (కాళహస్తీశ్వర శతకం)

'అంతయు' అనేది గ్రాంథిక రూపం.

ఈ యుగంలో అనేక అన్యదేశ్య పదాలు తెలుగు కావ్యాలలో ప్రవేశించాయి.

"త్రాసులంబోని చిత్తంబుల తోడు తఁ

బ్రజవివివాదము లెడ భయములుడిగి"

(భార. శాంతి. )

అని తిక్కన పారస తరాజు శబ్దం నుండి వచ్చిన 'త్రాసు' ను తన భారతంలో ప్రయోగించారు. 'తరాజు' శబ్దం కూడా తర్వాతి కవులచే ప్రయోగించబడింది.

"ఖుసిమీఱన్ సురథాణి నిండుకొలువై కూర్చున్నచో" (హర. 1-22) అని శ్రీనాథ ప్రయోగం.

ఖుసి (సంతోషం) < పారసి. ఖుసీ

సురధాణి < అరబీ సుల్తాన్

మహమ్మదీయుల తోడి సంపర్కం వల్ల తెలుగులో అనేక పారసీ అరబీ (ఉర్దూ) పదాలు ప్రవేశించాయి.

ఈ పదాలలో "అపరంజి, అరబీ, అసివారు, కాగితము, కుల్లా, గులాము, జబ్బు, తేజీ, బాజారు, బిబ్బీ, రోజు, లాహిరి, మసీదు, సేబాసు, హద్దు" పదాలు ఈ కోవకు చెందాయి.

రావు, బిడారు, సొగటాలు మొదలయిన పదాలు తెలుగులో ప్రవేశించాయి.

**క్రియలు :**

'ఎదురు' (కు.సం. 4-46) అని నన్నిచోడుడు ప్రయోగించగా అనంతర కవులు ఎదిరించు అని ప్రయోగించారు.
'తెప్పిరు' (కు.సం. 10-10) అని కుమారసంభవ ప్రయోగం ఉండగా తర్వాతి కవులు 'తెప్పిరిల్లు' అని ప్రయోగించారు.
వలయు వంటి క్రియలు తిక్కనాదులు ప్రధాన క్రియలుగా వాడగా ప్రబంధ కవులు సహాయ క్రియలుగా వాడారు.
"ఏమి వలతు నీవడుగు మనిన" (కు.సం. 1-70)
"పోయిరావలయు మాకు" (భార. ఉద్యో. 1-42)
క్రియలు సంపూర్ణాలు అసంపూర్ణాలు అని రెండు రకాలుగా ఉన్నాయి.

**సంపూర్ణ క్రియలు :**

భూతకాలం : -ఇ- / -ఇతి- / -టి - / -ఎ -

'చేసిరి' (హర. 7-62)

< చేయు + -ఇ- + -రి-

'ఇచ్చితిని' (భీమే. 5-81) < ఇచ్చు + -ఇతి- + -మి

'పోయితిరి' (శృం.నై. 7-103) < పో + -ఇతి- + రి

'కంటిని' (హర. 1-9) < కను + -టి- + ని

'వింటిని' (భీమే. 2-120) < కను + -టి- + ని

క్త్వార్థకం : -ఇ

'చేసి' (భీమే. 4-24) < చేయు + -ఇ

'తెలిసి' (శృం.నై 3-41) < తెలియు + -ఇ

శత్రర్థకం : -చున్

'అనుచున్' (శృం.నై. 3-141) < తెలియు + -ఇ

'చేయుచున్' (శృం.నై. 5-27) < చేయు + -చున్

మిగిలిన క్రియా ప్రయోగాలు ఈ యుగ శాసనాలలోలాగే కావ్యాలలో కూడా ఉన్నాయి.

**వాక్యాలు :**

సామాన్యవాక&యం (Simple Sentence), సంశ్లిష్ట వాక్యం (Complex Sentence), సంయుక్త వాక్యం (Compound Sentence) అని వాక్యాలు మూడు విధాలుగా ఆంగ్ల వ్యాకరణ పద్ధతిననుసరించి తెలుగు వాక్యాన్ని విభజించారు.

**సామాన్యవాక్యం :**

ఇందులో ఒకే సమాపకక్రియ ఉంటుంది. క్రియావిరహితంగా కూడా వాక్యం ఉండవచ్చు.

"నీవు తుంబురుడవు" (హర. 2-138)

"అవ్వీర మహేశ్వరు నాకుంజూపవలయు" (హర. 2-14)

**సంశ్లిష్ట వాక్యం :**

రెండు క్రియలున్న వాక్యం సంశ్లిష్ట వాక్యమవుతుంది. వీటిలో ఒకటి అసమాపకక్రియ ఔతుంది.

"భూభువనంబు భరియింపనివాఁడు, భుజంగమ
శేఖరుండు మృగాల పేశలంబగు' ఫణామండ
లంబున విడి భరింప సమర్థుండగునే? (హర. 4-63)

**సంయుక్తవాక్యం :**

రెండు వాక్యాలు కలిగిన ఏకవాక్యం సంయుక్త వాక్యం.

"నామై సెమర్చుటకుంగారణంబు సెప్పెద నాకర్ణింపుము" (హర. 1-26)

ప్రాఙ్నన్నయ నన్నయ యుగభాషలలోని భాషా విశేషాలను పరిశీలించిన తర్వాత ఈ యుగ (క్రీ.శ. 1101 నుండి 1600) శాసన కావ్యభాషా విశేషాలను గమనించి భేద సాదృశ్యాలను తెలుసుకున్నాం.

**ప్రశ్నలు :**

1. మధ్యయుగాంధ్ర (క్రీ.శ. 1101 నుండి క్రీ.శ. 1600) శాసనభాషలోని విశేషాలను వివరించండి.
2. మధ్యయుగాంధ్ర (క్రీ.శ. 1101 నుండి క్రీ.శ. 1600) సారస్వత భాషలోని విశేషాలను వివరించండి.
3. మధ్యయుగాంధ్ర (క్రీ.శ. 1101 నుండి 1600) భాషలోని భాషా విశేషాలను విశేషాలను వివరించండి.
4. ఆంధ్రభాషా పరిణామం మధ్య యుగాంధ్రంలో ఏవిధంగా జరిగిందో సోదాహరణంగా వివరించండి.

**ఆధారగ్రంథాలు :**


అనంతరామశాస్త్రి, నేతి. 1982. శ్రీనాథ భాషా పరిశీలన, అరుణా పబ్లికేషన్స్, బి-82, పట్టాభిపురం, గుంటూరు 522 006.

కృష్ణమూర్తి, భద్రిరాజు, 2000, తెలుగు భాషాచరిత్ర, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాదు - 4.

Ranganadhacharyulu, K.K. 1987. A Histrorical Grammar of Inscriptional 'Telugu, Centre of Advanced Study in Linguistics, Hyderabad - 7.


-

పాఠం - 15

# ఆధునిక తెలుగు భాష : 1801 నుంచి నేటి వరకు

**పాఠ్యాంశ నిర్మాణ క్రమం :**

15.1 పరిచయం
15.2 వర్ణాలు
15.2 ఇతర భాషల నుంచి వచ్చి చేరిన హల్లులు
15.3 వర్ణసంయోజన నియమావళి
15.4 సంధి
15.5 నామవాచకం
15.6 ప్రాతిపదికలు
15.7 లింగ ప్రత్యయ సహిత ప్రాతిపదికలు
15.8 లింగం
15.9 వచనం
15.10 విభక్తులు
15.11 ఔపవిభక్తులు
15.12 సర్వనామాలు
15.13 సంఖ్యా వాచకాలు
15.14 క్రియలు
15.15 వాక్య నిర్మాణం

**లక్ష్యం :**

క్రీ.శ. 1801 నుంచి నేటి వరకు వాడుకలో ఉన్న తెలుగు భాషా స్వరూపాన్ని వివరించటం.

15.1.0 ఏదయినా ఒక భాషలో వచ్చిన మార్పుల్ని తెలుసుకోవాలంటే ముందుగా ఇతర భాషల నుంచి వచ్చి చేరిన శబ్దజాలం లేదా పదజాలాన్ని వేరుచేసి చూడాలి. చారిత్రక నేపథ్యాన్ని బట్టి చూసినప్పుడు తెలుగు భాషమీద సంస్కృతం, ప్రాకృతం, ఉర్దూ, అరబిక్, పారశీక భాషలే గాక, సజాతీయ భాషలయిన తమిళ, కన్నడాది భాషలు, భౌగోళికంగా సమీపవర్తి అయిన మరాఠీ, హిందీ, ఒరియా భాషలు, ఇంకా వ్యాపార నిమిత్తమై వచ్చి భారతదేశంలో ఉండిపోయిన ఆంగ్లం, ఫ్రెంచి, డచ్, పోర్చుగీసాది భాషల ప్రభావం కనిపిస్తుంది. పయిన పేర్కొన్న భాషలలోని శబ్దజాలం ఎంతో తెలుగులోకి వచ్చి చేరింది.

సంస్కృతాది భాషల నుంచి ఆవిధంగా వచ్చిచేరిన పదజాలం కొంత అంతకుముందే ఉన్న మాటలతో వేరుచేసి చూపించలేనంతగా కలసిపోయాయి. మరికొంత వేరుగా ఉండిపోవడం జరిగింది. వేరుగా ఉన్న మాటల్ని తత్సమాలనీ, కలసిపోయిన వాటిని తద్భవాలనీ అన్నారు. ఆధునిక తెలుగులోని ధ్వనుల నిర్మాణాన్ని సమగ్రంగా పరిశీలించాలంటే దేశ్యశబ్దాల్ని అన్య భాషా

శబ్దాల నుంచి వేరుచేసి చూడాలి. అలాంటప్పుడు మాత్రమే ఏ ధ్వనులు తెలుగుకు సహజ పరిణామ సిద్ధాలో, ఏవి అన్య త్రావచ్చి చేరాయె తెలుసుకోవటం వీలుపడుతుంది.

## 15.2.0 వర్ణాలు :

ఇప్పటి తెలుగులో దేశ్యభాగాన్ని, తద్భవ భాగాన్ని మాత్రమే దృష్టిలో ఉంచుకొని పరిశీలిస్తే వర్ణవిభాగం ఇలా ఉంటుంది.

## 15.2.1 అచ్చులు :

| | పురస్ | కేంద్ర | పశ్చాత్ |
|---|---|---|---|
| అగ్ర | ఇ ఈ | | ఉ ఊ |
| మధ్య | ఎ ఏ | | ఒ ఓ |
| అధస్/నిమ్న | ఏ | అ ఆ | |

15.2.3. హల్లులు :

| | | ఓష్ఠ్యాలు | దంత్యాలు | దంతమూలీయాలు | మూర్ధన్యాలు | తాలవ్యాలు | హనుమూలీయాలు |
|---|---|---|---|---|---|---|---|
| స్పర్శాలు | శ్వాసాలు | ప | త | | ట | | క |
| | నా దాలు | బ | ద | | డ | | గ |
| స్పృష్టోష్మాలు | శ్వాసాలు | | | | | చ | |
| | నాదాలు | | | | | జ | |
| ఊష్మాలు | | | | స | | | |
| అనునాసికాలు | | మ | న | | ణ | | |
| పార్శ్వికాలు | | | | ల | ళ | | |
| కంపితాలు | | | | ర | | | |
| అంతస్థాలు | | వ | | | | య | |

## 15.2.4. ఇతర భాషల నుంచి వచ్చి చేరిన హల్లులు :

| | | | | |
|---|---|---|---|---|
| ఫ | థ | ఠ | ఛ | ఖ |
| భ | ధ | ఢ | ఝ | ఘ |
| ఫ (F) | | ష | శ | హ |
| | | | ఞ | ఙ |

పైన పేర్కొన్న వాటిలో ఒక్క 'ఫ' తప్ప మిగిలిన వర్ణాలన్నీ సంస్కృత, ప్రాకృత, హిందీ వంటి హింద్వార్య భాషలనుంచి వచ్చి చేరాయి. 'హ' కారం మాత్రం కన్నడం నుంచి వచ్చిన మాటల్లో కూడా ఉంది.

ఉదా: హత్తు, హెచ్చు, హోన్ను, మొదలయినవి.

నలభై, యాభై, డెభ్భై, ఎనభై మొదలైయిన మాటల్లోని మహాప్రాణాలకు మూలం ఏదో చెప్పడం కష్టం. కారణం వీటిలో ఉన్న మహాప్రాణత్వానికి ఇతర భాషల ప్రభావం ఉందనడానికి సరయిన ఆధారాలు లేవు.

ఏదో కొన్ని వర్గాలలో తప్ప చదువుకున్న వారిలో అయినా తెలుగువారి ఉచ్చారణలో మహాప్రాణోచ్చారణ తక్కువే. కంఠం,శుంఠ లాంటి కొన్ని మాటలలో తప్ప మిగిలినవి కావ్యభాషకే పరిమితమయినట్లు కనిపిస్తుంది.

ఉదా: ఠావు, ఠేవ, ఛత్రము, ఛాత్రుడు, ఝషము, ఝంకారము మొదలైన తెలుగు భాషలో మహాప్రాణోచ్చారణకు అర్థభేదక సామర్థ్యంలేదు. మహాప్రాణాలున్న మాటల్ని అల్ప ప్రాణాలుగా ఉచ్చరించినా అర్థావగాహనకు లోటురాదు. ఆయావ్యక్తుల సాంఘిక, సాంస్కృతిక, విద్యాది ఔన్నత్యాన్ని సూచించడానికి మహాప్రాణోచ్చారణ ఉపకరిస్తుంది.
తెలుగులిపిలో కనపడే శషసలలో ఒక్క 'స' మాత్రమే ప్రాచీన భాషల నుంచి వచ్చింది. కాగా శ, షలు సంస్కృతం, హిందీ నుంచి తెలుగులోకి వచ్చాయి. 'శ' వర్ణానికి నిర్దిష్టమయిన ఉచ్చారణ తెలుగులో అతి తక్కువగా వినిపిస్తుంది. అతి కొద్దిమంది ఉచ్చారణలో మాత్రం ఓష్ఠ్యాచ్చుల ముందు ఇది వినిపిస్తుంది.

ఉదా: శుక్రవారం, శనివారం, శుభ్రం, త్రిశూలం, శోభనం, శోభ

ఫ ఉర్దూ, ఆంగ్లం నుంచి వచ్చిన మాటలలో వినిపిస్తుంది.

ఉదా: ఫసిలీ, ఫైసలు, కైఫీయత్తు , కాఫీ, ఆఫీసు

అచ్చుల విషయంలో ఇతర భాషల నుంచి తెలుగులోకి వచ్చి స్థిర పడ్డవి కనిపించవు. అయితే వివృతమయిన ఏ మాత్రం గుర్తించదగనంతగా చాలామంది వ్యవహారంలో ఉంది.

ఉదా: bank, bat, mat, ban, cash, cap, glass. మొదలుగున్నవి.

తెలుగులో తాటాకు, మేక మొ॥న భూతకాలసమాపక క్రియలలోనూ కనిపిస్తుంది. వివృతాచ్చయిన ఏ ని ప్రత్యేకవర్ణంగా గుర్తించాలనే వారి సంఖ్యే ఎక్కువ. దీనిని ప్రత్యేక వర్ణంగా గుర్తిస్తే మరికొన్ని వర్ణాల్ని గుర్తించాల్సిన అవసరం ఉందనే వారు కూడా ఉన్నారు. ఆధునికులు అనేక మంది వాడడం చేత దీనిని ప్రత్యేక వర్ణంగా గుర్తించడమే భావ్యంగా ఉంటుంది.

## 15.3.0 వర్ణ సంయోజన నియమావళి :

ఏభాషను పరిశీలించినా అన్ని వర్ణాలూ, అన్ని పరిసరాలలోనూ రావు. కొన్ని రకాల సంయోజనాలు మాత్రమే సాధ్యమవుతాయి. తెలుగు భాషా విషయంలో య,ణ,ళ అనే వ్యంజనాలు పదాదినరావు. (యాభై, యాస, యాలుక - దీనికి అపవాదాలు) ట వర్ణం పదాదిన చాలా అరుదు 'డ వర్ణం కొన్ని మాటలలో కనిపిస్తుంది.

ఉదా: టక్కరి, టెక్కు, టెంకాయ, టెంకె
డేకు, డోకు, డబ్బు, డెక్క, డేగ, డెబ్బై

పదాది 'వ' వర్ణం తర్వాత ఓష్ఠ్యేతర అచ్చులే వస్తాయి.
ఉదా: వల, వాడు, విల్లు, వీలు, వెన్న , వేట

పదాదిలో ద్విరుక్త , సంయుక్త వ్యంజనాలు ఉండవు. ప్రాచీన భాషలో వర్ణవ్యత్యయంవల్ల ఏర్పడ్డ క్రంత, త్రిప్పు, ప్రాను, క్రొత్త, ప్రాత, క్రింద, బ్రతుకు లాంటి మాటలలో రెండో వ్యంజనమయిన రూఫ ఆధునిక తెలుగు భాషలో పోయింది. (కొంతమంది వ్యవహారంలో అరుదుగా ఉండవచ్చు వ్రాత, వ్రాలు రాత, వాలుగా మారిపోయి చేవ్రాలు దీనికి అపవాదుగా మిగిలింది)

ధాతువుల్లో మొదటి అక్షరంలో మాత్రమే దీర్ఘాచ్చు ఉంటుంది. అంటే పదమధ్యంలో గానీ, పదాంతంలో గానీ దీర్ఘాచ్చు ఉండదు.

నామాలలో జంతు, పక్షి, వృక్ష, నగర వాచక శబ్దాలలో మాత్రమే ఏ, ఓ లు మధ్యాచ్చుగా కనిపిస్తాయి. అబ్బాయి, అమ్మాయి అనే మాటలలోనూ, తల్లాడ, మంటాడ మొదలైన గ్రామనామాల్లోనూ 'ఆ' మధ్య స్వరంగా కనిపిస్తుంది. తాబేలు, కుందేలు, పొటేలు, నేరేడు, మారేడు, పూరేడు, తంగేడు, గన్నేరు, పల్లేరు, నల్లేరు మొదలైనవి ఉన్నాయి. అయితే -ఏ లు జంతువాచక శబ్దంగానూ, -ఏరు, -ఏడు లను వృక్ష వాచక శబ్దాలుగానూ భావిస్తున్నారు. అయితే వీటిని నిరూపించడం కొంత ప్రయాసతో కూడుకున్న విషయం. ఒకప్పుడు ఇవి బిన్న శబ్దాలు కావచ్చు. నేటి వ్యవహర్తలకు ఇలాంటి పరిజ్ఞానం ఉందని చెప్పడం కష్టం. ఒంగోలులో లు-ఓ లు ప్రోలు కు రూపాంతరంగా భావించడం జరిగింది.

దీర్ఘాచ్చు తర్వాత ద్విరుక్తవ్యంజనం ఉండదు. కొన్ని బంధు వాచక శబ్దాలు దీనికి అపవాదులుగా కనిపిస్తున్నాయి.

ఉదా: నాన్న, అమ్మ

త్ర= పాత్రం. దీని రూపాంతరం పొత్తరం.-ండ్ర= తండ్రి, కొండ్ర మాటల్లోని 'డ్ర' ని 'ణ్ర' అనే సంయోగంగా గ్రహిస్తే మూడు వ్యంజనాల సంయోజనం తెలుగులో లేదని చెప్పవచ్చు.

మూడచ్చుల మాటల్లో చివరి అచ్చు నిరోష్ఠ్యమయితే మధ్యాచ్చు నిరోష్ఠ్యం. చివరి అచ్చు తాలవ్యేతరమయితే మధ్యాచ్చు తాలవ్యేతరమూ అవుతుంది. 'అ' వర్ణం తాలవ్యేతరమూ, నిరోష్ఠ్యమూ, మిగిలిన శబ్దాల్లో మధ్య అచ్చు అ,ఇ,ఉ లలో ఒకటి మాత్రమే గాక 'ఏ' వర్ణం కూడా ఉంటుంది. అయితే 'ఓ' వర్ణం మాత్రం ఉండదు.

| అచ్చు1 | అచ్చు2 | అచ్చు3 |
|---|---|---|
| | ఇ అ | ఇ ఎ అ |
| | ఉ అ | ఉ అ |

ఉదా: పొడుగు, కుడితి, ములికి, గాడిద, ఎలికె

ధాతువుల్లో దీర్ఘాచ్చు మొదటి అక్షరంలోనే ఉంటుంది. చివరి అచ్చు 'ఉ' వర్ణేతరం ఉండదు. మధ్యాచ్చులు ఇ, అ, ఉ లు మాత్రమే ఉంటాయి.

ఏక శబ్దంలో స,ణ వర్ణాలకు ద్విత్వం లేదు. కస్సు, బుస్సు అనే ధ్వన్యనుకరణాలకు శబ్ద పరిగ్రహణ జరగలేదు. 'ణ' కు ద్విత్వం కొన్ని మాటలలో కనిపిస్తుంది. గొణ్ణెం, దణ్ణం దణ్ణెం వంటి కొన్ని మాటల్లో కనిపిస్తుంది. కళ్ళెం, కళ్ళు, గొళ్ళెం, పళ్ళెం, తాళ్ళు, కళ్ళు, పళ్ళు వంటి నామాలు, కుళ్ళు, తుళ్ళు, మళ్ళు, వెళ్ళు వంటి క్రియలలో తప్ప 'ళ' వర్ణ ద్విత్వం కూడా కనిపించదు. బహుశః ఇవి ఆధునిక కాలంలో ఏర్పడ్డ రూపాలు కావచ్చును.

ద్విరుక్తవర్ణాలు మొదట హ్రస్వాచ్చు తర్వాతే ఉంటాయి. పయిన చెప్పిన నియమావళి ఏక శబ్ద పరిమితికి మాత్రమే వర్తిస్తాయి.

## 15.4 సంధి :

త్వరిత ఉచ్చారణ జరిగేటప్పుడు అవ్యవహితంగా వచ్చిన శబ్దాలలో జరిగే ధ్వనుల మార్పిడిని సంధి ఉంటారు. వ్యవహిత ఉచ్చారణలో సంధి చేయవలసిన పని ఉండదు. తెలుగులో సంధి కార్యాలు జరిగేటప్పుడు స్వరలోపమూ, దాని ఫలితంగా దగ్గరగా వచ్చిన వ్యంజనాలలో సమీకరణాది మార్పులు జరుగుతాయి.

ఒక దాని కొకటి దగ్గరగా వచ్చిన రెండు అచ్చులలో మొదటి హ్రస్వాచ్చు లోపిస్తుంది.

ఉదా : బండి+ అంతా = బండంతా
కోడి+అది = కోడది
వచ్చి+ఉంటాడు = వచ్చుంటాడు

దీర్ఘస్వరాంత రూపాలకు తాలవ్యాచ్చులు పరమయితే 'య', ఓష్ఠ్యాచ్చులు పరమయితే 'వ' ఆగమంగా వస్తాయి.

ఉదా: మా+ఇల్లు = మాయిల్లు
మా+ఊరు = మావూరు

రెండు సమవ్యంజనాలలో పూర్వవ్యంజనం ల, నలలో ఒకటయి, పరవ్యంజనం దంత్య, దంతమూలీయ, తాలవ్య, మూర్థన్య వర్ణాలలో ఒకటయినప్పుడూ, పూర్వ్యంజనం మూర్థన్యమయి పరవ్యంజనం దంతమూలీయమయినప్పుడు, పరవ్యంజనం దంత్యమయి పరవ్యంజనం స్పృష్టోష్మమయినప్పుడూ (చ జ) మధ్యన ఉన్న హ్రస్వాచ్చుకు లోపంవస్తుంది.

ఉదా: చేప+పిల్ల = చేప్పిల్ల | పిరికి+గుండె = పిరిగ్గుండె
కాలి+తో = కాల్తో | తల+నూనె = తల్నూనె
మూట+లో =మూట్లో | వాడి+ని = వాణ్ణి
పాత+చెప్పు = పాచ్చెప్పు | కొత్త+చీర = కొచ్చీర

అచ్చుకు లోపం జరిగిన తర్వాత చ జ ల పరంగా ఉంటే దానికి ముందున్న త, ద లు కూడా చ జ లుగా మారతాయి. రెండో హల్లు శ్వాస మయితే మొదటి హల్లు శ్వాసంగానూ, నాదమయితే నాదం గానూ మారుతుంది. న,ల లు మూర్థన్యవర్ణ సంయోజనలో (పూర్వమయినా, పరమయినా) మూర్థన్య వర్ణాలుగా మారతాయి.

ఉదా: పాత+జగ్గు = పాజ్జగ్గు
కొత్త+తట్ట=కొత్తట్ట
ఇరుకు+గది = ఇరుగ్గది
నీడ+లో = నీళ్ళో

సంధి జరగడానికి వీలున్న రెండు పరిసరాలు వెంటవెంటనే ఉండి సంధి జరిగితే కొన్ని చోట్ల మూడు హల్లుల సంయోగం ఏర్పడుతుంది. అలాంటి చోట్ల పరసంధిముందుగా జరిగి పరసంధిని నిరవకాశం చేస్తుంది.

ఉదా: మాటలు+రావు = మాటల్రావు
గుడ్డలు + లేవు = గుడ్డల్లేవు

కొన్నిచోట్ల పూర్వపరసంధులలో ఏదయినా జరగవచ్చు.
కారు+లు+లో = కారుల్లో / కార్లలో

ద్విరుక్తవ్యంజనం ఇంకోవ్యంజనం ముందు అద్విరుక్తమవుతుంది.
చెట్టు+లు = చెట్లు | గుడ్డు+లు = గుడ్లు
తొట్టి+లు = తొట్లు | మట్టి + లో = మట్లో

## 15.5 నామవాచకం :

వాక్యంలో కర్తగానీ, కర్మగానీ ప్రయోగించ దగిన శబ్దాల్ని నామవాచకాలని స్థూలంగా చెప్పవచ్చు. వాస్తవానికి సంఖ్యా వాచకాలూ, సర్వనామాలూ నామవాచకాలనే పెద్ద సముదాయంలో అంతర్విభాగాలు. ఇవి గాక క్రియలమీద కృత్ప్రత్యయాలు చేర్చడం వల్ల ఏర్పడిన కృదంతాలు కూడా నామవాచకాలలో ఒక విభాగం అవుతాయి. ఆధునిక తెలుగులో నామవాచక పద నిర్మాణం.

ప్రాతిపదిక+(బహువచనప్రత్యయం)+(ఔపవిభక్తికం)+(విభక్తిప్రత్యయం లేక విభక్త్యర్థక శబ్దం) అనే విధంగా ఉంటుంది. బ్రాకెట్లలో ఇచ్చిన ప్రత్యయాలు విభాషగా అంటే వ్యవహర్త ఇష్టానుసారంగా ప్రాతిపదికకు చేరతాయి.

## 15.6.0 ప్రాతిపదికలు :

కృదంతప్రాతిపదికలు: క్రియకి ఒక ప్రత్యయం చేర్చడం ద్వారా ఏర్పడిన నామవాచకాల్ని కృదంతాలంటారు. నామప్రాతిపదికలలో చాలావరకు నీరు, కాలు, ఎద్దు, అన్న మొదలైన ఏక పదాలుగానే ఉంటాయి.

భావార్థక ప్రత్యయాలు : అటం/- అడం చేరడంవల్ల నామవాచకాలవుతాయి.

చెప్పటం, చెయ్యటం, కొనడం, వినడ మొదలైనవి.

అలాగే -క, -ఇమి, -త, -కువ, -ట, -టు, -పము, -ంత, -వు, -బడి, -గడ, -ఇకి, -వు, -అ, -అకము, -డు, -వడి, -వి, -అవు, -అవు, -ఇ, -కలి మొదలయిన ప్రత్యయాలు చేరి నామవాచకాలవుతాయి.

## 15.7.0 లింగ ప్రత్యయ సహిత ప్రాతిపదికలు :

నామ ప్రాతిపదికలలో లింగప్రత్యయాలు అరుదుగానే ఉంటాయి. నామవాచకం లింగం అర్థం వల్లనే తెలుస్తుంది. పురుష వాచక ప్రత్యయం: -డు, తమ్ముడు, మనవడు, అల్లుడు మొదలైనవి.

స్త్రీవాచక ప్రత్యయాలు : -అలు, -ఆలు, -ఇ, -త్తె

కోడలు, చెలియలు (చెల్లెలు), మనుమరాలు, చూలాలు, బాలెంతరాలు, వగలాడి, కులుకులాడి, ఆటకత్తె, అందగత్తె మోసగత్తె.

## 15.8 లింగం :

సాధారణంగా మహద్వాచకాలకి ఒక బహువచన ప్రత్యాయమూ, అమహద్వాచకాలకి వేరొక బహువచన ప్రత్యయమూ ఉన్నాయి. బహువచన ప్రత్యయంలో బహువచనార్థమే గాక లింగభేదం కూడా అంతర్లీనమయి ఉండడం చేత ఒక్కోచోట లింగవచనాలని కలిపి చర్చించడం జరుగుతుంది. ఆధునిక తెలుగులోని లింగం మహద్వాచకాలు, అమహద్వాచకాలని రెండు విధాలు.

తెలుగులో నామవాచకం లింగాన్ని అనుసరించి దానితో సంబంధించిన సర్వ నామంగానీ, సమాపక క్రియగానీ, ఆఖ్యాత సర్వనామం గానీ, మారుతూ ఉంటుంది. నామవాచకంలో లింగం దాని అర్థం వల్లే తెలుస్తుంది. గాని నామవాచకంలో లింగ ప్రత్యయాలు సాధారణంగా ఉండవు.

తమ్ముడు, అల్లుడు, మనవడు లాంటి పదాలలో 'డు' ప్రత్యయం ఉన్నా అన్న, తండ్రి, కొడుకు లాంటి పదాలలో లింగప్రత్యయంలేదు. అయినా ఈ పదాలు అర్థం ఆధారగానే మహత్తులుగా పరిగణించబడతాయి. జంతువులలో లింగభేదాన్ని విశేషణాల ద్వారా సూచించవచ్చు. ఆడకుక్క, మగ సింహం మొదలైనవి. అయితే క్రియారూపంలో ఈ భేదం కానరాదు (సీత వచ్చింది, ఆవు వచ్చింది మొదలైనవి) సర్వనామాలలో స్త్రీలని సూచించే ఆమె, ఆవిడ, అనే ప్రత్యేక పదాలున్నాయిగాని వీటిలో వచ్చేక్రియ పురుషులకు చెందినదిగాని (ఆమె వచ్చారు) మనుష్యేతరాలకు సంబంధించినదిగాని (ఆమెవచ్చింది) అయి ఉంటుంది.

మహద్వాచకాలలో మళ్ళీ ఏకవచన, బహువచనాలూ, అమహద్వాచకాలలో కూడా ఏకవచన, బహువచనాలూ ఉన్నాయి.

| | |
|---|---|
| మహత్ ఏకవచనం | మహత్/మహతీ బహువచనం |
| వాడు | వారు / వాళ్ళు |
| మహతీ/ అమహత్ ఏకవచనం | అమహత్ బహువచనం |
| అది | అవి |

## 15.9 వచనం:

సంస్కృత భాషలో ఏక, ద్వి, బహు వచనాలని మూడు విధాలు తెలుగులో రెండు వచనాలే ఉన్నాయి. కొన్నింటిలో ఏకవచనాన్ని తెలియజెయ్యడానికి-డు ప్రత్యయం ఉన్నా అన్ని నామ ధాతువులకూ ఏకవచన ప్రత్యయాలు చేరతాయని చెప్పలేం. ఏక వచన నామానికి 'లు' అనే ప్రత్యయం చేరిస్తే బహువచనం నామం అవుతుంది. ప్రకృతి ప్రత్యయం విభాగం లేకుండానే కొన్ని నామాలు బహువచన బోధకాలుగా కనిపిస్తాయి. వీటిని నిత్యబహువచనాలనవచ్చు.

ఉదా : పాలు, నీళ్ళు, పెసలు, పేలాలు, బియ్యం, ఉసిళ్ళు మొదలైనవి.

ఏకవచన నామాలకు బహువచన ప్రత్యయాలు చేరేటప్పుడు ఏకవచన నామానికి కొన్ని మార్పులు వస్తాయి. వాటిని పరిశీలిద్దాం.

1. అన్యదేశ్యాలయిన దీర్ఘ స్వరాంత శబ్దాలలో ఎలాంటి మార్పులూ ఉండవు.
   లుంగీ+లు = లుంగీలు, లంగా+లు = లంగాలు, బాడీ+లు = బాడీలు
2. కొన్నింటిలో తుది అక్షరం లోపిస్తుంది.
   పేను+లు = పేలు, చేను+లు = చేలు, పూవు+లు = పూలు
3. ఇదంతశబ్దాల్లో అకారేతర దీర్ఘస్వర పూర్వకమయిన యకారానికి తకారం వస్తుంది.
   చేయి+లు =చేతులు, గోయి+లు = గోతులు, నూయి+లు =నూతులు
4. న్ను అంతంలో వచ్చే ఔపవిభక్తిక నామాలకు 'ండు' ఆదేశంగా వచ్చి ఆతర్వాత -ళ్ళుగా మారుతుంది.
   కన్ను+లు = కండ్లు/కళ్ళు, పన్ను+లు = పండ్లు / పళ్ళు.
5. లి అంతంలో వచ్చే చతుర్మాత్రాకశబ్దాల్లో '-ండి' ఆదేశంగా వచ్చి ఆతర్వాత '-ళ్ళు' గా మారుతుంది.
   రోకలి+లు = రోకండ్లు/రోకళ్ళు, కౌగిలి+లు = కౌగిండ్లు/కౌగిళ్ళు.
6. రెండక్షరాల కన్నా ఎక్కువ ఉన్న ఇదంత శబ్దాలలో చివర వ్యంజనమయిన 'ల' మూర్ధన్యమవుతుంది.
   మొసలి+లు = మొసళ్ళు, నెమలి+లు = నెమళ్ళు

7. ఉదంత శబ్దాలలో చివర స్వరానికి ముందున్న లకారం మూర్ధన్యమవుతుంది.

   వేరు+లు = వేళ్ళు, ఊరు+లు =ఊళ్ళు, గోరు+లు =గోళ్ళు

8. యకారేతర వ్యంజన పూర్వకమయిన నామాంత ఇ వర్ణం ఉ వర్ణంగా మారుతుంది.

   గది+లు = గదులు, కాకి+లు = కాకులు, కోతి+లు = కోతులు

9. నామాంతంలోని 'ఉ' మూర్ధన్యవర్ణపూర్వకమయితే లోపిస్తుంది.

   చెట్టు+లు = చెట్లు

   కోటు + లు = కోట్లు

10. అకార, ఎకార పూర్వకమయిన 'మ' కారాంత శబ్దాలలో తుది మకారానికి లోపమూ, పూర్వ స్వరానికి దీర్ఘమూ వస్తాయి.

    గుఱ్ఱం+లు = గుఱ్ఱాలు, మంచం+లు = మంచాలు

ఎద్దు శబ్దానికి బహువచనం 'ఎడ్లు' అనే రూపం వికల్పంగా ఉంది. దీనికి లు ప్రత్యయం చేరి ఎడ్లుగా కూడా వాడుకలో ఉంది. ధాన్యానికి వడ్లు, వడ్లు అనే రూపాలు నిత్య బహువచనంగా కనిపిస్తాయి.

పెండ్లి, రాత్రి శబ్దాలకు క్రమంగా పెండ్లిండ్లు, పెళ్ళిళ్ళు, రాత్రిండ్లు, రాత్రిళ్ళు అనే బహువచన రూపాలున్నాయి.

సర్వనామాలు నేను-మేము, మనం

నువ్వు,నీవు -మీరు

అతను,అతడు,ఆయన, వాడు - వారు, వాళ్ళు

ఆమె,ఆవిడ/ఆవెడ- వారు,వాళ్ళు

అది - అవి

ఏక, బహువచనాలుగా ఉంటాయి.

విశేష నామాలను సామాన్య నామాలుగా వాడాలన్నప్పుడు 'లు' వర్ణంతో బహువచన నామాలుగా వాడుతున్నారు. రామారావులు, సుబ్బారావులు, వెంకట్రావులు.

## 15.10 విభక్తులు :

ఆధునికి తెలుగుభాషలో 'ను' కర్మ అర్థంలోనూ, 'కు' సంప్రదానాది అర్థాలలోనూ నామానికి చేరతాయి. వీటికి ఇకారాంత శబ్దాల తరువాత ని,కి అనే రూపాలున్నాయి. విభక్తి చేరినప్పుడు సర్వనామరూపాల్లో కొన్ని మార్పులు జరుగుతాయి. అవి : నా+ను=నన్ను, నీ+ను=నిన్ను, మా+ను= మమ్మలిన, మీ+ను= మిమ్మల్ని మన+ను= మనని, మనల్ని.

నా, నీ, మా, మీ ల తర్వాత ఎప్పుడూ కు, ను లే ఉంటాయి. మిగతా శబ్దాల్లో ఇకారేతర స్వరం తరువాత ని, ను, లు, కి, కులలో ఏదయినారావచ్చు.

మాటకు-మాటికి, ఆవును-ఆవుని

-కు కింది అర్థాలలో వస్తుంది.

'ఉండు' క్రియతో సామ్యర్థంలో వస్తుంది.

నాకు రెండు ఇళ్ళున్నాయి.

వాడికి పది ఎకరాల పొలం ఉంది.

దేహ,మనస్థితి బోధక ఆఖ్యాతాలతో వస్తుంది.

నాకు ఆకలిగా ఉంది.

'అని' కాంక్షార్థంలో వచ్చినప్పుడు వస్తుంది.

నాకు వెళ్ళాలని ఉంది.

వాడికి తినాలని ఉంది.

దానార్థక్రియ ఉన్నప్పుడు గ్రహీతకు వస్తుంది.

వాడికి ఉంగరం ఇచ్చాను

నా

నాకు చాక్లెట్లు ఇచ్చాడు.

తో:

కరణార్థంలో-

నోటితో మాట్లాడి నొసలుతో వెక్కిరిస్తాడు.

సహార్థంలో-

శ్రద్ధతో చదువుతాడు

కర్తృవిశేషణంగా-

ఆకలితో వచ్చాడు

జ్వరంతో పరీక్షరాసింది

ప్రతిక్రియా ప్రేక్షక క్రియలతో-

భారతదేశం పాకిస్తాన్‌తో యుద్ధం చేసింది

సీత పక్కవాళ్ళతో పోట్లాడుతుంటుంది.

## మూలపదార్థంలో-

కర్రతో చేసిన కుర్చీ, పిండితో చేసిన రొట్టె, బంగారంతో చేసిన ఉంగరం.

లో:

ఔపశ్లేషికార్థంలో-

గిన్నెలోపాలున్నాయి.

కాలార్థంలో-

ఆంధ్రప్రదేశ్ 1956లో ఏర్పడింది.

దేశకాలాల వాతావరణార్థంలో-

బెజవాడలో ఎండలెక్కువ

విశాఖపట్నంలో ఉక్క ఎక్కువ.

ఇంకా అభివ్యాపకార్థంలోనూ, వైషయికార్థంలోనూ, నిర్ధారణార్థంలోనూ వస్తుంది.

**నుంచి:**

1. గమనార్థక ధాతువులతో దేశకాలాల్లో వ్యాపారాది అర్థాలలో వస్తుంది.
   అతను వాళ్ళ ఊరి నుంచి వస్తున్నాడు.
   పిల్లవాడు 8 గంటల నుంచి చదువుతున్నాడు.
2. పర్యంతార్థంలో-
   రామారావు 10 ఏళ్ళ నుంచి మెడిసిన్ చదువుతున్నాడు
3. హేత్వర్థంలో-
   నీ నుంచి నాకీ కష్టాలువచ్చాయి.
4. మూల స్థలార్థంలో-
   చెట్లు నుంచి కాయలు కోశాడు

విభక్తులు కాకపోయినా ఇంకా దగ్గర, వరకు, కోసం, మీద, పైన, కింద, పక్క, గురించి, వల్ల, పట్టి, నుండి, కన్న మొదలయిన పదాలు భిన్న విభక్త్యర్థాలలో వస్తాయి.

## 15.11 ఔపవిభక్తులు :

నామాలు విభక్తుల ముందు, విభక్త్యర్థక శబ్దాలముందు, ఇతర నామాల ముందు ప్రయోగించి నప్పుడు కొన్ని మార్పులకు లోనవుతాయి. వీటినే ఔపవిభక్తులంటారు.

1. అ- బహువచన ప్రత్యయం 'లు' లోని 'ఉ' లోపించి 'అ' గా మారుతుంది.
పుస్తకాలను, పుస్తకాలపురుగు

**2. ంటి, టి:**

ఇల్లు, కన్ను, పల్లు మొదలైన రూపాలకు మొదటి అచ్చు తరువాత భాగానికి 'ంటి' ఆదేశమవుతుంది.

ఇల్లు-ఇంటికి, ఇంటిలో

కన్ను-కంటికి, కంటిలో

కొన్ని ర,రు, లు, డు అంతంలో ఉన్న శబ్దాలకు చివరి అక్షరానికి 'టి' ఆదేశమవుతుంది.

గోరు-గోటి, ఏరు-ఏటి, నోరు-నోటి, గూడు-గూటి

**3. తి :**

ఇదంతమయిన రెండుచ్చుల మాటల్లో దీర్ఘస్వర పూర్వకమయిన 'య' వర్ణానికి 'త' వర్ణం ఆదేశమవుతుంది.

చేయి-చేతి రాయి-రాతి

గోయి-గోతి నేయి-నేతి

**4. ఇ-**

ను, లు, రు, డు అంతంలో ఉన్న శబ్దాల్లో చివరి 'ఉ' 'ఇ' గా మారుతుంది.

ఊరు-ఊరికి , కాలు-కాలికి, చేను-చేనికి, కోడలు-కోడలికి

## 15.13 సంఖ్యావాచకాలు :

భాష ప్రాచీన స్థితి, సంస్కృతి, నాగరికతలు ఆ భాషలో ఉన్న సంఖ్యా వాచకాలని బట్టి చెప్పవచ్చు. తెలుగుకు సంబంధించినంతవరకు వెయ్యి/వేయి వరకు దేశయపదాలుండగా, లక్ష, కోటి మొదలైనవి సంస్కృతం నుంచి తెచ్చుకొన్నాం.

ఒకటి, రెండు, మూడు, నాలుగు, అయిదు, ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది, పది- తర్వాత మళ్ళీ పదుల మీద ఒకటి, రెండూ.. చేరుతూపోతాయి. రెండు పదులు ఇరవై గానూ, మూడు పదులు ముప్పయి గానూ.... ఇలా నలభై, అరవై, డెభ్భై, ఎనభై, తొంభై, నూరు/వంద- తర్వాత మళ్ళీ నూట (నూరు ఔపవిభక్తిక రూపం) ఒకటి.... ఇలా ఉంటాయి సంఖ్యా వాచకాలు.

తెలుగులో నిర్మాణాన్ని బట్టి సంఖ్యా వాచకాలను మూడు విధాలుగా విభాగించవచ్చు.

### 1. లెక్కింపు సంఖ్యలు :

ఒకటి, రెండు, మూడు.... మొదలైనవి.

### 2. పూరణార్థక సంఖ్యలు :

రెండో అబ్బాయి, మూడో అమ్మాయి.... మొదలైనవి.

### 3. వ్యక్తిబోధక లేదా మనుష్యవాచకసంఖ్యావాచకాలు:

మహన్మహతీ వాచకాలకు మాత్రమే గురు, మంది చేరడం వల్ల ఏర్పడతాయి. ముగ్గురు, నలుగురు, నూరు మంది, పదిమంది, వెయ్యిమంది మొదలైనవి.

'ఒక' శబ్దానికి పుం, స్త్రీ, నపుంసక భేదాలున్నాయి.

ఒకడు, ఒకతె/ఒకర్తె, ఒకటి

## 15.14 క్రియలు :

క్రియలు రెండు విధాలు. 1. సంపూర్ణాలు 2. అసంపూర్ణాలు

1. సంపూర్ణక్రియలు: వరుసగా ధాతువు, కాలబోధక ప్రత్యయం, వ్యక్తిబోధక ప్రత్యయం ఉంటుంది.

2. అసంపూర్ణక్రియలు:- అలా ఉండవు. ఏదో ఒకటి లోపిస్తుంది.

ఆధునిక తెలుగులో అకర్మక, సకర్మక, ప్రేరణార్థక ధాతువులు విడిగా ఉండటమే గాక ప్రత్యయాదుల చేత ఒక వర్గాన్ని మరో వర్గంగా మార్చవచ్చు కింది వాటిని పరిశీలించండి.

అకర్మకం - సకర్మకం
వంగు - వంచు
పెరుగు - పెంచు
జరుగు - జరుపు
తడియు - తడుపు

ఆగు - ఆపు

చూచు - చూపు

గడచు - గడపు

మాయు - మాపు

సకర్మకం - ప్రేరణం

తిట్టు - తిట్టించు

అను - అనిపించు

కాలుచు - కాల్పించు

అడుగు - అడిగించు

తిను - తినుపించు

మొలుచు - మొలిపించు

కురియు - కురిపించు

చూచు - చూపించు మొదలైనవి.

ప్రాచీన భాషలో ఉన్న చేయు, వేయు లాంటి ధాతువులు అకర్మధాతువులను సకర్మధాతువులుగా చేస్తాయి. ఆధునికి భాషలో కొట్టు, తీయు, పెట్టు వంటి ధాతువులు కూడా ఈ పని చేస్తాయి. ఈ ధాతువులను అనుబంధించినప్పుడు ప్రధాన క్రియలు అన్నంత రూపంలో ఉంటాయి. అనుబద్ధ ధాత్వాది పరుషం సరళంగా మారుతుంది.

పగలు - పగలగొట్టు

తెలియు - తెలియజేయు

పడు - పడగొట్టు

అరుగు - అరగదీయు

విరుగు - విరగదీయు

కాగు - కాగబెట్టు

నాను - నానబెట్టు / నానవేయు

ఆరు - ఆరవేయు / ఆరబెట్టు

కరుగు - కరగబెట్టు

కొను ధాతువు భిన్నార్థాలలో ధాతువుకు అనుబంధించబడుతుంది. ప్రధాన క్రియ ధాతురూపంలోనే ఉంటుంది. యోపధ ధాతువుల్లో 'య' కారం 'న' కారం గా మారుతుంది.

చేయు - చేసుకొను

చదువు - చదువుకొను

అమ్ము - అమ్ముకొను

తెలయు - తెలిసికొను

తిట్టు - తిట్టుకొను

పోయు - పోసికొను

మాట్లాడు - మాట్లాడుకొను

కొన్ని ధాతువులు 'కొను' తోనే వస్తాయి.

అనుకొను, ఊరుకొను, ఒప్పుకొను, పుంజుకొను, మొత్తుకొను మొదలైనవి.

కొన్ని శబ్ద పల్లవాలు ఆయా అర్థాలలో అలాగే వస్తాయి.

కూరుచుండు, నిలుచుండు, కనబడు, నిలబడు మొదలైనవి.

కొన్ని నామా దులను కూడా ప్రత్యయాదులు చేర్చి క్రియలుగా వాడవచ్చు.

భయం - భయపడు, భయపెట్టు

కష్టం - కష్టపడు, కష్టపెట్టు

లో - లో బడు

వెనుక - వెనుక బడు

పాత - పాతబడు

సంతోషం - సంతోషించు, సంతోషపెట్టు, సంతోషపడు

క్షమ - క్షమించు

## 15.14 క్రియాపదాలు :

ఆదునిక తెలుగులో క్రియా పదాలు సమాపక, అసమాపక భేదాలతో రెండు విధాలుగా ఉంటాయి.

### 15.14.1 సమాపక క్రియలు :

సమాపక క్రియలకు చాలా వరకు క్రియావిభక్తులు ఉంటాయి. కాలబోధక క్రియలతో పాటు లింగ-వచన-పురుష బోధక క్రియావిభక్తులు చేరతాయి. భూతాకాలంలో, ఇన, వర్తమాన కాలంలో - తున్న, తున్, భవిష్యత్ కాలంలో -త, ఉభయ ప్రార్థనంలో -ద ప్రత్యయాలు చేరతాయి. బహువచనంలో 'అండి' చేరుతుంది. తెలంగాణా మండలికంలో న్రి, రి, ండి, చేరతాయి.

రాన్రి, రారి, రాండి.

**క్రియావిభక్తులు :**

| | ఏకవచనం | బహువచనం |
|---|---|---|
| ఉత్తమ | ను | ము |
| మధ్యమ | వు | రు(మహన్మహతి) |
| ప్రధమ మహత్తు | డు | |
| ఇతర | ది | వి(యి) (అమహత్తు) |

ఇవే క్రియావిభక్తులు వ్యతిరేక సమాపక క్రియల్లో కూడా వాడతారు. కాని ది,వి ప్రత్యయాలు దు, వు లుగా మారతాయి. కొన్ని తెలంగాణా మాండలికాల్లో ది, వి లు దీర్ఘ స్వరాంత క్రియా రూపాల తర్వాత మాత్రమే దు, వు లుగా మారతాయి.

**15.14.1.2 అసమాపక క్రియలు :**

అసమాపక క్రియారూపాలు ఉపవాక్యాంతంలో గానీ, ప్రధాన వాక్యంలో ఒక పదబంధం స్థానంలో కాని వస్తాయి. అసమాపక క్రియకు కాల బోధకత ఉంటుంది. క్రియావిభక్తులు ఉండవు.

**1. అసమాపక క్రియా ప్రత్యయాలు :**

అవ్యతిరే క్రియా ప్రత్యయాలు కావర్థకంలో ఇ: శత్రర్థకంలో తూ, తా: చేదర్థకంలో ఇతే : అప్యర్థకంలో ఇనా : భావార్థకంలో అటం, అడం: నుజ్యంతంలో అ(న్) వస్తాయి. వ్యతిరేకార్థంలో క్త్వార్థకంలో అక, అకుండా: చేదర్థకంలో అకపోతే: అప్యర్థకంలో అకపోయినా: భావార్థకంలో అకపోవటం/అకపోవడం వస్తాయి.

ఉదా: అడుగు

అడిగి - అడగక

అడగకుండా

అడుగుతూ

అడుగుతా

అడిగితే - అడగకపోతే

అడిగినా - అడగకపోయినా

అడగటం - అడగకపోవటం

అడగన్

**15.14. 3 వ్యతిరేకక్రియలు :**

భూతకాలవ్యతిరేకక్రియలు అన్నంత రూపాలకు 'లేదు' చేర్చడం వల్ల ఏర్పడతాయి.

ఉదా: రాలేదు.

వర్తమాన వ్యతిరేక క్రియలు 'అటం' కి 'లేదు' చేర్చడంవల్ల ఏర్పడతాయి.

ఉదా: రావటం లేదు.

భవిష్యత్ బోధక వ్యతిరేక క్రియలు అన్నంత రూపాలకు క్రియా విభక్తులు చేర్చటం వల్ల ఏర్పడతాయి.

ఉదా: రాను - రాము

రావు - రారు

రాడు - రారు

రాదు - రావు, రారు

వ్యతిరేక విధి అన్నంత రూపాలకు వద్దు చేర్చటం వల్ల ఏర్పడుతుంది.

ఉదా: రావద్దు, రాకు, రాబోకు, రామాకు, రామోకు మొదలైనవి.

**15.14.1.4 అన్నంత క్రియ :**

1. సామ్యార్థంలో కల అనే క్రియకు 'కలుగు' ఆదేశమవుతుంది. వ్యతిరేకంలో 'లే' ఆదేశంగా వస్తుంది.

ఉదా: రాగలడు, రాగలుగుతాడు, రాలేడు

2. అనుమతి నివ్వడం అనే అర్థంలో 'వచ్చు' వస్తుంది.

ఉదా: లోపలికి రావచ్చు, బయటకు వెళ్ళవచ్చు మొదలైనవి.

3. నిషేదార్థంలో కూడదు, రాదు వస్తాయి.

ఉదా: అ సత్యమాడరాదు, అబద్ధం చెప్పకూడదు.

4. తప్పనిసరి అర్థంలో 'ఆలి' వస్తుంది.

ఉదా: చెప్పాలి, చదవాలి, తినాలి మొదలైనవి.

ఇంకా కర్మణ్యార్థంలో పడు, అనుమతి అర్థంలో ఇచ్చు, సమీప భవిష్యార్థంలో పో, అన్నంతరూపానికి ప్రయోజనార్థంలో అక్కరలేదు, అవసరంలేదు. అనే రూపాలు వస్తాయి.

## 15.14.1.5. క్రియా ధాతువుల్లో మార్పులు :

ప్రత్యయ వర్గాలను బట్టి ప్రత్యయాలు చేరినప్పుడు ధాతువులో కొన్ని మార్పులు జరుగుతాయి. ఈ మార్పులు ప్రత్యయవర్గాలను బట్టి ఉంటాయి.

1. విధ్యాదులు క్త్వార్థక ప్రత్యయాలు కాక మిగతా ప్రత్యయాలు ముందు ఉండు, ఉన్ గా మారుతుంది.
2. అనుబంధ క్రియలుగా వచ్చిన ఉండు, కొను ధాతువులు విధ్యాదుల్లో ఓ, కోలుగా మారతాయి.

   ఉదా: కూర్చో, చేసుకో
3. అనుబద్ధమయిన ఉండు, కొనులు భూతాది ప్రత్యయాలముందు వికల్పంగా ఉన్, కున్ లుగా మారతాయి.

   ఉదా: కూర్చున్నాడు, చేసుకున్నాడు.
4. ధాతువు చివర 'యు' విధ్యాదికేతర ప్రత్యయాలముందు న కారంగా మారుతుంది.

   ఉదా: చేయు, చేసి, చేశాడు, చేస్తే, చేస్తాడు.
5. రెండక్షరాల ధాతువుల్లో దీర్ఘ స్వరపూర్వకమయిన 'చ' వర్ణానికి విధ్యాదిక ప్రత్యయాలు ముందు కొందరి వ్యవహారంలో 'య' వర్ణాదేశమవుతుంది.

   ఉదా: తూచు - తూయి, తూచటం, తూయటం

   దాచు - దాయి, దాచటం, దాయటం
6. మూడక్షరాల ధాతువుల్లో చివరి వ్యంజనమయిన 'చ' వర్ణానికి విధ్యాదిప్రత్యయాలముందు 'వ' వర్ణాదేశమవుతుంది.

   ఉదా: పిలుచు - పిలువు, పిలవటం
7. మూడక్షరాల ధాతువుల్లో ప్రత్యయాది అ, ఇ ల ననుసరించి ధాతువుల్లో ప్రథమేతరాచ్చులు కూడా క్రమంగా అ, ఇ లుగా మారతాయి. దీనిని సమస్వరత అంటారు.

   ఉదా: అడుగు - అడగ, అడిగి

   కరగు - కరగ, కరిగి

   తెలియు - తెలియదు, తెలవదు

8. పడుధాతువు భూతాదిక ప్రత్యయాలతో కలిసి వస్తాయి.

   ఉదా: పడు - పడ్డాడు, పడ్డా, పడినా

   చెడు - చెడ్డాడు, చెడ్డా - చెడినా

**15.14.1.6 ప్రత్యయాల్లో మార్పులు :**

1. 'అను' మొదలయిన ధాతువుల తర్వాత ప్రత్యయంలో 'త' 'ట' గా మారుతుంది.
    అను - అంటే, అంటాడు, అంటున్నాడు
    కొను - కొంటే, కొంటాడు, కొంటున్నాడు
2. దీర్ఘ స్వరాంత ధాతురూపాలకు అటం చేరినప్పుడు 'వ' కారం ఆగమంగా వస్తుంది.
    ఉదా: రా+అటం = రావటం
    తే+ అటం = తేవటం
3. దీర్ఘ స్వరాంత ధాతువుల తర్వాత స్వరాది ప్రతయాల స్వరానికి లోపం జరుగుతుంది. కొందరి భాషలో అటంలోని మొదటి కొందరి భాషలో అటంలోని మొదటి అచ్చు కూడా లోపిస్తుంది.
    ఉదా: రా+అక =రాక
    తే + అక = తేక
4. అన్నంత క్రియారూపాల తర్వాత పరుషాలు సరళాలవుతాయి.
    ఉదా: రాన్ + కలడు = రాగలడు
    పోన్ + కూడదు = పోగూడదు.

కొన్ని స్వరలోప, సమీకరణ కార్యాలు భిన్న మాండలికాల్లో భిన్న విధాలుగా ఉన్నాయి.

**15.15.0 వాక్య నిర్మాణం :**

ఒక వాక్యంలో పదాలు ఏవిధంగా పరస్పరం కలిసి ఆ వాక్యం ఏర్పడింది అని చర్చించేది వాక్య నిర్మాణం వాక్యాలు మూడు రకాలు

1. నిర్దేశక వాక్యాలు (Declarative Sentences)
2. ప్రశ్న వాక్యాలు (Interrogati Sentences)
3. విధి వాక్యాలు (Imperative Sentences)

1. నిర్దేశకవాక్యాలు : ఇవి ఒక విషయాన్ని గురించి తెలియజేస్తాయి.
    ఉ: రాముడు నిన్నవచ్చాడు.
2. ప్రశ్నవాక్యాలు : ఒక విషయాన్ని ప్రశ్నిస్తాయి.
    ఉ: మీరు ఎప్పుడు వచ్చారు? ఎందరువచ్చారు? ఎలావచ్చారు?
3. విధి వాక్యాలు : శ్రోతికి ఆదేశాన్నిస్తాయి.
    ఉ: నువ్వు రేపురా.
    రేపు ఆ పుస్తకాలు తెచ్చిపెట్టు.

**వాక్యం నిర్వచనం :**

ప్రాచీన పాశ్చాత్య వ్యాకరణాలు సంపూర్ణార్థాన్ని ఇచ్చేవి వాక్యాలు అని నిర్వచించాయి. పై నిర్వచనం పూర్తి సంతృప్తి కరంగా లేదు. ఒక్కోసారి ఒక్క పదమే సంపూర్ణార్థాన్నిస్తుంది.

ఉదా: ఆయనెప్పుడు వస్తారు?

రేపు

'రేపు' అనేది ఒక వాక్యం, ఒక పదం కూడా. కాబట్టి పయినిర్వచనం అసమగ్రం అనవచ్చు. ఆధునికులు ఉచ్చారణలో రెండు విరామాల మధ్య ఉండే ధ్వని సముదాయాన్ని వాక్యం అన్నారు.

వాక్యాన్ని గురించి చామ్స్కి స్థాపించిన పరివర్తన వ్యాకరణం భాషలో వాక్య నిర్మాణ పరిశోధనకి ప్రాముఖ్యం ఇచ్చింది. తెలుగుకు సంబంధించినంతవరకు ఆచార్య చేకూరి రామరావు గారు తెలుగు వాక్య నిర్మాణం మీద విశేష కృషి చేశారు. (వారి కృషి ఫలితమే ఈ వ్యాసం)

## వాక్య నియామాలు :

కొన్ని పదాలు కలసి ఒక వాక్యంగా ఏర్పడటంలో ప్రతిభాషలోనూ కొన్ని నియమాలు ఉంటాయి.

నేను ఇల్లు చూశాను మీ ( ఈ వాక్యం అంగీకారంకాదు)

మీఇల్లు నేను చూశాను

నేను చూశాను మీ ఇల్లు

చూశాను నేను మీఇల్లు

నేను మీఇల్లు చూశాను

చూశాను మీఇల్లు నేను.

అంటే పదాలు ఒక నిర్దిష్టక్రమంలో ఉంటేనే అవి సాధువాక్యాలవుతాయి. ఇది భాషకీ భాషకీ మారుతుంటుంది. తెలుగులో వేటగాడు పులిని చంపాడు అన్నా పులిని చంపాడు వేటగాడు అన్నా అర్థం మారదు. కాని అదే అర్థంలో వచ్చే ఆంగ్ల భాషలోని వాక్యాన్ని చూడండి.

The hunter killed the Tiger.

The tiger killed the hunter.

పై వాక్యాలలో ఒక వాక్యానికి వేటగాడు పులిని చంపాడు.

రెండో వాక్యానికి పులి వేటగాణ్ణి చంపింది.

అంటే రెండు వాక్యాలు ఒకటి కాదు. దీనికి కారణం తెలుగులో ద్వితీయా విభక్తి ప్రత్యయం ఉంది ఆంగ్లంలో ద్వితీయా విభక్తి ప్రత్యయంలేదు.

పదాలకు పరస్పరం ఉన్న సంబంధం మూడు విధాలు.

1. స్థాన సంబంధం
2. యోగ్యతాసంబంధం
3. ఆదేశసంబంధం

## 1. స్థాన సంబంధం :

కొన్ని పదాలు కలిసినప్పుడు అవి నిర్దిష్టక్రమంలో స్థానాలు మార్చడానికి వీలులేకుండా ఉండటం.

రెండు పెద్ద పుస్తకాలు రెండు పుట్ల బియ్యం

పుస్తకాలు పెద్ద రెండు బియ్యం పుట్ల రెండు

**2. యోగ్యతా సంబంధం :**

వాక్యంలో ఉన్న ఒక రకం పదం కొన్ని రకాల పదాలతోనే కలుస్తుంది. మరికొన్ని రకాల పదాలు దానికి చేరిస్తే ఆ వాక్యం వింత అర్థాన్ని ఇవ్వడమో లేక అంగీకార యోగ్యం కాకపోవడమో జరుగుతుంది.

కమల ఆలోచించింది.

రాయి/చెట్టు ఆలోచించింది.

**3. ఆదేశ సంబంధం :**

ఒక వాక్యంలో ఒక పదం స్థానంలో ఇంకొక పదాన్ని గాని, పదాలను గాని పెట్టడం సాధ్యమయితే అలాంటి పదాల పరస్పర సంబంధాన్ని ఆదేశ సంబంధం అంటారు.

ఆ..... పెద్దది (ఖాళీలో ఇల్లు, చెట్టు, పుస్తకం మొదలైనవి. రావచ్చు, కాని తిని, విని, కొత్త, చూశాడు చేశాడు మొదలైనవి రావు)

తెలుగు భాషలోని వాక్యాలను ప్రధానంగా మూడు విధాలుగా విభజించవచ్చు. అవి:

1. సామాన్య వాక్యాలు (Simple Sentences)
2. సంశ్లిష్ట వాక్యాలు (Complex Sentences)
3. సంయుక్త వాక్యాలు (Compound Sentences)

**1. సామాన్య వాక్యాలు :**

సామాన్య వాక్యాలలో ఒకే ఆఖ్యాతం ఉంటుంది. ఇవి తెలుగులో 1. క్రియారహితాలు 2. క్రియా సహితాలు అని ద్వివిధాలు. 1. క్రియారహితాలు: ఒకే విషయాన్ని బోధించే రెండు నామాలు ఒక చోట చేరిస్తే క్రియారహిత వాక్యాలు ఏర్పడతాయి. ఇందులో మొదటిది ఉద్దేశ్యం, రెండోది విధేయం. మొదటి నామం సామాన్యంగా సర్వనామంగాని, విశేషణంగాని అయ్యుంటుంది. రెండవది. సిద్ధనామంగాని విశేషణాదుల నుంచి నిష్పన్నమయినది గాని కావచ్చు.

ఆయన టీచరు

ఆమె సీత

వాడు మంచివాడు

అది బల్ల

ఉత్తమ పురుష, మధ్యమ పురుష సర్వనామాలు ఉద్దేశాలుగా ఉన్నప్పుడు విదేయనామం క్రియాపురుషల్ని బోధించే ప్రత్యయాన్ని గ్రహిస్తుంది.

| | ఏ.వ | బ.వ |
|---|---|---|
| ఉ. పురుష | ను,ని | ము,మ్, మి |
| మ. పురుష | వు,వి | - |

ఇకారాంత శబ్దాల మీద ని,వి, మి వస్తాయి.

నేను మనిషిని
మేం మనుషులం
నువ్వు ఆడదానివి

ప్రాధాన్య వివక్ష కోసం ఉద్దేశ్య, విధేయవ్యత్యాసం జరగవచ్చు.

నువ్వు గాడిదవు - గాడిదవునువ్వు
మేం తెలుగు వాళ్ళం - తెలుగు వాళ్ళం మేము

క్రియారహిత వాక్యాలను ఉపవాక్యాలుగా వాడేటప్పుడు 'అయితే', అయినా' వస్తాయి.

ఆయన ధనవంతుడు అయినా గుణవంతుడు
అతను పొట్టివాడు అయితే గట్టివాడు

విభక్తి బంధాలు కూడా క్రియారహిత వాక్యాలలో వస్తాయి.

విశాఖపట్నం నాకు కొత్త
మాలో సుధాకర్ పొడుగు

సంబంధ బోధకాలు 'కు' విభక్తి బంధంతో ఉంటుంది.

వాడు నాకు తమ్ముడు
ఆమె నాకు స్నేహితురాలు.

విధేయనామానికి 'కాదు' చేర్చడం వల్ల అన్ని పురుషలోలనూ వ్యతిరేక రూపాలు ఏర్పడతాయి.

నువ్వు లత కాదు
ఆయన పాల్ కాదు
వాడు నాకు తమ్ముడు కాదు
మేం అన్నదమ్ములం కాదు.

2. క్రియా సహిత వాక్యాలు: ఇవి 1. కర్తృరహితాలు, 2 కర్తృసహితాలు అని రెండు విధాలు.

కర్తృరహిత వాక్యాలలో 'ఉంది' అనే క్రియా రూపం ఉంటుంది. దేహ, మన, స్థితుల్ని తెలిపే నామాలు 'గా' అనే ప్రత్యయంలో కూడ ఉంటుంది.

నాకు ఆకలిగా ఉంది.
వాడికి జబ్బుగా ఉంది

కర్తృ సహిత వాక్యాల్ని క్రియల్ని బట్టి అకర్మక, సకర్మక ప్రేరణ వాక్యాలుగా విభజించవచ్చు. అకర్మక వాక్యాలలో కర్మ ఉండదు. సకర్మక వాక్యాలలో కర్మ ఉంటుంది.

సీత అన్నం వండింది.

ప్రేరణ వాక్యాలలో కర్తృప్రేరక నామం ఉంటుంది.

ఆమె అతన్ని నిద్రలేపింది.

ప్రత్యేకమయిన ప్రాధాన్యాన్ని చెప్పవలసి వచ్చినప్పుడు ఆపదాన్ని క్రియా పదానికి సన్నిహితంగా జరపడం ఒక పద్ధతి.

నేను రేపు హైదరాబాద్‌లో ఇంగ్లీషు సినిమా చూస్తాను.

నేను హైదరాబాద్‌లో ఇంగ్లీషు సినిమా రేపు చూస్తాను.

నేను రేపు ఇంగ్లీషు సినిమా హైదరాబాద్‌లో చూస్తాను.

ప్రశ్నవాక్యాలు, సామాన్యంగా ఏ భాష అయినా మూడు రకాలుగా ఉంటాయి.

1. వాక్యాంత శబ్దాపేక్ష ప్రశ్నలు.
2. వాక్యేతర శబ్దాపేక్షప్రశ్నలు
3. విషయ నిర్ధారక ప్రశ్నలు

**1. వాక్యాంతర శబ్దాపేక్ష ప్రశ్నలు:**

'ఆ' చేర్చడంవల్ల ఏర్పడతాయి.

రామారావు హైదరాబాద్ నుంచి వచ్చాడా?

(వచ్చాడు/రాలేదు సమాధానం)

సీత బడి నుంచి వచ్చిందా?

(వచ్చింది/రాలేదు సమాధానం)

**2. వాక్యేతర శబ్దా పేక్ష ప్రశ్నలు:**

ఎవరు, ఎందుకు, ఎప్పుడు, ఎలా లాంటివి చేర్చడం వల్ల ఇవి ఏర్పడతాయి.

రామారావు హైదరాబాద్ నుంచి ఎప్పుడు వస్తాడు?

సీత బడి నుంచి ఎప్పుడు వస్తుంది?

(ఈ రోజు, రేపు, ఎల్లుండి...... సమాధానం)

**3. విషయనిర్ధారక ప్రశ్నలు :**

'కదూ,' కాదా' చేర్చడం వల్ల ఇవి వస్తాయి.

రామారావు హైదరాబాద్ నుంచి వచ్చాడు కదూ?

సీత బడి నుంచి వచ్చింది కదా।

(వచ్చాడు/వచ్చింది, రాలేదు సమాధానం)

**కర్మప్రధాన వాక్యాలు:**

కర్మపదాన్ని ఉద్దేశ్యం చేసి కర్తృపదాన్ని విధేయంలో భాగంగా చేసి చెప్పేవి కర్మప్రధాన వాక్యాలు.

కెల్లీ తెలుగు వ్యాకరణం రాశాడు

తెలుగు వ్యాకరణం కెల్లీ చేత రాయబడింది.

రెండో వాక్యంలో ప్రధాన మయినది 'తెలుగు వ్యాకరణం' తెలుగులో కర్మణివాక్యాలు రచనా భాషలోనూ, ఉపన్యాసాలలోనూ కనిపిస్తాయి. కర్త ప్రాధాన్యతను తగ్గించటమే కర్మణి వాక్యలప్రయోజనం.

## 2. సంశ్లిష్ట వాక్యాలు:

ఒక ప్రధాన వాక్యానికి కొన్ని ఉపవాక్యాలు చేరడం వల్ల సంశ్లిష్ట వాక్యాలు ఏర్పడతాయి. అసమాపక క్రియాయుక్త ఉపవాక్యాలు చేరిన సామాన్య వాక్యాలు సంశ్లిష్ట వాక్యాలవుతాయి. సంశ్లిష్ట వాక్యాలలో క్రియలు ఒకటికన్నా ఎక్కువ ఉంటాయి.

సంశ్లిష్ట వాక్యాలలో క్త్వార్థకం, శత్రర్థకం, అప్యర్థకం, చేదర్థకం - ప్రధాన పాత్రను వహిస్తాయి.

క్త్వార్థకం : చిన్నయసూరి తన బాలవ్యాకరణంలో క్త్వార్థకాన్ని గురించి 'సమానాశ్రయంబులం బూర్వ కాలం బునందివర్ణకంగు' (క్రియ. 3) అంటాడు. దీనిని బట్టి 'ఇ' వర్ణకాన్ని క్త్వార్థకంగా చెప్పవచ్చు.

1. సమాన కర్తృకమయిన రెండు క్రియల్లో పూర్వ క్రియ క్త్వార్థకమయి ఉంటుంది.

సుజాత అన్నం తిని నిద్రపోయింది

రవి ఇంటికి వెళ్ళి కాఫీ తాగాడు

ఈ వాక్యాలు ఇలాంటి అర్థంలో భిన్న కర్తృకాలు కావటానికి వీలులేదు.

రామారావు అన్నంతిని సుబ్బారావు కాఫీతాగాడు.

అయితే పరస్పర విరుద్ధార్థ బోధ ఉన్న క్రియలు వాడినప్పుడు భిన్న కర్తృకాలయినా పరవాలేదు.

1983 ఎన్నికల్లో కాంగ్రెసు ఓడిపోయి తెలుగు దేశం గెలిచింది.

2. కొన్ని క్రియల్లో క్త్వార్థకం హేత్వర్థకమవుతుంది.

అతను జ్వరం వచ్చి పడుకున్నాడు

రామారావు పాఠాలు చదవక ఫెయిలయ్యాడు.

3. కొన్ని క్రియలతో రీత్యర్థక క్రియావిశేషణం అవుతుంది.

అతను లంచాలు తిని సంపాదించాడు

వాడు రిక్షాలాగి బతుకుతున్నాడు

4 ప్రకృతిలో సహజసిద్ధంగా వ్యాపారంతో క్త్వార్థకం హేత్వర్థకం అవుతుంది.

వానలు కురిసి చెరువులు నిండుతాయి.

తుఫాను వచ్చి పంటలు పోయాయి.

5. కాలబోధకంగా కొన్ని క్త్వార్థక రూపాలు ఉన్నాయి.

పొద్దెక్కి నిద్ర లేచాడు.

చీకటిపడి ఇంటికి వెళ్ళాడు.

**శత్రర్థకం :**

ఏక కర్తృకంగా ఏక కాలంలో జరిగే వ్యాపారాలు బోధించటం శత్రర్థక క్రియల ప్రధాన ప్రయోజనం. ప్రధాన క్రియలతో పాటు జరిగే వ్యాపారాన్ని సూచించడానికి ఉపవాక్యంలో క్రియకు 'తూ' ప్రత్యయం వస్తుంది.

అతను కాఫీ తాగుతూ పేపరు చదువుతున్నాడు
కమల సినిమా చూస్తూ బఠానీలు తింటోంది.

**అప్యర్థకం :**

ధాతువుకు 'ఇనా' ప్రత్యయం చేరడంవల్ల అప్యర్థక క్రియలు ఏర్పడతాయి. రెండు వ్యాపారాల్లో వైరుధ్యాలు ఉన్నప్పుడే ఈ వాక్యాలు వాడతారు.

విద్యాశాఖామంత్రి వచ్చినా పరవాలేదు
రామారావు రాకపోయినా పని అవుతుంది

**చేదర్థకం :**

ధాతువుకి 'తే' 'ఇతే' ప్రత్యయాలు చేరిస్తే చేదర్థకక్రియలు ఏర్పడతాయి. ఒక వ్యాపారం మీద ఆధారపడి ఇంకో వ్యాపారం జరిగినప్పుడు ఈ వాక్యాలు ఉపయోగిస్తారు.

మా ఇంటి కొస్తే పాఠం చెబుతాను
హైదరాబాద్ వెళ్తే పుస్తకం తెస్తాను

జరగవలసింది జరగలేదు అనే భావాన్ని వ్యక్తం చేయటానికి క్త్వార్థక క్రియ మీద ఉండు ధాతువు చేదర్థకరూపం చేరుతుంది.

మీరు నిన్న వచ్చిఉంటే పాఠం చెప్పేవాణ్ణి
రామారావు పరుగుపందెంలో పాల్గొని ఉండి ఉంటే గెలిచేవాడు.

**సంయుక్త వాక్యాలు :**

కొన్ని సమాన ప్రతిపత్తి గల వాక్యాలు కలసి ఒక వాక్యంగా ఏర్పడితే సంయుక్తవాక్యం అవుతుంది. ఆ వాక్యంలో భాగాలయన వాటి ప్రతిపత్తి అలానే ఉంటుంది. వాక్యాల సంయోజనంవల్ల సంయుక్త వాక్యాలు ఏర్పడతాయి. 'కాని', 'అయితే' లాంటి కొన్ని అవ్యయాలు రెండు వాక్యాలనూ అనుసంధించగలవు. ఆంగ్లంలో and, or, but అనేవి, హిందీలో ఔర్, యా, మగలర్ ఇలాంటివే. ఈ వాక్యాలు సంకలన, వికల్ప, వైరుధ్య సంబంధాలవల్ల మూడు రకాలు.

**1. సంకలన సంబంధం :**

కొన్ని సామాన్య వాక్యాలను ఒకే సారి ప్రయోగించి నప్పుడు వాటి మధ్య ఉన్న సంబంధం సంకలన సంబంధం.
లత పాటలు పాడుతుంది, గేయాలురాస్తుంది, వీణవాయిస్తుంది, కథలురాస్తుంది.
సుజాత ఇంటికివచ్చింది, చీరమార్చుకొంది, పొయ్యి మీద కాఫీ నీళ్ళు పెట్టింది.

**2. వికల్పసంబంధం :**

రెండు వాక్యాలు ప్రతిపాదించే విషయాలమధ్య సంబంధం వైరుధ్య సంబంధం: రెండు వాక్యాల మధ్య 'కాని', 'అయితే' వస్తాయి.

వెంకట్రావు చదువు తాడుకాని తలకెక్కదు
రామారావు తింటాడు గాని అరిగించుకోలేడు
సుబ్బారావు బాగా చెబుతాడు అయితే గర్వం ఎక్కువ
అతని దగ్గర డబ్బుంది అయితే ఖర్చు పెట్టడు.

**సమీక్ష:**

క్రీ.శ. 1801 నుంచి నేటి వరకు ఉన్న ఆధునిక తెలుగు భాష, దాని స్వరూప స్వభావాలను ఈ పాఠంలో చర్చించడం జరిగింది.

**ప్రశ్నలు :**

1. ఆధునిక తెలుగు భాషలోని ధ్వనులు, వర్ణాలు, సంధి, నామవాచకం, లింగం వచనాలను సోదాహరణంగా వివరించండి.
2. ఆధునిక తెలుగులోని విభక్తులు, ఔపవిభక్తులు, సర్వనామాలు, సంఖ్యా వాచకాలు, క్రియ, వాక్యం గురించి తెలియజెయ్యండి.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. కృష్ణమూర్తి, భద్రిరాజు (సంపాదకుడు) తెలుగు భాషా చరిత్ర, ఆంధ్రప్రదేశ్ తెలుగు సాహిత్య అకాడమీ, కళాభవన్, సైఫాబాదు, హైదరాబాదు, 1974.
2. జోగిసోమయాజి, గంటి-ఆంధ్రభాషావికాసము, త్రివేణీపబ్లిషర్సు, మచిలీపట్నం, 1968.

-

పాఠం - 16

# వర్ణ నిర్మాణం : తెలుగు వర్ణాలు - మూలద్రావిడం నుంచి పరిణమించిన తీరు

## పాఠ్యాంశ నిర్మాణ క్రమం :

16.0 లక్ష్యం

16.1 వర్ణ నిర్మాణం

16.2 మూలద్రావిడ భాష

16.3 పునర్నిర్మాణ పద్ధతి

16.4 తెలుగు వర్ణాలు

16.5 అచ్చులు

16.6 హల్లులు

16.7 తెలుగు భాషలో జరిగిన సాధారణ పరిణామాలు

## 16.0 లక్ష్యం :

వర్ణ నిర్మాణం గురించి తెలుసుకోవటం, పునర్నిర్మాణ పద్ధతుల ద్వారా మూలద్రావిడ భాషను ఎలా పునర్నిర్మిస్తారో తెలుసుకోవటం, మూలద్రావిడ భాషా వర్ణాలను పునర్నిర్మించటం, అవి తెలుగు భాషలో ఎలా పరిణామం చెందాయో తెలుసుకోవడం ఈ పాఠం ప్రధాన లక్ష్యం.

## 16.1 వర్ణ నిర్మాణం :

మనం మాట్లాడే భాష ధ్వనులమయం. ఈ ధ్వనులలో కొన్ని ముఖ్యమైనవి. కొన్ని ముఖ్యం కానివి ఉంటాయి. ముఖ్యమయిన ధ్వనికే వర్ణమని వ్యవహారం. దీనిని బట్టి వర్ణాలన్నీ ధ్వనులే గాని, ధ్వనులన్నీ వర్ణాలు కావని తెలుసుకోవాలి. అముఖ్యమయిన ధ్వనుల్ని ముఖ్యమయిన ధ్వనులలోనే పరిగణించవచ్చు. అముఖ్యమయిన ధ్వనుల్ని ప్రత్యేక లిపి చిహ్నాల ద్వారా నిరూపించవలసిన అవసరం లేదు. అవి ముఖ్యమయిన ధ్వని చిహ్నంతోనే వ్యవహరించడం జరుగుతుంది. ఉచ్చారణలో భేదమున్నా ఇబ్బంది లేదు.

భావ ప్రకటనమనేది వాక్యం ద్వారానే సాగుతుంది. వాక్యం నుంచి పదాల్ని పదాల నుంచి వర్ణాల్ని పృథక్కరించటం జరుగుతుంది.

ఉ : సీత - (స్+ఈ+త్+అ) నాలుగు వర్ణాల సమ్మేళనం ద్వారా ఏర్పడ్డది. తొలి రెండు వర్ణాలు ఒక అక్షరంగానూ, మలిరెండు వర్ణాలు ఒక అక్షరంగానూ ఏర్పడ్డాయి. తరువాత ఈ రెండక్షరాలు మేళవించగా పదం ఏర్పడింది. అక్షరమంటే (Sylable) రెండు గాని అంతకంటె ఎక్కువగాని వర్ణాల సమ్మేళనం. ఇందులో ఒక వర్ణం అయినా స్వరం కావాలి. కేవల స్వరం కూడా అక్షరం కావచ్చు.

స్వతంత్రోచ్చారణం కలిగిన స్వరాన్ని మాత్రం వర్ణమని గాని, అక్షరమని గాని అనవచ్చు. కేవల హల్లులు వర్ణాలే గాని అక్షరాలు కావు. అంటే వర్ణాలన్నీ అక్షరాలు కావు. అక్షరాలన్నీ వర్ణాలే.

సమాన హల్లుల కలయికను ద్విత్వం (క్క, గ్గ) అని, భిన్న హల్లుల కలయికని సంయుక్తం (క్త, క్న) అని అంటారు. తెలుగు మొదలయిన ద్రావిడ భాషలలో ద్విత్వ హల్లులే అధికంగా ఉంటాయి.

## 16.2 మూలద్రావిడ భాష :

క్రీ.పూ. 3000 సంవత్సరాల నాడు భారతదేశంలో మూలద్రావిడం అనే ఒక భాష ఉందనీ ఆ తరువాత అది వివిధ భాషలుగా విడిపోయిందని ప్రొఫెసర్ ఆంద్రినోవ్, భద్రిరాజు కృష్ణమూర్తి మొదలయిన భాషావేత్తలుంటున్నారు.

1816లో A.D. Campbell రాసిన 'A Grammar of Gentoo or Teloogoo Language' అనే పుస్తకానికి ఉపోద్ఘాతాన్ని ఇండియన్ సివిల్ సర్వీస్‌లో పనిచేసే Francis Whyte Ellies అనే ఆయన రాశాడు. దానిలో మొట్టమొదట

1. తమిళం
2. మలయాళం
3. కన్నడం
4. తెలుగు
5. తుళు
6. కొడగు
7. మాల్తో

అనే భాషలు ఒకే భాషా కుటుంబానికి చెందినవనీ, వాటికే సంస్కృతానికీ ఎలాంటి జన్మ సంబంధం లేదనీ చెప్పాడు. ఈ భాషల్ని ఆయన 'Dialects of Southern India' అన్నాడు.

ఈ భాషలకు ద్రావిడ భాషలు అని నామకరణం చేసింది మాత్రం ద్రావిడ భాషా పరిశోధన పితామహుడని పేరు పొందిన రాబర్టు బిషప్ కాల్డ్‌వెల్. ఈయన 1856లో 'A Comparative Grammar of Dravidian or South Indian Family of Languages' అనే పుస్తకాన్ని ప్రచురించాడు. ఇందులో 'ద్రవిడయన్' అనే పదాన్ని ఆయన భాషలకు మొట్టమొదటగా వాడగా ఆ తరువాత పరిశోధన చేసిన భాషా శాస్త్రజ్ఞులు దానిని ఆమోదించి ఆయా భాషలకు ద్రావిడ భాషలు లేదా ద్రావిడ భాషా కుటుంబం అని వాడటం మొదలుపెట్టారు.

ఇప్పటివరకు జరిగిన పరిశోధనలలో ద్రావిడ భాషలు 26 అని తేలింది. (ఇంకా పరిశోధన జరగవలసిన భాషలు ఉన్నాయి) వీటన్నింటికి మూలం 'మూలద్రావిడ భాష' (Proto-Dravidian) అనేది పరిశోధకుల నిర్ణయం. ఈ భాషను గురించి విన్నవారు గాని, లేఖనం చూసిన వారు గాని లేరు. మరి ఈ భాష గురించి గాని, భాషలోని వర్ణాల గురించి గాని ఎలా చెప్పగలరు?

## 16.3 పునర్నిర్మాణ పద్ధతి :

ఇప్పటి వరకు జరిగిన పరిశోధనలలో 26 ద్రావిడ భాషలు ఉన్నాయని చెప్పుకోవటం జరిగింది. వీటిని సోదర భాషలు అంటారు. సోదర భాషలలో ఉన్న వర్ణాలు, భిన్న భాషలలో ఉన్న వర్ణాల పరస్పర సంబంధం ఆధారంగా తులనాత్మక పద్ధతి

(comparative method) సహాయంతో మూలభాషలోని వర్ణాలను పునర్నిర్మించవచ్చు. దీనికి భాషా శాస్త్రజ్ఞులు కొన్ని ప్రామాణిక, శాస్త్రీయ పద్ధతుల్ని అనుసరించారు. వాటిని పునర్నిర్మాణ పద్ధతులు (reconstruction methods) అంటారు. వీటిని ఆధారం చేసికొని మూలద్రావిడ భాషలోని వర్ణాలను పునర్నిర్మించారు.

తులనాత్మక పరిశోధనలో ధాతువు (root), నిష్పాదక ప్రత్యయం (derivative suffix) - ఈ రెంటికీ ఉన్న భేదాన్ని తెలుసుకోవడం అవసరం. సోదర భాషలలో ఉన్న సమాన పదాల (cognates) లో మొదట కొన్ని వర్ణాలే తుల్యంగా ఉంటాయి. ఇలా అన్ని భాషలలోనూ తుల్యంగా ఉన్న వర్ణ సముదాయాన్ని ధాతువు అంటారు. ధాతువులో వర్ణాలు తుల్యంగా లేకపోయినా కొన్ని భాషలలో నియతమయిన ధ్వని పరిణామాలు పొంది ఉండవచ్చు. ధాతువు తర్వాత ఉన్న వర్ణ సముదాయాన్ని నిష్పాదక ప్రత్యయం అంటారు. కొన్ని కొన్ని సందర్భాలలో నిష్పాదక ప్రత్యయం లేకుండా కేవలం ధాతువు మాత్రమే ఉంటుంది. ద్రావిడ భాషా కుటుంబంలోని ధాతువుల్ని వాటి స్వరూప స్వభావాల్ని బట్టి ఆరు రకాలుగా విభజించడం జరిగింది.

పునర్నిర్మాణ పద్ధతుల ద్వారా మాత్రమే నిర్మించే భాష కాబట్టి మూలద్రావిడ భాషని పునర్నిర్మాణ భాష లేక పునర్నిర్మిత భాష అంటారు.

అలా పునర్నిర్మితమయిన ఈ మౌలిక ద్రావిడ భాషా వర్ణాలు ఈ కింది విధముగా ఉంటాయి.

**అచ్చులు :**

| | అగ్రం (Front) | కేంద్రం (Center) | పశ్చిమం (Back) |
|---|---|---|---|
| ఉన్నతం (High) | ఇ ఈ | | ఉ ఊ |
| మధ్యమం (Middle) | ఎ ఏ | | ఒ ఓ |
| నిమ్నం (Low) | | అ ఆ | |

(ఐ కారం అయ్‌తో తుల్యమయినది. అలాగే ఔకారం అవ్‌తో తుల్యం. కాబట్టి ఐ,ఔ లను ప్రత్యేక వర్ణాలుగా పరిగణించరు)

**హల్లులు :**

| | కంఠ్యం | తాలవ్యం | మూర్ధన్యం | దంతమూలీయం | దంత్యం | ఓష్ఠ్యం |
|---|---|---|---|---|---|---|
| స్పర్శం | క | చ | ట | త | త | ప |
| అనునాసికం | | ఞ | ణ | (న) | న | మ |
| అంతస్థం | | య | | | | వ |
| కంపితం | | | | ర | | |
| పార్శ్వికం | | | ళ | ల | | |
| ఈషత్స్పృష్ట పార్శ్వికం | | | ఱ | | | |

మొత్తం మీద ద్రావిడ భాషా వర్ణాలు పది అచ్చులు, పదహారు హల్లులతో కలసి 26 వర్ణాలు. మూలద్రావిడ భాషలో వర్ణాల వ్యాప్తి ఈ కింది విధంగా ఉంటుంది.

1. మూర్ధన్య వర్ణాలయిన ట, ణ, ళ, ఱ, దంతమూలీయ వర్ణాలయిన త, (న), ర, ల లూ పదాదిన రావు. తెలుగు, కువి ఉపకుటుంబంలో మాత్రం వర్ణ వ్యత్యయం వల్ల కొన్ని పదాలలో పదాదికి రావడం జరిగింది.
2. ట,ణ,ళ, త, ల (ర, ఱ లు తప్ప మిగిలినవి) ద్విరుక్తంగా కూడా ఉంటాయి.
3. మూలభాషలో కంఠ్యానునాసికం (ఙ) ఒక్క కకారం ముందు మాత్రమే ఉండటం చేత దానిని ప్రత్యేక వర్ణంగా పరిగణించరు.
4. దంతమూలీయ నకారాన్ని (న) ప్రత్యేక వర్ణంగా చెప్పవచ్చని పి.ఎస్. సుబ్రహ్మణ్యం గారు కొన్ని ఉదాహరణలు కూడా ఇచ్చారు. వారు చేసిన చర్చ సశాస్త్రీయమే అయినా భాషా శాస్త్రజ్ఞులు ఆమోదం పొందవలసి ఉంది).
5. మూలద్రావిడ భాషలో నాదస్పర్శాలు (గజడదబ) ప్రత్యేక వర్ణాలు కావు. అవి కేవలం సవర్ణాలు మాత్రమే. తమిళ, మలయాళాలు తప్ప మిగిలిన భాషలలో ప్రాచీనమయిన శ్వాస స్పర్శాలు (కచటతతప) కొన్ని పదాలలో నాద స్పర్శాలుగా తర్వాత కాలంలో మారాయి.
6. పదాదిన ఙ, ట, ఞ, ణ, ళ అనే వర్ణాలు రావు.
7. పదాదిన సంయుక్త వర్ణాలూ, ద్విరుక్త వర్ణాలు లేవు.

## 16.4 తెలుగు వర్ణాలు :

సంప్రదాయ వ్యాకరణంగా పేరుగాంచిన చిన్నయసూరి బాలవ్యాకరణం సంజ్ఞా పరిచ్ఛేదం లో 'తెలుగునకు వర్ణములు ముప్పది ఆఱు' అని సూత్రించి 'అ ఆ ఇ ఈ ఉ ఊ ఎ ఏ ఐ ఒ ఓ ఔ అం అఁ క గ చచ జ జ ట డ ణ త ద న ప బ మ య ర ల వ స హ ళ' లను పేర్కొన్నాడు.

ఆ తర్వాత సూత్రంలో 'ఋ ౠ : ఖ ఛ ఠ థ ఫ ఘ ఝ ఢ ధ భ ఙ ఞ శ ష లు సంస్కృత సమంబులను గూడి తెలుగున వ్యవహరింపబడు' అంటాడు. దీనిని బట్టి తత్సమాది భేదాలతో గూడిన తెలుగు భాషకు 55 వర్ణాలు అని అర్థమవుతుంది. కాగా బహుజనపల్లి సీతారామాచార్యులు ప్రౌఢ వ్యాకరణంలో 'ఆంధ్రభాషకు వర్ణంబు లేబది యైదు' అని సంస్కృత ప్రాకృతాల నుంచి వచ్చి చేరినా అవి తెలుగు భాషలో అంతర్భాగంగానే భావించి మొత్తం వర్ణాలను ఆంధ్రభాషావర్ణాలుగా పరిగణించాడు.

తెలుగులో తత్సమాల వలన ప్రవేశించిన మహా ప్రాణాలూ, శ ష స వర్ణాలు కాక కేవల దేశ్య వర్ణ మాలను ఏర్పాటు జేస్తే ఆ దేశ వర్ణమాల ఈ కింది విధంగా ఉంటుంది.

**అచ్చులు :**

| | అగ్రం | కేంద్రం | పశ్చిమం |
|---|---|---|---|
| ఉన్నతం | ఇ ఈ | | ఉ ఊ |
| మధ్యమం | ఎ ఏ | | ఒ ఓ |
| నిమ్నం | | అ ఆ | |

**హల్లులు :**

| | | కంఠ్యం | తాలవ్యం | మూర్ధన్యం | దంతమూలీయం | దంత్యం | ఓష్ఠ్యం |
|---|---|---|---|---|---|---|---|
| స్పర్శం | శ్వాసం | క | | ట | | త | ప |
| | నాదం | గ | | డ | | ధ | బ |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| స్పృష్టోష్మం | శ్వాసం | చ | | | | |
| | నాదం | జ | | | | |
| ఊష్మం | | | | స | | |
| అనునాసికం | | | ణ | | న | మ |
| పార్శ్వికం | | | ళ | ల | | |
| కంపితం | | | | ర | | |
| అంతస్థం | | య | | | | వ |

చిన్నయసూరి 'హ' కారాన్ని కూడా తెలుగు వర్ణమాలలోనే చేర్చాడు. అంటే ఆయన ఉద్దేశంలో 'హ' కారం దేశీయ వర్ణమేనన్నమాట. కాని భాషా శాస్త్ర పండితులు 'హ' కారాన్ని దేశీయ వర్ణంగా భావించడం లేదు. ఇది కన్నడ భాష నుంచి వచ్చి చేరిన ఎరవు వర్ణం అంటున్నారు.

దేశీయ వర్ణమాలలో లేకుండా తెలుగు వర్ణమాలలోకి సంస్కృతాది భాషల మూలంగా వచ్చి చేరిన వర్ణాలు ఋ, ౠ, () విసర్గ, ఖ ఛ ద థ ఫ ఘ ఝ ఢ ధ భ జ ఇ శ ష లు.

మూలద్రావిడ భాషలో ఉండి తెలుగులో లేని వర్ణాలు జ ఇ ఱ, త లు. మూలద్రావిడంలో లేకుండా తెలుగులో అధికంగా ఉన్న వర్ణాలు :

గ జ డ ద బ ఛ జ న లు (సంస్కృత భాష నుంచి వచ్చి చేరిన వర్ణాలు అదనం) కాగా 'తి' కారం ప్రాచీన భాషలో అంటే ప్రాఙ్నన్నయ కాలం నాటికి ఉండి ఆ తర్వాత కాలక్రమేణా డ ల ర ళ య గా మారిపోయింది. ఇక జ ఇ లకు ఈనాటి తెలుగులో వ్యస్త ప్రయోగం లేదు. జ ఇ లకు పదాదిలో గాని పదమధ్యమంలో గాని ఎక్కడా ప్రయోగం కనిపించదు. జ ఇ ల స్థానంలో బిందువు కనిపిస్తుంది. ప్రాచీన కాలంలో ఎక్కడయినా సంయుక్తాక్షరాల స్థానంలో ఉన్న జ ఇ లు అనుస్వారం వాడుకలోకి రాగానే భ్రష్టమయిపోయాయి.

మూలద్రావిడ వర్ణాలని, తెలుగు వర్ణాలని పరిశీలిస్తే కొన్ని భేద సాదృశ్యాలను గమనించవచ్చు. అవి.

**అచులు :**

ఎ) తెలుగులో అకార ఎ కారాల మధ్యగా ఉండే ఉన్నతాచ్చు 'ఏ' ఆధునిక తెలుగు భాషలో ప్రత్యేక వర్ణంగా చేకూరి రామారావు గారి లాంటివారు గుర్తిస్తున్నారు.
ఉదా : తాటాకు, మేక, వెళ్ళాడు, వచ్చాడు మొ॥నవి.

బి) మూలద్రావిడ భాషలో పదాదిన ఉన్న ఇ, ఉ లు తెలుగులో ఎ, ఒ లుగా పరిణమించాయి.

ఉదా : *ఇర్ > ఎర్ > రె(ండు)

*ఉళ్ > ఒళ్ > లో (న)

సి) మూలద్రావిడంలో పదాదిన అచ్చు ఉండి రెండవ స్థానంలో డ, ల, ర, ళ, తి - లలో ఏ హల్లు అయినా ఉంటే తెలుగులో వర్ణ వ్యత్యయం జరిగి ఆ హల్లు పదాదికి వస్తుంది.

*అట > డాగు

*పుతిల్ > ప్రోలు

*ఉళ్ > లో

*ఇల్ > లే (త)

డి) మూలద్రావిడంలో తాలవ్యాచ్చుతో కూడిన పదాది కకారం తెలుగులో చకారంగా మారుతుంది.

కివి > చెవి

కిళి > చిలుక

ఇ) మూలద్రావిడ భాషలోని చకారం సకారంగా మారింది.

* చాగు > సాగు

* చుటి > సుడి

### 16.5.0 అచ్చులు :

తెలుగులోని అచ్చులు ఏ మూల భాషా వర్ణాల నుంచి వచ్చాయో పరిశీలించండి :

**అ < *అ**

మూల ద్రావిడ భాషలోని అకారం నుంచి తెలుగు అకారం వచ్చింది.

| | | |
|---|---|---|
| ఉదా : | తమి. | అరై |
| | మల. | అర |
| | తొద. కోత. | అర్ |
| | కన్నడం, తుళు | అరె |
| | తెలుగు | అర (సగం) |

**ఆ < *ఆ**

మూల ద్రావిడ 'ఆ' నుంచి వచ్చింది.

| | |
|---|---|
| తమిళం, మలయాళం | ఆటు |
| కోత. | ఆడ్- |
| తొద. | ఓడ్- |
| కన్నడం, తుళు | ఆడు |
| కోలామీ, నాయకీ | ఆడ్- |
| తెలుగు | ఆడు |

**ఇ < *ఇ**

మూలద్రావిడ 'ఇ' నుంచి వచ్చింది.

| | |
|---|---|
| త.మ. | ఇల్, ఇల్లం |
| క.తు.కు. | ఇల్లు |
| కో.నా. | ఎల్ల |
| ప, పెం. మం. | ఇల్ |

| | |
|---|---|
| కొండ | ఇలు |
| తెలుగు | ఇల్లు |

**ఈ < *ఈ :**

మూలద్రావిడ 'ఈ' కారం దీనికి మూలం.

| | |
|---|---|
| త. | ఈ |
| మ. | ఈచ్చ |
| తొ. | ఈవ్య |
| కోత. | ఈవ్ |
| కో.నా. | నీంగ |
| కూ.మా. | ఈ |
| బ్రా. | ఈల్ |
| తెలుగు | ఈగ |

**ఉ < *ఉ :**

మూలద్రావిడంలో 'ఉ' కారం దీనికి మూలం.

| | |
|---|---|
| త.మ. | ఉళ్ |
| తొ. | విళ్ద్ |
| కోత. | ఒళ్ |
| క. | ఉళ్, ఒళ్ |
| కొ.తు | ఉళ్ల్ |
| బ్రా. | ఉట్ |
| తెలుగు. | ఉండు |

**ఊ < *ఊ :**

మూలద్రావిడ 'ఊ' నుంచి వచ్చింది.

| | |
|---|---|
| త.మ. కోత. తొ. క | ఊర్ |
| కొడగు | ఊరు |
| కోలామీ, నాయకీ | ఊర్ |
| బ్రాహుఈ | ఉరా |
| తెలుగు | ఊరు |

**ఎ < *ఎ :**

మూలద్రావిడం 'ఎ' నుంచి వచ్చింది.

| | |
|---|---|
| త.మ. | ఎలి |
| కోత. | ఎయ్జ్ |

| | |
|---|---|
| క.తు. | ఎలి, ఇలి |
| కొ. | ఎలి |
| కో.నా. | ఎల్క |
| పర్జీ | ఎల్ |
| గోండి. | అల్లీ, ఎల్లీ |
| కొండ. | ఎల్క |
| బ్రా. | అల్ |
| తెలుగు | ఎలుక |

**ఏ < *ఏ**

మూలద్రావిడ 'ఏ' నుంచి వచ్చింది.

| | |
|---|---|
| త.మ. | తేళ్ |
| క. | తేళ్, తేళు |
| కొ. | తేళు |
| తు. | తేళు |
| మా. | తేలె |
| బ్రా. | తేల్ |
| తె. | తేలు |

**ఒ < *ఒ :**

మూలద్రావిడ 'ఒ' నుంచి వచ్చింది.

| | |
|---|---|
| త. | ఒన్టు |
| బ్రా. | అసిట్ |
| తె. | ఒకటి |

**ఓ < *ఓ**

మూలద్రావిడ 'ఓ' నుంచి వచ్చింది.

| | |
|---|---|
| క.త.మ.కోత. | పోర్ |
| తొద. | పీర్ |
| తెలుగు, కుఇ | పోరు |

## 16.6 హల్లులు :

ఎ) మూలద్రావిడంలో కేవలం సవర్ణాలుగా ఉన్న సరళాలు పరిణామదశలో తెలుగులో ప్రత్యేక వర్ణత్వాన్ని పొంది ఉన్నాయి. ఇవి పదాదిలో కనిపిస్తాయి.

| | | | |
|---|---|---|---|
| పడి | తగ్గు | చూలు | కసి |
| బడి | దగ్గు | జూలు | గసి |

తెలుగులో సరళాలు ప్రత్యేక వర్ణాలుగా ఏర్పడటానికి సంస్కృతాది అన్యభాషల ప్రభావం కొంతవరకు కారణమయి ఉండవచ్చు. కాబట్టే తెలుగులో ఎక్కువ పదాలు సాధారణంగా మొదట పరుషాలుగా ఉండి తరువాత సరళాలుగా కనిపిస్తాయి.

| | | | |
|---|---|---|---|
| పుక్క | తూఱు | కడప | చప్పున |
| బుక్క | దూఱు | గడప | జప్పున |

బి) చ జ లకు మూలద్రావిడంలో లేని దంత్య తాలవ్య భేదం తెలుగులో కనిపిస్తుంది. అయితే ఈ భేదం అంతటాగాక కొన్ని వర్ణాలకు ముందు మాత్రమే కనిపించడంతో దంత్య, తాలవ్యాలు ప్రత్యేక వర్ణాలుగా కాక సవర్ణాలుగానే చెప్పవచ్చు.

సి) మూలద్రావిడంలోని పదాది చకారం కొన్ని చోట్ల తెలుగులో లోపిస్తుంది.

*చుప్ప్ > ఉప్పు

డి) మూలద్రావిడంలో లేని దంతమూలీయ ఊష్మధ్వని 'స' తెలుగులో క్రమంగా ఏర్పడింది. ఇది మూలద్రావిడ 'చ' కారం నుంచి ఏర్పడినట్లుగా నిర్ధారించవచ్చు.

చుటి > సుడి

ఇ) మూలద్రావిడంలో లేని 'హ' తెలుగులో ఉంది. ఇది మూలద్రావిడ 'ప' వర్ణం నుంచి పరిణామం చెందిన వర్ణం. ఈ పరిణామం మొదట కన్నడంలో జరిగి ఆ తర్వాత కన్నడం నుంచి తెలుగులోకి ప్రవేశించింది. అందుచేతనే కన్నడ ప్రభావంవల్ల తెలుగులోకి ప్రవేశించిన హకారయుత రూపాలతో బాటుగా సరాసరి మూలద్రావిడం నుంచి వచ్చిన పకారయుత రూపాలు కూడా తెలుగులో ఉన్నాయి.

| మూలద్రావిడం | కన్నడం | తెలుగు |
|---|---|---|
| *పేర్ | హెచ్చు | హెచ్చు |
| *పేర్ | - | పెచ్చు |
| *పొన్ | హొన్ను | హొన్ను |
| *పొన్ | - | పొన్ను |

ఎఫ్) మూలద్రావిడంలో ప్రత్యేకవర్ణమయిన 'ఞ' తెలుగులో 'న' గా మారింది. అంతేగాక 'ఞ' 'ఆ' వర్ణాక్షరంతో కూడినప్పుడు అనునాసిక ధ్వనిని సూచించే సవర్ణంగా ఏర్పడింది.

*ఞా ఞ్చిల్ > నాగలి

*ఞె రిప్పు > నిప్పు

జి) మూలద్రావిడంలోని 'ణ' 'న' గా మారింది.

*అణ్ణ > అన్న

*కణ్ > కన్ను

హెచ్) మూలద్రావిడంలో రేఫాది పదాలు లేవు. తెలుగులో వర్ణ వ్యత్యయం వల్ల రేఫ పదాదికి వస్తుంది.

ఇరణ్టు > రెండు

ఐ) మూలద్రావిడ 'ళ్' 'ల' గా మారింది.

*కళ్ > కల్లు

*తేళ్ > తేళు

జె) తెలుగు శాసనాల్లోనూ, ప్రాచీన కావ్యభాషలోనూ కనిపించే 'ఱ' నేటి వ్యవహారంలో లేదు. అంటే సాధు శకటరేఫలకు ఉచ్చారణలో భేదం లేదు. ఇప్పుడు ఎవరన్నా 'ఱ' వాడినా ఒకే రేఫానికి లేఖన చిహ్నంగా మాత్రమే వాడుతున్నారనేది గ్రహించాలి. అంటే తప్ప వాటిలో ధ్వని భేదం మాత్రం లేదు.

కె) మూలద్రావిడంలోని ద్విరుక్తశకటరేఫ తెలుగులో 'ట' గా మారింది.

* మాఱ్ఱు > మాట

ఎల్) మూలద్రావిడంలోని అచ్చుల మధ్య గల దంతమూలీయ తకారమే (త్) తెలుగులో శకటరేఫ (ఱ) గా మారింది.

*కుత్ > కుఱ్ఱు

ఎమ్) మూలద్రావిడంలోని 'ఴ' అచ్చుల మధ్య 'డ' గానూ, పదాదిన సంయుక్తంగా, వర్ణ వ్యత్యయం వల్ల రేఫగానూ మారింది.

*ఏఴు > ఏడు

*ప్ఴోలు > ప్రోలు

హల్లులు మూలద్రావిడ భాష నుంచి తెలుగులోకి పరిణామం చెందినప్పుడు ఆయా వర్ణాలు ఎలా పరిణామం చెందాయో పరిశీలిద్దాం.

ఒక్క తమిళ, మలయాళాలు తప్ప తెలుగాది అన్ని భాషలలోనూ క చ ట త ప లూ, గ జ డ ద బ లూ ప్రత్యేక వర్ణాలే.

హల్లులు పదాదిలోనూ, పదమధ్యంలోలనూ, పదాంతంలోనూ, పదమధ్యంలో ద్విరుక్తంగా కూడా ఉండవచ్చు. రెండు రకాల ధ్వనులకు భేదక ప్రవృత్తి (Contrastive distribution) ఉంటే వాటిని ప్రత్యేక వర్ణాలుగా పరిగణిస్తారు.

తెలుగులో కొన్ని ఉదాహరణలను పరిశీలించుదాం.

**ఉదా :**

ఎ) కట్టు ఆకు మొక్క వంక

గట్టు ఆగు మొగ్గ వంగ

పయి ఉదాహరణల వల్ల క, గ లు ప్రత్యేక వర్ణాలు.

బి) చరుపు కాచు గుచ్చు ముంచు

జరుపు బూజు గుజ్జు ముంజె

చ, జ లు ప్రత్యేక వర్ణాలు

సి) టేకు పాడు గుట్ట పెంట

డేకు పాటు గుడ్డ ఎండ

ట, డ లు ప్రత్యేక వర్ణాలు

డి) తడి బాతు ఎత్తు అంతం
దడి బాదు ఎద్దు అందం
త, ద లు ప్రత్యేక వర్ణాలు

ఇ) పాట ఉప్పు డప్పు చెంప
బాట ఉబ్బు డబ్బు చెంబు
ప, బ లు ప్రత్యేక వర్ణాలు

మూలద్రావిడంలో ఉన్న హల్లులు తెలుగుభాషా వర్ణాలుగా మారినప్పుడు అవి ఎలా పరిణమించాయో చూడండి.

**హల్లులు :**

క

క - < * క- (తాలవ్యేతర అచ్చుల ముందు మూలద్రావిడ భాషలోని క కారం క కారం గానే ఉంది. తాలవ్యాచ్చుల ముందు 'క' 'చ' కారంగా మారింది. దీనినే తాలవ్యీకరణ అంటారు)

-క-, -క్క-< *, *-ర్క-

-ంక-<* -ంక్క-

గ

గ- < * (బహుళంగా)

-గ- < *-క-

-గ్గ- < *-ఙగ-, < *-ఙ్ గ-

-ంగ- < *-ంక-

చ

చ- < *క (తాలవ్యాచ్చుల ముందు), < *చ-

-చ-, -చ్చ- < *-చ్చ-

-ంచ-< *-ంచ్చ-

జ

జ- < *చ (బహుళంగా)

-ంజ- < *-ంచ-

ట

-ట-, -ట్ట- < *-ట్ట-, *ట్ఱ

-ంట- < *-ంట్ట-

డ

-డ- < *-ట-, *-ఱ-

-డ- < *-ట-, *-ఱ-

-డ్డ- < *-ట్ట-

-ండ- < *-స్ఠ-, *-ంట-

ణ

-ణ- < *-ణ-

-ణ్ణ- < *ణ్ణ (ప్రాఙ్నన్నయ యుగశాసనాలలో ప్రచురంగా ఉంది. తరువాత తెలుగులో ‘న’ గా మారింది).

త

త- < *త-

-త-, త్త < *-త్త-

-ంత- < *-ంత్త-

ద

ద- < *త- (బహుళంగా), *-తి-, *-ట-

-ద- < *-త-

-ద్ద- < *-ర్త- *-త్తి-

-ంద- *-ంత-, *-స్థ-

న

న < *న, *న, *ఞ, *ణ

ప

ప- < *ప-

ప-, -ప్ప- < *-ప్ప-, *-ర్ప-

-ంప- < *-ంప్ప-

బ

బ- < *ప (బహుళంగా) *వ- (క్వాచిత్కంగా)

-బ్బ- < *-ప్ప-, *-ర్ప-

-ంబ- < *-ంప-

మ

మ- < *మ-

-మ- < *-మ్మ- *-మ-, *-ంప-

య

-య- < *-య-

ర

ర < *ర, *ఱ, *ఱ

ఱ

ఱ < *ఱ (*త)

ల

ల < *ల, *ళ

వ

వ < *వ

స

స< *చ (క్వాచిత్కంగా)

హ

హ- * కన్నడ హ- *ప- (తెలుగులో హత్తు, హెచ్చు, హొన్ను మొదలయిన హకారాది పదాలు కన్నడ భాష నుంచి ఎరవు తెచ్చుకున్నవి. ఇలాంటి పదాల సంఖ్య చాలా స్వల్పం.)

### 16.7.0 తెలుగు భాషలో జరిగిన సాధారణ పరిణామాలు :

మొత్తం మీద తెలుగు భాషలో జరిగిన సాధారణ పరిణామాలు అయిదు ఉన్నాయి. అవి :

1. దీర్ఘాచ్చు నిష్పాదక ప్రత్యయం ముందు హ్రస్వం కావడం.
2. యకారం ముందు హ్రస్వాచ్చు దీర్ఘం కావడం.
3. వర్ణ వ్యత్యయం
4. మూలద్రావిడ పదాది *చకార లోపం
5. మూలద్రావిడ శ్వాస స్పర్శాలు కొన్ని పదాలలో నాదస్పర్శాలుగా మారడం.

పైన పేర్కొన్న విధంగా మూలద్రావిడ వర్ణాలు క్రమపరిణామానికి లోబడి తెలుగు భాషలోకి ఆవిష్కరించబడడం జరిగింది.

### సమీక్ష :

మూలద్రావిడ వర్ణాలు (అచ్చులు, హల్లులు) తెలుగు వర్ణాలుగా ఎలా పరిణమించాయో ఈ పాఠంలో తెలుసుకున్నారు.

### ప్రశ్నలు :

1. మూలద్రావిడ వర్ణాలు తెలుగులో పరిణమించిన తీరును సోదాహరణంగా వివరించండి.

### ఉపయుక్తగ్రంథాలు :

సుబ్రహ్మణ్యం, పి.ఎస్ : ద్రావిడభాషలు, సత్యవతీ పబ్లికేషన్సు, నెం. 4, చంద్రారెడ్డి రోడ్డు, అన్నామలైనగర్-608101, 1977.

**ఆచార్య పి. సుబ్బారావు**

పాఠం - 18

# నామవాచకం - నిర్మాణం, లింగం, వచనం, విభక్తి - పరప్రత్యయాల చరిత్ర - ఔపవిభక్తులు సంఖ్యావాచకాలు - సర్వనామాలు - విశేషణాలు

**నామవాచకం :**

**లక్ష్యం :**

ఈ పాఠంలో నామవాచకం - నిర్మాణం, లింగవచనం, విభక్తి - పరప్రత్యయాల చరిత్ర - ఔపవిభక్తులు - సంఖ్యావాచకాలు, సర్వనామాలు - విశేషణాల గురించి తెలుసుకుందాం.

## 18.0. నామవాచకం - నిర్మాణం :

సంపూర్ణ భావాన్ని తెలిపే పదసముదాయాన్ని వాక్యం అంటారు. పదాలు వాక్యానికి అంగాలు. సందర్భాన్నిబట్టి (రా, చెట్టు) ఏకపదం వాక్యంగా ఏర్పడినా, చాలా మాత్రం వాక్యంలో ఒకటి కంటే ఎక్కువ పదాలుంటాయి పై "రా" "చెట్టు" అనే ఉదాహరణాల్లో కూడా "నీవు ఇటురా" అనే వాక్య అంతర నిర్మాణానికి బాహిర నిర్మాణంగా "రా" అనే ఏకపదమే వచ్చింది. అలాగే అదేమి ? అన్న ప్రశ్నకు జవాబుగా "అదిచెట్టు" అనే రెండు పదాలు వాక్య అంతర నిర్మాణానికి చెట్టు అనే ఏకపద వాక్యం బాహిర నిర్మాణంలో ఏర్పడింది.

## 18.1.1 పదవర్గీకరణ

సంస్కృత భాషలో "యాస్కుడు" తన "నిరుక్తము"లో పదాల్ని నాలుగు విధాలుగా విభజించాడు. 1. నామము, 2. ఆఖ్యాతము (క్రియ), 3. ఉపసర్గలు, 4.నిపాతములు అనేవి.

భర్తృహరి "వాక్యపదీయము"లో అయిదవ విభాగంగా 'కర్మ ప్రవచనీయములు" చెప్పబడ్డాయి.

| | | | |
|---|---|---|---|
| 1. | నామాలు (సుబంతాలు) | : | గోవు, అశ్వము పురుషుడు మొదలైనవి |
| 2. | ఆఖ్యాతాలు (తిజంతాలు) | : | పచతి, కరోతి మొదలైనవి |
| 3. | ఉపసర్గలు | : | ప్ర, పరా, అప మొదలైనవి |
| 4. | నిపాతాలు | : | ఓమ్, నమః మొదలైనవి |

## 18.1.2 తమిళభాష :

"తొలాప్పియం"లో 1) పెయర్ (పేరు = నామం)

2) విన్నై (క్రియ = ఆఖ్యాతం)

3) ఇడైచ్చొల్

4) ఉరిచ్చొల్ అని నాలుగు విధాలుగా విభజింపబడ్డాయి.

'ఇడైచ్చొల్' విభాగంలోని శబ్దాలకు స్వతంత్ర ప్రయోగం లేదు. ఇది నామాల్తో, క్రియల్తో ముందు వెనుకల ప్రయోగింపబడతాయి. అంటే నామవిభక్తులు, క్రియా విభక్తులు, ధ్వన్యనుకరణ శబ్దాలు మొదలైనవి ఈ విభాగంలో చేరతాయి.

"ఉరిచ్చొల్" విభాగం ధాతుశబ్దంతో సమానం. వ్యుత్పత్తి తెలియని మూలరూపాలు ఇందులో చేర్చబడ్డాయి. నామవిశేషాలని క్రియావిశేషణాలని వేర్వేరు అభిప్రాయాలున్నాయి.

### 18.1.3 కన్నడం :

నామం, సర్వనామం, ఆఖ్యాతం, అవ్యయం, నిపాత (నాగవర్మకృత, కర్ణాటక భాషాభూషణం)

నామం, ఆఖ్యాతం, అవ్యయం (శబ్దమణి దర్పణం)

### 18.1.4 తెలుగు :

'ఆంధ్ర శబ్ద చింతామణి'లో పదవిభాగం లేదు కానీ ప్రాతిపదికము (నామం), క్రియ (ధాతువు) ప్రత్యయం (వర్ణకం) అనే వాటిని గూర్చి తెలుపబడింది. బాలవ్యాకరణంలో పదవిభజన లేదు. ప్రౌఢవ్యాకర్త 'పదములని నామములు, క్రియలు, అవ్యయంబులని త్రివిధంబులు' అని పదాల్ని మూడు విధాలుగా విభజించాడు.

### 18.1.5 నామపద స్వభావం :

కేవలం "ప్రాతిపదికము" అనే అర్థంలో చింతామణి "నామ" శబ్దాన్ని ప్రయోగించింది. ఇంగ్లీషులో 'Noun' అనేది ఒక భాషా భాగం. దాని అర్థం "నామ" శబ్దానికి ఉంది. వీటినే "నామవాచకాలు" అంటారు. ఇవే పేర్లు (A Noun is the name of a person, place or thing) వస్తువు, ప్రదేశం, మనుష్యులు అనే వాటి పేర్లు నామవాచకాలు)

తెలుగులో అనేక శబ్దాలకు ప్రథమా విభక్తి ఏకవచన ప్రత్యయం అక్కర లేకుండానే ప్రాతిపదిక తుల్యాన్నే ప్రయోగిస్తారు. ఉదా ॥ అమ్మ, నాన్న, తాత, అన్న, రాయి, పులి మొదలైనవి. అందువల్లే ఆచ్ఛిక శబ్దాలన్నీ తరచుగా స్త్రీ సమాల్లో, క్లైబసమాలో అయి వుంటాయని చిన్నయసూరి అన్నాడు. ప్రథమైక వచన ప్రత్యయం లోపించినది స్త్రీ సమాలు.

తెలుగులో నామాలకు, క్రియలకు ఒకటే మూలరూపం అదే భిన్నంగా ప్రయోగింపబడుతుంది.

"పండు" నామం ప్రథమావిభక్త్యంతం

"పండుగాయ" దీనిలో "పండు" విశేషణం

"పండుతున్నది" పండు + తు + ఉన్నది. ఇందులో "పండు" క్రియ ఇలాంటి పదాలు చాలా ఉన్నాయి.

తెలుగు నామాలు సంస్కృత నామాల కంటే భిన్నాలు ఇవి అలావాక్యాలు, ఒకదానికొకటి చేరి అర్థవిశేషాల్ని తెలుపుతుంటాయి. నామానికి ఉండే లక్షణాల్లో లింగ, వచన, విభక్తులు ఒకటి.

| | | |
|---|---|---|
| ఉదా : రాముడు | : | పుంలింగ, ప్రథమా విభక్తి |
| సీత | : | స్త్రీ లింగం, ఏకవచనం, ప్రథమా విభక్తి |
| పులి | : | అమహత్తు, ఏకవచనం, ప్రథమావిభక్తి |

ఇలా నామం ఏ లింగంలోనైనా, ఏ వచనంలోనైనా, ఏ విభక్తిలోనైనా ప్రయోగింపబడవచ్చు.

నామవాచకాల్ని సంజ్ఞా నామాలుగా సామాన్య నామాలుగా విభజించవచ్చును.

సంజ్ఞానామం వ్యక్తుల్ని, స్థలాన్ని, కాలాన్ని తెలిపేరు.
ఉదా ॥ రాముడు, తిరుపతి, నిన్న

కొన్ని ప్రత్యేక సందర్భాల్లో తప్ప సంజ్ఞానామం బహువచన ప్రత్యయాన్ని చేర్చుకోదు.
ఉదా ॥ ఎంతమంది గాంధీలు జన్మించినా ఈ దేశం గతి ఇంతే.

పై వాక్యంలో "గాంధీ" అనే సంజ్ఞానామానికి బహువచన ప్రత్యయం చేరడానికి ఎలా వీలయిందంటే - సంజ్ఞానామాన్ని సామాన్య నామంగా మార్చటం వల్లనే.

సామాన్య నామాల్ని లెక్కింపదగిన సామాన్యనామాలు అని విభజింపవచ్చు.
వస్తు, జాతి, స్థల, కాల బోధక నామాల్ని లెక్కింపదగిన సామాన్య నామాల క్రింద చేర్చవచ్చును.

ఉదా : పేనా, పులి, దేశం, దినం.
లెక్కింపదగిన నామాలలో పరిమాణాత్మకంగా ఉండే నామాల్ని చేర్చవచ్చు. ఇవి అవిభాజ్యాలు. అమూర్తాలు అని మళ్ళీ విభజించవచ్చు.

ఉదా : ఉప్పు, ఇనుము, వెండి, వడ్లు, పెసలు, పాలు, ఆకాశం, తెలుపు, తెలివి, కోపం, బలం, నిద్ర.

ఈ వర్గంలో నిత్య ఏకవచన, నిత్యబహువచన బోధకాలైన శబ్దాలన్నింటినీ చేర్చుకోవచ్చు.

అలాగే సమూహ వాచక నామాలయిన మంద, గుంపు, సమితి, సంస్థ, సభ సంఘం మొదలైనవి కూడా చేర్చుకోవచ్చు.

## సాధ్యనామాలు :

ఇతర భాషా భాగాల్ని నామవాచకాలుగా మార్చుకోగా ఏర్పడ్డవి సాధ్యనామాలు. వీటిని ఎనిమిది రకాలుగా చెప్పుకోవచ్చు.

### 1) సంఖ్యానామాలు :

ఒకటి, రెండు, మూడు, వంద, వేయి, లక్ష లాంటి సంఖ్యావాచకాలు అటు నామవాచకాలుగానూ, ఇటు విశేషణాలుగాను ఉపయోగపడతాయి. వీటిని వ్యక్తి బోధకాలుగా మార్చుకొన్నా ఈ రెండు విధాలుగా ప్రయోగించవచ్చు.

ఉదా : ఇద్దరు, ముగ్గురు, ఒకడు, ఒకతె, ఒకరు, వందమంది.

### 2) విశేషణ నామాలు :

విశేషణాన్ని నామవాచకంగా మార్చుకోవడం వల్ల ఏర్పడేవి.

ఉదా : తెల్ల - తెల్లన, ఎర్ర - ఎర్రన, మంచి - మంచితనం, వీటిని తద్ధిత నామాలలో కూడా చెప్పుకోవచ్చు.

### 3) క్రియా విశేషణ నామాలు :

క్రియా విశేషణాన్ని నామాలుగా మార్చుకోగా ఏర్పడేవి.
ఉదా : అప్పుడు, ఇప్పుడు, పై తర్వాత మొ॥నవి.

**4) భావార్థక నామాలు :**

క్రియా ధాతువు మీద అటం / అడం చేర్చగా ఏర్పడేవి

ఉదా : తిను - తినడం, వచ్చు - రావడం, కొట్టు - కొట్టడం, ఈ విభాగాన్ని కృదంతాల్లో చేర్చే వీలుంది.

**5) సార్వనామిక విశేష్యాలు :**

విశేషణం మీద సర్వనామం చేరి ఏర్పడేవి

ఉదా : కొత్త + అది > కొత్తది
మంచి + అది > మంచిది మొ॥నవి.
వీటిని సమాసాల్లో చేర్చు వీలుంది.

**6) కృదంత నామాలు :**

క్రియా ధాతువు మీద కృత ప్రత్యయం చేరి ఏర్పడేవి

ఉదా : చేయు + త > చేత
ఆడు + ట > ఆట మొదలగునవి

**7) తద్ధిత నామాలు :**

నామపదం మీద తద్ధిత ప్రత్యయం చేరి ఏర్పడ్డ నామవాచకాలు
ఉదా : ముక్కు + ఇడి > ముక్కిడి
ఆట + కాఁడు > ఆటకాడు

**8) సమస్త నామాలు :**

నామపదం మీద నామపదం చేరి ఏర్పడ్డ సమాసాలు. ఇవే సమాసాలు.

ఉదా : పిట్టగోడ, చెట్టుకొమ్మ మొదలగునవి

**18.1.6 తెలుగు భాషలో నామనిర్మాణం :**

తెలుగులో దేశ్యాలైన నామాలకు సాధారణంగా మూలద్రావిడ భాషలో పూర్వ రూపాలుంటాయి.

ఉదా : కణ్ (మూల ద్రావిడ భాష) తెలుగు. కన్ను
మలై (మూల ద్రావిడ భాష) తెలుగు . మల మొదలగునవి

**'ము' వర్ణం చేరే నామాలు :**

1. అమహత్తులు, అదంతాలు అయితే 'ము' వర్ణకం చేరుతుంది.
ఉదా : వృక్షము

2. 'మిత్ర' లాంటి కొన్ని శబ్దాలకు అటు 'ము' వర్ణకం, ఇటు 'డుజ్' చేరతాయి.

ఉదా : మిత్రము / మిత్రుడు; పాత్రము / పాత్రుడు

## 'వు' వర్ణకం చేరే తత్సమాలు :

1. ఉకారాంతాలు మహత్తులయినా, మహతీవాచకాలైనా, అమహత్తులైనా "వు" వర్ణకం చేరుతుంది.

విష్ణు - 'మహత్' పుంలింగం - విష్ణువు
జరత్కారు - మహతీ - స్త్రీలింగం - జరత్కారువు
తరు - అమహత్తు - న పుంసకలింగం - తరువు
ఉదా : పెర్షో - అరబిక్ : అమీర్ - అమీరు
గరీబ్ - గరీబు

ఇంగ్లీషు : స్కూల్ - స్కూలు
బ్రౌన్ - బ్రౌను

ఇలా నామాలు హలంతాలైతే చివర ఉకారం చేరి అజంతాలు కావడం తెలుగు భాషకు సహజమే.

## పెర్షో - అరబిక్ నామాలు కొన్ని :

| | |
|---|---|
| ఉర్దూ | తెలుగు |
| పహ్ర్ | పారా |
| రోజ్ | రోజు |
| తమాషా | తమాషా |
| రోటీ | రొట్టె |

## పోర్చుగీసు నామవాచకాలు కొన్ని :

అనాస, గొయ్యా (జామ), గోబీ (క్యాబేజీ), బొప్పాయి, టమాటో తాళపుచెవి 'శావి' పోర్చుగీసు పదమే.
ఇంగ్లీషు పదాలు తెలుగులో వేలాది వున్నాయి. కొత్తకొత్తగా ఎన్నో చేరుతున్నాయి.
ఉదా : ఫ్యాన్, కంప్యూటర్ మొదలగునవి

## 2. లింగం

## 18.2.0 తెలుగులో లింగ నిర్మాణం :

తెలుగులో లింగ నిర్మాణాన్ని గురించి తెలుసుకుందాం

స్థూలంగా చెప్పాలంటే - సంస్కృత లింగ విధానానికి తెలుగు లింగ విధానానికి సాదృశ్యం లేదు. తెలుగుకు ఇతర ద్రావిడ భాషల్తో లింగ విధానంలో సాదృశ్యం ఉంది.

'లింగం' అంటే 'చిహ్నం' అని అర్థం. స్త్రీ పురుష చిహ్నాల్లోని భేదాల్ని బట్టి లౌకిక లింగం ఏర్పరచబడుతుంది.

శబ్దానికి చేరే ప్రత్యయాల్ని బట్టి ఏర్పరచుకునే లింగాన్ని 'శబ్ద లింగం' లేదా 'వ్యాకరణ లింగం' అంటారు.

### 18.2.1 సంస్కృత భాషలో లింగ నిర్మాణం :

సంస్కృతంలో లింగం మూడు విధాలు 1) పులింగం 2) స్త్రీ లింగం, 3) నపుంసక లింగం. సంస్కృతంలో లింగశబ్ద ధర్మమే గాని అర్థ ధర్మంకాదు.

ఉదా : కళాత్రమ్ (నపుంసక లింగం) దార (పుంసలిగం) భార్యా (స్త్రీ లింగం) ఇవన్నీ 'పెళ్ళాం' అనే అర్థాన్ని సూచిస్తున్నా వేర్వేరు లింగాల్లో ఉంటున్నాయి. అందువల్లనే సంస్కృత భాషలో లింగం శబ్దధర్మం అని చెప్పబడింది. ఒకవేళ అర్థధర్మం ప్రధానమయితే కళత్రమ్, దార, భార్య అనే మూడు పదాలు స్త్రీ లింగాలుగానే వుండాలి.

అలాగే శిలా, జటా, చమూ, వేణి, జడాచకాలైనా సంస్కృతంలో స్త్రీలింగ శబ్దాలు. "వృక్ష" జడవాచకం అయినా పులింగం.

### 18.2.2. తమిళభాషలో లింగ నిర్మాణం :

ద్రావిడ భాషా కుటుంబంలో ఒకటైన తమిళభాషలో లింగం అర్థాశ్రయం. తమిళంలో లింగం రెండు రకాలు. 1) ఉయర్‌తిణై, 2) అఫ్ఱిణై. ఉయర్‌తిణై అంటే ఉన్నత జాతి. మనుష్యుల్ని దేవతల్ని నరలోక వాసుల్ని తెలిపేది.

అఫ్ఱిణై (ఆల్ + తిణై) అంటే 'అది కాని జాతి' అని అర్థం. జీవమున్నా లేకున్నా తక్కినవన్నీ ఇందులోనే చేరతాయి.

'ఉయర్‌తిణై'లో 'అణ్‌పాల్' (మహత్), పెణ్‌పాత్ (మహతీ) అనే భేదం ఏకవచనంలో వుంటుంది. బహువచనంలో ఇలాంటి బేధం లేదు. బహువచనంలో 'పలర్‌పాల్' అని ఒకేవిధంగా 'తొల్కాపియం'లో చెప్పబడింది. 'అఫ్ఱిణై'లో లింగ భేదం లేదు.

### 18.2.2 కన్నడ భాషలో లింగనిర్మాణం :

ద్రావిడా భాషా కుటుంబంలో ఒకటైన కన్నడ భాషలో లింగం అర్థాన్ని ఆశ్రయించి ఉంటుంది. కన్నడ భాషలో పురుషుల్ని తెలిపే శబ్దాలు పులింగాలు. స్త్రీలను తెలిపే శబ్దాలు స్త్రీ లింగాలు. మిగిలినవి నపుంసక లింగాలు. ఈ సందర్భంలో పులింగ, స్త్రీలింగ, నపుంసకలింగాలు అనే పారిభాషిక పదాలు సంస్కృతం నుండి తెచ్చుకున్నా సంస్కృతంలో వాటి (Concept) భావానికి కన్నడంలో వాటి భావానికి (Concept) భేదం ఉంది. ఈ విభజన కేశిరాజు "శబ్దమణి దర్పణం" లోనిది. క్రియా విభక్తి రూపాలు చివర్లో తమిళ, కన్నడ, మలయాళాల్లో మహతీవాచకాలను 'ళ్' అనే ప్రత్యయం నిరూపిస్తుంది.

### 18.2.3 తెలుగు భాషలో లింగ నిర్మాణం :

తెలుగు భాషలో లింగం అర్థాశ్రయం. లింగం రెండు రకాలుగా చెప్పబడింది.

1. **మహద్వాచకాలు** : పురుషుల్ని తెలిపే శబ్దాలు

2. **అమహద్వాచకాలు :** స్త్రీలను, తిర్యక్కుల్ని (పశుపక్ష్యాదుల్ని) జడవాచకాల్ని (అచేతనాల్ని) తెలిపే శబ్దాలు

స్త్రీలను తెలిపే శబ్దాలను 'మహతీ వాచకాలు' అని ప్రత్యేకంగా కూడా పిలుస్తారు.

ఉకారాంత శబ్దాల్లో కొన్నింటికి మాత్రమే 'వు' చేరుతుంది. ఈ డు, ము, వు ప్రత్యయాలు లేకుండానే ఆచ్ఛిక శబ్దాల్లో ఎక్కువభాగం ఉంటాయి.

### 18.2.4 తెలుగులో లింగబోధక ప్రత్యయం లేనివి :

| | | |
|---|---|---|
| మహత్ (పురుషుల్ని తెలిపేవి) | : | నాన్న, అన్న, అయ్య, తాత, పెనిమిటి మొదలగునవి. |
| అమహత్తు మహతీ (స్త్రీలను తెలిపేవి) | : | అక్క, అమ్మ, తల్లి మొదలగునవి. |
| అమహత్తు - జడ తిర్యక్కులు | : | కోడి, నక్క మొదలగునవి. |
| జడవాచకాలు | : | మొక్క, మాను మొదలైనవి. |

లింగ భేదాల్ని తెలపటానికి తెలుగులో కొన్ని పద్ధతులు పాటించబడ్డాయి.

1 ఎ) కొన్ని పదాల్ని చేర్చి స్త్రీ, పుం బేధం చెప్పబడింది.

ఆడు, మగ : ఆడుమనిషి, మగమనిషి
ఆడు గుఱ్ఱం, మగ గుఱ్ఱం

బి) పురుష వాచకాలైన అన్న, అయ్య, పుంజు లాంటి శబ్దాల్ని చేర్చడం ద్వారా లింగభేదం కల్పించబడింది.
ఉదా : రామన్న, కృష్ణయ్య, కోడిపుంజు

సి) స్త్రీ వాచకాలైన అక్క, అమ్మ, పెట్ట లాంటి శబ్దాల్ని చేర్చి కొన్ని పదాల్లో లింగభేదం కల్పించబడింది.
ఉదా : రామక్క, సీతమ్మ, కోడిపెట్ట

డి) అమ్మ / అప్ప / అయ్య ఉభయ లింగాన్ని తెలుపుతాయి.

ఉదా : రామప్ప ఉభయ లింగాల్ని తెలపుతుంది.
నాయుడమ్మ (పురుషుల్ని)
తాతమ్మ (స్త్రీలను)
అత్తయ్య (స్త్రీని)
మామయ్య (పురుషుల్ని) తెలుపుతాయి.

### 18.2.5 ఆధునిక భాషలో లింగం :

1. మొదటి నుండీ మహత్ ఏకవచనంలో వుండే ప్రత్యయాల్లో ఇప్పుడు - 'డు' మాత్రమే ప్రచారంలో వుంది. నిండు సున్నాతోగానీ, అరసున్నాతోగాని రూపాలు ప్రయోగించడం లేదు.

ఉదా : రాముడు, మధ్యయుగాల్లో పెర్షోపదాల మీద 'డుజ్' చేర్చినట్లుగా ఇప్పుడు చేర్చడం లేదు. ఉదా : ఫిరోజ్‌ఖాన్.
2. ంబు / మ్ము / ము / ం అనే అమహత్ ఏకవచన ప్రత్యయాల్లో ఆధునిక వ్యవహారం భాషలో అనుస్వారమే విశేషంగా వాడబడుతోంది.

ఉదా : ధర్మం, కర్మం మొదలగునవి

పూర్వకాలం నుంచి బెంటు, అమ్ము, పాము మొదలైనచోట్ల అవే ప్రత్యయాల్తో వాడుతున్నాం. "ము" కూడా వాడుతున్నాం.

ఉదా : బియ్యము

3. వు తో పూర్వం నుండి వచ్చిన రూపాలు అలాగే వాడుతున్నాం.
విష్ణువు, పూవు, ఆవు మొదలైనవి

## 3. వచనం

### 18.3.0 తెలుగులో వచన నిర్మాణం :

తెలుగులో వచన నిర్మాణం గురించి తెలుసుకుందాం. ఒక్కమాటలో చెప్పాలంటే సంస్కృత వచన విధానంలో తెలుగు వచన విధానానికి పోలికలేదు. తెలుగుకు ఇతర ద్రావిడ భాషలతో వచన నిర్మాణంలో పోలిక ఉంది.

వచనం అనేది నామధర్మం. అంటే ప్రతి నామవాచకం ఏదీ ఒక లింగాన్ని, వచనాన్ని, విభక్తిని కలిగే వాక్యంలో ప్రయోగింపబడుతుంది.

ఉదా : రాముడు, ఇది పుంలింగం, ఏకవచనం, ప్రథమా విభక్తి

### 18.3.1 సంస్కృతంలో వచన నిర్మాణం :

వేదకాలం నుంచి సంస్కృతంలో మూడు వచనాలున్నాయి. ఏకవచనం, ద్వివచనం, బహువచనం.

ఉదా : రామః (ఏక), రామౌ (ద్వి) రామాః (బహు)

(ఒక రాముడు) (ఇద్దరు రాములు) (ఇద్దరుకన్నా ఎక్కువమంది రాములు)

ప్రాకృతాలు ఏర్పడే నాటికే సామాన్యులలో 'ద్వి' వచనం అంతరించింది. ప్రాకృతాల నుంచి ఏర్పడిన నేటి ఉత్తర దేశ భాషల్లోనూ ఏకవచనం, బహువచనం మాత్రమే మిగిలాయి.

### 18.3.2 తమిళంలో వచన నిర్మాణం :

తమిళంలో నామాల్ని ఐదు విధాలుగా విభజించారు. ఏకవచనంలో మూడు రకాలు బహువచనంలో రెండు రకాలు. తమిళంలో లింగ - వచన భిన్నత్వం నిరూపించబడలేదు. ఒకే ప్రత్యయం అటు లింగాన్ని, ఇటు వచనాన్ని తెలుపుతుంది.

తమిళం : ఏక : 1. పురుష వాచకాలు

2. స్త్రీ వాచకాలు

3. జడ వాచకాలు

తమిళం : బహు :

1. మహన్మహతీ బహువచనం (పలర్‌పాల్)
2. అమహత్ బహువచనం (పలవిన్‌పాల్)

స్త్రీ పురుష సామాన్యమైన బహువచనం తమిళంలో ఉంది.

తమి. పురుషర్ స్త్రీకళ్ వరుకిరార్ / మహన్మహలీ బహువచనం

తె. పురుషులు స్త్రీలు వస్తున్నారు (పలర్‌పాల్)

త. మాడుగళ్ మెయ్‌క్కిన్ఱవ / అమహత్ బహువచనం

తె. పశువులు మేస్తున్నవి / (పలవిన్ పాల్)

'కళ్' ప్రత్యయం తెలుగులో 'లు' ప్రత్యయంగా మారి తెలుగులో మహత్ అమహత్ బహువచన ప్రత్యయంగా వచ్చింది. 'రు' ప్రత్యయం మహద్బహువచన ప్రత్యయంగా తెలుగులో ఉంది.

తొల్కాప్పియం నాటికే జడవాచకాలకు బహువచన ప్రత్యయాలు - నామాల మీద అక్కరలేదని అంగీకరింపబడింది.

ఉదా : మాడు వందన (పశువు వచ్చినవి) ఈ ఉదాహరణలో ఏకవచన నామం (మాడు = పశువు) బహువచన క్రియలో అన్వయించింది. తెలుగులో ఇలాంటి నిర్మాణం లేకపోలేదు.

ఉదా : వంద విస్తర్లు వేశారు
నూరు ఆకు తెచ్చారు
ఏభై మేక కొన్నాడు
వంద కాయ ఊరుగాయ.

### 18.3.3. తెలుగులో వచన నిర్మాణం :

తెలుగులో వచనం మహత్, అమహత్ బేధాన్ని ఆశ్రయించింది.
తెలుగులో అమహత్ బహువచన కర్తతో ఏకవచన క్రియ సరిపడుతుంది.

ఉదా : చిలుకలు వచ్చెను.
చెట్లు పండెను
చిలుకలు (అమహత్ బహువచన కర్త) (తిర్యక్కు)
చెట్లు ( అమహత్ బహువచన కర్త) (జడవాచకం)

### 18.3.4 ఆధునిక భాషలో ఏకవచన నిర్మాణం :

తొలినుంచే మహత్ ఏకవచనంలో ఉండే ప్రత్యయాల్లో ఇప్పుడు - డు మాత్రమే ప్రచారంలో ఉంది. నిండుసున్నాతో గానీ, అరసున్నాతో గానీ (ండు / ఁడు) రూపాన్ని ప్రయోగించడం లేదు.

ఉదా : రాముడు
మధ్యయుగాల్లో పెర్షి - అరబిక్ పదాల మీద 'డుజ్' చేర్చినట్లుగా ఇప్పుడు చేర్చడం లేదు.
ఉదా : ఫిరోజ్‌ఖాన్

2) అమహత్ ఏకవచన ప్రత్యయాల్లో ంబు / మ్ము / ము / ం (అనుస్వారం)లలో అనుస్వారమ్ విశేషంగా వాడబడుతుంది.
ఉదా : ధర్మం, కర్మం మొదలైనవి

పూర్వకాలంలో నుంచి వచ్చిన చెంబు, అమ్ము, పాము మొదలైనచోట్ల అనే ప్రత్యయాల్లో వాడుతున్నాం. 'ము' కూడా వాడబడుతున్నది.
ఉదా : బియ్యము

3) 'వు' తో పూర్వం నుండి వచ్చిన రూపాలు అలాగే వాడుతున్నాం.
ఉదా : విష్ణువు, పూవు, ఆవు మొదలగునవి

### 18.3.5 ఆధునిక భాషలో బహువచన నిర్మాణం :

- లు బహువచన ప్రత్యయంగా ఏకవచన నామం మీద చేరి బహువచన నామం ఏర్పడుతుంది. కొన్ని నామాలు నిత్య ఏకవచనాలు

ఉదా : లోహాలు : ఇనుము, రాగి, బంగారం మొదలైనవి

పంటలు : వరి, రాగ, సజ్జ మొదలగునవి

పంటల పేర్లు ఏకవచనంలో ఉండగా ఆ నామాల మీద 'లు' చేరి ధాన్యాలు నిత్యబహువచనాలు అవుతున్నాయి.

ఉదా : వరి + లు > వరులు > వడ్లు

జొన్న + లు > జొన్నలు

రాగి + లు > రాగులు మొదలైనవి.

ప్రాతిపదికలో మార్పుల్లో బహువచన నిర్మాణం జరుగుతుంది

1) దీర్ఘ స్వరాంత నామాల్లో మార్పులేవు

ఉదా : లుంగీలు, లంగాలు, పకోడీలు

ఇవి సాధారణంగా అన్యదేశ్యాలు ఉంటాయి.

2) కొన్ని శబ్దాల్లో తుది అక్షర లోపం

పేను + లు > పేలు

చేను + లు > చేలు

వేయి + లు > వేలు

పూవు + లు > పూలు

కొందరి వ్యవహారంలో పేన్లు / పేండ్లు, చేనులు / చేండ్లు. పువ్వులు / పూవులు రూపాలున్నాయి.

3) ఇదంత శబ్దాల్లో అకారేతర దీర్ఘస్వరం ముందుంటే తుది 'యి' కారానికి తకారం ఆదేశం అవుతుంది.

ఉదా : చేయి + లు > చేతులు

గోయి + లు > గోతులు

నూయి + లు > నూతులు

పొయ్యి, వాయి, రాయి శబ్దాల్లో ఈ మార్పు రాదు.

ఉదా : పొయ్యిలు, వాయలు, రాళ్ళు

4) 'ల్లు, న్ను' అంతంలో ఉండే ఔపవిభక్తిక నామాల్లో 'ండు' ఆదేశం అవుతున్నది.

ఉదా : కల్లు + లు = కండులు > కండ్లు

కన్ను + లు = కండులు > కండ్లు

పన్ను + లు = పండులు > పండ్లు

5) '-లి' అంతంలో ఉండే నాలుగు మాత్రల శబ్దాల్లో -ండి ఆదేశం

రోకలి + లు - రోకండి + లు = రోకలు = రోకండ్లు

తిరగలి + లు - తిరగండ్లు

కౌగిలి + లు - కౌగిండ్లు

## 4. విభక్తి - పరప్రత్యయాల చరిత్ర

### 18.4.0 విభక్తులు :

వాక్యంలో పదాల్ని కలిపే ప్రత్యయాల్ని పరప్రత్యయాలు (Post possitional soffixes) అంటారు. వీటినే విభక్తులు అని పిలుస్తాం.

విభక్తులు రెండు రకాలు. 1. నామవిభక్తులు, 2. క్రియా విభక్తులు

నామవాచకాలపై; సర్వనామాలపై; సంఖ్యావాచకాల పైన వివిధ అర్థాల్లో నామ విభక్తి ప్రత్యయాలు చేరుతుంటాయి. నామవిభక్తుల్ని సంస్కృతంలో 'సుప్పులు' అంటారు. అవి చేరిన ప్రాతిపదికల్ని 'సుబంతాలు' అంటారు. ఏదో ఒక విభక్తి చేరనిదే; లేదా లోపించనదే సుబంతాలకు వాక్యంలో ప్రయోగం లేదు.

ఉదా : రాముఁడు రావణుని కోల చేత
లంక యందుఁగూల వేసెను.

ఈ వాక్యంలో 'రామ' కర్త. కర్త్రర్థంలో 'డుఙ్' అనే ప్రథమా ప్రత్యయం 'రామ' అనే ప్రాతిపదికకు చేరింది. కర్మార్థంలో 'రావణ' అనే ప్రాతిపదికకు 'ను' అనే ద్వితీయా విభక్తి ప్రత్యయం చేరింది. 'చేత' అనే తృతీయా విభక్తి ప్రత్యయం కరణార్థంలో 'కోల' అనే ప్రాతిపదికకు చేరింది. అలాగే 'లంక' అనే ప్రాతిపదికకు అధికారణార్థంలో 'అందు' అనే సప్తమీ విభక్తి ప్రత్యయం చేరింది.

ఇలాగ వేర్వేరు అర్థాల్లో; వచనాల్లో; వివిధ నామవిభక్తి ప్రత్యయాలు ప్రాతిపదిక మీద చేరుతుంటాయి. నామం మీద చేరేవి కాబట్టి వీటిని నామ విభక్తి ప్రత్యయాలు అని అంటారు.

### 18.4.1 ప్రథమా విభక్తి :

డు,ము, వు చేరి తత్సమ నామాలు. ఇవి చేరికొన్ని, చేరకుండానే కొన్ని ఆచ్ఛిక నామాలు ప్రథమా విభక్తి.

### 18.4.2 ద్వితీయా విభక్తి :

న్; ను; ని కూర్చి, గురించి, గుఱిచి; గుఱియించి ద్వితీయా విభక్తి ప్రత్యయాలు.

ఆధునిక భాష - ను,ని

ఉదా : చెట్టును, హరిని
ఉకారాంతాలపై కూడా 'ని' చేర్తుంది. అవుని.

### 18.4.3 తృతీయా విభక్తి :

న, ం, చేత, తో, తోడ, తోడ, తోటి ప్రత్యయాలు.

ఆధునిక :

ఎక్కువగా 'తొ' వాడబడుతోంది.
కరణార్థంలో : నోటితో మాట్లాడి

రీతి అర్థంలో : శ్రద్ధతో చదువుతాడు
సహార్థంలో : దొంగ సొమ్ముతో పారిపోయాడు
చేత / చాత : వానిచేత / వానిచేత

### 18.4.4. చతుర్థి :

సంప్రదాన, నిమిత్త అర్థాల్లో కిన్, నకు, కై, కాన్ అనేవి ప్రత్యయాలు.

**ఆధునిక భాష :**

కు, కి, కోసం, కోసరం

కు - నాకు
కి - వానికి
కోసం - నా కోసం
కోసరం - వాని కోసం

### 18.4.5 పంచమీ విభక్తి :

ప్రత్యయాలు : మిన్ద, మీన్ద, కడ,పై
ఉదా : మహిమిన్ద
గుడిమిన్ద
భాషాదిత్యులకడాన్
భూపతిపై
గ్రహ్యార్థంలో చేతన్, చేన్; వలనన్; వల్లన్ ఉన్నాయి.

**ఆధునిక భాష :**

వల్ల, నుంచి, కంటె, కన్న, పట్టి ఎక్కువగా ప్రయోగంలో ఉన్నాయి.

### 18.4.6 షష్ఠీ :

ద్వితీయాది విభక్త్యంగమే షష్ఠీరూపంగా ప్రయోగింపబడుతోంది. సంబంధార్థకంలో 'యొక్క' అనే అర్థాన్ని సూచిస్తున్నది. షష్ఠీ ప్రత్యయంగా 'న'కారం.

ఉదా : మూల స్థానంబు నాది మూర్తికి
కున్, కిన్
ఉదా : కొడుకునకు, నన్నయ
కుంతికి, నన్నయ

ఔప విభక్తిక రూపమే షష్ఠీరూపం
యొక్క

నీ యొక్క చేతుల యందు (శహాజీ)
ఆధునికభాష - కు, కి

ఉదా : సామ్యఅర్థంలో - నాకు కళ్ళజోడు ఉంది.
బాంధవ్య అర్థంలో - మాకు ఇద్దరు పిల్లలు
సంబంధ అర్థంలో - ఆవుకు రెండు కొమ్ములు
హేతువు అర్థంలో - చలికి వణుకుతున్నాడు.
కాలార్థకంలో - రేపటికి వస్తాడు.

### 18.4.7 సప్తమీ విభక్తి :

అ(ం), అన్, న, అందు, ఒళన, లో(ం) లోన, ళోన, లోపల అనేవి ప్రత్యయాలు

**ఆధునిక భాషలో :**

లో, దగ్గర, పైన, కింద, మీద పక్క మొదలైనవి
ఔపశ్లేషికార్థం - గిన్నెలో పాలున్నాయి.
కాలార్థం : 1947లో భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చింది.
నిర్ధారణార్థంలో : వాళ్ళు ముగ్గురిలో ఇతడు మంచివాడు.

## 5. ఔప విభక్తికాలు

### 18.5.0 ఔప విభక్తులు :

"ఇ, టి, తి, వర్ణంబులు విభక్తి నిమిత్తంబులయి యాదేశాగమాత్మకంబుయినవి యౌపవిభక్తికము లనంబడును" అని చిన్నయసూరి సూత్రం. వీటినే అథర్వణుడు ఉపవిభక్తులని వ్యవహరించాడు. టి, ంటి మొదలయిన వర్ణాలు ఔపవిభక్తిక సంజ్ఞకలవిగా ఆంధ్రభాషలో ఉన్నాయని చింతామణి సూత్రించాడు.

విభక్తులయందు ప్రాతిపదికలకు ఆగమాలుగానో, ఆదేశాలు గానో చేరే ఇ. టి, ంటి, తి ల్ని ఔపవిభక్తికాలు అంటారు. వీటిని, ఇవి చేరిన ప్రాతిపదికల్ని కూడా 'ఔపవిభక్తికాలు' అనే అంటారు. ద్వితియా సప్తములకు 'అత్వం' ఆదేశం అవుతుంది. ఇది కూడా ఔపవిభక్తికమే. సాధారణంగా లు, లి, ల్లు; డు, డి, ను, యి అంతంలో ఉండే రూపాలు ఔపవిభక్తికాలు.

'ఇ' చేరే నామాలు : ఊరు - ఊరి; చేను - చేని
'అ' చేరే నామాలు : తాము, తమ, వారలు - వారల

టి / ంటి : త్రాడు - త్రాటిని (ఆదేశం)
అన్ని - అన్నింటిని (ఆగమం)
మన్ను - మంటిని (ఆదేశం)
అన్ని - అన్నింటిని (ఆగమం)

తి : నేయి - నేతిని (ఆదేశం)
అఱ్ఱు - అఱితిని (ఆగమం)
టి, తి వర్ణాల్లో 'ఇ' ఇంత ముందు చెప్పబడిన 'ఇ' వర్ణమే.

## 18.5.1 ంటి వర్ణం :

ప్రాచీన కాలంలో పదాంత ణ,ళ లు టకారంగా మారి వాటిపై 'ఇ' చేరి 'ంటి' తో కూడిన ఔపవిభక్తిక రూపాలేర్పడతాయి.

తమి. మణ్ + కుడమ్ > ముట్కుడమ్

తె. మను + కుండ > మట్టికుండ / మంటికుండ

తమి. ముళ్ + కుఱై > ముట్కుఱై

తె. ముల్లు + ముక్క > ముంటి ముక్క

## 18.5.2 'తి' వర్ణం :

తమిళంలో 'అత్తు' అనే ఆగమాన్ని తొల్కాప్పియం పేర్కొంది.

ఉదా : మరమ్ + అత్తు + ఇల్ > మరత్తిల్

కుళమ్ + అత్తు + ఇల్ > కుళత్తిల్

తమిళంలోని 'అత్తు' తెలుగులోని 'తి' కి మూలరూపంగా చెప్పవచ్చు.

కుఱ్ఱు > కుర్తి; పఱ్ఱు > పర్తి మొదలైన ద్వితీయాది విభక్త్యాంగాలు ఏర్పడి కాలక్రమేణ అనుచిత విభాగంతో అవే ప్రథమాంతాలుగా గ్రామనామాలయ్యాయి.

ఉదా : గంగలపఱ్ఱు - గంగలపర్తి; చింతలపఱ్ఱు - చింతపర్తి; రాయచోటు - రాయచోటి

ఇలాగే ఇ, టి/ంటి, తి అనే వర్ణాలు చేరి ఔపవిభక్త రూపాల ద్వితీయాది విభక్త్యంగాలు ఏర్పడ్డాయి.

బాలవ్యాకరణంలో చెప్పినట్లు కాకుండా ద్వితీయార్థంలో వచ్చే అన్ని విభక్తులు ద్వితీయావిభక్తి క్రింద అలాగే తక్కిన విభక్తుల్లో చెప్పబడతాయి. ఈ విభక్తుల పరిణామం ఇలా ఉంటుంది.

ఉదా : ప్రథమ ద్వితీయాది విభక్త్యంగంలో

ఇ

ఊరు - ఊరి - ని, ఊరి - చేత

చేను - చేని - ని, చేని - చేత

నోరు - నోరి - ని, నోరి - చేత

టి

నూరు - నూటి - ని, నూటి - చేత

అన్ని - అన్నిటి - ని, అన్నిటి - చేత

ంటి

మన్ను - మంటి -ని, మంటి - చేత

మిన్ను - మింటి - ని, మింటి - చేత

తి

నూయి - నూతి - ని, నూతి - చేత

నేయి - నేతి - ని, నేతి - చేత

## 6. సంఖ్యావాచకాలు

### 18.6.0 లక్ష్యం :

సంఖ్యావాచకాల చరిత్రను గురించి తెలుసుకుందాం.

### 18.6.1 పరిచయం :

తెలుగులోని సంఖ్యావాచకాలకు తక్కిన ద్రావిడ భాషలకు సారూప్యం ఉంది. సంస్కృతం - తజ్జన్య భాషల్తో సారూప్యం లేదు.

సంఖ్యావాచకాలు రెండు విధాలుగా ఉంటాయి. మొదటి రకం విశేష్యాలు. వీటినే ప్రాథమిక సంఖ్యావాచకాలు అంటారు. రెండో రకం విశేషణాలు. వీటిని సార్వనామిక విశేషణాలు అంటారు. ప్రాథమిక సంఖ్యావాచకాలకు 'అగు' ధాతురూపాల్ని చేర్చినప్పుడు ఏర్పడే సార్వనామిక విశేషణాలు ఒకరకం. అస్వతంత్రమైన సంఖ్యావాచక విశేషణానికి లింగవచన బోధక ప్రత్యయాల్ని చేర్చగా ఏర్పడేవి మరోరకం.

### 18.6.2 ఒకటి :

ఒకటి ప్రాథమిక సంఖ్యావాచకం. 'ఒక్క' 'ఒక' అనేవి విశేషణాలు ఒకటి అమహత్తులో ఇటు విశేష్యంగాను అటు విశేషణంగాను వాడబడుతున్నది.

ఒకటి, ఒక్కంటి, ఒక్కటి, ఒకడు, ఒకానొకడు, ఒక్కరుడు, ఒక్కొరుడు అమహద్విశేషణాలు.

ఒక్కర్తి, ఒక్కతె, ఒక్కొర్తి, స్త్రీ వాచక విశేషణ రూపాలు.

'ఒక్కడు' మహత్ అమహద్రూపం. పై రూపాలన్నీ 'ఒక్క (ఒక) అనే విశేషణం నుండి పుట్టినవే.

ఒండు, ఒరుఁడు, ఓర్తి అనే రూపాలకు 'ఒరు' అనే విశేషణం మూలరూపం.

**ఆధునిక భాష :**

ఒకటి, ఒకడు, ఒకరు, ఒకామె, ఒక, ఓ రూపాలు వాడుకలో వున్నాయి.

### 18.6.3 రెండు :

"రెండు" ప్రాథమిక సంఖ్యావాచకం. ఇది ద్రావిడ భాష నుండి వర్ణవ్యత్యం వల్ల ఏర్పడింది.

ఇరంటు - రంటు - రండు - రెండు

'ఇరు' సార్వనామిక విశేషణం.

**ఆధునిక భాష :**

రెండు విష్యం. ఇర - వై / ఇర - బై, ఇద్ -దరు

విశేషణంగా 'రెండు' ఎక్కువ వాడుకలో వుంది.

ఉదా : ఇరు - ప్రక్కల (కావ్యభాష)
రెండు పక్కల (ఆధునిక భాష)

**18.6.4 మూఁడు :**

'మూఁడు' శబ్దానికి పూర్వపదం "మూన్టు" పోల్చి చూడు.

తమిళం : మూన్టు
మూ - ము, అనేవి విశేషణాలు.

**18.6.5 నాలుగు :**

'నాలుగు' ప్రాచీనరూపం 'నాలువు' అర్వాచీన రూపం నాలు - నాలు - విశేషణ రూపాలు.
నాల్కు, నాలుగు, నాల్ - ఉను ప్రాథమిక సంఖ్యావాచకాలు.
'నల్ - తమ్ముఁడ్లు' లోని 'నల్' సార్వనామిక విశేషణం.
'నల్ -వురు' పురుషబోధక సంఖ్యావాచకం.
నాలుగు / నాలువు / నాలు ప్రాథమిక సంఖ్యా వాచకాలు
నలు - మూడ్లు, నాల్గు మూరలు వంటి రూపాలు అరుదు.
నాలు - విశాఖ - శ్రీకాకుళం ప్రాంతంలోనే ప్రయోగంలో ఉంది.

**ఆధునిక భాష :**

నాలుగు / నాల్గు వి. / విణ. నలు / నాల్ ఇప్పుడు కూడా వాడుకలో వున్నాయి.
ఉదా : నలు - గురు
నాల్ - నాళ్ళు

**18.6.6. అయిదు :**

అయిదు / ఏను ప్రాథమిక సంఖ్యావాచకాలు
ఏను / ఏన్ విశేషణాలు

ప్రాచీన "అయ్" రూపం నుండి అయిదు / ఏను రెండూ ఏర్పడి వుంటాయని సోమయాజి గారి సిద్ధాంతం.

**18.6.7 ఆరు :**

ఆఱు విశేష్యం / విశేషణం
అఱు - విశేషణం
'అఱు' ప్రాథమిక సంఖ్యావాచకం. అర , అఱు / ఆరు

**విశేషణం :**

ఉదా : అర - వాద్యది, అఱు - పది, సార్వనామిక విశేషణాలు.
'ఆరు - వ్వురు' పురుషబోధక సంఖ్యావాచకం. తర్వాత శతాబ్దాల్లో విశేషాలు లేవు.

**ఆధునిక భాష :**

'ఆరు' రూపం ఉంది. విశేష్యంగాను, విశేషణంగాను వుంది. ఆరు విశేషణంగా వుంది.
ఆరు - గురు / ఆర్ - గురు రూపాలున్నాయి.

## 18.6.8 ఏడు :

ఏడు విశేష్యం, విశేషణం.
డె - విశేషణం

ఏఋ / ఏడు ప్రాథమిక సంఖ్యావాచకాలు. విశేషణ రూపాలు అలభ్యాలు.

ఆధునిక యుగభాషలో "ఏడు" వాడుతున్నాం. అయినా "ఏడు"కు బదులు ఆరునొక్కటిని కూడా వాడుతున్నాం.
ఉదా : వాడు ఆరునొక్కరాగం ఆలపిస్తున్నాడు. అంటే 'ఏడుపురాగం' అన్నమాట.

## 18.6.9 ఎనిమిది :

'ఎనిమిది' లోని 'మిది' పది శబ్దం రూపాంతరం. ముందున్న 'ఎను' రెండు అర్థాన్నిచ్చే 'ఇరు' శబ్దభావం లేదా 'ఎణ్' అనే ప్రాచీన ధాతువు. 'రెండు తక్కువ పది' లేక 'పదికి వెనుక రెండవది' అని భాషా శాస్త్రవేత్తల సిద్ధాంతం

'ఎణ్బొది, ఎణుంబది, ఎనుబొది, ఎణ్మ, ఎన్మిది' అనేది ప్రాథమిక సంఖ్యావాచకాలు. ఎనమ్, అణ్ణకును (ఎనిమిది మందికి) పురుషబోధక సంఖ్యావాచకం.

పై రూపాల్లో 'ణ' కారం తోడి రూపాలు ప్రాచీనాలు.
'న' కారం తోడిని ఆర్వాచీనాలు.

## 18.6.10 తొమ్మిది :

తొమ్మిది విశేష్యం / విశేషణం
తొల్ - పది అని విభాగం
పోల్చిచూడు, తొన్నూఱు (90) తొలినూరు
తొల్లాయిరమ్ (900)
(తొల్ + ఆయిరం) 'ఆయిరం' - వేయి
తొమ్మ - విశేషణం.

తొమ్బు, తొంభ ప్రాథమిక సంఖ్యావాచకం నేటి వ్యవహారంలో చాలామంది అనే అర్థంలో 'తొంబ తొంబగా' అని వాడుతున్నాం.

## 18.6.11 పది :

పది విశేష్యం / విశేషణం
పదు - పన్, -పం, పది, పయి, పై, భై, వై అనేవి 'పది'కి సమాసాల్లో కనిపించే రూపాలు.
'పది' ప్రాథమిక సంఖ్యావాచకం.

ఇర - వది, ఇరు-భది, ఎట్-బొది, ఎణ్-మ, ఎన్-మీది, ఏ-బది, ఏం-భంమ్, ఏ-నది, నల్-వొది, పన్నెండు, పణ్-రెణ్ణు, పద్-ఏను, పన్-దంబు, ము-ప్పది విశేషణాలు.

'పదున్గు' పురుష బోధక సంఖ్యావాచకం.

### 18.6.12 వంద :

వంద ప్రాకృతం నుంచి వచ్చింది. నూరు ద్రావిడ భాష నుండి వచ్చింది.

నూరు / నూఱు ప్రాథమిక సంఖ్యావాచకం

నూర్ - వ్వరు : పురుష బోధక సంఖ్యారూపం

నూఱు నన్నయ, శ్రీనాథ, దక్షిణాంధ్రయుగం

మున్నూరు, ఏనూరు

**ఆధునిక భాష :**

నూరు, వంద అనే రూపాలు వాడుతున్నాం.

### 18.6.13 వేయి :

వెయ్యి / వెయి / వేయు / వేయి శాసనభాషలో వున్నాయి.

వేయి పూర్వపదం

వే - ల్ పోల్చిచూడు వేనకు - వేలు.

వే - గవిలాలు (7శ) సార్వనామిక విశేషణం

వే - వురు, వే - గురు పురుషబోధక సంఖ్యావాచకం.

## 7. సర్వనామాలు

### 18.7.0 లక్ష్యం :

ఈ పాఠంలో సర్వనామాలు ఏమిటో, వాటిలోని రకాల్ని గురించి తెలుసుకుందాం.

### 18.1.0 పరిచయం :

'సర్వనామాలు' అనే తత్సమపదం సంస్కృతం నుండి తెలుగులోకి వచ్చిన పారిభాషిక పదం. సర్వనామాలు నామాల్లో ఒక అంతర్భాగం. 'సర్వాదేని సర్వనామాని' అనిపాణినీయంలో చెప్పబడింది. ఇందులో 35 శబ్దాలు చేర్చబడ్డాయి. 'సర్వ' ఆదిగా గల నామములు సర్వనామములు అని వివరణ.

### 18.7.2 సర్వనామాలు - విభజన :

సర్వనామాలను నేటి సంస్కృత, ఆంగ్లాది ప్రణాళికలను అనుసరించి విభజిస్తే ఏడు జాతులుగా విభజించవచ్చు.

1. యుష్మత్ - అస్మదర్థకాలు : నీవు, మీరు, నేను, మేము
2. ఆత్మార్థకాలు : తన, తమ అనే వాటిని సంబంధించనవే.

3. నిర్దేశ సర్వనామాలు : ఆ, ఈ, ఏ అనే వాటివల్ల ఏర్పడేవి
4. సంబంధార్థకాలు : ఏ, ఆ అనే వాటితో ఏర్పడే జంట శబ్దాలు
5. ప్రశ్నార్థకాలు : ఏ శబ్దరూపాలు
6. సంఖ్యావాచకాలు : ఒకటి,రెండు మొదలైనవి
7. అనిర్దిష్టార్థకాలు : పలు, కొన్ని మొదలైనవి

## 8. విశేషణాలు

### 18.8.0 లక్ష్యం :

ఈ పాఠంలోని విశేషణానికి నిర్వచనం, అవి ఏర్పడే విధానం అందులోని రకాల్ని గురించి తెలుసుకుందాం.

### 18.8.1 విశేషణం - నిర్వచనం :

"విశేష్యతే అనేన ఇతి విశేషణమ్"

విశ్వేష్యంలోని విశేషాన్ని తెలియజేసేది "విశేషణం". నామవాచకాల్ని, సర్వనామాల్ని కలిపి విశేషములని అంటారు. నామవాచకాల యొక్క సర్వనామాల యొక్క విశేషణాల్ని తెలిపే పదాలు విశేషణాలు. ఈ విశేషణం ఒక జాతినికానీ, గుణాల్ని కానీ సంఖ్యనుకానీ, సంజ్ఞనుకానీ ఆశ్రయించి వుంటుంది.

విశేషణం రెండు రకాలు. ఒకటి నామవిశేషణం. రెండు క్రియా విశేషణం. నామాల్ని గూర్చి విశేషించేది నామ విశేషణం. దీన్నే విశేషణం (Adjective) అని అంటున్నారు. క్రియల అర్థాన్ని విశేషించేది క్రియా విశేషణం (Adverb) విశేషణ భాగాలైన నామవిశేషణాలకూ, క్రియావిశేషణాలకూ గల రూపభేదం చాలా స్వల్పం.

### 18.8.2. విశేషణాలు - వర్గీకరణం :

ప్రధానంగా విశేషణాల్ని కొన్ని విధాలుగా వర్గీకరించవచ్చు.

1. గుణ విశేషణం
2. విధేయ విశేషణం
3. సార్వనామిక విశేషణం
4. హేతుగర్భ విశేషణం
5. క్రియా విశేషణం
6. క్రియా జన్య విశేషణం

## సమీక్ష :

ఇంతవరకు నామవాచకం - నిర్మాణం, లింగం, వచనం, విభక్తి - పరప్రత్యయాల చరిత్ర - ఔపవిభక్తులు. సంఖ్యావాచకాలు - సర్వనామాలు - విశేషణాల గురించి స్థూలంగా చర్చించడం జరిగింది.

**ప్రశ్నలు :**

1. నామవాచకం - నిర్మాణం గురించి వ్రాయండి.
2. తెలుగులో లింగ నిర్మాణం గురించి వివరించండి.
3. తెలుగులో వచన నిర్మాణం గురించి విశదీకరించండి.
4. విభక్తి - పరప్రత్యయాల చరిత్రను గూర్చి తెలపండి.
5. ఔపవిభక్తికాలను గురించి వ్రాయండి.
6. సంఖ్యావాచకాల చరిత్రను వివరించండి.
7. సర్వనామాన్ని నిర్వచించి, అందులో ఎన్నిరకాలు ఉన్నాయో వాటిని గూర్చి వివరించండి.
8. విశేషణాలను గురించి వివరించండి.

**సంప్రదించవలసిన గ్రంథాలు :**


1. ఆంధ్రభాషా వికాసము : ప్రొఫెసర్ గంటి జోగిసోమయాజి
2. తెలుగుభాషా చరిత్ర : ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి (సంపాదకుడు)
3. సంధి : ఆచార్య కోరాడ రామకృష్ణయ్య
4. ద్రావిడ భాషలు : ఆచార్య పి. యస్. సుబ్రహ్మణ్యం
5. ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు : ఆచార్య పి.యస్. సుబ్రహ్మణ్యం
6. ఆంధ్ర భాషా చరిత్ర : డాక్టర్ వి. సిమ్మన్న
7. హిస్టారికల్ గ్రామర్ ఆఫ్ తెలుగు : ప్రొఫెసర్ కె. మహదేవ శాస్త్రి
8. Early Telugu Inscriptions : డా॥ బి. రాధాకృష్ణ
9. A discriptive Analysis of Nannaya Usage : డా॥ కె. నాగభూషణరావు


-

పాఠం - 19

# క్రియలు

## విషయ సూచిక :


19.1 క్రియా నిర్వచనం
19.2 క్రియా నిర్మాణం
19.3 సకర్మక క్రియలు
19.4 అకర్మక క్రియలు
19.5 ప్రేరణ క్రియలు
19.6 ద్రావిడ భాషలలో ప్రేరణ క్రియల విశిష్టత
19.7 క్రియా ప్రత్యయాలు
19.8 తెలుగు క్రియా విభక్తి ప్రత్యయాల వ్యుత్పత్తులు
19.9 విజ్ఞాన చారిత్రకాలు
19.10 సమాపక-అసమాపక క్రియా రూపాలు
19.11 కాల బోధక పురుష బోధక ప్రత్యయాలు
19.12 భూత, వర్తమాన, భవిష్యత్కాలాలు
19.13 తద్ధర్మం - ప్రాథమిక, ద్వితీయ, నిష్పాదక ప్రత్యయాలు


## 19.1 క్రియా నిర్వచనం :

"ఆఖ్యాతకు, ధాతుః, క్రియా" అనే మూడు పదాలు సంస్కృత వ్యాకరణ శాస్త్రంలో పర్యాయపదాలుగా ప్రయుక్తాలు. "క్రియతే ఇతి క్రియా" అనే పదవ్యుత్పత్తి చే క్రియ అంటే చేష్ట, వ్యాపారం అని అర్థం. ఆంధ్ర శబ్ద చింతామణిలో క్రియాధాతుః (ఆంధ్ర శబ్ద చింతామణి - సంజ్ఞా - అసూ.) ధాతువు క్రియ అనబడుతుంది అని ఉద్ఘోషించబడింది. "తద్వాని చత్వారి పద జాతాని నామాఖ్యా తేచోపసర్గ నిపాతా శ్చోతానీ మాని భవన్తి" అని నిరుక్తంలో యాస్కాచార్యులు ఆఖ్యాత శబ్దాన్ని క్రియాపరంగా ప్రయోగించారు. 'ఆ + ఖ్యా + -త = పూర్తిగా చెప్పేది అని ఆఖ్యాత శబ్ద వ్యుత్పత్తి. "క్రియా వచనో ధాతుః" అని ధాతు నిర్వచనం. క్రియా వచనమే ధాతుకని తాత్పర్యం. ఆంధ్ర శబ్ద చింతామణి కర్త క్రియా శబ్దాన్ని ప్రయోగించినట్లుగా (అద్యః క్రియాసు భూతార్థ ద్యోతినమాద్యగం వినాసర్వః" అనే సూత్రాన్ని బట్టి తెలుస్తోంది. "కారకాణాం ప్రవృత్తి విశేషః క్రియా" అని పతంజలి భగవానుడు క్రియా శబ్ద నిర్వచనాన్ని కావించాడు. ప్రవృత్తి పదానికి వ్యాపారం అని అర్థం. ఈ ప్రవృత్తి ఒక్కో కారకానికి ఒక్కో విధంగా ఉంటుంది. కర్తృ వ్యాపారం పొయ్యి మొదలయిన వాటి మీద కుండ ఉంచటం; కర్మ వ్యాపారం వండటం; కరణ వ్యాపారం కట్టెలు మండటం; అధికరణమయిన స్థాలీ వ్యాపారం వేడెక్కటం. ఈ వ్యాపారాలు ధాతు వ్యాపారాలని అనేకుల అభిప్రాయం. కారక వ్యాపార మాత్రాలని మరికొందరు. క్రియాత్వం, క్రియా వ్యాపారం, వచనం, కారకం, అన్వయం అనే అయిదింటికి ధాతువులే వాచకాలనీ లడాది ప్రత్యయాలు ద్యోతకాలనీ వ్యాకర్తల మతం. తెలుగులో క్రియా శబ్దం తిజంత రూపాలకు వాడబడింది. ఉదాః

"మధ్యమ పురుష క్రియల యందిత్తునకు సంధియగు"

(బాల వ్యాకరణం సంధి. 7)

"వ్యతిరేక క్రియ యర్థ త్రయ బోధకంబగు"

(ప్రౌఢ వ్యా. క్రియా. 8)

ధాతువు అనే మాట ప్రాచీనకాలం నుంచి ఒక ప్రత్యేకార్థంలో వాడబడింది. ఆ అర్థం మాట ఎలా ఉన్నా ప్రస్తుతార్థాన్ని పరిశీలిద్దాం. ప్రసిద్ధంగా లోకవ్యవహారంలో ఉన్న శబ్దరూపాలకే లక్షణాలు చెప్పబడతాయి.

ఉదా : చేస్తున్నాడు, చేశాడు, చేస్తాడు, చేసింది మొదలయిన శబ్ద రూపాలను పరిశీలించి ప్రకృతి ప్రత్యయ విభాగాన్ని చేసి 'చేయు' ధాతువును వ్యాకర్త పేర్కొంటాడు. మూలం ప్రధానమయినది అనే అర్థంలో 'ధాతు' (root or vebsal base) శబ్దం వ్యవహరించబడుతోంది.

ధాతు శబ్దం క్రియా వాచి కాబట్టి భాష క్రియాజన్యమనే సిద్ధాంతాన్ని ప్రాచీన విపశ్చితులు ప్రతిపాదించారు. చేయు ధాతుజన్యాలయిన చేత, చేయుట, చెయ్యి, చేశాడు మొదలయిన శబ్ద రూపాలను అందరూ అంగీకరిస్తున్నారు. ఇల్లు, ముక్కు, చెవి, కాలు, రెండు, మూడు అయిదు శబ్ద రూపాలుకు కూడా ధాతురూపాలున్నాయా? అని ప్రశ్న. ఇవి ఏ ధాతుజన్యాలు అనేది మరో సూటి ప్రశ్న. ఇవే మూల రూపాలు కావచ్చు కదా! శాకటాయన మహర్షి శబ్దరాశి అంతా ధాతుజన్యమని వాక్రుచ్చినా అన్ని శబ్దాలనూ ఆ విధంగా భావించలేమని గార్గ్యాదులు, పతంజలి మొదలయిన వైయాకరణులు తెలిపారు. తొల్కాప్పియనారు కూడా నామాలన్నీ ధాతునిష్పన్నాలని పేర్కోలేదు. అహోబల పండితుడు తెలుగు పదాలలో కొన్ని ధాతుజన్యాలనీ మరికొన్ని ధాతుజన్యాలు కావనీ విశదీకరించాడు.

ఏ భాషలోని ధాతువులనైనా తెలుసుకోవాలంటే ఆ భాషలోని పదాలను ఆ భాషలోని మిగిలిన పదాలతోను, సజాతీయ భాషా పదాలతోను పోల్చి చూచి మూలరూపాలను తెలుసుకోవచ్చు. ఈ సూత్రాన్ని ధాతు నిర్ణయంలోను అనుసరించవచ్చు. తెలుగులో ఉన్న వెలుగు, వెల్ల, వెలయు, వెలు (లు) తురు పదాలను సజాతీయ పదాలయిన తమిళంలోని 'విల్' విళంగు (ప్రకాశం) కన్నడంలోని 'బెళ్' (తెల్లని 'బెళమ్' (దీపం); బెళ్పు (తెలుపు) మొదలయిన శబ్ద రూపాలను పరిశీలించి మూ.ద్రా. 'వెళా' ను పునర్నిర్మించారు. తెలుగులోని 'వెలుగు' ధాతువుకు పూర్వరూపాన్ని తెలుసుకోవటమే కాకుండా 'వెలుగు' తెలుగులో ఒక ధాతు రూపంగాను నామధాతువుగాను పేర్కోవచ్చు.

తెలుగులోని ధాతువులు 1236 ఉన్నట్లు ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి గారు తమ "తెలుగు ధాతువులు (ఊలిజితివీతి జలిజీలీబిజి ఔబిరీలిరీ)" సిద్ధాంత వ్యాసంలో పేర్కొని నిరూపించారు. ధాతువుల నుండి భూత వర్తమాన భవిష్యదాది క్రియా రూపాలు, ప్రేరణ రూపాలు, సకర్మకాకర్మక రూపాలు కల్గుతాయని, పదార్థాల జన్మస్థితిలయాలకు కాలమే నిమిత్త కారణమని ప్రాచీన కాలం నుంచి పేర్కోబడింది. కాలమనే లౌకిక పదాన్ని కొందరు వ్యాకర్తలు వ్యాకరణ సంజ్ఞగా ప్రయోగించారు. పాణిని లకార సంజ్ఞను ప్రయోగించగా చిన్నయసూరి మొదలయిన ఆంధ్ర వ్యాకర్తలు ఆ సంజ్ఞనే ప్రయోగించారు. కాల శబ్దం నుంచి పాణిన్యాచార్యులు లకార సంజ్ఞను గ్రహించారని భావించటం సమంజసం.

"వర్తమానంబున లట్టగు" (బాల వ్యా. క్రియా. 2)

"భూతంబున లిట్టగు" (పైది 3)

"భావిని లృట్టగు" (పైది 4)

చిన్నయసూరి పాణిని సంజ్ఞలను యథాతథంగా తీసుకొని కొన్ని సొంత సంజ్ఞలను కూడా సృష్టించుకున్నారు. 'తద్ధర్మాదులందు లాట్టగు' అనే సూత్రంలో 'లాట్' ను ఆంధ్రశబ్ద చింతామణికర్త ప్రయోగించారు. తద్ధర్మాన్ని వ్యాకరణ సంహితా సర్వస్వకారులు విపులంగా వివరించారు.

"తద్ధర్మమనగా ధాత్వర్థమే. ధాతువులు వ్యాపార మాత్రార్థ మందె క్రియావిభక్తులతో గూడి పదములై వాక్య ప్రయోగార్హములగునని తాత్పర్యము. ధాతువుకు స్వార్థ వ్యాపారమాత్ర బోధకమగునపుడాయా స్థలములందలి సందర్భమును బట్టి యాయాచోటు లందు వర్తమాన భవిష్యదాద్యర్థములందును, దచ్ఛీల సంభావనా శీరాద్యర్థములును గ్రాహ్యములగుచుండునని యెఱుంగునది (పుటలు 132-133).

## 19.2 క్రియా నిర్మాణం :

ద్రావిడ భాషలలో క్రియలు సమాపకాలు అసమాపకాలు అని రెండు రకాలుగా ఉన్నాయి. తెలుగు ద్రావిడ భాషా కుటుంబానికి చెందినది కాబట్టి తెలుగులోని క్రియలను ఇదే పద్ధతిలో సమాపకాలు అసమాపకాలు అని రెండు విధాలుగా విభజించవచ్చు. సమాపక క్రియలు వాక్యాన్ని సమాప్తి చేస్తాయి. ధాతువు చివర లింగ వచన పురుష బోధక ప్రత్యయం ఉంటుంది. అసమాపక క్రియా విషయంలో ఈ ప్రత్యయం ఉండదు. ఇక అసమాపక క్రియలు వాక్యంలో విశేషణంగా లేదా క్రియా విశేషణంగా పనిచేస్తాయి. కాబట్టి అసమాపక క్రియలను విశేషణ అసమాపక క్రియలు, క్రియా విశేషణ అసమాపక క్రియలు అని రెండు విధాలుగా విభజించవచ్చు.

తెలుగులో (ద్రావిడ భాషలలో) క్రియా నిర్మాణం ఈ క్రింది విధంగా ఉంటుందని ద్రావిడ భాషా కర్తలు సూత్రించి సోదాహరణంగా వివరించారు.

### ఇదే క్రియా నిర్మాణ విధానం :

(క్రియా) ధాతువు + (సకర్మక ప్రత్యయం) + (ప్రేరణ ప్రత్యయం) + కాల ప్రత్యయం లేదా వ్యతిరేక ప్రత్యయం) + పురుష ప్రత్యయం).

సమాపక క్రియలలో పురుష ప్రత్యయమూ, ధాతుజ విశేషణాలలో ప్రత్యయమూ ఉంటాయి. క్రియా విశేషణాలలో కాల ప్రత్యయం / వ్యతిరేక ప్రత్యయం తర్వాత ప్రత్యయం ఏదీ ఉండదు."

**(ద్రావిడ భాషలు పుటలు 299-300)**

తర్వాత సకర్మక అకర్మక ప్రేరణ క్రియలకు భూత వర్తమాన భవిష్యత్కాల రూపాలకు ఇచ్చిన ఉదాహరణలన్నీ ఈ పై సూత్రానుగుణమయిన ఉదాహరణలే.

## 19.3 సకర్మక ప్రేరణ క్రియలు :

ప్రేరణ క్రియలు ద్రావిడ భాషలలో ఎక్కువ. ఇంత విస్తృతి సంస్కృతంలో లేదు. సకర్మక క్రియలు సిద్ధాలు సాధ్యాలు (derived) అని రెండు రకాలుగా ధాతువులు మిగిలిన ద్రావిడ భాషలలో లాగానే తెలుగులో కూడా ఉన్నాయి.

### సిద్ధాలు :

సహజంగా ఏ ప్రత్యయమూ చేరకుండా కర్మ ఉన్న ధాతువులు సకర్మక సిద్ధధాతువులు. ఉదా : కను, తిను, వండు, కొను, చూచు మొదలయినవి. ఏ ప్రత్యయమూ వీటికి చేరకుండానే సకర్మక ధాతువులు.

ఒక ప్రత్యయం చేరటం వల్ల అకర్మక ధాతువు సకర్మకమవుతుంది. ఒక సకర్మక ప్రత్యయం చేరటం వల్ల ఇది సాధ్యమవుతుంది.

సకర్మక క్రియలన్నిటికీ కర్మ ఉంటుంది.

అకర్మక క్రియలకు కర్మ ఉండదు.

## 19.4 అకర్మక క్రియలు :

రాముడు ఇంటికి వెళ్ళెను

ఈ వాక్యంలో వెళ్ళు ధాతువు; వెళ్ళెను భూతకాలిక క్రియ. వెళ్ళు ధాతువుకు కర్మ లేదు. కాబట్టి ఈ వాక్యం అకర్మక వాక్యానికి ఉదాహరణ.

అకర్మక క్రియలకు కొన్ని సకర్మక ప్రత్యయాలను చేర్చటం వల్ల సకర్మక క్రియలేర్పడతాయి. ఇవి సాధ్య సకర్మక క్రియారూపాలు. తెలుగులోని సకర్మక ప్రత్యయాలు -పు, -చు, -ఇంచు, -ఇంపు. తెలుగులోని సకర్మక ప్రత్యయం -పు.

| | అకర్మక ధాతువు | సకర్మక ప్రత్యయం |
|---|---|---|
| -పు | తిరుగు | త్రిప్పు > తిప్పు |
| | కఱచు | కఱపు > కరపు |
| | నిలుచు | నిలుపు |
| | కలియు | కలుపు |
| | మాయు | మాపు |
| -చు | చేరు | చేర్చు / చేరుచు |
| | కాగు | కాచు |
| | కూలు | కూల్చు |
| | చెడు | చెఱచు |
| | ఓడు | ఓర్చు |
| | తేలు | తేల్చు |
| | అణగు | అణచు |
| | కలగు | కలచు |
| -ఇంచు | పండు | పండించు |
| | మొలుచు | మొలిపించు |
| | చచ్చు | చంపించు |
| | నవ్వు | నవ్వించు |
| | వచ్చు | రప్పించు |
| | వెలుగు | వెలిగించు |

**ప్రేరణ ప్రత్యయాలు : -ఇంచు; -ఇ పించు; -పించు.**

ఎ) వండు + -ఎ + -ను > వండెను

బి) వండు -ఎదు - ము > వండెదము

సి) వండు + -దు + -రు > వండుదురు

డి) వండు + -ఎద > -ను > వండెదను

ఇ) వండు + . . . > - > వండు

పై క్రియా రూపాలను గమనించినప్పుడు ధాతువు వండు అవుతుంది. క్రియా రూపంలోని మధ్య ఉన్నవి కాలబోధక ప్రత్యయాలు కాగా చివరివి పురుష ప్రత్యయాలు. వర్తమాన కాలంలో విధ్యర్థంలో మూలధాతువుకు ఏ ప్రత్యయమూ (ఆదిలో) చేరలేదు. ఈ విషయంలో ప్రపంచ భాషలన్నీ దాదాపు ఇదేవిధంగా ఉన్నాయి. దీనిని మనం విశ్వజనీనం (Universal) గా భావించవచ్చు.

సంయుక్త సమాపక క్రియలలో మూలధాతు రూపం ఇతర రూపాలతో ప్రత్యక్ష సంబంధం పెట్టుకోదు.

**క్రియా విశేషణానికి ప్రథమ పురుష సర్వనామం చేరినప్పుడు :**

వండు + వాడు + వు > వండువావు

వండు + అది > వండునది

వర్తమాన కాల రూపం ఇదేవిధంగా ఉంటుంది.

వండు + -చు + -ఉన్న + -అది > వండుచున్నది.

పాడు + -చు + -ఉన్న + -వాడు > పాడుచున్నవాడు > పాడుచున్నాడు

ఆడు + -చు + -ఉన్న + వారు > ఆడుచున్నవారు > ఆడుచున్నారు.

భవిష్యత్కాల క్రియారూపాలు కూడా ఇంతే

పాడు + -అ + -కల + -వాడు > పాడగలవాడు > పాడగలడు

తిను + -అ + -కల + వాఁడు > తినఁగలవాడు > తినగలడు

**కాల బోధక ప్రత్యయాలు :**

సామాన్య సమాపక క్రియా నిర్మాణంలోని కాలబోధక ప్రత్యయాలను గమనించండి.

భూతకాలం

| ధాతువు (Verbal base) | కాలబోధక ప్రత్యయం |
|---|---|
| వండు | -ఎ / -ఇ |
| పాడు | -ఎ / -ఇ |

తద్ధర్మార్థం

| | |
|---|---|
| వండు | -ఎడు |
| పాడు | -ఎడు |

వ్యతిరేకార్థం

| | |
|---|---|
| వండు | -అ |
| పాడు | -అ |

విధ్యర్థకం

| | |
|---|---|
| వండు | -ఉ |
| పాడు | -ఉ |

ఆశీరర్థకం

| | |
|---|---|
| వండు | -ఎడు / -త |
| పాడు | -ఎడు / -త |

నిషేధార్థకం

| | |
|---|---|
| వండు | -అడు |
| పాడు | -అడు |

**పురుష ప్రత్యయాలు** (Personal suffixes) :

పురుషలు మూడు రకాలుగా ఉన్నాయి. ప్రపంచంలోని చాలా భాషలలో ఇదే పరిస్థితి.

ప్రథమ పురుష (Third Person)

మధ్యమ పురుష (Second Person)

ఉత్తమ పురుష (First Person)

సంస్కృతంలో ఏకవచనం, ద్వివచనం, బహువచనం అని మూడు వచనాలుండగా తెలుగులో ఏకవచనం బహువచనం అనే రెండే రెండు వచనాలున్నాయి. ద్రావిడ భాషల ప్రభావం వల్ల సంస్కృతం నుండి పుట్టిన ప్రాకృతాలలో ద్వివచనం లోపించిందని ద్రావిడ భాషా శాస్త్రజ్ఞుల నిర్ధారణ.

**క్రియా విభక్తులు :**

"లకారంబునకు డుఱ్రువురునుముఙ్గు" అని బాలవ్యాకరణం.

| | ఏకవచనం | బహువచనం |
|---|---|---|
| ప్రథమ పురుష | -డు | -రు |
| మధ్యమ పురుష | -వు | -రు |
| ఉత్తమ పురుష | -ను | -ము |

వీటినే పురుష ప్రత్యయాలని వ్యవహరిస్తారు. వీటికి చరిత్ర ఉంది.

**ప్రథమ పురుష ఏకవచనం : -డు : ఇది వాఁడు శబ్దం నుంచి ఉత్పన్నమయింది. ప్రత్యయం : -ఁడు -డు**

వచ్చుచున్నవాఁడు > వచ్చుచున్నాఁడు > ఁడు

వచ్చినవాఁడు > వచ్చినాఁడు > -ఁడు

ప్రథమ పురుష బహువచనం : -రు : ఇది వారు శబ్దం నుంచి నిష్పన్నం చేయవచ్చు. కాగా ప్రత్యయం -రు.

వచ్చుచున్నవారు > వచ్చుచున్నారు > -రు

వచ్చినవారు > వచ్చినారు > -రు

### మధ్యమ పురుష ఏకవచనం : -వు ప్రత్యయం

ఇది నీకు > ఈవు శబ్దం నుంచి నిష్పన్నమయినట్లుగా తెలుస్తుంది.

వచ్చితివి + ఈవు > వచ్చితీవు > -వు

### మధ్యమ పురుష బహువచనం : -రు

ఇది మీరు > ఈరు శబ్దం నుంచి నిష్పన్నమయిందని భావించవచ్చు.

వచ్చితివి + వీ ఈరు > వచ్చితీరు > -రు

### ఉత్తమ పురుష ఏకవచనం : -ను ప్రత్యయం

నేను > ఏను

వచ్చితిని + ఏను > వచ్చితేను > -ను

ఉత్తమ పురుష బహువచన ప్రత్యయం : -ము ప్రత్యయం

ఉత్తమ పురుష బహువచనంలో -ము వస్తుంది.

మేము > ఏము

వచ్చితి + ఏము > వచ్చితేము > -ము

### సారాంశం :

| | | | |
|---|---|---|---|
| ప్రథమ ఏ.వ. | వాఁడు | > | -ఁడు |
| ప్రథమ బ.వ. | వారు | > | -రు |
| మధ్యమ ఏ.వ. | ఈవు | > | -వు |
| మధ్యమ బ.వ. | ఈరు | > | -రు |
| ఉత్తమ ఏ.వ. | ఏను | > | -ను |
| ఉత్తమ బ.వ. | ఏము | > | -ము |

అమహత్తులలో ఏ.వ. ప్రత్యయం -ది. ఇది అది లేదా ఇది శబ్దం నుంచి వచ్చి ఉంటుంది.

వచ్చిన్ + అది > వచ్చినది > -ది

వండిన + అది > వండినది > -ది

### అమహత్తులలో బహువచన ప్రత్యయం : -వి.

ఇది అవి లేదా ఇవి శబ్దం నుంచి వచ్చి ఉంటాయి.

వచ్చిన + అవి > వచ్చినవి > -వి

వండిన + అవి > వండినవి > -వి

**తెలుగులోని వ్యతిరేక క్రియలు :**

అ) భూతకాలిక వ్యతిరేక క్రియలలో అన్నంత రూపాలకు '-లేదు' చేరుతుంది. ఇది సర్వలింగ వచన ప్రత్యయం : రాలేదు, వండలేదు, తినలేదు, పోలేదు.

ఆ) వర్తమాన వ్యతిరేక క్రియ : ధాతువు + -అటం + లేదు

ఉదా : వండు + అటం + లేద > వండటం లేదు

తిను + అటం + లేదు > తినటం లేదు

**ఇ) భవిష్యద్బోధక వ్యతిరేకక్రియ : -అ-**

అన్నంత క్రియలు + క్రియావిభక్తులు

| ధాతువు | ప్రథమ ఏకవచనం | ప్రథమ బహువచనం |
|---|---|---|
| వండు | వండడు | వండరు |
| తిను | తినడు | తినరు |
| ధాతువు | మధ్యమ పురుష ఏకవచనం | మధ్యమ పురుష బహువచనం |
| వండు | వండవు | వండరు |
| తిను | తినవు | తినరు |
| ధాతువు | ఉత్తమ పురుష ఏకవచనం | ఉత్తమ పురుష బహువచనం |
| వండు | వండను | వండము |
| తిను | తినను | తినము |
| | అమహదేకవచనం | అమహద్బహువచనం |
| | అదు | అవు |
| వండు | వండదు | వండవు |
| తిను | తినదు | తినవు |

**ఈ) వ్యతిరేక విధ్యధికాలు అన్నంత ధాతువుకు వద్దు చేర్చటం వల్ల ఏర్పడతాయి.**

| ధాతువు | వ్యతిరేక విధి |
|---|---|
| వండు | వండవద్దు |
| తిను | తినవద్దు |
| వచ్చు | రావద్దు |

వ్యతిరేక క్రియకు ఇంకా అనేక రూపాలు

| ధాతువులు | వ్యతిరేక క్రియ |
|---|---|
| వచ్చు | రాకు, రాబోకు, రాదు, రాకూడదు మొదలగునవి. |

నిషేదార్థానికి పురుష భేదం లేదు. '-రాదు' అనేది ధాతువుకు చేర్చబడుతుంది.

| ధాతువు | నిషేదార్థ రూపం |
|---|---|
| వండు | వండరాదు |
| ఆడు | ఆడరాదు |
| | అసత్యమాడరాదు |
| తిను | తినరాదు |
| | పురుగుల అన్నం తినరాదు |

**తెలుగులోని అసమాపకక్రియారూపాలు :**

**క్త్వార్థక రూపం :**

"సమానాశ్రయంబులం బూర్వకాలంబునం దివర్ణకంబగు" (బాల వ్యా. క్రియా. 38)

తెలుగులో క్త్వార్థక ప్రత్యయం '-ఇ'. ఇది ధాతువుకు చేర్చితే క్త్వార్థక రూపం సిద్ధిస్తుంది.

| ధాతువు | క్త్వార్థక ప్రత్యయం | క్త్వార్థక రూపం |
|---|---|---|
| వచ్చు | -ఇ | వచ్చి |
| వండు | -ఇ | వండి |
| చూచు | -ఇ | చూచి |
| వెళ్లు | -ఇ | వెళ్లి |
| తన్ను | -ఇ | తన్ని |

**వ్యతిరేక క్త్వార్థకం :**

"కజీ వ్యతిరేకార్థకంబునందగు" (బాల వ్యా. క్రియా. 39)
దీని ప్రౌఢ వ్యాకర్త అక ప్రత్యయాంతమని తెలిపాడు.

| ధాతువు | ప్రత్యయం | రీవ్యతిరేకార్థక రూపం |
|---|---|---|
| వండు | కజీ (> -అక) | వండక |
| తిను | కజీ (> -అక | తినక |
| పాడు | కజీ (> -అక) | పాడక |

**శత్రర్థకం :**

శత్రర్థకం > శతృ + అర్థకం.

సంస్కృతంఓ భవత్, లసత్, కనత్ మొదలైనవి శత్రర్థకాలు. వర్తమానకాలికా సమాపక క్రియా రూపాన్ని శత్రర్థకమని వ్యవహరిస్తారు. '-చు' వర్ణకం ఈ అర్థాన్ని తెలుగులో బోధిస్తుంది. తెలుగులో ఈ రూపం అర్వాచీనమని భావించటానికి తమిళంలో ఇటువంటి రూపాలు లేకపోవటం ఒక ప్రధాన కారణం. తెలుగులో ప్రాఙ్నన్నయ కాలం నుంచి ఈ ప్రత్యయం ఉంది అని చెప్పటానికి 'ఏళుచు' వంటి ప్రాచీన శాసన ప్రయోగాలు ఉపబలకంగా ఉన్నాయి.

శత్రర్థక ప్రత్యయం ద్రుతాంతం '-చున్'

కొంటూ' అని గ్రామ్యానికి కేతన ఉదాహరించాడు. ఇది శత్రర్థక రూపం. దాన్ని బట్టి 'చున్ > తున్' గా కేతన కాలానికి మారిందని చెప్పవచ్చు. తిన్ + తున్ > తింతూ > తింటూ నేటికీ వ్యావహారిక భాషలో '-తూ' యే శత్రర్థకంగా ప్రయోగంలో ఉంది. వస్తూ, చూస్తూ, పోతూ. -తున్ ట -తూ.

క్రీ.శ. 15వ శతాబ్దిలో దీనికి శాసన ప్రయోగం ఉంది.

ఉదా : రాజ్యం చేస్తుంది
రాజ్యం పాలిస్తున్న
విచ్చేస్తున్న
కాబట్టి తెలుగులో శత్రర్థకాలుగా ఈ కింది ప్రత్యయాలను పేర్కోవచ్చు.
-చున్ > -తున్ > -తూ > -తా

ఉదా : చేయుచున్ > చేస్తు > చేస్తూ > చేస్తా

## తుమర్థ భావ లక్షణాలు :

"తుమర్థ భావలక్షణంబులంబు నుజియగు" (బాల వ్యా. క్రియా. 40)

తుమర్థంలోను భావలక్షణంలోను ధాతువుకు నుజి ప్రత్యయం వస్తుంది. ఏ క్రియ నిమిత్తం వేరొక క్రియ జరుగుతుందో ఆ క్రియ తుమర్థకం.

"భావలక్షణంబునా నన్య క్రియకు లక్షణభూతంబగు క్రియ" అని చిన్నయసూరి గారే భావ లక్షణాన్ని నిర్వచించారు. తుమర్థానికి ఉదాహరణ : "చైత్రుండు వండనుబోయెను. పాక క్రియార్థము పోయెనని యర్థము.

## భావ లక్షణానికి ఉదాహరణ :

"చైత్రుండు వండనతిథి వచ్చెను"
అతిథి ఎప్పుడు వచ్చాడు,

"చైత్రుండు వండన్" చైత్రుడు అన్నం వండిన తర్వాత లేదా చైత్రుడు వడుతున్నప్పుడు) అతిథి వచ్చాడు అనేది సమాధానం. 'వండు' అనేది లక్షణ క్రియ. దీనినే భావలక్షణమంటారు. 'వచ్చు' లక్ష్య క్రియ. భావలక్షణ క్రియ అయిన 'వండు'కు నుజి వచ్చి 'వండన్' ఏర్పడింది.

"వాడి కడుపు బంగారం కాను
నాడి దుంప తెగ
కళ్ళార > కళ్ళారా" మొదలగునవి నేటి తెలుగులోని కొన్ని నుజ్యంత రూపాలు.
ప్రాచీన వాఙ్మయంలో కూడా కొన్ని శాసనాలలో
"ఏళన్ < ఏళు + -అన్
ప్రవర్తిల్లన్ = ప్రవర్తిల్లు + అన్
నా + < అను + అన్" మొదలగునవి ఉన్నాయి.

కర్మణి రూపాలు అన్వంత క్రియారూపానికి పడు ధాతువును చేర్చటం వల్ల ఏర్పడతాయి.

ఉదా : "చేయఁబడెను
పిలువఁబడెను" మొదలైనవి.

## చేదాద్యర్థకం :

"చేదర్థంబునందు వృత్తంబగు భావలక్షణంబు నందు న వర్ణకంబు ద్రుతాంతంబగు" (బాల.వ్యా. క్రియా. 41)
చేదర్థంలోను, భూతకాలికమయిన భావలక్షణంలోను ధాతువుకు 'నన్' అనే ప్రత్యయం వస్తుంది.
చేదర్థం = అయితే

ఉదా : వానలు కురిసి నంబంటలు పండును

కురియు ధాతువుకు చేదర్థంలో ద్రుతాంతమయిన న వర్ణకం (-నన్) చేరగా కురియు + నన్ = కురిసినన్ అవుతుంది. చేదర్థక క్రియ ఎప్పుడూ పూర్వకాలికమే అవుతుంది. పండటానికి వానలు ముందేకురవాలి కదా. నేటి తెలుగులో -తే చేరుతుంది. "వానలు కురిస్తే పంటులు పండుతాయి" అనేది ఇందుకు ఉదాహరణ.
వృత్తమయిన భావలక్షణానికి

"వాడు రమ్మనినన్ బోయితిని"

ఈ పై వాక్యంలో రమ్మను అనేది లక్షణ క్రియ, పోవు లక్ష్య క్రియ. 'రమ్మను' అనేది భావలక్షణం. పోవుటకు ముందు కార్యం "రమ్మనుట" అనేది ఇది వృత్తమయిన భావలక్షణం. ఈ అర్థంలో "రమ్మను" ధాతువుకు ద్రుతాంతమయిన న వర్ణకం (-నన్) చేరగా "రమ్మనినన్" రూపమేర్పడింది.

భావార్థంలో నేటి తెలుగులో 'తే' చేరుతుంది.
రమ్మనినన్ = రమ్మను + తే > రమ్మంటే
'వాడు రమ్మంటే పోయాను"
శాసనాలలో కూడా 'తే' రూపాలున్నాయి.

ఉదా : "చేస్తే, పోయితేను"
నేడు '-ఇతే' ప్రత్యయరూపాలు ఉన్నాయి.
అడుగు + ఇతే > అడిగితే
అడిగితే చెప్తాను.

## సమాపక క్రియలు

### భూతకాలం :

మూల ద్రావిడ భాషలో భూతకాలాన్ని తెలిపే ప్రత్యయాలు చాలా ఉన్నాయి. తెలుగులో (సామ్యం వల్ల) వైరుధ్యం అంతగాలేదు. ప్రాచీనాంధ్రంలో ఉత్తమ మధ్యమ పురుషలలో భూతకాలిక ప్రత్యయం -ఇతి- హ్రస్వాచ్చు కలిగి -ను తో అంతమయ్యే "అను, కను, కొను, తిను, మను, విను" అనే క్రియల తర్వాత 'ఉండు' అనే క్రియ తర్వాత వచ్చే ఈ "-ఇతి"

-టి-గా మారిపోవటమే కాకుండా వీటిలోని (అన్యాదులలోని, ఉండులోని) "ను" 'ండ' గా -లు --ణ్-గా మారతాయి. ప్రథమ పురుషలో మనుష్య బహువచన ప్రత్యయమయిన '-రి' ముందు -ఇ-, మిగిలిన చోట్ల -ఎను వస్తాయి.

"భూతంబునందిగాగమంబగు" (బాల వ్యా. క్రియా. సూ. 17)

| | ఏ.వ. | బ.వ |
|---|---|---|
| ఉత్తమ పురుష | వచ్చితిని | వచ్చితిమి |
| మధ్యమపురుష | వచ్చితి (వి) | వచ్చితిరి |
| ప్రథమపురుష | వచ్చెను | వచ్చిరి |
| (అతడు, ఆమె, అది) | | |

అన్యాదుల క్రియా రూపాలు ఈవిధంగా ఉంటాయి.

| | ఏ.వ. | బ.వ. |
|---|---|---|
| ఉత్తమపురుష | అంటిని | అంటిమి |
| మధ్యమపురుష | అంటి (వి) | అంటిరి |
| ప్రథమపురుష | అనెను | అనిరి |
| (అతడు, ఆమె, అది) | | |

ఆధునికాంధ్రంలో ప్రాచీన భూతకాలిక రూపాలకు మారుగా ధాతుజ విశేషణ నామాలు క్రియలుగా ఏర్పడ్డాయి. సర్కారు జిల్లాల వ్యవహారంలో ఈ భూతకాలిక క్రియా నిర్మాణంలో ఆధునిక కాలంలో కొన్ని మార్పులు చోటుచేసుకున్నాయి. ది వీ తర ప్రత్యయాల ముందు -ఇన- లోని నకారం లోపించి ఇ +అ ట> -ఏ-గా మారింది. -ఏ-ను ఆధునిక భూతకాలిక ప్రత్యయంగా పేర్కోవచ్చు.

**ధాతువు వచ్చు**

| | ఏ.వ. | బ.వ |
|---|---|---|
| ఉత్తమ పురుష | వచ్చేను | వచ్చేము |
| మధ్యమ పురుష | వచ్చేవు | వచ్చేరు |
| ప్రథమ పురుష | వచ్చేడు | వచ్చేరు |

అమహదేకవచన ప్రథమ పురుష క్రియలలో -ఏ- స్థానంలో -ఇన్-; మహతీతరామహత్ క్రియలలో -ఏ- స్థానంలో -ఆ- రావటమే కాకుండా తర్వాత క్రియా ప్రత్యయంగా ఉన్న '-వి' స్థానంలో "-య్/-యి" వస్తుంది.

ధాతువు వచ్చు

| | ఏ.వ. | బ.వ. |
|---|---|---|
| ప్రథమ పురుష | వచ్చింది | వచ్చాయి / వచ్చాయ్ |
| (అది, ఆమె) | | |

అన్యాది ధాతువుల తర్వాత ఉన్న -ఇన- కు మారుగా -న్నా- అనేది రావటమే కాకుండా అన్యాదులలోని తుది '-ను' వర్ణం లోపిస్తుంది.

**ధాతువు తిను**

| | ఏ.వ. | బ.వ. |
|---|---|---|
| ఉత్తమ పురుష | తిన్నాను | తిన్నాము |
| మధ్యమపురుష | తిన్నావు | తిన్నారు |
| ప్రథమ పురుష | తిన్నాడు | తిన్నారు |

**వర్తమాన కాలం :**

ద్రావిడ భాషలలో వర్తమానకాలం అర్వాచీన కాలంలో ఏర్పడింది. తెలుగులో వర్తమానకాలంలో ఉన్నాను బంధం వస్తుంది.

"ఉదంతంబునకు లట్టు పరంబగునపుడున్నాను బంధంబగు" (బాల వ్యా. క్రియా. 13). వర్తమాన కాలం తెలియజేయటానికి '-చు' వస్తుంది. దీనిని వ్యాకర్తలు గుర్తించారు.

"ఉన్న శబ్దంబు పరంబగునపుడు చువర్ణకంబగు" (బాల వ్యా. క్రియా. 14 సూ.)

ధాతువు 'వండు'

| | ఏ.వ. | బ.వ. |
|---|---|---|
| ఉత్తమపురుష | వండుచున్నాను | వండుచున్నాము |
| మధ్యమపురుష | వండుచున్నావు | వండుచున్నారు |
| ప్రథమపురుష | వండుచున్నాడు | వండుచున్నారు |

వ్యావహారిక రూపాలలో ఈ పై క్రియాపదాలన్నింటిలోను -చు- కు మారుగా -తు- కన్పిస్తుంది. 'వండుచున్నాను' కు మారుగా వండుతున్నాను మొదలయినవి.

**భవిష్యదర్థకం :**

భవిష్యత్కాల ప్రత్యయాలు ప్రత్యేకంగా ప్రాచీనకాలంలో లేవు. ఆధునిక కాలంలో కాలంలో వేరే రూపాలున్నాయి.

"కలజ్యనుబంధంబు లృట్టు పరంబగునపుడగు" (బాల వ్యా. క్రియా. 19)

లృడర్థంలో (భవిష్యర్థంలో) ధాతువుకు కల అనేది అనుబంధంగా వస్తుందని ధాతూకారం 'అ' కారమౌతుందని పై సూత్రార్థం.

నన్నయ భట్టారకుల మహాభారతంలో 'కల' అనేది భవిష్యదర్థకంగా కాక హేరళం శక్త్యర్థకంగానే ప్రయోగించబడింది. నేడు కూడా అదే శక్త్యర్థకంగా ఉన్నట్లు కన్పిస్తోంది.

-కల- అనేది కలుగు ధాతునిష్పన్నం. మొదట స్వతంత్ర క్రియగాను తర్వాత అనుబంధ క్రియగాను ఉపయోగించబడింది.

ధాతువు 'వండు'

| | ఏ.వ. | బ.వ. |
|---|---|---|
| ఉత్తమపురుష | వండగలను | వండగలము |
| మధ్యమపురుష | వండగలవు | వండగలరు |
| ప్రథమపురుష | వండగలడు | వండగలరు |

ఆధునికాంధ్రంలో -తా- అనేది భవిష్యత్కాల ప్రత్యయం. అన్యాదుల తర్వాత ఉండు ధాతువు తర్వాత ఇది -టా- గా మారుతుంది. ఈ ప్రత్యయాలు పరమైనపుడు ధాతువు ఉత్వానికి అత్వం వస్తుంది.

**ధాతువు 'పాడు'**

| | ఏ.వ. | బ.వ |
|---|---|---|
| ఉత్తమపురుష | పాడతాను | పాడతాము |
| మధ్యమపురుష | పాడతావు | పాడతారు |
| ప్రథమపురుష | పాడతాడు | పాడతారు |

ధాతువు అను

| | ఏ.వ. | బ.వ. |
|---|---|---|
| ఉత్తమపురుష | అంటాను | అంటాము |
| మధ్యమపురుష | అంటావు | అంటారు |
| ప్రథమపురుష | అంటాడు | అంటారు |

'ఉండు' ధాతువుకు భవిష్యత్కాలంలో 'ఉన్' సర్వాదేశమవుతుంది.

ధాతువు 'ఉండు'

| | ఏ.వ. | బ.వ. |
|---|---|---|
| ఉత్తమపురుష | ఉంటాను | ఉంటాము |
| మధ్యమపురుష | ఉంటావు | ఉంటారు |
| ప్రథమపురుష | ఉంటాడు | ఉంటారు |

## తద్ధర్మాద్యర్థకం :

ఇది ప్రత్యేక కాలం కాదు. తస్యధాతోః ధర్మః > తద్ధర్మః

ఈ సంజ్ఞ ఆంధ్ర శబ్ద చింతామణి కర్తచే కల్పించబడింది. దీనిని బాలసరస్వతి బాగా వివరించాడు.

"భూతాద్యర్థత్రయ విలక్షణమైన యుకానుక ధర్మంబు తద్ధర్మమనిపించుకొనును అది యేది యంటేని వాచ్యర్థమాత్రమైన ధాతుధర్మమే"

"తద్ధర్మాదులందు లాట్టగు" (బాల వ్యా. క్రియా. 5)

అని చిన్నయసూరి ఆంధ్రశబ్ద చింతామణిని అనుసరించాడు.

"వచ్యర్థంబులకొకానొకచో భూతంబున లాట్టుగానంబడియెడి" (బాల వ్యా. క్రియా. 22)

వాడు వచ్చును - అంటే వాడు నిన్న వచ్చి ఉండవచ్చు. రేపు రావచ్చు. ఇప్పుడు వస్తూండవచ్చు.

వండు -తా-డు మొదలయినవి అర్థత్రయ బోధకాలు.

శుభంబగును లేదా శుభమవుతుంది మొదలయినవి కూడా వర్తమాన భవిష్యదర్థకాలను సూచిస్తాయి. కాబట్టి నన్నయ చిన్నయలు 'లాట్' ను ప్రయోగించారు.

సంస్కృతంలో వలె తెలుగులో దశవిధ లకారాలు లేకపోయినా ఉన్న క్రియలతో తమ భావాలను తెలుగువారు వ్యక్తంచేయగల్గుతున్నారు.

**ప్రశ్నలు :**

1. క్రియను నిర్వచించి క్రియానిర్మాణ సూత్రాన్ని తెలిపి నిరూపించండి.
2. సకర్మక అకర్మక ప్రేరణ క్రియా రూపాలను సోదాహరణంగా వివరించండి.
3. కాలబోధక పురుష బోధక ప్రత్యయాలను పేర్కొనండి.
4. ప్రాథమిక, ద్వితీయ నిష్పాదక క్రియా ప్రత్యయాలను సోదాహరణంగా వివరించండి.

**5. ఈ క్రింది వాటిని సంగ్రహవ్యాఖ్య వ్రాయండి.**

అ) క్రియా నిర్వచనం

ఆ) క్రియా నిర్మాణ సూత్రం

ఇ) తెలుగులోని ప్రేరణ క్రియలు

ఈ) తెలుగులోని విధ్యర్థక క్రియలు

ఉ) తెలుగులోని వ్యతిరేక క్రియలు

ఊ) క్త్వార్థకం, వ్యతిరేకక్త్వార్థకం

ఋ) శత్రర్థకం

ౠ) తుమర్థకం

ఎ) నిష్పాదక ప్రత్యయాలు

ఏ) సమాపక క్రియా లక్షణం

**సంప్రదింపు గ్రంథాలు**


1. Krishna Murti, BL. Telugu Verbal Bases, Universities of California press, Berkeley, 1961.
2. జోగిసోమయాజి, గంటి. ఆంధ్రభాషా వికాసము, విశాఖపట్నం -1, 1947.
3. మహాదేవశాస్త్రి, కోరాడ. గంగాధర పబ్లికేషన్స్, రామమందిరం వీధి, విజయవాడ - 522 002, 1987.
4. సుబ్రహ్మణ్యం, పి.ఎస్. సత్యవతీ పబ్లికేషన్స్, అణ్ణామలైనగర్ - 608 101, 1977.


**- ఆచార్య లకంసాని చక్రధరరావు**

పాఠం - 20

# తెలుగులోని పదజాలం - అన్యదేశ్యాలు

**వ్యాస సంగ్రహ స్వరూపం :**

1. తెలుగులోని పదజాలం
.2. దేశ్యాలు
3. అన్యదేశ్యాలు
4. పూర్వ వ్యాకర్తల పదవిభజన
5. పద విభజన విధానంలో ఆధునికుల భావన
6. ఆదానం ఆవశ్యకత - ఫలితాలు
7. ఆదాన పదాలలో ధ్వని పరిణామం
8. సంస్కృత ప్రాకృత భాషల నుండి తెలుగులో ప్రవేశించిన పదజాలం
9. తత్సమాలు, తద్భవాలు
10. ఆధునిక హింద్వార్య భాషల నుంచి, యూరోపియన్ భాషల నుంచి సజాతీయ భాష నుంచి తెలుగులోకి వచ్చిచేరిన ఎరవు మాటలు.

రెండు భాషలకు సంసర్గ సంబంధం ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఉన్నప్పుడు ఆ భాషలలోని పదాలను పరస్పరం వినిమయం చేసుకోవటం అతి సహజ విషయం. ఈ వినిమయంలో హెచ్చుతగ్గులుండవచ్చు కాని అసలు వినిమయం లేదనటం సరికాదు. ప్రతి భాషలోను దేశ్యపదాలతోపాటు ప్రతిదేయపదాలు అన్యదేశ్యాలు (Loan words) ఉంటాయి. ప్రపంచంలో ఉన్న 5 వేల భాషలలోను అన్యదేశ్యపదాలు లేని భాష లేదు. పైతృకంగా మూలభాష నుంచి సంక్రమించిన పదాలు దేశ్యాలు. ఇతర భాషల నుంచి రాజకీయ వాణిజ్యాద్యనేక కారణాల వల్ల తమ భాషలోకి ఎరువు తెచ్చుకొన్న పదజాలం అన్యదేశ్య పదరాశి. ఒక భాషకు నిసర్గంగా ఉన్న పదాలు కాకుండా సోదర భాషల నుండి కాని మరే యితర భాషా కుటుంబ భాషల నుండి కాని ఎరవుగా ఆ భాషలోకి వచ్చి చేరిన పదాలు అన్యదేశ్యాలు అని అన్యదేశ్య నిర్వచనం. ఈవిధంగా అన్యదేశ్యపదాలు ఒక భాషలో చేరటానికి అనేక కారణాలున్నాయి. ఇటువంటి ఎరువుగా తెచ్చుకొన్న పదాలను తెలుగులో ఉండటం గమనించిన వికృతి వివేకారులు.

"ప్రాకృతే తద్భవే చాపి
చజౌదంత భవౌస్మృత్
అహేయమన్య దేశీయం
యత్త దేవప్రయుజ్యతే"

(వికృతి వివేకం, సంజ్ఞా పరిచ్ఛేదం) అని సూత్రీకరించారు.

| | | |
|---|---|---|
| "అహేయమ్ | = | రసంకల |
| అన్యదేశీయమ్ | = | అన్యదేశ్యం |
| యత్ | = | ఏపదమున్నదో |
| తత్ + ఏవ ) తదేవ | = | ఆ పదమే |
| ప్రయుజ్యతే | = | ప్రయోగింపబడుతున్నది |

"ఏ అన్యదేశ్య పదం రసం కలిగి ఉంటుందో ఆ పదమే ప్రయోగించబడుతుంది" అని, సూత్రార్థాన్ని బాలసరస్వతి ప్రభృతులు వివరించారు. ఏ పదాలను వికృతి వివేకకారులు అన్యదేశ్యాలుగా ఉద్దేశించారో తెలుసుకోవాలి. ఈవిధంగా మనం తెలుసుకోవటానికి వికృతి వివేకంలోని "డోలా భూషోత్తరీయాణి విన్యైత్వం నాస్తి మధ్యమః" అనే సూత్రం సాయపడుతోంది. ఈ సూత్రాన్ని దృష్టిలో పెట్టుకొన్న చిన్నయసూరి గారు తన బాలవ్యాకరణంలో "ఊయెల పయ్యెద తాయెతులం ద్రక్క నామంబులందు యాకుందాలవ్యవక్రయోగంబు లేదు" (బాల వ్యాకరణం. ప్రకోర్ణ. 3) అని సూత్రీకరించారు. వికృతి వివేకకారుని భూషా శబ్దానికి 'తాయెతు' అని అర్థం. 'త అవీజ్' అనే అరబీ పదం ఉర్దూలోకి తావీజ్ గా వచ్చి చేరింది. ఉర్దూ తావీజ్ తెలుగులోకి 'తాయెతు'గా వచ్చి చేరింది. ఇది అన్యదేశ్యపదం. క్రీ.శ. 15వ శతాబ్ది వరకు ఈ శబ్దం తెలుగులోకి ఉర్దూ నుంచి రాలేదు.

"వక్షః స్థలంబున రక్షపూసల పేరు
దండ తాయెతులను దగధరించి"

అని సింహాసన (సింహాసన ద్వాత్రింశిక 7-45) ద్వాత్రింశిక ప్రయోగం.

"మేనిక రక్షయై మించు తాయెతులు" అని పల్నాటి వీరచరిత్రలో శ్రీనాథకవి ప్రయోగం. 15వ శతాబ్దిలో మహమ్మదీయుల ప్రభావం వల్ల ఈ పదం తెలుగులో ప్రవేశించింది. ఆంధ్ర మహమ్మదీయుల సాంస్కృతిక సంబంధాల వల్ల ఇటువంటి విశ్వాసంతో కూడిన పదాలు తెలుగులో ప్రవేశించాయి.

పారసి 'త రాజూ' శబ్దం వర్ణలోపం (Syncose) కారణంగా తెలుగు భాషలో 'త్రాసు' గా మారి తిక్కన సోమయాజి మహాభారతంలో ప్రవేశించింది.

"త్రాసులంబోనిచిత్తంబుల తోడుత
ప్రజవివాదములెడ భయములుడిగి"
(భార. శాంతి. 2-375)

ఇంతేగాక తిక్కన కాలానికి చెందిన ఈ పురు శిలాశాసనంలోను ఈ త్రాసు శబ్దం కన్పిస్తోంది.

"ఓగిరానకు త్రాసు నాయము వల్ల"
(క్రీ.శ. 1278)

ఈ 'త్రాసు' శబ్దం వల్ల మహమ్మదీయులకు మనకు తిక్కన కాలానికే వాణిజ్య సంబంధాలున్నాయని తెలుస్తోంది.

వాణిజ్య సంబంధాల వల్ల, రాజకీయ సంబంధాల వల్ల, మత సంబంధాల వల్ల అన్యదేశ్యాలు తెలుగులో లేదా మరే భాషలోనైనా ప్రవేశిస్తాయి. ఈ పాఠంలోని ఇతర అన్యదేశ్య పదాలను పరిశీలించినపుడు ఈ విషయం స్పష్టపడుతుంది. ఒక భాషలోకి ఇంకో భాష నుంచి అన్యదేశ్యాలు ప్రవేశించటమనే సంప్రదాయం అనాది నుంచి ఉంది. రెండు భిన్న భిన్న భాషలను మాట్లాడే వ్యక్తులు కలుసుకున్నప్పుడు తమ తమ అవసరాలను బట్టి ఆ రెండు భాషలలో అధిక గౌరవం ఉన్న భాషను ప్రతిష్ఠ (ఆజీలిరీశిరివీలి) కోసం అనుకరించటాన్ని బట్టి ఆ అధిక ప్రతిష్ఠ ఉన్న భాషా పదాలు న్యూన ప్రతిష్ఠ కల భాషలోకి ప్రవేశిస్తాయి. ఇటువంటి సందర్భాలలో భాషలలో ఆదాన ప్రదానాలు జరుగుతుంటాయి. స్వీయ భాషలోకి ఇంకో భాష నుంచి పదాలను తీసుకోవటం ఆదానమంటారు. స్వీయ భాష నుంచి ఇతర భాషలోకి పదాలు ప్రవేశించటం ప్రదానమని వ్యవహరిస్తారు.

ప్రపంచంలో ప్రతిష్ఠ పొందిన భాష సంస్కృతం. సంస్కృత భాషలోకి కూడా ప్రపంచంలోని ఇతర భాషల నుంచి అనేక పదాలు ప్రవేశించాయి. ఈ విషయాన్ని జైమిని మహర్షి తన మీమాంసాదర్శనంలో తెలిపాడు :

"చోదితంతు ప్రతీయేతావిరోధాత్
ప్రయాణేన" (మీమాంసాదర్శనమ్)

వేద విరుద్ధం కాని సందర్భంలో ఆర్యులకు కొన్ని వేద పదాల అర్థం అవగతం కానప్పుడు మ్లేచ్ఛులకు ఆ అర్థం బాగా తెలిసినప్పుడు ఆమ్లేచ్ఛుల నుండి ఆ పదాల అర్థాలను ఆర్యులు గ్రహించవచ్చు. శబరస్వామి కుమారిలభట్టు ఈ సూత్రాన్ని ఈవిధంగానే వ్యాఖ్యానించారు. కుమారిలభట్టు ఈ సూత్రాన్ని సోదాహరణంగా వివరించాడు. ద్రావిడాది భాషల్లోని వ్యంజనాంత పదాల్ని స్వరాంతపదాలుగా మార్చి విభజిస్తే, ప్రత్యయాదుల్ని కృత్రిమంగా కల్పించి వాటిని సంస్కృత పదాలే అని సంస్కృత పండితులు తెల్పుతున్నారు. ఇది సరికాదు. అన్నం అర్థాన్నిచ్చే ద్రావిడ 'చోర్' శబ్దాన్ని స్వరాంతంగా మార్చి చోర శబ్దాన్ని కల్పించి "బుభుక్షితో కింనకరోతి" అని తెలిపి చోర శబ్ద వ్యుత్పత్తిని ప్రదర్శిస్తున్నారు. ఇటువంటి కృత్రిమవ్యుత్పత్తుల్ని కల్పించే సంస్కృత పండితుల్ని కుమారిలభట్టు ఆక్షేపించాడు. ద్రావిడాది భాషాపదాల స్పష్టార్థాన్ని ద్రావిడాది భాషా వ్యవహర్తల నుంచి మాత్రమే గ్రహించాలని తెలిపి కుమారిలభట్టు ఆధునిక భాషా శాస్త్రజ్ఞులకు ఆదర్శప్రాయుడయ్యాడు.

**తెలుగులోని శబ్దజాలం :**

తెలుగులోని శబ్ద జాలాన్ని ఆంధ్ర శబ్ద చింతామణి ఈ క్రింది విధంగా విభజించింది :

"తజ్జా సమాచదేశ్యా
గ్రామ్యాచేయం చతుర్విధాభవతి
ప్రకృతి ద్వయజాతజ్జా
తుల్యాతుసమాప్రవాకినీదేశ్యా" (ఆంధ్ర శబ్ద చింతామణిః సంజ్ఞా. 42)

తెలుగు భాష తజ్జ, సమం, దేశ్యం, గ్రామ్యం అని నాలుగు విధాలు. సంస్కృత ప్రాకృత ప్రకృతి ద్వయం నుంచి వచ్చింది తజ్జ. వాటితో సమమయింది 'సమ' అని, లోక వ్యవహారం వల్ల తెలుసుకోతగింది దేశ్యమని ఆంధ్ర శబ్దచింతామణి పేర్కొంది. చిన్నయసూరి "సంస్కృత ప్రాకృతతుల్యంబగు భాష తత్సమంబు" (బాల వ్యా. సంజ్ఞా. 19)

"సంస్కృత ప్రాకృత భవంబగు భాష తద్భవంబు" (పైది. 20)

"త్రిలింగ దేశ వ్యవహారసిద్ధంబగు భాష దేశ్యంబు" (పైది. 21) అని శబ్దరాశిని చింతామణిననుసరించి విభజించాడు.

"లక్షణ విరుద్ధంబగు భాష గ్రామ్యంబు" (బాల. వ్యా. సంజ్ఞా. 22)

అని మరో విభాగాన్ని సృష్టించి అది ప్రయోగానర్హమని పేర్కొన్నారు.

ఇది ప్రాచీన మతం. ఇందులో (ఈ విభజనలో) అన్యదేశ్య ప్రసక్తి ఏ మాత్రమూ లేదు. ప్రౌఢ వ్యాకర్త కూడా ఇంతే.

సంస్కృత సమాలు కాని సంస్కృత భవాలు కాని అన్యదేశ్యాలే అని ఆధునిక భాషాశాస్త్రవేత్తలు సిద్ధాంతం. సంస్కృత సమాలు సంస్కృత భవాలు సంస్కృత భాష నుంచి జనించగా, ప్రాకృత సమాలు ప్రాకృత భవాలు ప్రాకృత భాష నుంచి పుట్టాయి. శాసనాలలోని ఆంధ్రసారస్వతంలోను సంస్కృత సమశబ్దాలు అనేకం ప్రవేశించాయి. క్రీ.శ. 200 సంవత్సరానికి చెందిన గుంటూరు జిల్లా అమరావతి శాసనంలోని 'నాగబు' శబ్దం సంస్కృత సమం. సంస్కృత నాగ - (పాము) శబ్దానికి 'బు' అనే తెనుగు ప్రథమా విభక్తి ప్రత్యయం చేరగా ఈ శబ్దం తెలుగు పదం అయింది కాగా ఇది సంస్కృత సమశబ్దం. క్రీ.శ. 575 -

600 సంవత్సరానికి చెందిన ఎఱ్ఱిగుడిపాడు శిలాశాసనంలో 'నవప్రియ' అనే పదం సక్షి (ఎసాక్షి) పదం ఈ రెండూ సంస్కృత సమాలు. ఇదే కాలానికి చెందిన ధనం జయుని కలమళ్ళ శాసనంలోని "పఞ్చ మహాపాతక" అనేది ఇట్టిదే. నన్నయ భట్టారకులు తమ మహాభారతంలో మొదట సంస్కృత శ్లోకాన్ని రచించి తర్వాత ఒక వచనాన్ని తర్వాత ఒక పద్యాన్ని రచించారు. మహాభారతంలోని ఈ మొదటి తెలుగు పద్యం సంస్కృత పద భూయిష్ఠం.

"రాజకులైక భూషణుఁడు రాజమనోహరుఁడన్యరాజతే
జోజయశాలిశౌర్యుఁడు విశుద్ధయశశ్శరదిందు చంద్రికా
రాజిత సర్వలోకుడపరాజిత భూరిభుజాకృపారాధ
రాజల శాంత శాత్రవ పరాగుఁడు రాజమహేంద్రుఁడున్నతిన్"

(ఆంధ్ర మహాభారతము ఆదిపర్వము 1-3)

ఈ పద్యంలో 7 సమాస భూయిష్ఠ సంస్కృత సమాలున్నాయి.

సంస్కృతభవాలు అనేకం తెలుగులో ప్రవేశించాయి. ఇప్పుడు సంస్కృత భవాలను పరిశీలిద్దాం.

## వర్ణ సమీకరణం :

రెండు విభిన్న వర్ణాలు ఒక పదంలో ఉన్నప్పుడు అవి కలిసిపోయి ఒకే వర్ణంగా ఏర్పడటమే వర్ణ సమీకరణం. ద్రావిడ భాషలలో సంయుక్తత లేని కారణంగా సంస్కృతంలో భిన్న వర్ణాలతో సంయుక్తంగా ఉన్న పదాలు తెలుగులో ఎరవు మాటలుగా ప్రవేశించేటప్పుడు సమీకరణం పొంది ద్విత్వాక్షరాలుగా మారతాయి.

**ఉదా :** సంస్కృత పదం    తెలుగు

| సంస్కృత పదం | | తెలుగు |
|---|---|---|
| శూర్పణఖా | > | చుప్పనాక |
| నిత్య - | > | నిత్తెము |
| సత్య - | > | సత్తెము |
| స్వత్వ - | > | సొత్తు |
| వ్యత్యాస - | > | వెత్తేసము |

## స్వర భక్తి :

సంయుక్తాక్షరాలలో ఒక అచ్చు చేరి సంయుక్తత పోవటం. తెలుగులో సంయుక్తాక్షరాలు లేని కారణంగా సంస్కృత పదాలలో స్వరభక్తి కలిగి తెలుగు పదాలవలె రూపును సంతరించుకుంటాయి.

| సంస్కృతం | | తెలుగు |
|---|---|---|
| కీర్తి - | > | కీరితి |
| చంద్ర - | > | చందురుడు |
| మంత్రిన్- | > | మంతిరి |
| మర్యాదా | > | మరియాద |
| రాత్రి | > | రాతిరి |

**వర్ణనాశం** (Syncose) :

పదంలోని ఒక వర్ణం లోపిస్తుంది. ఈ కారణంగా తెలుగులో కొన్ని తద్భవాలేర్పడ్డాయి.

| సంస్కృతం | | తెలుగు |
|---|---|---|
| తర్దూ | > | త్రెడ్డు |
| పర్వన్ | > | ప్రబ్బము |

**పదాది యకార లోపం :**

పదం మొదట వచ్చిన యకారం లోపిస్తుంది.

| సంస్కృతం | | తెలుగు |
|---|---|---|
| యుగ - | > | ఉగము |
| యుగాది- | > | ఉగాది |
| యువతీ | > | ఉవిద |

సంస్కృతంలో పదాదిని పరుషాక్షరాలుండగా తెలుగులో సరళాక్షరాలుగా మారాయి.

| సంస్కృతం | | తెలుగు |
|---|---|---|
| కేతకి | > | గేదఁగి |
| ఖాతికా | > | గాదియ / గాదె |
| పారిభద్ర | > | బాడిద |
| పాశికా | > | బాసికము |
| సోత | > | బోద |

**అనునాసిక్యం :**

పదాలలో లేని ఆనునాసిక్యం కల్గటం, ఉన్న ఆనునాసిక్యం పోవటం జరుగుతుంటుంది. సంస్కృత పదాలలో లేని ఆనునాశిక్యం తెలుగులో రావటం

| సంస్కృతం | తెలుగు |
|---|---|
| నాయక - | నాయంకుడు |
| భట - | బంటు |

ఇక ప్రాకృత పదాలు తెలుగులో ప్రవేశించేటప్పుడు పొందే మార్పులను పరిశీలిద్దాం.

| సంస్కృతం | | ప్రాకృతం | | తెలుగు |
|---|---|---|---|---|
| అటవీ | > | అడవీ | > | అడవి |

| | | | | |
|---|---|---|---|---|
| ఆశ | > | ఆసా | > | ఆస |
| ఉత్కట | > | ఉక్కడ - | > | ఉన్కడము |
| ఊషర - | > | ఊసర - | > | ఊసర |
| ఖాదన - | > | ఖాణ - | > | ఖాణము |
| గ్రాస - | > | గాస - | > | గాసము |
| త్యాగ - | > | ఛాగ - | > | ఛాగము |
| యమ - | > | జమ - | > | జముఁడు |
| ద్యూత - | > | జూద - | > | జూదము |
| స్థాన - | > | ఠాణ - | > | ఠాణము |
| తంత్రీ - | > | తంతీ - | > | తంతి |
| ముక్తి - | > | ముత్తి | > | ముత్తి |
| రాజ్ఞా | > | రాణీ | > | రాణి |
| వైర - | > | వేర | > | వేరము |
| శ్రీ | > | సిరీ | > | సిరి |

ప్రాకృత పదాలు తెలుగులో ప్రవేశించేటప్పుడు కొన్ని ధ్వని పరిణామాలు చోటుచేసుకున్నాయి.

పదాది రేఫ ఘటిత సంయుక్త పదాలుగా ప్రాకృతం నుండి తెలుగులో ప్రవేశించినప్పుడు వర్ణనాశం (Syncose) పొందాయి. పొంది తెలుగులో ఏర్పడ్డాయి.

| | | | | |
|---|---|---|---|---|
| సంస్కృతం | > | ప్రాకృతం | > | తెలుగు |
| కిరీటిన్ | > | కిరీడి | > | క్రీడి |
| కురవక - | > | కురవయ - | > | క్రోవి |

పారసి పదమయిన తరాజూ తెలుగులోకి వచ్చినప్పుడు ఇదేవిధంగా వర్ణనాశం పొంది త్రాసు అయింది. పదాదిని సంయుక్త రూపమేర్పడటం విశేషణం.

మూల ద్రావిడ భాషలో పదాదిని దంత మూలీయ వర్ణాలు మూర్ధన్య వర్ణాలు లేవు. ఇదే పద్ధతి ప్రాచీన తెలుగు భాషలో కూడా ఉన్నట్లు ద్రావిడ భాషా శాస్త్రజ్ఞుల అభిప్రాయం. పరాయి భాషా పదాలు మన తెలుగు భాషలో ప్రవేశించేటప్పుడు పదాదిని దంత మూలీయ మూర్ధన్య వర్ణ ఘటిత శబ్దాలకు పూర్వం ఒక అచ్చును చేర్చి అనన్య భాషా పదాలుగా గ్రహించటం జరిగింది. ఈ పద్ధతిని భాషా శాస్త్రంలో అజాదిత్యమంటారు.

| సంస్కృతం | | ప్రాకృతం | | తెలుగు |
|---|---|---|---|---|
| రజ్జ | > | రంగ - | > | అరుగు (వేదిక) |
| రూప | > | రూప - | > | ఉరుప |
| రథ | > | - | > | అరదము |

ప్రాకృత భవాలలో పదాది వర్ణం లోపించిన సందర్భాలు చాలా ఉన్నాయి.

| సంస్కృతం | | ప్రాకృతం | | తెలుగు |
|---|---|---|---|---|
| సర్షప - | > | సారవ | > | ఆవ |

| | | | | |
|---|---|---|---|---|
| హింగు - | > | హింగు - | > | ఇంగువ |
| హిమ - | > | హిమ - | > | ఇవము |
| శుల్క - | > | సుంక - | > | ఉంకువ |

వర్ణ వ్యత్యయం కారణంగా కొన్ని ప్రాకృత శబ్దాలు తెలుగులోకి వచ్చి చేరాయి.

| సంస్కృతం | | ప్రాకృతం | | తెలుగు |
|---|---|---|---|---|
| అలక్తక - | > | అలత్తక - | > | లత్తుక |
| అహంకార - | > | హంకార - | > | హంకారము |

ఈ పై ఉదాహరణలను పదాది అజ్లోపానికి ఉదాహరణలుగా కూడా ఇవ్వవచ్చు.
కృతక ప్రామాణిక రూపంగా ఒకే ఒక ప్రాకృతభవ శబ్దం కన్పిస్తోంది.

| సంస్కృతం | | ప్రాకృతం | | తెలుగు |
|---|---|---|---|---|
| ఆ రాత్రిక - | > | ఆరత్తియ | > | హారతి (<ఆరతి) |

## అన్యదేశ్యాల్లో అర్థ పరిణామం :

భాషలలో శబ్ద పరిణామం జరగటం ఎంత సహజమో అర్థ పరిణామం జరగటం కూడా అంతే సహజం. భాషలోని పదజాలంతో జరిగే మార్పుల్ని అర్థ పరిణామం (remantic change) అని అర్థ పరిణామ శాస్త్రజ్ఞులు నిర్వచించారు. అర్థ పరిణామం ఎందుకు జరిగిందో సమగ్రంగా చెప్పలేము కాని అది ఎలా జరిగిందో వివరించవచ్చు.

అన్యభాషా పదాలు భాషలో ప్రవేశించినపుడు శాబ్దికమైన మార్పులతో పాటు ఆర్థికమైన కొన్ని మార్పులు జరగటంలో ఆశ్చర్యం లేదు. తెలుగు భాషలో అనేక సంస్కృత పదాలు ఆదిలోనే ప్రవేశించాయి. ప్రాఙ్నన్నయ యుగంలోనే తెలుగు శాసనాలలో అనేక సంస్కృత ప్రాకృత పదాలు ప్రవేశించాయి. కావ్య భాషలోను వ్యవహారం లోను ప్రవేశించిన అనేక సంస్కృత ప్రాకృత పదాలలో అర్థ పరిణామం జరిగింది. ఈ పరిణామాన్ని పరిశీలిద్దాం.

అభిమానం (< సం. అభిమాన -) :

1. ధనాదుల వల్ల కలిగే గర్వం; 2. ఆత్మ గౌరవం. ఈ ఆత్మ గౌరవమే కాకుండా ఈ అభిమాన పదానికి తెలుగులో ఇష్టం, ప్రీతి, గౌరవం అనే అర్థాలు ఉన్నాయి.

ఉదా : నేనంటే అతనికి అభిమానం.
అభిమానించు = ప్రీతితో చూచు
అతణ్ణి అభిమానిస్తున్నాడు.

అతిశయం (< సం. అతిశయ - అధికం, ఎక్కువ)

ఈ పదానికి తెలుగు వారి వ్యవహారంలో గర్వం అనే అర్థం ఉంది.
ఆమెకు అతిశయం ఎక్కువ (గర్వం ఎక్కువ అని అర్థం)

సంస్కృతంలోని అంతస్థం శబ్దానికి 1. రహస్యం; 2. మరుగుచోటు; 3. మేడ పై భాగం అనే అర్థాలు ఉన్నాయి. తెలుగులో ఈ పదం 'అంతస్తు' గా మారి మేడపై భాగం అనే అర్థంతోపాటు పరువు, హోదా (Status) అనే అర్థాల్లో వాడుకలో ఉంది.

ఉదా : నీ అంతస్తు ఎంత
అంతస్తుకు తగినట్లు నడచుకోవాలి.

తెలుగులోని సంస్కృత అభ్యంతర పదానికి అడ్డు, ఆటంకం అనే అర్థాలున్నాయి. ఈ అర్థం సంస్కృత భాషలో ఈ పదానికి లేవు.

సంస్కృతంలోని అభ్యర్థి పదానికి యాచించేవాడు, కోరేవాడు అనే అర్థాలు మాత్రమే ఉన్నాయి. ఈ రోజు ఈపదానికి ఎన్నికల్లో నిలబడ్డ వ్యక్తి; ఉద్యోగానికి దరఖాస్తు పెట్టిన వ్యక్తి అనే అర్థాల్లో మాత్రమే ఈ పదం వాడబడుతోంది.

సంస్కృత భాషలోని అసహ్య పదానికి ఆ భాషలో సహించరానిది, సాధ్యం కానిది అని మాత్రమే అర్థాలు. కాని తెలుగులో ఈ అసహ్యపదానికి 'రోత' అనే అర్థంలో వాడుతున్నారు.

'అవసరము' అనే పదానికి అక్కర (necessity) అనే అర్థంలో నేటి ప్రయోగం. సంస్కృతంలో సమయం, తగిన సమయం అనే అర్థంలో ప్రయోగించబడింది. తెలుగులో కూడా నన్నయ గారు "అవసరజ్ఞుండయి వ్యాసుఁడే తెంచెనంత" అని సంస్కృతంలో ఉన్న అర్థంలోనే ప్రయోగించారు. నేడు అక్కర అనే అర్థం ఉదా : అవసరం తీరిపోయాక ఎవరైనా ఎందుకు కనిపిస్తారు?

ఉత్తరము (< సం. ఉత్తర - 1. ఒక దిక్కు; 2. పైది; 3. అతిక్రమించినది; 4. ఎక్కువ; 5. సమాధానం) తెలుగులో ఈ పదానికి లేఖ అనే అర్థం కలిగింది. ఉదా : ఇవ్వేళ నాకో ఉత్తరం వచ్చింది.

క్రీ.శ. 1900 సంవత్సరంలో ఫ్రెంచి భాషా శాస్త్రవేత్త బ్రెయల్ (Breal) అర్థ పరిణామాన్ని కొన్ని రకాలుగా వర్గీకరించాడు. ఆ పద్ధతిని తెలుగులోని అన్యదేశ్య పదాలకు అన్వయించి అవలోకిద్దాం.

**అర్థ వ్యాకోచం** (Extension of meaning) :

పరిమితార్థంలో ప్రయోగింపబడే పదం విస్తృతార్థంలో వాడబడితే అర్థ వ్యాకోచం అనబడుతుంది.

అష్టకష్టాలు : 8 కష్టాలు : 1. దేశాంతరగమనం; 2. భార్యావియోగం; 3. ఆపత్కాల బంధు దర్శనం; 4. ఉచ్ఛిష్ట భోజనం; 5. శత్రు స్నేహం; 6. పరాన్న ప్రతీక్షణం; 7. అప్రతిష్ఠ; 8. దారిద్ర్యం. వాడు అష్టకష్టాలు పడుతున్నాడు అన్నప్పుడు పైన చెప్పిన 8 కష్టాలేకాకుండా ఏ విధమైన కష్టమైనాకావచ్చు. కష్ట సామాన్యవాచిగా అష్టకష్టాలు పదం నేడు వ్యవహారంలో ఉంది.

మహరాజు : గొప్ప రాజు అని అర్థం. తెలుగులో ధనవంతుడు అని అర్థం.

రాణి : రాజు గారి భార్య రాణి. కాని ధనికురాలు అనే అర్థంలో ఈ పదాన్ని వాడుతున్నారు.

ఉదా : ఆమెకేమమ్మా ! రాణి గారు.

ఉర్దూలోని "షుతురునాల్" అనే పదానికి ఒంటిమీద ఎక్కించి తీసుకుపోయే ఫిరంగి అని అర్థం. కాని తెలుగులో ఈ పదం ఫిరంగి సామాన్యవాచి.

"అజగర ప్రతిమంబులగు కంచు షుతురునా
ళములు పన్నిన జిరాసమదగజములు" (రంగా. 1-158) అని కవిప్రయోగం.

**అర్థ సంకోచం** (Narrowing of meaning) :

ఒక పదాన్ని పరిమితార్థంలో ప్రయోగించినప్పుడు అర్థ సంకోచం జరిగిందని పేర్కొంటారు. అప్పుడు ఆ పదం విస్తృతార్థాన్ని కోల్పోతుంది. చీర సంస్కృత పదం. ఈ పదానికి స్త్రీలు పురుషులు ధరించే వస్త్రమని అర్థం. ఇది వస్త్ర సామాన్యవాచి. "ఆ ఋషి పుత్రుడు కట్టిన చీరలు" అని నన్నయ భట్టారకుల ప్రయోగం. నేడు 'చీర' అంటే స్త్రీలు ధరించే వస్త్రం మాత్రమే కాబట్టి ఇక్కడ అర్థ సంకోచం జరిగింది. 'సాహిబ్' అనే ఉర్దూ పదానికి చెలి, సహచరుడని అర్థం . . . తెలుగులో సాహిబు అంటే మహమ్మదీయుడని అర్థం. ఇక్కడ అర్థ సంకోచం స్పష్టం.

**అర్థ గౌరవం** (Elevation of meaning) :

అర్థగౌరవాన్ని అర్థోత్కర్ష అని కూడా వ్యవహరిస్తారు. ఒక పదానికి నిందార్థంలో కాని సామాన్యార్థంలో కాని అర్థమున్నప్పుడు ఆ పదానికి గౌరవార్థం కలిగినట్లయితే అర్థగౌరవం లేదా అర్థోత్కర్ష కలిగిందని చెప్పవచ్చు. దీనికి ఉదాహరణగా సంస్కృత సభిక శబ్దాన్ని ఉట్టంకిస్తుంటారు. "సభికా ద్యూతకారకాః" అని అమరం. సంస్కృతంలోని సభిక శబ్దానికి జూదం ఆడించేవాళ్ళు లేదా జూదమాడేవాళ్ళు (జూదగాళ్ళు) అని అర్థం. సభికులు అంటే సభాసదులు (రాజుగారి సభలో ఉన్నవారు, సభ్యులు) అనే అర్థంలో తర్వాత ప్రయోగించబడింది. తిక్కన విరాటపర్వంలో "ఈ సభికుల్ కనుంగొన" అని ప్రయోగించారు. సభిక శబ్దానికి తెలుగులో అర్థగౌరవం కల్గింది.

ముహూర్త శబ్దానికి సంస్కృతంలో నిమిషకాలమని అర్థం. ఇది కేవలం బోధకం. శుభకార్యానికి నిర్ణీతమయిన పవిత్ర కార్యమనే అర్థంలో ఈ పదం వాడబడుతోంది. ఈ విధంగా ఈ పదానికి అర్థ గౌరవం కల్గింది.

**అర్థాపకర్ష** (Degradation of Meanings):

పదానికి ఉన్న అర్థం కంటే న్యూనార్థంలో లేదా నిందార్థంలో లేదా నీచార్థంలో పదం వాడబడితే అర్థాపకర్ష జరిగిందని పేర్కొంటారు.

**ఛాందసుడు లేదా చేదస్తుడు :**

ఈ పదానికి వేదవిదురుడు అని అర్థం. కాని నేడు ఈ పదానికి లోకజ్ఞానం లేనివాడనే అర్థం కలిగింది. సంస్కృత కైంకర్య పదానికి సేవ, పూజ అనే అర్థాలుండగా నేడు కైంకర్య పదానికి దొంగిలించటమనే అర్థం కలిగింది.

ఉదా : అతడు కైంకర్యం చేస్తున్నాడు.

**లక్ష్యార్థసిద్ధి** (Transfer of Meaning) :

ఆధారాధేయ సంబంధం వల్ల కాని అంగాడి సంబంధంవల్లకాని, కార్యకారణ సంబంధం వల్ల కాని లక్ష్యార్థాలు ఏర్పడతాయి. కాలక్రమేణా ఇవి రూఢికెక్కుతాయి.

**ముష్టి :**

ఇది సంస్కృత పదం. దీనికి పిడికిలి అని అర్థం. ఆధారమయిన పిడికిలి ఆధేయమయిన బియ్యానికి అర్థమై "ముష్టి" అంటే బియ్యమని ఈ ముష్టి పదానికి అర్థం కలిగింది. నేడు బియ్యమే కాక డబ్బు కాని మరేదయినా కాని కావచ్చు. కాబట్టి ఈ పదం లక్ష్యార్థానికి మంచి ఉదాహరణ.

**దాహం :**

దాహమనే సంస్కృత పదానికి దహించటం, తాకించటం అని అర్థం. కారణకార్య సంబంధం వల్ల పానీయం అనే అర్థం కల్గింది.

**మర్యాద :**

ఈ సంస్కృత పదానికి 'హద్దు' అని అర్థం. తెలుగులో లక్ష్యార్థసిద్ధి కలిగి గౌరవం మన్నన అర్థాలు మర్యాద శబ్దానికి కలిగాయి.

**లోక నిరుక్తి** (Folk etymology) :

సరయిన వ్యుత్పత్తిని తెలపకుండా పదాలలోని అక్షరాలను లేదా అక్షర సముదాయాన్ని గ్రహించి వాటికి తప్పుగా అర్థం చెప్పి నిరుక్తి (etymology) ని చెప్పటం లోక నిరుక్తి.

'చంద్రమస్' శబ్దం నుంచి చంద్ర శబ్దం సంస్కృతంలోనే కలిగింది. కాని ఈ చంద్రమస్ పదాన్ని దృష్టిలో ఉంచుకొని తెలుగులో 'చందమామ' పదాన్ని కల్పించారు. ఇక్కడ మామ శబ్దం వల్ల 'చందమామ' శబ్దాన్ని నిష్పన్నం చేసి ప్రయోగించటం విశేషం.

చక్రకేళి : ఈ పదం లోక నిరుక్తి వల్ల కల్గిందే.

ఈ 'చక్రకేళి' పదంలోని చక్ర - శర్కరా సంబంధం. దీనికి చక్ర శబ్దానికి సంబంధం లేదు. సం. కదళ శబ్దభవం కేళీ.

| ప్రాకృతం | | తెలుగు |
|---|---|---|
| సక్కరాక కయళీ | > | చక్రకేళీ (వర్ణ వ్యత్యయం) |

**ఆధునిక హింద్వార్య భాషలలోని పదాలు తెలుగులో ప్రవేశించటం :**

ఆంధ్రదేశ సరిహద్దులో కళింగరాజ్యం (ఒరిస్సా రాష్ట్రం) ఉంది. ఆంధ్రులకు ఓఢ్రులకు కల సంబంధాలు ప్రాచీనకాలం నుంచి ఉన్నాయి. హింద్వార్యభాష అయిన ఒరియా భాష నుండి కొన్ని పదాలు తెలుగులో ప్రవేశించాయి.

జనాబ : వి. జనసంఖ్య
ఒ. జనాబ
< ఒ. జనాబ

పన్నె వి. దువ్వెన
ఒ. పన్నె దువ్వెన
< ఒ. పన్నె

బుగత వి. భూస్వామి
ఒ. బుగత
< సం. ఒ. బుగత

భోగట్టా వి. సమాచారం, వివరం
ఒ. భోగట్టా
<ఒ. భోగట్టా

రేక వి. బాల్చీ, చేద
ఒ. రేక చేద
< ఒ. రేక

కంబారి (రీ) వి. సేవకుడు, నౌకరు
ఒ. కబారి నౌకరు
<ఒ. కబారి

ఈ పై పదాలు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో జనాల నిత్య వ్యవహారంలో ఉన్నాయి. ఇవన్నీ తెలుగులోని ఒరియా నుంచి వచ్చిన అన్యదేశ్యపదాలు.

ఒరిస్సా తెలుగు భాషల వలె తెలుగు మరాఠీ భాషలు కూడా అన్యోన్య సంబంధం కలవి. కాబట్టి మరాఠీ నుంచి తెలుగులోకి అనేక పదాలు వచ్చి చేరాయి.

ఉగ్రాణము వి. సామాను పెట్టుకొనే గది
మరాఠీ ఉగ్రాణకు సామానుగది
< మరాఠీ ఉగ్రాణకు

గంగాళము వి. మూతి వెడల్పు కల పెద్ద పాత్ర
మరాఠీ గంగాళ్ వృత్తాకార లోహపాత్ర
< మరాఠీ విశేషం గంగాళ్

దచ్చి వి. ఎనిమిది
మరాఠీ. దచ్చి ఎనిమిది
< సం. దచ్చి

పాగ వి. శిరోవేష్టనం
మరాఠీ. పాగ శిరోవేష్టనం
< మరాఠీ పాగ

బిడారడు వి. 1. వాసస్థానం; 2. విడిది; 3. కేళీగృహం.
మరాఠీ. బిడార ఇల్లు, విడిది, ఉగ్రాణం
< మరాఠీ బిడార

తెలుగులో ఇళ్ళపేర్లలో ఉండే '-రావు' శబ్దం మరాఠీ పదం మరాఠీలో 'రావ్పె'.

## తెలుగులో ప్రవేశించిన తమిళ, కన్నడ పదాలు :

తమిళ కన్నడ భాషా వ్యవహర్తలకు మనకు సరిహద్దులున్నాయి, సంబంధాలు చిరకాలం నుంచి ఉన్నాయి. కాబట్టి ఆ భాషాపదాలు కొన్ని మన భాషలో ప్రవేశించాయి.

తమిళ పదాలు అసమీకృతంగా తెలుగులో చేరినవి.

అరంగేట్రం వి. నృత్యం
తమి. అరంగేట్రం నృత్యం
< సం. అరంగేట్రం

ఆళ్వారు వి. విష్ణుభక్తుడు
తమి. ఆళ్వార్ విష్ణుభక్తుడు
< తమి. ఆళ్వార్

తిరుమల వి. తిరుపతి కొండ
తమి. తిరుమలై తిరపతి కొండ
< తమి. తిరుమలై

సాంబారు వి. అన్నంలో కలుపుకునే ద్రవ పదార్థం
తమి. సాంబార్ పైది
< తమి. సాంబార్

**తెలుగులో సమీకృతాలయిన తమిళ పదాలు :**

తమిళంలోని మూర్ధన్య వర్ణాలు తెలుగులో దంత మూలీయాలుగా మారాయి.

| తమిళం | | తెలుగు |
|---|---|---|
| అణ్ణామలై | > | అన్నామల |

తమిళ పదాలలోని వర్ణాలు తెలుగులో లోపిస్తాయి.

| తమిళం | | తెలుగు | అర్థం |
|---|---|---|---|
| సాత్తాద | > | సాతాని | వైష్ణవభక్తుడు |
| ఎడుత్తు | > | ఎత్తు | తీసుకోవటం |
| సాపాట్టు | > | సాపాటు | భోజనం |

**తెలుగులో ప్రవేశించిన అసమీకృత కన్నడ పదాలు :**

| కన్నడం | | తెలుగు | అర్థం |
|---|---|---|---|
| కసుమాల | > | కసుమాలం | మలినం |
| మజ్జిగె | > | మజ్జిగ | చల్ల |
| గొత్తు | > | గొత్తు | గుర్తు |

ఆదిలో తెలుగులో హకారాది పదాలు లేవు. హకారం పదాలన్నీ అన్యదేశ్యాలుగానే స్థూలంగా భావించవచ్చు. కన్నడంలో పదాది పకారం హకారంగా మారింది. ఆవిధంగా మారిన పదాలలో కొన్ని తెలుగులో ప్రవేశించాయి. ఈవిధంగా పదాది కకారాది పదాలకు అంకురార్పణ జరిగింది. తెలుగులో 1236 ధాతువులుండగా హకారాది ధాతువులు రెండు మాత్రమే. అవి హత్తు, హెచ్చులు. ఈ రెండు కన్నడం నుంచి, తెలుగులో ప్రవేశించాయి.

| కన్నడం | | తెలుగు | అర్థం |
|---|---|---|---|
| హంగు | > | హంగు | అనుకూలం |
| కత్తు | > | హత్తు | కలుపు |
| హాళి | > | హాళి | వరస |
| హండి | > | హండి | పొల్లు |

## తెలుగులోని సమీకృత కన్నడ పదాలు

| కన్నడం | | తెలుగు | అర్థం |
|---|---|---|---|
| అగడు | > | గాడు | పొగరు |
| ఒళగె | > | ళోగా | లో |

కన్నడంలోని మూర్ధన్యాక్షరాలు తెలుగులో దంత మాలవీయాలౌతాయి.

| కన్నడం | తెలుగు | అర్థం |
|---|---|---|
| హోణరు | హోనరు | అందం, ఇంపు |

## పాశ్చాత్య భాషల నుంచి తెలుగులో ప్రవేశించిన పదాలు :

పాశ్చాత్య భాషలయిన ఇంగ్లీషు, ఫ్రెంచి, డచ్చి, పోర్చుగీసు పదాలు తెలుగులో ప్రవేశించాయి. తెలుగుపై ఉర్దూ భాషా ప్రభావం అధికంగా ఉంది. మహమ్మదీయులు దాదాపు 400 సంవత్సరాల పాటు తెలుగు నేలపై ఉండి తెలుగుపై ఎంతో ప్రభావాన్ని చూపారు. ఈ కారణంగా అనేక ఉర్దూ పదాలు మనభాషలో ప్రవేశించాయి.

ఖుసి — వి. సంతోషం
ఉర్దూ. ఖుసీ సంతోషం
< ఉర్దూ. ఖుసీ

పంజు — వి. ప్రకాశించే రత్నాలు చెక్కిన
ఉర్దూ పంజ్ జ్యోతి
< ఉర్దూ పంజ్

బాజార్ — వి. విపణి, మార్కెట్టు
ఉర్దూ. బాజార్
< ఉర్దూ బాజార్

రోజు — వి. దినం
ఉర్దూ. రోజ్ దినం
< ఉర్దూ రోజ్

వజీరు — వి. మంత్రి
ఉర్దూ. వజీర్ మంత్రి
< ఉర్దూ వజీర్

సర్దారు వి. సేనాపతి
ఉర్దూ సర్దార్ సేనాపతి
< ఉర్దూ సర్దార్

హవేలీ వి. ప్రాసాదం
ఉర్దూ హవేలీ
< ఉర్దూ హవేలీ

**వర్గ సమీకరణం :**

| ఉర్దూ | | తెలుగు | అర్థం |
|---|---|---|---|
| ఫర్ద్ | > | పద్దు | అకౌంటు |

అరబీ పదమయిన అల్లాహ్ తెలుగులో 'అల్లా' గా మారింది. ఇక్కడ '-హ్' లోపించింది.

**తెలుగులోని అసమీకృత పోర్చుగీసు పదాలు :**

అల్పి వి. గుండుసూది
పోర్చు. అల్పి గుండుసూది
< పోర్చు. అమీ

కమీజు వి. చొక్కా
పోర్చు. కమీజా చొక్కా
< పోర్చు. కమీజా

పీపా వి. పాత్రవిశేషం
పోర్చు. పీపా పాత్ర విశేషం
< పోర్చు పీపా

మేజా వి. బల్ల
పోర్చు. మేజా బల్ల
< పోర్చు మేజా

**తెలుగులోని పోర్చుగీసు సమీకృత పదాలు :**

| పోర్చుగీసు | తెలుగు | అర్థం |
|---|---|---|
| కొస్తా | కోస్తా | సముద్రతీరం |
| తోకాల్య | తువాలు | తుండుగుడ్డ |
| బల్ది | బాల్చా | చేద |

డచ్చి పదమయిన 'క్లోవర్' తెలుగులో విప్రకర్ష వల్ల 'కళావరు' గా మారింది. తెలుగులోని 'మదాము' ఫ్రెంచి పదమయిన మదాకు నుండి ఏర్పడి కేసినో కూడా ఫ్రెంచి పదమే.

తెలుగులోని 'పంపరపనాస' డచ్చి పదమయిన "పంపెల్ మెఎస్" నుంచి ఏర్పడింది.

క్రీ.శ. **1639** నుండి ఆంగ్లేయులు మనదేశానికి రావటం మొదలు పెట్టారు. నాటి నుండి **15-8-1947** వరకు మన భారతదేశంలో ఉండి ఆంగ్లేయులు మన దేశభాషలకై విశేష ప్రభావాన్ని చూపారు. తెలుగులో ఈ కారణంగా అనేక ఇంగ్లీషు మాటలు ప్రవేశించాయి.

**ఇంగ్లీషు నుండి తెలుగులోకి వచ్చిన అసమీకృత పదాలు :**

| ఇంగ్లీషు | తెలుగు |
|---|---|
| కోర్ట్ | కోర్టు |
| కార్డ్ | కార్డు |
| పోస్టాఫీస్ | పోస్టాఫీసు |
| కమిటీ | కమిటీ |
| కాఫీ | కాఫీ |
| కాలేజ్ | కాలేజి |
| యూనివర్సిటీ | యూనివర్సిటి |
| గ్రాంట్ | గ్రాంటు |
| ప్రెస్ | ప్రెస్సు |
| రోడ్ | రోడ్డు |
| హాల్ | హాలు |

**ఇంగ్లీషు నుంచి తెలుగులో ప్రవేశించిన సమీకృతాంగ్ల పదాలు :**

ఇంగ్లీషులో ఫ (F) ఉచ్చారణ తెలుగులో పకారంగా మారింది. ఈ పకారోచ్చారణ ముఖ్యంగా గ్రామీణుల్లో ఉంది.

| ఇంగ్లీషు | తెలుగు |
|---|---|
| ఆఫీస్ | ఆపీసు |
| కాఫీ | కాపీ |
| ఫీజ్ | పీజు |
| టిఫిన్ | టిపిను |

ఇంగ్లీషు పదాలలో పదానికి సంయుక్తాక్షరాలుంటే ముందు ఒక అచ్చుకు తెలుగులో చేర్చుతారు.

| ఇంగ్లీషు | తెలుగు |
|---|---|
| స్టాంప్ | ఇస్టాంప్ |
| స్కూల్ | ఇస్కూలు |
| స్పేడ్ | ఇస్పేటు |

**మాదిరి ప్రశ్నలు :**

**I ఈ క్రింది ప్రశ్నలకు సమాధానములు వ్రాయండి.**

1. తెలుగులోని పదజాలాన్ని వర్గీకరించండి.
2. అన్యదేశ్యాన్ని నిర్వచించి సోదాహరణంగా నిర్వచనాన్ని నిరూపించండి.

3. తెలుగులో ప్రవేశించిన తద్భవ రూపాలను సోదాహరణంగా నిరూపించండి.
4. తెలుగులో ప్రవేశించిన ఆధునిక హిందార్య భాషా పదాలను పరిశీలించండి.
5. తెలుగులో ప్రవేశించిన యూరోపియన్ భాషా పదాలను వివరించండి.
6. తెలుగులోకి సజాతీయ భాషల నుండి ఎరవు మాటలుగా ప్రవేశించిన పదాలను పరిశీలించండి.
7. తెలుగు అన్యదేశ్యాలలోని అర్థ పరిణామాన్ని సోదాహరణంగా నిరూపించండి.
8. తెలుగు అన్యదేశ్యాలల్లోని ధ్వని పరిణామాల్ని నిరూపించండి.

**II ఈ క్రింది వాటికి లఘు వ్యాఖ్యలు వ్రాయండి.**

1. అన్యదేశ్య నిర్వచనం
2. అర్థ వ్యాకోచం
3. వర్ణ సమీకరణం
4. పోర్చుగీసు పదాలు తెలుగులో ప్రవేశించటం
5. తెలుగులోని తమిళపదాలు

## సంప్రదింపు గ్రంథాలు


1. కృష్ణమూర్తి, భద్రిరాజు తెలుగు భాషాచరిత్ర, శ్రీ పొట్టి శ్రీరాములు, తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్ - 4, 2000.
2. చక్రధరరావు, లకంసాని భాషా శాస్త్ర వ్యాసములు, తెలుగు శాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం - 3, 1968.
3. దొణప్ప, తూమాటి, వైకృత పద స్వరూప నిరూపణము, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞాన భవన్, 4-1-435 బాంక్ స్ట్రీట్, హైదరాబాద్ - 1, 1987.


## చదువదగిన గ్రంథాలు :


G.N. Reddy, A study of Telugu Semantics 1966, Sri Venkateswara University, Tirupati.


- ఆచార్య లకంసాని చక్రధరరావు